# సావిత్రోపాఖ్యానము

---

మాస్టర్ కె. పార్వతీకుమార్ గారి ప్రవచనములు

గురుపూర్ణిమ, జూలై 20 – 22, 2013

భాగ్యనగరం

# సావిత్రోపాఖ్యానము

## July 20, 2013 ఉదయం – ప్రవచనం #1

భాగ్యనగరం సోదరబృందం, జగద్గురు పీఠం, ఇతర కేంద్రముల నుంచి ఎంతో ఆసక్తితో, ఉత్సాహంతో ఈ గురుపూర్ణిమ సందర్భంగా ఏర్పాటు చేయబడ్డ గురుపూజలకు విచ్చేసినటువంటి వారందరికి కూడా నా హృదయపూర్వకమైన నమస్కారములు. గురుపుర్ణిమా సంప్రదాయం కలియుగం ఆరంభం నుంచి కూడా ఏర్పడి ఉన్నది. గురుపూర్ణిమ సందర్భంగా గురువును ఆశ్రయించి తమ తమ జీవితాలని సరిదిద్దుకొంటున్న వారందరు కూడా తప్పక సద్గురువునకు మరల జీవితాలని పునరంకితము చేసుకోవాలి. అలాంటి సంప్రదాయం మనకి ఈ కలియుగ ఆరంభంలో జగద్గురువు అయిన శ్రీకృష్ణుడు ఏర్పాటు చేసి ఉంచాడు. వేదవ్యాసుని ఈ ఆషాఢ మాస పూర్ణిమనకు అధి దైవముగను, గురువుగను ఏర్పాటు చేసి ఉంచాడు. ఈ మానవజాతి అంతా కుడా ఉద్ధరింపబడాలి అంటే దైవమును ఎరిగినటువంటివాడు, దైవము ఎరుక చెప్పేటటువంటి పద్దతులలో అందుబాటులో ఉండవలెను. అందుచేత, గురు పరంపర అంతా కూడా గురుపూర్ణిమ ఆధారంగా సదాచార సంపన్నులయినటువంటి శిష్యులకు తమను తాము బాగు చేసుకొందాము, తమను తాము ఉద్ధరించుకొందాము, సత్యమును దర్శనము చేద్దాము, దైవమును దర్శనము చేద్దాము, దివ్యవైభవమును అనుభవిద్దాము అనేటటువంటి ఆశయములు కలవారందరికి కూడా మార్గము చూపించవలసిందిగా వేదవ్యాస ఆవ్యాజన గురు పరంపరను శ్రీకృష్ణుడు ఆదేశించడము జరుగుతుంది. అప్పటినుంచి మనకి ఈ పూర్ణిమ వ్యాసపూర్ణిమగను, గురుపూర్ణిమగను బాగా ప్రసిద్ధి చెంది ఉన్నది. నిజానికి వేదవ్యాస మహర్షి జన్మించినటువంటిది వైశాఖ పూర్ణిమనాడు. "నీవు వైశాఖ పూర్ణిమలో జన్మించి ఉండవచ్చు కాని ఆషాఢ పూర్ణిమనాడు అందరినీ అనుగ్రహించు" అని చెప్పి శ్రీకృష్ణుడు ఆదేశించాడు. సద్గురు పరంపర అంతా కూడా ఒకటే. అది మనకి పరబ్రహ్మము నుండి సనకాది మహర్షుల ద్వారా, నారద మహర్షి ద్వారా, సప్త ఋషుల ద్వారా, మన గోత్ర ఋషుల ద్వారా, అటుపైన హిమాలయాలందలి ఋషుల ద్వారా, మైత్రేయాది గురు పరంపర ద్వారా, అలాగే దక్షిణమందున్నటువంటి అగస్త్య గురు పరంపర ద్వారా, అనేకానేకటువంటి సిద్ధ పురుషులు దిగివచ్చి జీవులను అనుగ్రహిస్తూ ఉంటారు.

ఎవరయితే వారి వారి జీవితములను ఉన్న దానికన్నా ఇంకొంచెం బాగుచేసుకొందాము అనేటటువంటి ఆసక్తి కలిగి ఉంటారో... ఇంతకన్నా బాగుండాలి అని అనుకోవడము ఒకటి, అది అందరూ అనుకుంటారు. బాగుండడం అంటే ఏమిటో కూడా తెలియాలి కదా! బాగుండడం అంటే డబ్బు సంపాదించుకోవడం, కీర్తి సంపాదించుకోవడం, ఇళ్ళు వాకిళ్ళు కొనుక్కోడం, పదిమంది మీద అధికారం సంపాదించడం, ఇలాంటివి బాగున్నట్టుగా అనిపిస్తాయి గాని, అందులోకి దిగిన తర్వాత తెలుస్తాయి అవేం బాగుండవు అని. కొన్ని కొన్ని బాగున్నట్టుగా గోచరంచి, అందులోకి ప్రవేశించిన తర్వాత గాని బాగాలేవు అనేటటువంటివి తెలియడానికి కొన్ని ఉన్నాయి ప్రపంచంలో. అంటే, సుందరివలె ఈ ప్రపంచంలో ఆకర్షించేటటువంటివి చాలా ఉంటాయి. ఆకర్షించేవన్నీ కూడా మనకు పోషణ, పెరుగుదల ఇవ్వవు.

అలా అని అన్నీ అలాగే ఉంటాయా అంటే కాదు. కొన్ని అలా ఉంటాయి. అలా ఉండే వాటిల్లో ఏవి మనకు శాశ్వతం అయినటువంటివి, ఏవి మనకి ఆనందాన్ని కలిగించేటటువంటివి, ఏవి తాత్కాలికంగా ఆనందం కలిగించినట్లుగా ఓ భావన కలిగించి అటుపైన దుఃఖంలోకి నెడతాయి అనేటటువంటివి తెలుసుకోవడానికి కొన్ని జన్మలు పడతాయి. కొన్ని జన్మలు ఆ విధముగా మనము ధనం వెంటబడి... ఓ పాట రాసారు అన్నమాచార్యుల వారు – రకరకాలుగా వాటి వెంటా, వీటి వెంటా బడ్డాను, దేని వెంటబడ్డా కూడా దాహం తీరడం లేదు, ఆకలి తీరడంలేదు, అందుకుని చివరకు తెలుసుకున్నది, నీ వెంటబడితే అన్నీ పోతాయి, ఏ అగ్నీ లేకుండా ఆనందంగా ఉండచ్చు అని. "ధనము వెంటబడి, ధాన్యము వెంటబడి, తనవారి తగిలి, ఖాతరుడు అయిననూ..." అని ఒక పాట రాస్తాడు. దేని వెంటబడ్డా ఉపయోగము లేదు. వెంటబడకుండా లోపల ఒకడు అంటిబడి ఉన్నాడు మనలో. ఆ అంటి ఉన్న వాడితో మనము కూడి ఉన్నట్లయితే క్రమంగా మనకి ఒక సంవృద్ధి జీవితంలో ఏర్పడుతుంది.

అంచేత, ఈ గురుపూర్ణిమ నాడు సద్గురువు మన్ని చేరతాడు. అది సాంప్రదాయం. మనని చేరడం అంటే? ఇట్లా విశాఖపట్నం నుంచి చేరడం కాదు! లోపల హృదయంలో వచ్చి చేరతాడు. ప్రతివాడికి అతడి సద్గురువు లోపల హృదయంలో చేరి చక్కగా దారి చూపిస్తాడు. లోపలికి ప్రవేశించి గురువుగారి దగ్గర కూర్చునే ఒక అలవాటు నిజమైన శిష్యుడు చేసుకోవాలి. నిజంగా బాగుపడాలంటే మనము... కిందటి సంవత్సరం వచ్చాం, గురుపూజలు చేసుకున్నాము, మళ్ళీ ఈ సంవత్సరం వచ్చాం, మళ్ళీ గురుపూజలు చేసుకున్నాము, పై సంవత్సరం మళ్ళీ గురుపూజలు, ఇట్లా చేసుకుంటూనే ఉంటాం కదా! ఈ చేసుకోవడంలో పాతికేళ్ళు అయిపోతాయి, ముప్పైయేళ్ళు అయిపోతాయి. సిల్వర్ జూబ్లీలు అంటాము, అవంటాము, ఇవంటాము, బోల్డు అంటాము, కాని మనకి ఏమయింది లోపల? ఇది ఏమయినా పిందె వేసిందా, పిందె కాయ అయ్యిందా, కాయ పండు అయ్యిందా? ఇలా లోపల గురువుగారు ఎక్కువ దర్శనం ఇచ్చి, ఎక్కువ భాషణం చేసి, ఎక్కువ మార్గం చూపించి, నిన్ను తనవాడిగా చేసుకుంటే పండినట్టండి. తనవాడిగా చేసుకొంటే, ఇక అక్కడనుంచి ఏం జరుగుతుంది అంటే మార్గం ఒక విజయపథంగా నడుస్తూ ఉంటుంది. ఎవరికి విజయము అంటే ఇది విజయనామ సంవత్సరం కదా, ఎవడు గురువు ఆదేశాలను అందుకొని, తదనుగుణముగా జీవితాన్ని మలుచుకుని, ఆ దారిలో శాశ్వతంగా నడుస్తాడో వాడికి విజయం. అలా నడిస్తేనే విజయుడు. అలా నడవకపోతే కష్టం, అరణ్యంలా ఉంటుంది జీవితం. అరణ్యంలో రకరకాలు విషయాలు ఉంటాయి. మీరు అరణ్యంలోకి వెళ్లారనుకోండి ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలియదు. ఒక మంచి జింక కనబడవచ్చు. ఆనందించే లోపల ఒక పులి గాండ్రింపు వినిపించవచ్చు. ఒక భీకరమయిన వాతావరణం ఏర్పడవచ్చు. చక్కని పువ్వులు పూస్తున్నటువంటి పూల చెట్లూ గోచరించవచ్చు. ఎత్తైన పర్వతములు ఉండవచ్చు, లోతైన జలపాతములు ఉండవచ్చు. రకరకాలుగా ఉంటుంది అరణ్యంలో జీవితం. కాని అలాంటి అరణ్యంలోనే ఋషులు కూడా ఉంటారట. మనకి రామాయణం తీసుకున్నా, మహాభారతం తీసుకున్నా, అరణ్యంలో వీటన్నిటితోబాటు, మనకి భయం కలిగించేవాటితోబాటు ఋషులు కూడా వుంటారు. వాళ్ళూ అక్కడే ఉన్నారు. అంచేత, ఏ ప్రాంతంలో ఋషులు ఉండి, ఋషుల గురించినటువంటి జ్ఞప్తి మనకి బాగా ఉండి, ఋషుల కోసమే తిరుగుతున్నామనుకోండి, అప్పుడు అది అరణ్యం అవదట, వనం అవుతుందట.

ఇప్పుడు రాముడు వెళ్ళింది అరణ్యానికి, కాని వనవాసం అయ్యింది ఆయనికి కదా! ఏంచేతంటే, బోల్డుమంది మహర్షుల దర్శనం అయ్యింది ఆయనకి. పద్నాలుగేళ్ళు ఏదో కారణం చేత వెళ్లినా, జరిగినది సామాన్యంగా దొరకని ఋషి, గురు సాన్నిధ్యం దొరికింది ఆయనకి. అలాగే ధర్మరాజు కూడా వెళ్ళింది అరణ్యానికే! అక్కడ కూడా మార్కండేయాది మహర్షులందరితో కూడా పరిచయము గలగడం, అలా జరిగినప్పుడు అరణ్యపర్వం వనపర్వం అవుతుంది. అంచేత, మనకి జీవితాలు ఒక అరణ్యంలాగా ఉంటాయి. ఎప్పుడూ సస్పెన్సే కదా, జీవితంలో రేపు ఏం జరుగుతుందో అని! ఎందుకంటే, ఒక రోజు బావుంటే ఒక రోజు బావుండదు, ఒక సంవత్సరం బావుంటే ఒక సంవత్సరం బావుండదు. రకరకాలు! మన చుట్టూ ఏర్పడినవి అన్నీ ఎప్పుడు బావుంటూ ఉండవు. కొన్ని బావుంటూ ఉంటాయి, కొన్ని పాడయిపోతూ ఉంటాయి. మళ్ళీ కొన్ని బావుంటూ ఉంటాయి, కొన్ని పాడయిపోతూ ఉంటాయి. ఇవన్నీ ఇలా ఉండగా, వీటితో సంబంధం లేకుండా, శాశ్వతంగా బాగుండేటటువంటి ఒక పరిస్థితి మన మనసులో ఏర్పడింది అనుకోండి, అప్పుడు ఆ మనస్సు వనం చేరినట్టు అవుతుంది. లేకపోతే అరణ్యంలో తిరుగుతూనే ఉంటూ ఉంటుంది.

అరణ్యం అంటే ఏమిటి? మనము మాములుగా కూర్చుని ఉన్నాం అనుకోండి ఎవరూ లేకుండా, మనకి వచ్చే ఆలోచనలన్నీ ఉంటాయి కదా, బోల్డు ఆలోచనలు వస్తాయి. దాంట్లో ఒక పద్ధతి ఉండదు, ఒక తెంపు ఉండదు. ఎక్కువగా భయం కలిగించే ఆలోచనలు, ఆందోళన కలిగించే ఆలోచనలు, మనకి ఏర్పడిన వైఫల్యాలు, ఇవే గుర్తు వస్తూంటాయి కదా! అలా మనకి గుర్తు వస్తుంటే మనకి ఏం జరుగుతుందంటే మన మనసు అరణ్యవాసం చేస్తోందని అర్థం. అంటే, రాముడు రామాయణంలోను, యుధిష్ఠిరుడు మహాభారతంలో మాత్రమే అరణ్యంలోకి వెళ్ళారని అనుకొబోకండి. అసలు మనం ఉంటున్నదే అరణ్యంలో! ఏంచేతంటే, ఒక రోజు ఉన్నట్లు ఒక రోజు ఉండదు మనసు కదా! ఇవ్వాళ బాగుంటే రేపు బాగుండదు. ఇవ్వాళ ప్రేయర్ బాగుందనిపిస్తుంది, రేపటి నుంచి చెయ్యకపోతే ఏం అనిపిస్తుంది, చేస్తేనేనా అని అనిపిస్తుంది కదా! ప్రేయరే ఇట్లా అనిపిస్తే ఇంక పూజల సంగతి చెప్పేదేముంది చెప్పండి! ఏందుకండీ ఇవన్నీ? ఊరికే శ్రమ! పూజకి ఏర్పాటు చేసుకోవాలంటే చాలా శ్రమ ఉంది. అంచేత, అలా మనసు రకరకాలుగా దైవం విషయంలోనూ, గురువు విషయంలోనూ, కర్తవ్యం విషయంలోనూ, ధర్మం విషయంలోనూ, దానం విషయంలోనూ, ఇలాంటి విషయాల్లో మనసు రకరకాలుగా పనిచేస్తోందనుకోండి, అది అరణ్యవాసం చేస్తున్నట్టు ఆ మనసు. ఇలా అరణ్యంలో తిరుగుతూ ఉండే వాడికి అనుకోకుండా ఓ గురువుగారి ఆశ్రమం తగిలిందనుకోండి, ఒక ఋషి ఆశ్రమం తగిలిందనుకోండి, అక్కడి నుంచి వాడికి ఓ దారి తెలుస్తుంది. అది అరణ్య జీవనం కాకుండా వన జీవనం అవుతుంది. అంటే, ఎంతోమంది ఎన్నో రకాలుగా పదవుల కోసం, ఉద్యోగాల కోసం, డబ్బు కోసం, ఏవేవో తిరిగి, తిరిగి, తిరిగి చచ్చిపోయారు కదా! ఒక కుచేలుడుతో బాటు ఆ ఊళ్ళో ధనవంతులు ఎంతోమంది ఉంటారు, పలుకుబడి కలవాళ్ళు ఎంతోమంది ఉంటారు, ఎంతో రాజకీయం నడిపించినవాళ్ళు ఉంటారు. మరి వాళ్ళందరి గురించి ఎక్కడా రాయరు కదా! కుచేలుడు గురించి రాస్తారు. అంతేనా? అలాగే, ఏ భక్తుడు జీవితం అయినా, అది శాశ్వతంగా నిలిచే కథగా మిగిలిపోయి, అతడితో సమకాలికులిగా ఆ రోజుల్లో అక్కడ ఉండేటటువంటి ధనవంతులు,

బలవంతులు, అధికార్లు, వారందరి గురుంచి ఏమీ ఉండదు. ఎందుకు ఉండదు అంటే, కనీసం వీడితో ఏదో ఒక అనుబంధమో, లేకపోతే ఒక ప్రతిబంధమో కలిపించడం ఎమయినా చేస్తే, అప్పుడయినా వీడి చరిత్ర ఏమయినా నిలుస్తుంది. ఒక భక్తుడిని బాగా ఏడిపించినవాడు ఒకడు ఉన్నాడనుకోండి, వాడి కథ కూడా వీడి కథతో బాటు చెప్పుకుంటారు, కాకపోతే ఇంకొక రకంగా చెప్పుకుంటారు. అంచేత, ఏ విధమయినటువంటి ప్రయోజనం లేకుండా, అట్లా అరణ్యంలో ఎన్నో జంతువులు, మొక్కలు, చెట్లు పుడుతూ ఉంటాయి, చచ్చిపోతూ ఉంటాయి... పుడుతూ ఉంటాయి, చచ్చిపోతూ ఉంటాయి. కాని ఎప్పుడయితే ఒక ఋషి ఆశ్రమానికి చేరిందో అరణ్య జీవనం అక్కడి నుంచి ఒక దారి దొరుకుతుంది.

అలా మనకి ఆషాఢ మాసంలో దారి కోసం వెతుకుంటున్న వారికి దారి చూపించడానికి దిగి వచ్చేటటువంటి తత్త్వం ఒకటి ఉన్నది. అది శాశ్వతంగా ఉన్నది. అందుకనే ఆషాఢ మాసం! ఆషాఢ మాసంలో ఏ నక్షత్రాలు ఉంటాయి? నాలుగు రోజులపాటు పునర్వసు ఉంటుంది. ఆ తర్వాత పుష్యమి ఉంటుంది. ఆ తర్వాత ఆశ్లేష ఉంటుంది. ఆ నక్షత్రాలు తీసుకుంటే, మొదటి నాలుగు రోజులు పునర్వసు, తర్వాత పదమూడు రోజులు పుష్యమి, ఆ తర్వాత పదమూడు రోజులు ఆశ్లేష. ఆశ్లేష అంటే అందరికి భయమే! ఆశ్లేష నక్షత్రంలో పుడితే శాంతులు కూడా చేయిస్తూ ఉంటారు. పాము అది. దాని తోక ఎక్కడో మళ్ళీ వృశ్చిక రాశి చివర వరకూ ఉంటుందట. ఆశ్లేషలో పడ్డవాడు మళ్ళీ ధనుర్మాసం వచ్చే వరకు దిక్కు తెలియకుండా పడి ఉంటాడట. అలా మింగేస్తుంది ఆ పాము. Dragon అంటారు వాళ్ళు బయట దేశాలలో. దాని ముందు పుష్యమి ఉంటుంది. పుష్యమి అమ్మవారికి కూడా రాసుకుంటూ ఉంటాము స్తోత్రాలలో – "*పుష్యమీచంద్ర విభ్రాజ దలికస్థలి శోభిత*". అది ఆ పాము మీద ఉండేటటువంటి మణి. కాంతివంతమయిన జీవితం. భరతుడు పుష్యమి, ఆశ్లేష లక్ష్మణుడు.

రాముడుతో ఉన్నాడు కాబట్టి లక్ష్మణుడు మనకి సలక్షణుడు అయ్యాడు తప్ప, లేకపోతే చాలా ఒక rebel కింద ఉండేవాడు ఆయన. By nature he is a rebellion. అతడిని రాజ్యంలో వదిలేసోస్తే సంక్షోభం జన్మించి, వృద్ధి చెందుతుందని రాముడు తనతోబాటు పట్టుకొచ్చుకుంటాడు లక్ష్మణుదుని – అది ఆశ్లేష! మరి పునర్వసో? రాముడే! పునర్వసు అన్న నక్షత్రానికి అర్థం ఏమిటంటే మళ్ళీ వస్తానని. పునర్ వసించడానికి వస్తాడు. అది పునర్వసు. నక్షత్రాలు, వాటి భావాలు కొంత అవగాహన సాధన చేసుకునే వాళ్లకి అవసరం ఉన్నది. వాటి అవగాహన ఉంటే, ఎక్కువ బాగా జరుగుతూ ఉంటుంది. అంచేత, పునర్వసు నక్షత్రం జెమినీలో, అంటే జేష్ట మాసంలో, సాయన సిద్ధాంతం. ...... నక్షత్రాల వరకు ...... అవేలెండి. మిధునంలో మొదలయ్యి ఆషాఢంలో కూర్చో! పునర్వసు ఒక పాదం ఆషాఢంలో ఉంటుంది. అంచేత, మనలో మళ్ళా వసించడానికి దిగి వస్తాడు సంవత్సర పురుషుడు.

ఈసారి మన సంవత్సర పురుషుడికి విజయ అని పేరు పెట్టుకున్నాము మనము – "శ్రీ విజయ నామ సంవత్సరము" అంటాము. అంటే, తప్పక మనకి విజయం చేకూరుస్తాడు అని కదా అర్థం! విజయం అంటే ఏ విజయం? మనం ఇచ్చిన అప్పులు తిరిగి వచ్చేస్తాయనా? లేకుంటే, మన ఆస్తులకి మంచి ధరలు వచ్చి అమ్ముడు

పోతాయనా? ఇలాంటి విజయాల నుంచి నరుడికి విజయము అని ఒకటి ఉంది. మనిషి నరుడుగా మారడం అనేటటువంటి దానిని విజయం అంటారు. మనిషి అంటే? మనసులో జీవించేటటువంటి వాడు మనిషి. మనువు పుత్రుడని, మనస్సు ప్రధానంగా జీవించేవాడని, మానవుడని అంటూ ఉంటారు. మానవుడు నరుడు అవ్వాలి. నరుడు అంటే నశింపనివాడని అర్థం. అంచేత, మాటిమాటికీ చచ్చిపోవడం అనేది లేకుండా, ఎప్పటికీ చిరంజీవిగా బ్రతికి ఉండేటట్టుగా ఈ మనిషి తయారు అయితే, అప్పుడు వాడిని నరుడని, విజయుడని చెప్తారు. నరుడన్న పేరు అర్జునుడికి చెప్తూ ఉంటారు మామూలుగా భారతంలో. అతడు విజయుడని చెప్తూ ఉంటారు. ఏంచేత అంటే, కృష్ణోపదేశం కారణంగా అతడు ఇంద్రుడి పుత్రుడే అయినా, అంటే మనసు పుత్రుడే అయినా, క్రమంగా శాశ్వత స్థితికి చేరుకున్నాడు కాబట్టి, అతడు విజయం సంపాదించేడు అన్నది సంకేతం. అలా మనకి కూడా విజయం అంటే, పుట్టని-చావని త్రోవ ఒకటి దొరికి, ఆ దోవలో నడచి వెళ్తూ ఉంటే, దానిని విజయపథము అంటారు. ఏంచేత అంటే, మనం ఇక్కడ ఏం చేసినా ఇవ్వన్నీ ఇక్కడే వదిలేసి వెళ్ళాలి, మనతో రావు. మనతో వచ్చేది ఏమిటయ్యా అంటే మనం ఏర్పరచుకొన్న జ్ఞానం అనేటటువంటి వెలుగు. ఆ జ్ఞానం అనేటటువంటి వెలుగు మనం ఎక్కడికి వెళ్తే అక్కడ వెలుగుతూనే ఉంటుంది. స్వయం ప్రకాశం అది. ఒక మణిని చీకటిలో పెట్టినా వెలుగుతూనే ఉంటుంది. ఏంచేతంటే, దానికి సహజంగా ప్రకాశం ఉంది. మనకి ఇంత మంచి భవనం ఇక్కడ ఉన్నది. మనం అంతా కూర్చుని ఉన్నాం. చీకట్లో ఏం కనబడదు కదా! ఏదేనా ఒక వెలిగేది ఉంటే అది ఆధారంగా చీకట్లో కనిపిస్తుంది. వెలుగు ఆధారంగా చీకట్లో కనిపించాలి. ఆ వెలుగు బయట ఉంటే అది ఆరిపోవచ్చు కదా! లోపల వెలుగు ఒకటి ఏర్పరుచుకుంటే అది ఆరదు. అంచేత, లోవెలుగు ఆధారంగా రాత్రి-పగలు మాత్రమే కాకుండా, పుట్టుక-చావు కూడా ఆ వెలుగులో దర్శిస్తూ ఉండవచ్చు. అంటే, తన ఎట్లా పుడుతున్నాడో తను చూసుకోవచ్చు. తను ఎట్లా మరణిస్తున్నాడో తను చూసుకోవచ్చు. అట్లా చూసుకుంటారు ఋషులు. తన ఎక్కడ జన్మించ దలచుకుంటాడో ఆ తల్లితండ్రులను తనే ఎన్నుకుంటాడు. వారి శరీరంలో చంద్రాత్మక భావంగా తల్లి గర్భంలో పెరుగుతూ ఉంటే, సూర్యాత్ముడుగా తండ్రి శిరస్సు మీద ఉండి చక్కగా చూసుకుంటూ ఉంటాడు. ఆ లోపల ఉండేటటువంటి ఆ పిండం చక్కగా పెరిగి పెద్దదయి, ప్రసవిస్తున్న సమయంలో తను ఆ శిరస్సులో ప్రవేశించి జనిస్తాడు. అది కృష్ణజననం యొక్క రహస్యం. అది కృష్ణజననం యొక్క రహస్యమే కాదు, చిరంజీవి అయిన ఏ మహాత్ముడయినా మరలా జన్మించాలంటే అతనికి గర్భనరకం ఉండదు. అంచేత, అతడు ఆ విధంగా విజయాన్ని సాధిస్తాడు. అంచేత, ఈ విజయనామ సంవత్సరం వచ్చింది. మళ్ళీ ఆషాఢ మాసం వచ్చింది. ఆషాఢ పూర్ణిమ మనం ప్రాతిపథికగా పెట్టుకున్నాం. ఆషాఢ మాసం నాలగవ రాశి. ప్రతి జీవుడికి ఒక ఇల్లు ఏర్పడుతుంది. Fourth house ఒక ఇల్లు. ఏమిటి ఇల్లు అంటే, తాను ఏర్పరుచుకున్న శరీరం. అంతకుముందే ఒక ఇల్లు తనకు ఉంది. అది తన స్వభావం. ప్రతివాడికి వాడి స్వభావమే వాడి ఇల్లు. మామూలుగా మనకి జ్యోతిష్యంలో నాలగవ ఇల్లు అంటే మన ఇల్లు, వ్యవహారం అవి అన్నీ చెప్తారు, మంచి ఇల్లు ఉంటుందనీ. మంచి ఇల్లు అంటే? చాలా అధికమయినటువంటి ధనంతో, ఎంతో పెద్ద పెద్ద విషయాలు, మంచి మంచి విషయాలు ఇంట్లో తెచ్చి పెట్టుకున్నంత మాత్రాన ఇల్లు మంచిదనడానికి లేదు. అంచేత, నీకు అసలు స్వభావంలో ఆనందంగా ఉండేటటువంటి ఒక స్థితి

లేకపోతే నీ చుట్టుపక్కల ఎన్ని ఉంటే ఏం లాభం? ఒక అరవై లక్షలు రూపాయలు పెట్టి ఒక కారు కొనుక్కున్నా, నీకు సమస్యలు ఉన్నాయనుకో, ఆ కారు నీకు అనందం ఇవ్వదు కదా!

ఆలాగే, పది కోట్లు పెట్టి ఇల్లు కట్టుకున్నావనుకో, నీకు సమస్యలుంటే ఆ ఇల్లు నీకు ఏం అనందం ఇస్తుంది? ఇవ్వదు! ఏ ఇల్లు నీకు ఆనందం ఇస్తుంది? నీ స్వభావం అనేటటువంటి ఇల్లు ఒకటి ఉంది. అది నాలగవ ఇల్లు. ప్రతివాడికి వాడి స్వభావమే నిజమైనటటువంటి వసతిగృహం. అది సుఖంగా ఉంచుతుందా, అసౌకర్యంగా ఉంచుతుందా? పూరిగుడిసలో ఉండి ఆనందంగా ఉండేవాడుంటాడు కదా! మనం కట్టుకుంటూ ఉంటాం ముప్పై లక్షల దగ్గర నుంచి కోటి రూపాయల వరకు. ఏవేవో తెచ్చి అందులో పెట్టాకుంటూ ఉంటాం. ఈ మధ్య అందరూ చైనా వెళ్లి తెచ్చుకుంటున్నారు. నువ్వు చైనా వెళ్ళు, జపాన్ వెళ్ళు, అమెరికా వెళ్ళు, ఇంట్లో చేర్చిన వస్తువులు చూసే time కూడా ఉండదు కదా! మా ఇంటికి వస్తే చాలా ఉంటాయి వస్తువులు. ఎందుచేతంటే, వెళ్ళిన చోటల్లా నేను వాళ్ళకి విద్య పంచుతూ ఉంటే వాళ్ళు నాకు వస్తువులు ఇస్తూ ఉంటారు. అవన్నీ ఇంట్లో పెట్టుకున్నాం అనుకోండి, వాటిని చూసే time ఏది మనకి కదా! మనం కూడా అక్కడా ఇక్కడా వెళ్లి కొనుక్కొచ్చిన వస్తువులు, ఇంట్లో పెట్టిన తర్వాత మళ్ళీ చూశామా వాటి మొహం? చూడం!

అంచేత, అసలు నిజమైనటువంటి ఇల్లు అనేటటువంటిది మనకి ఏదయినా ఉంది అంటే, ఎప్పటికీ మనతో ఉండేటటువంటిది, అది మన స్వభావం. అందుకుని, Cancer speaks of the behavioral nature అని చెప్తారు. మన స్వభావం ఎంత బాగా తీర్చిదిద్దుకోవాలి అనేటటువంటిది ప్రధానం. కొంతమందికి మాట తొందర ఉండొచ్చు, కొంతమందికి చేత తొందర ఉండొచ్చు, కొంతమందికి మాట్లాడడమే చేతకాదు, కొంతమంది మాట్లాడితే ఆపలేరు, కొంతమంది మాట్లాడరు. ఇట్లా ఉంటాయి కదా! ఇది మాటల వరకు. చేతలు కూడా మన ఆలోచనల బట్టే కదా! ఆలోచన, మాట, చేత – ఇవి కదా త్రికరణాలు అంటే! ఈ మూడిటియందు ఎంత వెలుగు ఉంది, ఎంత వెలుగు లేదు? స్వభావంలో వెలుగు లేకపోతే నీచుట్టూ ఎంత వెలుగు ఏర్పరచుకున్నా ఉపయోగం లేదు కదా! అంచేత, ఈ ఆషాఢ మాసం నీ ఇంట్లో దీపం పెట్టడానికి వస్తాడు గురువుగారు. ఏంచేత అంటే దీపం లేదు ఇంట్లో. ఏవేవో ఆలోచనలు ఉంటాయి లోపల, రకరకాల పథకాలు ఉంటాయి, పనికొచ్చేవేవి ఉండవు. దైవము గురుంచిన స్మరణ కన్నా ఇతరములు ఎక్కువగా ఉంటాయు. ధర్మానుష్ఠానం కన్నా ఇతర అనుష్ఠానములు ఎక్కువగా ఉంటాయి. ఆ ధర్మం మనకి ఏం కూడుపెట్టింది అన్నట్టుగా ఉంటుంది కదా! అంచేత, ఈ ప్రపంచం అంతా ఇట్లా ఉంటే మనం ఒక్కళ్ళం ధర్మం ఆచరించి ఉంటే ఏం ఉపయోగం అనేటటువంటిది ఉంటుంది. అంటే, అలా ఉన్నాయనుకోండి భావాలు, ముందు భవిష్యత్తు ఇంకా భయంకరంగా ఉంటుందని అర్థం. ఇంట్లో దీపం లేకపోతే ఏం అనుకున్నాడనుకోండి? అంచేత, సద్గురువు పునర్ వసించడానికి మనలోకి ప్రవేశించి, "*పుష్యమీ చంద్ర విభాజ*" అంటాం చూసారా, అంతటి వెలుగు నీకు తోడుగా ఇస్తాడు నీ స్వభావానికి. సద్గురువు యొక్క వెలుగే అది. ఆ వెలుగు ఆధారంగా కాస్త నాలుగూ చూసుకోవచ్చు. ఓహో! మనం, మన ఆలోచనలు అంత పెద్ద గొప్పగా లేవు, కొంచెం వంకర తిరిగి ఉన్నట్టుగా కనిపిస్తాయి ప్రతివాడికి. ఆత్మ పరిశీలన చేసుకుంటే మనం ఎలాంటి ఆలోచనలు చేస్తున్నాం పొద్దున్నుంచి సాయత్రం

వరకూ అని చూసుకో. అసలు మన మనసు నిండా వీడూ, వాడు, ఇంకోడూ, పొరిగింటివాడు, బంధువులు, మన్నేడిపించేవాళ్ళు, వీళ్ళంతా నిండిపోయి ఉన్నారనుకోండి మనసులో, ఇంకేముంది? మాములుగా ఏం ఉంది మనకి, ఎవరివల్ల సమస్యో వాళ్ళు ఎక్కువగా ఉంటూ ఉంటారు మనస్సులో కదా! ఎవరన్నా మన్ని ఏదన్నా అన్నారనుకోండి, మన్ని పొగిడిన వాడికన్నా, మన్ని ఏదయినా విమర్శ చేసినవాడే మనసులో ఎక్కువ ఉంటాడు కదా! అసలు వాళ్ళూ, వీళ్ళూ ఎందుకు? వెలుగు ఎందుకు పెట్టుకోవు? వెలుగుమూర్తి నెందుకు పెట్టుకోవు? వెలుగును, వెలుగుమూర్తులను పెట్టుకుంటే, ఈ వీళ్ళంతా చేరడానికి కుదరదు. వీళ్ళంతా చేరుతుంటే వెలుగుమూర్తి చేరడానికి అవకాశం ఉండదు.

అంచేత, ఎందుకు ఆషాఢ మాసమే పెట్టుకున్నాం? ఏం శ్రావణ మాసం పెట్టుకోవచ్చు కదా గురుపూర్ణిమ? అసలు మొదట్లోది ఆశ్విని కదా! మనకి మొదట్లోనే చైత్ర మాసం, మేష రాశి కదా! So, మొదట్లోనే పెట్టచ్చు కదండి? నాలుగు! జ్యోతిష్య శాస్త్రం ప్రకారం నాలుగు నీ స్వభావం అని చెప్తుంది. ఆ స్వభావాన్ని చక్కగా తీర్చిదిద్దుకోవచ్చు. నువ్వు ఏర్పరుచుకున్నదే అది కదా! ఏంటోనండి ఇంటికెళ్తే ఏదీ, ఒక్కటీ సరిగ్గా ఉండదు, అందుకని గుళ్ళో కూర్చున్నాను అంటాడు. ఇంటికన్నా గుడి ప్రధానం! ఇంటికెళ్తే చిరాకుగా ఉంటుంది చాలా మందికి. అక్కడా, ఇక్కడా గడిపేసి రాత్రి వరకూ, ఏదో పడుకోడానికి ఇంటికి వెళ్లి, పొద్దున్నే బయటకు వచ్చేస్తూంటాడు. ఆ ఇల్లు వదిలేవు, ఈ ఇల్లు అలా వదలకూడదు. ఇలాంటి ఇల్లుని సరిదిద్దడానికి సద్గురువు యొక్క ఆశ్రయం చాలా అవసరం. ఏందుకంటే, నీకుగా నీవు సరిదిద్దుకోలేవు. నువ్వు చేసుకుంటేనే అది అట్లా తయారయ్యింది. అది స్వభావము. నీ స్వభావం అలా తయారవ్వడానికి కారణం నువ్వే. ప్రతివారు వారి స్వభావమును వారే జన్మలతరబడి అదోక మాదిరిగా తయారు చేసుకుంటారు. వాడి స్వభావము వాడికే ఇబ్బందిగా ఉంటుంది. అందుకని వాడు సంతోషంగా ఉండలేడు. ఎప్పుడూ చిరాకూ, కోపమూ. అంటే, వాడ్నీ, వీడ్నీ సాధిస్తున్నట్టు. లేకపోతే, భయం, అనుమానం, చిరాకు. ఇలా ఉంటాయి కదా స్వభావాలు! ఇష్టమయిన వాళ్ళు కనబడితే ఒక రకంగా ఉంటుంది, ఇష్టంలేని వాళ్ళు కనబడితే ఇంకో రకంగా ఉంటుంది. ఏవేవో మన స్వభావం గురుంచి మనం ఎంత చెప్పుకున్నా చాలదు. ఏంచేతంటే, జన్మజన్మల తరబడినుండి అట్లా తెచ్చూకుంటూ ఉన్నాం దాన్ని. మనతోబాటే వస్తుంది అది! భగవద్గీత పదిహేనవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు చెప్తాడు, ఏ విధంగా గాలి ఒక సుగంధమయినటటువంటి విషయం మించి పొరి వెళ్తూ ఉంటే ఆ సుగంధం వాసన దానితో పాటు తెలుసుకెళ్ళిపోతుంది. ఆలాగే దుర్గంధం మీంచి వెళ్ళిందనుకోండి, ఆ వాసన తనతోబాటు వస్తుంది. అట్లాగే, జీవుడు బోల్డు శరీరాలు వదిలినా, మళ్ళీ శరీరంలో ప్రవేశించేప్పుడు "నేను కూడా" అంటూ వచ్చేస్తుంది. Me too అంటుంది! అదే స్వభావం వస్తుంది! అంచేత, స్వభావం చేరితే, వీడు మా తాతయ్యేమోనండి అంటూ ఉంటాడు. ఏందుకంటే, వాడు అప్పుడు ఏం తింటాడో ఇష్టంగా, వీడూ అదే తింటూ ఉంటాడు కదా! అది వాడు అప్పుడు చెయ్యి విసురుడు ఉందనుకోండి, వీడు చెయ్యి విసురుడు చూపిస్తాడు. మనం అట్లా గుర్తిస్తుంటాం. ఏది ఎమయినప్పటికీ, ప్రతీ వాడికి వాడిదయిన ప్రత్యేకమయిన స్వభావం ఉన్నది.

ఆ స్వభావం పశు స్వభావమా, మానవ స్వభావమా అనేటటువంటిది ముఖ్యం. అది దైవీ స్వభావం కూడా కాగలదు. అంచేత, పశుత్వంలోంచి మానవత్వంలోకి, మానవత్వంలోంచి దైవీత్వంలోకి, దైవత్వంలోంచి బ్రహ్మత్వంలోకి

ప్రవేశించడానికి నీ స్వభావమే నీకు ఉపకారి, నీకు అపకారి కూడా. శ్రీకృష్ణుడు ఆరో అధ్యాయంలో చెప్తాడు, ఆత్మే ఆత్మకు శత్రువంటాడు. జీవుడికి తన స్వభావమే శత్రువు. అలాగే, ఆత్మకు ఆత్మే మిత్రుడంటాడు. అంటే, తన స్వభావం తనకు తోడ్పడుతూనూ ఉండవచ్చు, తన స్వభావం తనకి ప్రతిబంధకంగానూ ఉండవచ్చు.

ఒక ఆరాధన చూద్దాం. అంటే, స్వభావం ఏ విధంగా సహకరిస్తోందో తెలిసిపోతుంది. ఇది దైవీ స్వభావానికి దగ్గరగా ఉందా? పశు స్వభావానికి దగ్గరగా ఉందా? మానవ స్వభావంగా ఉందా? ఈర్ష, అసూయలతో ఉందా? లేకపోతే బద్దకంగా ఉందా? ఏవో రకరకాలు ఉంటాయి కదా! పొద్దునే లేవాలనుకోండి. ఈ మూడు రోజులు ఎట్లా అయినా లేచేస్తాం కదా! సరే, ఇవ్వాళ్ళ ఎలా లేచేరన్నది అడగకూడదు. ఏందుకంటే, తొమ్మిది గంటలకు పెట్టుకున్నాం కదా! రేపు మనం లేవడానికి చేసే ప్రయత్నంలో ఉండే ఉత్సాహము, రేపు మనం ఈ ప్రార్ధనకి, అంతకుముందు గణపతి పూజకు తయారయ్యి వచ్చే సమయంలో మనం చూపేటటువంటి ఆసక్తి తర్వాత ఉండదు కదా! అంటే ఏమయ్యింది? నీ స్వభావం "ఆ చాల్లే అంటుంది". క్రమంగా అది ఎక్కడకు తీసుకెళ్తుంది అంటే, గణపతి పూజ పక్కన పెట్టేయండి, ప్రేయరుకు స్నానం చెయ్యాలా? స్నానం చెయ్యకుండా చెయ్యాలా? ఇవ్వన్నీ వచ్చేస్తాయి కదా!

ప్రతివాడికి వాడికన్నా వాడి స్వభావం చాలా బలంగా ఉంటుంది. అంచేత, స్వభావం రోజుకో రకంగా ఉంటుంది. అది నీతోబాటే వస్తూ ఉంటుంది కదా! అందుకే దాన్ని ఎమన్నారంటే మన పెద్దలు... ఆషాఢ మాసం, లేక కర్కాటక రాశి సంకేతం పీత. పీత ఒక పద్ధతిగా నడవదు. అంటే, జంతువులన్నిటిలోకెల్లా అసలు పద్ధతి లేనిది పీత. ఒకటి, దానికి భయమెక్కువ. రెండు, ఎప్పుడూ ఇంటికి వెళ్దామనుకుంటుంది పీత. ఓ సముద్రం ఒడ్డున కూర్చుని చూస్తే, మరి అల రాంగానే అది కన్నంలోకి వెళ్ళిపోతుంది కదా! ఎప్పుడూ ఇంటి ధ్యాసే! అంటే, దాక్కుందామని భావన ఒకటి. ఈ కర్కాటక రాశికి సరిగ్గా opposite లో ఉంది ఒక రాశి, మకర రాశి, Capricon, మొసలి. అది కూడా పని చేస్తూ ఉంటుంది ఇక్కడ. అంచేత, పని చేసి ఏం చేస్తుందంటే, మన్ని పట్టేస్తుందండి. స్వభావము జీవుడిని పట్టేటటువంటిదే ఒక మానవుడికి ఉన్నటువంటి దుస్థితి. తన స్వభావం తన్ని బంధించేస్తుంది. అంతేగా! ఎన్నాళ్ళు పోయినా అట్లాగే మాట్లాడుతాము కదా! ఎన్నాళ్ళు పోయినా, ఒక నిర్దిష్టమైన సన్నివేశంలో అలాగే ప్రవర్తిస్తుంటాం. అది మారదు! ఎందుకు మారదు? దానికి అంత బలం వచ్చేసింది. తొందరపాటుదనం మనకుందని తెలుస్తూంటుంది, అయినా కుదరదు, మారదు. అన్ని విషయాల్లో కూడా అది మారదు. ఎందుకు మారదంటే అంత బలం వచ్చింది దానికి. అంచేత, ఈ జీవుడు ఎంత దైవాంశ సంభూతుడయినా తను ఏర్పరుచుకున్న స్వభావంలో తను పట్టుబడిపోయి ఉంటాడు. గజేంద్రుడే విధంగా మొసలికి పట్టుబడిపోయాడో, అలా ప్రతి జీవుడు ఒక గజేంద్రు డనుకుంటే... గజేంద్రుడు కూడా ఓంకార స్వరూపుడే! మనమూ ఓంకార స్వరూపులమే. మొదట్లోకెళ్తే, కథలోకి అతడు ఓంకారమువలే గుహలోంచి బయటకు వచ్చాడంటారు. మనం కూడా అంతే. కాని ఎవరెవరి స్వభావాలకు వాళ్ళు వాళ్ళు లొంగిపోయి, వాళ్ళ స్వభావంలోంచే అన్నీ చూస్తూ, నిర్ణయాలు చేస్తూ ఉంటారు. వీడది, వీడది, వీడది, వీడది అని... అంటే, నీకంటూ ఒక దృష్టికోణం ఒకటోచ్చేస్తుంది. ఇక అంతే! నా దృష్టే correct, నేనుకుంటున్నదే correct! ఇంకొక కోణం నుంచి చూసే ఉద్దేశ్యం కూడా ఉండదు.

అందుకనే, మన వాళ్ళు చెప్పినట్టు తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు కదా! మూడే కాళ్లుంటాయంటాడు వాడు! కాదురా నాలుగు ఉన్నాయంటే వాడొప్పుకోడు. ఏందుకొప్పుకోడంటే వాడు ఒకటి పట్టేసుకున్నాడు, వాడికి మూడే కనపడుతున్నాయి. వాడు పట్టుకున్నది కాలు వాడికి కనబడదు కదా! అలా ప్రతీ జీవుడు తన స్వభావంలోంచి తను దర్శించినప్పుడు తానేమనుకున్నాడో ఇక ఎప్పటికీ అదే. కొంతమంది మనుషులమీద కొన్ని కొన్ని అభిప్రాయలు స్థిరంగా ఉండిపోతాయి కదా! ఏమో, వాడు ఏమయినా మారేడేమో? మనకు తెలియదు కదా! ఎట్లా మారతాడు, మనమేం మారలేదు కదా! నా అంతడి వాడిని నేనే మారనప్పుడు వాడేం మారతాడు, వాడు అలాగే ఉంటాడు అనుకుంటాం. కాని నువ్వు అనుకున్నది సత్యమో, కాదో? అలా అభిప్రాయములు దురభిప్రాయములుగా మిగిలిపోతుంటాయి.

ఇలాంటి స్వభావాన్ని ఎవరండి బాగు చెయ్యగలిగింది? నీకంటూ ఈ స్వభావంలోంచి బయటపడాలనేటటువంటి ఒక తపన ఉండాలి. I am alright అనుకునేవాడు అట్లా గాడిదల్లే బతికేస్తాడు, చచ్చిపోతాడు, అది తీసేస్తారు, కాల్చేస్తారు, అయిపోతుంది. వాడి కథేం ఇక్కడ మనం చెప్పుకోక్కర్లేదు. కోటాను కోట్ల జీవులు ఎప్పుడూ అలాగే ఉంటారు. మనం ఏదో మన్ని ఉద్ధరించుకోవాలని పెద్ద పెద్ద ఫోటోలు అవీ పెట్టుకున్నాం కదా! వాళ్ళందరూ మరి మరణాన్ని దాటినటువంటి వారు కదా! వాళ్ళు మొత్తం విశ్వవిజ్ఞాన విద్య తెలిసి, శాశ్వతంగా జీవులకు సహాయపడేటటువంటి ఒక స్థితిలో చేరినటువంటి వారు. మనలను అనుగ్రహించడానికి ఉన్నారని తెలిసి, వారి ద్వారా మన్ని మనం మెరుగు పరుచుకోవడానికి, బాగు పరుచుకోడాని చేసే ప్రయత్నం కదా! So, ఇలాంటి ప్రయత్నంలో ఉండే వారి కోసమే సద్గురువు. నన్ను నేను మార్చుకుంటాను అనుకునే వాడికి సద్గురువు. నా పరిస్థితులు మార్చి పెట్టడానికి కాదు.

నేను బాగుపడితే నా పరిస్థితులన్నీ బావుంటాయి. నేను బాగుండకపోతే, పరిస్థితులు బాగుపరిచినా మళ్ళీ పాడు చేసుకుంటాను. అంతే కదా! శుభ్రంగా ఒక మంచి... ఏవో బోల్డు పందులు తిరుగుతూ ఉంటాయి. ఒక పంది తెల్లగా ఉందని మనం తీసుకొచ్చి దాన్ని శుభ్రంగా మంచి shampoo అదీ వేసి, ఇంకా ఈ liquid soap అవన్నీ వేసి బాగా కడిగి, మంచి పన్నీరవి కొట్టిపెట్టామనుకోండి. అది కాసేపయిన తర్వాత, దాని స్వభావం పంది స్వభావమే కదా, అందులోకే వెళ్తుంది! మార్పు స్వభావంలో రావాలి.

ఇప్పుడు లంచాలు తీసుకోవడానికి అలవాటు పడిందనుకోండి స్వభావం. ఇంక తీసుకోకూడదు అనుకుంటాడు కదా! ఇంక తీసుకోకూడదనుకుంటే, ఆ రోజే ఎవడో మనం ఊహించిన దానికంటే పెద్ద మొత్తం పట్టుకొస్తాడు లంచం. ఈ ఒక్కసారికీ అనిపిస్తుంది. అలాగే అన్ని విషయాల్లోనూ. మనకి తెలిసి మన స్వభావంలో ఒక లోటు మనం సర్దుబాటు చేసుకొందాము అనుకుంటే, అది సర్దుబాటు చెయ్యడానికి వీల్లేకుండా దానికి వ్యతిరిక్తంగా ఒక సన్నివేశం వచ్చినప్పుడల్లా లొంగిపోతూ ఉంటాము కదా! ఈ ఒక్కసారి అని club కి వెళ్ళేవాళ్ళు, ఈ ఒక్కసారికి అని సిగరెట్లు కాల్చేవాళ్ళు మనకి కనబడతారు. ఈ ఒక్కసారికి అని రోజూ అబద్దాలాడేవాళ్ళు... రోజూ అబద్ధమే! ఇంటికి వెళ్లి

చూసుకుంటే మనం అబద్ధాలు చెప్తున్నాం కదా అని మనకే అనిపిస్తుంది. అంటే కాస్తోకూస్తో లోపల ఆత్మ పరిశీలన ఉండేవాడికి, వాడు ఈ రోజు మాట్లాడిన దాంట్లో ఎంత సత్యం ఉన్నది, ఎంత అసత్యం ఉన్నది, ఈ రోజు చేసిన ఆలోచనలో ఎంత శుద్ధి ఉన్నది, ఎంత అశుద్ధి ఉన్నది అని చూసుకోవాలి కదా! అలా చూసుకోకపోతే సాధన లేదు గుర్తుపెట్టుకోండి.

ఆత్మ సాధకుడికి ఆత్మ పరిశీలనము అనేటటువంటిది అనునిత్యం చెయ్యవలసిన ఒక కార్యం. అనునిత్యం ఏ విధంగా భోజనం చేస్తాము? స్నానం చెయ్యకపోయినా భోజనం చేస్తాం కదా! అట్లా రోజూ చేసే పనుల్లో, నా ఆలోచనలలో శుద్ధి ఎంత ఉన్నది, ఒకటి. నా మాటలలో ఎంత పవిత్రత ఉన్నది, సత్యం ఎంత ఉన్నది? ఊరికే వాగుతున్నానా? నా చేతల్లో ఏమయినా వృద్ధి కలిగించేటటువంటిది... "*వృద్ధి కర్మణి*" అంటాము కదా! అభ్యుదయమస్తు. మనం చేసే పనులవల్ల అభ్యుదయం కలగాలట వాళ్ళకీ, వీళ్ళకీ. అలాంటి పనులు ఏమయినా జరిగినాయా, లేకపోతే ఏమో గడిచిపోయె!

అంచేత, గురుపూర్ణిమ సందర్భంగా మొట్టమొదటగా తెలుసుకోవలసిందేమిటంటే, అది ఆషాఢ మాసంలో వస్తుంది కాబట్టి, మన స్వభావమునందు మనకిగా మనం పూనుకుని కొంత ఇంతకన్నా బాగుండడానికి ప్రయత్నం అనేటటువంటిది చేస్తాం అనేది దీక్ష. అలాంటి వారికి సద్గురువు. తనను తాను ఉద్ధరించుకోవాలి అనేటటువంటి తపన ఉన్నవాడి దగ్గరకు సద్గురువు వస్తాడు. నువ్వు వెతుక్కోలేవు సద్గురువుని. అతడే నీ యొక్క సంకల్పము యొక్క తీవ్రతను బట్టి నీ దగ్గరకు వస్తాడు. మన దగ్గరకే గురువు నడచి వస్తాడు అని ఎందుకంటారంటే... తన్ని తాను బాగు చేసుకోవాలనేటటువంటి భావన ఉన్నటువంటివాడు, ముందుగా చేసేదేమిటంటే, తన జీవితంలో తన కర్తవ్యాలను తాను స్పష్టంగా నిర్వర్తిస్తాడు. కర్తవ్య నిర్వహణము. "*కార్యం కర్మ కరోతి*" అంటాడు. కర్తవ్య నిర్వహణమునందు ఆసక్తి కలిగి, సద్గ్రంథ పఠనమునందు తన్ను తాను మార్పు చేసుకోవడానికి ఏమయినా సూచనలు ఇచ్చారేమో అని వెతుక్కుంటూ ఉంటాడు అందులో పుస్తకాల్లో. కాస్తోకూస్తో తనకు ఉన్నదాంట్లో తోటివాడికి సహాయపడుతూ ఉంటాడు. ఇలాంటి గుణాలు ఏవరిలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయో అలాంటి వాడిని సద్గురువు చేరతాడు.

ఈ చేరడం ఎక్కడా? బయటా, లోపలా కూడా. బయట ముక్తసరిగా పలకిరిస్తూ, అందరితో మర్యాదగా ఉండే సద్గురువు, కొందరి హృదయాలలో చేరి మార్గాన్ని చూపిస్తాడు. అతను సద్గురువు. అంచేత, ఆ విధంగా అతడు చూసుకుంటూ ఉంటాడు. అలాంటి వారికి ఈ గురుపూర్ణిమ.

అంచేత, ఈ గురుపూర్ణిమ మనం నిర్వర్తించుకుంటున్నామంటే, మనము మన సద్గురువును ఆశ్రయించి మన స్వభావమునందు, ఇదివరకటి విధానము – ఏది... భావం, భాష, ఆచరణ – వీటిని ఉన్నదానికన్నా కొంచెం మెరుగు ఏమయినా తెచ్చుకోగలమేమో అనేటటువంటి ప్రయత్నంలో సద్గురువు యొక్క చరణములు ఆశ్రయించడం ఉంటుంది. దానికి తూకంగా ఏం చెప్తారంటే, నీయందు కొద్దిగా సడలింపు. మనిషిలో అదే మూర్ఖపు పట్టుదల కాకుండా, కొంచెం పట్టువిడుపు ఉంటుంది... పట్టూ-విడుపు. పట్టువిడుపనేటటువంటిది అన్ని విషయాల్లోనూ ఉండాలి. ఎప్పుడూ అట్టాగే

పడుతూ ఉంటే నీకే ఇబ్బంది. నువ్వు ఎన్ని పట్టుక్కుచుంటే అంత మనసులో tension. Grip is a tension. అంచేత, పట్టూ–విడుపులుగా నీ మనసు. నీ స్వభావంలో, అన్నీ విషయాల్లోనూ పట్టూ–విడుపూ. నేను ఫలానా వాళ్ళింటికి వెళ్ళను అనుకున్నావనుకో? మాములుగా మగవాడు అలాంటివన్నీ కూడా అత్తగారి విషయంలో చేస్తూ ఉంటాడు. అత్తగారింటికి వెళ్ళను, ఇటువంటివన్నీ పెట్టుకుంటాడు కదా! ఇట్లా ప్రతీవాడికి ఏవో పట్టుదలలుంటాయి. నేను వాడింటికి వెళ్ళను, నేను వీడింటికి వెళ్ళను, ఇలా ఉంటాయి. వాడంటే మనకు ఇష్టం లేదు, ఇటువంటివన్నీ ఉంటాయి కదా! వాటిల్లో విడుపు రావాలి. కొన్ని విషయములలో అధికమైన పట్టు, కొన్ని విషయములయందు విసర్జన, ఇటువంటివి ఉంటాయి. అంచేత, మొట్టమొదటగా జీవుడులో రావలసినటువంటి ముఖ్యమైన మార్పు ఏమిటంటే పట్టు విడుపులు. అంటే, ఏది పట్టుకోవాలి, ఏది విడిచేయ్యాలి?

మాములుగా ఏం చేస్తాం అంటే ఏది పట్టుకోవాలో అది విడిచేస్తాం. ఏది విడి చెయ్యాలో అది పట్టుకుంటాం. విడి చెయ్యాలిసినవి పట్టుకుంటూ, పట్టుకోవాలిసినవి విడిచేస్తూ ఉంటే? ఏది ముఖ్యం, ఏది ముఖ్యం కాదు? తెలియాలి కదా! మొన్నామధ్య ఎవరో ఏదో పెద్దవాళ్ళకి ఇంక మీరు ఎక్కువ తిరగకుండా కూర్చోండి అని చెప్తే, వాళ్ళు అయితే May Call మానేస్తాం అని చెప్పారు. అదేమిటండి? ఎక్కువ తిరగద్దంటే May Call కి రావద్దనా! అట్లా ఉంటుంది ఇది. మనకి convenient గా దాన్ని apply చేసుకుంటూ ఉంటాము. ఊరికే వాళ్ళిళ్ళకి, వీళ్ళిళ్ళకి తిరగడం మానేయమన్నామనుకోండి. వాళ్ళిళ్ళకి, వీళ్ళిళ్ళకి తిరగడం మానేయమంటే, ఊరికే ప్రయోజనం లేకుండా తిరగడం కదా! ప్రయోజనం ఉండి కూడా వాళ్ళింటికి వెళ్ళలేదనుకోండి? విచక్షణ మానవుడికి ఇచ్చాడు దేవుడు. దాన్ని ఎక్కడ వాడాలన్నది ప్రశ్న. విలువయినది ఏది, విలువ కానిదేది? విలువయినది పట్టుకోవాలి. విలువ కానిది వదిలెయ్యాలి. దేని పరంగా? ఆత్మ పరంగా.

అంచేత, ఈ పట్టువిడుపులే రాహుకేతువులు. రాహువొచ్చాడంటే భయపడిపోతుంటారు చాలా మంది. కేతువచ్చాడంటే భయపడిపోతుంటారు. ఏందుకూ? రాహువొస్తే నీకు ఎంత ఉపయోగమో తెలుసా? నువ్వు పట్టవలసిన విలువైన విషయానికి తోడ్పాటు చేస్తాడు, నువ్వు సరిగ్గా సంస్కారవంతుడివయితే. నువ్వు బాగా సంస్కార హీనుడివయితే, ఏది పట్టుకుంటే బాగా కాలుతుందో అది పట్టుకుంటావు. ఏంచేత? అప్పుడు నేర్చుకుంటావు ఇది పట్టుకోకూడదని! రాహుకేతువులు గాని, గ్రహాలు గాని పాపం అన్నీ మనకి విద్యలు నేర్పేవే. జీవుడు బాగుపడడానికి. అవి రెండు రకాలుగానూ పని చేస్తుంటాయి. "పట్టిన పట్టు పట్టనే పట్టావు" అంటూ ఉంటారుగా. ఏం పట్టాలి? దైవాన్ని పట్టు, దాన్ని వదలకు, మిగతావన్నీ వదిలెయ్యి.

మీరాదేవి ఒక పాట పాడుతుంది కృష్ణుడు గురించి, నువ్వు ఎన్నయినా తీసేయి నా దగ్గర నుంచి, నాకేం భయం లేదు. నీయందు నాకు గల పట్టు, అది మాత్రం తీయకంది. అంటే, ఏదయినా ఫర్వాలేదు. మనకి సాయత్రం ప్రేయరుకి అడ్డం వచ్చేది ఎంత చిన్న విషయమైనా అది మన ప్రేయర్ పక్కన పెట్టించేస్తుంది కదా! ఉదయం ప్రేయర్ వదిలెయ్యండి. ఏదో కాస్తోకూస్తో చేస్తున్నారనే అనుకుంటూ ఉంటాను నేను కూడా. అలా అనుకోపోతే నాకు ముందు లోపల

సంచలనం కలుగుతుంది. సాయంత్రం ప్రేయరుకి అడ్డొచ్చేవి వున్నాయి. అవి మనం పట్టుకోవాలా, వదిలేయ్యాలాండి? మీరే చెప్పండి. "నిజముగా తెలుపుమా మనసా" అని అడిగారనుకోండి. సాయంత్రం ప్రేయర్ కన్నా ముఖ్యమైనవి ఉన్నాయా ఇంట్లో ఆడవాళ్లకి? చూద్దాం, పోన్లే ఆఫీసులో ఉన్నారు మగవాళ్ళంతా. అంటే ఆడవాళ్ళు కూడా ఉండొచ్చు ఆఫీసులో. ఆ టైంకి ఒక్కసారి తలచుకోలేవా, నీకు నిజంగా అది important అయితే? ఆయనేం అన్నారు? ఆ టైంకి ఒక్కసారి తలుచుకో, ఆ తర్వాత నీకు ఖాళీ దొరుకుతుందే అప్పుడు చేసుకో. అసలు సాయంత్రం ప్రేయర్ ఎంత చేస్తున్నావు? అంటే పట్టు ఉందా లేదా అని చెప్పడానికి.

మనం మాస్టరుగారి యోగం అనుకుంటున్న దాన్ని, Yoga is attitude అని బోర్డు పెట్టారు పెద్ద బొమ్మ వేసి. కరెక్టే! నీ attitude ఎలా ఉంది సాయంత్రం ప్రేయర్ గురుంచి? పొద్దున్న గురించి ఎలా ఉందని నేను చిన్నవాళ్ళని అడగను. ఏందుకంటే, వాళ్ళు లేవనే లేవరు కదా! సాయంత్రం busy గా ఉంటారు. ప్రేయర్ జరగదు. ఇంట్లో మాస్టారి ఫోటో ఉంటుంది. అది ఎలా ఉందండి? ఎవరి కోసం పెట్టావా ఫోటో? ఇంటికొచ్చే వాళ్ళు చూడడం కోసమా? అంతేగా! మాదీ ఆ కులమే, మాదీ ఆ మతమే అని చెప్పుకోడాని పెట్టావా? దేనికి పెట్టావు? ఏ ఇంట్లో cvv పఠం ఉంటుందో, ఆ ఇంట్లో పొద్దున్నా సాయంత్రం ప్రేయర్లు అవొద్దూ? అవ్వాలా, వద్దా? మరెందుకు దాని మీద పట్టు లేదు? చెప్పాగా ఇందాక! అంతకన్నా పెద్ద విషయాలంటూ ఒక సద్గురువు నాశ్రయించిన వాడికి ఉండకూడదు. సద్గురువును గూర్చినటువంటి ప్రార్థన కన్నా పెద్ద విషయాలుండకూడదు. ఉంటే, ఇది మానేయ్! లేకపోతే, అది మానేయ్! అంచేత, ఏది పట్టుకోవాలి, ఏది వదిలెయ్యాలి అన్నది తెలియాలి.

ఆరు గంటలకు సినిమా ఉంటుంది. ఇప్పుడు సినిమాల కేముందిలెండి, ఎప్పుడుబడితే అప్పుడు చూడవచ్చు television లో. పూర్వకాలం మాస్టరుగారు చెప్తూ ఉండేవారు, సినిమాకి టికెట్ దొరకని ప్రతీ వెధవ వచ్చి నా క్లాసులో కూర్చుని నా పాఠాలు వింటూంటాడు అని. సినిమాకి వెళ్తారు, దొరక్కపోతే వస్తారన్నమాట పాఠానికి. ఏందుకంటే, అప్పుడు సరిగ్గా ఆరుముప్పావు అవుతుంది. ఈయన ఆరింటికి మొదలు పెడ్తారు కదా! ఆరింటికి ప్రార్థనకి రాని వాడు ఆరుముప్పావుకి వచ్చాట్ట అంటే ఏం చేసాడని? ఆయన, "ఏరా, సినిమాకి టికెట్టు దొరకలేదా?" అని అడిగేవారు.

అంచేత, మనం జీవితంలో ఏది ముఖ్యమైనటువంటిది, ఏది కాదు అనేందుకు... ఒకటి, ముఖ్యమైన విషయములయందు పట్టు, ముఖ్యము కాని విషయములయందు ఒక విధమైనటువంటి విడుదల. Its OK అని. సినిమాకి వెళ్దాం అనుకున్నాం అనుకోండి, ఎట్లాగయినా వెళ్ళాలా? వెళ్ళక్కర్లేదు కదా! Hotel కి వెళ్దాం అనుకున్నాం అనుకోండి, ఎట్లాగయినా వెళ్ళాలా? అక్కర్లేదు! అంచేత, ఈ కర్కాటక రాశి – ఒకటి పీత, రెండు తాబేలు అని చెప్తారు. తాబేలు తనకు అపాయం కలిగించే విషయములు బయట జరుగుతున్నపుడు తనకు తాను లోపలకి వెళ్లిపోతుంది. తనకి వాతావరణం అనుకూలంగా ఉన్నపుడు బయటకి వస్తుంది. అది తాబేలు! తాబేలు చాలా పెద్ద చిహ్నంగా చెప్తారు. ఇంక పీతంటే అడ్డగోలు జీవితం. ఇక మనసు ఎక్కడో ముంచేసంతవరకూ పట్టుకుపోతూనే

ఉంటుంది. అంచేత, ఈ తాబేలు, ఈ పీత, ఆ మకరం నుంచి ఈ తాబేలుకి రావాలని చెప్తారు. నీకు దివ్యమైన విషయాల మీద మకరం పట్టు ఉండాలి.

మామూలుగా ఏం జరుతుందంటే, కొంచెం మనకి వయసు వస్తుందనుకోండి, మనకి ఒంట్లో వయసు పెరుగుతున్న కొద్దీ బద్ధకం పెరుగుతుంది. అందుకనే, నలభైయేళ్ళకి ఒంటిపూట భోజనం చేసి నేలమీద పడుకోమని చెప్తారు బద్ధకం రాకుండా ఉండాలంటే. అలాంటప్పుడు ఏం చేస్తామంటే, అంతవరకూ ఏదో మనం ఇట్లా పూజలు చేస్తున్నామనుకోండి. ఎవరయినా "ఇంకేం చేస్తారు సార్ ఈ పూజలు, హాయిగా మీరు మానసికంగా చేసుకోవచ్చుగా" అంటే, మనకి సౌకర్యంగా ఉంటుంది వినడానికి కదా! నిజమే కదా, ఇవన్నీ ఏర్పాటు చేసుకుని ఏం పూజలు చేస్తాం! "ఆ! నేను మానసికం అండీ" అంటారు. ఏడిసావులే అనుకోవాలి! ఏంచేత అంటే, శంకరాచార్యులవారు తుది శ్వాస వరకూ పూజ చేసారు. అంతకన్నా మనం గొప్పవాళ్ళం కాదు కదా! త్యాగరాజస్వామి తుది శ్వాస వరకూ పూజ చేసారు. ఆ రోజు కూడా షోడశోపచార పూజ చేసి, రాముడికి నైవేద్యం పెట్టి, తర్వాత శ్వాస వదిలేడు ఆయన.

అంచేత, నీకు నువ్వే ఒక సానుభూతి చూపించుకుంటూ, మంచి విషయాలు వదిలేసావనుకో? పోనీ ఆ టైములో ఏం చేస్తావు? పూజ మానేసి ఏం చేస్తావు? పేపర్ చదవడమో, laptop తియ్యడమో, ipad తియ్యడమో, ఏవో ఇంకో పనులు! అంటే, పూజ మానేసి చేసేంత మంచి పనులు ఉన్నాయనుకో, అందుకోసం పూజ చెయ్యలేదంటే అది ఒక పద్ధతి. అది కూడా, పూజ చేసినా టైం ఉందనుకోండి ఆ పని చేసుకోడానికి, మానకూడదు. గుర్తుపెట్టుకోండి, భారతీయ సాంప్రదాయంలో ఒక కుటుంబ వ్యవస్థ చక్కగా కళకళలాడుతూ ఉండాలంటే, ఆ ఇంట్లో ఆరాధన ఉండాలిసిందే. షోడశోపచార పూజ జరుగుతూ ఉండాలిసిందే. మరో మార్గం లేదు. భర్తో, భార్యో, ఎవరో ఒకరు చేస్తూ ఉంటే, ఆ ఇంట్లో కళ పెరుగుతుంది. లేకపోతే, కళ తగ్గుతుంది. తర్వాత ప్రేతకళ పడుతుంది. ఇల్లు పెద్దదిగా ఉండొచ్చు కాని కళ ఉండదు. A house is not a home అన్నారు. ఇంట్లోకి వెళ్ళగానే హాయిగా ఉండాలి. అందుకని దేవాతా విగ్రహాలు చాలా ప్రతివాడు ఇప్పుడు fashion గా తెచ్చి పెట్టుకుంటున్నారు. ఊరుకనే తెచ్చి పెట్టుకుంటే ఏం కాదు. దానికేమయినా పువ్వు పెట్టాలి, అగరొత్తు పెట్టాలి, లేదా ఒక అరటిపండు పెట్టాలి. ఇది minimum. పూజే చెయ్యాలని ఆసక్తి ఉంటే ఎంతో time పట్టదు నేర్చుకోడానికి. మానేయ్యడం కేవలం అహంకారం. అది fashionable ego. ఉపయోగం లేదు. అంచేత, అలాంటివి వదిలేస్తూ ఉంటాం. అన్నమాచార్యుల వారు పాట పాడారు దీని గురుంచి. ఏమిటి ఇవి వదిలేసి అవి పట్టుకుంటానేంటి నేను అని పాడతాడు. నీకు పూజ చెయ్యడం మర్చిపోతాను. భోజనం చెయ్యడం మాత్రం గుర్తుందంటాడు. వాటియందు మరుపు కలగకూడదు.

అంచేత, స్వభావంలో పట్టు విడుపులు ఒకటి రావాలి. ఉత్త పట్టే అయితే అది మమకారం అవుతుంది. ఉపయోగం లేదు. ఇప్పుడు మకరం పట్టిదంటే నిన్ను ఎవరూ అది వదిలించలేము కదా! ఎవరయినా ఇంకోడు బయటినుంచి వదిలించాలి. ఎందుకని? అది లాగేస్తూ ఉంటుంది. అంచేత, నీలో పట్టుదల నిన్ను పట్టిన గ్రహణం అనుకోవాలి. గ్రాహకం అంటారు. అది అలా పీల్చేస్తూ ఉంటుంది. నీ పట్టుదల వల్ల నువ్వు పాడయిపోతావు.

మార్పులు చేసుకోపోతే పాడయిపోవూ? యుధిష్ఠిరుడు చూడండి. చాలా పట్టువిడుపు ఉన్నవాడు. రాముడు చాలా పట్టువిడుపులు కలవాడు. అందుకని ఆ కథలు. దుర్యోధనుడు ఆ పట్టు వల్లే పాడు చేసుకున్నాడు కదా! మనిషి పాడయిపోవడానికి, తన పెట్టుకున్న పట్టుదలే తన్ని పాడుచేస్తుంది.

అంచేత, ఈ స్వభావం పశు స్వభావంగా ఉండొచ్చు, మానవ స్వభావంగా ఉండొచ్చు, దైవీ స్వభావంగా ఉండొచ్చు. అలా మనలో ఈ మూడవ స్థితికి మన్ని చేర్చడానికి సద్గురువు. అతడు వీటన్నిటినీ దాటినటువంటి వాడు. అతడి స్వభావం దైవీ స్వభావమై వెలుగుతూ ఉంటుంది. అది కూడా స్వభావమే. దాన్ని బంగారుకాంతి శరీరం అంటారు. ఇంక అంతకన్నా ఎక్కువ వెలుగుతో ఉండేటటువంటి స్వభావముంటుంది. దాన్ని వజ్రకాంతి శరీరం అంటారు.

ఇప్పుడు బల్బులు ఉన్నాయండి. కొన్ని తెల్లగా కాంతి ఉన్నాయి, కొన్ని పచ్చగా కాంతి ఉన్నాయి కదా! కాంతి లేకుండా బల్బు ఉండదు. నీవు విద్యుత్తువే! అందుకని నీకు కాంతి లేక నీవు లేవు. నీ కాంతి పదార్థమైన శరీరంలో కప్పబడి ఉన్నది కాబట్టి, ఈ పదార్థమైనటువంటి శరీరం ఉండి నీ వెలుగుని సమీకరణం చేసి, ఆ వెలుగునంతా తీసి నీకు, నీలోనే, నీ వెలుగుని నీకు ఆలా పోగుచేసి నీకందించి, ఇదిగోరా నువ్వు ఎంత ప్రకాశవంతుడివో చూడు అని చూపించేటటువంటి వాడు సద్గురువు. అందుకని అతడేంచేస్తాడంటే చాలా తక్కువ నియమాలు ఇస్తాడు. చెయ్యాలేనటువంటి నియమాలు ఇవ్వడు, చెయ్యగలిగినవే ఇస్తాడు. అవి చెయ్యకపోవడం అనేటటువంటిది ఒకటి అశ్రద్ధ, రెండు ఆసక్తి లేదు. దానికోసం రారా గురువుగారి దగ్గరుకు. దాని కోసం రాలేదు! ఏవో మన దగ్గర చాలా బాధలుంటాయి, ఆయన దగ్గర సలహా పుచ్చుకోవచ్చు, కాయం పుచ్చుకోవచ్చు, సహకారం, అందుకోసం! వాటికోసం కూడా సద్గురువు తాపత్రయ పడతాడు. కాని ముఖ్యంగా సద్గురువు ఎక్కువ ఇవ్వవలసినది నీకు జన్మజన్మలకీ నీ స్వభావం నీ మాట వినేటట్టుగా నీకు ఏర్పాటు చేసి వెళ్తాడండి.

నీ మాట వింటుందనుకోండి నీ స్వభావము, అది పంచ కల్యాణి గుర్రంలా ఉంటుంది. నీ మాట వినడం లేదనుకోండి, అది కంచర గాడిదల్లే ఉంటుంది. అందుకని పంచ కల్యాణి దొరికిన కథలుంటాయు మనకి కదా! మన పుస్తకాల్లో రకరకాల కథల్లో వాడికి పంచ కల్యాణి ఇచ్చేరంటే? ఎవరూ ఇవ్వరు, గుర్తుపెట్టుకోండి. నువ్వు ఆ విధంగా తయారు చేసుకోవడంవల్ల అది నీకు ఏర్పడుతుంది. కొంతమందికి పక్షి వాహనాలున్నాయి కదా! అంటే, ఇది ఎగిరేటటువంటి శరీరం. ఇవన్నీ కూడా ఈ కర్కాటక మాసం కథల్లో ఉన్నాయి. మామూలుగా ఏం చెప్తారంటే, ఆ కర్కాటక మాసంలో జీవుడు శరీరప్రవేశం చేస్తాడంటారు. ఆ శరీరం అంటే ఇందులో చాలా కోశాలు ఉన్నాయి. పంచ కోశాలతో చెయ్యబడ్డదీ శరీరం. అందులో మనకి కనపడుతున్నటువంటి ఐదో కోశమైనటువంటి, పదార్థమయమైనటువంటిది కనిపిస్తుంది. కానీ ఇందులో ఆకాశము కూడా ఉంది. ఆకాశం ఉంది, వాయువు ఉంది, అగ్ని ఉంది, నీరు ఉంది, పదార్థం ఉంది. అంటే, ఈ ఐదు కోశాలతో చేసిన ఆ శరీరంలో నీ ప్రవర్తన బట్టీ

నీవేర్పరుచుకున్న స్వభావము వలన అది ఉత్తమంగానైనా తయారవచ్చు, అధమంగానైనా తయారవచ్చు. దానికి ఎవరు కర్త అంటే, నీవే కర్త.

నీవెందుకు దాన్ని ఉత్తమంగా చేసుకోలేక పోతున్నావు అన్న ప్రశ్నకు సమాధానం ఏమిటంటే, తెలియక. కాబట్టి, తెలియ చెప్పడానికి సద్గురువు వస్తాడు. అతడు నీకు జీవన విధానాన్ని ఇస్తాడు – ఇలా జీవించు, ఊరికే పరిగెత్తక, ఆశ పడక, కర్తవ్యం నిర్వర్తిస్తూ ఉండు అని. నీ కర్తవ్యం నువ్వు నిర్వర్తిస్తూ ఉంటే క్రమంగా నీకు ఇదివరకే ప్రారబ్ధకర్మ బట్టి చేసుకున్నవన్నీ వస్తూ ఉంటాయి, మంచి, చెడూ. వానియందు నీ కర్తవ్యం ఉంటే కర్తవ్యం నిర్వర్తించు. అనుభవించడానికి, భోగించడానికి వస్తే క్లుప్తంగా భోగించు, ఎక్కువ దానం చేసుకోమని చెప్తారు. అలా నిర్దిష్టంగా నడిపిస్తాడు సద్గురువు. అలా నడిపించే సద్గురువుని చేరాలనే ఉద్దేశంతో గురుపూర్ణిమ పెట్టుకుంటారందరూ. అది ఎంత బాగా మనం పరిశ్రమించి, హృదయమునందు సద్గురువుని ఏర్పాటు చేసుకుంటామో దాన్ని బట్టీ ఉంటుంది. ఎందుకంటే, పునః ప్రవేశం... మనకే మనయందు గురువు ఉండి ఉండవచ్చు. ఇంకా ఎక్కువ వెలుగుతో రా. మరింత వెలుగు, మరింత జ్ఞానం నాకు ప్రసాదించు. అది ఎంతవరకూ ప్రసాదిస్తాడంటే మనం కడతేరే వరకూ కూడా ప్రసాదించగలడు గురువు. అందుకునే వాడిని బట్టీ అందించడం ఉంటుంది. ఆ మార్గంలో మనం ప్రవేశించి క్రమంగా దైవీ స్వభావాన్ని పొందడానికి ప్రాతిపతికగా గురువుని ఆశ్రయించడం అనేటటువంటిది ఒక కథ, మానవుని కథలో జరుగుతూ ఉంటుంది. ఏదో సమయంలో ప్రతీ వాడికీ అతడి తపనని బట్టీ ఒక సిద్ధుడు వచ్చి మార్గాన్ని ఇస్తూ ఉంటాడు.

బుద్ధుడికి కూడా అలా ఒక సిద్ధుడు వచ్చి, ధ్యానం ఎట్లా చేసుకోవాలో మార్గం ఇస్తేనే అయ్యింది పని. అంచేత, గురుశిష్య సాంప్రదాయంలో మన స్వభావం మనికిగా మనం దాటలేము. అలాంటి స్వభావాన్ని దాటి, దాని మీద స్వామిత్వం నెరపుతున్న మరొకడు మనకి సహాయం చేస్తాడు. అది సాంప్రదాయం. ఆ కథలో భాగంగానే ఈ ఆషాఢ మాస కథ. ఆషాఢ మాసం అంటే మామూలుగా దక్షిణాయన పుణ్యకాలం అంటాము. అంటే సూర్యుడు దిగుతున్నాడన్నమాట. మనకి మేష మాసంలో శిరస్సులో ప్రవేశించిన సంవత్సర పురుషుడు, వృషభం లేక వైశాఖ మాసం వచ్చేసరికి ముఖమునందు ఉంటాడు. వైశాఖ మాసం ఎందుకు పవిత్రమైనటువంటి మాసం అయ్యిదంటే ముఖమునందు అన్ని ఇంద్రియాలు ఉన్నాయి. నీకు ముఖమునందే కన్నూ ఉంది, చెవీ ఉంది, ముక్కూ ఉంది, నోరూ ఉంది, చర్మమూ ఉంది కదా! ఐదు ఇంద్రియాలు ఒకే ఒక భాగంలో గోచరించేది ముఖము. అది మిగతా భాగాల్లో పంచ తత్వములూ ప్రకాశించవు. అంటే, ఎంత గొప్పదయినా హృదయము, ఇక్కడ కన్ను ఏర్పరుచుకోవాలి కాని చూడడానికి ఉండదు. చెవి ఏర్పరుచుకోవాలి తప్ప, ఉండదు అంటారు. వాసన ఉండదు కదా! అంచేత, ముఖమే ప్రధానం. వైశాఖ ప్రాశస్త్యం ఎక్కడనుంచి వచ్చిందంటే అది సంవత్సర పురుషుని యొక్క ముఖం. చాలా తేజోవంతుడై వెలిగాడు వైశాఖ మాసంలో సంవత్సర పురుషుడు ఈ సారి మనకి భారతదేశం అంతా కూడాను. విపరీతమైన ఎండలు కదండీ! ఎందుకు ఎండలు? సూర్యుడు తీవ్రంగా ఉన్నాడు కదా! సూర్యుడు తీవ్రంగా ఉంటే, అది వెలుగేగా! "అబ్బో ఎండలే ఎండలు!" అని భావించేవాడు దేహాత్మ భావంలో ఉన్నాడు. జీవాత్మ భావంలో ఉన్నాడనుకో, "అబ్బో ఎంత వెలుగు, ఎంత వెలుగు!". ఆ వెలుగు ఎంతటి వెలుగు. నాపరాళ్ళని కూడా పగలుకొట్టే వెలుగు కదా! రాళ్ళు పగిలి

పోతాయంటారు కదా రోహిణీ కార్తిలో! రోహిణి ఎక్కడుంది? వృషభంలోనే ఉంది. వైశాఖ మాసంలోనే ఉంది రోహిణి కార్తి కదా! "వృషభాక్షో..." అని ఫాలభాగంలో ఉంటుదటువంటి కాంతి దైవానికి. మనక్కూడా ఉంటుందక్కడ. కాని మూసుకు పోయింటుంది.

అంచేత, ఈ భాగాన్ని బాగా ఆరాధన చేసుకోమని చెప్తారు. అందుకనే కంటితో చూచేది, చెవితో వినేది, నాలుకతో మాట్లాడేది, నోటితో తినేది, వాసన చూసేది, ఇవన్నీ కూడా ఆ మాసంలో ఐదు ఇంద్రియాలని చక్కగా పవిత్రీకరించుకోమని చెప్తారు. అటుపైన మనం మిధునంకి, జేష్ట మాసంకి వచ్చినప్పుడు కంఠం. రెండు మాటలు వద్దు. రెండు మాటలున్నాయంటే రెండు ఆలోచనలున్నాయనేగా అర్థం. అలా ఉంటే నువ్వు రెండయిపోతావు. మిధునం యొక్క గొప్పదనం ఏమిటంటే రెండిటిని ఒకటిగా చెయ్యగలుదు. మహత్తరమైనటువంటి మాసం. జేష్ట మాసం అంటే చాలా పెద్ద మాసం కదా! మిధున రాశి, గుర్తుపెట్టుకో, నీవు రెండుగా చీలి పోవచ్చు. నీవు, నీ స్వభావము. ఒకదానికొకటి సరిపడకుండా తయారయిపోవచ్చు నువ్వు. నీవు పురుషుడివి, నీ స్వభావం స్త్రీ. నీ స్త్రీ నీ మాట వింటుందా అనడిగితే అర్థం ఏమిటంటే, నీ స్వభావం నీ మాట వింటోందా అని? ప్రతివానియందు మగయినా, ఆడయినా స్త్రీ పురుష భావములు రెండూ ఉన్నాయి. ప్రకృతి, పురుషులు ఇద్దరూ ఉంటారు. అంచేత, మన స్వభావం మనకి లోబడి ఉన్నదా? మన స్వభావానికి మనం లోబడి ఉన్నామా? ఒకదానికొకటి సహకరించుకుంటూ ఉన్నాయా? యోగం అంటే దేనిమీద దేనికీ ఆధిపత్యం ఉండదు.

యోగంలో గొప్పదనం ఏమిటంటే జీవుడు తన స్వభావాన్ని దమించి ఉండడం అనేది ఉండదు. స్నేహపూరితంగా స్వభావాన్ని తనకు సహకరించుకునేలా చేసుకుంటాడు జీవుడు. అంచేత, స్వభావానికీ బావుంటుంది, జీవుడికీ బావుంటుంది. యోగి తన శరీరాన్ని కష్టపెట్టడం అక్కర్లేకుండా, అంటే, ఊరికే మాడ్చి దాన్ని, అంటే ఉపవాసాలు పేర మాడ్చడం ఒప్పుకోడు యోగి. కృష్ణుడు భగవద్గీతలో చెప్తాడు, ఈ ఉపవాసాలు చేసేవాళ్ళు నాకు ఇష్టం లేదని. అతిగా తినేవాడు ఎంత ఇష్టం లేదో, ఉపవాసం చేసేవాడు కూడా అంతే. ఉపవాసం చేసేవాడు పెద్ద ఉపకారం ఏం చెయ్యట్లేదు శరీరానికి. దానివలసినంత ఇస్తే సరిపోతుంది. ఎక్కువ తినడం వల్ల ఉపవాసం చెయ్యవలసిన అవసరం వైద్యపరంగా రావచ్చు. కానీ మాములుగా ఉపవాసాలు చెయ్యమని చెప్పరు.

నిన్ను నువ్వు బాగా హింసించుకోమని చెప్పరు. హింసించకుండా స్నేహపూర్వంగా నీ స్వభావాన్ని నీకు అనుగుణంగా మలుచుకోమని చెప్తారు. ఒక తమ్ముడున్నాడనుకోండి. వాడికొక chocolate ఇచ్చి మన పని చేయించుకోవచ్చు కదా! వాడిని ఏ విధంగా మన మాట వినేటట్టుగా ప్రేమతో లాలించో, స్నేహంతో అడుకునో, ఎట్లాగొట్లాగ మన వాడిగా చేసుకోవచ్చు. అలా చేసుకోవడం వల్ల, స్వభావము వల్ల పొందే ఉపకారాలు చాలా ఉంటాయి జీవుడుకి. అలా కానప్పుడు ఆ స్వభావము జీవుడిని బంధించేస్తుంది. అంచేత, జేష్ట మాసంలో స్వభావమునకు జీవునికి, ప్రకృతికి పురుషునికి మైత్రి. అది జరగాలంటే రెండు ఆలోచనలు ఉన్నాయంటే జరగవు. నీకు రెండు ఆలోచనలు ఉంటే, లోపల ఒకటి, బయట ఒకటి. నిన్ను నువ్వు నిట్టనిలువుగా చీల్చుకున్నట్టుగా అయిపోతుంది.

ఇంక అంతే! అది నా మాటా వినదు. ఆ పరిస్థితి వస్తుంది. అలా కాకుండా ఉండడానికి ఏ విధంగా యోగం చెయ్యవచ్చు అనేటటువంటిది Gemini, జేష్ఠ మాసంలో ఇచ్చారు. ఆషాఢానికి వచ్చేసరికి నీ స్వభావాన్ని నీకు, నీకు నీ స్వభావానికి చక్కని మైత్రి కలిపించి, ఆ స్వభావాన్ని దివ్య స్వభావంగా మార్చడానికి సద్గురువు మనయందు ప్రవేశించేటటువంటి ఒక వైభవము ఈ మాసంలో ఉంది.

ఈ విధముగా స్వభావమునందు మనం కృషి చెయ్యకపోతే మనకేం జరుగుతుందంటే స్వభావమనేటటువంటిది ఆశ్లేష వలే ఒక పెద్ద పాము అయి మన్ని మింగేస్తుంది. "పాము కరిచేసింది వాడిని" అంటే అర్థం అది. మన గ్రంథాల్లో పాము కాటేసింది అంటూ ఉంటాము కదా! ఏంటి పాము? కాలమే పాము కదా! కాలసర్పం అంటాము. అంటే, చచ్చిపోయాడంటాము. అందుకని పునర్వసు, పుష్యమి. అలా మనకి ఈ రాశుల్లో ఇవి గోచరిస్తూ ఉంటాయి. అంచేత, ఇప్పుడు మనం ఈ పూర్ణిమ సందర్భంగా, అంటే ఇప్పుడు మనం త్రయోదశిలో ఉన్నాం. ఈ పూర్ణిమ చివర వరకూ, అంటే రాకంతం అంటారు. పూర్ణిమ తిథి అయిపోయి మర్నాడు కూడా వెలుగు ఉంటుంది. ఇక అక్కడ నుంచి క్రమంగా కాంతినందుకొని మనం తర్వాత తొమ్మిది నెలల జీవితాన్ని చక్కగ్గా నిర్వర్తించుకోవడానికి ఇప్పుడు పెట్టారీ ముహూర్తం, గురువుగారు ఇక్కడ రావాలని.

ఏమిటి దాని యొక్క ప్రధానమైనటువంటి ప్రయోజనం ఏమిటంటే స్వభావమునందు మార్పు. పదేళ్ళ క్రితం కంగారు పడుతూ వచ్చాం అండీ, ఇప్పుడూ కంగారు పడుతున్నావంటే, ఏమీ ఆనందాన్ని ఇవ్వలేదు. మనకి సామెత ఉందికదా, "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది" అని. గురువుగారు అవే చూస్తూ ఉంటాడు. వీడికి ఏమయినా కంగారు తగ్గిందా? ఒకటి చూస్తాడు. తొందరపాటు తగ్గిందా? మాట ఎలా ఉంది? ఆ మాటల్లో పదాలు ఏంటి? అవి కూడా చూస్తాడు. దాన్నిబట్టి వాడు. మనకి ఉందికదా ఆశంసనము "May the sound I utter reveal the light in me." ఒకడు మాట్లాడుతుంటే వాడిలో ఎంత సరుకుందో తెలుస్తూ ఉంటుంది. వెలుగు ఉందో, లేదో! మాట తర్వాత చూద్దాం. ఏమంటే మాట్లాడుతుంటే అవతలవాడికి వికాసం కలగాలి. అప్పుడూ light! May the sound I utter reveal the light in me. And may I listen to it while others speak. వాడు అవతలవాడు మాట్లాడుతుంటే అది నీకు వికాసాన్ని కలిగిస్తోందా? మరొకటి కలిగిస్తోందా? వికాసాన్ని కలిగించడం లేదనుకో, ఊరికే అట్లా చూస్తూ ఉండు. వేరే ఈ లోపల ఎటో వెళ్ళిపో. కాస్త ఇటుపక్కా అటుపక్కా నాలుగు విషయాలు ఆలోచించుకుంటూ ఉండచ్చు. వీడిది వినక్కర్లేదు. ఎందుకంటే, అందులో ఏంలేదు వినడానికి. ఫోన్లు కూడా వస్తూ ఉంటాయి కదా! మొదటి మూడు వాక్యాల్లోనే మనకు సందేశం ఉంటుంది. ఆ తర్వాత రోడ్డు కొట్టుడే. అందుకని, అందరూ ఇలా పెట్టేసుకుని పనులు చేసుకుంటూ ఉంటారు కదా!

అంచేత, ఇది చూస్తాడు సద్గురువు. సంవత్సరానికి ఒకసారి వస్తాడు. నీలో ఏ మాత్రం వెలుగుందో చూసి నీకొక స్ఫూర్తి ఇచ్చి వెళ్లిపోతానంటాడు జ్వాలకూల్ మహర్షి. "I see the light in the head." నీ తలకాయలో అసలు ఏదయినా వెలుగు ఒకటి ఉన్నదా? ఉంటే అది ఏమయినా పెరిగిందా? దాన్నిబట్టీ ఆయన ఇచ్చే impulse

ఇచ్చేస్తాడట సంవత్సరానికి ఒకసారి. అంచేత, మనకి మన గురువుగారు ఇవాళ వచ్చి చూసి, "ఏమోయ్ ఎట్లా ఉన్నావు" అంటే, "ఏదో ఇలా ఉన్నాం మాస్టారు, తమరికి తెలియందేముంది", ఇటువంటి పిచ్చి పిచ్చి మాటలన్నీ మాట్లాడక్కర్లేదు. నోరు మూసుకుని కూర్చోవడమే.

ప్రతీ ప్రశ్నకీ సమాధానం చెప్పక్కరలేదు కదా. "ఎలా ఉన్నావంటే", "తమరికి తెలియందేముంది" అని అంత వినయంగా మాట్లాడమని సద్గురువు expect చెయ్యడు. ఎందుకంటే, ఆయన ఎప్పుడూ శిష్యుడిని స్నేహితుడిగానే చూస్తాడు. శిష్యుడు గురువుగారిని గురువుగారి లాగానే చూడాలి. గురువు శిష్యుడికి స్నేహితుడు. శిష్యుడు గురువుని నా friend అనకూడదు. ఆయన దృష్టిలో నువ్వు స్నేహితుడివి, కుమారుడివి, సహవాసివి. అంతేకాదు, అంతేవాసివి. ఇంట్లో ఉంచుకుంటాడటండీ. గుండెల్లో పెట్టుకుంటాడట గురువుగారు, కొన్ని కొన్ని నియమాలు తుచ తప్పకుండా పాటిస్తూ ఉంటే. అలాంటి వాడిని తన హృదయంలో పెట్టుకుని జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉంటాడు. అంటే, అతడు నశించకుండా చూసుకుంటూ ఉంటాడు. అంచేత, అలాంటి సద్గురువు వచ్చినప్పుడు "ఏమోయ్ ఎలా ఉన్నావు?" అన్నాడనుకోండి. అలాగే మాట్లాడతారు కదా, "ఏం సుబ్బారావు?" అంటారు, అంతే కదా! అలా అనగానే మనం పడిపోతాము. ఏందుకంటే ఆ మాటలోనే వెలుగు. అంటే, "ఏం సుబ్బారావు?" అంటే, అదేం పెద్ద ఉపనిషత్తు వాక్యమా? కాదు. కానీ ఆ ఉచ్చరించే విధానం ఉందే దాని వల్ల లోపలనుంచి ఒక వెలుగు వచ్చి స్పృశిస్తుంది. స్పృశిస్తే, వాడిలో అంతకు ముందు కాస్తోకూస్తో అవీ ఇవీ ఆలోచనలు ఉంటే అవన్నీ ఫట్ మని పోతాయి. రకరకాలుగా పలకరిస్తాడు సద్గురువు కదా! పలకరింపులో ఉద్దేశ్యం ఒకటే. ఒక flash light లా పని చేస్తుంది. అంతే, అక్కడనుంచి ఇక నెమ్మదిగా కార్యక్రమం. కలిసి నడుస్తారు ఏముంది. "*సహనా భవతు సహనౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వినావధీత మస్తు*". అవి ఎవరు చదువుకుంటారు? గురువు శిష్యుడు కలిసి చదువుకుంటారు. అవి గురుశిష్యులు కలిసి చదువుకునేటటువంటి ఆశంసనం అది. శాంతి పాఠం. కలిసి పని చేద్దాం అంటాడాయన. అదీ చెప్పిందాయన నాకు మొట్టమొదట. CA అయిపోయి, కొంచెం మనకి చదువు బాధ లేదు, సంపాదనా బాధ లేదు. ఏంచేతంటే, ఆ విద్య వల్ల సంపాదించుకోపోతామా అనే ధీమా. అంచేత, ఆయన దగ్గరకెళ్తే, ఇప్పుడు నేను చాలా free మాస్టరుగారు, నన్నేం చెయ్యమంటారంటే, "మనమిద్దరం కలిసి పని చేద్దాం" అన్నారు. ఇదొక్కటే మాట. మనమిద్దరం కలిసి పని చేద్దాం, "*సహవీర్యం కరవావహై*" అన్నారన్నమాట. అంటే, కలిసి పని చేద్దాం అంటే, ఏదో అలా చెప్పేరులే అనుకుంటాం కదా! చాలా కాకతాళీయంగా ఉంటాయి మాటలు. పెద్ద పెద్ద ఉపన్యాసాలు, ఇలా screen వేసి నిర్వర్తించరు initiations. చిన్న చిన్న మాటలే మంత్రాలు. అలా పని చెయ్యడం, పని చెయ్యడం, పని చెయ్యడంగా ఇక కలిసే పని చేస్తున్నాం. అట్లా ఉంది అది. అంటే, ఎంత పనులయినా చెయ్యొచ్చు కలిసి. ఏముందక్కడ! ఏందుకని? కలిసి రక్షింపబడతాము. "*సహనా భవతు*", కలిసి భోజనం చెయ్యడం, "*సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై, తేజస్వినావధీత మస్తు*". వెలుగు అలా పెరగడానికి ఏమీ అవరోధాలు లేకుండా చేస్తాడు. ఎంతయినా పడుతుంది. అది అనంతం కదా! అది అంతం ఏముంది? ఇలా మనం ఎన్ని మాటలు మాట్లాడుకున్నా ఏప్పుడూ ఏదో వస్తూనే ఉంది కదా! అలా ఉంది అది.

అంచేత, ఆ విధంగా అలా మనని చక్కగా ఒక శిల్పి మలిచినట్టు, ఒక కమ్మరి మట్టి నుంచి బొమ్మని తయారుచేసినట్టు. కుండలే తయారు చెయ్యడు కదా! మట్టి బొమ్మలు లేవూ కృష్ణుడివి? అలా జాగ్రత్తగా చేసుకొచ్చేస్తాడు. లేకపోతే మట్టే ఇది. అట్లు మట్టిలో ఇరుక్కుపోయిన జీవుడిని, కేవలం జీవుడిని తియ్యడమే కాదు, జీవుడి స్వభావాన్ని అందంగా తయారు చేస్తాడు. అది గొప్ప విషయం.

గుర్తుపెట్టుకోండి, రాజయోగ మార్గం ఇక్కడనుంచి ఎక్కడకో వెళ్ళిపోవడం కాదు. ఇక్కడ నుంచి అందులోకి వ్యాప్తి చెందడం. ఇది వదిలేసి అందులోకి వెళ్ళిపోయాము, అవన్నీ gas, భ్రమ. ఎదో వదిలేసి వెళ్ళిపోయాడట అంటే వాడు చేతకాని వాడని అర్థం. ఎందుకు వదిలెయ్యాలి? ఎవరూ వదిలెయ్యమని చెప్పలేదు. రాముడట్లా వదిలెయ్యలేదు. వదిలేసాడా? నీకు ఉన్నదాన్నుంచే పెరగడం ఉంటుంది. మొక్క పెరుగతుందంటే భూమిలో కూడా బాగా స్థిరంగా పాతుకుని ఉంటుంది కదా! పెరిగిన కొద్దీ వేళ్ళు తీసేస్తే? ఉంటుందా? అందుకని, యోగంలో ఆక్రమించడం అంటాడు దాన్ని. సత్యపరాక్రమః అని రాముడికి పేరు. ఏమిటి ఆక్రమణము? నీ చైతన్యము పృధ్వీ తత్వంలోంచి ఆకాశ తత్వంలోకి, అక్కడనుంచి ఇంకా పైకి, అక్కడనుంచి ఇంకా పైకి, ఇట్లా వ్యాప్తి చెంది ఏడు లోకాలు వ్యాప్తి చెంది, చైతన్యుడివయ్యి నీవు నిలబడాలని ఆశించేటటువంటి వాడు గురువు తప్ప, ఇవొద్దు, అవొద్దు, ఇంకోటోద్దు అనడు.

ఉద్యోగం మానేయనా అంటే మానేయి అనడు. ఉద్యోగం మానేసి ఏం చేస్తావు? పెళ్ళాం పిల్లలను ఎవరు చూస్తారు? నేను చూస్తాననుకుంటున్నావా? నువ్వే చూడాలి? నేర్చుకోవద్దూ? పెళ్ళాం పిల్లలను సరిగ్గా చూడలేని వాడికి యోగం ఏమిటండీ? కర్తవ్యాలు వదిలేసి యోగంలోకి రావడం అనేటటువంటిది ఎప్పుడూ ఏ సద్గురువు దాన్ని ప్రోత్సహించలేదు. అలా అక్కడక్కడా జరిగిందంటే తప్పుడు జరిగినట్టే. నీ ధర్మంలో నువ్వు చెదరకుండా నిన్ను అక్కడనుంచి వృద్ధి చేసేటటువంటి పద్దతుల్లో ఉంటాడు సద్గురువు. అంతే తప్ప నీ ధర్మంలోంచి నిన్ను విడదియ్యడు. అక్కడినుంచే పెంచుతాడు. నేనన్నాను మాస్టరుగారితో, "ఈ profession కొంచెం conflict గా ఉంది, university లో teacher post, professor post కావాలంటే easy గా ఇస్తారు". "ఏం దీనికన్నా అది బాగుంటుందని అనుకుంటున్నావా, అదేం బాగుండదు, నేను అదే కదా" అన్నారాయన. ఆయన university professor రే కదా! బావుండడం, బావుండక పోవడం ఇక్కడ ఉంటుంది. ఉన్నచోట ఉండి అక్కడనుంచి పెరగడమే తప్ప, ఇంతకన్నా అక్కడ బావుంటుంది... అక్కడ నుంచి ఇక్కడకు... నీకేది బావుంటుందో ప్రకృతికి తెలుసు కాబట్టీ నిన్ను అక్కడ పెట్టారు. నువ్వు అక్కడ నుంచే పెరగాలి. అక్కడ నుంచే పెరుగు. అలా పెంచుతాడు. Displacements ఉండవు సద్గురువు దగ్గర. He will not cause displacements. He will ensure that you are established and grow from there. Beyond your determined horizon. నీ పరుధులను పెంచి నిన్ను పెద్దవాడిని చేస్తాడు.

ఆ విధంగా నిర్వర్తించే సద్గురువు మనలందరిని గురు పరంపర ఒకసారి స్వీకరించడం కోసమని ఈ గురుపూర్ణిమ పెట్టుకున్నాం. అంతకుముందు మనకి Gemini లో రెండు గురుపూజలు ఉండేవి కదా! గురుపూర్ణిమ

సాంప్రదాయం రావడానికి కారణం నిజానికి జగద్గురు పీఠం కార్యక్రమ్మాల్లో, అదో కార్యక్రమంగా ఏర్పడడానికి కారణం, రమణి గోపాల్ గారే. వాళ్ళేం చేసేవారంటే నేను గురుపూర్ణిమకు మా ఊళ్ళో ఏదో పూజో, హోమమో చేసూకుంటూ ఉంటే, వీళ్ళు నెమ్మది నెమ్మదిగా బృందాలుగా రావడం మొదలుపెట్టారు. వాళ్ళే ఆ పైన కూర్చుని అన్నీ వంటకాలు అన్నీ చేసుకోవడం. నెమ్మదిగా ఇది ఒక సాంప్రదాయంగా, గురుపూర్ణిమ ఒక event గా తయారయ్యింది. అందుకనే, ఇక్కడ దివ్యకళాంజలి ఏర్పడినప్పుడు గురుపూర్ణిమే వీళ్ళకి గురుపూజలుగా ఉంటే బావుంటుందని నిర్ణయం చేసుకున్నాం. అప్పుడు మనకు ఆగష్టు గురుపూజలు ఉన్నాయి. మన సోదరులు సుబ్బారావుగారు, ఆయన సహృదయ స్వభావము చేతనే రెండూ ఒకటి అయినాయి. చక్కగా జరుతోంది గురుపూజ. అప్పుడు చేసేదీ గురుపూజే! ఇప్పుడు ఈ గురుపూజ ఆషాఢ పూర్ణిమ ఆధారంగా చేసుకుంటున్నాము.

అంటే, ఆషాఢ పూర్ణిమ, ఈ గురుపూజ... అంటే, ఇక్కడ జరిగితేనే గురుపూజ అనుకోబోకండి. ఎక్కడ చేసుకన్నా కావాలసింది, "*ఆవాహయామి, స్థాపయామి, పూజయామి... సద్గురువు ఆవాహయామి, స్థాపయామి, పూజయామి*". రోజూ చిన్న లఘు పూజయినా చెయ్యండి గురువుగారికి. మరీ లఘువు అంటే ఇప్పుడు చెప్పిందే. "*ఆవాహయామి, స్థాపయామి, పూజయామి*" అంటే మూడు. షోడశోపచారాలు చెయ్యోచ్చు కూర్చోబెట్టుకుని. మానసికంగా చెయ్యి, లేదు, వాచికంగా, లేదు, చేత. రోజూ ఆ విధంగా సద్గురువుని లోపలకి పిలుచుకుంటే, సద్గురువు భోధలు చదువుతూ ఉంటే... అదొకటి ఉంది. లేకపోతే సద్గురువు ఏం చెప్పాడో మనకు తెలియదు. మన కోసమే రాసాడు. ఇప్పుడు ఓ సద్గురువు ఆయనేదో రాసి ఇచ్చాట్ట అంటే, మొత్తం ప్రపంచం అని వ్యామోహం ఆయన కుండదు. నేను చెప్పేదంతా global అని వ్యామోహం ఉండదు. ఎవరికోసం అంటే, తనను అనుసరించే వారికోసం, అంతే! తనను అనుసరించే వారికోసం తాను కొన్ని రాతలు రాసి వెళ్ళిపోతాడు. ఎందుకంటే, రూపం తర్వాత కనపడకపోవచ్చు కదా! మాటలు వినపడకపోవచ్చు. ఇప్పుడు వినేట్టట్టుగా తయారు చేసుకుంటున్నారు కదా! మాస్టరుగారివి కూడా అలా ఉన్నాయి. రాసిస్తే? ఒక paragraph మాస్టరుగారు రాసినటువంటిది మనం చదువుకున్నామనుకోండి, కచ్చితంగా మాస్టరుగారి సాన్నిధ్యం ఉంటుంది మనకి కదా! When you read any book written by the master, you have the presence of that master through that book. It is so simple as that. అదీ ఒక పరమ గురువు, ఒక సద్గురువు రాసేటటువంటి రాతకి, మిగతా రాతలకి తేడా.

ఆయన మనతో ఉండి, నువ్వు చదువుతున్నంత సేపూ తన సాన్నిధ్యాన్ని ఇచ్చి, అది అర్ధమవడమే కాదు, నీలో పాషాణాన్ని అంతా కరిగించేస్తాడు. అందుకని, సద్గురువు ఆరాధన, సద్గురువు బోధన అధ్యయనం, ఆ రెండూ. ఆయన ఇచ్చేటటువంటి భోధనలలో ఆచరణీయాత్మకమైనటువంటివి ఆచరణలోకి తీసుకురావడం. ఈ మూడిటియందు ఎవరికి శ్రద్ధ ఉంటుందో వాళ్లకి ఉన్నతి అన్నది తధ్యం.

ఈ మూడు అరకొరగా చేస్తున్నామనుకోండి, ఉపయోగం లేదు. మనకేంటంటే ఇట్లా సంఘంలో ఉంటాం, సంఘంలో తిరుగుతూ ఉంటాం, సంఘంలో బోల్డు కార్యక్రమాలు చేసుకుంటూ ఉంటాం, చక్కగా భోజనాలు ఏర్పాటు

చేసుకుంటాం, తింటూ ఉంటాం కదా! ఆ చాలా బాగా జరిగింది... చాలా బాగా జరిగింది ... చాలా బాగా జరిగింది, చాలా బాగా... ఇప్పుడు ఏ గురుపూజలకి వెళ్తే చాలా బాగా జరిగిందని చెప్పరు చెప్పండి? అన్నీ చాలా బాగా ఎందుకు జరుగుతాయంటే, భోజనాలు బాగుంటున్నాయి, వసతి బావుంటోంది. అందరూ కాస్తోకూస్తో reservation లు చేయించుకుని వచ్చేస్తున్నారు. వచ్చిన వాళ్లకి అవీ ఇవీ ఏవో బహుమతులు కూడా ఇస్తూ ఉంటారు, మళ్ళీ రావాలని. కాబట్టి బాగా జరిగిందా? లేకపోతే, మన లోపల గురువుగారికి ఏమయినా చోటు పెరిగిందా? గురువుగారి భోధలకు ఏమయినా చోటు పెరిగిందా? మన లోపల వెలుగు, నీలోన వెలుగు మన పరిసరములలో ఏమయినా కనబడుతోందా, లేదా? అలాంటి వడిగితే పెద్ద సమాధానాలు రావు కదా! మన కథే కదా! ఏం చూడాలి పెరుగుదలకి? ఎంతమందిని చూస్తే నీకు వెలుగు కనిపిస్తోంది? అందరి కళ్ళలో ఉంది కదా వెలుగు! కళ్ళలోంచి వెలుగు కనిపిస్తుంది. వాడు నవ్వితే పళ్ళలోంచి కూడా కనిపిస్తుంది కదా! అవతల వాడు వాడి చైతన్యం వికాసం అవ్వడం వల్ల కదా వాడు నవ్వుతాడు. అంచేత, చిరునవ్వు ఉందనుకోండి, అంటే వెలుగు ఇంకా బాగా ఉంది. చిరునవ్వు లేదనుకోండి, పోనీ అప్పుడు కూడా కళ్ళలోంచి వెలుగు కనిపిస్తుంది. ఇప్పుడు నువ్వు దేనితో అనుసంధానం చెందాలి? వాడి కంటితో అనుసంధానం చెందాలి. ఎదుటివాడు వేసుకున్న బట్టలతోటి కాదు, వాడు వేసుకున్న నగలతోటి కాదు, జుట్టుతో కాదు. అంటే, ఎవరయినా కనబడితే, "జుట్టు బాగా నెరిసిపోయిందే?" నిన్ను జుట్టు ఎవరు చూడమన్నారు? ఆయన్ని చూడు, అవన్నీ చూడకుండా, ఆయన జుట్టు చూసి, ఆయన బూటు చూసి, ఆయన బట్ట చూసి... నువ్వు ఎవరిని చూడాలి? ఎదుట ఉండే జీవుడిని చూడాలి. ప్రతీ జీవుడు కాంతివంతమే. కాంతిని చూడాలంటే, కళ్ళలో చూడాలి కదా! కళ్ళలో చూసి పలకరించాలి. ఆ తర్వాత నువ్వు నైసర్గిక ప్రాంతం అంతా కూడా చూడొచ్చు. కళ్ళ చుట్టూ ఉండే అంతా ప్రదేశాన్ని, నఖశిఖ పర్యంతం అంతా తర్వాత చూడొచ్చు. ముందు కనులను చూడు, ముఖాన్ని చూడు. ఆ తర్వాత మిగతావి చూడు. ఎందుకని? చూసేటప్పుడు పరీక్షగా చూడాలి. ఏం చూస్తావు? వెలుగుని.

ఇట్లా చూస్తే పరీక్షిత్తు అవుతావు. పరీక్షగా ఈక్షణము చేస్తున్నాడు కాబట్టి పరీక్షిత్తు అయ్యాడు కదా. పరీక్షిత్తు book రాసేసుకోవడం, దాన్ని అన్ని బాషలలోకి మార్చేసుకోవడం, అవేమో అక్కడ కాపీలు పడేస్తే ఆ పని అయిపోయింది. ఇంక అంతే కదా! ఏంటి పరీక్షిత్తు? చిన్నతనం నుంచి ఎవరొచ్చినా అట్లా తేరిపారా చూస్తుండేవాడు కన్నులలోకి. కృష్ణుడు కనబడగానే శాంతించాడు. అంటే, తను ఎంత వెలుగు చూద్దామనుకున్నాడో అంత వెలుగు కనబడింది ఆయనకి. అప్పుడు తృప్తి పొందాడు. మనకి మాస్టరుగారు కూడా అదే ఇచ్చారు, "May the light in me, be the light before me". అది సాయంత్రం ప్రేయరులో ఉండడం వల్ల కాబోలు చాలా మందికి నోటికి కూడా రాదు. ఏందుకంటే, సాయంత్రం ప్రేయర్ చెయ్యం కదా! అందుకని సాయంత్రం రాదు. అంచేత, అలా చూస్తూ, ఆయన ఇచ్చిందే అది.

అంచేత, సద్గురువుని లోపలకి ఆవాహన చేసుకుని, ఆయన బోధలు చదవండి చాలు. ఆ భోధల వల్ల ప్రచోదనం కలుగుతుంది. ఆరాధన వల్ల, బోధనల వలన కలిగిన ప్రచోదనాన్ని, ఆయన ఇచ్చేటటువంటి నియమములు, విధానాన్ని అనుసరించడానికి వినియోగింపచెయ్యండి. మూడోది, అప్పుడు వికాసం చాలా వస్తుంది.

అలాంటి వికాసంలో మనం నివసిస్తున్నామనుకోండి, ఒక పన్నెండేళ్ళలో చాలా అద్భుతమైనటువంటి మార్పులు మనలో మనకి తెలియకుండా సద్గురువు నిర్వర్తించేస్తాడు. అది మనకెలా తెలుస్తుందంటే, మన చుట్టుపక్కల ఉండేటటువంటి బంధువులు, మిత్రులు "మీలో చాలా మార్పు ఉందండి" అంటారు. అంత తొందర పడడం లేదు మీరు, మీ మాట చాలా మారింది, ఎక్కడా కనపడడం లేదు మీరు అంటాడు. ఎక్కడా కనబడడం లేదంటే అక్కర్లేని చోటల్లా కనబడడం లేదు, అదీ. ఇవన్నీ certification. అంటే paradise junction లో కనబడేవాడు, ఇప్పుడు కనబడడం లేదు. బిరియానీ తినేవాడు అనుకోండి వచ్చి, ఇప్పుడు తినడం లేదన్నమాట, అంతే! లేకపోతే, అక్కడ tank bund దగ్గరో, మరో చోటో కనిపించేవాడు, కనబడడం లేదు. ఎందుకంటే, ఆ time ఇంకో రకంగా వాడుకుంటున్నాడు. ఇట్లా "*యుక్తాహార విహారస్య*" అని, అన్నిటిలోనూ చక్కటి మార్పులు తీసుకొస్తాడండీ. ఆహారం దగ్గర నుంచి మార్పులు తీసుకొస్తాడు గురువుగారు, మనకి చెప్పకుండానే. మనకే అనిపిస్తుంది, ఇవాళ్ళనుంచి ఇహ తినను నేను. ఎంతో మంది ఆ విధంగా మాంసాహారం మానేసిన వాళ్ళున్నారు ఈ గురుపూజలలో. ఇక్కడే కాదు, పాశ్చాత్య దేశాలలో కూడా. ఎవరూ చెప్పరు నువ్వు మాంసం మానేయమని అని. అట్లా rules ఉండవు మన దాంట్లో. వాళ్ళే మానేస్తారు. అలాగే చాలా మానేసిన వాళ్ళు ఉన్నారు. వారి వారి యొక్క తత్త్వం ఏది బావుంటుందో దాన్నే ఆశ్రయిస్తూ మిగతా వాటిని విసర్జించుకుంటూ ఆహారంలో మార్పు, విహారంలో మార్పు. అన్నిటి కన్నా ముఖ్యం ఆలోచనలో మార్పు. అలా తీసుకొచ్చి క్రమక్రమంగా, క్రమక్రమంగా మన్ని, చాలా క్రమంగా, తన కార్యంలోకి సద్గురువు, ఓ తండ్రి ఏ విధంగా కుమారుడిని పెంచి తన కార్యాల్లో నియమిస్తాడో, అలా నియమించి అవి నిర్వర్తిస్తూ ఉంటే చూస్తూ ఉంటాడు. సహకరిస్తూ ఉంటాడు. అలా సాగి వెళ్లిపోతూ ఉండడమే. ఈ లోపల మన స్వభావంలో రావలసిన మార్పులన్నీ ఒక్కక్కటీ, ఒక్కక్కటీ...

అంచేత, ఈ రాజయోగ మార్గంలో ఇవి మనం పోగట్టుకోవాలి, ఇవన్నీ మనం బాగుచేసుకోవాలి అన్న ఆలోచన ఎప్పుడూ ఉండకూడదు. మనలో పుచ్చులు ఏవున్నాయో మర్చిపోయి, మనం చెయ్యవలసినవి చేస్తూ ఉంటే, ఈ పుచ్చులు తచ్చులు అన్నీ మనకి తెలియకుండానే ఏరెయ్యడం జరుగుతుంది. When you are engaged with constructive activity, the destructive attitudes in you, they are all eliminated through time. అట్లా జరుగుతుంది. ఇదివరకు ఇలా వచ్చేది కదా మనకి ఆలోచన ఈ సందర్భంలో, ఇప్పుడు రాదే అనిపిస్తుంది. ఇదివరకు ఇలా ఉంటే కంగారు వచ్చేది కదా, ఇప్పుడు రాదే అనిపిస్తుంది. ఇదివరకు భయం వచ్చేది కదా, ఇప్పుడు రావట్లేదేంటి అనిపిస్తుంది. అంటే train కి వెళ్ళాలంటే అరగంట ముందే ready అయ్యేవాడు platform మీద, ఇప్పుడు ఐదు నిమిషాల ముందే వస్తాడు platform మీదకి. అంటే, ముందు రోజునుంచి ప్రయాణం చేసే వాళ్ళుంటారు కదా! ఇలాంటి స్వభావంలో అటువంటివన్నీ క్రమంగా పోతాయి. ఏలా పోయినాయి?

నువ్వు చెయ్యవలసినటువంటివి చేస్తూ ఉంటే, సద్గురువు యొక్క సానిధ్యం ఇప్పుడు కాలం రూపంలో, దైవం రూపంలో, ఈ మాసంలో చాలా విచిత్రంగా అదింపబడుతుంది. కాబట్టి, ఒక సద్గురువుని ఆశ్రయించిన వారందరూ

కూడా ఈ మూడు, నాలుగు రోజులు ఈ విధమైనటువంటి కార్యక్రమంలో నిమగ్నమై ఉండడమైనటువంటి ఆచారం అనుసరించి మనం ఈ విధంగా ఈ గురుపూజలు నిర్వర్తించుకుంటూ ఉన్నాం.

నిజానికి ఆషాఢ మాసంలో ప్రవేశించడానికి ముందే మన పెద్దలు, అంటే జేష్ఠ అమావాస్యకి మూడు రోజుల ముందు నుంచి, అంటే అమావాస్య నుంచి నాలుగు రోజులు ఒక వ్రతం ఇచ్చారు. ఆ వ్రత కథే సావిత్రి కథ. అంటే, ఆషాఢ మాసంలోకి ప్రవేశిస్తూ ఉంటే మన ఋషులు మనకి ఎన్ని రకాలుగా హెచ్చరికలు చేసి, మన్ని సంసిద్ధులని చేసి, ఆషాఢంలోకి ప్రవేశింప చెయ్యడానికి కృషి చేసారా అని చూస్తే, వాళ్ళకుండేటటువంటి అపారమైన కరుణ మనకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే, దక్షిణాయన సంక్రమణం అంటే అది సాయంకాల సమయంలాంటిది. ఉత్తరాయణ సంక్రమణం అంటే అది ప్రాతఃకాలం లాంటిది. అక్కడనుంచి అంతా వెలుగే. ఏందుకంటే, చైతన్యం ఊర్ధ్వగతి చెందుతూ ఉంటుంది ఉత్తరాయణంలో. మూలాధారం నుంచి చైతన్యం ఊర్ధ్వగతి చెందే కాలం అంతా కూడా మనకి ఉత్తరాయణంగా పరిగణింపబడుతుంది. కటక లేక కర్కాటక మాసం నుంచి సూర్యగతి దక్షిణాయణమున, అంటే సూర్యుడు దక్షిణ దిశగా పయనిస్తూ ఉంటాడు. అంటే, సూర్యుడు పయనం ఉండదు, భూమి యొక్క తిరగడంబట్టి ఆ విధంగా గోచరిస్తూ ఉంటాడు. అలాగా కుడి పక్కకు వెళ్ళిపోతూ ఉంటాడు రోజూ. డిసెంబరుకి వెళ్ళేసరికి ఈ మూల కనిపించే సూర్యోదయం ఆ మూల కెళ్తుంది. దక్షిణ ప్రయాణం.

దక్షిణ ప్రయాణం అంటే పదార్థ ప్రవేశం అని చెప్పారు ఋషులు. ఉత్తరము అంటే స్థూలగతికి, సూక్ష్మస్థితి నుంచి స్థూలస్థితికి రావడం. అంచేత, ఈ దిగివచ్చే మార్గంలో పదార్థానికి బలం దొరుకుతుంది. కింద లోకాల్లో పదార్థానికి బలం ఎక్కువ, పై లోకాల్లో ప్రజ్ఞకి బలం ఎక్కువ. అంచేత, పదార్థంలోకి దిగివస్తున్న జీవుడికి ఇంకా ఎక్కువ పదార్థంలో బందింపబడకుండా ఉండడానికని ఎన్ని ప్రయత్నాలు చేసారో ఋషులు, రకరకాల విధానాలు పెట్టి. అప్పటి నుంచే చాతుర్మాస దీక్ష పెట్టేసారు కదా! దక్షిణాయణము, పుణ్యకాలం అని నాలుగు నెలలబాటు చాతుర్మాస దీక్ష. అంటే, దాంట్లో మనకి రకరకాల వర్గ విబేధాలు, సిద్ధాంతాలు ఉంటాయి. కొంతమందయితే ఆషాఢం రాగానే మొదలు పెడ్తారు, కొంతమంది ఆషాఢ శుద్ధ ఏకాదశి, కొంతమంది పూర్ణిమ, కొంతమంది కృష్ణ ఏకాదశి. మొదలు పెట్టి వృశ్చికం వరకూ కూడా ఈ నాలుగు నెలలు ఎక్కువ అప్రమత్తులై ఉంటారు.

ఎక్కువ అప్రమత్తులై ఎందుకు ఉండాలి అంటే, రాబోయేది పదార్థము యొక్క పెరుగుదలకి సంబంధించిన కాలము, ఆరు నెలల పాటు. మళ్ళీ డిసెంబర్ 22 వరకూ రాత్రి పెరుగుతూ ఉంటుంది, పగలు తగ్గుతూ ఉంటుంది. చీకటి పెరుగుతూ ఉంటుంది, వెలుగు తగ్గుతూ ఉంటుంది. అజ్ఞానము పెరిగే అవకాశం ఈ ఆరు నెలలో ఉంది. అజ్ఞానం దేనివల్ల కలుగుతుందంటే, పదార్థం పెరుగుతూ ఉంటే అజ్ఞానం పెరుగుతుంది. ఎవరికయినా బొత్తిగా తెలివితేటలు లేవనుకోండి, మనం ఏమంటాం? "ఏరా బుర్ర నిండా మట్టా?" అని. అంటే, బుర్రలో మిగతా దేహంలో ఉండేటటువంటి పదార్థం కన్నా చాలా సున్నితమైన పదార్థం ఉంటుందక్కడ. Filament లాగ ఉంటుందక్కడ పదార్థం. అందుకనే, brain surgery అంటే ఒక పట్టాన భయపడతారందరూ. అదంతా ఇక్కడ ఉంది. అంచేత,

పదార్థం స్థూలం అవుతూ వస్తూ ఉంటుంది జీవుడికి. మన చుట్టూ ఏర్పడినటువంటి శరీరం యొక్క పదార్థం బరువు అవుతూ ఉంటుంది. గుర్తుపెట్టుకోండి, అది వెలుగు శరీరం అయినా పదార్థమే, అది వజ్రపు కాంతి అయినా పదార్థమే, బంగారు కాంతి అయినా పదార్థమే. అంతకన్నా ఎక్కువ బాగా పదార్థముగా ఉండేది రక్తమాంసాదులతో కూడినటువంటిది. అంటే, రక్తమాంసాదులతో కూడినటువంటి ఈ శరీరం మనం పాలు అనుకుంటే, దాన్నుంచి తయారు చేసిన వెన్నలాంటిది సూక్ష్మ శరీరం. ఆ వెన్న నుంచి తయారు చేసినటువంటి నెయ్యిలాంటిది కారణ శరీరం. అట్లా ఈ శరీరంలోనే ఆ రెండు శరీరాలు తయారు చేసుకోగలిగేటటువంటి అవకాశం ఉన్నది.

నీకో శరీరం ఇస్తే, దాన్ని మూడు శరీరాలు చేసుకోవచ్చు. One becoming three. ఒక శరీరం మనిషికిస్తే, వాడు యోగవిద్య ద్వారా, లేకపోతే భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా మరి రెండు శరీరాలు తయారుచేసుకోవచ్చండి. అంటే, అంతుంది అందులో. అందుకని అన్నీ సాధించడానికి ఈ శరీరం కావాలంటారు. ఇప్పుడు ఈ దక్షిణాయణంలో ఏం జరుగుతుందంటే పదార్థం యొక్క సాంద్రత పెరుగుతూ ఉంటుంది. సాంద్రత పెరిగితే ఏం జరుగుతుందంటే, జీవుని ప్రకాశానికి అడ్డు గోడ లేర్పడిపోతాయి. ఇప్పుడు ఇంత hall ఉండి, బోల్డు వెలుగొస్తోంది కదా! మంచి ఇటుకలు తెచ్చేసి శుభ్రంగా గదులు కట్టేసారనుకోండి. ఈ లోపల గదులకి వెలుతురు ఉండదు కదా! ఏ గదులకీ గాలుండదు. ఏందుకంటే, అటునించి వచ్చే గాలి ఇటో, అటునుంచి వచ్చే గాలి ఇటో వెళ్తే, అక్కడ వాతావరణం శుద్ధిగా ఉంటుంది తప్ప, గాలి పారనటువంటి ఒక ఇలాంటి hall ల్లో వాసన మిగిలిపోతుంది. అలాగే, మనం బాగా గదులు కట్టేసామనుకోండి. జరిగేది రెండు. గాలి పారే అవకాశం తగ్గిపోతుంది. వెలుగు తగ్గిపోతూ వస్తుంది గదుల్లోకి. అంచేత, పదార్థం పెరిగితే ఏం జరుగుతుందంటే వెలుగు తగ్గుతుందని చెప్పారు. మామూలుగా కూడా దక్షిణాయణంలో భూగోళం ఉత్తర ప్రాంతంలో వెలుగు తగ్గుతుంది, దక్షిణ ప్రాంతంలో వెలుగు పెరుగుతుంది. అంచేత, మన దక్షిణాయణం వాళ్లకి ఉత్తరాయణం, వాళ్లకి ఉత్తారాయణం మనకి దక్షిణాయణం అనుకోకూడదు.

సూర్యుడు దక్షిణమునకు ఉదయిస్తున్నాడా రోజురోజుకీ, లేక ఉత్తరమునకు కనిపిస్తున్నాడా అదొక్కటే కొలబద్ద. అందుకని, మొత్తం గోళానికి మకర రేఖ నుంచి కర్కాట రేఖ వరకూ ఉత్తరంగా వెళ్లి, కర్కాట రేఖ నుంచి మకర రేఖ వరకూ దక్షిణంగా వస్తున్నట్టుగా మనకి గోచరిస్తుంది. అది భూమి తిరగడం బట్టి. అంచేత, ఈ దక్షిణంగా సూర్యుడు వెళ్తున్నట్టుగా మనకి గోచరిస్తున్న సమయంలో పదార్థ ప్రవేశం చేస్తాడు. అందుకే మాస్టరుగారు రాస్తారు Cancer అనేటటువంటి caption కింద, "birth of souls into matter is marked by Cancer." అట్లాగే, చిట్టచివర ఒక sentence ఉంటుంది, "Cancer is all about the behavioral nature of the man". ఈ రెండు వాక్యాలు చాలదూ చెప్పుకోడానికి?

అంచేత, పదార్థంలో దిగుతూ ఉంటే ఏం అవుతుంది? వెలుగు తగ్గుతూ ఉంటుంది. మన bulb లు ఉన్నాయి. వాటికి గాజు తొడుగులు ఉన్నాయి కాబట్టి వెలుగు వస్తోంది. మరి గాజు తేసేసి, ఏదో రేకు పెట్టామనుకోండి,

మట్టి పెట్టామనుకోండి, అసలు రాదు. వెలుగు లోపల ఉంటుంది, bulb వెలుగుతూ ఉంటుంది. కానీ, ఏదీ ప్రకాశం? ఆ ప్రకాశం దేనికి పరిమితమైంది? అక్కడ మనం పెట్టిన కుండ లోపల మాత్రమే వెలుగుతూ ఉంటుంది, తప్ప పరిసరాలకు రాదు. ఇప్పుడు పరిసరాలకు కూడా వెలుగు ప్రసరింపజేసేవారు కొంతమంది ఉంటే, తనకు తాను వెలుగు కోల్పోయిన వాళ్ళు కూడా ఉంటారు. ఇంత వరకూ మనకి range కనిపిస్తుంది.

అంచేత, మన లోపల వెలుగు పెంచుకుని, ఈ పదార్థమైనటువంటిది మన్ని బంధింపకుండా, మన్ని అరికట్టకుండా, మన్ని jail లో పెట్టినట్టు చెయ్యకుండా, ఈ దేహంలో మనం కుళ్ళి పోకుండా ఉండడం కోసం మార్గాలు ఇచ్చేరండీ.

అదే సావిత్రి కథ. జేష్ఠ శుద్ధ ఏకాదశి నుంచి చతుర్దశి వరకూ మూడు రోజులపాటు చేస్తుందావిడ. ఉపవాస దీక్ష పెట్టుకుని సావిత్రీదేవి ఆరాధన చేస్తుంది. ఆరాధన చేస్తే? లేకపోతే అప్పుడే ఏందుకిచ్చారు? పైగా ప్రతీ మాసంలో ఇలా ఇలా జరిగిందని రాయరు. కొన్ని కొన్ని చోట్ల ఎక్కడయితే ప్రాముఖ్యం ఉంటుందో అక్కడది రాస్తారు. ఆషాఢ మాసంలో చివర్లో అమావాస్య ముందు మూడు రోజుల పాటు సావిత్రి వ్రతం అనేటటువంటిది అనాదిగా ఋషులు, ఋషిపత్నులు నిర్వర్తించుకుంటూ ఉండే వారనేటటువంటిది భారతంలో చెప్పబడింది. ఏమిటి దాని వుద్దేశ్యం అంటే, దాని వలన మన వెలుగు తరగకుండా రాబోయే ఐదారు నెలలో కలిగేటటువంటి పదార్థ బంధనం లేనటువంత వెలుగు తెచ్చుకోవడానికి వ్రతం అది. అదో పద్ధతి.

లేదూ, ఈ నాలుగు నెలలు పదార్థం పెరుగుతూ ఉంటే, ప్రజ్ఞకి ఆటంకం కలగకుండా నాలుగు నెలలు దీక్షగా నిర్వర్తించుకోవడం అనేటటువంటిది ఒకటి, అది చాతుర్మాస దీక్ష. అంటే, ఏం చేస్తారంటే చాతుర్మాస దీక్ష అంటే, ఒక పూటే తింటారు. రెండు పూటలా తినరు. సరే రెండు పూటలకి సరిపడా ఒక పూటే తింటారనుకోండి. ఏదయినా ఒకసారే తింటారు. ఎందుకని? అసలు నిజానికి ఒక పూట తింటే చాలట. మనం భయం కొద్ది మూడు సార్లు తింటున్నాం. ఇంకా భయం కొద్ది ఐదు సార్లు తింటున్నాం. ఈ గురుపూజలలో కొంచెం తిండి తగ్గించండి అని చెప్పాను కార్యకర్తలకి, ఎందుకంటే భోజనం పెరగకూడదు. భోజనం తరగాలి. రెండు స్వీట్లు, రెండు పచ్చళ్ళు, రెండు కూరలు, ఇట్లా వేసుకుంటూ మనం గురుపుజలు చేసుకోకూడదని చెప్పాను. అవునా, కాదా? ఏదో శరీరం నిలబడడానికి మాత్రమే పెట్టండి సుమా, అని. భయపడకండి, అలా చెయ్యట్లేదులెండి వాళ్ళు. ఒక కూర, ఒక పచ్చడి, పప్పు, పులుసు, చారు, పెరుగు చాలదూ? అదే ఎక్కువ. ఒక టిఫిన్ చాలదూ? ఇంట్లో రోజూ స్వీట్ తింటున్నామా? ఇలాంటివన్నీ చెప్పానన్నమాట పొద్దునే రాంగానే ఒక teaching. అమ్మయ్య నాకు మొదలయి పోయిందన్నాను నేను.

ఎంచేత? పదార్థమును అదుపులో ఉంచుకుంటేనే ప్రజ్ఞ బాగా ప్రకాశిస్తూ ఉంటుంది. అన్నం కనబడితే ఎగబడి పోతున్నామనుకోండి, మన ప్రజ్ఞ ఎక్కువ శరీరంలో ఉందన్నమాట. దేహాత్మ భావన. అంత మాత్రం చేత అన్నాన్ని అశ్రద్ధ చెయ్యకండి. "*అన్నం న నింద్యాత్, తథ్ వ్రతం*". శ్రద్ధగా పుచ్చుకో, కావలసినంత పుచ్చుకో. అంచేత, ఈ పెరిగే పదార్థం ... ఎందుకు పెరుగుతుంది పదార్థం ఇప్పటినుంచి అంటే, ఇప్పుడు చూడండి, ఇప్పుడు వర్షాలు పడతాయి, గ్రీష్మ

ఋతువు అయిపోతుంది. గ్రీష్మ ఋతువే ఇంకా ఆషాఢ మాసం, కానీ చూడండి ఎంతలా వర్షాలు పడిపోతున్నాయో, విశాఖపట్నంలో తప్ప! మొత్తం మన రాష్ట్రంలో అన్ని చోట్లా పడ్డాయి. మా ఊళ్ళోనే, మేము కొంచెం special కదా! మాకు సముద్రం ఉంది. అంచేత, వర్షం అందరికి ఎప్పుడూ ఉంటుందన్నమాట అక్కడ. అంచేత, వర్షం పడితే ఏమవుతుంది? అన్నీ మొలకలెత్తుతాయి. పదార్థమే కదా పెరుగుతోంది! ఈ మొలకలెత్తడంలో మనకి రకరకాల భావాలు కూడా మొలకలెత్తుతాయి. Thought is matter గుర్తుపెట్టుకోండి. అంటే, భావము కూడా పదార్థమే. నువ్వు తినే దాన్ని బట్టే నీ ఆలోచనలు. అది కూడా ఉంది. బాగా కారం తింటున్నామనుకోండి, లోపల నుంచి పేగులన్నీ ulcer లు వచ్చి చీటికి మాటికి కోపం వస్తూ ఉంటుంది. అందుకనే కోపం వస్తే Nux Vomica వేసేస్తాం మనం కదా! అంటే, కోపం వస్తే Nux Vomica వెయ్యడం కన్నా, వాడసలు అన్నం ఎట్లా తింటున్నాడో చూడాలి. అది మార్పు చేస్తే మాటిమాటికి Nux Vomica మింగక్కర్లేదు కదా! Voracious eating, అంటే ఇక పడ్డాడంటే విస్తరి మీద, అదేదో పెద్ద దండయాత్రే చేస్తూ ఉంటాడు కంచం మీద. ఎందుకని అలా జరుగుతుంది? పదార్థమునందు అంత ఆసక్తి.

అంచేత, ప్రజ్ఞ పెంచడం ఒక పద్ధతి. పదార్థం తగ్గించడం ఒక పద్ధతి. రెండున్నాయి. యోగంలో ఏమంటారంటే పదార్థం తగ్గించడం జోలికి పోక, ప్రజ్ఞని పెంచు అంటారు. అది గొప్పదనం. కాబట్టి మీరవరూ అన్నం తినడం తగ్గించుకోక్కర్లేదు, ప్రార్థనలు పెంచుకోవాలి. రాజయోగం అట్లా ఉంటుంది. అసౌకర్యం అనేటటువంటిది వీలున్నంతవరకూ తీసేస్తారు.

అంచేత, ప్రజ్ఞ బాగా పెంచుకోవాలి. అంటే, చాతుర్మాస దీక్ష అని పెట్టారు. మూడోదేం పెట్టారు? గురుపూర్ణిమ అని పెట్టారు. ఒకటి సావిత్రి వ్రతం అన్నాను, ఒకటి చాతుర్మాస దీక్ష అన్నాను, ఒకటేమో గురుపూర్ణిమ, గురువుగారిని ఆహ్వానించడం. గురువుగారిని లోపలకి ఎంత దించుకుంటూ ఉంటే, అంత మనలో విచక్షణ పెరుగుతూ ఉంటుంది. అలా పెరుగుతూ ఉండడం వల్ల మనం సవ్యంగా ప్రజ్ఞతో ముడి పడి పదార్థం మీద ఆధిపత్యం కలిగి ఉండి, జీవించడానికి వీలు పడుతుంది.

ఇలా ఇన్ని రకాలుగా ఈ గురుపూర్ణిమకి ప్రాశస్త్యం ఉన్నది. అంచేత, మనం ఈ మూడు రోజులు పూర్ణిమ వరకూ వీలున్నంత వరకూ గురువుగారిని నింపుకుందాం లోపల. అటుపైన ప్రజ్ఞ, వెలుగు బాగా పెరగాలంటే ఏం చెయ్యాలి? ప్రజ్ఞ మన లోపల విపరీతంగా వికాసం చెందాలంటే మనం చేస్తున్నది ఒకటి. అది బాగా చెయ్యాలి. "*తత్సవితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి, ధియః యోనః ప్రచోదయాత్.*" ఎక్కువ వెలుగు కావాలనుకుంటే, సవిత్రమూర్తిని ఆరాధన చెయ్యాలి. ఏదో ఇట్లా జంఝం పూనేసి, ఇట్లా గుద్దేసి, లోపల పదిసార్లు గొణుక్కుంటే గాయత్రి అయిపోయిందనుకునే వాళ్ళకన్నా ఆత్మవంచన ఇంకోటి లేదు. గాయత్రి మంత్రం దేని గూర్చి? ఏ వెలుగయితే మొత్తం ప్రపంచాన్ని వెలిగిస్తోందో అటువంటి వెలుగుల మూలాన్ని ఆరాధన చేస్తున్నాం. భర్గులంటే మన సూర్యుడికి ఆధారమైనటువంటి సవిత్రమూర్తులంటి వాళ్ళు. ఎన్నో నక్షత్ర మండలాలున్నాయి ఆకాశంలో. వీటన్నిటికీ పెద్ద పెద్ద

కేంద్రాలు ఉన్నాయి. ఇప్పుడు మనకి సప్తర్షి మండలం ఉంది, కృత్తికా మండలం ఉంది, రకరకాల మండలాలు ఉన్నాయి. వీటన్నిటికీ వెలుగెవరిస్తున్నారు? మన సూర్యుడికి సవిత్రమూర్తి, ఆయనికి ఆదిత్యుడు. "*ఆదిత్యః సవితః, సూర్యః*" మన వరకూ. అట్లాగే, భూమికి సూర్యుడు, సూర్యుడికి ఆయన సూర్యుడు సవిత్రిమూర్తి, ఆయనకి ఇచ్చేటటువంటి వాడు ఆదిత్యమూర్తి. వాళ్లటువంటి ఆదిత్యులు ఎంతో మంది ఉన్నారు కదా! మరి వీళ్ళందరికీ వెలుగునివ్వడానికి ఎవరో ఒకడు ఉండాలి కదా! లేకపోతే వాళ్లకి వెలుగెట్లా వచ్చింది? ఇప్పుడు వెలుగొచ్చిందంటే, ఇంక అక్కడ ఏదో ఉండడం బట్టే కదా ఇక్కడకొచ్చింది కనబడకుండా. అట్లా కనబడకుండా అన్నిటినీ వెలుగించేదుందే దాన్నే మనం "*భర్గః అస్య ధేవః*" అన్నాం. ఈ వెలుగేటటువంటి వాటికన్నిటికీ దేవుడెవరో మనకు తెలియదు. వాళ్ళ నుంచి వెలుగులొస్తున్నాయి. ఆ వెలుగు మనకు ఆదిత్యుడి నుంచి, సవితుడి నుంచి, సూర్యుడి నుంచి, మన వరకూ వస్తున్నాయి.

కాబట్టి దాన్ని మనం ఎంత ఆరాధన చేసుకుంటే అంత వెలుగు పెరుగుతుంది. అంచేత, గాయత్రి కన్నా మంత్రం లేదని చెప్తుంటారు కదా! అలాంటి గాయత్రి ఉపాసన బాగా చేసుకున్నావనుకో, అంటే, రోజుకి పదిసార్లు చేస్తేనే అలిసిపోకూడదు. ఆదివారం వచ్చిందనుకోండి, ఏం పనుంది? మాములుగా చేసే పిచ్చి పనులుండవు కదా ఆదివారం! మరి ఎక్కువ చేసుకోవచ్చు కదా! అర్జెంటినాలో గాయత్రి గురుంచి చెప్తే అక్కడ ఒక బృందం తయారయ్యింది, ఇరవై మంది. వాళ్ళు ప్రతీ ఆదివారం వెయ్యి సార్లు చేస్తారు గాయత్రి. నేనే దణ్ణం పెట్టాను. అదేంటి దణ్ణం పెడుతున్నావంటే, నేనే చెయ్యలేదురా ఎప్పుడూ, మీకు చెప్పాను తప్ప, వెయ్యి సార్లు చెయ్యలేదు అని చెప్పాను. వంద సార్లు చేసాను చాలా సార్లు.

అంటే, శిరస్సు పేలిపోయేంత వెలుగొచ్చేంత ఉందండి ఆ మంత్రంలో. అలాంటి మంత్రం రోజూ పదివేల సార్లు చేసాడట ఒకాయన. పైగా మనలాగా కాదు. పనిపాటా లేనివాడు కాదు. దేశానికి రాజు. పది వేల గాయత్రి. దేశానికి రాజై, పది వేలు గాయత్రి చేసి రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. ఎలా ఉంది? అలాంటి వాడికి పుడుతుంది సావిత్రిదేవి. ఆ కథ మనం ఈ సారికి ఈ సావిత్రి ఉపాఖ్యానం చెప్పుకుందామని ఒక భావన కలిగింది. రెండు గంటలైపోయింది కాబట్టి సాయంత్రం మొదలు పెట్టుకుంటాము. అంచేత, ఈ సావిత్రి కథ కూడా మన నచికేతుని కథ లాంటిదే. దీనికీ మరణ సంబంధం ఉంది కదా! మీకు ఎప్పుడూ చెప్తూ ఉంటాను మూడు కథలు మనం బాగా తెలుసుకోవాలని – ఒకటి మార్కండేయుని కథ, మరొకటి సావిత్రి కథ, మరొకటి నచికేతుని కథ. నచికేతుని కథ క్రిందటి సంవత్సరం గురువుగారి అనుగ్రహంగా అద్భుతంగా చెప్పుకోవడం జరిగింది.

అంచేత, ఈ సారి సావిత్రి కథ మనం చెప్పుకుందాం. కథ చిన్నదే, అందరికీ తెలిసినదే కదా! కాకపోతే, చెప్పుకోవడంలో మరి కొన్ని విశేషాలు మనకి తెలుస్తాయి, కొంత సాధన తెలుస్తుంది. అసలు ఈ సావిత్రి అలా ఎలా సాధించింది, ఇవన్నీ తెలుసుకోవచ్చు. అంచేత, ఈ గురుపూర్ణిమకి గురువుగారు, ప్రాశస్త్యం, ఆషాఢ పూర్ణిమ, ప్రాశస్త్యం

అవన్నీ కొంత చెప్పుకోవాలి. ఇప్పుడు ఏం చేస్తామంటే, ఈ ఆషాఢ మాసంలో ప్రవేశించగానే చచ్చి పోతాడట వాళ్ళాయన. చూడు, ఆషాఢ మాసం కథే!

ఇంక రేపటి నుంచి ఆషాఢ మాసం మొదలు. ఆ ముందు అమావాస్య. ఈ అమావాస్య రోజు ఆయన చచ్చి పోతాడు. ఆలాంటాయనని పెళ్లి చేసుకుని, ఆయనని బతికించుకున్న కథే ఇది. కాబట్టీ, ఇది ఆషాఢ మాసానికి పనికివచ్చే కథ. తర్వాత మన యోగానికి కూడా పనికివచ్చే కథ. మన యోగం అనకూడదు. ఏందుకంటే, యోగం ఒక్కటే. ఏ యోగంలోనైనా సరే నువ్వు ధారణ స్థితికెళ్తే మరణాన్ని దాటతావు. దాటడం అంటే ఏమిటి? అది జరుగుతూ ఉంటే చూస్తావు. శరీరం... ఇంట్లోంచి బయటికి వస్తూంటే, ఇంట్లోంచి బయటికి వస్తున్నట్టు చూస్తున్నావా? అంత time ఎక్కడుంది సార్ అంటారు. ఇంట్లోంచి బయటకు వస్తూ ముందు అది పరిక్ష చెయ్యండి. తర్వాత ఒంట్లోంచి బయటకు రావడం సంగతి చూద్దాం. ఇంట్లోంచి బయటకు అడుగులేస్తూ వస్తూ, step లు వేసుకుని వస్తూ, ఒక్కక్కటీ, ఒక్కక్కటీ అలా దాటుకుంటూ gate ఆవలకి వచ్చేస్తావు చూడు, అలాగే అడుగులు వేసుకుంటూ దేహంలోంచి బయటకు వచ్చే కథ యోగంలో ప్రధానమైన కథ. అమరత్వం సిద్ధిస్తేనే కదా, బ్రహ్మత్వం కూడా సిద్ధించి శాశ్వతుడవుతాడు.

అంచేత, ఆ విధంగా కూడా మనకి ఈ సావిత్రోపాఖ్యానం పనికి వస్తుంది. అన్నిటికీ మించి సావిత్రిదేవి యొక్క కృషి, ఆమె పుట్టు పూర్వోత్తరాలు, ఆ కథలో ఉండేటటువంటి మంచి మంచి ఘట్టాలన్నీ కూడా మనం ఈ సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకూ చెప్పుకోడానికి ప్రయత్నం చేస్తాం.

––– స్వస్తి

# సావిత్రోపాఖ్యానము

## July 20, 2013 సాయంత్రం – ప్రవచనం #2

సావిత్రి ఉపాఖ్యానం మహాభారతంలో రెండవ పర్వమైనటువంటి అరణ్య పర్వమునందు నిక్షిప్తము చెయ్యబడి ఉన్నది. అరణ్యము ఋషులు ఆవాసము అయిఉండడం చేత దానిని వనం అని కూడా అంటారని ఉదయం ప్రసంగంలో చెప్పుకోవడం జరిగింది. అరణ్యం ఆగమ్య గోచరంగా ఉంటుంది, భయానకంగా ఉంటుంది. ప్రాణ భయం చాలా ఎక్కువగా ఉంటుంది. అలాగే ప్రతీ రోజూ జీవితం కూడా చాలా అనిశ్చితిలో ఉంటుంది. జరుగుతూ ఉంటుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. అలా ఉండేటటువంటి ప్రపంచంలో కాలమెరిగి, దేశమెరిగి, ప్రకృతి ధర్మమెరిగి జీవించేటటువంటివారు కూడా సృష్టిలో ఉన్నారు. వారెక్కడ ఉంటే అక్కడ అరణ్యం వనం అవుతుంది.

అరణ్యంలో అన్నీ ఏ పద్ధతీ లేకుండా ఉంటాయి. చెట్టు, చేమ ఒక తీరు తెన్నూ లేకుండా విస్తరించి ఉంటాయి. అలాగే పురుగు, పుట్ట, క్రూర జంతువులు, సాధు జంతువులు. ఇలా కలగాపులగంగా ఉండే ఒక అరణ్యంలో ఒక జ్ఞాని, లేక ఒక ఋషి వసిస్తున్న ప్రాంతం మనం గమనించినట్టయితే... అది గ్రంథాలలో చక్కగా వర్ణింపబడి ఉంటుంది. ఆ ప్రాంతంలోకి ప్రవేశించగానే అది మిగతా అరణ్యంలా అనిపించదు. మనసుకు ఒక విధమైనటువంటి ప్రశాంతత, ఒక నిర్భీతి, ఒక నిర్భయము కలుగుతుంది. తెలియని ఆనందం కలుగుతుంది. అక్కడ ఉండేటటువంటి వృక్షములన్నీ కూడా ఫలవంతములై విపరీతంగా కొమ్మలకు ఫలములు కలిగి ఉంటాయి. నేలకు వంగి ఉంటాయి కొమ్మలు. అలాగే పుష్ప వృక్షములు కూడా బాగా విరివిగా పూచి ఆ ప్రాంతం అంతా కూడా పూలు జల్లబడి ఉంటాయి. అది ఎవరూ పెంచినటువంటి ఒక నడవ కానప్పటికీ విపరీతమైనటువంటి పుష్ప వికాసం ఒకటి అన్ని చోట్లా నేల మీద పడి రంగుల రంగులుగా ముగ్గులు వేసినట్టుగా ఉంటుంది. అంతేకాక క్రూర మృగాలు, సాధు మృగాలు కూడా బేధం లేకుండా ఉంటాయి. అది గొప్ప విషయం. అంటే, క్రూరమైనటువంటి జంతువులు, సాధు జంతువులు వైరం వదిలి ఉంటాయి. ఆటుపైన ప్రాంతం అంతా కూడా ఒక చల్లని ఆహ్లాదం కలిగించే వాయువు వీస్తున్నట్టుగా స్పర్శ తెలిసి ఉంటుంది. ఇదీ వనానికి, అరణ్యానికి ఉండే తేడా. అదే అరణ్యంలో ఆ వనం ఉంటుంది. అలా ఎక్కడ గనక ఒక వనం, ఒక ప్రదేశం మనకి కనిపిస్తే అక్కడ ఒక ఆశ్రమం ఉన్నది, అక్కడ ఒక మహాత్ముడు తన అనుయాయులతో వసించి ఉన్నాడు అనేటటువంటి ఒక సత్యం గోచరిస్తుంది.

అంచేత, మనం భారతంలో గాని, రామాయణంలో గాని, ఒక ఋషి దర్శనం జరిగే ముందు వాతావరణం ఎలా ఉంది అక్కడ అనేటటువంటిది భారతమునందు వేదవ్యాసుడు, రామాయణమునందు వాల్మీకి మహర్షి చక్కగా వర్ణిస్తారు. ఒక ప్రాంతంలో మనం ప్రవేశించినప్పుడు, ఆ ప్రాంతం యొక్క స్వరూప స్వభావాలు తెలియటమనేటటువంటిది అదొక జ్ఞానం. బుద్ధిమంతులు అటువంటి జ్ఞానం కలిగి ఉండాలి. అందుకే గ్రంథాలు

చదువుకునేటప్పుడు కేవలం మనుష్యుల ప్రవర్తనలు మాత్రమే కాక, ప్రకృతి వర్ణనలు కూడా చదువుకోవాలి. అలాగే ఋతు వర్ణన కూడా ఉంటుంది. ఏ ఏ ఋతువులలో ప్రకృతి ఏ విధంగా స్పందిస్తూ ఉంటుంది అనేటటువంటి విషయాలు. ఉదాహరణకు ఈ భాగ్యనగరంలోకి ప్రవేశించామనుకోండి, ప్రతీ నగరానికి దానిదైన ఒక వ్యక్తిత్వం ఉంటుంది. Every city has its own personality. భాగ్యనగరం వెళ్తే దానిదైన ఒక ప్రత్యేకత ఒకటి మనకి గోచరిస్తుంది. అలాగే ముంబయి నగరం వెళ్ళినా, లేకపోతే మన చెన్నై నగరం వెళ్ళినా, చిన్న గ్రామం వెళ్ళినా, ఆయా ప్రదేశాలలో ఉండేటటువంటి వాతావరణంలోంచి పంచభూతముల యొక్క సమన్వయం బట్టి ఆ ప్రదేశం గురించి తెలుసుకోవచ్చు. అలాగే అక్కడ ఉండేటటువంటి కొండా గుట్టా, చెట్టు చేమా, అక్కడ ఉండేటటువంటి జంతువులు, అక్కడ రాత్రిపూట ఆకాశంలో ఉండేటటువంటి రంగులు, ఇవన్నీ గమనిస్తూ ఉండడం అనేటటువంటివి జ్ఞానమునందు ఆసక్తి కలిగినటువంటి వారికి చాలా ముఖ్యమైన విషయాలు. ఆ దృష్టితో గ్రంథం చదువుకుంటున్నప్పుడు ప్రకృతి కొంత మనకి తెలుస్తూ ఉంటుంది.

అంటే, ఆషాఢ మాసంలో ప్రకృతి తొలకరి అనేది తప్పదు. ఆషాఢ మాసంలో మనం గురుపూజలు చేసుకుంటుంన్నాం కాబట్టి మనకి అంతరాయం కలగకూడదు, వర్షం పడకూడదు అనుకోకూడదు. ఏంచేత అంటే, ఆషాఢంలో తొలకరి అనేది సహజం. దానికి మనం సిద్ధపడాలి. వారం పది రోజులుగా వర్షం కురుస్తూ ఇవ్వాళ్ళ తెరిపి ఇచ్చినంత మాత్రాన, ఇదేదో మనం గురుపూజలు చేసుకుంటున్నాం కాబట్టి ఇలా తెరిపి ఇచ్చింది, ఇలాంటి భావాలు మనకి వస్తూ ఉంటాయి. సద్గురువులు ఎప్పుడూ కూడా ప్రకృతి చేసే కార్యక్రమాలకి అనుబంధంగా వారి కార్యక్రమాలు నిర్వర్తించుకుంటారు తప్ప, దాన్ని బంధించి, ప్రతిఘటించి, నిర్జించి, ఇలాంటి పనులు చెయ్యరు. అది చేసేటటువంటివారు కొంచెం అధర్మ శక్తులతో చేస్తూ ఉంటారు. చుట్టూ అంతా బంధించడం అలా ఉండదు. సద్గురువుల మార్గం ప్రకృతి అనుసరణీయంగా ఉంటుంది. ప్రకృతి కూడా సద్గురువుయందు చక్కని సహకార బుద్ధి చూపిస్తూ ఉంటుంది. అంతే తప్ప ఈయన తనకు తెలిసిన కాస్తోకూస్తో మంత్ర శక్తితో, యోగ శక్తితో నిర్జించడం, నిర్జించిన కొద్దీ అది బాగా ప్రతిఘటించి కుండపోతగా వర్షం పడడం, ఇట్లా యుద్ధాలు జరగవు. ఎక్కడయితే నిజమైన యోగం జరుగుతుందో అక్కడ ఒకరితో ఒకరు చక్కగా సహకరించుకుంటూ చక్కగా సర్దుకుపోతూ ఉంటారు.

మనం చెప్తూ ఉంటాం కదా ప్రార్థనలో, "Master's own adjustments" అంటాం కదా! అంటే మన చుట్టూ వాళ్ళని సహకరించేటట్టు adjust చెయ్యమని కాదు, మన చుట్టూ ఉండేవారితో సహకరించేటట్టుగా మన్ని adjust చెయ్యాలి. అది కావాలి. ఎక్కడయినా adjust అయిపోవాలి. ఇదే పాదరసం, అదే బుద్ధి. ఎక్కడయినా అరమరికలు లేకుండా మనం సర్దుబాటు చేసుకోగలిగితే, అలాంటి వారికి చక్కని సర్దుబాట్లు లోపల తత్త్వం ఉండేటటువంటి ప్రకృతిని చక్కగా నిర్వర్తించి, ఒక మృదువైన స్వభావాన్ని ఏర్పాటు చేసుకోవాలి. పెద్ద అరణ్యంలో ఒక మృదువైన స్వభావం కలిగిన ప్రాంతం ఏర్పడడం ఎంత గొప్ప విషయమో, అలాగే మానవ స్వభావంలో అది మృదు స్వభావం ఏర్పడడం అంత సులభం కాదు. ఎందుకంటే, ఎప్పుడూ ఏదో రకంగా ఘర్షణ. ఆ ఘర్షణ కారణంగా పోరాటం, ఇలాంటిది సాగుతూ ఉంటుంది.

అంచేత, ఇది అరణ్య పర్వం అని చెప్పబడ్డప్పటికీ అది వన పర్వం అని కూడా తెలియాలి. ఎప్పుడు అరణ్యం, ఎప్పుడు వనం? మనం మన కార్యక్రమాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటుంన్నాం అనుకోండి, ఓ హోరాహోరీగా అరణ్యంలో తిరుగుతున్నట్టుగా ఉంటుంది. ఎందుకంటే, వీడు ఎత్తులు వేస్తూ ఉంటాడు, వాడు పై ఎత్తులు వేస్తూ ఉంటాడు, వీడు దాన్నెలా తప్పించుకోవాలో చూస్తూ ఉంటాడు, వాడు దాన్ని మరింతగా బిగిస్తూ ఉంటాడు. ఇలా జరుగుతూ ఉంటాయి కదా! ఇది అరణ్యం.

అలా కాకుండా ఒకరికొకరు సహకరించుకునేటటువంటి పద్ధతుల్లో మన జీవితాన్ని చక్కగా తీర్చి దిద్దుకున్నామనుకోండి, అదే అరణ్యంలో మన జీవితం ఒక వనం అవుతుంది. ఏమిటోనండి అంతా చాలా గందరగోళంగా ఉంది అని, మీ ఇంటికొస్తే చాలా ప్రశాంతంగా ఉంది అన్నారనుకోండి, అంటే ఏమిటంటే, మీ జీవన విధానంలో అలాంటి సర్దుబాటు, మీలోనూ, మీ గృహంలోనూ ఏర్పడి ఉంటుంది. అలా కాకుండా మంచి gated community అని ఎక్కడికో పోయి, ఎక్కడో కట్టుకుని, లోపలికి వెళ్ళిన దగ్గరనుంచి అంతా చికాకుగా ఉందనుకోండి, ఉండొచ్చుగా? ఉండదా? ఇంత gated community అని కట్టుకుంటే, పక్కన ఆ community లో ఇంకోయాన... మీ అమ్మాయి, ఆయన కొడుకు ప్రేమలో పడ్డారనుకోండి. ఇంక gate లేదు, community లేదు. ఇంక అక్కడ నుంచి అన్నీ చిరాకులే కదా!

ఎక్కడ ఉంటే ప్రశాంతంగా అనేది ఉండడం బట్టి కాదు కదా, నీ బట్టీ కదా! "*కమనీయంబగు భూమి భాగములేకున్నవే...*" వెతుకోక్కర్లేదురా దూది పరుపుల కోసం, ఎక్కడ పడుకుంటే రాదు నిద్ర అని చెప్పాడు శుక మహర్షి. అంచేత, నేనెందుకు చెప్తున్నానంటే మనమంతా నేల మీద పడుకోమని కాదు, అసలే చలిగా ఉంది. అలాంటి విషయాల్లో వద్దు. కాబోతే ఏంటంటే, మనసులో సమయానికి తగ్గట్టుగా సర్దుబాటు చేసుకోగలిగితే, ఆ జీవితంలో, ఆ స్వభావంలో చక్కని మృదుత్వం ఏర్పడుతుంది. వెన్నవంటి స్వభావం. అది కదా కావాలి? అలా ఉంటే ఆయన తీసుకుంటాడట. నీ స్వభావం వెన్నవంటి స్వభావమైతే నువ్వు దైవానికి ఇష్టుడు అవుతావు, నిన్ను అందుకుని తను వాడుకుంటాడు. అంటే, తింటాడన్న మాట. వెన్న తిన్నాడు కృష్ణుడు అంటే అర్థమేమిటంటే, ఇట్లా ప్రతీ ఇంట్లోనూ వెన్నే తింటూ ఉంటే ఆయన జఠరాసయం, చిన్న ప్రేగులూ, పెద్ద ప్రేగులూ అంత గొప్పగా ఉండేవి కాదు. కాకపోతే ఏమిటంటే, ఎందుకు వెన్న తింటాడు అంటే, అది మృదు స్వభావం అంటే ఇష్టం అని సంకేతం. మృదు స్వభావం ఉండే చోట తానూ కూడి ఉంటాడు. ఇప్పుడు రాముడు మృదు స్వభావం కదా! కృష్ణుడున్నాడు, మృదు స్వభావం. ఇప్పుడు సౌజన్యం అయేటటువంటి స్వభావం లేకుండా, నేను యోగం చేస్తానంటే కుదరదు. యోగానికి కావలసినటువంటిది మృదు స్వభావం. ఇప్పుడు ఒక వస్తువు ముట్టుకున్నా, ఒక వస్తువు మనం వాడుకున్నా, మన చేతుల్లో అది నలిగి పోకూడదు. మనుషులే నలిగి పోతున్నారనుకోండి మన చేతుల్లో, ఇంక అది మృదు స్వభావమెలా అవుతుంది? అందుకనే, భారతంలో చెప్తారు, ఇద్దరి అప్సరసల మెళ్ళో పూల దండలు వేసి, ఇద్దరినీ నృత్యం చెయ్యమని చెప్తే, ఒక అప్సరస మెళ్ళో పూల దండ వాడలేదు అని. కాబట్టి ఆమే చక్కని నర్తకి అంటారు. కారణం ఏంటంటే, లోపల అలజడి ఉంటే, పైన వేసుకున్న పూల మాల త్వరగా వాడిపోతుంది. లోపల ప్రశాంతత ఉంటే, వేసుకున్న పుష్ప మాల వాడిపోదు.

కొంతమంది దేవుడికి పువ్వులు పెట్టి పూజ చేస్తే, ఆ పువ్వులు తొందరగా వాడిపోవు. కొంతమంది పూజ చెయ్యకముందే వాడిపోతాయి. వీడు పూజ చేస్తాడేమో అన్నట్టుగా ఉంటుంది. ఆ పువ్వు పట్టుకునే విధానంలో, ఆ పువ్వు దగ్గర నుంచి, పండు దగ్గర నుంచి, వస్తువు దగ్గర నుంచి, కొంతమంది చేతికి అంది వచ్చినప్పుడు వారి చేతుల్లో అవి వికసిస్తాయి, వాటియందు కళ పెరుగుతుంది. కొంత కొంతమంది చేతికి కొన్ని కొన్ని వస్తువులు మనం ఇచ్చిన్నప్పుడు, అంటే మనం ఇలాంటిది ఇవ్వకూడదు అన్నట్టుగా తయారయిపోతుంది. అంటే, కొంతమంది చేతిలో కొన్ని కళావిహీనం అయిపోతాయి. మరి కొంతమంది చేతిలో అవి కళ పెరుగుతాయి. ఎవరి కళ అది? ఒక పరమ గురువు ఆశ్రమంలో ఎప్పుడో త్రేతాయుగం నాటి వస్తువులు కూడా ధగధగలాడుతుంటాయటండి హిమాలయాల్లో. రాసారు పుస్తకాల్లో. ఎప్పుడిదో ఆ వస్తువు. మన ఇంటిలో వస్తువులు ఎట్లా ఉన్నాయో? మన శ్రద్ధని బట్టే కదా!

అంచేత, ఈ దృష్టి, ఈ కళ అనేది ఉన్నదా, లేకపోతే కళ లేదా? గురుపూజలు నిర్వర్తించుకుంటున్నాం. అది ఎలాగయినా నిర్వర్తించుకోవచ్చు కదా! ఎలాగయినా నిర్వర్తించుకుంటే నీలో శ్రద్ధ పెరగదు, నీలో కళ పెరగదు. నువ్వు చేసే కార్యక్రమాల్లో కళ ఎంత పెంచితే నీలోపల కూడా కళ అంత పెరుగుతుంది. కళ ఎక్కువ అంటే ఎక్కువ దీపాలు పెట్టేస్తే కళ రాదు. ఎక్కువ భక్తితో ఉంటే కళ వస్తుంది.

అంచేత, ఈ అరణ్య పర్వంలో బాగా దుఃఖ పడుతున్నటువంటి యుధిష్ఠిరుడిని తీసుకుని ధైమ్యుడు అలా అలా అరణ్యంలో ఉండేటటువంటి వనములకు తీసుకెళ్తాడు, పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తాడు. వనంలోకి వెళ్ళగానే దుఃఖం వస్తుంది. రెండు రకాల దుఃఖం. ఒకటేమిటంటే, ఉన్నది పోయింది. రెండోది, వచ్చి పడ్డచోట ఏ పూట ఏం మింగేస్తుందో అన్నట్టుగా ఉంటుంది అరణ్యంలో. అట్లా భయభ్రాంతమై జీవించేవాళ్ళు లేరూ? ఉన్నారు. అంచేత, వాళ్ళకి ఏం చెయ్యాలి? మనసు కుదుటపడడాలి కాబట్టి పుణ్య క్షేత్ర దర్శనం, పుణ్య పురుష దర్శనం. మనసు బాగుండకపోతే ఏం చెయ్యాలంటే, ఒక పుణ్య పురుషుని దగ్గరుకు వెళ్ళాలి. లేదా ఒక పుణ్య క్షేత్రానికి వెళ్ళాలి. లేకపోతే, ఒక తీర్థానికి వెళ్లి స్నానం చెయ్యాలి. ఇలా చేస్తూ ఉంటే, మనసుకు కొంచెం ఉపశమనం కలుగుతూ ఉంటుంది. ఇప్పుడు ధర్మరాజుకి వచ్చిన కష్టం చాలా పెద్దది కదా! ఎవరికీ రాని కష్టం. వచ్చినా ఎవరూ బతకరు, అలాంటి కష్టం.

అన్ని రకాల బాధలతో ఆయన అరణ్యంలో ప్రవేశించినప్పుడు కృష్ణుడు వస్తాడు. శ్రీకృష్ణుడు సత్యభామతో అరణ్యానికి రావడం జరుగుతుంది. అది కాదు మన కథ. ఊరికే ముందు కథేమిటో కొంతగా చెప్తున్నాను. కుశల ప్రశ్నలు వేస్తాడు. అన్నీ అయిపోయిన తర్వాత అందరూ కలిసి ఆ పక్కన ఉండేటటువంటి మార్కండేయ మహర్షి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు, మార్కండేయుడు బాగా ఆదరిస్తాడు యుధిష్ఠిరుడిని. ఆదరించి, ఎంతో కష్టం వచ్చినా ధర్మం తప్పనివాడివి, నిన్ను చూస్తే నాకు చాలా ఆనందంగా ఉంది, రాముడుని చూసినట్టుగా ఉందంటాడు. అంత ధర్మాత్ముడువు నువ్వు. నీకు వచ్చిన కష్టానికి మాబోటి వాళ్ళంతా కూడా చాలా బాధపడ్డాం, అని పలకరిస్తూ ద్రౌపతిని కూడా చాలా మెచ్చుకుంటాడయన. ఆవిడ వల్లే కదా మళ్ళీ వీళ్ళు దాసీ విముక్తి పొంది ఈ విధంగా బయటపడతారు. మెచ్చుకుంటే, యుధిష్ఠిరుడు ఒక ప్రశ్న వేస్తాడు. ద్రౌపతి ఇంత మహా పతివ్రత, అంతే కాదు పవిత్రమూర్తి, అగ్ని గర్భ.

ఇలాంటి స్త్రీ ఇంకెవరయినా ఉన్నారా చెప్పండి స్వామీ అని. ఇలాంటి ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. అంతకు ముందు ఇలాంటి ప్రశ్న నారదుడి దగ్గర వేస్తాడు మయసభ చూపించి ఇలాంటి సభ ఇంకెక్కడయినా ఉందా చెప్పమని. చెప్పమంటే, అప్పుడు ఆయనేమో చాలా చెప్పి, రాజసూయానికి ప్రోత్సహిస్తాడు.

మళ్ళీ అలాంటి ప్రశ్న వేస్తే, మార్కండేయ మహర్షి మొట్టమొదటగా మహా పతివ్రత అయిన సీత కథ చెప్తాడు. ఏ విధంగా సీతాదేవి అత్యంత పవిత్రమూర్తో, ఎలా ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా, భర్త చేత అవమానించబడి, అగ్నిహోత్రంలో ప్రవేశించి తన యొక్క సహజ పవిత్రతను ఏ విధంగా నిరూపించుకుందో, అమ్మవారి కథంతా ఆ విధంగా చెప్పుకొస్తాడు. ఆమె మహా పతివ్రత అంటాడు. ఈమె కన్నా... అట్లా మాట్లాడరు. ఈయన అడిగాడు ఎవరయినా ఉన్నారా అని. ఉన్నారని కథ చెప్తాడు. అంతే కాదు, ఇంకో కథ ఉందంటాడు. అంటే ఏమిటి? ఇలా ఎవరికయినా వచ్చాయాండి మార్కులు అని అడిగామనుకోండి. మన పిల్లలకు మంచి మార్కులు వచ్చాయి. ఇది ఎలా ఉందంటే, క్రిందటేడాది అని ఒక కథ, అంతకు ముందు ఏడాది అని ఒక కథ, అట్లా చెప్పుకుంటూ వాళ్ల మార్కులతో పోల్చి చూసుకుంటే, వీళ్ళకి మార్కులు తగ్గిపోతూ ఉంటాయి. దాన్ని బట్టీ వాళ్లకి అర్థమైపోతుంది. ఇంక చెప్పక్కర్లేదు కదా! వీడికి తక్కువ మార్కులు వచ్చాయి వాడి కన్నా అనకుండా, వాడికెన్ని మార్కులు వచ్చాయో చెప్పామనుకోండి, వీళ్ళ మార్కులు తెలిసి. అలా చెయ్యలేదు మార్కండేయ మహర్షి. వీళ్ళందరినీ ఒకే category, తరగతిలో పెడతాడు మహాత్ముడు. సావిత్రి, సీత, ద్రౌపతి – ఆ విధంగా ముగ్గురు గురించి పొగుడుతాడు మార్కండేయ మహర్షి.

ఆ సందర్భంలో సావిత్రి కథ చెప్తాడు. సావిత్రిదేవి ఉన్నది. సావిత్రిదేవి లాంటి కథ మనకు కనిపించదు. ఎందుకు కనిపించదంటే, మరణించిన భర్తను యముడితో సామరస్యంగా సంభాషణ చేసి, మరలా కొని తెచ్చుకున్న వ్యక్తి ఆవిడ కదా! అంచేత, ఆ మాట చెప్పగానే, యుధిష్ఠిరుడు అప్పుడు కొంచెం సావిత్రి కథ వివరంగా చెప్పండి అని అడగడం జరుగుతుంది. అలా అడగడం చేత మనకి సావిత్రి ఉపాఖ్యానం చోటు చేసుకుంది. ఈ భారతాది కథల్లో జరిగేదేమిటంటే, ఇంతకుముందు సృష్టిలో జరిగినటువంటి అత్యంత విలువైనటువంటి కథలన్నిటినీ కూడా సందర్భోచితంగా దాన్ని అందులో ఇముడిస్తారు.

ఏంచేత? లేకపోతే, ఆ కథ ప్రాచుర్యంలో లేకపోతే అందులో ఉండేటటువంటి ఆశయములు, ఒక ఉన్నతోన్నతమైనటువంటి ఒక విషయము మరుగున పడిపోతుంది. అలా పడిపోకుండా ఉండడానికి, ఇప్పుడు మనకి రామాయణం భారతంలోనూ చెప్పబడ్డది, భాగవతంలోనూ చెప్పబడ్డది, రామాయణం ఒకటి ఉండగా. నవమ స్కందం అంతా రాముడి కథే. అలా ఒకటి, రెండు చోట్ల చేరుస్తూ ఉంటారు. ఏంచేతంటే, ఒక గ్రంథం కాకపోతే, మరొక గ్రంథంలోంచి అయినా మంచి విషయం మానవుడికి అందితే వాడు బాగుపడతాడని.

అంచేత, ఒక అత్యంత పవిత్రమూర్తి అయిన స్త్రీ, తన భర్త యొక్క ఆయుర్దాయాన్ని, ఐశ్వర్యాన్ని, అన్నిటినీ చక్కగ్గా పదిలపరచగలదు అనేటటువంటి కథ అది. భర్తకి ఆయుర్దాయం తక్కువైతే, తన యొక్క పవిత్ర భావం చేత, నడవడిక చేత, ఆరాధన చేత, భర్త ఆయుర్దాయం పెంచుకునేటటువంటి కథలన్నీ మనకి పతివ్రతల కథల్లో కనిపిస్తాయి.

ఆయుర్దాయం పెంచుకోవడం ఒకటి, అసలు మరణించినవాడిని కొని తేవడం ఒకటి. అలాగే, భర్త యొక్క ఐశ్వర్యం అంతా తిరిగి అతనికి లభించేటటువంటి పరిస్థితి ఒకటి ఉంటుంది. కర్మవశాత్తు ఐశ్వర్యం పోతే, ఐశ్వర్యం అంతా భార్య వల్ల పొందడం. ద్రౌపతీదేవి వల్ల కదా వీరందరూ మళ్ళీ బట్టకట్టారు, దాస్య విముక్తి జరిగింది. అలాగే, సావిత్రి వలన మరణించిన సత్యవంతుడు తిరిగి జీవితాన్ని పొందడమేకాక, తన తండ్రి రాజ్యం కూడా దక్కి, సత్యవంతుడి తండ్రి అయిన ద్యుమత్సేనుడుకి కన్నులు వచ్చి... కనులు, దృష్టి పోతుంది, దృష్టి వస్తుంది. రాజ్యం పోతుంది, రాజ్యం వస్తుంది. అంతేకాదు, భర్తకి ప్రాణం తిరిగి వస్తుంది. ఇట్లా ఇన్ని ఒక వ్యక్తి వలన ఎలా జరిగినాయి అనేటటువంటిది కథ చూస్తే చాలా అద్భుతం. సీతాదేవి కథయినా అంతే. సీత నడవకపోతే అడవిలో రాముడితో పాటు, రావణ సంహారం జరిగేది కాదు. రాముడితో అమ్మవారు చెప్తుంది, నేను ముందు నడిస్తే కదా, నేను ముందు నడవడంచేత, నువ్వు వెనకాలగా వచ్చి, మొత్తం అరణ్యం అంతా ఒక వనంగా అప్పుడు తయారవుతుంది కదా అని చాలా రహస్యపూర్వంగా ఒక మాట మాట్లాడుతుంది. తాను ముందు లంకకు వెళ్ళడం బట్టి కదా తర్వాత రాముడు రావడం జరిగింది!

అంచేత, ఒక స్త్రీ శక్తి ఎంతటిది అనేది ఈ ప్రపంచంలో ఎన్నోచోట్ల ఎన్నో కథలు ఉండొచ్చుగానీ, భారతదేశంలో ఉన్నటువంటి అవగాహన స్త్రీ గురుంచి మిగతా దేశాల్లో లేదు. భారతదేశంలో స్త్రీలకు ఈ విషయం తెలిసీ మర్చిపోయారు. ఒక స్త్రీ సత్ప్రవర్తన చేత, ఆస్తిక్య బుద్ధి చేత, ఒక వ్యసనపరుడైనటువంటి ఒక పురుషుడిని చక్కగా తీర్చుదిద్దుకుని, అతడికి కూడా కైవల్యాన్ని కలిగించేటటువంటి కథలు మనుకున్నాయి. అంటే, స్త్రీ శక్తి... సృష్టికి ఆధారమే స్త్రీ.

అంచేత, అలాంటి స్త్రీ కథ ఒకటి మనకి వివరింపబడింది భారతంలో. కథ మీ అందరికీ తెలుసు. కాబోతే, మనం భారతంలో చెప్పింది, అది కూడా తెలుగు భారతంలో... అంటే, తెలుగు భారతం అని తక్కువ చేస్తున్నాని కాదు... సంస్కృతంలో ఒక పదానికి అనేకానేకమైన దృక్కోణములు ఉంటాయి. ఒక పదానికి ఉత్పత్తి అర్థం అని, విశేషమైనటువంటి అర్థం అని ఉంటాయి. తెలుగులో కూడా దాదాపు అలాగే ఉంటాయి. ఎంచేత? తెలుగు సంస్కృతం నుండి వచ్చింది కాబట్టి. ఈ కథ ఆధారంగా కొన్ని విషయాలు అవగాహన చేసుకుంటూ, ఏ విధంగా సావిత్రీదేవి ఈ మరణ దేవతని దర్శించింది? మరణ దేవతని దర్శించడమే ఒక పెద్ద విషయం. అటుపైన సంభాషించింది. అటుపైన మెప్పించింది. నచికేతుడు వెళ్ళాడు, యముడితో సంభాషించాడు, యముడిని మెప్పించాడు, మరణ విద్యని భూమికి పట్టుకొచ్చాడు. మరణించకుండా దేహం నుంచి తాను చక్కగా ఇంట్లోంచి బయటకు వచ్చినట్టుగా అంత కులాసాగా బయటకు ఎట్లా రావడం అనే విధాన్నాన్ని తెలుసుకుని మనందరికి ఇచ్చినటువంటి కథ నచికేత విద్య అంటారు. అలాగే, సావిత్రిదేవి కూడా ఆ విధంగా నిర్వర్తించుకుంది. అలాగే మార్కండేయ మహర్షి నిర్వర్తించుకున్నాడు. ఈ ఘట్టం ప్రధాన ఘట్టంగా... కాని, ఆ ఘట్టం వరకూ రాక ముందు అలాంటి పరిస్థితి సావిత్రిదేవికి ఎలా కలిగింది అని తెలియడానికి కథ మొదటినుంచి శ్రద్ధగా వివరంగా చదువుకుంటాం. కథ ఎక్కువ పేజీలు లేదు, పదకొండు పేజీలు ఉంటుంది. కాబట్టి ఈ పదకొండు పేజీల కథ మనం సద్గురువుల యొక్క సమాశ్రయం చెంది, చక్కగా అవగాహన చేసుకోడానికి ప్రయత్నం చేద్దాం.

"ధర్మరాజా, సావిత్రి అను రాజకుమారి చారిత్రము కూడా ఇటువంటిదే. ఇది నీకు ఉపదేశించగలను" అన్నాడు. ఇది చూడండి తమాషా! "నీకు చెప్తాను" అనొచ్చుగా! చెప్పడం వేరు, ఉపదేశించడం వేరు. చెప్పడం అంటే వీడు వింటాడు, వీడు చెప్తాడు మనసులోంచి, మస్తిష్కంలోంచి, వాడూ వింటాడు మనసుతో. అక్కడ అది స్థిరంగా ఉండదు. ఎందుకంటే, మనసు చంచలమైనది కాబట్టి. చెప్పేవాడు చంచలమైన ప్రజ్ఞతో చెప్పి, వినేవాడూ చంచలమైన ప్రజ్ఞతో విన్నాడనుకోండి, కథ అయిపోగానే మర్చిపోతాం. దాన్నే మనం పురాణ కాలక్షేపం అంటాం. ఎప్పటినుంచో ఎన్నో చోట్ల ఎన్నో పురాణాలు విన్నప్పటికీ, అది పురాణం వినటం తప్ప, అది ఉపదేశం అయినట్టు కాదు. ఉపదేశం అంటే ఏమవుతుందంటే, బాగా దగ్గరగా నీలో ప్రవేశించి, నీకు ప్రచోదనం కలిగించి, బతికితే ఇట్లా బతకాలి, లేకపోతే ఎందుకు వ్యర్థం అనిపించాలి. అలా ఉంటుంది ఉపదేశం. ప్రసంగం వేరు, ప్రవచనం వేరు అని కదా చెప్తుంటాం! ప్రసంగం అధిక ప్రసంగం కూడా కావచ్చు, తెలుసా! అంచేత, ప్రవచనం అంటే చెప్పబడుతున్న విషయంలోకి నిన్ను ప్రవేశబెట్టి, నిన్ను అలా తీసుకుపోతాడు. అలాంటి వాళ్ళు సూతుడు, శుకుడు, ఇలాంటి మహర్షులు అంతా కూడా.

అంచేత, ఇక్కడ చూడండి, "నీకు అది ఉపదేశించగలను" అన్నాడు. సావిత్రి కథ ఉపదేశించగలను అంటే? అంటే, నీక్కూడా అది పనికివస్తుంది ముందు ముందు. నిజానికి ఎవరికి పనికి వచ్చింది ఈ ఉపదేశం? పాండవులందరికీ పనికి రాలేదు. ఒక్క ధర్మరాజుకే పనికొచ్చింది. చూడండి, ఒక వాక్యం మనకి సద్గురువు యొక్క స్మరణ చేసి తెలుసుకోవడం మొదలు పెడ్తే, చిన్న వాక్యంలోంచి బోల్డు విషయాలు తెలుస్తూ ఉంటాయి. ధర్మరాజు ఒక్కడే మహాప్రస్థానంలో, అందరూ పడిపోతున్నా, ఉత్తరదిశగా నడిచి వెళ్తాడు కదా! నడిచి వెళ్తుంటే, మొదట నుంచీ వీళ్ళ ఆరుగురుతో పాటు, అంటే పంచ పాండవులు, ద్రౌపతీదేవితో పాటు ఒక కుక్క, అది కూడా పెంపుడు కుక్క కాదు, ఊర కుక్క, అది కూడా వెంటవచ్చింది కదా! వెంట వస్తే, దార్లో ఒక్కొక్కడూ, ఒక్కొక్కడూ వారి వారి ప్రజ్ఞ ప్రకారం దేహం విడవడం జరుగుతుంది. ధర్మరాజు నడుస్తూ ఉంటే, అతనితో పాటు ఈ కుక్క నడిచి వెళ్తూ ఉంటుంది. ఇలా వెళ్తూ ఉంటే, ఇంద్రుడు సంతోషించి దేహంతో సహా స్వర్గంలోకి రావొచ్చని ఆహ్వానం పంపిస్తూ, సొంత రథాన్ని పంపిచడం జరుగుతుంది, మాతలి అనేటటువంటి రథ సారధిని ఇచ్చి. నీ కోసం పంపించాడు ఇంద్రుడు రథం, మీరు సరాసరి దేహంతో స్వర్గానికి రావొచ్చు, మీరు నిర్వర్తించినటువంటి ధర్మం అలాంటిది అని తెలిపినప్పుడు, ధర్మరాజు ఆ కుక్కని కూడా రథం ఎక్కించడానికి సౌంజ్ఞ చేస్తాడు. చేస్తే మాతలి ఒప్పుకోడు. ఎంచేత అంటే, స్వర్గంలో కుక్కలకి తావు లేదు అంటాడు. నీ కోసం రథం పంపిచేము గాని ఈ కుక్క కోసం కాదు అని చెప్పినప్పుడు, సమభావం కలిగినటువంటివాడు, సమధర్మం అవలంబించేవాడు, సమవర్తి అయినటువంటివాడు ధర్మరాజు, ఇది నాతోబాటే ఇంత దూరం వచ్చింది, నా తమ్ముళ్ళు రాలేక పోయారు, నా భార్య రాలేక పోయింది, ఇది వచ్చింది. దీన్ని ఇక్కడ ఏ రక్షణా లేకుండా వదిలేసి రాలేను, నువ్వు వెళ్ళిపోమని చెప్తాడు. ఇది వస్తేనే నేను రథం ఎక్కుతాను, లేదా నువ్వు తిరిగి వెళ్ళొచ్చు, నేను ఈ కుక్కతో ఇక్కడే ఉంటాను అని చెప్తాడు. అప్పుడు ఆ కుక్క, ఈ యమధర్మరాజుగా దర్శనం ఇస్తుంది. దర్శనం ఇచ్చి నీ సమబుద్ధి నాకు అమితానందం కలిగించింది అంటాడు. అంటే, ఇప్పుడు ఇక్కడ పడ్డ బీజం అక్కడ ఫలించిందన్నమాట. యముడిని మెప్పించడం సావిత్రిదేవి ఎలా చేసిందో, ఏదీ ధర్మ నిర్వహణ వలన, అదీ విశిష్టమైన

ధర్మములు నిర్వర్తించడం వలన సావిత్రిదేవి యముడిని మెప్పించింది. ధర్మరాజు కూడా మార్కండేయుడి చేత ఉపదేశం పొందడం చేత అతనియందు ధర్మ బుద్ధి మరింత స్థిరపడి ఉండాలి. అందుకని, ఇక్కడ పదం కూడా ఎట్లా ఉందో చూడండి, "ఆ సావిత్రి కథ నీకు ఉపదేశించ గలను" అని. అన్నిచోట్లా అలా వాడరు. అంటే, మార్కండేయుడు కేవలం వినిపించడం కాదు చేసింది, ఉపదేశించాడు.

"ఆతమించ వలసినది అశ్వపతి మద్ర దేశాధీశ్వరుడు" అన్నాడు. పుస్తకాలు చదువుకునేటప్పుడు, గ్రంథాలు, మహాగ్రంథాలు... భారతం మానవ జాతి ఉన్నంత కాలం ఉంటుంది. రామాయణం కూడా అలాగే ఉంటుంది. మిగతా పుస్తకాలు ఉంటాయో లేదో నేను చెప్పలేను గానీ, భారతం, భాగవతం, రామాయణం, భారతంలో ఉండే భగవద్గీత, ఇవన్నీ శాశ్వత గ్రంథాలు. అంచేత, ఇందులో వాడినటువంటి కథల్లో ప్రతీ దానికీ లోతైన అర్థాలు ఉంటాయి. అలా చదువుకోవాలి. ఇప్పుడు, మద్ర దేశం అంటే ఏమిటి? బుద్ధిగా సంస్కృతం dictionary తీసుకుని అందులో ఈ పదానికి ఏం అర్థం ఉందో చూసుకోవాలి. అంటే, etymological key అని ఒకటి ఉంటుంది, అంటే నిరుక్త శాస్త్రం అని అంటారు. నిరుక్తం దగ్గర పెట్టుకోవాలి, జ్యోతిష్యం దగ్గర పెట్టుకోవాలి. ఇలాంటి వాటి ఆధారంతో మనం చదువుకుంటే ఎక్కువ బాగా అర్థం అవుతాయి. ఎందుకంటే, ఈ గ్రంథాలన్నీ కూడా వేదాంగాలనే తాళం చెవులతో తాళాలు వెయ్యబడి ఉంటాయి. స్థూలంగా చదువుకున్నా ఫలం ఉంటుంది. బాగా సూక్ష్మాతి సూక్ష్మంగా చదువుకున్న కొద్దీ అందులోంచి విపరీతంగా రాసానుభూతి కలుగుతుంది. బాగా నములుతున్న కొద్దీ చెరుకుగడలోంచి ఎలా రసం వస్తుంది? పళ్ళు లేకపోతే ఇట్లా ఇటూ ఇటూ కొరికేసి వదిలేస్తాం. పళ్ళు ఉంటే బాగా పిప్పి అయ్యేంతవరకూ నమలమూ చెరుకు! అలా నమలాలట ఈ పుస్తకం. భారతం అంటే చెరుకుగడతో సమానం. ఎందుకంటే, నములుతున్న కొద్దీ తీపి.

"మద్రము" అనే పదానికి అర్థం ఏమిటయ్యా అంటే అనందమట. మద్రము అంటే ఆనందం. అది ఏ ఆనందం? ఇంద్రియ ఆనందం కాదట. హృదయానందం. ఇప్పుడు శరీరానికి ఒక ఆనందం ఉంది. అది కొంచెం వేడిగా ఉంటే చల్లగా గాలి తగిలితే ఆనందం. చల్లగా ఉంటే కొంచెం వేడిగా గాలి తగిలితే ఆనందం. చెమట పోస్తే విసిని కర్రతో విసిరితే... ఇట్లా ఉంటుంది శరీరం. అలాగే ఇంద్రియాలకు కొన్ని ఆనందాలు ఉంటాయి. మనసుకి కొన్ని ఆనందాలు ఉంటాయి. బుద్ధికి కొన్ని ఆనందాలు ఉంటాయి. అంటే, కొంత మందికి మంచి మంచి విజ్ఞానపరమైనటువంటి గ్రంథాలు చదువుకుంటే ఆనందంగా ఉంటుంది. అలా అందరికీ ఉండకపోవచ్చు కదా!

So, హృదయానందం అనేటటువంటిది స్థితి. దానికి దీక్ష ఏంటి? హృదయమే. హృదయమే దేశంగా ఎవరయితే జీవిస్తూ ఉంటారో వాళ్ళందరినీ మద్రపతులంటారు. అంచేత, పుస్తకం కేవలం తెలుగొచ్చని చదువుకోలేం. ఇలాంటి పదాలు మనకొచ్చినప్పుడు, ప్రతీ పదానికి నానార్థములు ఉంటాయి. అంటే, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు రకాల అర్థాలు ఒక పదానికి ఉంటాయి సంస్కృతంలో. దాంట్లో ఇక్కడ ఏది ప్రస్తుతం అనేది మనం చక్కగ్గా అర్థం చేసుకుంటూ చదువుకోవాలి. అలా చదువుకోడానికి మనకి అవకాశం కల్పించారు Master EKగారు. వారి పుస్తకాల

నిండా ఎంతో నిరుక్తాన్ని వివరించి ఇచ్చారు. జ్యోతిష్యాన్ని కూడా ఏ విధంగా అన్వయించుకోవాలి, నిరుక్తాన్ని ఏ విధంగా అన్వయించుకోవాలి, అలా ఉంటుంది. ఏంచేత? మహాత్ములు, తనకు ముందు నడిచి వెళ్ళిన వాళ్ళంతా కూడా అలాగే రచించారు గ్రంథాలు. మామూలుగా నవలలు రాయడం, పుస్తకాలు రాసేయడం కాదు. అంచేత, మాస్టరుగారు గ్రంథాలు తీస్తేనే మనకి నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు ఒకడు కాదని తెలుస్తుంది. మామూలుగా నారాయణుడు అన్నా, విష్ణువు అన్నా, వాసుదేవుడు అన్నా ఒకటే అనుకుంటాం కదా! ఒకటి కాదు అని తెలుస్తుంది. ఒక్కొక్క సన్నివేశంలో ఒక్కొక్క వ్యూహం, దైవం యొక్క వ్యూహాన్ని వివరిస్తూ ఉంటుంది. ఇలా మనకి ఒకే మూర్తి... సహస్ర నామాలు మనం చదువుతాం కదా, అమ్మవారు గాని, అయ్యవారు గాని, ఒక్కొక్క నామం ఒక్కొక్క వ్యూహాన్ని తెలియపరుస్తుంది, తత్త్వం యొక్క ఒక్కొక్క వ్యూహం. అంచేత, అలా తెలుసుకున్నాం అనుకోండి, సందర్భోచితంగా మనకి చక్కని అవగాహన అవుతుంది.

అంచేత, అక్కడ ఉపదేశిస్తాను అని రాస్తే మూలంలో, నేను నీకు చెప్తాను అని రాసాం అనుకోండి... పోయింది. అందుకనే, అనువదించే వాళ్లకు కూడా తదనుగుణమైనటువంటి పదజాలం వాడబడేటటువంటి శక్తి ఉండాలి. అనువాదం అంటే ఏదో మనకు భాష తెలుసు కాబట్టి అక్కడ దానికి తగిన పదం వెయ్యక, ఏదో పదం వెయ్యడం కాదు.

అంచేత, మద్రపతి అశ్వపతి మద్ర దేశాధీశ్వరుడు. మద్ర దేశమునకు ఆయన ఈశ్వరుడు, అంటే హృదయమునందే ఎప్పుడూ వసిస్తూ ఉంటాడు. అవసరం బట్టి ఇంద్రియాల్లోకి, మనసులోకి దిగి వచ్చి బాహ్య ప్రపంచంలో పనులు చేసుకుంటూ, ఇతర సమయంలో హృదయంలో రమిస్తూ ఉంటాడు. అతని పేరేంటి? అశ్వపతి. అశ్వములు అంటే? రకరాకాల అర్థాలు ఉంటాయి. అశ్వము అంటే ప్రాణము అని ఒక అర్థం ఉంది. అశ్వపతి అంటే ప్రాణమునందు స్వామిత్వం కలిగినవాడు. ప్రాణములయందు స్వామిత్వం కలవాడు హృదయమందే ఉంటాడు. ఎంచేత అంటే, ప్రాణములకు కేంద్రం హృదయం. ప్రజ్ఞకు కేంద్రం ఆజ్ఞ. జీవ చైతన్యానికి మూల స్థానం అజ్ఞా చక్రం, అజ్ఞా పద్మము. అలాగే, ఆ ప్రజ్ఞ నుంచి ఏర్పడినట్టిదే ప్రాణం. ఆ ప్రాణానికి పెద్ద పీఠం ఎక్కడ ఉంది అంటే, హృదయమునందు ఉంది. అంచేత, అశ్వపతి అంటే ఇతడు ప్రాణములను, ప్రాణములయందు స్వామిత్వం కలిగినవాడు అని ఒక అర్థం. అంతేకాదు, హృదయమునందే ఎప్పుడూ వుండేటటువంటివాడు అనేది రెండో అర్థం. మామూలుగా సాధారణ అర్థం ఏమిటంటే మద్ర దేశం ఒకటుంది. మద్ర దేశం అంటే ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ దగ్గర ఉండే దేశం, గాంధారమునకు, గాంధారం అంటే ప్రస్తుతం మనం కాంధహార్ అంటాం కదా, అదే గాంధారం. అక్కడ తక్షశిల అనేటటువంటి విశ్వవిద్యాలయం ఉండేది. ఆ గాంధారమునకు అనుబంధంగా ఉండేటటువంటి దేశం మద్ర దేశం. మాద్రి అనే రాజకుమారి కూడా అక్కడినుంచే వస్తుంది. పాండురాజుని వివాహం చేసుకుంటుంది. మాద్రి. అంచేత, మద్ర దేశం ఒకటుండగా... ఇప్పుడు మద్రాస్ అన్నారనుకోండి, నేను చాలా మందిని అడిగా ఈ మద్రాస్ అన్న పేరు ఎలా వచ్చింది అని. చెన్నై ఎట్లా వచ్చిందో అందరూ చెప్పగలిగారు. ఎందుకంటే, చంద్రుడనేటటువంటి ఒక బెస్తవాడు అక్కడ ఉండేవాడు చేపలు పట్టుకుంటూ, నెమ్మదిగా పెరిగింది, నగరం అయ్యింది. మా విశాఖపట్నం కూడా అలాంటిదే. అంచేత, మొట్టమొదట అది చేపలు పట్టేవాళ్ళ ఊరన్నమాట. చేపలు పట్టే వాళ్ళు తక్కువ వాళ్ళా? కాదు. సత్యవతి

కూడా అక్కడి నుంచే పుట్టుకొచ్చింది. అంచేత, ఈ విధంగా చెన్నై అనే నామం అందరికీ తెలియవచ్చు. మద్రాస్. మాస్టరుగారి పుణ్యమా అని మంద్రా అనే పదానికి కొంత అర్థం తెలుసుకున్నారు అందరూ. మంద్ర కదా! మద్రము అంటే చైతన్యము అని. కాబట్టి, మద్ర దేశంలో ఎప్పుడయితే చైతన్యం ఆనందంతో కూడి ఉంటుందో, అప్పుడు దానికి ఎవడయితే అధిపతి అయి ఉంటాడో, అలాంటి వాడు మద్రాధీశుడు అవుతాడు. అలాగే, అతడు అక్కడ అశ్వపతి కూడాను. తన ప్రాణములయందు తానూ స్వామిత్వం కలిగి ఉన్నాడు.

ప్రాణములయందు స్వామిత్వం కలిగి ఉన్నటువంటి వాడు, శరీరంలో ప్రవేశించనూ గలడు, శరీరం నుంచి బయటకు కూడా రాగలడండీ. ఎందుకంటే, మనకి ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అనే ఐదు ప్రాణములు ఉన్నాయి. ఈ ఐదు ప్రాణాల గురుంచి చాలా సార్లు వివరించాను. మనకి ప్రాణములు మనల్ని నడిపిస్తూ ఉంటాయి. కాని ప్రాణములు జీవ చైతన్యంలోంచే పుట్టుకొచ్చాయి. అదే ప్రాణములకు మనం ఆధిపత్యం వహించవచ్చు. వాడు యోగి. ఎవడు యోగీశ్వరుడు అంటే, తన ప్రాణములు తన ఆధీనమునందు ఉండి, తన ఎంత కాలం కావాలంటే అంత కాలం కార్యక్రమాలు నిర్వర్తించి అటుపైన స్వచ్ఛందంగా దేహాన్ని త్యజించగలేటటువంటి వాడు యోగి. భీష్ముడుకి స్వచ్ఛంద మరణం ఒక వరంగా ఇస్తాడు తండ్రి.

అశ్వపతి తాను స్వయంగా తన పంచ ప్రాణములయందు తాను స్వామిత్వం కలిగి ఉంటాడు. పంచ ప్రాణములయందు స్వామిత్వం కలిగి ఉండడానికి ఒక మార్గం ఉన్నది. దానినే ప్రాణాయామము అంటారు. అంటే, ప్రాణము, అపానము, ఈ రెండిటిని చక్కగా సమన్వయించుకో గలిగితే జీవుడు హృదయమునందు స్పందనాత్మక ప్రజ్ఞగా తన్ను తాను అనుభూతి చెందుతూ ఉండొచ్చు. ఆ స్పందనమును మనం బాగా అనుసరిస్తూ ఉంటే, అది సూక్ష్మ స్పందనంలోకి తీసుకువెళ్తుంది. ఆ సూక్ష్మ స్పందనం ఉదాన వాయువు అనేటటువంటి ఒక ప్రాణాన్ని పట్టుకుని ఊర్ధ్వగతి చెంది ఆజ్ఞకి చేరుస్తుంది. అలా ఆ ఆజ్ఞకి చేరిస్తే, మరి వ్యానం అని మొత్తం మన శరీరం బయటా, లోపలా వ్యాప్తి చెందినటువంటి ఒక ప్రాణం మనకు, నీకు పరిచయము కలుగుతుంది. అది ఆధారంగా జీవుడు దేహంలోకి ప్రవేశించగలడూ, దేహంలోంచి బయటకు తనకు తానుగా వెలిగి రాగలుతాడు.

పురంజనోపాఖ్యానము అనేటటువంటిది భాగవతంలో ఉన్నది. అక్కడ మనకి ఈ పంచ ప్రాణముల గురుంచి బాగా వివరిస్తారు. ఇందులో, ఈ పంచ ప్రాణములను ఐదు తలల పాముగా చెప్తారు. ఈ ఐదు తలల పాము నుంచి లోపలికొచ్చినటువంటి వాడు బయటకి ఎలా వెళ్ళాలో తెలియకుండా లోపలకొచ్చేస్తే ఈ దేహంలో ఇరుక్కు పోతాడు. అంచేత, మరి ఎదయినా లోపలికి ప్రవేశించేటప్పుడు బయటకెళ్ళే దారి తెలియకుండా ప్రవేశించకూడదు. జీవితంలో ఏ పని లోకయినా వెళ్ళడం మాత్రమే తెలుసు, తిరిగి రావడం తెలియదు అంటే కష్టం. అభిమన్యుడి కథ అయిపోతుంది. లోపలికి వెళ్ళడమే తెలుసు, బయటకు రావడం తెలియదు. శరీరంలోకి వెళ్ళడం తెలుసు, బయటకు రావడం తెలియదు కదా! దాంపత్య జీవితం, కుటుంబము వీటిలోకి ప్రవేశించడమే తెలుసు, బయటకు రావడం తెలియదు. ధన సముపార్జనము అనేటటువంటి విషయంలోకి ప్రవేశించడమే తెలుసు, బయటకు రావడం తెలియదు. దేంట్లోకయినా

లోపలికి చాలా వీరోచితంగా మనం ప్రవేశించగలం, కానీ దేనినుంచి బయట పడలేము. చూడండి, అది ఎంత దురదృష్టమైన కథో. Way in తెలిసినప్పుడు, Way out కూడా తెలియాలి. If you do not know how to exit, do not enter into it. ఉద్యోగంలోకి ప్రవేశిస్తున్నామనుకోండి, ఎప్పుడు ఇందులోంచి బయటకు వస్తాడో తెలిసి ఉండాలి. ఎందుకోసం అది? దేహ పోషణ, కుటుంబ పోషణం, ఇంతే! వృత్తిలోకి ప్రవేశించాం అనుకోండి, చచ్చిపోయే వరకూ వృత్తిలో ఉండమని ఎక్కడా లేదు కదా! ఎందుకంటే, నువ్వు పుట్టినప్పుడే రాలేదు కదా నీకు వృత్తి! సగం దూరంలో నీకు వృత్తి వచ్చింది. నీ జీవన యాత్ర సరిగ్గా సాగడానికి ఒక వృత్తో, ఒక ఉద్యోగమో, ఒక వ్యాపారమో. దాని నుంచి బయటపడడానికి నీకు వీలు ఉంచుకున్నావా, లేకుండా అలా మాలోకంలాగా లోపలకి వెళ్ళిపోతున్నావా? అట్లాగా ప్రాణం పట్టుకుని దేహంలో ప్రవేశించిన వాడికి ప్రాణముల ఆధారంగా మళ్ళీ దేహంలోంచి బయటపడడం కూడా తెలిసి ఉండాలి కదా! నిష్క్రమణము తెలియని విద్య విద్యే కాదు. ఏ విద్యకయినా ఉపసంహారించే శక్తి కూడా ఉండాలి. లేకపోతే వాడు వీరుడు కాదు.

అంచేత, ఈ ప్రాణముల లోనికి మనం ప్రవేశింపబడినటువంటి వాళ్ళం. ప్రవేశం అయిపోయింది. పంచ ప్రాణములు మనని నడిపిస్తూ ఉంటాయి. ఆ పంచ ప్రాణములనుంచి నువ్వు విడిపడి పంచ ప్రాణములను పగ్గాలు పట్టుకునే స్థితి కూడా మానవునకు ఉన్నది. అలా ఎవరికయితే ఉంటుందో వాడిని అశ్వపతి అంటారండి. అశ్వపతి అంటే అర్థం ప్రాణములయందు స్వామిత్వం సాధించినటువంటి వాడు. ప్రాణములయందు స్వామిత్వం ఉన్నది అంటే దేహం అలా వదిలేయగలడండి. ఎప్పుడూ హృదయమునందు ఆనందంగా ఉన్నాడు, బావుంది. ప్రాణములు వదిలెయ్యగలడం తెలుసు కాబట్టి వదిలేస్తామా? ప్రాణములు వదిలెయ్యగలడం తెలుసు కాబట్టి వదిలేయ కూడదు. వదిలేయాలిసిన సమయం వచ్చినప్పుడు అది మన్ని పట్టుకోకుండా ఉండడానికి ఆ విద్య తెలియాలి తప్ప, ప్రాణములను దేహం నుంచి విసర్జింపబడగలను అని తెలిసి ఇలా దేహం వదిలేసి వెళ్లిపోక్కర్లేదు. ఎంచేత, ప్రతీ వాడికి జీవన ప్రయోజనం ఒకటి ఉన్నది. జీవన ప్రయోజనం నెరవేరకుండా దేహాన్ని విసర్జించడం దేనికండీ? జీవన ప్రయోజనం నెరవేరాలి కదా! ఇప్పుడు నువ్వు ఏమి నిర్వర్తించేసావని వెళ్లిపోదా మనుకుంటున్నావు అని అడగాలి వెళ్ళిపోతా, వెళ్ళిపోతా అనేవాడిని. మాటిమాటికి కొంతమంది, అసలు వెళ్ళరులెండి, కానీ వెళ్ళిపోతానంటూ ఉంటారు. ఏదీ వెళ్ళడానికి చేత అవ్వద్దూ? చేతకాదు కదా! అందుకనే, మాస్టారు ఒక మాట చెప్పారు నాకు రహస్యం. ఏమిటంటే, పెద్దవాళ్ళు, పెద్ద వయసు ఉన్నప్పుడు, వెళ్ళిపోతారేమో అని వాళ్ళకి తెలుస్తూ ఉంటుంది కదా, ఇక మనం వెళ్లిపోతామని, అనిపిస్తూ ఉంటుంది కదా! ఎందుకంటే, చుట్టుపక్కల అందరినీ చూస్తూ ఉంటాము కదా! అంచేత, మనం కూడా వెళ్ళిపోతాం అని తెలుస్తూ ఉంటుంది వయసు వచ్చే కొద్దీ. అప్పుడు పెద్దవాళ్ళు, ఏ మాస్టారుగారు లాంటి వాళ్ళో కనబడితే, మరి ఇంక నాకు ఎంత కాలం ఉందంటారు అని అడుగుతారు. అలా అడిగినప్పుడుల్లా, ఇంకా చాలా కాలం ఉందని చెప్పాలట. చెప్తే వాళ్ళు సంతోషిస్తారట. ఎప్పుడూ "ఇంక కొంత కాలమే" అని చెప్పకు అని చెప్పారు. కొంత కాలమే అని చెప్తే వాళ్ళు ఇప్పుడే చచ్చిపోవచ్చు. అంచేత, ఎంత కాలం అని అడిగితే, ఇంకా చాలా కాలం ఉంది, బాగా పనులు చేసుకోండి, అని చెప్తారు పెద్దలు. ఎంచేత? ఏదో ఎంతవరకూ వీలు ఉంటే అంతవరకూ పండి, అటుపైన

వచ్చిన మరణాన్ని అంగీకరించాలి తప్ప, పండకుండా మరణం వస్తే ఏమిటీ ఉపయోగం అండీ? మళ్ళీ మొదలుపెట్టాలి కదా! పండి, అక్కడ చెట్టు నుంచి రాలినట్టు రాలడం ఒక పద్ధతి. పండకుండా, నేపోతా, నేపోతా, నేపోతా అంటే, పోనూ లేదు, ఒకటి. పోయినా సుఖం లేదు. మొన్నామధ్య ఒక పెద్దాయన చెప్పారు, నే వెళ్ళిపోతా, నే వెళ్ళిపోతా అని ఒకావిడ హడావుడి చేస్తుంటే, ఏమ్మా చిన్న చిన్న ప్రయాణాలే, హైదరాబాదు వెళ్ళాలన్నా ఎదో మంచి నక్షత్రం, మంచి తిథి చూసుకుని వెళ్తాం కదా! మావూరు నుంచి బయలుదేరి వస్తున్నాం అంటే తిథి, వారం, నక్షత్రం అన్నీ చూసుకుని, మనకి అనుకూలంగా ఉన్నాయో లేదో చూసుకుని కదా బయలుదేరతాం! అలాంటిది పెద్ద ప్రయాణం కదా, చాలా మంచి ముహూర్తం ఉండాలి కదా అని చెప్పారు. ఎంత మంచి ముహూర్తం ఉండాలి వెళ్ళడానికి? వెళ్తే ఒక పూర్ణిమ నాడు వెళ్ళాలి, ఒక ఏకాదశి నాడు వెళ్ళాలి, ఒక పర్వదినం నాడు వెళ్ళాలి. ఇలా వెళ్ళాలి తప్ప, ఏమిటో పెట్టి సర్దుకుని, లఘ్నం చూసుకోకుండా వెళ్లిపోతానంటే ఎట్లా? ముఖ్యమైన కార్యాలన్నిటికీ మనం లఘ్నం చూసుకుంటాం కదా! అంచేత, వెళ్ళిపోవడంలో గొప్పదనం లేదు. ఏం చేసావని వెళ్ళిపోతావ్? ఆ ఏం చెయ్యలేదు కాబట్టే వెళ్ళిపోతున్నాం అన్నావనుకోండి, ఏం చెయ్యలేదంటే, ఎదో ఒకటి చెయ్యడానికి ప్రయత్నం చెయ్యి. ఇచ్చాడుగా ప్రాణం దేవుడు. అది వెళ్ళిపోయేటప్పుడు నువ్వు ఉంటానన్నా అది ఉండదు. నువ్వు చాలా పనులున్నాయి, కొన్నాళ్ళు ఉంచవయ్యా అంటే ఉంచుతుందా ప్రాణం? ఉంచదు. ఆ time కి వెళ్ళిపోతుంది. కాలుడు వచ్చేస్తాడు. అంచేత, ఉన్నప్పుడు ఏం చెయ్యాలి?

ఇప్పుడు ఆశ్వపతికి ఏం జరిగింది? ఆయన హృదయంలో ఉండగలడు. ఆనందంగా ఉండగలడు. ప్రాణాలను అలా అలా వదిలెయ్యగలడు. అంటే, దేహాన్ని వదిలెయ్యగలడు. మరి అలాంటి వాడు ఎందుకు వెళ్ళిపోలేదు అంటే, వెళ్లి పోయే ముందు... నువ్వు వెళ్ళిపోతే ఇక్కడ తేడా పడకూడదు కదా! నువ్వు ఏదయినా సీటు ఖాళీ చేసేముందు, ఆ సీటులో ఇంకోడిని కూర్చోపెట్టి వెళ్ళిపోవడం అనేటటువంటిది ఉద్యోగాల్లో కూడా చూస్తున్నాం కదా! Transfer Order వచ్చింది, reliver వస్తే గానీ నువ్వు వెళ్ళడానికి లేదు కదా! ఏమయ్యా transfer order వచ్చింది, ఎప్పుడొస్తావు అని అడుగుతారు అవతలి పక్క నుంచి ఆ ఊళ్ళో ఉండే బంధువులు. ఇంకా reliver రాలేదని చెప్తాం. Reliver రావాలి కదా! ప్రతి వాడికి ఒక reliver రావాలి, అన్ని విషయాలకి ఒక reliver రావాలి. నువ్వు చేసేటటువంటి కార్యక్రమము మరొక చేసేటటువంటి వాడు తయారయినప్పుడు నువ్వు అక్కడి నుంచి తప్పుకోవచ్చు.

ఇప్పుడు అశ్వపతి ఎవరయితే ఉన్నారో ఆయనకి సంతానం లేదండి. చూడండి ఎలా పెట్టాడో దేవుడు? సంతానం లేదు. ఇప్పుడు సంతానం లేకపోతే రాజ్యం ఎవరికి అప్పచెపుతాడు? యోగ్యుడైన వాడు ఒకడు ఉండాలి కదా! ఆ రాజ్యం సంక్షోభంలోకి వెళ్ళిపోకుండా ఉండాలంటే యోగ్యుడైన వాడు ఒకడు రావాలి కదా! అంచేత, ఈయన ఏం చేసాడంటే, తన హృదయం చేరినప్పటికీ, తనకి ఈ దేహ విసర్జన అనేటటువంటిది చాలా అనాయాసం అనేటటువంటిది విద్యగా తనకి తెలిసినప్పటికీ కూడా, తన రాజ్యానికి ఉత్తరాధికారి ఒకడు కావాలి అని చెప్పి ప్రార్థన మొదలుపెట్టాడండి, దైవారాధన. "అతడు సంతాన కాంక్షతో, ప్రగాఢ భక్తితో, పది పై ఎనిమిది సంవత్సరాలు..." ఎందుకిలా రాస్తారో తెలుసా? పద్దెనిమిది సంవత్సరాలు అని రాయచ్చు కదండి? ఊరికే పద్దెనిమిది అని రాస్తే

సరిపోదూ? పద్దెనిమిది అంటే ఏమిటి? పదునెనిమిది అంటే పది, ఎనిమిది, పది పై ఎనిమిది. సంస్కృతంలో అలా ఉంటుంది. అష్టాదశ. అష్టాదశ అంటే దశ పైన ఎనిమిది అని అర్థం. అందుకని పద్దెనిమిది. అంటే, అనువాదం బావుందా, లేదా? భారతం మొన్నామధ్య ఎవరో free అంటే internet లో, నా iPad లో ఎక్కించుకున్నా. అది చదివితే నాకే లోపలి నుంచి వెగటు వచ్చింది, డోకు పుట్టింది. ఆయన advocate, ఆయనకీ సంస్కృతం వచ్చు. అందుకని రాసేశాడు ఎడాపెడా. అది చదువుతుంటే... ఏదీ సంస్కృతం, తెలుగు వచ్చని రాసేడు తప్ప, ఇంకేం తెలియదు అని తెలిసింది. ఏం తెలీదు, అనవసరంగా iPad నిండా నింపుకున్నాను, పద్దెనిమిది పర్వాలు. అది తీయించెయ్యాలి వారెవరి చేతయినా, ఆ కుర్రాళ్ళ చేత, ఖాళీ వస్తుంది. ఇలా ఉండాలి. ఇది పిలకా గణపతి శాస్త్రిగారు రాసిన అనువాదం. ఇదే సంస్కృతం శ్లోకం పట్టుకున్నాం అనుకోండి, అసలు మనకు కథ అవ్వదు, అంత విపరీతంగా మనకి అందులోంచి వాఖ్యానం వస్తుంది వేదవ్యాసుడుది. అలాగే ఉంటాయి పోతన తెలుగు భాగవతం, అద్భుతం. అంచేత, ఈయన పదునెనిమిది అనకుండా పది పై ఎనిమిది. సంస్కృతంలో అలా ఉంటుంది, అష్టాదశ.

పద్దెనిమిది సంవత్సరాలు సావిత్రిదేవి గురుంచి ఘోర తపస్సు ఆచరించాడటండి. తపస్సు ఆచరించడం ఎలా చేసాడో తెలుసా తపస్సు? పొద్దున్న చెప్పాను కదా! ప్రతి రోజూ పది వేల మార్లు గాయత్రి జపం చేసాడట. రాజ్యానికి రాజై ఉండి, పది వేల మార్లు గాయత్రి చెయ్యాలంటే ఎంత సమయం ఉండాలండీ? అంటే, ఎంత పొద్దున్న లేస్తుండా లాయన? అది కూడా పద్దెనిమిది సంవత్సరాల పాటు ఎక్కడా అంతరాయం లేకుండా, రోజుకి పదివేల సార్లు గాయత్రి ఆరాధన చెయ్యడాన్ని తపస్సు అని చెప్పారు ఇక్కడ. ఆ విధంగా తపస్సు ఆయన ఆచరిస్తే, పద్దెనిమిదేళ్ళకి సావిత్రిదేవి ప్రత్యక్షం అయ్యింది. సావిత్రిదేవి అంటే? మన సూర్య మండలాలన్నిటికీ ఏది కేంద్రమో, ఆ కేంద్రాన్ని సవితృ మండలం అంటారు. ఆ సవితృ మండలం యొక్క మూర్తీభవించిన రూపం ఒకటి ఏర్పడితే దాన్ని సావిత్రి అంటారు. మన సూర్య మండలాలు పన్నెండు సూర్య మండలాలు కలిపితే ఒక కేంద్రం దానికి ఉంది. అంటే, పన్నెండు సూర్య మండలాలకి ఒక కేంద్రం చొప్పున, అలాంటి పన్నెండు కేంద్రాలకి ఒక భర్గోదేవ మండలం ఒకటి ఉంటుందని మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అంటే, ఒక ఆదిత్యలోకంలో ఒక సూర్యుడి నుంచి పన్నెండు సవితృమూర్తులు, ఒక్కొక్క సవితృమూర్తి నుంచి పన్నెండు సూర్యమూర్తుల మండలాలు వస్తూ ఉంటాయని మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అందుకనే, పన్నెండు పన్నెండ్లు, దాన్నే మనం growth అంటూ ఉంటాం, పన్నెండు పన్నెండ్లని. Twleve times twelve.

అంచేత, మన సూర్యుడికి మూలమైనటువంటి స్థానం సవితృమూర్తి. దాన్ని ఆరాధన చెయ్యడానికే మనకి గాయత్రి. దాన్ని ఆ విధంగా మన్ని, ఆ వెలుగు మన్ని ఆవరించడం కోసం గాయత్రి చేస్తాం. ఏ వెలుగయితే మన సూర్యుడి ద్వారా మన దగ్గరకు వస్తుందో, ఆ వెలుగు మన్ని బాగా ఆలింగనం చేసుకోవాలటండీ. "*తత్స వితుర్వరేణ్యం*" అంటే మన్ని వరించి, మన్ని బాగా ఆవరించాలి. మనం ఊరికే దాన్ని కావలించుకోవాలని అనుకోకూడదు, మాడి పోతాం! తాను మనకి అనుగుణంగా దిగి వచ్చి, మన్ని స్పృశించి, మనకి కావలసిన రసాయన చర్య అంతా కూడా బాగా నిర్వర్తించి, చక్కని వెలుగుతో మనం ప్రకాశించేటట్లుగా ఆమె నిర్వర్తించాలని కోరుకుంటూ ఉంటాం గాయత్రి మంత్రం ద్వారా. అది కూడా ఎవరిని కోరతాం? ఆమెకి మూలమైన భర్గోదేవుడిని కోరతాం. పొద్దున్న చెప్పాను కదా,

"*భర్గః అస్య దేవః*". అంటే, భర్గులు అంటే మొత్తం సృష్టిలో ప్రజ్వలంగా వెలిగిపోతున్నటువంటి ఆదిత్యులు ఉన్నారే, cosmic sun అంటారు English లో. ఆ cosmic sun, లేదా ఆదిత్యుడు, ఆయన్ని ఆరాధాన చేస్తున్నాం. ఆ సవితృమూర్తి నన్ను ఆలింగనం చేసుకోవాలని. ఆలింగనం చేసుకోవడం దేనికంటే, నీ యొక్క ప్రకాశం ఉందే, జీవుని యొక్క ప్రకాశమే బుద్ధి. ప్రతీ జీవుడికి కొంత ఒక ప్రకాశం ఉంది. దాన్ని పెంచుకోవచ్చు. ప్రకాశం పెరగడానికి మన జీవుడి యొక్క బలం పెరిగితే ప్రకాశం పెరుగుతుంది. బల్బులు watts బట్టి కదా! Bathroom లో సరిగ్గా కనబడకపోతే, కొంచెం higher watt bulb పెట్టమని అడిగాను పొద్దున్న. ఎందుకని? సరిగ్గా కనిపిస్తుంది కదా! అసలే bathroom, కనబడక పోతే కష్టం! అంచేత, ఒక 60 watt bulb పెట్టారనుకోండి, ఓ మనం ఏం వెతుక్కోక్కర్లేదు. చిన్న చిన్న వస్తువులు వాడుతూ ఉంటాం కదా!

అలాగే, మనకి వెలుగు పెరిగిందనుకోండి, దర్శనం బావుటుంది. అంతకముందు కనబడనివి, ఇప్పుడు కనిపిస్తూ ఉంటాయి కదా! ఇదివరకూ తెలియనివి ఇప్పుడు తెలుస్తూ ఉంటాయి. కనబడడం అంటే అదే అర్థం. తెలియడమే కనబడడం. అది పెంచడం కోసం ఆ సవితృమూర్తి నన్ను ఆలింగనం చేసుకోడానికి, నేను ఈ వెలుగులన్నిటికీ ఎవరు దేవుడో, ఆ దేవుడిని ధ్యానం చేస్తున్నాను, "*ధీమహి*" అని చెప్తోంది గాయత్రి మంత్రం. మంత్రం అంటే అర్థం తెలియకుండా మంత్రం అలా రాట్నం వడికినట్టు చేసుకునేవాళ్ళు చాలామంది ఉంటారు కదా! వాడికేమిచ్చినా అలా నమిలి పడేస్తారు! నమిలేసి ఉమ్మేసే type వాళ్ళు. Next ఇంకోటి చెప్పండి నాకు అంటారు. శుభమా అని ఉపనయనం చేసుకుని గాయత్రి మంత్రం పుచ్చుకున్నాడనుకోండి, ఆ తర్వాత ఏ గురువుగారి దగ్గరకో వెళ్లి నాకేమయినా మంత్రం ఇస్తారా అని అడిగాడనుకోండి, చాచి లెంపకాయ కొట్టాలి. కొట్టడు గురువుగారు, ఎందుకంటే, ఆయనకి శిష్య వ్యామోహం. అసలు దొరకడనుకో, శిష్యుడొకడు వచ్చి మన్ని అడిగాడు, వీణ్ణి పోగుట్టుకుంటే ఎట్లా, అని వాడికి ఇంకో మంత్రం ఏదయినా... ఎందుకు మంత్రం? ఒక మంత్రం ఉంటే చాలదా? ఏ ఒక్క మంత్రం అయినా నిన్ను పరిపూర్ణ వెలుగుగా తీర్చిదిద్దగలినటువంటి మంత్రాలు ఎన్నో ఉన్నాయి. నీకు దక్కిన మంత్రమే నిన్ను కడతేర్చే మంత్రం అని భావించాలి. అలా భావన ఎందుకుండదంటే, మనసులో ఉంటాం. మనసు చంచలమైనటువంటిది కాబట్టి, ఈ మంత్రంతో పని కాదేమో, ఇంకో మంత్రం పుచ్చుకుందాం అనిపిస్తుంది. ఈ గురువుగారితో పని కాదేమో, ఇంకో గురువుగారి దగ్గరకు వెళ్దాం అనిపిస్తుంది. నీకు ఎంత చంచల బుద్ధి ఉంటే, నీకు అలాంటి గురువు దొరుకుతాడు. నీ బట్టే నీ గురువు! శిష్యుడు సదాచార సంపన్నుడయితే సద్గురువే దొరుకుతాడు అని వాక్యం ఉంది. శిష్యుడికి రకరకాల వ్యామోహాలు ఉన్నాయనుకోండి, అలాంటి వ్యామోహాలకు బూతద్దం వేస్తే ఎట్లా ఉంటుందో అలాంటి గురువు దొరుకుతాడు. అందుకే, "*వంచతే పరి వంచతే స్థాయునాం పతవే నమః*" అని మనం నమకంలో చదువుకుంటాం. మోసగించే వాడికెలాంటి గురువు దొరకుతాడంటే, అంత కన్నా వందరెట్లు మోసం చేసేవాడు గురువుగా దొరుకుతాడు. దొంగిలించే వాడికి దొంగిలించే వాడు, మోసగించే వాడికి మోసగించే వాడు, అబద్ధాలు చెప్పే వాడికి అబద్దాలు చెప్పే వాడు, ఇలాంటి గురువులు దొరుకుతూ ఉంటారు. ఇట్లా ధనం కోసం పరిగెట్టేవాడికి ధనం... అట్లా ప్రతీది అంతే!

సత్యం కోసం. సదాచారం అంటే సత్యం గురించి జీవితంలో ఆచరణ కార్యక్రమంగా పెట్టుకున్న వాడికి సత్యమెరిగిన గురువు దొరుకుతాడు. అంచేత, ఈ విధమైనటువంటి ఆరాధన గాయత్రి.

ఆరాధన మనకి త్రికాల సంధ్యలయందు చేసుకోమని చెప్పారు. ఎంచేత, ఇందులో మనం భర్గోదేవుడిని, సవితృమూర్తిని, సూర్యమూర్తిని, అందరిని ఆరాధన చెయ్యడం కోసం. Triple Sun అంటారు. ఆ Triple Sun నే పాశ్చాత్య దేశాల్లో Solomon అంటారు. Solomon లో Om ఉంది, మధ్య భాగం ఓం. ఓం అనేటటువంటిది Cosmic Sun. Sol అనేటటువంటిది Central Sun. On అనేటటువంటిది మనమెరిగినటువంటి సూర్యుడు. మనం కూడా "*ఆదిత్యః సవితః సూర్యః*" అని చెప్పుకుంటాం. "*ఆదిత్యః సవితః సూర్యః*" అనేటటువంటి నామం బాగా చేసుకుంటే ఆ మధ్య స్విట్జర్లాండ్లో ఒకావిడకి కన్నులు కనబడనివి కనబడడం మొదలు పెట్టినాయండీ, ఆవిడ ఆశ్చర్యంగా mail ఇచ్చింది. ఈ మంత్రాల్లో ఇంత శక్తి ఉందనేటటువంటిది నాకు చిన్నప్పటినుంచీ ఉంది. నాకు కన్నులు కనబడడం లేదు, మంత్రం ఎమన్నా చెప్తావా అంటే, ఇంకేం చెప్తాం, సూర్యుడివే చెప్పాలి. అందుకని, "*ఆదిత్యః సవితః సూర్యః*" అనేటటువంటి అష్టాక్షరం. "*ఆదిత్యః*" మూడక్షరాలు, "*సవితః*" మూడక్షరాలు, "*సూర్యః*" రెండక్షరాలు. ఎనిమిది అక్షరాలు, అష్టాక్షరి. అంటే గాయత్రి ఛందస్సు అన్నమాట. గాయత్రిలో కూడా ఎనిమిది అక్షరముల ఒక ఛందస్సు ఉంది. అంచేత ఇస్తే, ఆమెకి ఒక్క మూడు నెలలపాటు చేస్తే, చూపు వచ్చింది. ఎంచేత? ఆమెకి అచంచల విశ్వాసం ఉండడం చేత. అదే ఒక భారతీయుడికి ఇస్తే, ఉండదు, రాదు. ఎందుకంటే, మనకి ఈ మంత్రం చేస్తుంటే, ఇంకో మంత్రం ఎట్లా ఉంటుందంటాడు. ఈ లోపల నాబోటి వాడొచ్చి అశ్వినీ దేవతలు చెయ్యమంటాడు. అనేసరికి, ఈ సూర్యుడెళ్ళి పోయాడు. ఇట్లా ఒకదాట్లోంచి ఇంకోదాంట్లోకి jumping activity ఉంటుంది. ఇట్లా గెంతులు వేసే వాడికి ఏమీ జరగదు, ఎక్కడా జరగదు.

ఎందుకని చెప్తున్నానంటే, గాయత్రి మంత్రం కన్నా మించిన మంత్రం లేదు. గాయత్రి కన్నా దేవత లేదు. గాయత్రి మంత్రం కన్నా మంత్రం లేదని మనకి శ్లోకం ఉంది. గట్టిగా శ్లోకాలు చదివి భయపెట్టక్కర్లేదు మనం, విషయం తెలుసుకుంటే చాలు. అంచేత, మనకి ఉదయం సాయంత్రం ప్రార్థనలో ఇమిడ్చి ఇచ్చారు కదా! ఆ గాయత్రియందు మనం ఎంత శ్రద్ధతో దాన్ని నిర్వర్తించుకుంటున్నాం? నీయందు వెలుగు బాగా ప్రకాశం చెందడానికి ఋషులు సాధించి ఇచ్చిన మంత్రం కదా! అది దేనికి చెప్తోంది? వెలుగులకి మూలాన్ని చెప్తోంది. దాని నుంచి దిగివచ్చిన వెలుగుని చెప్తోంది. అది నీలోనికి దిగి రావాలట. అది దిగి రావడం ఎలా? దిగి రావాలంటే, నిన్ను కావలించుకున్నట్టుగా దిగి రావాలట. అది చూడండి! అంటే, దిగి వచ్చినా ఉంటుందో ఉండదో, అందుకని కావలించుకుంటే ఇంక మరి ఉండిపోతుంది. అంటే, అంత వాత్సల్యంతో, అంత ప్రేమతో, ఆ వెలుగు నిన్ను ఆవేశించి, ఆవరించి, స్థిరంగా ఉండిపోయేటట్టుగా చేసేటటువంటి ప్రార్థన గాయత్రి మంత్రం.

Master EKగారు వారికి ప్రచోదనానికి మూలకారణం గాయత్రీ మంత్రమే కదా! అంచేత, ఆ మంత్రాన్ని మనకి కూడా ఉభయ సంధ్యలయందు చేసుకోమని చెప్పారు. అంతే కాదు, స్త్రీ పురుష భేదం లేకుండా, జాతి భేదం

లేకుండా, సూర్యుడు అందరికీ సంబంధించిన వాడు కాబట్టి, అందరూ చేసుకోవచ్చని పరమ గురువులు ఎప్పటినుంచో చెప్తున్నారు కదా! సూర్యుడు మన సూర్యుడా? అందరికీ సూర్యుడే! అతడి ప్రజ్ఞయే మనయందు పని చేస్తున్నది. నిజానికి అతడి యొక్క చిలమే మనం. అతడు రూపాయి బిళ్ళ అయితే మనం పైసా బిళ్ళ అంతే! అదే వెలుగు ఇక్కడ ఉన్నది. ఆయనకి ఏ విధంగా మిగతా గ్రహములన్నీ ఒక కుటుంబంగా ఉన్నాయో, నీలో కూడా ఆ గ్రహ శక్తులన్నీ కూడా ఉన్నాయి. రాహు కేతువులతో కలిపి నవ గ్రహాలు, అన్ని శక్తులూ – పదార్థం, భూమి. నీలో ఉండేటటువంటి శక్తి కుజుడు. నీలో ఉండేటటువంటి విచక్షణ బుధుడు. నీలో ఆలోచించి చక్కగా అది ప్రతిబింబించేటట్టుగా భావన చెయ్యడం చంద్రుడు. నీకున్న బుద్ధి వికాశం బృహస్పతి. నీకుండే సుఖపడే యోగ్యత శుక్రుడు. స్థిర పడేటటువంటి లక్షణం శని. ఇట్లా అన్నీ ఉన్నాయి మనలో. మనమే సూర్యుళ్ళం. అందుకనే, "*అసావాదిత్యే బ్రహ్మ*" అన్నారు. ఆ కనబడే సూర్యుడే నేను. వాడే నేను అనేటటువంటి భావన. అలా అయిపోతామేంటి? ఎప్పుడయిపోతావు? అది నీయందు సత్యమై నిలిచినప్పుడు అవుతావు.

అంచేత, ఆ విధంగా ఈయన ధ్యానం చేసాడు. పద్దెనిమిది సంవత్సరాలు ధ్యానం చేసాడు. ఉపనయనం అయ్యి మూడు రోజులు, నాలుగు రోజులు చేస్తే, అప్పటికే తండ్రి మొదలుపెట్టేస్తాడు ప్రచారం, మా అబ్బాయి రోజూ గాయత్రి చేస్తున్నాడు అని. పదహారు రోజుల పండగ అయ్యిన తర్వాత కనబడు అని అడగాలి. ఏది ఉపనయనం అయ్యిన తర్వాత పదహారు రోజుల పండగ అని ఉంటుంది కదా! అప్పుడు కనబడవయ్యా చూద్దాం అను. ఏం చేస్తున్నాడు మీ అబ్బాయి? రెండు పూట్లా చేస్తున్నాడా? చెయ్యట్లేదండీ! ఎందుకంటే, పొద్దున్నే లేవడండీ, మధ్యాహ్నం school అండి, సాయంత్రం ఆడుకోవాలి కదండీ అంటాడు. ఇంకేముందండి! అంచేత, మనం అంత సులభంగా గాయత్రి చేద్దామంటే చెయ్యలేం. మంత్రం అందరికీ ఇచ్చి ఉండవచ్చు, అది వేరే సంగతి. ఇప్పుడు అందరికీ ఇవ్వలేదా? ఎంత మంది ఆర్ద్రతతో దాన్ని చేస్తున్నారు అన్న దాన్ని బట్టి కదా ఏ ఒకట్టయినా!

ఇక్కడ చూడండి ఎలాంటి ఉదాహరణ ఉందో? అంటే, తన ప్రాణములు సైతము తన ఆధీనములో ఉన్నటువంటి, తను సహజంగా ఆనంద లోకంలో ఉండేటటువంటి ఒక జీవుడు, తన జీవన ప్రయోజనం నెరవేరడం కోసం గాయత్రి ఆరాధన చేసాడు. కాబట్టి, గాయత్రి ఆరాధన దేనికోసం? నీ జీవన ప్రయోజనం సిద్ధించడానికి అన్ని విధాలా ఉపయోగ పడుతుంది. అది చెయ్యడం చేత ఆ సవితృమూర్తే రూపు కట్టుకుని వచ్చేసాడు. అమ్మవారిగా రూపు కట్టుకుని వచ్చాడు. అయ్యవారిగా కూడా రూపు కట్టుకుని రావొచ్చు. ఒకో సందర్భంలో ఒకో రకంగా ఉంటుంది కదా! సత్రాజిత్తు యాగం చేస్తుంటే ఎలా వచ్చాడు? పురుష రూపంలో వచ్చాడు. వచ్చి ఒక మణి ఇచ్చి వెళ్ళిపోయాడు కదా! ఎందుకని? సత్రాజిత్తుకి కావలసినది అదీ. ఆ మణి ప్రతి రోజూ ఎనిమిది మణుగుల బంగారం పెడుతుందట. అంటే, వీడికి బంగారం మీద ఎంత వ్యామోహం ఉందో చూడండి. ఇప్పుడు ఒక దేవుడో, దేవతో వచ్చి నీకు ఏదయినా ఇచ్చారంటే, నీకు మనసులో ఏది ఉందో చూసి అదే ఇస్తారు కదా! దాని వల్ల ఎన్ని కష్టాలు వచ్చాయి సత్రాజిత్తుకి? ఎనిమిది మణుగుల బంగారం రోజూ వస్తే, ఏం చేసుకుంటావు? దాన్ని కాచేద్దామని ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు ఎదురు చూస్తూనే ఉంటారు. ప్రాణ భయం ఉంటుంది.

మరి ఈయన ప్రార్థన చేసాడు దేని కోసం? సంతానం కోసం. సంతానం ఉంటేనే కదా కొనసాగుతుంది జీవితం. "ప్రజాతంతుం మాం వ్యవస్తేస్యి" అన్నారు. అందుకనే, సంతాన ప్రాప్తి కోసం ప్రార్థన చేస్తే అమ్మవారు వచ్చిందండి... అమ్మవారు వచ్చేలోగా కాగితాలు ఇక్కడ తిరిగిపోతూ ఉంటాయి... అమ్మవారు వచ్చి... "ఆ నరేంద్రుడు ఆ దేవి అనుగ్రహ దృష్టికి ఎంతో ఆనందిచాడు". అంటే, ఆవిడ కనబడగానే ఆవిడ దృష్టి తనయందు అనుగ్రహించడానికి సంసిద్ధంగా ఉన్నట్టుగా భావించాడు. భావించి, అప్పుడు ఆవిడ కూడా, నీకు ఏమి కావలెనో కోరుకోవలసినది అని అనుగ్రహించింది. "అత్యంత వినమ్రుడై, తనయుడినొక్కని ప్రసాదింపవలసినదని అభ్యర్థించినాడు." చెప్తుంటాం కదా "అపుత్రః నాస్తి" అని, పుట్టి మనని ఏడిపించేవాడు కాకుండా, మనకి ఊర్ధ్వ లోకాలకెళ్ళడానికి ఎవడో ఒకడు ఉంటే చాలని! ఎంతసేపూ మన గోలే కదా! కాదు. నిజానికి ప్రతి వ్యక్తికి కూడా దేహం పొందినందుకు, దేహం కలిగించవలసిన ఒక బాధ్యత ఒకటి ఉన్నది. పితృదేవతలికి ఋణం ఉన్నది. దాన్ని నిర్వర్తించడానికే సంతానం. లేకపోతే, ఆ ఋణం అలా ఉండిపోతుంది. అంతేకాదు, ఆయన రాజు. ఈయన వెళ్ళిపోతే సంక్షోభం కలగకూడదు. మనం వెళ్ళిపోవడం వల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదు. అందుకనే, "*అకాల మృత్యు హరణం సర్వ వ్యాధి నివారణం*" అని కోరుకుంటూ ఉంటాం. "*సర్వ వ్యాధి*" ఏకంగా! ఆయనంటాడు, అకాల మృత్యువు పోనీ నేను చూస్తానురా, వ్యాధులు ఉంటాయి నీతో అని చెప్తాడు. "*సర్వ వ్యాధి నివారణం సమస్త పాప క్షయం*". ఒక్కసారి పూజ చేసి, ఎన్ని అడిగేస్తామో! ఇంతకన్నా దేవిరింపు ఎక్కడా ఉండదనుకుంటాను. "*అశ్వదాయేచ గోదాయేచ ధనదాయేచ మహాధనే...*" మహాధనం కూడా కావాలి, ఉత్త ధనం కూడా కాదు. "*పుత్ర పౌత్రం...*" పుత్రుడే కాదు, పౌత్రం కూడా! ఇంకేవో అడిగేస్తాం. సంస్కృతం కాబట్టి తెలియకుండా చదివేస్తున్నాం తప్ప, అది నిజంగా అర్థం తెలుసుకుంటే, ఇంత దేవిరిస్తున్నానా నేను, హాయిగా దేవుడితో ఉండొచ్చు కదా అనిపిస్తుంది. దేవిరింపే దేవిరింపు! కాకపోతే, ఒక రకంగా నయం, ఊరిలో వాళ్ళని దేవిరించకుండా దేవుడిని దేవిరిస్తున్నావు.

అంచేత ఈయనే మన్నాడంటే, ఒకడు... ఒక్క కొడుకుని ఇమ్మన్నాడండి. ఇప్పుడు చెప్తుంటారు కదా కథల్లో, ఏనుగు బలం లాంటి బలం కలిగిన వంద కొడుకులు కావాలా, లేకపోతే మంచి గుణవంతుడైన ఒక కొడుకు కావాలా అని అడుగుతూ ఉంటారు కదా! మామూలుగా అందరూ ఒక మంచి కొడుకు అయితే చాలు అని చెప్తారు. ఎందుకంటే, వాళ్ళు ఏనుగు బలం ఉన్నవాళ్ళు వంద మంది ఉంటే, వీణ్ణి మొత్తేసినా మొత్తేస్తారు కదా! అంచేత, "నాకు ఒక తనయుడిని ఇవ్వు తల్లీ" అని అడిగాడు ఈయన. సమంజసమే కదా! అడిగితే, ఆ లోకైకమాత, "కన్నియ నీకు ఉదయించగలదు" అంది. అది చూడండి! నేనొకటి అడిగితే నువ్వొకటి ఇచ్చేవేమిటి అని, CVVగారిలాగా. నువ్వు అడిగేది నువ్వు అడుగుతుండగా ఆయనేదో అడగనివి ఇచ్చేస్తుంటాడు, training. అట్లాగే, ఈయనకి కూడా సావిత్రిదేవి చెప్పింది, "నీకు ఒక్క కూతురు పుడుతుంది" అని.

కూతురు పుడుతుంటే ఎట్లా? కొడుకు పుట్టమని కదా అడిగింది! కూతురు పుట్టడమేంటి? "ఆమె వలన తర్వాత నీకు అన్నీ కలుగుతాయి. ఆమె వలన నీకు సమస్తమూ సిద్ధిస్తాయి." అంచేత, మనవాళ్ళు ఆచారవంతుల కుటుంబంలో మొదటి సంతానం కన్య కావాలనుకుంటారు. ఎందుకంటే, ఆడపిల్ల ముందు పుడితే ఇంటికి శుభం అని.

ఎందుకని? ఆడపిల్లని కని, పెంచి, వివాహం చెయ్యడం అనేటటువంటిది ఒక యజ్ఞార్థమైనటువంటి కర్మ. ఎంచేత? గుణవంతురాలిగా తీర్చిదిద్ది, చక్కని విద్యాబుద్ధులన్నీ నేర్పి, రకరకాలైన ఆభరణాలన్నీ కూడా ఏర్పాటు చేసి, ఇవన్నీ ఇంకొకరికి అప్పచెప్పడం కదా అది! ఇంకొకరికి అప్పచెప్పడమే. మరది యజ్ఞమే కదా! నీకోసం కాదు కదా! నీ ఇంట్లో ఒక కన్య పెరుగుతుందంటే, ఆ కన్య "ఆడ పిల్లే" కదా! అంటే, అక్కడ పిల్ల ఇక్కడ పెరుగుతోంది. తెలుగులో మంచి పేరే పెట్టారు స్త్రీ అన్నదానికి, కన్య అన్నదానికి "ఆడ పిల్ల" అని. ఈడ పిల్ల కాదని తెలియాలి కదా!

అందుకనే, పెళ్ళయిన తర్వాత కూడా ఇక్కడి నుంచే అక్కడ monitor చేస్తూ ఉంటారు. కూతురు కాపురాన్ని monitor చేసి... అది పాడయిపోయేంత వరకూ monitoring, ఒకటే monitoring. Full గా పాడయిపోవాలి. ఎందుకంటే, ఇక్కడ అత్తగారు రోజూ పొద్దున్న, మధ్యాహ్నం, రాత్రి అలా briefing ఇస్తూ ఉంటుంది. ఆ mobile లు వచ్చాయేమో సులభం అయిపోయింది. ఇక్కడ నుంచి అక్కడ అలా washing అయిపోతూ ఉంటుంది. ఏమిటి? brain! అది పెట్టుకుని, ఆ అమ్మాయి ఆ మొగుడితో ఆ విధంగా ప్రవరిస్తూ ఉంటే, ఇదేమిటి నేను ఈమెని చేసుకున్నానా, అత్తగారిని చేసుకున్నానా అనిపిస్తుంది. పెళ్లి చేసుకుంది ఆ కన్యనా, అత్తగారినా? ఎందుకంటే, అత్తగారి భావాలన్నీ ఈమె ద్వారా ఇక్కడ ప్రకటితమైపోతూ ఉంటాయి. ఎందుకంటే, వదలరు. వదల్లేం కదా! ఏదీ వదల్లేం, మనం ఏం వదులుతాం అండీ? అన్నీ పట్టుకోవడం నేర్చుకున్న వాళ్ళం, ఏదీ వదలలేం. అంచేత, మన సాంప్రదాయంలో ఏం చెప్తారంటే, ముందు స్త్రీ సంతానం, తర్వాత పురుష సంతానం కలిగితే అది అదృష్టం అని చెప్తారు. ముందు లక్ష్మి ఇంటికి వస్తే, తర్వాత అన్నీ... లక్ష్మి అంటే డబ్బు అనే అనుకోకండి. వైభవం, సంపద అని అర్థం. ఆనందం.

అంచేత, అలాంటి కన్య నీకు ఒకటి కలుగుతుంది. "జగన్మాతా నీ కృప వల్ల నా కోరిక నెరవేర వలదా?" అన్నాడు. మరి నా మాటేంటి అన్నాడు. నేనొకటడిగాను, నువ్వొకటిస్తానన్నావు. నేను అడిగింది వేరు, నువ్వు ఇస్తానన్నది వేరు, మరి నా మాటేంటి అన్నాడు. అంటే, "అతడు అప్పుడు లోపలి అభిప్రాయం వెల్లడించాడు. లోకమాత ఆ అభ్యర్ధన విని, అశ్వపతిపై కృపా దృష్టి ప్రసరింపజేసి, మద్రేశ్వరా, నేను ఇంతకు మునుపే నీ హృదయాభిలాష చతుర్ముఖునికి ఎరిగించినాను." అంటే, ఈయన తపస్సు చేస్తుంటే, ఇలా వీడు కొడుకు కోసం తపస్సు చేస్తున్నాడని బ్రహ్మదేవుడుని అడిగిందట. అంటే, ఆయన ఏం రాసి పెట్టాడో? అడిగితే, "ఆ మహనీయుడు నీకు ఒక కన్యకామణిని మాత్రమే ప్రసాదించాడు". అంటే, నీకు program లో ఉంది ఒక కన్య అని. నువ్వు తపస్సు చేసావు, బావుంది. కానీ, నీకు ఇప్పటికే నీకు కన్య రాసి పెట్టి ఉన్నది. అది ముందు అంగీకరించు. ఆ తర్వాత నా ప్రసాదంగా ఆమె ద్వారా నీకు చాలా జరుగుతాయి. అయితే, "ఆ పుత్రిక ప్రభావం వల్ల నీకు ఆనతి కాలంలోనే తనయ శతము లభించగలదు." ఆ పుత్రిక ప్రభావం వల్ల నీకు వంద మంది పిల్లలు కలుగుతారు. నువ్వడిగింది ఒకడిని, నేను ఇచ్చేది నీకు సమస్తమునూ సిద్ధింపచేస్తుంది. అంతేకాదు, నువ్వు అడిగిన విషయం కూడా వంద రెట్లు. బావుంది కదా! ఎంచేతంటే, నిజానికి ఆ సావిత్రిదేవే ఈయనకి పుడుతుంది సావిత్రిగా. అందుకనే, పుట్టిన శిశువు కూడా సావిత్రే. ఏంచేత? తాను ఆయనయందు అంత అనుగ్రహం చెందియున్నది. ఉండడం చేత, అమ్మవారే తనకి పుత్రికగా రూపు కట్టుకుంటుంది.

ఎందుకు రూపు కట్టుకుంటుందంటే, మరొక ఘట్టం జరుగవలసి ఉన్నది కాబట్టి, దాని కనుగుణంగా ఇక్కడ ఈ విధంగా ఆవిడ... నీకు ముందు కన్య ఉదయిస్తుంది, ఆ తర్వాత ఆమే కారణంగా నీకు వంద మంది తనయులు కూడా ఏర్పడుతారు. అంచేత, నీ హృదయం తెలిసినదాన్నే, తెలియనిదాన్ని కాదు. కాకపోతే, ఇప్పటికే బ్రహ్మరాత ఒకటి ఉన్నది. అది ఆధారంగా నీకు అద్భుతమైనటువంటి కన్యకామణి జన్మిస్తుందనే విషయాన్ని సావిత్రిదేవి ఆవిష్కరిస్తుంది.

అలా చెప్పి, ఆమె అంతర్హితురాలయ్యింది. "మరి కొంత కాలం గడిచిన పిమ్మట, అశ్వపతి ధర్మపత్ని అయిన మాళవియందు సావిత్రిదేవి కృపా దృష్టి వల్ల 'సావిత్రి' అన్న తనూజ ప్రాదుర్భవించినది". పుట్టినావిడ కూడా సావిత్రే. మాళవి అనేటటువంటి కన్య ద్వారా, అంటే చాలా మార్ధవమైనటువంటిది ఆవిడ. అంచేత, మాళవి అని పేరు పెట్టారు. అంటే, ఒక తీగ లాంటి స్వభావంగా, మృదువుగా ఉండేటటువంటి స్వభావం కలిగినటువంటి ఒక స్త్రీ ద్వారా అశ్వపతి ఈ దైవాంశ సంభూత అయిన ఒక కన్యకను, ఒక స్త్రీ శిశువును కనటం జరిగినది. "ఆ కన్యాతిలకం క్రమక్రమంగా పెరిగి పెద్దదయి, సోయగంలో సిద్ధ, సాధ్య, యక్ష, అమర కుమారికలందరిలోనూ మిక్కిలి మిన్న అయినది". చూడండి, పుట్టిన ఆడపిల్ల, అంటే అన్ని లోకాల్లోనూ ఆవిడ కీర్తింపబడేంత ఉత్తమోత్తమైనటువంటి ప్రతిభతో ఆవిడ పెరుగుతూ వచ్చిందండి. అంటే, ఇలాంటి కన్య మానవలోకంలో కాదు, సిద్ధలోకంలో సిద్ధుల మధ్య లేదు, సాధ్యుల మధ్య లేదు, యక్షుల మధ్య లేదు, అమరుల లోకంలో లేదు. అంటే, ఎలాంటి కన్య అయి ఉండాలి? సాక్షాత్తు శుద్ధ చైతన్యం రూపు కట్టుకొచ్చి ఉండాలి, అంతే! నవమ ప్రకృతి అంటే, మూల ప్రకృతే రూపు కట్టుకొస్తే మాత్రం అలా ఉంటుంది. అలాంటి పద్ధతుల్లో ఆమె వికాసం చెందుతూ, పెరుగుతూ ఉన్నది.

"నా తనూజకి అన్ని విధాలా అనురూపుడయిన వరుడు ఎచ్చట లభింపగలడో కదా?" ఇప్పుడిదొకటి చూడాలి. గుణపరంగా అనురూపం అయినటువంటి సంబంధం చూసుకోవాలి. అందుకనే కదా, సీతమ్మవారు చిన్నతనంలోనే శివ ధనుస్సుని అట్లా, ఎదో కిందకి బంతి వెళ్లిందని, అట్లా ఎడం చేత్తో ఎత్తేసి, కింద నుంచి బంతి తీసుకుంటే చూసి జనకుడికి గుండెలు బరువెక్కిపోతాయి. ఓరి బాబోయ్! ఆ శివ ధనుస్సుని ఎవరూ ఎత్తలేరు. ఒక్క మనిషి ఎత్తే పరిస్థితి లేదు. అలాంటిది, చిన్న పిల్ల ఎడం చేత్తో ఎత్తేసింది. ఎంత ప్రతిభ కలిగి ఉండాలి? అది కండలు ఉంటే ఎత్తగలిగినటువంటిది కాదు ఆ శివ ధనుస్సు. అంటే, బాగా gymnastics అవీ చేసి, కండలు పెంచుకుని నేనేత్తుతానని వచ్చినవాళ్ళంతా చాలా మంది ఉన్నారు. ఎత్తలేకపోయారు. ఎవరు ఎత్తగలరు? శివానుగ్రహం ఉంటేనే ఎత్తగలరు. రావణుడికి శివానుగ్రహం లేదా? ఉంది, కాని శివ సంకల్పం లేదు. అందుకని, శివ సంకల్పం ఎలా ఉన్నదో, ఆ విధంగానే ఈమెకు వరుడు లభిస్తాడు అన్న ఉద్దేశంతో మహాయోగి అయినటువంటి జనకుడు ఈ శివ ధనుస్సుని ఎవరయితే ఎక్కుపెడతారో, వారికే నా కుమార్తెనిచ్చి పెళ్లి చేస్తానని అంటాడు. అది ఏ లోకంలో వాళ్లయినా కావచ్చు. ఆ శివ ధనుస్సు తానుగా చేత్తో పట్టుకుని ఎత్తి దానికి అల్లే తాడు వెయ్యాలి. అలా అల్లే తాడు వేసేటటువంటి వాడు ఉంటే అలాంటి వాడికి ఇవ్వడం అంటే అర్థం ఏమిటంటే, అంత శివానుగ్రహం ఉన్న పురుషుని కోసం ప్రయత్నం అన్న మాట.

అంచేత, మన పిల్లకి ఎలాంటి గుణములు ఉన్నాయో, దానికి అనురూపంగా ఉన్న గుణములు ఉన్నవాడిని మనం తెచ్చుకుని ఇచ్చామనుకోండి, ఇస్తే ఆ దాంపత్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగిపోతుంది. ఈ రోజుల్లో అరుదులెండి. ఎందుకంటే, అసలు చూసే విధానమే వేరు. ఒకరికొకరు నచ్చడం అంటే, అసలు ఏం నచ్చిందో తెలీదు ఎవడికినీ. అసలు ఏం చూడాలో తెలియదు. ఏం చూస్తాడో? ఒడ్డూ, పొడవూ చూస్తాడు. ఈ బయట ప్రపంచం ఇచ్చేటటువంటి, విద్యలకి ఇచ్చేటటువంటి certificate లు చూసుకుంటారు. ఇకపైన ఆ రూపాయో, ఈ రూపాయో సంపాదించుకున్నది అది చూస్తారు. ఏమిటండీ, ఏం చూసి చేసుకున్నారంటే, అమ్మాయి Infosys అండీ... అయిపోతుంది. అంటే, అమ్మాయి infosys ఏమిటి? అమ్మాయి infosys అయితే అయిపోయిందా? మాములుగా మన వాళ్ళు పెళ్లి కుదుర్చుకున్న తర్వాత నేను అడుగుతూ ఉంటాను సరదాగా, ఏమిటి what are the parameters అని. వారి కుటుంబములు, వారి సంస్కారములు, వారి ఇంట్లో ఉండేటటువంటి ఆచార వ్యవహారాలు, ఆ పిల్ల గుణసంపద ఎవ్వరికీ అక్కర్లేదు. Physical form ఎలా ఉంది? Agreeable లా, non-agreeable లా? కదా! అమెరికాకి వెళ్తే పనికివస్తుందా? ఎందుకంటే, అక్కడ కూడా సంపాదించాలి కదా వాడితో పాటు. లేదు, దేశంలో ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్ళు, చన్నీళ్ళకి వేన్నీళ్ళు... మనవన్నీ చన్నీళ్ళే! ఆ అమ్మాయి వేన్నీళ్ళు పొయ్యాలందులో... అట్లా ఉందా? BE చదివిందా? BTech చదివిందా? ఇది కదా చూసుకునేది? ఆస్తి. ఇప్పుడు ఆస్తులు చూడడం లేదు లెండి. మరి అవి కూడా చూసుకునే వాళ్ళు ఉంటారు. ఎంత ఆస్తి ఉంటే, అది గుణసంపద అవ్వదు. ఎంత ఆస్తి ఉంటే, గుణసంపద లేని చోట ఆస్తి ఉన్న చోట మదం ఉంటుంది. మంచి మదించిన ఏనుగుని తెచ్చుకున్నాం అనుకోండి ఇంటికి, ఇంట్లో వాళ్ళందరిని తొక్కేస్తుంది అంతే పూర్తిగా కదా!

అంచేత, ఈ తండ్రికి చూడండి, పిల్లలు పెరుగుతూ ఉంటే, ఇంట్లో ఆడపిల్ల, తండ్రి మనస్సులో ఆలోచనలు పెరుగుతూ ఉంటాయి. వాడు తండ్రి అయితే. కాకపోతే చేసేదేమీ లేదు. వాడేదో గాడిదయ్యాడనుకోండి అది వేరే సంగతి. అంటే, పిల్ల పెరుగుతూ ఉంటే తండ్రి గుబులు పెరుగుతూ ఉంటుంది లోపల. ఎందుకని? తగిన వరుడిని తీసుకు రావాలి. పిల్ల ఎలా పెరుగుతుందో? అది కూడా చూసుకుంటూ ఉండాలి తల్లిదండ్రులు. ఏదో ఒక రోజున, "తల్లీ నీ పెళ్ళని అనుకుంటుంన్నాం" అంటే, "నువ్వు అనుకోటం ఏమిటి? నేను ఎప్పుడో నిర్ణయం చేసుకున్నా కదా" అని చెప్పకూడదు కదా! ఆ పరిస్థిది రాకూడదు కదా! ఎప్పుడొస్తుంది? నువ్వు అనుసరిస్తూ ఉండాలి పెరుగుతున్న పిల్లల్ని. అంటే, అనుసరించడం అంటే spying కాదు. ఆ అమ్మాయి భావాలు ఎలా ఉన్నాయి? దినచర్య ఎలా ఉంది? ఎలాంటి విషయాలయందు ఆసక్తి కలిగి ఉన్నది? ఇటువంటివన్నీ తండ్రి గమనిస్తూ ఉండాలి, తల్లి గమనిస్తూ ఉండాలి.

ఇప్పుడు ఈయనకి భయం పుట్టిందంటే, పుట్టదండీ? అశ్వపతి "నా తనూజకి అన్ని విధాలా అనురూపమైన వరుడు ఎచ్చట లభించగలడో కదా" అనుకున్నాడు. చాలా కష్టం. Highly qualified. అంటే, మన understanding కాదు qualified. గుణపరంగా, సౌందర్యపరంగా మూర్తీభవించినటువంటి స్త్రీ మూర్తిగా ఏర్పడుతున్న ఒక కన్యను, ఏ లోకంలోనూ తనతో సమానమైనటువంటి కన్య లేదట. అలాంటి వరుడంటే ఎలా ఉంటుంది? తపస్సు చేసి తాను పొందినటువంటి కుమార్తే కదా! అమ్మవారే స్వయంగా ఆశీర్వదించి ఇచ్చిన కన్య కదా,

అందుకని ఎలాంటి భర్త తీసుకు రావాలో తెలియక, ఆయనేం చెప్పాడో తెలుసా? ఎప్పుడూ, ఎక్కడా ఇలా ఎవరూ చెప్పింది లేదు తెలుసా! నువ్వే ఎన్నుకో తల్లీ అని చెప్పాడు. అంటే, మన పిల్ల మన కన్నా తెలివిదయ్యిందనుకోండి, అదే మంచిది కదా! తండ్రి కన్నా మించిన చైతన్యవంతురాలైన కూతురు ఉందనుకోండి, మనకంత తెలివితేటలు లేవనుకోండి. మన తెలివితేటలు మనకి తెలుస్తాయి కదా! ఎందుకంటే, ఆవిడ కన్నా ఒక ఇరవై, ముప్పై ఏళ్ళు ahead కదా మనం జీవితంలో. మనకే మాత్రం తెలివితేటలున్నాయో మనకి తెలుస్తాయి. మన పిల్లకి అంతకన్నా తెలివితేటలు ఉన్నాయనుకోండి, Your choice is my choice అని చెప్పగలిగేటటువంటి తండ్రి ఉంటాడా? ఉండొచ్చంటుంది భారతం. ఇప్పుడు మనం అంతా regressive race అనుకుంటాం కదా! ఇంత కన్నా progressive race లేదు. చాలా కథల్లో చూస్తారు. Most advanced thinking. స్త్రీ పురుషునితో సమానమా? ఇంకా ఎక్కువైనటువంటి, మేధస్సు కలిగినటువంటి స్త్రీలు పురుషునికి మార్గం చూపించినటువంటి కథలు ఎన్ని ఉన్నాయో. భార్య, భర్తకి ఉద్ధరింపు మార్గాన్ని చూపించినది, జయము కలిగించినటువంటి కథలు ఎన్ని ఉన్నాయో. అంచేత, మనకి womens liberation అనేటటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు బొత్తిగా అక్కర్లేదు అర్థం చేసుకుంటే. అర్థం చేసుకోకపోతే అన్నీ ఒకటే.

అంచేత, ఆ సమయంలో బాధ పడుతున్నాడు. "ఆ సమయంలో సాల్వపతి ద్యుమత్సేనుడి కుమారుడు సత్యవంతుడు అత్యంత రూపశాలి అని, మహనీయ గుణవంతుడని ఆకర్ణించిన సావిత్రి అతని యెడల ఎంతో మక్కువ కలిగి ఉన్నది. కానీ వల్లమాలిన సిగ్గు వల్ల ఆమె ఆ విషయం జననీజనులకు ఎరిగించలేదు." వింటూ ఉంటారు కదండి. వింటూ ఉండడం చేత ఈవిడికి ఈ విధంగా అంతఃపురంలో సత్యవంతుడి గురుంచి తెలిసింది. అది మనస్సులో ఆవిడ సత్యవంతుడి గురించి విని ఉన్నది. ఆ గుణగణములకు ఆకర్షించబడినది. రూపసంపద ఇంకా అవన్నీ ఏమీ తెలియవు మనకి. అంచేత, బావుంది, ఈ రాజకుమారుడు బావున్నాడు. ఎలాంటి రాజకుమారుడు? రాజ్యం లేదు, అడువుల్లో ఉంటున్నాడు. రోజూ వెళ్లి చెట్టు కొట్టి, కట్టెలు తయారుచేసి, ఇంటికి సమిధలు ఏరుకొచ్చి పుల్లలు వంటకి, అగ్నిహోత్రానికి... ఇవన్నీ రోజూ పోగేసుకురావడానికి అడవిలోకి వెళ్లి వచ్చేటటువంటి ఒక క్షత్రియ కుమారుడన్నమాట. అలాంటి వాడియందు తాను ఆకర్షితురాలై ఉన్నది అండి. రేపు మనం కథ కొనసాగిద్దాం.

––– స్వస్తి

# సావిత్రోపాఖ్యానము

## July 21, 2013 ఉదయం – ప్రవచనం #3

సోదరబృందానికి హృదయ పూర్వకమైనటువంటి నమస్కారములు. పరమ పవిత్రమైనటువంటి సతీ సావిత్రి ఉపాఖ్యానాన్ని మనం వివరించుకుంటున్నాము. అశ్వపతి అనేటటువంటి మహారాజుకి గాయత్రి తపః ఫలితంగా సావిత్రీ మాతయే 'సావిత్రి' అనే కన్యగా అశ్వపతికి జన్మించిందని నిన్న తెలుసుకోవడం జరిగింది. అశ్వపతి అతడి ప్రాణములకు అధిపతి అని, పంచ ప్రాణములు తన అధీనంలో ఉంచుకోగలిగినటువంటి ప్రజ్ఞావంతుడని, అతనుండేటటువంటి రాజ్యం మద్ర రాజ్యం, మద్ర దేశం, మద్ర దేశమంటే ఆనందానికి నిలయమని, మద్ర అంటే ఆనందమని తెలుసుకోవడం జరిగింది. హృదయమునందు చేరి పంచ ప్రాణములను చక్కగా తన అధీనమునందు ఉంచుకున్న వ్యక్తిని 'అశ్వపతి' అని పిలుస్తారు. ప్రాణమునందు... హృదయమునందు ప్రాణములు కర్కాటక రాశికి సంబంధించినటువంటిది. కర్కాటక రాశిలో, లేక ఆషాఢ మాస ప్రజ్ఞ సంవత్సర పురుషుడు హృదయమునందు వసించేటటువంటి సమయం. అంచేత, ప్రాణముల యొక్క తీరు తెన్నులన్నీ కూడా ఆషాఢ మాసానికి సంబంధించే ఉంటాయి.

రెండు ప్రాణములు సూక్ష్మంగాను, ఊర్ధ్వంగాను ఉంటే, రెండు ప్రాణములు బహిర్గతంగానూ, ప్రస్ఫుటంగానూ వ్యక్తమై ప్రాణ వ్యాపారములను నిర్వరిస్తున్నట్టుగా గోచరిస్తూ ఉంటే, లోపల ఉన్నటువంటి రెండు సూక్ష్మ ప్రాణములకు, బయట మనకు గోచరిస్తున్న రెండు ప్రాణములకు అనుసంధానంగా ఒక ప్రాణం ఉంటుంది. ఇలా ఐదు ప్రాణములు ఉన్నాయి మనకి. మనందరికీ బాగా తెలిసినటువంటిది ఉచ్ఛ్వాస, నిశ్వాస. దీని వలన దేహ సంబంధం ఏర్పడి ఉంటుంది. దేహ సంబంధానికి పంచ ప్రాణాలు ముఖ్యమే. అందులో మనకి తెలిసినవి రెండు. ఎందుకంటే, పీల్చి వదులుతున్నప్పుడు సామాన్యంగా అందరికీ తెలుస్తూ ఉంటుంది. గుర్తు చేస్తే నిజమే కదా అనిపిస్తుంది. గుర్తు చెయ్యకపోతే అది మనలో పని చేస్తున్నట్టుగా కూడా మనం అంత గుర్తించం. మనలో అనునిత్యం పని చేస్తూ, మనలను ఈ విధంగా నిలబెట్టి, ఈ శరీరమందు జీవుడిగా మనం నిర్వర్తించుకో వలసినటువంటి కార్యములను నిర్వర్తించుకుంటూ పరిణితి చెందడానికి ప్రాణముల యొక్క అవసరం చాలా ఉన్నది. ఆ ప్రాణ స్పందనమే లేకపోతే కార్యక్రమమే లేదు జీవుడికి. అందులో రెండు ప్రాణములు మనకి తెలిసినవి – ఉచ్ఛ్వాస, నిశ్వాస. ఈ రెండు ప్రాణములు చక్కగా మనం సమన్వయించుకోగలిగితే, లోపల ఉన్నటువంటి రెండు ప్రాణములతో అనుసంధానం చేసి ఒక ప్రాణమున్నది. దానిని సమాన ప్రాణం అంటారు.

అపాన వాయువు శరీరంలో కింది భాగాన్నంతా కూడా పరిపాలిస్తూ ఉంటే, ఉదర వితానానికి కింది భాగం అంతా అపాన వాయువు పరిపాలిస్తూ ఉంటుంది. ప్రాణ వాయువు నాశా రంధ్రం పుటము నుండి, ముక్కు రంధ్రాల నుంచి, ఈ భ్రూమధ్యం వరకూ వెళ్లి, అక్కడనుంచి శ్వాస నాళం ద్వారా లోపలికి వెళ్లి, ఊపిరితిత్తులంతా కూడా

ప్రాణాలను నింపుతూ ఉంటుంది. ప్రాణ వాయువు ప్రాణాన్ని నింపుతూ ఉంటే, ఆ ప్రాణాన్ని బాగా ఆకలింపు చేసుకుని, దేహంలో ఉండేటటువంటి అపానము, అంటే మలినమైనటువంటి విషయములన్నిటినీ కూడా అపాన వాయువు బయటకి నెట్టేస్తూ ఉంటుంది. ఇట్లా ప్రాణాలను పొందుతూ... అంటే, మంచి నీరు ఇంట్లోకి తెచ్చుకుంటూ, మురికి నీరు వదిలేసినట్టుగా. మంచి నీరు ఇంట్లోకి రాకపోయినా ఇబ్బందే, మురికి నీరు ఇంట్లోంచి వెళ్ళకపోయినా ఇబ్బందే కదా! అంటే, మనకి మంచి నీరు సరఫరా ఏ విధంగా సవ్యంగా ఇంట్లోకి రావడానికి ఎంత కృషి చేస్తామో, ఇంట్లో మురికి నీరు బయటకు వెళ్ళపోడానికి అంత ప్రయత్నమూ చెయ్యాలి. ఆ రెండూ సరిసమానంగా ఉంటేనే ఆ ఇంట్లో ఆరోగ్యం ఉండేటటువంటి అవకాశం ఉంది.

అంచేత, మనకి ప్రాణం అనంతమైనటటువంటి ప్రాణమునుండి మనలోకి ప్రాణం అలా ఆవాహనం చేసుకుంటూ ఉంటాము. ఆ ప్రాణం మనలోకి ప్రాణ వాయువు, అంటే ఆక్సిజన్ అంటూ ఉంటాము కదా, అది బాగా నింపుతుంది ఊపిరితిత్తుల నిండా. మనం ఒక్క పావలా వంతు మాత్రమే మనకున్న శక్తిలో ఈ ప్రాణాన్ని అందుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటామట. మన ఊపిరితిత్తులు పీల్చ గలిగినటువంటి గాలిలో మనం పావలాయే వాడుతూ ఉంటాం, ముప్పావలా వాడం. బాగా వాడితే, ముప్పావలా కూడా, ఇన్ని రోగాలు వచ్చేటటువంటి అవకాశం ఉండదు. ఇప్పుడు నాకు చూడండి మాటిమాటికి జలుబు చేస్తూ ఉంటుంది, దగ్గుతూ ఉంటాను. మైకు పెట్టుకుని దగ్గుతూ ఉంటే మరీ ఘోరం కదా! బాగా పని చెయ్యించడం లేదు దాన్ని. బాగా పని చెయ్యించాలి. ఎంత బాగా గాలి పీలిస్తే, అంత బాగాను లోపలి నుంచి గాలి వదలబడుతుంది. పీల్చడం బట్టీ వదలడం ఉంటుంది. పీల్చడమే బాగుండకపోతే వదలడమూ బాగుండదు. కాబట్టి, లోపల ఈ అగ్ని కార్యం వల్ల, అంటే మనసుతో చేసే పనంతా అగ్ని కార్యమే. ప్రాణ కార్యం కూడా అగ్ని కార్యమే. లోపల మనం ఆహారం తీసుకుంటున్నా అది అగ్ని కార్యమే. ఇంత అగ్ని కార్యము జరుగుతున్నప్పుడు లోపల మలినాలు ఏర్పడుతూ ఉంటాయి. అంటే, వంట వండితే గిన్నెకి ఎలా మసి తప్పదో, అలాగే ప్రతి నిత్యం మనం శ్వాస పీల్చడం వలన, మనం చేసేటటువంటి ఆలోచనల వలన, మనం తీసుకునేటటువంటి ఆహారం వలన, వీటన్నీ కూడా మనలో పుట్టించే వేడి వలన శరీరంలో మలినాలు పుడుతూ ఉంటాయి. ప్రతిసారీ వంట చేసేటప్పుడు పాత్ర ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో, అలాగే ప్రతి నిత్యం ఈ కార్యక్రమం చేసేటప్పుడు మనలో ఉండేటటువంటి మలినాలన్నీ కూడా తీసేసుకుంటూ ఉండాలి. మలినాలని పారద్రోలడానికి అపాన వాయువు చాలా ముఖ్యం. లేకపోతే, అక్కడనుంచే అన్ని జబ్బులూ పుట్టుకొస్తాయి.

అది ఒకటి ఉండగా, అపాన వాయువే శరీరంతో బంధం వేసి వుంచుతుంది. బొడ్డుకి కొంచెం కింది భాగంలో అపాన వాయువు జీవుడిని పట్టి ఉంచడానికి అక్కడ ముడి ఒకటి ఉంటుంది. సినిమాలు చూస్తూ ఉంటారు మీరందరూ, మనకన్నా తూర్పు దేశాల్లో, ఈ martial arts నేర్పేటటువంటి వారు, బొడ్డు కింద ఏ ప్రాంతంలో కొడితే జీవుడు వెళ్ళిపోతాడో దేహంలోంచి, తెలిసినటువంటి విద్యలు ఉన్నాయి. అలా అంటే చాలు అక్కడ, వెళ్ళిపోతుంది! అంటే, అంత భయంకరంగా చంపవలసినటువంటి అవసరం ఉండదు ప్రాణం తియ్యడానికి. ఎక్కడ ప్రాణం ముడి ఉందో ఆ ముడి విడిపోతుంది. యోగంలో ఒక యోగి అక్కడ దూముడి వేసుకుని ఉంటాడు. అది గొప్ప విషయం. అక్కడ

దూముడి వేసుకుని, వచ్చిన పని అయిపోయిందనుకుంటే, దూముడి ఇలా తేసేస్తే వచ్చేసినట్టు, శరీరానికి తనకి సంబంధం పోతుంది. అంటే, అపాన వాయువుని శరీరానికి అప్పచెప్పేసి, తాను ఉదాన వాయువు ఆధారంగా ఊర్ధ్వగతి చెంది బయటకొచ్చేస్తాడు. ఇట్లా మనకి, అపాన వాయువుకి శరీరంతో సంబంధం.

ఈ శరీరాన్ని నిలబెట్టడానికి ప్రాణ వాయువు ద్వారా చాలా ప్రాణాన్ని అందుకుంటాం. ప్రాణాన్ని రకరకాలుగా అందకుంటూ ఉంటాం. గాలి ద్వారా అందుకోవచ్చు బాగా. సూర్యరశ్మి ద్వారా... ఉదయమూ, సాయంత్రమూ కొంత సమయం పాటు భూమి మీదకి సూర్యరశ్మి బంగారు కాంతితో ప్రసరిస్తూ ఉంటుంది. అది పొద్దున్నా, సాయంత్రమే ఉంటాయి ఆ కిరణాలు. ఆ సూర్యరశ్మి ద్వారా అందుకోవచ్చు. గాలి ద్వారా ప్రాణాన్ని అందుకోవచ్చు. స్వచ్ఛమైనటువంటి పారుతున్నటువంటి నీరు ద్వారా... bottled water ద్వారా కాదు. జుబ్బు చెయ్యకుండా పనికొస్తుంది తప్ప మనం తాగే సీసా నీళ్ళు, అందులో ప్రాణం తక్కువ. ప్రాణం ఎందులో ఎక్కువ ఉంటుందంటే, ప్రవహించే నీటియందు ఉంటుంది. ప్రవహించే నీటియందు ప్రాణం మన టాంకుల్లోకి వచ్చేసరికి తగ్గిపోతుంది దాంట్లో ప్రాణం. అక్కడినుంచి మన బిందెల్లోకి వచ్చేసరికి మరింత తగ్గిపోతుంది. అక్కడ నుంచి మన గ్లాసు కొచ్చేసరికి మరింత తగ్గిపోతుంది. Stagnated waters కి flowing waters కి ఆ difference, ప్రవహించే నీటికి, పోగుచేసుకునే నీటికి. అందుకనే, బావిలో నీరు కూడా ప్రవహించే నీరే. ఎంచేతంటే, ఏ పూటకాపూట మీరు నీరు వాడేస్తూ ఉంటే స్నానానికి, పానానికి, తోటకి, అన్నిటికి ఇంట్లో వాటికి వాడేస్తే, మళ్ళీ ఊట నీరు వస్తూ ఉంటుంది అందులోకి. అవన్నీ పూర్వకాలం మనకి ఉండేటటువంటి ఒక సౌకర్యాలు. అవన్నీ ఇప్పుడు అసౌకర్యాలు చేసుకోవడం వల్ల... ఏవో రకరకాలుగా మనం ఇప్పుడు కొత్తగా నీటిలో కొంత ఆక్సిజన్ చొప్పించి ఇచ్చేటట్టుగా ఒకటి తయారుచేస్తున్నారు. ఏవో రకరకాల బాధలు.

ఏది ఏమయినప్పటికీ, నీటిలో ప్రాణం ఉంది. గాలి, నీరు, సూర్యరశ్మి. సూర్యరశ్మి ఉదయం 7:30 గంటల వరకూ, అంటే గంటన్నర సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయానికి గంటన్నర ముందు, ఆ సమయంలో ప్రాణం చాలా ఉంటుంది. మనబోటి దేశాల్లో సూర్యుడు చాలా ఎక్కువ ప్రాణాన్ని ఇస్తాడు. ఐరోపా ఖండం, అలాంటి ప్రదేశాలు... దక్షిణ అమెరికాలు, అంటే tropics అంటాం. కర్కాటక రేఖ, మకర రేఖ, భూమధ్య రేఖ, ఆ ప్రాంతంలో, అంటే భూమధ్య రేఖకి పైన, క్రిందుగా ఉండేటటువంటి ప్రాంతాలని tropical countries అంటారు. అంటే, అక్కడ సమశీతోష్ణ స్థితి ఉంటుంది. చిన్నప్పుడు చదువుకున్నాం సమశీతోష్ణ స్థితి అని. అంటే ఏమిటంటే, మరీ భయంకరంగా చలి ఉండదు, మరీ భయంకరంగా ఎండ ఉండదు. అన్నీ సమంగా ఉంటాయి. ఎండా, వానా, గాలి, వర్షం, అన్నీ సమంగా ఉంటాయి. ఆరు ఋతువులు ఉంటాయి. ఈ ఆరు ఋతువులూ ఎక్కడ స్పష్టంగా ఉంటాయో అక్కడ ప్రాణం చాలా ఏర్పడి ఉంటుందని చెప్పి మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అందుకనే, ఆరు ఋతువు లుండేటటువంటి ప్రాంతం ఏమయినా ఉంటే, అది ప్రాణ శక్తితో కూడి ఉంటుంది. అందుచేతనే అక్కడ పంటలెక్కువ. ఇప్పుడు మన దేశంలో పండినంత వైవిధ్యంగా కూరగాయలు గానీ, ఫలములు గానీ ఇతర దేశాల్లో ఉండవు. ఇన్ని రకాల కూరలు, ఇన్ని రకాల ధాన్యములు, ఇన్ని రకముల పప్పులు, ఇన్ని రకముల ఫలములు ఇదే విధంగా ఉండేటటువంటి భూమి, భూమి చుట్టూ

ఈ belt ఉంటుందే, ఏది కర్కాటక రేఖ నుంచి మకర రేఖ వరకూ, ఆ belt లోనే ఇవన్నీ పండుతాయి. మిగతా వాళ్ళందరూ ఇక్కడ నుంచి తెచ్చుకోవలసిందే. ఎంత ధనవంతుడయినా ఈ ప్రాంతాల నుంచి పళ్ళు, కూరలు, పప్పులు, దినుసులు, అన్నీ తెచ్చుకోవాలి. ఐరోపా ఖండం అన్నీ ఇలాంటి ప్రాంతాల నుంచి తెచ్చుకుని తింటూ ఉంటాయి. ఎందుకని ఇది చెప్తున్నానంటే, సమశీతోష్ణ స్థితి ఉన్న చోట సూర్యకాంతి ప్రభావం యొక్క ప్రభావం చక్కని ప్రాణ శక్తి కలిగిస్తుంది. మిగతా వారు ప్రాణం కోసం ఎక్కువ ప్రయత్నం చెయ్యాలి.

కాబట్టి, ఇలాంటి అనంతమైన ప్రాణం మన గోళం చుట్టూ ఏర్పడి, మనకి ప్రాణ వాయువు ద్వారా అందుతూ ఉంటే, దాన్నందుకుని అపాన వాయువు ద్వారా మనలో ప్రతి నిత్యం ఏర్పడుతున్న మలినాలని పారద్రోలుతూ ఉండాలి. దానికి బాగా గాలి పీల్చాలి. ఇలా బాగా గాలి పీల్చి, వదిలి, గాలి పీల్చి, వదిలి, గాలి పీల్చి, వదిలి అనేటటువంటి ప్రక్రియ మనసుతో, అంటే మనస్సులో ఉంటుంది మన ప్రజ్ఞ మానవుడికి. బుద్ధి కక్ష్యలోనూ ఉండొచ్చు, తానూ–నేను అనేటటువంటి కక్ష్యలోనూ ఉండొచ్చు. లేదూ, మనసు కన్నా ఇంకా దిగువ ప్రాంతాల్లో ఉండేటటువంటి ఇంద్రియ కక్ష్యలోనూ ఉండొచ్చు. మరీ దిగ జారిపోతే భౌతిక కక్ష్యలో ఉండొచ్చు. ఇవన్నీ జీవ ప్రజ్ఞ ఉండగలినటువంటి స్థానములు, లేక కోశములు, లేక లోకములు. కేవలం భౌతికమే, ఇంక ఇంతకన్నా ఏమీ తెలియదు! రెండవది, ఇంద్రియములు, కోరికలూ, అదొక కక్ష్య. మూడవది, మనో భావములు. నాలగవది, అవీ భావములే గానీ, వెలుగు భావములు, దివ్యమైనటువంటి భావములు – బుద్ధి కక్ష్య. ఐదవది, ఆనంద కక్ష్య. తనకు తానుగా ఆనందించడం, ఆత్మయందు రమిస్తూ ఉండడం. ఆటుపైన, ఆరవది, తానుగా ఉండడం. ఏడవది, దేవుడితో కూడి ఉండడం. వీటన్నటిలోనూ దేవుడితో కూడి ఉండొచ్చు. దైవము అంటే అంతటా వ్యాపించినటువంటి తత్వము. ఆ తత్వంతో ముడి పడి, ఈ ఆరు కోశములలో ఏ కోశములోనైనా ఉండొచ్చు.

ఆ అన్ని కోశాల్లో ప్రయాణం చెయ్యాలంటే, ఈ ప్రాణము–అపానము ఒక్కదానితో పని జరగదు. అంచేత, ప్రాణము, అపానము అనేటటువంటి వాయువులకు సమత్వం కలిపిస్తే, సమాన వాయువు అని చెప్పి హృదయమునందు అది స్పందనంగా ఉంటుంది. ఆ స్పందన వాయువుని మనం మనసుతో అక్కడికి వెళ్లి, దాన్ని ఈ విధంగా గాలి పీలుస్తుంటే మనో ప్రజ్ఞ గాలి అందుకుని లోపలికి ఏ విధంగా వెళ్తుందో, మళ్ళీ నిశ్వాస ద్వారా ఏ విధంగా బయటకు వస్తూ ఉంటుందో తెలుస్తుంది మనసు శ్వాస మీద ఉంచితే. మనసు శ్వాస మీద ఉంచకపోతే, శ్వాస జరుగుతూ ఉంటుంది గానీ నీకు సంబంధం ఉండదు, శరీరం పని చేస్తూ ఉంటుంది. నీవే ఒక భాగం ప్రాణంగాను, ఒక భాగం ప్రజ్ఞగాను ఏర్పడి ఉన్నావు. ఒక భాగం ప్రాణంగాను, ఒక భాగం ప్రజ్ఞగాను ఉన్నాడు జీవుడు. అందుకనే, జీవుడిని స్పందనాత్మకుడు అంటారు. స్పందనాత్మక చైతన్యము అంటారు. అంచేత, నువ్వు రెండు భాగాలుగా ఉంటే, ఏ భాగానికి ఆ భాగంగా నీ యొక్క పరిపూర్ణ స్వరూపం, సమగ్ర రూపం నీకు తెలియుదు. అంచేత, ఈ లోపల ఉండేటటువంటి ప్రాణాలని, బయట ఉండేటటువంటి ప్రాణాలని, రెండిటిని కలిపేటటువంటిది సమాన ప్రాణం. అది హృదయమునందు ఉంటుంది. ఆ హృదయ మందుండేటటువంటి ఆ ప్రాణం మిమ్మల్ని చేరుకుంటే, ఉచ్ఛ్వాస

నిశ్వాసలు మనసు పెట్టి బాగా చేస్తూ ఉంటే, మనం స్పందనం అనేటటువంటి ప్రజ్ఞయందు కాసేపు ఉండడానికి వీలు పడుతుంది.

అలా ఉంటే, ఆ స్పందనమునందు ఉండేటటువంటి సమయం పెరుగుతూ ఉంటే, అక్కడనుంచి ఉదాన వాయువని ఒకటి లోపల పని చేస్తుంది. అది ఊర్ధ్వముఖంగా నీ ప్రజ్ఞని తీసుకెళ్ళగలదు. అంటే, విమానం ఎక్కినట్టన్నమాట. విమానం ఎక్కినట్టు హృదయం నుంచి పై లోకాల్లోకి, పై ప్రజ్ఞలోకి తీసుకెళ్తుంది. ఉదాన వాయువు ఆధారంగానే... మనం శరీరంలో దగ్గాలంటే ఉదాన వాయువు బావుండాలి. తుమ్ము వచ్చిందంటే ఉదాన వాయువు వల్లే తుమ్ముతావు. అది ఉదాన వాయవు. ఆ ఉదాన వాయువు, ఈ సమాన వాయువు దగ్గరకు చేరిన ప్రజ్ఞను ఊర్ధ్వముఖం పట్టిస్తుంది. పట్టిస్తే, అది ఎంతవరకూ తీసుకెళ్తుందంటే, నీలో ఉండేటటువంటి ఆకాశాన్ని దాటించి, ఆపైన ఉండేటటువంటి వెలుగులో నిన్ను స్థిర పరుస్తుంది. అంటే, పంచ భూతములతో చెయ్యబడినటువంటి ప్రపంచాన్ని దాటించి, అవతల ఉండేటటువంటి లోకంలోకి నిన్ను తీసుకెళ్తుంది. అక్కడ మనకి మొత్తం వ్యాప్తి చెందినటువంటి వాయువొకటి ఉన్నది. దాన్ని వ్యాన వాయువు అంటారు. వ్యానము అంటే పరిపూర్ణంగా వ్యాప్తి చెందినటువంటిది అని అర్థం. మన శరీరంలో అణువణువులోనూ వ్యాప్తి చెంది ఉంటుంది, మన బయటంతా వ్యాప్తి చెంది ఉంటుంది. అంచేత, ఆ ప్రాణంతో నీకు అనుబంధాన్ని కలిగిస్తుంది. ఇవన్నీ కర్కాటక రాశికి సంబంధించినటువంటి ప్రజ్ఞలు.

ప్రాణము కర్కాటక రాశి సంబంధం. అందుచేత, జీవుడు సంవత్సర పురుషుడు, కర్కాటక రాశి చేరేటప్పటికి ప్రాణం ఆధారంగా దేహ ప్రవేశం చేస్తాడు, గృహప్రవేశం చేసినట్టుగా. ఎప్పుడు జీవుడు దేహం తీసుకుంటున్నా, ఆ కార్యక్రమం అంతా కూడా కర్కాటక రాశి కార్యక్రమం. అంచేత, వెలుగు స్వయం ప్రకాశకుడైన ఆత్మ, ప్రపంచంలో ఉండేటటువంటి ఈ ఐదు భూతములతో చెయ్యబడినటువంటిది. అంటే, ఆకాశంలోకి దిగితే దాని కాంతి అంతకుముందు కాంతి కన్నా తగ్గుతుంది. వాయువులోకి, అగ్నిలోకి, జలంలోకి, పృథ్విలోకి, ఇలా దిగుతున్న కొద్దీ, ఒక్కొక్క పొరలోకీ జీవాత్మ దిగివస్తుంటే, దాని కాంతి అంత అంతగా తగ్గిపోతూ ఉంటుంది. అంటే, ఇక్కడ మనకో bulb ఉందనుకోండి, దాని మీద ఒక ఉల్లిపొర వేసి, మరొక పొర వేసి, మరొక పొర వేసి, మరొక పొర వేసి, మరొక పొర వేసామనుకోండి చుట్టూ. ఐదు పొరలు వేసి, ఆరో పొరగా నీ మనసొకటి ఏర్పరిచి, ఇన్ని పొరలు వేసి దాన్ని కప్పేస్తే, అక్కడ అసలు ఉందని కూడా తెలియదు కదా! ఆ bulb వెలుగుతున్నా తెలియదు. ఎందుకని? దాని చుట్టూ అన్ని పొరలు ఏర్పరిచేసాము. ఎలా ఉంటుందంటే పనస తొనల్లే ఉంటుంది. లోపల అది మృదువుగాను, కాంతివంతంగానూ ఉంటుంది. బయట చూడండి ఎలా ఉంటుంది పనసకాయ? ముట్టుకుంటే గుచ్చుకునేటట్టుగా ఉంటుంది.

అట్లా మనకి ఇన్ని పొరలు ఏర్పడిపోయిన తర్వాత, లోపల ఉండేటటువంటి జీవుని యొక్క ప్రకాశం తగ్గిపోతూ ఉంటుంది. అంచేత, జీవుడు దేహాన్ని ధారణ చేసినప్పుడు అతనికేం జరుగుతుందంటే, ఈ పదార్థము ఆవరించడం చేత కొంత అతను వెలుగు కోల్పోతూ ఉంటాడు. కాబట్టి ఏం చెప్పారంటే, గుర్తుపెట్టుకో నువ్వు ఈ పొరల్లోకి దిగి

వచ్చినప్పుడు, ఈ పొరలే నేను అనిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు పొద్దున్నే లేచి ప్రతి వాళ్ళం స్నానం చేసి అద్దం దగ్గర నిలబడి రకరకాలుగా మన్ని మనం అలంకారం చేసుకుంటూ ఉంటాం కదా! అప్పుడు ఈ శరీరమే నేను అనుకుంటాం కదా! అంతేకాదుగా, దానికి కట్టిన బట్ట కూడా అదే నేను అనుకుంటుంది. అంటే, మన బట్టలందరూ చూసారా అన్నట్టుగా అనిపిస్తూ ఉంటుంది. మన శరీరమే ఒక వస్త్రం కదా! ఇంకా లోపలికెళ్తే, ఇంకా చాలా వస్త్రాలు ఉన్నాయి. భావాలు కూడా వస్త్రాలే. ఇన్ని వస్త్రాలు వెనకుండేటటువంటి జీవుడినేలా చూడగలుగుతావు నువ్వు? అద్దంలో చూసుకున్నప్పుడు నీ కన్నులు నువ్వు చూసుకుంటే, ఆ కన్నుల్లో కాంతి నేను అని తెలుస్తుంది. కనులు చూసుకోవాలి ముందు. కనులు చూసి నేను, అతడు నేను. ఏది నేను? కన్నులు కాదు. కన్నుల్లోంచి ప్రసరిస్తున్నటువంటి కాంతి నేను. ఆ నేను చుట్టూ చాలా పొరలేర్పడ్డాయి. అంచేత, ఈ పొరలన్నీ, ఈ పంచ కోశాల్ని సవ్యంగా నిర్వర్తించడానికి పంచ ప్రాణాలేర్పరిచారు. ఈ పంచ ప్రాణాలు కారణంగా పంచ ఇంద్రియాలు, పంచ కోశములు చక్కగా నిర్వర్తింపబడతాయి.

అంచేత, ఇది ఈ వ్యూహంలోకి జీవుడు దిగి వచ్చేటటువంటి సందర్భం కర్కాటక రాశి, ఆషాఢ మాసం. అందులోకి వస్తే మన స్వస్వరూపం మనం కోల్పోతాము. అంటే, మన్ని మర్చిపోతాము. మర్చిపోతామేమో అన్న భయం చేత ఏం చేసారంటే, సృష్టికర్త మర్చిపోకుండా ఉండడానికి అక్కడ ఒక ప్రక్రియ పెట్టాడు. ఏమిటంటే, హృదయంలోనేగా స్పందన? స్పందన, సో హం, సో హం, సో హం, సో హం అని వినిపిస్తూ ఉంటుంది. సోహం అంటే అర్థం "అతడే నేను" అని. అంటే, ఏ తత్వమయితే ప్రపంచం అంతా వ్యాప్తి చెంది ఉందో, అదే నేనుగా ఇందులో ఉన్నానని తెలిసి ఉండాలి. ఇది నే ననుకోకూడదు. అలలో ప్రవేశించిన సముద్రం అలగా గోచరిస్తున్నప్పటికీ సముద్రమే కదా! అలాగే, ఈ శరీరంలోకి ప్రవేశించినటువంటి మనం, మనం ఇది కాదు, మనం అదే. ఏదీ? అంతటా వ్యాపించినటువంటి విశ్వవ్యాప్తమైనటువంటి ప్రజ్ఞ యొక్క అంశగా ఇందులోకి ప్రవేశించాము.

అంటే, గోదావరి ఒడ్డున మన పుష్కర భవనం కట్టుకున్నాం కదా! అక్కడ నుంచి, గొట్టం పెట్టుకుని మన పుష్కర భవనంలోకి నీళ్ళు తెచ్చుకున్నాం అనుకోండి. ఆ నీళ్ళు మనవవుతాయా? గోదావరి నీళ్ళే కదా! అంటే, ఉదాహరణ చెప్పడానికి హైదరాబాదు, విశాఖపట్నం పనికి రావు. అందుకని, రాజమండ్రి తీసుకోవాలి, లేకపోతే బెజవాడ తీసుకోవాలి కదా! మనకేమో, మూసీనది మూసేసాం. మన చేతలవల్లే నదులు ఎండిపోతూ ఉంటాయి. సరే, విశాఖపట్నం ఉప్పు నీరు తప్ప మంచి నీరు ఎక్కడినుంచయినా తెచ్చుకోవాలి. కాబట్టి, విజయవాడ, రాజమండ్రి చెప్పుకోవాలి. వాళ్ళు తాగే నీరు, కృష్ణలో నీరే కదా విజయవాడ అంతా! కృష్ణ నీరు అని గుర్తు ఉండదు కదా! మన ఇంట్లో ఉండే 'మన' పంపు, 'మన' టాంకు, 'మన' storage టాంకు, 'మన' aqua guard! ఇక 'మన' దయిపోతూ ఉంటుంది కదా! అది కృష్ణ నీరని గుర్తు ఉంటుందా తాగుతున్నప్పుడు? కృష్ణకి దణ్ణం పెట్టుకుంటావా? తల్లీ, నీ వల్లే కదా మేము ఈ నీళ్ళు తాగుతున్నాం అని ఎవరికి గుర్తు ఉంటుంది? ఎవరికీ ఉండదు. అలాగే గోదావరి నీళ్ళు. నాబోటి వాడు పక్కన గోదావరి ఉంటే ఏం చేస్తారంటే, వెళ్లి గోదావరిలో స్నానం చేసారా అంటే, చేసానని చెప్తారు. ఏమిటంటే, గోదావరి నీళ్ళే కదా మన bathroom లోకి వస్తున్నాయి! అక్కడ shower కింద చేసామనుకోండి, ఆ నీళ్ళే ఇక్కడ చేసాం కదా! కానీ, తేడా ఉంది. గోదావరి నీళ్ళే, కానీ గోదావరిలో ఉన్న ప్రవాహం దీనిలో ఉండదు. ఎందుకంటే,

దాన్ని తెచ్చి నువ్వు టాంకులో పెట్టి, ఆ టాంకులోంచి నీ bathroom లో shower లోకి వచ్చేప్పటికి, ఆ ప్రవాహం పోతుంది కదా! So, ఏది ఏమయినప్పటికీ, గోదావరిలో నీళ్ళే కదా! గోదావరి నీళ్లు తాగితే కొంచెం వేడి చేస్తుంది. తెలుసా మీకు? గోదావరి నీళ్ళలో వేడి ఎక్కువ. అందుకనే, అక్కడ ఆవకాయలు అవీ బాగా తింటూ ఉంటారు. కృష్ణ నీటికి అరుగుదల ఎక్కువ. మీరు మూడు రోజులు విజయవాడలో ఉంటే మీకు ఏ విధమైన అజీర్తి ఉన్నా పోతుంది. అలాంటి నీళ్ళవి. నల్ల రేగడి నేల మించి పారే నీరది, కృష్ణ నీరు. హైదరాబాదు వాళ్ళు అదృష్టవంతులు. ఎందుకంటే, ఇక్కడికి కృష్ణా జలాలు వస్తూ ఉంటాయి. మా విశాఖపట్నం అసలే ఎర్ర మట్టి, అరుగుదల తక్కువ. గోదావరి నీళ్ళు తెచ్చుకుని వేడి చేయించుకుంటూ ఉంటాము. ఇట్లా ఉంటాయి. మనకి తెలియవు! ఇది ఇలా ఉండగా, మనం అంతా ఇప్పుడు mineral water తాగుతున్నాం, కాబట్టి ఇబ్బంది లేదు మనకి! ప్రతీ వాడు mineral water bottle, అది నీళ్ళే కాదు. మామూలుగా పరమ గురువుల మార్గంలో చెప్పుకోవాలంటే మనం ఏదో తాగుతున్నాం, వాటిని నీళ్లు అంటూ ఉంటాం అంతే!

అది అలా ఉండగా, అసలు విషయమేమిటంటే, గోదావరి నీళ్ళే మనం రాజమండ్రిలో తాగినట్టు, కృష్ణ నీరే హైదరాబాదులోనూ, విజయవాడలోనూ, లేకపోతే కృష్ణా ప్రాంతలోనూ తాగినట్లు, ఆ మొత్తం వ్యాప్తి చెందినటువంటి విష్ణువే, ఏదో పేర్లు పెడతాం కదా చాలా! Omniscient omni present God, అంతటా వ్యాప్తి చెందినటువంటి దైవము, అదే వెనకాల ఉన్నది. అలాంటి దైవాన్ని కూడా ఒక్కోసారి కాస్త చూస్తూ ఉండాలి. ఎందుకంటే, దాన్నుంచే అన్నీ వచ్చినాయి. వచ్చిన వాటికి విలువ ఉంది, కానీ దాన్ని మర్చిపోకూడదు. భారతీయులు ఎన్నో రకాలుగా దేవతామూర్తులు తయారు చేసుకుని, అవన్నీ ఎందులోంచి వచ్చాయో దాన్ని మర్చిపోయారు. మర్చిపోయి, మీ ఇంట్లో అమ్మవారు, మా ఇంట్లో అమ్మవారు, ఈ అమ్మవారు వేరు, ఆ అమ్మవారు వేరు. ఎందుకంటే, చిత్రపటాలు అన్నీను. అక్కడో రాముడు, ఇక్కడో రాముడు. ఏ ఇంట్లో రాముడు రాముడు? అసలు నీలమేఘ శ్యాముడు కదా! అంటే, విష్ణువయినా, కృష్ణుడయినా, అమ్మయినా, రాముడన్నా, మీరు పేరేం పెట్టినా, చివరకదే కదా! విశ్వవ్యాప్తమైనటువంటి తత్వమే కదా! "*విశ్వం విష్ణుః*" అంటూ ఉంటాం, "*వషట్కారో*" ఆయననే ఆరాధన చేస్తున్నాం అంటాం. ఏ ఆరాధన చేసినా దాన్నే చేస్తాం. అందుకనే, "Namaskaram Master" అంటే, మొట్టమొదట పెట్టేది ఆ నీలానికి. తెలుసా! ఆయన ఇదనేం లేదు, అంతాను. "Master Namaskaram", లేకపోతే, "Namaskaram Master". ఏదయినప్పట్టికీ, మొదట నమస్కారం దేనికీ? అనంతత్వానికి. అక్కడ నుంచి CVV గాను, MN గాను, EK గాను దిగి వచ్చినటువంటి మూర్తులు. మూర్తులు ఆరాధిస్తాం ఎందుకంటే మనింటికి bulb లు... మనింట్లో bulb మనం చదువుకోడానికి పనికొస్తుంది కదా, అందుకని వాటిని గౌరవిస్తాం. కాని అది కూడా విద్యుత్తే. ఇన్ని రూపాల్లోంచి ఒకే విద్యుత్తు. కాబట్టీ, ఇన్నిగా కనిపిస్తున్నామే మనం, ఇందరిలోనూ అదే pump అండి. ఏదీ, ఆ విశ్వాత్ముకుని యొక్క projections మనలో మనంగా ఉన్నాం. అదే మనంగా ఉన్నాం. అదే మనంగా ఉన్నప్పుడు, అది మర్చిపోతే గల్లంతే. నదిలో చెంబు ముంచుకుని నీళ్ళు తెచ్చుకుంటే, మన నీళ్ళయిపోతే? మన నీళ్ళవుతాయి, మడి నీళ్ళవుతాయి, ఏవో అయిపోతాయి కదా! అది గోదావరని ఎట్లా మర్చిపోతామో, బిందెత్తుకుని మనింటికి వచ్చేసరికి మన నీళ్ళు ఎలా

అయినాయి? గోదావరి నీళ్ళే కదా! లేక గంగ నీళ్ళే కదా! మాటిమాటికి గోదావరంటున్నారేం సార్, కృష్ణా వాళ్ళం కూడా ఉన్నాం అంటారేమో అని భయం.

అంచేత, మూలం నుంచి ఇందులోకి ఒకటి వ్యక్తమైతే, మూలం మర్చిపోతే ఎలా? విద్యుత్తు మర్చిపోయి, అందమైన bulb లు పెట్టుకుంటే ఏం ఉపయోగం? ఇప్పుడు చూడండి, ఎంత పెద్ద chamdelier ఉంది అక్కడ, అద్భుతంగా ఉంది. అది వెలగకపోతే ఏం ఉంది? అంటే, ఇప్పుడు ఆర్పేసాం లెండి, లేకపోతే వెలుగుతుంది. ఇప్పుడు వెలగకపోతే అది బరువే కదా అక్కడ! అది వెలిగితే కదా అందం! అంటే, దేనివల్ల వెలుగుతోంది? అలాగే, నీలో నువ్వు దేనివల్ల మాట్లాడుతున్నావు? నువ్వు దేని వల్ల చూస్తున్నావు? దేని వల్ల వింటున్నావు? దేని వల్ల వాసన చూస్తున్నావు? దేని వల్ల రుచి చూస్తున్నావు? అది నేను, నేను అంటున్నావే, ఆ నేను నువ్వా? అదే! అదీ కథ. అది ఇట్లా ఉంది ఇందులో. ఆ bulb లో ఉంది, ఇన్ని bulb ల్లోకీ ఒకే విద్యుత్తు వచ్చిన్నట్టుగా. ప్రతీ ఆత్మ, ప్రత్యేకంగా కనిపిస్తున్న ఆత్మ నిజంగా అంత ప్రత్యేకం కాదు. అక్కడ main switch ఆపేస్తే, ఇవన్నీ పోతాయి ఒక్కసారి కదా! Main switch ఆపేస్తే, నువ్వు ఎంత అద్భుతమైన bulb లు పెట్టుకుంటే ఏం లాభం?

అలాగ, నీలో నేను అనువంటి ఆత్మగా ఉన్నవే, అది నేను కేవలం నేను కాదు. అదే నేను. అదే ఇదిగా ఉంది. అది చెప్పడానికే "సోహం" అని ఇచ్చారు. అదే హృదయంలో అలా... సోహం అంటే అర్థం ఏంటి? సహ అహం కదా! సహ అహం అంటే? సహ అంటే అది, అహం అంటే నేను. అదే నేను, అదే నేను, అదే నేను, అదే నేను, అదే నేను... అది ఎప్పుడూ అహర్నిశలూ చెప్తూనే ఉంటుందండి. అందుకని కర్కాటక రాశి చాలా గొప్పది. ఆ ప్రజ్ఞ, "ఒరేయ్ నువ్వు వేరే ఉన్నావనుకోబోక, అదే నువ్వుగా ఉన్నావు. వేరువేరుగా లేవు" అనేటటువంటి ఉపదేశం నీకు ఆషాఢ మాసం ఇస్తుంది. దాన్ని గుర్తు చెయ్యడానికే గురువు. ఇందులో వెలిగేదయినా, అందులో వెలిగేదయినా, అదేగా విద్యుత్తు! మీరు చూస్తున్నా, నేను చూస్తున్నా, చూచేవాడు ఒకడే ఇన్ని రూపాల్లోంచి చూస్తున్నాడు. ఇది మర్చి పోవడం అనేటటువంటిది సహజంగా జరుగుతుంది ఈ మాసంలో, అది దాని గొప్పదనం. మరుపు సహజం, గుర్తు చేసుకోవడం సాధన, అంతే! ఇప్పుడు, అక్కడ ఉంది పెద్ద Chandelier... పోనీ ఒక్కసారి వెయ్యండి బావుంటుంది చెప్పుకుంటుంన్నాం కదా! ఏదయినా ఆరిపోతే ఎముందడీ? అందులో అయినా పని చేస్తున్నది విద్యుత్తే, ఇందులో అయినా పని చేస్తున్నది విద్యుత్తే కదా! మీలో అయినా, నాలో అయినా, పలికే పలుకు ఒకటే వాణి. అది వాడి వాణి. మీలో అయినా, నాలో అయినా ఉన్నది ఒకే వెలుగు. అది శబ్దరూపం దాలుస్తూ ఉంటుంది, వెలుగురూపం దాలుస్తూ ఉంటుంది, రకరకాల రూపాలు ఏర్పాటు చేస్తూ ఉంటుంది. ఇవన్నీ దాన్నుంచే తయారు అయినాయి. So, తయారయిన వాటిల్లో ఏకత్వం చూపించేటటువంటివాడు గురువు.

అంచేత, ఈ వేరుగా అనుకుంటే ఒక భయం, ఒక అపాయం ఉన్నది ఆషాఢ మాసంలో. ఎంచేత అంటే, జీవుడు కోశ ప్రవేశం చేస్తున్నాడు, లేక గృహ ప్రవేశం చేస్తున్నాడు, ఒక పొరలోకి దిగుతున్నాడు. అతడు అపరిమితుడు. ఒక పొరలోకి దిగితే పరిమితం అవుతుంది కదా! ఒక బూర తెచ్చి ఊదేం అనుకోండి, అంతకు ముందు బయట ఉండే

గాలే కదా ఇప్పుడు బూరలోకి వచ్చింది! ముడేసేసావు. లోపల గాలి, బయట గాలి అయ్యిందా? So, లోపలి గాలికి వేరే అస్తిత్వం ఉన్నట్టుగా కనిపిస్తుంది. లోపలి గాలి ఎట్లా ఉంటుంది బయట గాలి లేకుండా? దీనికి, దానికి ఉండేటటువంటి అనుసంధానం ఎక్కడుంది? హృదయంలో ఉంది. అంచేత, నీ హృదయంలో ఉన్నటువంటి ఆ అనుసంధానం నీకు గుర్తు చెయ్యడమే గురుపూర్ణిమ. అదే గురుపూజ. గురువుగారు చెయ్యాలిసిన పని అది. నన్ను చూడు, నా అందం చూడు అని ఊరికే హడావిడి చేసేస్తుంటే కాదు, ప్రతివాడికి వాడిలో మూల స్థానం వాడికి గుర్తుచేసి, అక్కడ పడి కాపలా కాయి అని చెప్తారు. అక్కడ ఉండి నువ్వు సమస్తాన్ని దర్శించడానికి ప్రయత్నం చెయ్యమని చెప్తాడు సద్గురువు. అలా దర్శనం చేస్తున్నవనుకో అప్పుడు నువ్వు క్రమంగా అశ్వపతి అవుతావు.

అంటే, కథ చదువుకుంటే మనకేముంది మూడు ముక్కల్లో అయిపోతుంది. అశ్వపతి అంటే సామాన్య విషయం కాదు. అశ్వపతి అవ్వాలి. ఆ తర్వాత జీవన ప్రయోజనం. నేనెవరో తెలుసుకోవడం ఒకటి, నేనేం చెయ్యాలో తెలుసుకోవడం. Who am I? Where am I? What am I to do? నేనెవరిని? అతడే నేనుగా వచ్చాను. సరే ఎందుకొచ్చావు? తెలియాలా? ఏవో కొన్ని అనుభవాలు అయినాయి, ఇంకా కొన్ని అనుభవాలు కావాలి. కొన్ని తెలుసుకున్నాను, కొన్ని ఇంకా తెలుసుకోలేదు. ఎవడెప్పుడు ఏం ప్రయత్నం చేస్తున్నా, ఇంకా పొందవలసిన అనుభవం పొందడం కోసమే ఆ పనులు చేస్తుంటారు. ఆ అనుభవం తీరిన తర్వాత ఆ పని చెయ్యమంటే చెయ్యడు వాడింక. ఆ అనుభవం కలిగేవరకే ఆ పని. జీవుడికి రకరకాల అనుభవములు సృష్టిలో కలుగచెయ్యడానికే ఈ సృష్టి అంతా. చేసి, అతడిని పరిపూర్ణిడిని చేసి, అటుపైన అతడి యొక్క అపరిమిత్వం అతనికి తెలియచేసి, ఆనంద స్వరూపిడిగా అతడు ఎప్పుడూ శాశ్వతుడై ఉండేంత వరకూ కూడా ఆ సృష్టి జరుగుతూనే ఉంటుంది. అందులో భాగంగా మనం అతడే నేనుగా దిగి వచ్చాము, ప్రతి ఒక్కళ్ళం కూడా. అక్కడనుంచే దిగి వస్తాం. నిద్రలోంచి వచ్చేటప్పుడు కూడా అక్కడనుంచే వస్తాం. దిగి వచ్చిన వాళ్ళం మర్చిపోకూడదు, అదే నేను అని. అందుకనే, మనకి చూడండి పాట ఉంది "అదే నేను, అదే నువ్వు" అని కదా! అంటే, నేనొక్కడినే అది అంటే కాదు కదా, మీరందరూ కూడా అదే. తెలిసినవాడు, నేనే దైవాంశ సంభూతుడిని అనుకోడు, అందరూ దైవాంశ సంభూతులే. అందరూ అదే వెలుగు యొక్క రూపములే. ఆ రూపములు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా దాన్ని pack చేస్తారు. By package we are different, by content we are essentially one. ఈ package differences లో రకరకాల package లు. అందుకనే దిగి వచ్చినప్పుడు, ఇంత తెలిసినవాడికి కూడా "నేను" అనిపిస్తుంది. నా భావములు, నా సిద్ధాంతములు, నా అభిప్రాయములు, ఇలా నా, నా, నా, నా... నా నా లాగా వచ్చేస్తుంది. నానావిధమైనటువంటి భావములలో చిక్కుకుపోతారు. ఎంచేత చిక్కుకుపోతాడు? అందరం ఒకే చోట నంచి వచ్చాము అని తెలియక. అందరం ఒకే చోట నుంచి వచ్చాము. ఎవరెవరి అనుభూతి వారు పొందడానికి వచ్చారు. అందరూ వారి వారి వైవిధ్యమైనటువంటి అనుభూతులు కోసం ప్రయత్నం చేస్తూ ఉంటారు. నీ ప్రయత్నం నువ్వు చేస్తున్నావు, వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేస్తున్నారు. అందరూ అదే ప్రయత్నం చేస్తున్నారు తెలుసా?

అది కృష్ణుడు ఒక్కడే చెప్పాడండి. ధనం వెంటపడ్డవాళ్ళు నా గురించే వెతుక్కుంటున్నారు అన్నాడు. పదవుల వెంటపడ్డవాళ్ళు నా గురించే వెతుక్కుంటున్నారు. స్త్రీల వెంటపడ్డవాళ్ళు నా గురించే వెతుక్కుంటున్నారు. ఎవడు, ఎక్కడ, ఏ జీవుడు దేని గురించి వెతుక్కుంటున్నా, అన్నం గురించి వెతుక్కుంటున్నా... రకరకాలుగా జీవుడు ఆనందం కోసం అన్వేషణ చేస్తున్నాడు కదా! ఈ ఆనందం నువ్వు పొందుతూ ఉంటే, క్రమక్రమంగా పరిణితి చెందుతూ, చిట్టచివరికి వీటన్నిటికీ మూలమైన నన్ను కోరుకుంటాడు. అంతవరకూ జరుగుతున్నది నాదే కార్యక్రమం అంటాడు ఆయన. కృష్ణుడొక్కడే ఆ మాట చెప్తాడు. ఎంత గొప్పవాడండి! అంటే, మీరు అలా డబ్బు సంపాదించుకుంటూ అందులో మునిగిపోయారు హిహిహి అనకూడదు. ఎందుకంటే, వాడికది అవసరం. ఎందుకయ్యా ఇలా పదవులు పట్టుకుని వేలాడుతూ ఉంటావు అని మనం అంటే కుదరదు. వాడికందులో మోజు ఉంటం వల్ల దాని ద్వారా పనులు జరుగుతూ ఉంటాయి. అట్లా ఒక్కొక్కరికి ఏదో ఒక్కొక్క మోజు ఉంటుంది. మోజు ఎందువల్ల ఏర్పడింది? అది తీరక. తీరితే అది ఇంక ఉండదు. ఇప్పుడు ధనం మీద వ్యామోహం పోయినవాడికి నువ్వు ఎంత ఆశ చూపించినా వాడికి, వద్దమ్మా అంటాడు. అలాగే, పదవుల మీద ఆశ చూపిస్తే, వద్దమ్మా అంటాడు. అంటే, వద్దమ్మా రెండు రకాలుగా ఉంటుంది. అందకపోవడం వల్ల వద్దనడం ఒకటి. అందని ద్రాక్ష పళ్ళుపులుపని అన్నారు కదా! ధనం అందకపోవడం వల్ల, ధనం మీద అదో రకమైన వైరాగ్యం మొహం పెట్టుకోవడం వల్ల వీడది దాటినట్టు కాదు. దొరికితే మళ్ళీ పడిపోతాడు కదా! అంచేత, అందుబాటులో ఉన్నా, వాటియందు నీకు సహజంగా ఆకర్షణ లేక, వీటన్నిటికి మూలమైన వాటి మీద ఆకర్షణ ఉండే వాళ్ళు కొంత మంది ఉంటారు సృష్టిలో. వాళ్ళు examples. అంటే ఏమిటి examples? ఏదో ఒక రోజు వాడిలా అవుతావు నువ్వు అని అంతే. ఎందుకంటే, నీకు ఈ మోజులు తీరిపోతాయి. పెళ్లిమోత వరకూ తహతహ అండి, పెళ్ళయిన తర్వాత ఇంకేం ఉంది? ఎన్నాళ్ళుంటుంది? పెళ్ళికాక ముందు, ఎప్పుడు పెళ్లవుతుందా అని చూస్తూ ఉంటారు స్త్రీలు, పురుషులు. పెళ్ళయిన తర్వాత ఏముంది? అంతేగా! అలాగే, result వచ్చిన తర్వాత pass అయిపోయామనుకోండి, ఏముండదు. Pass అయ్యేంత వరకూ తపన ఉంటుంది. అయిపోతే ఏం ఉండదు. ఇప్పుడు breakfast పెట్టేంత వరకూ తపన ఉంటుంది కదా! వాళ్ళు పెట్టాలి, మనం తినాలి కదా! తినేసిన తర్వాత ఇంక breakfast గురుంచేం అలోచిస్తామండీ? ఈ పూటకి ఆలోచించము. అంటే, ఎక్కడికక్కడ నీకు దేనియందు ఇంకా పూర్ణ భావం రాలేదో దాన్ని గురించినటువంటి ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. అందుకని, ఎన్ని ఎన్ని రకాలుగా ఎంత మంది జీవులు ప్రయత్నం చేస్తున్నా, జంతువుల దగ్గరనుంచి, అందరూ నన్నే, నా గురించే, నా కోసమే ప్రయత్నం చేస్తున్నారు. వాటన్నటి రూపాల్లో చిట్టచివరకు నన్నే చేరతారు అని చెప్తాడండి శ్రీకృష్ణుడు. మరి త్రైలోక్య గురువంటే ఆయనే. ఎవడిని నిందించడు. వాడికది అవసరం, వాడది చేస్తున్నాడు. వీడికిది అవసరం, వీడిది చేస్తున్నాడు. ఎవడు చేస్తున్నది వాడికి చాలా highest గా అనిపిస్తూ ఉంటుంది కదా! ఇట్లా ప్రవచనాలు చెప్పుకుంటూ తిరుగుతూ ఉంటే, అదే best అనుకోవచ్చుగా? ఏది, ప్రతీదీ అలవాట్లే కదా! So, బాగా జరుకుతున్న కొద్దీ ఇంకా చెప్పి, ఇంకా చెప్పి, ఇంకా చెప్పి, ఇంకా చెప్పి... దానికేదో మితి ఉంటుంది ప్రతీదానికి కదా! దేనికైనా మితి ఉంటుంది. అలా నేర్చుకుంటూ వస్తాడు. కాకపోతే ఈ ఆషాఢ మాసం వచ్చిన తర్వాత, "ఒరేయ్, గుర్తు పెట్టుకో, అదే నువ్వు, ఊరికే మునిగిపోకు ఇందులో" అని, "దేనికోసం వచ్చావో అది నిర్వర్తించుకో".

అశ్వపతి ప్రాణములయందు స్వామిత్వం సంపాదించినవాడు, ఆనందంగా ఉంటున్నాడండి. ఇంక అంతకన్నా ఏం కావాలండి, మామూలుగా? అలా కాదే! వచ్చిన పనొకటి ఉంటుంది. వచ్చిన పనేంటి? తాను రాజు, రాజ్యానికి ఉత్తరాధికారి కావాలి కదా! అంచేత, ప్రతి దానికి... నీ కుటుంబంలో నీ తర్వాత ఎవడు? ఒకడు ఉండాలి ఆ సంస్కారాలు అందించడానికి. అలాగే, వ్యాపారమో, వృత్తో, ఉద్యోగమో. ఉద్యోగంలో ఎలాగో వాళ్ళే నిర్ణయం చేసి, నువ్వు retire అవుతుంటే వాడు ముందే వచ్చి కూర్చుంటాడు, ఇంక తమరు వెళ్తారా అన్నటుగా కదా! మరి ఉద్యోగాల్లో మనం ఎవరినీ తయారు చెయ్యలిసినంత పెద్ద పరిస్థితులు ఏమీ లేవు. అయినప్పటికీ నీకు ఉండేటటువంటి విలువలు ఇంకొకడికి నేర్పితే, నీలాగా వాడు ఉద్యోగం నిర్వర్తించవచ్చు. వ్యాపారానికి, నీ తర్వాత ఇంకోడు. ప్రతీ దానికీ. కుటుంబంలో నీ తర్వాత ఇంకోడు. దేనికైనా నీ తర్వాత ఇంకోడు అనేటటువంటిది ఒకటి ఉంటుంది. అది వ్యవస్థ. అట్లా అనుస్యూతంగా సృష్టి నడవాలంటే, నీ తర్వాత ఒకడు తయారవ్వాలి.

అంచేత, అశ్వపతికి అదొకటి లోటు ఉంటం చేత, ఆయన అద్భుతంగా గాయత్రి ఆరాధన చేసాడు. మనం కూడా బాగా చెయ్యాలండి గాయత్రి ఆరాధన. ఎంచేత అంటే, ఆ ఆరాధనలో నీకు పైన ఉన్నటువంటి మూడు లోకముల నుండి, అంటే "*ఆదిత్యః సవితః సూర్యః*" అని చెప్పాను నిన్న. ఈ మూడు లోకాల నుండి వచ్చే కాంతి నీ హృదయం నిండా నింపుకోవాలి. అందుకని గాయత్రి మంత్రం బాగా గానం చేస్తుంటే, ఈ వెలుగులకన్నిటికీ మూలమైనటువంటి దేవుడు, ఆయనికి పేరు లేదు, ఆయన నుంచి సవితృమూర్తి ద్వారా వెలుగు నన్ను బాగా ఆవరించి, నా బుద్ధిని ప్రచోదనం చెయ్యాలి అని దాని అవగాహన. అందుకని, నీ హృదయం చేరి, అక్కడ కూర్చుని, అలాగ అపరిమితమైనటువంటి వెలుగు నీలో అట్లా సహస్రారం నుంచి ప్రవేశిస్తున్నట్టు, shower bath with light, అది సూర్య కాంతి. అది ఇక్కడ ముందు క్రమంగా బంగారు కాంతిగా వస్తూ, ఆ పైన తెల్లటి కాంతిగా దిగి వస్తున్నట్టుగా, నీ హృదయంలో అంతా నిండిపోయి, ఇంకా అది పొంగి, పొరలి అన్ని అంగాల్లోకి పూర్తిగా ప్రవేశించినట్టుగాను, ఈ చూసారా వేలి గోటి చివరి కొన వరకూ, కాలి గోళ్ళ కొన వరకూ, అంతా నిండిపోతున్నట్టుగా, చుట్టు పక్కల పారుతున్నట్టుగా... అట్లా చెయ్యాలి. ఇలా రోజూ చెయ్యండి. స్నానం చేస్తే అంతకుముందు కన్నా కొంచెం ఎట్లా better గా ఉంటామో, ఇలా గానం చేస్తే గాయత్రి, వెలుగు రూపాలుగా, బాగా వెలుగు దిగుతుంది. ఎంత వెలుగు దిగితే అంత మాలిన్యం పోతుంది కదా! అంత చీకటి పోతుంది.

అంచేత, ఇప్పుడు ఈయన ఎంత చేసాడీయన? రోజుకి పది వేల సార్లేంటండీ! తపస్సుగా చేస్తే లోపల అంత సేపు పట్టదు పది వేల సార్లు చెయ్యడానికి. మేము హనుమాన్ చాలీసా చదువుతూ ఉంటాము వారానికి ఒకసారి, గంటముప్పావు పడుతుంది బయటకి చదివితే. లోపల చదివితే ఇరవై నిముషాల్లో అయిపోతుంది పదకొండు సార్లు. లోపల ఈ నాలుకలు తిప్పడాలు ఉండవు కదా! నాలుక కన్నా మనసుకి వేగం ఎక్కువ. అందుకని, అక్షరాలు చాలా త్వరిత గతిన పఠనం చేసేస్తుంది మనసు. అంచేత, మనో వేగం చాలా ఎక్కువ కదా! దేహం కన్నా ఇంద్రియాల వేగం వంద రెట్లు ఎక్కువట. ఇంద్రియాల కన్నా మనసుకు వంద రెట్లు ఎక్కువ. కాబట్టి వెయ్యి రెట్లు ఎక్కువ. అంచేత, ఆయన రోజుకి పది వేల సార్లు చేసాట్టండి. రోజుకి పది వేల సార్లు గాయత్రి చేస్తూ... ఉన్నారు సహస్ర గాయత్రి రోజూ

చేసేటటువంటివారు. ఆ మధ్యోకాయన ఆదోనిలో ఒక ఇరవై సంవత్సరాల క్రితం ఇలాగే సహస్ర గాయత్రి చేస్తూ, ముప్పైయేళ్ల పాటు జీవిస్తూ ఉంటే, వారికి గాయత్రి ధ్యానంలో CVVగారు కనిపించారట. ఆయనికి దొకటి... ఎవరు బాగా గాయత్రి చేస్తుంటే, వెళ్లి వాళ్ళ దగ్గర పని పెడతారు ఆయన! మాస్టరుగారు కూడా గాయత్రి గానము, ధ్యానము, జపము, వీటిల్లో తన్మయత్వం చెందుతూ ఉంటే కదా Master CVVగారు కనిపించారు. అంటే, ఉత్తమోత్తమమైనటువంటి చైతన్యం నీయందు అవతరిస్తున్న సందర్భంలో దర్శనం ఇచ్చేటటువంటి ఒక మహత్తరమైన గురువుగా భావన చేసుకోవాలి Master CVVగారిని. ఏదో ఫోటోలు పంచేసుకున్నాం, బాగా ఇంటి నిండా పెట్టేసుకున్నాం, ఏదో మనతోనే ఉన్నాడులే అనుకుంటూ ఉంటాం. అందులో సత్యం లేకపోలేదు. ఉంది, తుమ్మేరు కూడా గట్టిగా! అది ఉండగా, ఆయన మనయందు స్థిర పడి, మనతో ప్రతి నిత్యం మాట్లాడే పరిస్థిది తెచ్చుకోవద్దండీ? One-to-one మాట్లాడుకోవద్దూ మాస్టారుగారితో? ఎంత తేజోవంతులో ఆయన మనకి బాగా అవగాహన కావలి కదా? మాస్టారుగారి గురించి చెప్తూ మాస్టరు EKగారు అన్నారు, "అది ఎంత తేజస్సంటే నేను చెప్పలేనోయ్" అన్నారు. "ఇంతా అంతా అని నేను చెప్పలేను ఆ తేజస్సు, ఆయన కాలి బొటని వేలి గోరు వెలుగు చాలు మన భూమికి" అన్నారాయన. అంటే, అతిశయోక్తేమో అనుకున్నాను నేను. "అట్లా అనుకోబోక, కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకో" అని చెప్పరాయన. అంతటి వెలుగు. ఎందుకంటే, మాస్టరుగారు మిగతా గురువుల గురించి, దేవుళ్ళ గురించి చాలా అద్భుతంగా విన్యాసాలు చేస్తూ ఉపన్యాసాలు ఇచ్చేవారేమో గాని, Master CVVగారి గురుంచి చెప్పాలంటే చాలా బుద్ధిమంతులు అయిపోయే వారాయన. చాలా అప్రమత్తతతో, జాగురూకత వహించి, హెచ్చరికగా చెప్పేవారు. ఏమిటిలా అయిపోయేవారని అనిపించేది. "మరి విషయం పెద్దది కదోయ్" అనేవారు.

అంచేత, మనం... గాయత్రి మనకు మాస్టరుగారు ఇచ్చారు కదా! ఎన్నో మంత్రాలు ఉన్నాయి, కాని గాయత్రి మంత్రం అద్భుతం. గాయత్రి మంత్రం గురించి అసలు చెప్పుకోవచ్చు ఒక ఐదు ఆరు రోజులపాటు. ఎందుకంటే, అంత అద్భుతమైనటువంటి మంత్రం అది. కానీ, దాన్ని ఆరాధన చేస్తూ ఒక్కటే పెట్టుకోండి – శిరస్సు నుండి హృదయం వరకూ అలా జలపాతం, వెలుగు జలపాతం, అలా దిగుతున్నట్టు, హృదయంలో పడ్డ తర్వాత అది నిండి, పొంగి, ఇంక శరీరం అంతా వ్యాప్తి చెందుతున్నట్టు. అంతే కాదు, నీవంతా నిండి పోయిన తర్వాత, అంటే అంగాల్లోనూ నింపుకోవచ్చు, చెవులలోనూ, తల చుట్టూ, ముఖంలోనూ, ముక్కులోనూ, నోట్లోనూ, ఇంక ఏది బడితే అది, మొత్తం అంతా నింపేసి, ఇహ చుట్టుపక్కలకి ప్రవహిస్తున్నట్టు, ఇలా ఈ ఊరు... ఈ ఊరంతా... ఇట్లా చేస్తారు... ఈ ఊరంతా నిండుతున్నట్టు, మన రాష్ట్రం అంతా నిండుతున్నట్టు, మన దేశం అంతా నిండుతున్నట్టు, మొత్తం గోళం అంతా నిండుతున్నట్టు... ఏం ఎందుకు చెయ్యకూడదు? ఇంక planetary purifications అని వేరే అవసరం లేదు. అదే అన్నీను. నీ భావనే కదా! అలా ఎంత చెయ్యచ్చు. సూర్య మండలం అంతా నిండుతున్నట్టు చెయ్యచ్చు. తపస్సు చేసిన వాళ్ళు అట్లా చేసారు. అట్లా చెయ్యడం వల్ల, వీళ్ళు ఇలా నింపేస్తుంటే, ఈ కాంతి అక్కడకు వెళ్లి సూర్యుడికి కూడా తగిలేది. వీడెవడో చేసేస్తున్నాడు గట్టిగా గాయత్రి, మనం కనబడాలనిపించేట్టుగా. పురాణాల్లో ఇట్లా... మాటిమాటికి ఇట్లా మనం పిలిస్తే సూర్యుడొస్తాడాండి? మరి సూర్యుడు వచ్చిన వాళ్ళు ఉన్నారు కదా! ఎంత చేస్తే వచ్చారు? మనం

ఎంత చేస్తున్నాం? సరిగ్గా పది సార్లు కూడా గాయత్రి చెయ్యం. మనకి ఇచ్చిన వన్నీ కూడా అత్యంత విలువైనటువంటి విషయాలిచ్చారు. అవి అత్యంత విలువైనవని తెలియక, వాటినేవో ఆషామాషీగా వాడేసుకుంటాము.

శుచి అయిన మనసుతో గాయత్రి గానం చేస్తుంటే అద్భుతం. అలా చేసాడాయన. పద్దెనిమిది సంవత్సరాల పాటు చేస్తే, ఆయనకి మొత్తం కాంతిరూపం వచ్చేస్తుంది. అలాంటి కాంతిరూపం తనకేర్పడిపోయింది. తన కాంతిరూపం పూర్తిగా ఆ సవితృ కాంతి, అంటే తెల్లటి వెలుగన్నమాట. అది ఏర్పడితే, మొత్తం సృష్టిలో ఏ వెలుగయితే ఇదంతా నిర్వర్తిస్తోందో, అదే స్త్రీమూర్తిగా కనబడ్డది. అదే పురుషమూర్తిగా కూడా కనబడవచ్చు. అందుకనే, మనకి గాయత్రి మంత్రానికి చేసే ముందు రెండు స్లోకాలు ఇచ్చారు మాస్టరుగారు. ఒకటి "*ముక్తా విద్రుమ హేమ నీల ధవచ్ఛాయైర్ముఖై స్త్రీ క్షణైః యుక్తా మిందు నిబద్ధ రత్నముకుటాం తత్త్వార్ధ వర్ణాత్మికామ్, గాయత్రీం వరదా భయాంకుశ కశాశ్శుభ్రం కపాలం గదాం శంఖం చక్ర మథార వింద యుగళం హస్తైర్వ హంతీం భజే*" అని. అది అమ్మవారి రూపంతో చాలా చక్కగా వివరంతో వర్ణింపబడి ఉన్నది. ఎప్పుడో ఇక్కడే చెప్పుకుందాం గాయత్రి. అలాగే, ఇంకోటి ఇచ్చారు. అంటే, స్త్రీ రూపమా, పురుష రూపమా? మనకదో బాధ ఉంది. అది రెండూనూ. ఇప్పుడు అది ఉంది వెనకాల వెలుగు, అది స్త్రీ అంటారా, పురుషుడంటారా? రూపానికి అతీతమైన తత్త్వం రూపంలోకి దిగివచ్చినప్పుడు నీకే రూపం ఇష్టం అయితే ఆ రూపంలో ధ్యానం చేసుకోవచ్చు. కానీ, అది తత్త్వం అని గుర్తు ఉండాలి. అందుకనే, దాని వెనకాలే ఇంకోటి ఇచ్చేసారు. "*ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః, కేయురవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయ వపుర్ధృత శంఖ చక్రః*". రెండూ రెండే! నీకేలా కావాలంటే అలా చేసుకో. కానీ, నువ్వు గుర్తుపెట్టుకో వలసినది ఒక్కటే, రెండిటిలోనూ వెలుగు వర్ణనే ఉంటుంది.

అంచేత, దేన్నీ ఆరాధన చేస్తున్నావు? వెలుగుని ఆరాధన చేస్తున్నావు. అలా వెలుగుని బాగా ఆరాధన చేస్తుంటే, ఎంత నువ్వు సత్తిబుచ్చి అయినా దానికి కూడా వెలుగు వచ్చేస్తుంది. పూర్వకాలం సత్తిబుచ్చిలను తోముకుంటే, ఎంత బాగా వెలుగు ఉండేది? అందులోనే పులుసు అవీ పెట్టుకునే వాళ్ళం, మా అమ్మమ్మలూ, అమ్మలూ. అంతకుముందు, రాచ్చిప్ప అని ఉండేది. ఏది, రాచ్చిప్ప కూడా బాగా నిగనిగ లాడుతుంది తోముకుంటే కదా! అంచేత, ఎంత వెలుగు ఆస్వాదింపబడితే, అంత కాంతివంతమైపోతూ ఉంటుంది పాత్ర. ఆ విధంగా అశ్వపతి యొక్క దేహం నుంచి ఒక్కొక్క కాంతి శరీరం తయారవుతూ వచ్చేసిందండి, బంగారు కాంతి శరీరం వచ్చేసింది, వజ్ర కాంతి శరీరం వచ్చేసింది. ఎంతగా ఆ దేహముల యొక్క కాంతి ఏర్పడిందంటే, ఆ వెలుగుకే ముచ్చట వేసి అమ్మవారి రూపంలో వచ్చేసింది. ఎందుకని? ఈయన చేసిన ఆరాధన సావిత్రిదేవి ఆరాధన. అంటే, స్త్రీమూర్తిగా పరతత్వాన్ని ఆరాధన చేస్తే అదే వస్తుంది. స్త్రీమూర్తి గానే కనిపిస్తుంది. ధ్రువుడు పురుషమూర్తిగా ఆరాధన చేస్తే విష్ణురూపంగా కనిపించాడు. అదే తత్త్వం! నువ్వు చేసే ఆరాధన బట్టీ ఆ రూపంలో దర్శనం ఇస్తాడు. పోతనామాత్యుడు శివారాధాన చేస్తే రాముడు రూపంలో దర్శనం ఇచ్చాడు. అంచేత, రూపం ఏదయినా, అది it is a messenger of light. అది గుర్తు పెట్టుకోవాలి కదా! వచ్చింది వెలుగు. అది ఏ రూపంలో అయినా రావొచ్చు. ఈ రూపంలో వచ్చింది. వస్తే, "తల్లీ, ఉత్తరాధికారి మరి ఒకడు ఉండాలి కదా, అందుకని నాకొక తనయుడిని ప్రసాదించు" అంటాడు. అంటే, ఆమె చెప్పింది,

"తనయుడు కాదు, తనూజ" అంది. అని చెప్పి ఒక మాట వేసారు. అంటే, "తనూజ" అన్నారు. తనూజ అంటే తనువు నుంచి పుట్టింది అని, శరీరం నుంచి పుట్టిందని. ఆ అశ్వపతి అనేటటువంటి మహారాజు యొక్క కాంతి శరీరం నుంచి అదే కాంతితో ఆ సావిత్రిదేవే ఈయనకి కుమార్తెగా పుట్టుకొచ్చింది. అంటే, ఆమెయందు సహజంగానే వెలుగు శరీరం ఉంది.

పుట్టీ పుట్టంగానే మనకి మామూలుగా రక్తమాంసాదులతో కూడిన శరీరంతో పుడతాం. ఈ రక్తమాంసాదులతో పుట్టిన ఈ శరీరం నుంచి క్రమంగా ఆ శరీరాలు తయారు చేసుకోవాలి. అందుకూ మానవ శరీరం. ఆ మాటిమాటికి చెప్పుకుంటూ ఉంటాం, మానవ శరీరం దుర్లభం, మానవ శరీరం దుర్లభం, మానవ శరీరం దుర్లభం అని మాటిమాటికి అనుకుంటే ఏం లాభం? దుర్లభమే. అంటే, అంత సులభంగా దొరకదు. కానీ, మానవ శరీరం దొరికితేనే నువ్వు ఈ వెలుగు శరీరాలు నిర్మాణం చేసుకోగలవు. మిగతా శరీరాల్లో ఆ నిర్మాణం జరగదు. అందుకని, ఎంతటి వాళ్ళయినా మానవులుగా పుట్టాలి. పుట్టి, ఆ వెలుగు శరీరాలు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే, ఆ జన్మకి సార్ధకత. అంతవరకూ పుడుతూ, చస్తూ, పుడుతూ, చస్తూ ఉంటావు. ఏ రోజయితే ఈ విద్యలో చేరి, ఏదీ ఈ విద్యంటే, ఈ జ్ఞానం కలిగి, దీనికోసం అనేటటువంటి ప్రయత్నం మొదలు పెడతావో, అప్పుడు క్రమంగా నువ్వు, అందులో ఏదో ఒక జన్మలో ఉత్తీర్ణుడవుతావు. అలాంటి శరీరం కలిగినటువంటి తండ్రి నుండి పుట్టుకొచ్చినటు వంటిది సావిత్రి. ఆమెకి సహజంగా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు కలిగి ఉన్నటువంటి జీవి.

అది చూడండిప్పుడు మనకీ మధ్య కాలంలో మనం చూసుకుంటే, Madam Blavatsky ఆ విధంగానే పుట్టుకతోనే వెలుగు శరీరంతో పుట్టిన మనిషి ఆవిడ. అందుకనే, చిన్నతనంలోనే, ఇంత పాప అప్పుడు కూడా, అలా సూక్ష్మమైనటువంటి శరీరాలతో, గుంపులు గుంపులుగా అలా తేలి వెళ్తున మనుషులు కనిపిస్తూ ఉండేవారు, అలా దేవతలు కనిపిస్తూ ఉండేవారు ఆవిడకి. ఆవిడకి కూడా మాటిమాటికి గాలిలో తేలిపోతున్న అనుభవం ఉంటూ ఉండేది. ఓ చిత్రపటం ఒకటి గోడకి కొట్టాలని ఈ నిచ్చెన లాంటిది వేసుకుని అక్కడ పటం పెట్టి, చిత్ర పటానికి మేకు ఏర్పాటు చేస్తుంటే, ఈ కింద నిచ్చెన పడిపోతే, ఆవిడ గాలిలో తేలుతూ మేకు కొడుతుంది. అది ఎలా సాధ్యం అంటే, పుట్టుకతో సిద్ధురాలు ఆవిడ. అలా ఈ సావిత్రిదేవి పుట్టుకతో సిద్ధురాలు. ఎందుకని? అంత తపస్సు చేసిన తండ్రి నుంచి దిగి వచ్చింది. అందుకనే, "నీకు తనూజ ప్రసాదిస్తున్నాను". అంచేత, మనకుండే లక్షణాలే మన పిల్లలకి కూడా వస్తాయి దాదాపు. వాళ్ళ కర్మ వాళ్ళు తెచ్చుకోగా, మనవి కూడా వాళ్ళకి అంటుతాయి.

కాబట్టి, ఈ అశ్వపతికి అలాంటి కన్య పుట్టింది. కాబట్టే, అలా సహజంగానే పుట్టుకతోనే ఈ సిద్ధి కలిగింది కాబట్టే ఉత్తరోత్తరా ఆమెకు యమ దర్శనం సాధ్యం అయ్యింది. అందరికీ యమ దర్శనం సాధ్యం కాదు. అలాంటిది ఆమె పెరిగి పెద్దదయింది. అసలే పుట్టుకతోనే అంత సిద్ధి ఉన్న జీవి పుట్టుకు వచ్చినప్పుడు అన్ని విద్యలూ అద్భుతంగా అబ్బుతాయి. వచ్చి చేరతాయి అన్ని విద్యలన్నీ. నీలో ఉండేటటువంటి సద్గుణాల బట్టి విద్యలొచ్చి చేరతాయండి. మన గుణములయందు కొంత నాణ్యత తగ్గితే విద్యలు వెళ్లిపోతాయి. గుణములు పెంచుకుంటే విద్యలొస్తాయండి.

సద్గుణములు ఎన్ని చేరుతుంటే, అన్ని మంచి విద్యలు వచ్చేస్తాయి. సద్గుణములు పోగొట్టుకుంటున్నా వనుకోండి, ఈ విద్యలన్నీ మనకి చెప్పకుండా వెళ్ళిపోతాయి. అదేంటి, అలా వెళ్ళిపోయారంటే, చెప్పి వచ్చామా, నీకు చెప్పి వెళ్ళిపోడానికి అంటాయి. చెప్పి రాలేదు కదా! నువ్వంటే ఇష్టపడి నీ దగ్గర చేరాం, ఇప్పుడు నీ పరిస్థితి అంత గొప్పగా లేదు, అందుకని మళ్ళీ వస్తాం అంటారు. దివ్యమైనటువంటి కార్యాలకి ఎన్నో దివ్యాస్త్రాలు చేరి, కార్యం అయిన తర్వాత దివ్యాస్త్రాలన్నీ కూడా మాయమై పోయాయి కదా అర్జునుడికి. ఎంచేత చేరినాయి? దివ్యమైన గుణాలు ఉండడం చేత. ఎందుకు వెళ్ళిపోయాయి? యుద్ధం మనమే గెలిచాము అనుకోవడం చేత. తర్వాత పనికి రాలేదు. ఎలాగూ తర్వాత లేవు ఆయనకు.

దివ్యాస్త్రాలన్నీ చేరినాయి రాముడి దగ్గర, విశ్వామిత్రుడు ఇట్లా చెప్పగానే మంత్రాలు, యాభై అస్త్రాలకి సంబంధించినవి. అవన్నీ బాగా ధ్యానం చేసి, తపస్సు చేసి, ఆ మంత్ర దేవతలన్నిటిని మాములుగా మనం సిద్ధి కలిగించుకోవాలి. అలాంటిది, రాముడి దగ్గరుండేటటువంటి కళ్యాణ గుణాలకి అస్త్రాలన్నీ లోబడి పోయాయండి. లోబడి పొతే, ఆయన అన్నాడు, నాకెందుకు లోబడి మీరుంటారు, హాయిగా స్వతంత్రంగా జీవించండి, నాకెప్పుడయినా అవసరం వచ్చినప్పుడు మీరే మీ అంతటగా రండి అని చెప్పాడు. ఎంత స్వేచ్ఛ ఇచ్చాడు? అంటే, గుణవంతుడంటే రాముడే! ఇంక అంతకంటే ఎవరుంటారు? మానవుల్లో గుణవంతుడంటే రాముడే! అంత స్వేచ్ఛ ఇచ్చాడు. మనం స్వేచ్ఛ అపహరించడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాం, తోటి జీవులది కదా! ప్రతీ వాడి స్వేచ్ఛ అపహరించడమే. భర్త, భార్య స్వేచ్ఛ అపహరించాలని చూస్తున్నాడు. అదే భార్య చేస్తూ ఉంటుంది, భర్తని పట్టేస్తూ ఉంటుంది కదా! ఎక్కడికి పోతావు అన్నట్టుగా ఉంటుంది. స్వేచ్ఛ ఏదీ? తల్లిదండ్రులు పిల్లల్ని పట్టేస్తారు, పిల్లలు తల్లిదండ్రులను పట్టేస్తారు. ఒకళ్ళని ఒకళ్ళు పట్టేసుకుంటూ, ఒకళ్ళని ఒకళ్ళు పీక్కు తింటూ బతికే బతుకులు ఎలా? గుణ సంపద పెరిగితే స్వేచ్ఛ కూడా ఉంటుంది. తాను స్వేచ్ఛగా ఉన్నాడు రాముడు, వాటికీ స్వేచ్ఛ ఇచ్చాడు. మనం స్వేచ్ఛగా ఉందాం అనుకున్న వాళ్ళు, ఇతరులకు ఆ స్వేచ్ఛ కావలసి ఉంటుందన్నది గుర్తు ఉండొద్దా? నాకేనా స్వేచ్ఛ? నేను స్వేచ్ఛగా ఉంటాను, మా అమ్మాయికి స్వేచ్ఛ ఇవ్వకూడదంటే ఎట్లా? మా అబ్బాయికి స్వేచ్ఛ ఇవ్వను! అదేంటంటే, వాళ్లకి తెలియదు అంటారు. నీకు తెలుసా? నీకూ తెలియదు. అందరం తెలియని వాళ్ళమే. మనం చేయ్యసినవి మనం చేస్తే, వాళ్ళు చెయ్యాల్సినవి వాళ్ళు చేస్తూ ఉంటారు కదా! సలహా వరకూ ఇస్తూ ఉండొచ్చు ఎవరికయినా, భార్యకయినా, పుత్రులకి అయినా. ఎవరయినా, ప్రతీవాడు బుడుగు చెప్పినట్టు, "నా అంతటి వాడిని నేను" అన్నట్టుగా ఉంటాడు ఈ రోజుల్లో. కాబట్టి, అడిగితే మంచి మాట చెప్పడమే. అడగకపోతే, అది కూడా వద్దు. ఎవరయినా అంతే.

అంచేత, ఇన్ని గుణాలతో ఆమె చాలా అద్భుతంగా తయారయ్యి... తనకి సాటి అయిన రాకుమారి మొత్తం ఏ లోకంలోనూ లేదండి. భూలోకమే కాదు, యక్షలోకంలో లేదు, కిన్నెరలోకంలో లేదు, దేవలోకంలో లేదు, ఎక్కడా లేదు. ఇలా లేకపోతే, తండ్రికి భయం వేసింది, ఈమెకి భర్తని ఎలా తెస్తాం అని. ఇన్ని గుణములు ఉన్నటువంటి అమ్మాయి, కన్యను, సరిసమానమైనటువంటి గుణములు ఉన్నవాడికి ఇవ్వాలి కదా! అంటే, గుణమే ప్రధానం వివాహానికి. మిగతావి కాదు. ఆ గుణ పొంతన లేకపోతే విడిపోతారు, లేకపోతే ఏదో ఏడుస్తూ బతుకుతుంటారు. తిట్టుకుంటూ,

తన్నుకుంటూ, అరుచుకుంటూ బతుకుతుండడం ఒక పద్ధతి. ఎందుకీ పీడ అని, హాయిగా వాడికీ స్వతంత్రం ఇచ్చి, మనం స్వతంత్రంగా బతకడం మరో పద్ధతి. అమ్మమ్మా అలా చెప్పకండి అంటారు మనవాళ్ళు. భవిష్యత్తు అదే! రోజూ పోట్లాడుకునే బదులు, నువ్వూ హాయిగా ఉండొచ్చు, తనూ హాయిగా ఉండొచ్చు. ఏమిటక్కడ నష్టం? వివాహం సంబంధం అవ్వాలి తప్ప, బంధం కాకూడదే! అంచేత, వివాహం చేసుకున్నప్పుడే ఆ తెలివి ఉండాలి. తర్వాతొస్తే ఆ తెలివి కష్టం కదా!

అంచేత, ఈయన భయపడిపోయాడు తండ్రిగా, ఎవరా, ఎవరా అని. అంతవరకూ నిన్న కథ. ఈ కథే ఇవ్వాళ ఈ ప్రజ్ఞా పరంగా ప్రాణముల గురుంచి చెప్పడానికి చెప్పాను మళ్ళీ. అశ్వపతి సామాన్యుడు కాదు. అతను చేసిన తపస్సు సామాన్యమైనటువంటిది కాదు. అలాంటి తపస్సు అతను చేసినటువంటి సందర్భంలో... ఈ పెళ్లి కొడుకుల కోసం తల్లిదండ్రులు ప్రయత్నం చేస్తుంటే, చెప్పదు కానీ, ఇంట్లో ఉండే ఆడపిల్ల అన్నీ వింటూ ఉంటుంది. గుర్తు పెట్టుకోండి. మగ పిల్లవాడికి, ఆడపిల్లకి ఒక తేడా ఉంది. మగపిల్లవాడు చాలా vocal గా ఉంటాడు. ఆడపిల్ల అంత vocal గా ఉండదు. అన్నీ వింటూ ఉంటుంది, అన్నీ గమనిస్తూ ఉంటుంది. మగపిల్లవాడి కన్నా లోతుగా ఆలోచిస్తుంది ఆడపిల్ల. తనకు అన్నీ నచ్చితే ఏదయినా సంబంధం చెప్పినప్పుడు... అన్నీ వింటూ ఉంటుంది, అమ్మా నాన్నా మాట్లాడుకోవడం. అన్నీ నచ్చితే, ఏం చెప్తుందో తెలుసా, "మీ ఇష్టం నాన్నా" అంటుంది, ఎదో చాలా బుద్ధిమంతురాలిలాగా! అంతే. వీడు బుర్ర ఉంటే అర్థం చేసుకోవాలి. లేకపోతే ఏమంటుందో తెలుసా? "నాకు ఇప్పుడు పెళ్లి ఎందుకు నాన్నా?" అంటుంది. అంటే ఏమిటి? ఈ సంబంధం ఇష్టం లేదని! మాటల్లో చాలా సంస్కారంగా మాట్లాడుతూ ఉంటారు తెలిసినవాళ్లు. ఇప్పుడే పెళ్ళేంటి అంటే, వాడికి గుండె పగిలిపోతూ ఉంటుంది!

ఆ మధ్య ఒకాయన... ముగ్గురు ఆడపిల్లలు పాపం. పాపం అంటే, ఆయనకి భయం, వాళ్ళ పెళ్ళిళ్ళు ఎట్లా అవుతాయా అని. సరే మొదటి పిల్లకి సంబంధం వెతుకుతూ, ఎదో మంచి సంబంధం వస్తే, "ఏమే ఇలా పిల్లవాడు ఇలా చదువుకున్నాడు", ఆ అమ్మాయి డాక్టర్, "ఏం చెయ్యమంటావు" అంటే, చెల్లిలికి చూడండి సంబంధాలు అని చెప్పింది. ఈయనా డాక్టరే. అదేంటి? పెద్ద పిల్లకి సంబంధం చూస్తుంటే, చెల్లిలికి పెళ్లి సంబంధం చూడండి నాన్నా అంటే, ఆయన ఆలోచించాడు, ఏమిటి ఇట్లా చెప్పింది అని. ఏమిటి, ఈ పెళ్లి సంబంధం ఇష్టం లేదా అని. మనలోమన మాట ఉన్నదున్నట్టు చెప్పు, నువ్వు ఎవరినయినా ప్రేమించావా అని అడిగేసాడాయన. కదా! లేకపోతే చెల్లిలికి చూడమనడం ఏమిటి? అంటే, అవునని చెప్పింది. చూడండి ఎలా ఉందో? మరెందుకు, కానిచ్చేసాడు ఆయన! ధీరుడు. పిల్లకి నచ్చిన పిల్లవాడు. ఇంక మనకి బాధ లేదు కదా! పిల్లకి నచ్చని పిల్లవాడిని నువ్వు తెచ్చి కట్టవో, వాడితో పాటు నిన్ను కూడా వేయించేస్తుంది కదా!

అంచేత, ఈ అమ్మాయి ఇంటికి సంబంధాలు వస్తుంటే వింటోందండి అన్నీ. అలా వింటూ, వింటూ, అన్నీ కాదు... ఇవన్నీ చూడండి మరి భారతంలో ఉన్నాయంటే నమ్మ బుద్ధేస్తుందా? ఇవన్నీ కూడా, they are valid at all

times. రామాయణం, భారతం... they are eternally valid scriptures eternally. అవేవో పాతవనుకోబోకండి, అవి శాశ్వత కథలు.

అంచేత, వింటూ వింటూ ఆవిడేం చేసిందంటే, లోపల ఈ విన్న వాళ్ళలో సత్యవంతుడి గురించి విన్నదావిడ. ద్యుమత్సేనుడయిన రాజు యొక్క కుమారుడాయన. ద్యుమత్సేనుడంటే? ద్యౌ అంటే వెలుగు. అంచేత, వెలుగు సేనలు కలవాడని అర్థం. మనలో కూడా బాగా వెలుగంటూ పెరిగితే, లోపలుండే దేవతలందరూ మనకి సహకరిస్తూ ఉంటారు, తెలుసా! మనం చక్కగా సద్గుణములను, అంటే ధర్మపరంగా జీవిస్తూ ఉంటే, దేవతల సహకారం విపరీతంగా ఉంటుంది. దేవతా సమూహం నీకు సహకరించడానికి ఎప్పుడూ అప్రమత్తులై ఉంటారు, లోపలా, బయటా కూడా. అదే ధర్మరాజు కథ. అదే, రాముడి కథ. రాముడు తనకు తాను దేవుడని తెలియదు. తెలిస్తే, కథ కాదది. నిజంగా తెలీదు. నరుడే! నేను ఫలానా వారి అబ్బాయిని, నా పేరు ఇదని, ఇదే నా address అని చెప్తాడు ఎన్ని సార్లు అడిగినా. ఋషులు పొగిడి నువ్వు మహాత్ముడివి, నువ్వు విష్ణుమూర్తివి, ఇలా దిగి వచ్చావంటే, అదేం నాకు తెలియదు, నాకు తెలిసిందొక్కటే, నేను దశరథుడి కుమారుడిని, నా పేరు రాముడు అంటాడు, అంతే! చాలా సార్లు చెప్తాడు ఆ మాట. కానీ, ఆయన చూపించినటువంటి ధర్మ నిరతికి ఎంతమంది దేవతలు వచ్చి ఎన్ని రకాలుగా సాయం చేసారో. అలాగే, ధర్మరాజుకి ఎంతమంది మహాత్ములు, దేవతలు వచ్చి సహకారం చేసారు. ఎందుకిలా సహకారం చేస్తారు? నీ ధర్మ నిరతిని బట్టి చేస్తారు.

అట్లా కొంతమందికి దేవతలు సైన్యములుగా వచ్చి సహాయం చేస్తూ ఉంటారు. ద్యుమత్సేనుడంటే ఆయనలో ఉండేటటువంటి దేవతా సమూహం. మనందరిలో దేవతలూ ఉన్నారు, అసురులు ఉన్నారు. మనం ధర్మపరంగా జీవిస్తూ ఉంటే దేవతల సహకారం లభిస్తూ ఉంటుంది. అధర్మపరంగా జీవిస్తూ ఉంటే రాక్షసులు మన్ని లోబరచుకుంటారు. గుర్తుపెట్టుకోండి. అంటే, రాక్షస గుణమే లోబరుచుకోవడం. ఇప్పుడు మనం ఎవరినయినా లోబరుచుకుందాం అని బుద్ధి మనకుందనుకోండి, అది మనలో రాక్షసత్వం. లోబరుచుకోవడం ఎందుకు? స్నేహంగా ఉండొచ్చు, ప్రీతిగా ఉండొచ్చు, లోబరుచుకోక్కర్లేదు. ఆ లోబరుచుకునే బుద్ధి రాక్షస బుద్ధి. నువ్వు లోబరుచుకోవాలి వీణ్ణి మనం అనుకున్నామనుకోండి, వశం చేసుకుందాం అనుకున్నాం అనుకోండి, అప్పుడు నీలో రాక్షసులు పని చెయ్యడం మొదలు పెట్టి, నువ్వు క్రమంగా దానవుడివి అయిపోతావు, రాక్షసుడివి అయిపోతావు. మనుషులే రాక్షస ప్రవృత్తితోనైనా ఉండొచ్చు, దైవీ ప్రవృత్తితోనైనా ఉండొచ్చు. అంచేత, ద్యుమత్సేనుడు చాలా ధర్మపరుడై, దేవతా సమూహముల సహకారంతో జీవిస్తూ, మూడవ కన్ను కూడా కలిగి ఉండేవాడు. అంటే, అంత దృష్టి. ఆ సమయంలో సత్యవంతుడు పుడతాడు. ఆ తర్వాత ఈ ద్యుమత్సేనుడు తనలో ఉండేటటువంటి అహంకారం కారణంగా శత్రుత్వాన్ని కలిగించుకుంటాడు తన రాజ్యంలో తనకే. కొంతమంది తీరి కూర్చుని శత్రువులని పెంచుకుంటూ ఉంటారు. కొంతమంది ఉన్న శత్రువులని కూడా క్రమంగా మిత్రులని చేసుకుంటారు. శత్రువులు పెరగడం పెద్ద విషయం కాదు. అలా జీవితంలో ముందుకు వెళ్ళిన కొద్దీ పెరుగుతూనే ఉంటారు వాళ్ళు. ఎందుకంటే, నచ్చిన వాళ్ళు... ముందు నచ్చిన వాళ్ళే కదా తర్వాత నచ్చని వాళ్ళు అవుతారు. ఎవరికయినా ఇద్దరి మధ్య పరిచయము లేదనుకోండి, వాడు శత్రువూ

కాదు, మిత్రుడూ కాదు. ఎప్పుడయినా, ఎవడయినా శత్రువు అయ్యాడంటే, అంతకు ముందు వాడు మిత్రుడు అయ్యి ఉండాలి. అప్పుడే శత్రువు అవుతాడు. లేకపోతే శత్రువు కాలేడు. ఊరికే ఉట్టి పుణ్యానికి ఎందుకు శత్రువు అవుతాడు? మిత్రుడే, బాగా పూసుకోవడం వల్ల, కొంత రాపిడి వల్ల వేడి పుట్టి, దాంట్లోంచి కొన్ని వైవిధ్యమైనటువంటి భావాలు పుట్టి, అంతకుముందు friends, ఇప్పుడు ఒకడి పీక ఇంకోడు నొక్కెయ్యడానికి ready గా ఉంటారు.

ఈయన తన రాజ్యంలో, తన పాలనలో... ఇప్పుడు చూడండి మనకి సినిమాల్లో చూపిస్తూ ఉంటారు. రాజుగారు ఉంటారు, అన్నీ అందరికీ అప్ప చెప్పేస్తాడు, మంత్రికి, సేనాధిపతికి, అందరికీ అప్ప చెప్పేస్తాడు. అప్ప చెప్పేసిన తర్వాత మంత్రో, సేనాధిపతో, స్వతంత్ర బుద్ధి ప్రకటిస్తారు. ప్రకటించేసిన తర్వాత, రాజుకి అది తెలిసి అలా గంట కొడతాడు, ఎవరక్కడ అని. భటులు వస్తారు కదా! వస్తే, రాజుగారు అంటారు, వీణ్ణి బంధించు అంటాడు. అంటే, వాడక్కడ నుంచి వికటంగా నవ్వుతాడు. నవ్వి, ఇహిహిహి అని, బంధించండిరా వాడిని... ఎవరినీ? రాజుని! అంటే, ఆ భటులు వీడిని బంధిస్తారు. అంటే ఏమిటి? రాజుగారు వాడికీ, వీడికీ అప్ప చెప్పేయడం వల్ల భటులు అందరూ వాళ్లకి వశమై పోయి, ఆ భటులందరూ సేనాధిపతికో, మంత్రికో పని చేస్తూ ఉంటారు. ఈ రాజు గారేముందిలే అన్నట్టుగా ఉంటుంది! అందుకని, వీడు గంట కొట్టి బంధించండి అంటే, వీణ్ణి బంధిస్తారు కదా! అలాంటి వాటికి, మిక్కిలినేని, ఇలాంటి వాళ్ళని వాడుతూ ఉంటారు సినిమాల్లో. అలా వికటంగా నవ్వడానికి రాజనాల, సత్యనారాయణ... ఊరికే మనకి తెలియడానికి చెప్తున్నా.

అలా ఎందుకిలా జరిగింది? అంతకు ముందు నీతో వినయంగా ఉండేవాళ్ళు నీకు శత్రువులు ఎందుకయిపోయారో? తన రాజ్యంలోంచే తనకి శత్రువులు పుట్టుకొచ్చి, తనకి జాగ్రత్తగా దారి చూపిస్తారు అరణ్యానికి, తమరింక నెమ్మదిగా వెళ్ళవచ్చు వానప్రస్థానానికి అన్నట్టుగా పంపించేస్తారండి ఈ జ్యామత్సేనుడుని. దేనివల్లా? నీవు చాలా మంచి పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎక్కువ అప్రమత్తతో లేకపోతే, నీ మాటలోని అశ్రద్ధ వల్ల, చేతలో అశ్రద్ధ వల్ల, నీ చుట్టూ ఉండే వాళ్ళలోనే ఒకడికి నీ మీద ద్వేషం పుట్టవచ్చు. అందుకనే, ఎక్కువచోట్ల అంతరంగికుడే వ్యతిరేకి అయిపోతాడు. వాడో, వీడో వ్యతిరేకి అయితే అంత ఇబ్బంది ఉండదు. అంతరంగికుడే వ్యతిరేకుడు అయిపోయాడనుకో ఇబ్బంది ఎక్కువ. అలా అయిపోవడం చేత, ఈ జ్యుమత్సేనుడికి అరణ్యవాసం ఏర్పడుతుంది. చూడండి ఎలా అయిపోయాడో, అన్నీ తెలిసిన వాడు పాపం, అంత మంచివాడు అరణ్యానికి వెళ్ళిపోయాడు. ఎంచేత? శత్రువుని పుట్టించాడు. ఈ శత్రువులని పుట్టించుకునే విద్యలో మానవుడు చాలా గొప్పవాడు. ఉట్టి పుణ్యానికే ప్రతీ వాడిని శత్రువు చేసుకుంటూ ఉంటాడు. మరి చాలా మంది శత్రువులు పెరుగుతున్నారట అంటే, మనలో ఏదో లోపం ఉందని అర్థం చేసుకోవాలి. మాట తేడాయో, చేత తేడాయో, కొంత మదమో, ఏదో ఉంటుంది. ఏం లేకపోతే అలా ఎందుకు పెరుగుతూ ఉంటారు? మొన్నటి వరకూ బాగున్నవాడు, ఇవాళ్ళ ఎందుకు బాలేదు మనతో వాడు? తేడా మనలో ఉంటే మనం సర్దుకోవాలి. వాడిలో ఉంటే మనం wait చెయ్యాలి. రెండు రకాలు. చాలా నిష్కర్షగా నిన్ను నువ్వు పరిశీలించుకుంటే, నాలో తేడా లేదనిపించినప్పుడు, వాడితో నువ్వు ఆప్యాయంగా ఉంటూనే ఉండాలి. అప్పుడు వాడిలో తేడా ఉంటే అది కూడా సర్దుకుంటుంది. ప్రతికూల పరిస్థితులను అనుకూల పరిస్థితులుగా చేసుకునేటంటివాడు

ఉత్తముడు. అనుకూల పరిస్థితులను ప్రతికూల పరిస్థితులుగా చేసుకునే వాళ్ళని ఏం అంటాం? అజ్ఞానం చేత తెలియని వాళ్ళే కదా!

అంచేత, అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు తీరి కూర్చుని పాడు చేసుకుకోవడం జరిగిందాయనకి. అలా జరగడం చేత ఆయన అడవికి వెళ్ళిపోయాడండి. పంపించేసారు. Compulsory గా retire చేసి పంపించేసారు. పంపించేస్తే, అరణ్యంలో ఉన్నాడు. ఏం చేస్తాడు, ఆరాధన చేసుకుంటూ ఉన్నాడు. కొడుకున్నాడు. చూడండి, ఆ రాజుగారికి కొడుకు లేదు, ఈ రాజుగారికి కొడుకున్నాడు, రాజ్యం లేదు. ఆ కొడుకేం చెయ్యాలండి? మామూలుగా సాదాసీదా రాజుగారి కొడుకయితే, ఎదో విప్లవం సృష్టించాలి, రకరకాలుగా బాధలు పెడుతూ ఉన్న వాళ్ళని, ఎదో విధంగా రాజ్యం సంపాదించుకోవాలి కదా? ఆలా లేడండి సత్యవంతుడు. అదీ సత్యవంతుడు. చాలా ఆశ్చర్యం. తన తండ్రి రాజ్యం నుంచి ఆయన అనుయాయులే తండ్రిని, తనని, తన తల్లిని అరణ్యానికి పంపిచేస్తే, అరణ్యంలో తండ్రికి, తల్లికి సేవ చేసుకుంటూ, తండ్రిగారు చేసే ఆరాధనకి సమిధలు, తల్లిగారు చేసే వంటకి కట్టే పుల్లలు రోజూ ఏరుకొస్తుండే వాడండి.

అట్లా ఉంటారా ఎవరయినా? అదీ ధీరత్వం. ధీరుడే అలా ఉండగలడు. అందరూ అలా ఉండలేరు. ఏమిటా ధీరత్వం? మనది కానిది మన దగ్గరుకు రాదు, మనదైనది మన దగ్గర నుంచి పోదు. అంతే! గుర్తుపెట్టుకోండి. ధీరుడు అలా ఉంటాడు. ప్రతీ దానికి అలా ఆశ పడి పరిగెత్తడు. ఎంచేత అంటే, నీదయితే నీ దగ్గరకు వస్తుంది, నీది కాకపోతే నువ్వు ఎంత ప్రయత్నం చేసినా నీకు అది దక్కదు. మన వాళ్ళు సామెత చెప్తూ ఉంటారు, వంటి నిండా నూనె పూసుకుని పుట్టెడు నువ్వుల్లో పొర్లినా, అంటే నువ్వే అంటుతుంది తప్ప మొత్తం అంతా అంటదు వంటికి కదా! ఒక ఇద్దరు అలా పూసుకుని, ఓ బస్తాడు నువ్వులు కొనుక్కుని, వాటిలో అటూ ఇటూ బాగా పొర్లారండి. ఒకడికి అంటినంత ఇంకొకడికి అంటవు నువ్వులు. ఎందుకీ సామెత చెప్పానో తెలుసా? నీవు ఇదివరకూ చేసినటువంటి పుణ్య ఫలమే నీకు ఇప్పుడు వస్తుంది. దాన్ని ఎవ్వరూ దొంగిలించలేరు. అలాగే, నువ్వు ఇదివరకూ చేసిన పిచ్చి పనులు, అవి నువ్వు ఎన్నిరకాల రక్షాకవచాలు కట్టుకున్నా, తాయెత్తులు కట్టుకున్నా వచ్చేస్తుంది. అంతే! అది సృష్టి ధర్మం. బాగా వంటి నిండా తాయెత్తులు కట్టుకున్న వాళ్ళు కనిపిస్తూ ఉంటారు. వాళ్ళు చొక్కా విప్పితే బోల్డు తాయెత్తులు ఉంటాయి, వంటి నిండా తాయెత్తులు, ఇక్కడ తాయెత్తులు, ఎక్కడ పడితే అక్కడ తాయెత్తులు. మళ్ళీ ఉంగరాళ్ళు. ఎందుకండీ అంటే, ప్రతీ వాడు ఎదో ఒకటి చెప్తాడు కదా! భయం ఉండేవాడు ప్రతీ వాడూ ఒకటి చెప్తాడు. నువ్వు ఎన్ని తాయెత్తులు కట్టుకుని, ఎన్ని రక్షాకవచాలు పెట్టుకుని, రోజూ రక్షాకవచం చదువుకున్నా, నీకు రావలసినది నీకు వచ్చేస్తుంది. అది అయినా అంతే, ఇది అయినా అంతే! అది తెలిసిన వాడికి భయం ఏమిటండీ? మనకి రాజ్యం అనేటటువంటిది మనకి యోగంలో ఉంటే అదే వస్తుంది. అది ధీరుడే అలా ఉండగలడు. అందరూ అలా ఉండలేరు. ఉండగలరా?

అలా అరణ్యంలో పడి ఉండి, మాటిమాటికి అదే నెమరు వేసుకుంటూ ఉండడు సత్యవంతుడు. మా నాన్నకి అన్యాయం జరిగిందని ఎవరికి చెప్పుకుంటాడు అరణ్యంలో? భావనలో కూడా ఉండదండి. అది మరి ఎవరూ చెప్పరు

సత్యవంతుడి గురించి. అతని పేరే సత్యవంతుడు కదా! అది మనదయితే మన దగ్గిరికి నడిచి వస్తుంది, అది మనది కాకపోతే మనం ఎంత దాని వెంటబడ్డా మనకి దక్కదు కదా! అందుకని, అదృష్టవంతుడు అరణ్యంలో కూర్చున్నా వచ్చి వరించేస్తుందటండి. దురదృష్టవంతుడు కోశాగారంలో ఉన్నా వాడికో రూపాయి దక్కదు. మరి ఈ ధర్మం భారతమే చెప్తుంది. ఇలాంటి ధర్మాలు మిగతా గ్రంథాల్లో ఎక్కడ దొరుకుతాయి? దొరకవు.

ఏమిటో తాపత్రయ పడతావు. అందుకని, వాటి గురించి, వీటి గురించి తాపత్రయ పడక, నీకు అంది వచ్చిన కర్తవ్యాలని నిర్వర్తిస్తూ ఉండు అనేటటువంటిది మనకి నేర్పిన ధర్మం భారతీయుడికి. తల్లితండ్రుల యెడల, సోదరుల యెడల, భార్య యెడల, పుత్రుల యెడల, నీపై ఆధార పడిన వారి యెడల నీ కర్తవ్యాలు ఉన్నాయి. అవి నిర్వర్తిస్తూ నువ్వు తల వంచుకుని పని చేసుకుంటూ ఉంటే నీకు రావలసినవన్నీ నీకు వచ్చేస్తాయి – మంచీ, చెడూ. రెండూ అనుభవించెయ్యి, అయిపోతుంది! అది మార్గం.

అది తెలిసినటువంటి ధీమంతుడు సత్యవంతుడు. అంచేత, ఆయన రోజూ పొద్దున్నే ఆరాధన చేసుకుని, తల్లితండ్రులు దగ్గర అనుమతి తీసుకుని అడవికి వెళ్తాడు. అడవికి వెళ్ళి ఏం చేస్తాడు? అప్పటికప్పుడు కొడితే మనకి, అప్పుడు కొట్టిన కొమ్మల ద్వారా మనం వంట చేసుకోలేం కదా! అందుకని, వంటకి, తండ్రి చేసుకునే హోమాది కార్యక్రమాలకి ఎండు పుల్లలు ఎరుకొచ్చేవాడు. హోమం చేసేటటువంటి పుల్లల్ని సమిధలు అంటాం. ప్రత్యేకంగా అవి రావి, మఱ్ఱి ఇలాంటి వాటితో… మరి రాలి ఉంటాయి అరణ్యంలో, అవి ఎరుకొచ్చేస్తాడు. అమ్మకి కట్టెపుల్లలు ఎరుకొస్తాడు. అలాగే, ముందు కాలానికి పనికి వచ్చేట్టటుగా కొన్ని కట్టెలు కొడతాడు కూడా చెట్టు నుంచి. కొన్ని కొమ్మలు కొట్టి, ఇంట్లో దాన్ని store చేస్తే, కొన్నాళ్ళకి ఎండుతాయి. ఇవీ ఆయన కార్యక్రమం. పొద్దున్నా, సాయత్రం దైవారాధన, తల్లితండ్రులకి సహాయంగా ఉండడం. వారికి అన్ని విధాలుగా తానే ఆధారం. అలా ఉంటుంది.

ఈ తండ్రిగారికేం జరిగిందంటే, కళ్ళు కూడా పోతాయి. అది చూడండి! అంటే, కన్ను పోయిందంటే అర్థం ఏమిటి? కన్ను పోయిందంటే వెలుగు పోయిందని అర్థం. అంతకుముందు దేవతలు బాగా ఆవరించి ఉన్నప్పుడు, మనకి మూడవ కన్ను కూడా తెరుచుని ఉండేది. ఇప్పుడు మనలో సద్గుణాలన్నీ ఒక్కసారి అట్లా ఎదో కర్పూర హారతి కాలి పోయినట్టుగా, కరిగి పోయినట్టుగా కరిగి పోయింది. ఇప్పుడు కనబడదు కూడా! అంటే, కన్నులున్నంత మాత్రాన కనబడక్కర్లేదు! కళ్ళు పోయాయంటే అవగాహన పోయిందని అర్థం. కళ్ళు పోయాయట, రాజ్యం పోయిందట. ఆయన ఏవరట? ద్యుమత్సేనుడట సహజంగా! ద్యుమత్సేనుడు ఈ విధంగా పోగొట్టుకున్నాడు. అతని కుమారుడు. అవన్నీ పోకముందు పుట్టినవాడు. అతడు ధీమంతుడు, స్థిరమతి, సద్గుణవంతుడు.

అంచేత, వీరందరి గురుంచి, రాజుల గురించి వచ్చిన వాళ్ళు చెప్తూ ఉంటారు కాబట్టి, ఈ అశ్వపతిగారి గృహానికి విచ్చేసేటటువంటి అతిధులు, మిత్రులు, ఋషి పుంగవులు వస్తూ ఉంటారు కదా! వాళ్ళు ఆ రాజకుమారులు, ఈ రాజకుమారులు ఇట్లా ఇట్లా అని చెప్తూ, సత్యవంతుడి గురించి కూడా చెప్తారు. చెప్తే, ఈవిడకి సత్యవంతుడు నచ్చుతాడు. అది చూడండి! ఉద్యోగం పోయింది, అమెరికా నుంచి వచ్చేసాడు, అమ్మా నాన్నా dependents అంటే

పిల్లనిస్తారా ఎవరయినా? పిల్లవాడికి ఉద్యోగం లేదండి, ఉన్న ఉద్యోగం పోయింది. పోనీ independent ఆ? కాదు! అమ్మా, నాన్నా ఎప్పుడూ ఆ అబ్బాయితోనే ఉంటారాండి అని అడుగుతూ ఉంటారు. అదేంటండీ? పెళ్లి సంబంధానికి వెళ్ళేటప్పుడు ఈ పిల్ల తల్లీతండ్రి, ఆ అబ్బాయికి వాళ్ళ అమ్మా, నాన్నా ఎప్పుడూ వాళ్ళతోనే ఉంటాట్టండి... ఏం ఉండకూడదా? ఏం వాళ్ళకే కదా పుట్టాడు! వాళ్ళే కదా పెంచారు కదా! వాళ్ళుండ కూడదనుకోవడం అంత కన్నా దుర్మార్గం ఇంకేం లేదు ఈ ప్రపంచంలో. అందరి భావం అదే కదా! ప్రతీ తల్లీ తన కూతురికి అవతల అత్తగారు ఉండకూడదని అనుకుంటుందండి. అదేంటండి? అట్లా ఎట్లా? అత్తగారే కాదు, మావగారు కూడా ఎప్పుడూ ఇంట్లోనే ఉంటారట. ఎట్లా అండీ అలాంటిది? ఉండాలి. ఉంటే నీకు సేవకి అవకాశం ఎక్కువ. దాన్ని వల్ల పుణ్యం చాలా సంపాదించుకోవచ్చు. అది తెలియదు ఎవరకీ ఈ రోజుల్లో. వళ్ళు దాచుకోవడం అనే ప్రజ్ఞలో పాండిత్యం సంపాదిస్తున్నారు తప్ప, పెద్ద వాళ్ళకి సేవ చేసుకోవడం వల్ల తరగని ధనం ఏర్పడుతుంది అనే జ్ఞానం తగ్గిపోయింది ప్రపంచంలో. నీ ఇంట్లో తల్లి ఉంటే అది అదృష్టం, తల్లితండ్రులు ఇద్దరూ ఉంటే అది ఇంకా అదృష్టం. వాళ్ళకి నువ్వు ఎంత చేసుకుంటే, వాళ్ళెలాంటి వాళ్ళయినా కానీయండి, మన కనవసరం, అంత పుణ్యం నీకు. అలా కాకుండా, వాళ్ళని తిట్టి పోస్తూ, శాపనార్థాలు పెడుతూ, వాళ్ళకేదో ఇంతా అంతా చేసీ చేయ్యనట్టుగా చేసి పడేస్తున్నావనుకోండి, చాలా దురదృష్టవంతుడివి నువ్వు. ఇచ్చిన అవకాశాన్ని పాడు చేసుకుంటున్నావని అర్థం. ఎంత మనం ఇతరులకి, పైగా మన్ని పెంచి పెద్ద చేసినటువంటి వారికి చేస్తే, అంత మనకి ఆశీర్వచనం అనేటటువంటిది భారతీయ జ్ఞానం. అది సత్యం. అది ఎంత ఎగ్గొట్టి మనం దాచుకుందాం అనుకుంటామో అంత దురదృష్టం. ఏం సందేహం లేదు. ఇంక అంతకన్నా దురదృష్టవంతులు ఎవరూ ఉండరు. అందుకని పిల్లవాడు ఉండాలట, వాడి తల్లితండ్రులు ఉండకూడదట, అది ఇప్పుడు మన కార్యక్రమం.

ఇక్కడ ఈ అబ్బాయికి అసలు రాజ్యం లేదు, అడవిలో ఉన్నారు, తనో రాజకుమారి. తల్లితండ్రులు, మావగారికి కళ్ళు కనబడవు, ఏ సంపదా లేదు. అంటే, మన సంపదంతా తీసుకెళ్ళి అక్కడా... అది కూడా అనుకోదావిడ. కాని, అతనంటే తాను ఇష్టపడిందండి, ఇష్టపడి మనసులో పెట్టుకుంది. అంతవరకూ మనం చదువుకోవడం జరిగింది. అంటే, కథ ముందు చదివేస్తాం, తరవాత నెమ్మదిగా వెనకనుంచి అందులో మనకి పనికొచ్చే విషయాలన్నీ చక్కగా వివరించుకోవాలి. లేకపోతే ఉపయోగం ఏం ఉంది మనకి?

"ద్యుమత్సేనుడి కుమారదు సత్యవంతుడు అత్యంత రూపశాలి అని, మహనీయ గుణవంతుడని ఆకర్ణించిన సావిత్రి, అతని యెడల ఎంతో మక్కువ కలిగినది. కానీ, వల్ల మాలిన సిగ్గు వల్ల, అమె ఈ విషయం జననీజనులకు ఎరిగించలేదు. అటు పిమ్మట నారద మునీంద్రుడు ఒకనాడు మద్రపతి సన్నిదికి విచ్చేసి, సగౌర పూజలందుకుని, ఇష్టాగోష్టి ప్రారంభించాడు. అదే సమయంలో సావిత్రి మన్మథ సామ్రాజ్య లక్ష్మివలే మంద మంద గమనంతో నెచ్చెలిలతో కలిసి అచ్చటికి వచ్చి, అల్లంత దూరంలో నిలిచి, జనకునికెంతో అణుకువతో నమస్కరించినది. అశ్వపతి ఆమెనెంతో వాత్సల్యంతో ఒడిలో కూర్చుండబెట్టుకుని, చల్లని పలుకులతో లాలించినాడు. దేవర్షివర్యుడంత, మద్రేశ్వరా, ఈ కన్య కింత పర్యంతము తగిన వరునికీయ లేదేమి? అని ప్రశ్నించాడు. అశ్వపతి దానికి ఏ విధముగా ప్రత్యుత్తర

మీయక, తనూజ వైపు చూచి, తల్లీ నీకు అర్హుడైన వరుడెవరో నీవే అన్వేషించి, వరించ వలసినది. అన్ని విధాలా నాకిదే అభిమతము."

ఎంత సంస్కారం అండి అది? మనకంటూ ఎవరూ తట్టలేదు. తనకి ఎవరి యందయినా మక్కువ ఉంటే వాళ్ళకే ఇచ్చి పెళ్లి చేస్తానన్నాడు. Aquarian age, aquarian age అంతా independent అయిపోతున్నారు అని గొడవ చేసేస్తున్నాం కదా! అసలు స్వతంత్రత అనేటటువంటిది సంస్కారవంతుడు ఇతరులకి ఇచ్చేది. తన మీద తనకి నమ్మకం ఉండాలి. తన మీద తనకి నమ్మకం ఉంటే, పిల్లల మీద కూడా తనకా నమ్మకం ఉంటుంది. అలా ఉండాలి. అలా లేకపోతే, నీవు స్వతంత్రుడివి కాదు, నీవు ఎవరికీ స్వతంత్రాన్ని ఇవ్వవు. అవిశ్వాసమే కారణం దీనికంతా. నీ మీద నీకు నమ్మకం ఉంటే, నీ పిల్లలెలా ఉంటారో నీకు తెలిసి ఉంటుంది. మా చిన్నతనంలో మేము చదువుకుంటుంటే university లో, ఆరుగురు పిల్లలం... మా తల్లితండ్రులకి మేము ఏడుగురు పిల్లలం, ఆరుగురు మగ పిల్లలం. ఏదో అల్లరి చేస్తున్నట్టుగా కనిపిస్తుండేది మా అమ్మగారికి ఎప్పుడూను. "ఏమిటో వీళ్ళు అల్లరి చిల్లరిగా తిరుగుతూ ఉంటారు, మీరు పట్టించుకోవట్లేదు" అన్నారు మా అమ్మగారు. అంటే, మా నాన్నగారు అన్నారు, "వాళ్ళు నా పిల్లలు, నేను వెధవనయితే, వాళ్ళూ వెధవలవుతారు" అని చెప్పారు. Simple. నేను వెధవనయితే, వాళ్ళూ వెధవలవుతారు. నా బట్టే వాళ్ళూ అని చెప్పారండి. విన్న కొడుకెట్లా ఉంటుందండీ? అంటే, ఆయన కొడుకుగా మనకెంత బాధ్యత ఉంది అనేది తెలుస్తుంది కదా! ఎన్నడూ ఇది చదువుకోండి, అది చదువుకోండి, ఇట్లా చదువుకోండి, అట్లా చదువుకోండి, ఇలా చెయ్యండి, అలా చెయ్యకండి అని ఎప్పుడూ చెప్పినవాడు కాదాయన. అలాంటి స్వతంత్రత ఇచ్చిన తండ్రి దగ్గర పెరగడం చేత, నేను కూడా నా జీవితంలో అందరికీ స్వతంత్రమే నా చుట్టూ ఉండే వాళ్ళకి. ఎవ్వరి మీద మనం అంక్షలు పెట్టం, ఎవరయినా కావచ్చు. నేను వారికి స్వాతంత్రత ఇస్తాను. ఇవి ఎక్కడి నుంచి వస్తాయి? నీ మీద నీకు విశ్వాసం ఉంటే. నీలో భయం ఉండడం చేత ఎదుట వాళ్ళని పట్టుకుని కూర్చుంటావు. ఎందుకూ పట్టుకోవడం? నీవాడయితే నీతో ఉంటాడు. నీవాడు కాదు, నువ్వు ఎంత పట్టుకున్నా, నీ వాడు కాదు కదా! మనవాడు అనుకునేవాడు ఎవడూ? మనతో భావాల్లో అనుగుణమైన భావాలు, అనురూపమైనటువంటి భావాలు కలిగినవారు మనవారు. అనురూపమైన భావాలు లేనివారిని మన వాళ్ళు అని ఊరికే పట్టుకుంటే కలిగేటటువంటిది ఘర్షణే తప్ప, ఏం ఉందండి ఆనందం? మనం చెప్పిన మాట వాళ్ళు వినరు, మనకేదో వాళ్లకి చెప్దామని అనుకుంటాం. వాడు వినడుగా? ఎందుకూ చెప్పడం? వినే వాడికే చెప్పుకో! ఇప్పుడు ఇలాంటి సభలు జరిగినప్పుడు, ప్రతీవాడికీ వాడికి ఇష్టమైన వాళ్ళు వింటే బావుంటుం దనిపిస్తుంది. ఇష్టమైన వాడికి నీకు అనిపించినట్టుగా వాడి కనిపించాలి. ఇప్పుడు మనమంతా ఇక్కడ చేరి, పొద్దున్న పూట, ఇట్లా ఆదివారం కాలాన్ని వినియోగిస్తున్నాం కదా! ఎందుకిలా చేస్తున్నాం? మనమందరికీ ఒకే విధమైనటువంటి భావము ఉండడం చేత. అలా కాదనుకోండి, ఎందుకొస్తారు మీరు? మీరు రాలేదనుకోండి, ఎందుకు రాలేదని అడిగితే ఏమిటి ఉపయోగం? మీకు ఇష్టం లేకపోతే రారు, ఇష్టమైతే వస్తారు. జీవ స్వాతంత్రం అనేటటువంటిది సంస్కారములలో అత్యుత్తమమైనటువంటి సంస్కారం.

అంచేత, తండ్రి పిల్లకి చెప్తున్నాడు, నువ్వే నిర్ణయం చేసుకో తల్లీ వరుడిని అని. అలాంటి కథొకటి ఉందని తెలుసా మనకి భారతంలో? అని చెప్పాడండి. నన్నిడిగితే అలా చెప్పడం పెద్ద విషయం ఈ రోజులల్లో! తల్లితండ్రులు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి, తనకి ఇష్టమైన పిల్లవాడిని ఇచ్చి పెళ్లి చేస్తే, పిల్ల సుఖపడుతుందనే జ్ఞానం ఉండాలి, ఒకటి. రెండోది, మనసిచ్చేసిన తర్వాత ఇంకొకళ్ళకి నువ్వు ఇచ్చి చేస్తే సుఖపడుతుందా? సుఖపడదు. భారత స్త్రీ ఒక్కసారి మనసిచ్చేస్తే ఇంక అంతేనండి! గుర్తుపెట్టుకోండి. ఇతర స్త్రీలకి భారత స్త్రీలకి చాలా తేడా ఉంది. వీడొకడు కాకపోతే ఇంకోడు అన్నట్టుగా ఉండదు. ఒకడే! అట్లా ఉంటేనే భారత స్త్రీ. లేకపోతే కాదు. వస్తువులని మార్చినట్టు మనుషులని మార్చుకోరు భారతీయులు చాలా కుసంస్కారం ఉంటే తప్ప. ఒకచోట మనసిచ్చి, ఇంకోచోట కాపురం ఎట్లా చేస్తుందండి, చెయ్యలేదు కదా! అప్పుడా కాపురం బావుంటుందా? బావుండదు కదా! అంచేత, ఈయన ఇక్కడ అశ్వపతిగారికి అసలు కూతురిని చూస్తుంటే విపరీతమైనటువంటి వాత్సల్యమే కాదు, గౌరవం కూడా. ఎందుకంటే, అట్లా అమ్మవారే దిగి వచ్చినట్టుగా కనిపిస్తూ ఉంటుంది ఇంట్లో. ఇప్పుడు ఈ అమ్మవారి లాంటి అమ్మాయికి నేనెక్కడ తేగలను, తనే తెచ్చుకుంటుంది అన్న భావంతో చెప్పాడండి.

చెప్తే, "మద్ర తనూజ ఆ పలుకులు ఆలకించి, కొంత సేపు ఎంతో లజ్జించి..." ముందు కొంచెం తటపటాయించింది చెప్పడానికి. "తండ్రీ, సాల్వపతి భూనాథుడు, ద్యుమత్సేనుడి తనయుడు సత్యవంతుని యెడల నాకెంతో కూరిమి కలిగినది." ఇలా మాట్లాడడానికి, పక్కన నారద మహర్షి ఉన్నాడు కదా, లోపల ఎంత ధైర్యం ఉండాలండి? అలా చెప్పిందావిడ, "అతనికి నన్నిచ్చి వివాహం జరిపించ వలసినది. శాత్రవులు ఏకీభవించి తన రాజ్యము యావత్తు అపహరించినందు వల్ల, సాల్వపతి ఇప్పుడు సకుటుంబపరంగా కాననంలో నివసిస్తూ ఉన్నాడు." కాకపోతే, అది కూడా చెప్పేసింది. "దైవ యోగం వల్ల ఆ మహనీయునికి అంధత్వం కూడా సంప్రాప్తించినది. ఏది ఏమయినా ఇంక సత్యవంతుడే నా భర్త."

ఎంత clarity ఉందండి? అంటే, అలాగే ఫలానా రాజుగారి అబ్బాయి అనుకుంటావేమో, అడవిలో ఉన్నాడాయన. రాజ్యం పోయింది. కళ్ళు కూడా పోయినాయి దైవ వశం వల్ల. అయినప్పట్టికీ, ఆయన కొడుకు సత్యవంతుడిని నేను భర్తగా మనసులో అంగీకరించేసాను అన్నది. రామాయణంలో అమ్మవారు రాముడిని చూసినప్పుడు కూడా అలాగే చేస్తుంది. ముందే రాముడి గురించి వింటారు. ఆడపిల్లలు అన్నీ వింటూ ఉంటారండి, ఇంట్లో వాళ్ళ గురించి, వీళ్ళ గురించి మాట్లాడుకుంటే. విని చెప్తారు మనమడిగితే. మనం అడగం కదా! మనం decide చేసేస్తాం. మన దగ్గర ఉన్న పెద్ద disease ఏమిటంటే, we decide for others, we don't let others decide for us కదా! నీకు నువ్వు నిర్ణయం చేసుకునే వాడికి, పక్క వాడికి నువ్వు నిర్ణయం చెయ్యడమేమిటి? అడిగితే చెప్పాలి.

తండ్రిగా బాధ్యత కాబట్టి చేస్తే, చాలా జాగ్రత్తగా సరి అయిన వరుడిని తెచ్చి అందించాలి. నువ్వు తెచ్చింది నచ్చలేదనుకో కూతురికి, కష్టం. నువ్వు నచ్చని సంబంధం తెచ్చి చేస్తే ఆ కాపురం సరిగ్గా నెరవేరుతుందా? నెరవేరదు.

అంచేత, ఈవిడిలా చెప్పేసిందండి. అడిగాడుగా మరి. నువ్వే తెచ్చుకోమంటే, తెచ్చేసుకుంది. రాముడే నా భర్త అనుకుందండి అమ్మవారు. అలాగే, రుక్మిణీదేవి కృష్ణుడి గురించి విని, ఈ జన్మకి నాకు కృష్ణుడే భర్త అని నిర్ణయం చేసేసుకుంది. నిర్ణయం చేసేసుకుని ఏం చేసింది? ఒక love letter కూడా రాసేసింది. ఆ రోజుల్లో love letter ఏమిటండి? ఇప్పుడు love letter రాస్తే, అమ్మో, అమ్మో, ఆ పిల్ల చాలా బరి తెగించేసిందంటాము కదా! తప్పు కదా! అదేంటి, ద్వాపర యుగంలోనే love letters ఉన్నాయి. గుర్తుపెట్టుకోండి, భారత సమాజం ఎప్పుడూ ఆధునికమే! ఓ step ముందే ఉన్నాం అండి, వెనకాల లేం కదా! మరి అవి ఆలోచించం కదా మనం! అంటే, ఆయన కృష్ణుడు, దేవుడు... అలా కాదు. మాములుగా మనిషిలాగ చూడండి. ఒక రాజకన్య, ఎవరో ఒకానయకి, ఒక బ్రాహ్మణుడికి ఇచ్చి love letter ఇచ్చి పంపించిందండి కదా! తన మనసులో ఆయనే భర్త అని నిర్ణయం చేసుకుంది. ఇంక ఎవరయినా కుదరదు ఆవిడకి. ఆయనా అదే నిర్ణయం చేసుకున్నాడట. అందుకని, ఈ బ్రాహ్మణుడు వస్తే, ముసిముసి నవ్వులు నవ్వుతూ, నేనూ ఆ పని మీదే ఉన్నాను అన్నాడు. వచ్చేసాడు, అయిపోయింది కదా! అంచేత, ఇక్కడ ఇలా చెప్పేసింది. Clear గా చెప్పేసింది. మొహమాట పడకుండా, ఊరికే నచ్చులు కొట్టకుండా, మడతలు పెట్టకుండా, ఉన్న విషయం ఉన్నట్టుగా చెప్పేసిందండి. తండ్రి అడిగాడుగా.

"అని వక్కాణించింది. మద్రేశ్వరుడు అంతట నారద మహర్షి వైపు అవలోకించి, ముని నాథా, ముల్లోకాల్లోనూ నీవు ఎరగని వారెవ్వరూ లేరు, నా తనూజ వరించిన ఆ రాజకుమారుడెట్టి వాడో తెలియజేయ వలసినది అని ప్రార్థించాడు". మొట్టమొదటి సారిగా విన్నాడు సత్యవంతుడి గురించి. వింటే, పక్కనే ఉన్నాడు నారద మహర్షి కదా! అసలు ఆ కుర్రవాడు ఎలాంటి వాడో కొంచెం నాకు చెప్తారా, మీకు తెలియందేం ఉండదు కదా! అన్ని చోట్లా తిరుగుతూ ఉంటారు. అందుకని, పది చోట్లా తిరిగే వాడి దగ్గర సమాచారం ఎక్కువ ఉంటుంది కదా! ఎక్కడా తిరగని వాడి దగ్గర మనం ఇలాంటి విషయాలు అడగకూడదు. తిరిగే వాళ్ళని అడగాలి. "ఆ ఊరు వెళ్తుంటావు కదా, ఫలానా వాళ్ళు నీకు తెలుసా", అంటే చెప్తాడు కదా!

అప్పుడాయన చెప్పాడు. "అశ్వపతీ, సాల్వపతి కుమారునికి చిత్రాశ్వుడని వేరొక నామధేయం ఉన్నది". అతడి పేరు సత్యవంతుడు కాదు. సత్యవంతుడు అనేటటువంటిది అతని ప్రవర్తన వల్ల అతనికేర్పడిన బిరుదు. సత్యవంతుడనే తెలుసు మనకి. చిత్రాశ్వుడు అంటే చిత్రమైనటువంటి అశ్వము, అంటే ప్రాణము కలవాడు అని. పుట్టుకతోనే అతనికి ఆ పేరు పెట్టారండి. అశ్వమంటే ప్రాణమని చెప్పాను కదా! అశ్వానికి చాలా రకాల అర్థాలు ఉన్నాయి. అశ్వమంటే సూర్య కిరణములు, అశ్వమంటే ఇంద్రియములు, అశ్వమంటే ప్రాణము. ఇతడు చిత్రాశ్వుడండి. ఎందుకు చిత్రాశ్వుడు అంటే, ఇతడు ప్రాణాలు పోయినట్టే పోయి, తిరిగి వస్తాయి. జాతకంలో అట్లా ఉంది.

మొన్నామధ్య మీరు చూసారో లేదో... కాస్త అప్పుడప్పుడూ ప్రపంచ వార్తలు కూడా వింటూ ఉండాలి. అమెరికాలో, ఆ న్యూజెర్సీ ప్రాంతంలో ఒక అమ్మాయి చచ్చిపోయిందని declare చేసేసారు. Declare చేసిన తర్వాత, ఒక రోజు తర్వాత, రెండో రోజు... ఆవిడ కొన్ని అంగాలు దానం చేసింది శరీరంలో. ఇస్తూ ఉంటారు కదా, కళ్ళు,

కిడ్నీలు, ఇలాంటివన్నీ. ఆవిడ ఏవో కొన్ని అంగాలు దానం చేసింది. ఆ అంగాలు ఆ దేహంలోంచి తీసి, తర్వాత పూడ్చడానికి పంపిస్తారు ఆ దేశాల్లో. మనమయితే కాల్చుకుంటూ ఉంటాం. వాళ్ళు పూడ్చుకుంటారు. అందుకని, అన్నీ ready చేసి బల్ల మీద పడుకోబెడితే, ఆ అంగాలు తీద్దామని, ఆవిడ లేచి కూర్చుందిట. కాస్తోకూస్తో గుండె బలం లేకపోతే, డాక్టరుకి ముందు heart attack రావాలి కదా! మొన్నే, వారం కూడా కాలేదు. రెండో రోజు లేచి కూర్చుంది. అంటే ఏమిటి? పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. ఎట్లా వచ్చినాయో? వాళ్ళకే ఆశ్చర్యం. అన్నీ సరిగ్గా చూసామా, చచ్చిపోయిందని declaration correct గా ఉందా అని. అంటే, చావకుండానే, చచ్చిపోయిందన్నామా? ఇవన్నీ inquiry వచ్చేసినాయండి ముందు. మరి అదలా ఉండగా, తిరిగి వచ్చింది చూడండి, చిత్రాశ్వమే అది. వెళ్ళిపోయిన ప్రాణం తిరిగి రావడం అనేటటువంటిది చిత్రమే కదండి!

అంటే, చిత్రంగా తిరిగి వచ్చేటటువంటి ప్రాణం కలిగినటువంటిది ఉన్నది జాతకంలో. అంచేత, చిత్రాశ్వుడు అని పేరు పెట్టేసారు. అసలు పేరు ఆదట. అంటే, తెలిసి పేర్లు పెట్టుకోవడం ఒకటుంది. మనకి ఇష్టమైన పేరు పెట్టుకోకూడదు. పేరు పెట్టాలంటే జాతక చక్రం పరిశీలించి, పెద్దవారిని అడిగి పేరు పెట్టుకోవాలి. మనం బ్రహ్మాండమైన పేరు పెట్టామనుకోండి, వాడు దానికి పరిపూర్ణంగా వ్యతిరేకంగా ఉన్నాడనుకోండి. అంటే, ఆ పేరుకి విలువేం ఉందండి? అందుకనే, పై దేశాల్లో వాళ్ళు, Stone, Wood ఇట్లా పెట్టుకుంటారు. ఎందుకంటే, they can be better than that అని కదా! Wood, Miller, Muller... Muller అంటే పిండి మర ఆడించేవాడు. అట్లా పెట్టుకుంటే మంచిది. ఎందుకంటే, అంత కన్నా బావుంటాడు. మనం ఇక్కడ రామచంద్రమూర్తి అని పెట్టుకుంటాం కదా పేరు. ఓరి బాబోయ్! రామచంద్రమూర్తి పేరు, ప్రవర్తన ఇంకో రకంగా ఉంటుంది కదా! మైత్రేయ అని పెట్టేసుకుంటున్నాం పేర్లు మనం. మైత్రేయుడు ఎంత బాధ పడాలో కదా! అంటే, తెలిసి పెట్టిన పేరుకి, తెలియక పెట్టిన పేరుకి చాలా తేడా ఉంది.

అంచేత, ఇక్కడ తెలిసి పేరు పెట్టారు. చిత్రాశ్వుడు అనేటటువంటి పేరుందాయనకి. "సదా సత్యమే వక్కాణిస్తుంన్నందు వల్ల అతనికి సత్యవంతుడన్న సుప్రసిద్ధ నామధేయ మేర్పడినది". ఎప్పుడూ సత్యమే మాట్లాడతాడట. "తనహృద్భాషన సత్యముల్" అన్నారు. అంటే, తనువు, భావము, భాష, ప్రవర్తన, మూడూ ఒకే రకంగా ఉన్నాయి. ఇంకో రకంగా ఉండవు.

"తేజోరాశిలో భాస్కరునితోనూ, బుద్ధిలో బృహస్పతితోనూ, శౌర్యములో వాసువునితోనూ, అంటే ఇంద్రుడితోనూ, ఓరిమిలో పుడమితోనూ, కాంతిలో జాబిలితోనూ, సౌందర్యములో అశ్వనీ దేవతలతోనూ అవలీలగా సరితూగ గలడా రాజకుమారుడు" అని చెప్పాడండి. ఎంతటి వాడండి? అద్భుతంగా లేదూ! ఎవరు చెప్పారు? ఊరికే అబద్ధాలు ఆడుతూ, పక్క వాడిని పొగిడేవాడు కాదు నారదుడు కదా! ఒక దేవర్షి ఆయన అలా చెప్పాడంటే, అవునో కాదో మనం ఆలోచించక్కర్లేదు కదా! అంటే, మనం ఎవరినైనా అడిగినప్పుడు కూడా వాడెలాంటి వాడో తెలిసి అడగాలి కదా! ప్రతి వాడినీ అడగ కూడదు కదా!

నారద మహర్షిని అడిగితే ఎన్ని గుణాలు చెప్పాడు. సత్యవంతుడికి ఇన్ని గుణాలు ఉన్నాయని మనకి తెలుసా? తెలియదు. పేరుకి చిత్రాశ్వుడు, మాట్లాడేదెప్పుడూ సత్యము. తేజస్సు సూర్యుని తేజస్సు. అంటే, తేజస్సు ముఖంలో ఉంటుందండి. బుద్ధిలో బృహస్పతికి ఉన్నంత జ్ఞానం ఉన్నది. అందుకనే, కదలక మెదలక వనంలో ఉన్నాడు, అరణ్యంలో, రాజ్యం గురించి తాపత్రయ పడకుండా. శౌర్యము దేవేంద్రుడే. అంత శౌర్యము ఉండి, తన రాజ్యం తన సంపాదించుకోవాలని ఎందుకనుకోలేదో? అది ఎంత గొప్ప విషయం. ఓర్పు, భూమికున్నంత ఓర్పు ఉందట ఆయనకి. కాంతి అంటే సూర్యుని తేజస్సు, చంద్రుని కాంతి ముఖంలో. సౌందర్యము అశ్వనీ దేవతల సౌందర్యమట. మనకి తెలియదుగా. మీకు తెలుసా? అశ్వనీ దేవతలు ఎట్లా ఉంటారో మనకి తెలుసా? అంటే, నారదుడే చెప్పగలడు అశ్వనీ దేవతల సౌందర్యము అంటే, మనమేం చెప్పగలము! అలాంటి సౌందర్యవంతు డాయన. వాళ్ళందరితోనూ అవలీలగా తులతూగ గలడా రాజకుమారడు అని చెప్పాడండి. ఇంకా చెప్పాడు.

అది సాయంత్రం చెప్పుకుందాం. ఎందుకంటే, మరి కథ చెప్తుంటే మనకి సమయం, నాకూ, మీకూ సులభంగా వెళ్ళిపోతుంది. తత్త్వం చెప్తుంటే మీకు నిద్ర కదా! అంచేత, కథలో తత్త్వం చెప్పుకోవడంలోనే తత్త్వం ఎక్కినంత ఎక్కుతుంది, కథ మాత్రం మిగిలి పోతుంది. కథ తప్పకుండా ఎక్కుతుంది. తత్త్వం ఎక్కదు. అశ్వపతి, పంచ ప్రాణాలు, లోపల ప్రాణాలు, బయట ప్రాణాలు అంటే, మీ ప్రాణాలు తీసినట్టు అవుతుంది! అలా కాకుండా, ఇలా కథలోకి వెళ్ళాం అనుకోండి, కథలో అశ్వపతి ద్వారా వాటిని గుర్తు పెట్టుకోవచ్చు కదా! కథలో సావిత్రి ఎలా దిగివచ్చిందో తెలిస్తే, ఆవిడ యముడితో ఎట్లా మాట్లాడగలిగిందో మనకి తెలుస్తుంది. అలాగే, సత్యవంతుడు. So, సత్యవంతుడి గుణాలు ఇంకా ఉన్నాయి. ఒక పేరా అంతా చెప్పాడు ఈ నారద మహర్షి. అంచేత, అదంతా మనం న్యాయం చేకూర్చాలంటే ఇప్పుడు చెప్పుకోకూడదు. మీకేం భయం లేదు, రేపు సాయత్రం లోపల అయిపోతుంది కథ అంతా. కాకపోతే, మనం వివరంగా చెప్పుకోవాలి. సమకాలికంగా మన పరిస్థితులతో పోల్చి చూసుకోవాలి. అలా ఇందులో చెప్పబడిన ధర్మాలు మనకి ఇప్పటికి కూడా అవి చాలా ఉపయోగకరం అని కూడా తెలుసుకోవాలి. ఇట్లా ఆ విధంగా ఈ కథ చదువుకుంటున్నాం.

––– స్వస్తి

# సావిత్రోపాఖ్యానము

## July 21, 2013 సాయంత్రం – ప్రవచనం #4

సోదరబృందానికి హృదయ పూర్వకమైనటువంటి నమస్కారములు. అశ్వపతి, తన కుమార్తె అయినటువంటి సావిత్రిదేవిని ఉద్దేశించి ఈ జగత్తులో నీకు నచ్చినటువంటి యువకుని నీవే నిర్ణయం చేసుకుంటే, నేను వివాహం చేస్తానని చెప్పడం జరిగింది. తండ్రి, కుమార్తె చూపించినటువంటి దివ్య గుణములు, సద్గుణములు ఆధారంగా అలాంటి విశ్వాసాన్ని కుమార్తెయందు ప్రదర్శిస్తాడు నారద మహర్షి సమక్షంలో. అప్పుడు సావిత్రిదేవి తనకి ఈ మొత్తం జగత్తులో ఉండేటటువంటి రాజకుమారు లందరిలోకన్నా, సత్యవంతుడంటే ఇష్టపడుతున్నట్టు చెప్తుంది. చారుల వలన సత్యవంతుడి గురించి తెలిసినటువంటి సావిత్రి ఆ విధంగా తెలియపరుస్తుంది. సావిత్రిదేవి సద్గుణరాశి అయి ఉండడం చేత, జ్ఞానమూర్తి అయి ఉండడం చేత, పుట్టుకతోనే సహజ సిద్ధులు కలిగి ఉన్న కన్య అయి ఉండడం చేత, ఆ విధంగా నిర్ణయం తెలిపి, అటుపైన మరొక విషయం కూడా చెప్తుంది. తాను రాజకుమారి అయినప్పటికీ, సత్యవంతుడు రాజకుమారుడు అయినప్పటికీ, ప్రస్తుతానికి అతని రాజ్యమందు అతనికి రాజ్యం లేదు. అతడు అడవులయందు వసిస్తూ ఉన్నాడు తల్లితండ్రులతో. తల్లితండ్రుల సేవ చేసుకుంటూ ఉన్నాడు. అయినప్పటికీ నేను అతనిని వరించి, వివాహం చేసుకుంటాను అని చెప్పినప్పుడు, ఉదయం చెప్పుకున్నట్టుగా పదివి లేదు, జీవితమందు స్థిరత్వం లేదు. ఆస్థిరుడై, అరణ్యాల్లో ఉంటుంన్నట్టి ఒక యువకుడుని ఒక రాజకుమార్తె ప్రేమించి, పెళ్లి చేసుకుంటుందిట అంటే తండ్రికేలా ఉంటుంది భావం? అలాంటి భావం కలగలేదు అశ్వపతికి. కలగక, అతని గుణగణములను తెలుసుకోవాలని పక్కనే ఉన్న నారద మహర్షిని అడగడం జరుగుతుంది.

అడగడం జరిగితే, నారద మహర్షి సత్యవంతుడి సద్గుణాలు చెప్తూ వస్తున్నాడు. అతడి అసలు నామము చిత్రాశ్వుడని. చిత్రాశ్వుడు అనే పదానికి అర్థం ఏమిటంటే చిత్రమైనటటువంటి ప్రాణములు కలవాడని అర్థం. అశ్వము అనే పదానికి వేదంలో ప్రాణములని, ఇంద్రియములని, సూర్య కిరణములని నానార్థములు ఉన్నాయి. ఇతనికి చిత్రాశ్వుడు అని పేరు ఎందుకు పెట్టారంటే ఇతడి ప్రాణములు ఒక చిత్రమైన రీతిలో అదృశ్యమై, మళ్ళీ దృశ్యము అవడం అనే సందర్భం ఒకటి ఉన్నది. ఆ కుండలిని, అంటే జాతక చక్రంలో అలా ఉండడం చేత అతనికి చిత్రాశ్వుడు అని పేరు పెట్టారు. ప్రవర్తన చేత అతడు, ఈ చిత్రాశ్వుడు, చాలా సత్యవంతుడు. చిన్నతనం నుంచి కూడా సత్యాన్ని ఆశ్రయించినవాడు. సత్యభాషణము, సత్య ప్రవర్తన, మనోవాక్కాయల కర్మలయందు శుద్ధి కలిగినటువంటి ఓ గుణవంతుడు అవ్వడం చేత, అతడి యొక్క ఈ ప్రస్ఫుటమైన ఈ గుణము ఆధారంగా అతనిని సత్యవంతుడని పిలవడం మొదలు పెడతారు. మాములుగా బిరుదులే ఎక్కువగా మిగిలిపోతూ ఉంటాయి పేర్ల కన్నా కదా! అంచేత, ఇతడు నామధేయం మాములుగా నానుడిలో కూడా అందరూ మర్చిపోయారు.

ఇప్పుడు భారతంలో ఇట్లా రాయకపోతే సావిత్రి భర్త ఎవరు అంటే సత్యవంతుడని చెప్తాం. కానీ, జన్మతః అతనికి ఇవ్వబడిన వ్యవహార నామం చిత్రాశ్వుడు. చిత్రాశ్వుడని తెలిస్తే మనకి, కొంత ఊహించవచ్చు ఎందుకిలా పేరు పెట్టారు అని. ఎప్పుడయినా పెద్దలు నామకరణం చేసినప్పుడు జాతక కుండలిని తయారుచేసి, అందులో ఉండేటటువంటి గుణ సమ్మేళనం చూసి, అతని జీవన ప్రయోజనానికి సంబంధించి ఉపయోగపడేటట్లుగా నామకరణం చెయ్యడం అనేటటువంటి విధానం ఒకటి మనకి మన సాంప్రదాయంలో ఉంది, ఋషి సాంప్రదాయంలో. అంచేత, మీకు అన్ని పేర్ల నుంచి దాని లోపల ఉండే అర్థం చెప్తూ వస్తున్నాను. అశ్వపతి అంటే ఏమిటి, సత్యవంతుడుకి తండ్రి అయిన ద్యుమత్సేనుడు అంటే ఏమిటి, అతడికి కళ్ళు పోవడం అంటే ఏమిటి, రాజ్యం పోవడం అంటే ఏమిటి, ఇలాంటి వన్నీ మనం తెలుసుకుంటూ వస్తున్నాం. దీన్ని నిరుక్తం అనేటటువంటి ఒక తాళం చెవి అంటారు. ఈ తాళం చెవి ఉంటే గ్రంథం చదువుకునేటప్పుడు దాన్ని చక్కగా మనం అన్వయించుకుని లోపలి అర్థం మనం తెలుసుకోవచ్చు. అలా కాకపోతే, పైపైన ఏదో కథ కొంత తెలిసినట్టుగా ఉంటుంది. లో విషయాలు తెలియాలంటే, గ్రంథస్తమైనటువంటి విషయములు, భారత, భాగవతాది గ్రంథములు గాని, రామాయణం గాని తెలియాలంటే, కొంత జ్యోతిష్యం పరిచియం ఉండాలి, కొంత పదముల యొక్క పుట్టుకలోకి వెళ్లి, వాటి లోపల ఉండేటటువంటి అర్థములు తెలుసుకోవడం అనేటటువంటిది ఉండాలి. అలా ఒక పెద్ద తరంగములలో ఉండేటటువంటి ఒక అమరికను గుర్తించి, అందలి లోపలి అర్థం తెలుసుకోవడం అనేటటువంటి విధానం ఒకటి ఉండాలి. అలా లేకపోతే ఏం అర్థం కాదు. పై కథే అర్థం అవుతుంది. దాన్ని నిరుక్తము అంటారు. అదొక తాళం చెవి.

జ్ఞానం సంపాదించుకోవడానికి జ్యోతిష్యము. అంటే, జాతకాల కోసం కాదు జ్యోతిష్యం, జీవుని యొక్క స్వభావం తెలియడానికి. ఆ స్వభావాన్ని ఏ విధంగా వృద్ధి చేసుకోవచ్చు? ఉన్న స్థితి నుంచి వృద్ధి అవ్వడానికే ప్రయత్నం చేస్తూ ఉంటాం కాబట్టి, వృద్ధి చేసుకోవడానికి ఏ ఏ గ్రహముల యొక్క అనుకూల్యత సంపాదించవచ్చు. గ్రహానుకూలత సంపాదించడం అంటే పూజలు, పునస్కారాలు చెయ్యడం కాదు. తదనుగుణమైన ప్రవర్తనని తమ జీవితంలోకి చొప్పించాలి. ఊరికే అప్పటికప్పుడు ఏదో మాట చెప్పి తప్పించుకునే ఒక బుద్ధి ఉందనుకోండి మనకి. ఇప్పుడు ఏదయినా చెయ్యవలసిన పని ఉన్నప్పుడు, మనం చెయ్యలేనప్పుడు దాన్ని సూటిగా ఒప్పుకునే బుద్ధి కొంతమందికి ఉంటుంది. కొంతమంది దాన్ని ఏదో కప్పి పుచ్చి మాట్లాడం అనేది ఒకటి ఉంది కదా! 'ఎప్పటికయ్యేది ప్రస్తుత మప్పటికా మాటలాడి, అంజెల మనముల్ నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడు'... ధన్యుడు కాదు. లోక రీతిలో తప్పించుకు తిరుగుతాడు అంతే! తప్పించుకు తిరిగే వాడి వల్ల ఏ పనులు అవ్వవు. దాని వల్ల వాడికీ వృద్ధి ఉండదు, వాడి చుట్టూ ఉండే వాళ్ళకీ వృద్ధి ఉండదు కదా! ఇలా ఉందనుకోండి, ఉంటే ఏం చూడాలంటే, ఇతడికి బుధుడు, వాక్కుకి బుధుడు, బుధ గ్రహం, మెర్క్యూరీ అంటాం కదా, అది ఎలా ఉంది? అది బాగాలేదు. అది బాలేకపోవడం చేతే ఏదో పాదరసంలా మాట్లాడేసి, తప్పించుకు తిరుగుతూ ఉంటాడు. అలా తిరుగు తున్నాడనుకోండి, అప్పుడు వీడికేం చెయ్యాలి మనం? ఏం చెయ్యాలంటే, బుధుడికి పూజలు చెయ్యండి, ఇట్లా కాదు చెయ్యాలిసింది. ఒకటే

చెప్పాలి, నువ్వు కొన్నాళ్ళ పాటు మౌనం వహించు, అవసరం అయిన మాటే మాట్లాడు, అవసరం లేని మాట మాట్లాడక. నువ్వు బాగుపడాలంటే ఇదొక్కటే మార్గం అని హితం కోరి చెప్పాలి. కోరకపోతే ఎవరికీ చెప్పకూడదు. కోరని వారికి ఎప్పుడూ హితం చెప్పకూడదు. కోరితే చెప్పవలసినదేమిటంటే, నీవు కొన్నాళ్ళు మౌనం పాటించు, అత్యవసరం అయితే తప్ప మాట్లాడవద్దు అని. ఒక పిసినారి డబ్బులు ఖర్చు పెట్టాలంటే ఎంత బాధ పడుతూ ఖర్చు పెడతాడో, అలాగే నీవు మాట మాట్లాడం అంత పిసినారితనంతో మాట్లాడమని చెప్పాలి వాడికి. పైథాగొరస్ అనేటటువంటి ఒక మహర్షి ఆయన దగ్గరికి ఎవరయినా శిష్యరికానికి వస్తే మొదట మూడేళ్ళు మౌనం ఇచ్చేసేవాడు. ఎంచేత అంటే, మౌనం వల్లే మనిషి మహత్కార్యాలు చెయ్యగలడు. అలా రాళ్లు వేసినటువంటి డబ్బాలాగా వాగుతూ ఉంటే అతని ప్రజ్ఞ అంతా ఖర్చు అయిపోతుంది తప్ప, ఆ ప్రజ్ఞ సరైనటువంటి ద్వారంలో ప్రవహింపచేసి, చక్కగా జీవితాన్ని పండించుకో గలిగినటువంటి శక్తి ఉండదు. ఎంచేత అంటే, మాట నుండి ప్రాణం వెళ్తూ ఉంటుంది, మాట నుండి ప్రజ్ఞ ప్రవహిస్తూ ఉంటుంది. ప్రాణమూ, ప్రజ్ఞా ఊరికే అడ్డుగోలుగా ఖర్చు పెడితే, ఎంత ధనవంతుడయినా నిరుపేద అయిపోతాడు. అలా మానవుడుకి మాట ఇచ్చారు.

ఇలా చూసామనుకోండి మనము వాడి స్వభావంలో... కొంతమంది స్వభావంలో కొన్ని కొన్ని ప్రత్యేకంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటాయి, సద్గుణాలు గాని, లేక కొన్ని లోటుపాట్లు గాని. వాటిని చక్కగా సరిదిద్దడానికి మార్గాలు ఉంటాయి. అలా మనకి జ్యోతిష్యం వల్ల ఉపయోగం ఉంది. స్వభావంలో చక్కని మార్పు కొని తెచ్చుకుంటే, మానవ స్వభావం క్రమంగా దైవీ స్వభావంగా మారే అవకాశం ఉంది. లేదా, అదే మానవ స్వభావం పశు స్వభావంగా మారే అవకాశం ఉంది. మనకి రెండు దార్లు ఉన్నాయి. ఒకటి, ఇప్పటికన్నా ఇంకా పాడయిపోవడం, ఏదీ స్వభావంలో. లేదా, పశు ప్రవృత్తిలోకి వెళ్లిపోవడం. మరొకటి, దైవీ ప్రవృత్తిలోకి వెళ్ళిపోవడం. లేదా, ఉత్తమ మానవ వృత్తిలోకి, ప్రవృత్తి అంటారు దైవీ ప్రవృత్తిని, అలా వెళ్ళడం. దీనికి మన యొక్క ప్రయత్నమే ప్రధానంగా ఉంటుంది. దానికి దారి చూపించేటటువంటి వాడు సద్గురువు. అంచేత, ఈ శాస్త్రం తెలిసి ఇలాంటి గ్రంథాలు చదువుకుంటే అవగాహన చాలా ఎక్కువ వస్తుంది. గ్రంథంలో మనకి జ్యోతిష్యం కూడా వస్తుంది ఈ ఉపాఖ్యానంలో. అది వచ్చినప్పుడు చెప్పుకుంటాం.

అంచేత, ఇతడు చిత్రాశ్వుడు. చిత్రాశ్వుడంటే, ఇది ఎవరికి వర్తిస్తుందంటే, దాదాపు చచ్చిపోయి, బతికిన వాళ్ళందరికీ పనికొస్తుంది ఈ పేరు. Near death experiences అని hospitals లో research చేసి బాగా పరిశీలిస్తున్నారు. అంటే, దాదాపు చచ్చిపోతాడు రోగి, కాని కొన్ని గంటల తర్వాత బతికొస్తాడు. బతికొచ్చినప్పుడు, నీకు అప్పుడేం అనిపించింది ఆ సమయంలో అంటే, ప్రతి వాళ్ళూ కొన్ని కొన్ని అనుభూతులు చెప్తారు. ఈ మధ్యే అటువంటి సినిమా ఒకటి తీసారు హాలీవుడ్లో, సునామీ వచ్చి ఒకావిడ French journalist నీళ్ళలో మునిగిపోయి, తనతోపాటు ఉండేవాళ్ళూ కొంతమంది మునిగిపోయి, అందరూ చనిపోవడం, వేరే లోకాల్లోకి వాళ్ళు ప్రవేశించినట్టు, ఇటువంటి అనుభూతులు వస్తాయి. తర్వాత ఎవరో వచ్చి పొట్ట బాగా నొక్కి నీరు బయటకి తీస్తే మళ్ళీ ప్రాణం వస్తుంది. ఆవిడ చెప్తుంది, ఏమనంటే, మరణించడం అంటే మనం లేకపోవడం కాదు అని. అది మనబోటి వాళ్ళకి, భారతీయులికి ఎప్పటినుంచో తెలుసు. ఇప్పుడు కూడా ఈ near death experiences ఉన్నవాళ్ళ దగ్గర నుంచి చాలా విషయాలు

తెలుస్తూ ఉంటాయి. ఇట్లా వీళ్ళందరినీ చిత్రాశ్వులు అని చెప్పవచ్చు. ఎందుకంటే, చిత్రంగా వెళ్ళిపోయిన ప్రాణం మళ్ళీ తిరిగి వస్తుందన్నమాట. ఇది అతని అసలు పేరు. అతడి జీవ లక్షణంలో ఒకసారి ప్రాణములు పోయి తిరిగి వస్తాయి.

మనకి కూడా జాతకాలు చూసి పెద్దలు చెప్తూ ఉంటారు, ఫలానా సంవత్సరంలో ఈ పిల్లవాడికి గండం ఉంది అంటారు కదా! ఈ గండం తప్పించుకునే మార్గం ఏంటి అంటే ఏదో చెప్తారు కదా! అట్లా గండాలు తప్పించుకుని బయట పడిపోతూ ఉంటారు. గండం వచ్చినప్పుడు కొన్ని గంటల పాటు, కొన్ని రోజుల పాటు దాదాపు మరణించి, మళ్ళీ బతికిన వాళ్ళు ఉన్నారు. అలాంటి వాళ్ళందరిని చిత్రాశ్వులు అంటారు. ఈ అశ్వమేధ యాగం కూడా అలాంటిదే. అశ్వం ఎత్తుకుపోయారంటే ప్రాణాలు పోయాయని అర్థం, పోయిన ప్రాణాలు పట్టుకొచ్చారని అర్థం. అలా కథలు ఉన్నాయి మనకి. భృగు చక్రవర్తి కథల్లో అలాంటి వన్నీ వస్తుంటాయి.

అంచేత, ఇక్కడ ఈ సత్యవంతుడి అసలు పేరు మనం ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలి చిత్రాశ్వుడు అని. అదే యోగ మార్గంలో ఈ ప్రాణములను పట్టుకుని, శరీరం నుంచి మనం భౌతిక ప్రాణములు భౌతిక దేహానికి అప్పచెప్పేసి, సూక్ష్మ ప్రాణాలను పట్టుకుని జీవుడు ఊర్ధ్వ లోకాలకి వెళ్ళే మార్గములన్నీ కూడా యోగ విద్యలో ఇచ్చారు. దాన్నే ప్రాణాయామము తర్వాత ప్రత్యాహారము, ధారణ, ధ్యాన స్థితులు అని చెప్తారు. ధారణ స్థితిలో శరీరాన్ని మనం ధరించి ఉన్నాం తప్ప, శరీరం మన్ని ధరించి లేదు అని తెలుస్తుంది. మనం శరీరంలో బంధీకృతులై ఉన్నాం, ఇలాంటివన్నీ తెలియడానికి పెద్ద విజ్ఞానం అక్కర్లేదు. శరీరం మన నుంచే ఏర్పడింది. మనం పెట్టుబడిగా శరీరం ఏర్పడింది. మన నుంచి ఏర్పడిన దాని మీద మనకి స్వామిత్వం ఉన్నదా, బానిసత్వం ఉన్నదా అనేది లెక్క. స్వామిత్వం ఉన్నదనుకోండి, దాన్ని అలా వదిలేసి, అలా, అలా, అలా సూక్ష్మ లోకాల్లో విహరించి, మళ్ళీ కావాలనుకుంటే దాంట్లో ప్రవేశించివచ్చు. అదీ యోగ విద్య. అంచేత, మొత్తం కథంతా ప్రాణము, ప్రజ్ఞ, వీటికి సంబధించిన కథలు ఉంటాయి గ్రంథాల్లో. మనిషికి ఆత్మ తత్త్వం, జీవాత్మ అంటూ ఉంటాం. ప్రతి జీవుడు కూడా ప్రాణము, ప్రజ్ఞ యొక్క జలిమి రూపంగా ఉంటాడు, స్పందనాత్మక చైతన్యంగా.

ఇతడు చిత్రాశ్వుడని చెప్పబడినప్పుడే అర్థమయిపోయి ఉండాలి అశ్వపతికి. నారదుడు మొట్టమొదటగా ఏం చెప్పాడంటే, ఏది అశుభం అని చెప్పి అందరూ అనుకుంటున్నారో ఇతని విషయంలో అది శుభం అని చెప్పాడు. ఎంచేత అంటే, సత్యవంతుడు ఇప్పటి నుంచి ఒక సంవత్సరంలో మరణిస్తాడని ఒక కథ ఉంటుంది. ఈ సంభాషణ మొదలు పెట్టినప్పటినుంచి ఒక సంవత్సరం లోపల మరణం, అది కూడా చెప్తాడు నారదుడు. కాకపోతే, అతడు చిత్రాశ్వుడు. అంటే అతని ప్రాణములు అంత సులభంగా హరింపబడవు అని తెలుస్తుందన్నమాట. అలాంటివాడు సత్యవంతుడు, ఒకటి. రెండోది, చాలా తేజస్సు కలవాడు.

వెలుగుని ఆరాధన బాగా చేస్తుంటే తేజస్సు వస్తుంది. అందుకనే, మనకి ఈ సూర్యోదయం సమయంలోనూ, సూర్యాస్తమయ సమయంలోనూ, పూర్ణిమా సందర్భాల్లోనూ, వెలుగు ఆరాధన, దైనందినంగా

చేసుకునే దానికన్నా చాలా ఎక్కువగా చేసుకోమని చెప్తారు. ఎంచేత అంటే, ఏ వెలుగయితే నువ్వు సూర్యుడిలోనూ, చంద్రుడిలోనూ చూస్తావో, ఆ వెలుగే నీయందు నీవలే ఉంది. అందుకని, దానితో నువ్వు అనుసంధానం చెందడం వల్ల, నీలో తెలివి అనేటటువంటి ప్రజ్ఞ పెరుగుతుంది, ప్రాణము యొక్క శక్తి పెరుగుతుంది. తదనుగుణంగా నువ్వు పటిష్టంగా, స్థిరంగా నిలబడి, నీవు నిర్వర్తించవలసిన కార్యములు నిరాటంకంగా నివర్తించుకుంటూ ఉండవచ్చు. అంచేత, ప్రజ్ఞను మనం ఆహారం పుచ్చుకున్నట్టుగా, ప్రజ్ఞను బలపరుచుకోవడం, ప్రాణాలను బలపరుచుకోవడం అనేటటువంటిది రోజూ ప్రార్థనలో భాగంగా ఎవరయితే చేస్తూ ఉంటారో అలాంటి వారందరికీ కూడా తేజస్సు పెరుగుతుంది. పొద్దునే నిద్రపోయేవాళ్ళకి పెరగదు. ఉన్నదే ఉంటుంది. అది కూడా క్రమంగా పొద్దున్న చెప్పినట్టుగా అది హరింపబడుతూ, చిట్టచివరికి మతిభ్రమణం, మతిమరుపు, ఇటువంటివి అన్నీ వచ్చేస్తాయి. Alzheimer's అని చెప్పానుగా పొద్దున్న. అంచేత, సూర్యోదయం అవ్వడానికి ముందు గంటన్నరసేపు, సూర్యోదయం తర్వాత గంటన్నరసేపు, ఈ మూడు గంటల కాలము అమృత గడియలని చెప్తారు. దేనికి అమృతం అంటే, నీ ప్రజ్ఞకి అమృతత్వాన్ని ఇస్తాయి అవి. ప్రజ్ఞకి అమృతత్వాన్ని కలిగించే సందర్భం అది. సాయంకాలం సూర్య అస్తమయానికి ముందు గంటన్నర సేపు శరీరానికి కావలసినటువంటి బలం అంతా కూడా వ్యాయామం ద్వారా గాని, క్రీడల ద్వారా గాని అందుకోవచ్చని మన సాంప్రదాయం చెప్తుంది. ఉదయం పూట క్రీడలు కాదు, ఆరాధన. సాయంత్రం పూట క్రీడలు. అప్పుడు సూర్యుడి వెలుగులో... నాలుగున్నర నుంచి ఆరు గంటలనుకోండి. ఆరు గంటలకు సూర్యోదయం, ఆరు గంటలకు సూర్యాస్తమయం అవుతోందని మనం భావించినట్టయితే, దానికి గంటన్నర ముందు, గంటన్నర తర్వాత, ఉదయం మూడు గంటల సేపు నీ ప్రాణములను, నీ ప్రజ్ఞను నువ్వు చాలా బలపరుచుకోవచ్చు. ఆ సమయంలో నిద్రపోతే అతడి ప్రజ్ఞ అంతగా వికాసం చెందేటటువంటి అవకాశం లేదు. ఎందుకంటే, మొత్తం భూగోళానికే వికాసం కలించేటట్టుగా సూర్యుడి ఉదయం గోచరిస్తుంది. ప్రాంతీయమైన సూర్యోదయం అది. కాబట్టి ఆ ప్రాంతంలో ఉండే వారంతా కూడా అప్పుడు సూర్యుడు అందించే కిరణముల ద్వారా పొంద గలిగినటువంటి ప్రాణము, ప్రజ్ఞ చాలా అమితంగా ఉంటుంది. అలాగే, సాయంత్రం సమయంలో కూడా ఆ విధంగా ఉంటుంది.

అంచేత, ఉభయ సంధ్యలయందు కూడా ఈ వెలుగు ఆరాధన ఎవరయితే చేసుకుంటారో వారిలో తేజస్సు పెరుగుతూ వస్తూ ఉంటుంది. అది నిస్సందేహం. ప్రయత్నం చేసి ఆ విధంగా తెలుసుకుంటున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు. దానికి వ్యతిరేకంగా ప్రస్తుతం అధునాతన కాలంలో నిద్రపోతూ ఉంటాం పొద్దున్నపూట. అందులో ఆదివారం వస్తే ఎక్కువ నిద్రపోతాం కదా! ఆదివారం కదా పడుకోవాలి అనుకోకూడదు. ఆదివారం కదా, రోజూ కన్నా ముందు లేవాలి. ఎందుకని? ఆదివారం ఆదిత్యుని యొక్క ప్రజ్ఞ మనయందు ఎక్కువగా ప్రసరించే అవకాశం ఉన్నది. ఆదిత్య ప్రజ్ఞ ఎక్కువగా మన వరకూ ప్రసరిస్తుందంటే, ఆ సమయంలో ఎక్కువగా నిద్రపోతే ఎట్లా? ఎక్కువ మేల్కొని ఉండాలి. తూర్పు దేశాల్లో ఉండేటటువంటి మేధోబలం ఎక్కడినుంచి వచ్చిందంటే వారికి... ఇప్పుడు నిస్సందేహంగా అన్ని దేశాల్లో భారతీయుని ప్రజ్ఞా పాటవాలని అంగీకరిస్తూ ఉన్నారు. The Indian brain is considered to be of extraordinary abilities and capabilities. ఎందుకిలా ఉందంటే, మన రక్తంలో మన పూర్వీకులు అలా తెల్లవారు ఝామునే మూడు గంటలకి లేచి చేసినటటువంటి సాధనకి సంబంధించినటువంటి మేధోసంపత్తి అంతా మన

మేధస్సులో ఏర్పడి ఉండడం చేత. ఈ రోజుల్లో ఒక scientist కావాలనుకున్నా అమెరికాలో, ఒక software engineer అయినా, computers అయినా, అది విద్యారంగం అయినా, అది వైద్యరంగం అయినా, వైజ్ఞానికరంగం అయినా, ఏ రంగంలో అయినా సరే, భారతీయులు చాలా చక్కగా అపూర్వమైన విజయాలు సాధిస్తూ వస్తున్నారు. మీకు ఏ research లో చూసుకున్నా భారతీయులు ముందడుగులో ఉన్నారు. ఈ software వీటి గురించి తెలుసుకుంటే, hardware కనిపెట్టింది ఇజ్రాయిల్ వాళ్ళు అయితే, software దాన్ని ఉపయోగించినది Asians. అందులో మిక్కిలిగా, విశ్వసనీయంగా ఈ కార్యక్రమాలు నిర్వర్తించేవాళ్ళు భారతీయులని వాళ్ళకి విశ్వాసం. అందుకనే, మీరు యునైటెడ్ స్టేట్స్ వెళ్తే, అక్కడ ఒక భారతీయుడు, ఒక చైనీస్ ఉంటే, ఎవరిని కోరుకుంటారు మీరు అని అడిగితే, భారతీయుడినే కోరుకుంటాం అంటారు. Reliability అలాంటిది. ఎందుకివన్నీ ఉన్నాయంటే, ఇంకా మనలో మన పూర్వీకుల సెగ ఉండడం చేత. ఇప్పుడు మనం ఇలా నిద్ర పోతున్నాం అనుకోండి పొద్దున్న పూట, పొద్దున్నే నిద్రలు పోయే వాళ్ళకి ఈ ధీశక్తి తగ్గిపోతూ వస్తుంది.

ఇక్కడ సత్యవంతుడు తేజోరాశి అన్నారు. ఆయన తేజోరాశిలో భాస్కరునివలె మెరుస్తూ ఉంటాంటండి. కొంతమందికి వారి ఫాలభాగం చాలా కాంతివంతంగా ఉంటుంది. మామూలుగా కనిపించే దాని కన్నా ఫోటోలు తీస్తే ఎక్కువ కాంతివంతంగా ఉంటావు. ఇదేంటండి, ఫోటోలో బావున్నారు మామూలుగాకన్నా కదా! ఎందుకిలా కనిపిస్తుందంటే, it can capture certain auras relating to your face. అంచేత, కాంతివంతంగా పౌడర్లు పూసేసుకుంటేను, cosmetics treatments చేయించుకుంటేను వచ్చేది నిలబడదు కదా! ఇలా వచ్చే వాళ్ళకి చాలా శాశ్వతంగా ముఖంలో వెలుగుతూ ఉంటుంది. అంతేకాదు, స్ఫూర్తి ఉంటుంది, ప్రస్తుతంలో జీవించడం ఉంటుంది. ఏదయినా అప్రమత్తత అనేటటువంటిది చాలా అద్భుతంగా పనిచేస్తూ ఉంటుంది. దానితోపాటు బుద్ధి వికాసం కలుగుతుంది. మన బుద్ధి రోజురోజుకి వికాసం చెందాలంటే... ఇప్పుడు మనకి పదేళ్ళకి క్రితం ఎంత తెలుసో, ఇప్పుడూ అంతే తెలుసంటే కుదరదు కదా! ఈ రోజు ఏం నేర్చుకున్నావు కొత్త విషయం? ఈ రోజు నీ ప్రజ్ఞ వికాసం చెందడానికి కొత్తగా ఏమయినా నీకు తెలిసిందా? మామూలుగా routine life లో తెలుసుకోవడం అనేది మర్చిపోతాడు మనిషి, ఎందుకంటే ఆ routine నిర్వర్తించడమే అంతా అయిపోతుంది. సరే తెలుసుకోవాలసినది ఏంత ఉంది అంటే, అనంతంగా ఉంది. అనంతమైనటువంటిది జ్ఞానం. "*సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ*" అన్నారు. అనంతమైనటువంటి జ్ఞానం పొందడానికి వలసిన పరికరం మనయందు ఉన్నప్పుడు మనం దాన్ని వినియోగించుకోవడం లేదు కదా! వినియోగించుకోపోతే ఏమీ తెలియదు.

ఎవరయినా మీ ఊరు ఏమిటంటే, ఆ ఊరు పేరు చెప్తే, ఈ పేరు ఎందుకొచ్చింది అని అడుగుతూ ఉంటాను నేను. ఏమో తెలియదండి అంటారు. ఏమో తెలియదేంటి? అక్కడే పెరుతున్నావు కదా, తెలుసుకోవద్దూ? ఇప్పుడు హైదరాబాద్ అన్నారు. ఎందుకొచ్చిందా పేరు? ఎవరో ఒకాయన పరిపాలించాడు ఆ పేరుతో, హైదర్ ఖానో, హైదరాలీ ఖానో. ఆయన పేరు పెట్టేసారు. ఆయన రాకముందు ఏముంది పేరు?

భాగ్యనగరం. ఆ పేరెందుకు వచ్చింది, భాగ్యనగరం అని? భాగ్యలక్ష్మి అనేటటువంటి అమ్మవారు ఇక్కడ మొట్టమొదట ఈ గ్రామంలో వెలిసి ఉండేది. అందుకని దీన్ని భాగ్యనగరం అన్నారు. మూసీనది, మూసీనది అంటారు కదా, ఏమిటి మూసీనది ఏంటి? మూసి అని పేరు ఎందుకు వస్తుంది? మన దేశంలో ఏ పేరు ఉన్నా, దానికి సంస్కృతం మూలం ఉండాలి. ఏం సందేహం లేదు. ఎందుకంటే, మొట్టమొదటగా బాగా వ్యవహారంలో ఉన్నటువంటి భాష సంస్కృతం అయి ఉండడం చేత. మూసీనది ఏమిటి? అది మూసీనది కాదు, ముచికుంద నది. ముచికుంద నది, మూసీనది అయిపోయింది. ఏదీ ముస్లింలు మన దేశంలో ప్రవేశించి, పరిపాలించిన సమయంలో. అట్లా వెతుక్కుంటూ నువ్వు వెళ్తే, నీకు బోల్డు తెలుస్తుంది. ఇప్పుడు మూసీనది కాబట్టి, మూసేసాం ఇళ్ళు కట్టి, పూర్తిగా కదా! అలాగే, ఏ ఊరు వెళ్తే ఆ ఊరు. విజయవాడ, ఎందుకొచ్చిందా పేరు? విశాఖపట్నం, ఎందుకొచ్చిందా పేరు? నిన్న చెప్పాను మద్రాస్, ఎందుకొచ్చిందా పేరు? ఏ పేరయినా ఎందుకొచ్చింది? నీ పేరు ఎందుకొచ్చిందలా అని కూడా ఆలోచించాలి. నీకు ఈ పేరు నీ తల్లితండ్రులు పెట్టారంటే, తదనుగుణమైనటువంటి గుణములు నీలో నీవు సంపాదించుకుని సార్థక నామధేయుడివి కావాలి. అంతేనా? పేరయితే పెడతారు, మరి ఆ పేరుకి తగట్టుగా నువ్వు జీవించాలి. అంటే పేరులో అంత ఉంది.

ఇలా నేర్చుకోవడం అనేది ఒకటుందండి. ఈ నేర్చుకోవాలనే ఉత్సాహం ఉంటుందే, అంటే పనికిమాలిన విషయాలు కాదు. పక్కింట్లో ఏం జరుగుతోంది, వాళ్ళెందుకు పోట్లాడుకుంటున్నారు, వారిద్దరి మధ్య ఎందుకు పడడం లేదు, వీటియందు మనకి చాలా ఆసక్తి ఉంటుంది. విపరీతమైన ఆసక్తి కదా! అది కాదు కావలసినది. అది నీకు పనికొస్తుందా? అది నీకు వికాసాన్ని ఇస్తుందా? నీ ప్రజ్ఞకు వికాసం కలిగించేదేమయినా నీకు ఈ రోజు తెలిసిందా? తెలియకపోతే ఆ రోజు వృధా అయిపోయిందని అనుకుంటారు ఆర్యులు. ఏదో ఒకటి. నువ్వు గ్రంథం తీసి చదివితే నీకు అంతకు ముందు తెలియని విషయాలు తెలుస్తూ ఉంటాయి. అందుకనే, "*స్వాధ్యాయ ప్రవచన్నాభ్యాన్న ప్రమదితవ్యం*" అనేటటువంటి ఒక ఆశంసనం ఒకటి ఇచ్చారు. చదువుకో! రోజూ చదువు. "చదువని వాడజ్ఞుండగు". చదువుకోపోతే అజ్ఞానం వచ్చేస్తుంది. ఈ రోజుల్లో మంచి వృత్తుల్లో ఉన్నవారు రోజూ చదువుకోపోతే వెనకబడిపోతారు. ఒక వైద్యరంగం అయినా, విద్యారంగం అయినా, మాబోటి charted accountants రంగంలో అయినా, చదువుకుంటూ ఉండాలి. Life itself is a continuing education program అన్నారు కదా! అంచేత స్వాధ్యాయం. నిత్యమూ ఏదో ఒకటి తెలుసుకో. దివ్యమైన విషయాలు తెలుసుకుంటే మెదడుకి వికాసం ఎక్కువగా కలుగుతుంది. Newspaper లో కూడా అప్పుడప్పుడు మంచి, మంచి విషయాలు మనకి వికాసం కలిగించేవి గోచరిస్తాయి. కాని సద్గ్రంథాల్లో అదే ఎక్కువగా ఉంటాయి. Newspaper లో అక్కడక్కడా ఉంటాయి.

అంచేత, రోజూ నీకు వికాసం కలింగించేటట్టుగా నువ్వు ఏం చేస్తున్నావు? దానికి మన పెద్దలు ఏం చెప్పారంటే నిత్యమూ స్వాధ్యాయము చెయ్యమని చెప్పారు. ఏదో ఒక గ్రంథం పావుగంట సేపయినా నువ్వు పారాయణ చెయ్యి. శ్రద్ధగా చదువుకోవడాన్ని పారాయణం అంటారు. చదువుకుని, దాన్ని ఆకళింపు చేసుకున్నావనుకో, నీకు ఒక కొత్త విషయం ఆచరణాత్మకమైనది గాని, లేకపోతే సృష్టిని గురించినది గాని ఒకటి తెలుస్తుంది. ఇలా తెలుస్తూ ఉంటే నీ బుద్ధి ప్రచోదనం అవుతూ ఉంటుంది, బుద్ధి వికాసం కలుగుతూ ఉంటుంది. ఇలాంటి జిజ్ఞాస మనసుయందు ప్రతివారికి

ఉందండి. ఏం జిజ్ఞాస? తెలుసుకోవాలన్న జిజ్ఞాస. తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉంది కాబట్టే కొత్త mall ఏదయినా పెడితే అది ఎంత దూరంలో ఉన్నా వెళ్ళిపోతాడు. ఏంచేత? అక్కడ ఏమున్నాయో చూడాలని. మీరు ఏ mall కన్నా వెళ్ళండి ప్రపంచంలో, అవే standard shops ఉంటాయి. అయినప్పటికీ వెళ్తాం కదా! ఎందుకెళ్ళావురా అంటే, తెలుసుకుందామని వెళ్ళాను. ఏం తెలుసుకున్నావురా అంటే, ఏం లేదు, ఇక్కడ ఉండేవే అక్కడా ఉన్నాయి అని! మీరు హైదరాబాద్ సెంటరుకి వెళ్ళినా, ఇంకో సెంటరుకి వెళ్ళినా, మరో mall కి, GVK కి వెళ్ళినా, అన్నీ అవే branded shops గా ఉంటాయి. అలా అని వదిలేస్తావా? తెలుసుకోవాలని అనిపిస్తుంది. కొత్త IMax వస్తే తెలుసుకోవాలి, కొత్త product వస్తే తెలుసుకోవాలి!

ఇలా చిల్లర విషయాలు తెలుసుకోవడం అనేది ఒకటి ఉంచి, అసలు నీలో తెలుసుకోవాలనేటటువంటిది ఒకటి ఉందా? ఒక కుతూహలం ఉందా? ఒక ఉత్సుకత ఉందా? అది దివ్యగుణం. అలాంటి దివ్యగుణం మనలో ఉంటే, దాన్ని మనం దేని మీద అన్వయిస్తాము అనే దాన్ని బట్టి మనకి తెలియడం అనేదుంటుంది. దాన్ని ఈ విధమైన దివ్యమైన విషయముల మీద మరల్చి వికాసం పొందడానికి సృష్టిలో ఉండేటటువంటి principle ని మన వారు గ్రంథాల్లో నారదుడు అంటారు. నీ బుద్ధి వికాసానికి నువ్వు చేసే ప్రయత్నంలో నీకు తోడ్పాడు కావిస్తుంది నీకుండే ఉత్సుకత. ఇప్పుడు మీరెందుకు ఇట్లా వస్తున్నారు? ఇప్పుడు ప్రతి ఏడాది ఇట్లా చేసుకుంటున్నాం కదా, అలాగే చాలా ఊళ్ళల్లో చేస్తూ ఉంటాను కదా! అన్ని చోట్లకి వచ్చి ఎందుకు వింటారు? తెలుసుకుందామనే కదా! తెలుసుకుందామనేది లేకపోతే వికాసం రాదు కదా! తెలుసుకున్నది ఆచరిస్తే ఇంకా వికాసం వస్తుంది. ఇలాంటి వికాసాన్ని కలిగించేటటువంటి ప్రధానమైనటటువంటి గురువు నారదుడు. "నారద" అన్న పదం ఉందండి మనకి. ఏం అర్థమైంది "నారద" అంటే? నారదుడు, నారదుడు, నారదుడు అంటే సినిమాల్లో కనిపించే నారదుడు, ఇవే మనకు తెలుసు కదా! "నర". దేవుడి పేరు కూడా నారాయణుడు అన్నారు. "ర" అంటే నశించేది. "న" అంటే నశింపనిది. "ర" "న" అంటే ఎప్పట్టికీ నశింపనిది. "నరుడు". మనమంతా నరులం కదా! అంటే, నశింపని వారము. నశింపని తత్వాన్ని "నర" అంటారు. ఆ నశింపని తత్వాన్ని మనకి పరిచయం చేసి, మనం అదే అని తెలియ చెప్పడానికి కావలసిన విజ్ఞానం అంతా కూడా, "దా" అంటే ఇచ్చేవాడు అని అర్థం, నారదుడు. నీవు శాశ్వతుడవు, నీవు ఎప్పుడూ ఉన్నావు, దేహాలు మారుస్తూ ఉన్నావు, అయినా నీ నశింపని స్థితి నీయొక్క శాశ్వత స్థితి అని నీకు తెలియడానికి కావలసిన జ్ఞానం అంతా కూడా నీకు అందించడానికి, ఈ కనబడకుండా ఉండే చోటులో సంచరిస్తూ ఉంటాడట అన్ని లోకాల్లోనూ. అది ఒక principle. అది ఇలా మనలో ఈ ప్రాంతంలో వెళ్తూ ఉందనుకోండి, మనకేదో తెలుసుకుందా మనిపిస్తుంది. అంతవరకూ మనసులో తెలుసుకుందాం అనిపించని వాడికి కూడా తెలుసుకుందాం అనిపిస్తుంది. అలాంటి వాడతను. మనలో ఈ విధంగా తెలియపరచడం అనేటటువంటి ప్రజ్ఞ సృష్టిలో ఉన్నదాన్ని మన ఋషులు నారదుడు అని పేరు పెట్టారు. కాబట్టి ఆయనకి తెలియని విషయం లేదు. ఆయన బుద్ధులకు బృహస్పతి.

ఈ సత్యవంతుడు కూడా, on a daily basis, ప్రతినిత్యం ఏదో ఒకటి అధ్యనం చేసి తెసుకునేటటువంటి తత్త్వం కలిగినటువంటి వాడు. అది అతని యొక్క మరియొక గుణం. అటుపైన క్షత్రియ కుమారుడు అయిఉండడం చేత చాలా పరాక్రమవంతుడు. చాలా ముఖ్యమైన గుణం సత్యవంతుడిలో. అంటే, పరాక్రమవంతులు చాలా ఉన్నారు కదా! ఇప్పుడు చరిత్ర తీసుకుంటే ఎంతోమంది పరాక్రమవంతులు ఉన్నారు. కానీ సత్వవంతుడి యొక్క గొప్పదనం ఏమిటంటే, తన తండ్రి రాజ్యాన్ని అధర్మ మార్గంలో అతని దగ్గర ఉండే అనుయాయులే కబళించి, అతనిని, అంటే, తన తండ్రిని, తల్లిని, తనను, ముగ్గురినీ అరణ్యానికి పంపించేస్తే, మహా పరాక్రమవంతు డైనప్పటికీ కూడా, ప్రశాంతంగా రాజ్యం గురించి ఆలోచించకుండా ఉన్నాడండి. అదెలా సాధ్యం? కళ్ళ ముందే మన ఆస్తి అంతా దోచేసారనుకోండి. మనలో చాలా పరాక్రమం ఉంది, జయించగలవు. జయించగలిగి ఉండి, ఆ పోనిద్దూ అని ఉన్నాడంటే ఏమిటండి? అదే నిజమైన పరాక్రమం అని చెప్తుంది మన శాస్త్రం.

మౌనం చేత పరాక్రమించవచ్చు. మౌనము చేత, అకర్మ చేత పరాక్రమించవచ్చు. సూర్యుడు అస్తమించని సామ్రాజ్యం బ్రిటిష్ వారిది అని చెప్పుకుంటూ ఉండేవారు. ఇప్పుడు అస్తమించేసి బాగా చీకటులు కూడా వచ్చేసినాయి. అదలా ఉండగా, అలాంటి సామ్రాజ్యాన్ని ఎవరు ఎదిరించగలరు? ఒక్క మనిషి ఎదిరించాడు. దేని చేత? సత్యము చేత, మౌనము చేత. అంటే, మహాత్మా గాంధీ ఎంత వీరుడయ్యి ఉండాలి? అంటే, నువ్వు, నేను ఇవాళ నుంచి hunger strike అంటే ఎవ్వడూ పట్టించుకోడు కదా! ఇప్పుడు అట్లా కూర్చుని రోడ్డు మీద, hunger strike అంటే, ఆ పోతే ఎవడో అని... మహాత్మా గాంధి ఏ రోజయినా సత్యాగ్రహము అని చేస్తే, ఆ రోజు ఆ బ్రిటిష్ పరిపాలకులలో ఒక రకమైనటువంటి లోపల సంచలనం పుట్టుకొచ్చేది. దేని వల్ల సంచలనం? సత్యము వలన. అంటే, సత్యము చేత, తాను అక్కడే ఉండి, వారియందు వ్యాప్తి చెంది, వారికి కలత కలిగించేంత పరాక్రమము మహాత్మా గాంధిలో ఉన్నది. ఆ పరాక్రమము ఎక్కడి నుంచి వచ్చిందాయనకి? ఆయన అనుసరించిన సత్యములోంచి వచ్చినది. ఆయన రాసాడు కదా సత్యముతో నేను చేసిన ప్రయోగాలు అని! తప్పకుండా చదువుకోవాలి మనం. ఎంచేతంటే, దానికున్న బలం దేనికీ లేదు. ఆక్రమించడం అంటే భౌతికంగా ఆక్రమించడం కాదు. నీకు నచ్చని విషయం నీ పరిసరాల్లో జరుగుతూ ఉంటే, నువ్వు మౌనం వహిస్తే, నీ చుట్టూ ఉండే వాళ్ళు క్రమంగా సర్దుకుంటారు. ఆయకేదో మనం ఇబ్బంది కలిగించినట్టున్నాం అని ఇంట్లో సర్దుకుంటారు. అలాగే కార్యాలయంలో కూడా మనం కొంచెం మౌనంగా ఉంటే, ఏదో తేడా పద్దది జరుగుతున్న పనుల్లో, అందుకనే ఇలా మౌనంగా ఉన్నాడు అని అనిపించాలి అవతలి వాళ్ళకి. ఎప్పుడనిపిస్తుందో తెలుసా? నువ్వు సత్యవంతుడివైతే అనిపిస్తుంది. లేకపోతే అనిపించదు. లేకపోతే పట్టించుకోరు. నీకు ఇంకా tension పెరిగిపోతూ ఉంటుంది తప్ప! అంచేత, సత్యము వలన పరమును ఆక్రమించుట. అలాంటి ప్రయత్నాలు చెయ్యొచ్చు. చేస్తే, నీలో సత్యము ఉందా లేదా తెలుస్తుంది. ఎందుకంటే, మనం ఇలా మౌనంగా ఉంటే, చుట్టుపక్కల ఎవరికీ అలజడి కలగలేదనుకోండి, అంటే మనలో సత్యము లేదని తెలుస్తుంది. అలజడి కలుగుతోందనుకోండి, దాని ప్రకంపనలు ఎంత వరకూ ఉన్నాయి అనేది తెలుస్తుంది. అందుకనే, మనకి విష్ణుసహస్రనామాలలో ఒక నామం వస్తుంది, రాముడి గురుంచి చెప్తూ, సత్యపరాక్రముడంటారు. సత్యపరాక్రముడంటే, రాముడు అరణ్యంలో ఉన్నప్పటికీ, రాముని పేరు చెప్తే రావణుడు భయపడుతూ ఉండేవాడు. ఏం చెయ్యలేదు ఇంకా! అలాగే, కృష్ణుడు రేపల్లెలో ఉండి

ఆడుకుంటూ ఉంటే, అక్కడ మధురలో కంసుడు భయపడుతూ ఉండేవాడు. ఎంచేత? కంసుడియందు అధర్మమున్నది, కృష్ణుడికి అది తెలుసు, తెలిసి ఊరుకున్నాడు. ఎందుకు ఊరుకున్నాడని భయం. తెలిసి ఊరుకుంటే భయం కదండి! అందుకని, ఎదుటివారు తప్పులు చేస్తే, మాటిమాటికి మనం సరిదిద్దడం మొదలు పెడితే, వాడు విసిగిపోతాడు. తప్పులు చేస్తున్న వారియందు మనం మౌనం వహించామనుకోండి, క్రమంగా వాడు సర్దుకుని వచ్చేస్తాడు. మనం అన్నట్టుగా కూడా ఉండదు. అందుకని, మహాత్మా గాంధి లాంటి వాడు ఎక్కడో సత్యాగ్రహం అంటే, అలా అలా లండన్ వెళ్ళిపోయి, ఆ West Minister లో అక్కడంతా ప్రకంపనలు వచ్చి, మహారాణి సీటుకి కూడా ఇబ్బంది కలిగించేంత ఒక అలజడి పుట్టేది. అది సత్యాగ్రహం. సత్యము యొక్క పరాక్రమము అలా ఉంటుంది.

అంచేత, ఈయన పరాక్రమవంతుడై ఉండి, రాజ్యాన్ని గురుంచి అసలేమాత్రం బాధపడడం లేదు. మాములుగా మనకే మనిపిస్తుంది? అంత పరాక్రమవంతుడైతే అట్లా అరణ్యంలో ఎందుకు పడిఉన్నాడనిపిస్తుంది. ఊరికే అట్లా చెప్పుకుంటాడు గానీ, ఆయనకేం లేదు, చేతకాని వాడు. చేతనయినవాడైతే, రాజకుమారుడు వెంటనే యుద్ధం చేసో, మరొకటి చేసో, ఏదో పన్నాగం పన్నో, తన రాజ్యాన్ని తాను మళ్ళీ పొంద వద్దండి? అలాంటి ప్రయత్నం లేదు. అది రాజులు చెయ్యవలసిన పని కదా! అది చెయ్యవలసిన పనో కాదో తనకి తెలుసు. తన రాజ్యం తన నుంచి ఎక్కడికీ పోదు అనే ధీమా. ఏదో పిల్లాటగా తీసేసుకున్నారు, పోదు అనేటటువంటి ధైర్యం కొంతమందికి ఉంటుంది.

"*ధనము వీధిపడిన దైవవశమున నుండు, పోవు మూలనున్ననైన, అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమున జచ్చు*" అని ఒక పద్యం ఉంది మనకి భాగవతంలో. బాగా security పెట్టుకున్న కొద్దీ terrorism పెరిగిపోతూ ఉంటుంది కదా! ఎందుకని? అమెరికా వెళ్తుంటే, మనం లోపలికెళ్తుంటే, తడవకూడనివన్నీ కూడా తడిమేస్తారు కదా! అన్నీ విప్పి చూస్తుంటారు కదా! ఏమిటి భయం? ఎందుకు భయం? Sense of security. నువ్వు ఎంత sense of security పెంచుకుని, దాని గురించి అంత కలవర పడుతూ, అందరినీ కలవర పెడుతూ, ఒక bad will సంపాదించుకుంటున్నావే... కానీ నీ ప్రవర్తన వల్ల ఎప్పుడూ నీకు రక్షణ ఉన్నది. అడవిలో ఎవరు రక్షిస్తున్నారండి వాళ్ళని? అక్కడ మనుషులు బతకట్లేదూ? మనం వెళ్తే దోమ కుట్టి చచ్చిపోతాం. ఎందుకంటే, అడవిలో కెళ్ళినప్పుడు దోమ కుడుతుందేమో, దోమ కుడుతుందేమో, malaria mosquito ఉంటుందేమో... malaria mosquito జ్ఞానం ఉండడంచేత, దాని జపం చెయ్యడంచేత, అది చక్కగా ఆవాహనం చెయ్యబడుతుంది. అది మనని వచ్చి కుడుతుంది. చెప్పానా నీకు malaria mosquito కుడుతుందని అంటాం మనం. అక్కడ అడివిలో వాడిని కుట్టదే! మీరే చూడండి. మాములుగా దోమల గురించి భయపడే వాళ్లనే దోమలు ఎక్కువగా కుడతాయి. ఎందుకో తెలుసా? వాళ్ళలో దోమ ధ్యానం ఉంటుంది. దోముంటుందేమో, దోముంటుందేమో, దోముంటుందేమో అని మీరు hotel గదిలోకి వెళ్ళారనుకోండి, దోమే ఉంటుంది, కుట్టనే కుడుతుంది. చెప్పానా దోమలుంటాయి hotel లో అంటాడు. పక్క వాడిని కుట్టవు. నీ యొక్క మనసు చేత నువ్వు ఆ విధమైనటువంటి field ఏర్పాటు చేస్తావు.

చేసి, దానిని ఆకర్షిస్తావు. రోగం వస్తుందేమో, రోగం వస్తుందేమో, రోగం వస్తుందేమో అంటే, రోగం వస్తుంది. కోరి రోగాలు తెచ్చుకునే వాళ్ళు ఉంటారు. ఎంచేత? నువ్వు అటువంటి భావం చేస్తే, "*యద్భావం తద్భవతి*", అలాగే జరుగుతుంది. అంచేత, అన్ని రకాలుగా రక్ష కలిపించుకున్నా జరుగవలసినవి జరుగుతూనే ఉన్నాయి కదా! ఎన్ని కాపలాలు పెట్టుకుంటే మాత్రం నిలిచిందా ప్రాణం? ప్రాణం పోయే సమయం వచ్చినప్పుడు నువ్వు రకరకాల కాపలాలు పెట్టుకున్నా, ఒంటి స్తంభం మేడలోకి వెళ్ళిపోయి, అన్నీ చేసినా అది వచ్చేస్తుంది కదా! అలాగే, ధనానికి ఎన్ని రకాల ఉపాయాలు వేసి నువ్వు పకట్బందీ చేసినా, అది "కరి మింగిన వెలగ పండు ప్రియన్" అని చెప్పారు. "సిరి తావోచ్చిన వచ్చున్, నారికేళ సలిలై భంగిన్". ఎట్లా వచ్చింది కొబ్బరికాయలోకి నీళ్ళు? నువ్వు పోసావా? అది అందులోకి నీళ్ళు రావడమేమిటి? ఇంకే పండులోకి అన్ని నీళ్ళు రావు. దాంట్లో కొక్కదానికే అందులో నీళ్ళు వస్తాయి. అంతే కాదు, బాగా రుచిగా ఉంటాయి. తాగితే నీకు కాస్త శక్తిని కూడా ఇస్తాయి కదా! అలాంటి నీళ్ళు అందులో ఎట్లా చేరినాయి? అట్లా వస్తుంది సిరి వస్తే! అంటే, మన తెలివి తేటల వల్ల మనకి ధనం వచ్చిందనుకోబోకండి. నువ్వు చేసిన సత్కార్యాల వల్ల నీ దగ్గర క్రమంగా ధనం చేరుతుంది. అలాగే, చేరింది ఎప్పుడు పోతుందో తెలియదు. "సిరి తాపోయిన పోవున, కరి మింగిన వెలగ పండు ప్రియన్" అన్నాడు. ఏనుగుకి ఎప్పుడయినా వెలగ పండు పెట్టి చూడండి. మనం వెలగ పండే తినడం మానేసాం, అసలు ఏనుగులు మన చుట్టుపక్కల ఉండవు కదా! ఏ దక్షిణాదికో గుడికెళ్తే, ఓ ఏనుగు కనిపిస్తుంది. అప్పుడు చూపించాలి పిల్లలికి ఏనుగిలా ఉంటుందని. అంచేత, ఏనుగుకి వెలగ పండు పెడితే, అది దాన్ని పగలు కొట్టదు. అట్లాగే మింగేస్తుంది పండు పండుగానే! మళ్ళీ అలాగే, as it is గా వచ్చేస్తుంది బయటకి. కానీ, లోపల వెలగ గుజ్జు ఉండదు! అట్లా పోతుందట ధనం. అంటే, అంతా ఉన్నట్టుగానే ఉంటుందట గానీ, పోతుందటండి క్షణంలో. అంచేత, నువ్వా రక్షించేది దేన్నయినా? నీ ప్రవర్తన నిన్ను రక్షిస్తుంది తప్ప మరొకటి రక్షించదు. ఎవరినయినా రక్షించేది వారి ప్రవర్తనే. ప్రవర్తన బాగుండక, మన కోసం మనం ఎన్ని రక్షణలు కల్పించుకున్నా వచ్చే అపాయం వస్తుంది. ఏం సందేహం లేదు. అంచేత, ఏమిటి రక్షిస్తుంది నిన్ను అంటే నీ ప్రవర్తనలో ధర్మము నిన్ను రక్షిస్తుంది. నీ ప్రవర్తనలోని అధర్మము నిన్ను శిక్షిస్తుంది. నువ్వు ఎంత దాక్కున్నా వచ్చి నిన్ను శిక్షిస్తుంది. అది కాలం రూపంలో వస్తుంది.

అంచేత, ఇతడు సత్యపరాక్రముడు. చాలా పరాక్రమవంతుడు. అంటే, పరాక్రమవంతుడు కాబట్టే కదలకుండా తన రాజ్యం తనకొచ్చే మార్గం చూసుకున్నాడండి. తెలివయినవాడు కదా! ఎందుకని? బుద్ధిలో బృహస్పతి. మహాత్ముడు, గాంధిగారు ఈ బ్రిటిష్ వారితో మనమేం పోరాడుతాం అనుకున్నాడు కదా! వారి దగ్గరున్న తుపాకుల్లో మనకొకటీ లేదు, వారికున్న సైన్యం మనకి లేదు. మన వాళ్ళే ఆ సైన్యంలో చేరిపోయారు, డబ్బుల కోసం. మన వాళ్ళే మన వాళ్ళని కాల్చేస్తారు నిర్దాక్షిణ్యంగా. ఏమిటిరా అంటే ఉద్యోగధర్మం అంటాడు. అసలు ఈ సమయంలో మనం ఎట్లా గెలుచుకోస్తాం స్వాతంత్రము? అది చాలా అనితర సాధ్యమైనటువంటి పద్ధతుల్లో కదా మహాత్మా గాంధి స్వాతంత్రాన్ని తెచ్చి పెట్టాడు. ఇవాల్టికీ, ఎప్పటికీ అది ఒక record. శాంతియుతంగా, సమరం లేకుండా, స్వాతంత్రాన్ని తెచ్చుకున్న ఏకైక దేశం భారతదేశం. ఏమిటా సమరం? ఈయన మౌనం వహిస్తాడు ఆగ్రహంగా, ఇహ అక్కడ నుంచి ఉపవాసాలు చేస్తాడు. చేస్తే, ఆ ఉపవాసాల ప్రకంపనలు అలా వెళ్లిపోతూ ఉంటాయి. వాళ్ళు ఈయన్ని

పిలుస్తారు, మాట్లాడుతారు. ఈయన్ని West Minister పిలిస్తే, అదే మోకాళ్ళ పైకి పంచ, పైన కండువా వేసుకుని, అంత చలిలోనూ అలాగే వెళ్ళిపోతాడు. Dress code ఉంటుంది మాకు లోపలికి రావడానికి అంటే, నా dress code ఇది అని చెప్తాడు. నీ dress code నువ్వు అనుసరించు, నా dress code నేను అనుసరిస్తాను. ఎంత ధీరత్వం కావాలండి? అంతకుముందు సూటు, బూటు, హాటు వేసినవాడే ఈయన సౌత్ ఆఫ్రికాలో ఉన్నప్పుడు. ఆ ఫోటోలు ఉంటాయి. అప్పుడు అదోలా ఉంటాడు చూడడానికి. ఈ ఉద్యోగం మొదలుపెట్టి, తనలో మార్పు ఎంతగా వచ్చింది? ఈ మహాత్మా, అప్పుడు గాంధియే, ఇప్పుడు మహాత్మా గాంధి అయ్యాడు. అలా స్వాతంత్రం తెచ్చి పెట్టలేదా? అలా శాంతియుతంగా తనకు రావలసినది, తాను సంపాదించు కోవడంలో ఉండే పరాక్రమము, ఊరికే కత్తులు, కటార్లు పెట్టుకుని పోట్లాటకు వెళ్లి తెచ్చుకునే దాంట్లో లేదు. నిజమైన పరాక్రమము అది. సత్యము చేత పరము కూడా ఆక్రమిస్తారు. పరము అంటే దైవము అని అర్థం. సత్యము చేత పరమును ఆక్రమించడం. అలాంటి వాడు సత్యవంతుడు. అది ఒకటి.

ఓరిమిలో పుడమి లాంటి వాడు. అంటే, ఎంత ఓర్పు ఉందంటే, మనకి బొత్తిగా లేనిదే, ఆయనకున్నది అది అన్నమాట. ఇప్పుడు ఓర్పు అనేటటువంటిది మనిషికి చాలా బలం. Ten commandments లో first commandment tolerence. అది నిబంధనలు బాగుపడడానికి. వీటిల్లో మొట్టమొదటది పాశ్చాత్యులు పెట్టుకున్నది tolerence. అది లేదు వాళ్ళకి. ఏది ముందు రాసుకుంటారో అది ఉండదు కదా! మనకి అంతే! భారతం ఏమి చెప్తోంది? మొట్టమొదటి ధర్మం, ఎవడయితే నేర్చుకోదలచి, బాగుపడదామని అనుకుంటే, ఓర్పు, క్షమ. ఇప్పుడు ధర్మరాజు ఏమిటండి? ధర్మరాజు అంటే ఎంత క్షమ, ఎంత ఓర్పు? ఇప్పుడు పద్యాలు ఉన్నాయి కదా! చెయ్యరాని పనులన్నీ కూడా నీ మీద చేసినా కోపం రాదు కదా, నువ్వు ఎంతటి ధర్మరాజో అంటాడు కృష్ణుడు. "తాటం కట్టిరి, నీట తోసితిరి, విష ద్రావంబు తావించిరి, కాంతకున్ చెయ్యరాని ఎంత పని చేసిరి". ఇన్ని చేసినా ఆయనకు కోపం రాలేదు. ఓర్పు పోలేదుట, భరించాడట. ఏదో ఒక రోజు భరించడం కాదు, నన్ను భరించినట్టు మీరు! ఐదో సంవత్సరంలో వచ్చాడండి అడవుల నుంచి రాజ్యంలోకి తమ్ముళ్ళని తీసుకుని. అక్కడ నుంచి తొంభైయేళ్ళు వచ్చేవరకూ, అంటే ఎనభై ఐదు ఏళ్ళు. అంటే, ఒక సహస్ర చంద్ర దర్శనం అయిపోయింది. ఎనభై నాలుగేళ్ళకి అవుతుంది అది. అన్నేళ్ళు వాళ్ళు చేస్తున్నన్ని అపకారాలు వాళ్ళు చేస్తూనే ఉన్నారు, ఈయన భరిస్తూనే ఉన్నాడు. తమ్ముళ్ళకి ఓర్పు పోయింది, భార్యకి ఓర్పు పోయింది, ఊళ్ళో వాళ్ళకి ఓర్పు పోయింది. కృష్ణుడికి కూడా ఓర్పు పోయింది. వనవాసంలో ఉన్న పాండవులను చూసినప్పుడు కృష్ణుడు చాలా రౌద్రాకారం దాల్చి నేను ఇప్పుడే వాళ్ళందరినీ సంహరించేస్తాను అంటాడు. అంటే, అప్పుడు అర్జునుడు కొంచెం ఉపశమింపచేస్తాడు, మేమేదో కొన్ని ప్రతిజ్ఞలు పొరపాటున చేసాం. అంటే, ప్రతివాడికీ కొంచెం నోటి తొందర. అది క్షత్రియులుకి ఎక్కువట. అది కూడా చెప్తాడు కృష్ణుడు భారతంలో. అంటే, ఆయనా క్షత్రియుడే. ఈ క్షత్రియులకి నోటి తొందర ఎక్కువ, ఏవో మాట్లాడేస్తారు ముందు, అది నిలబెట్టుకోడానికి నానా బాధలు పడాలి కదా! ఆయనేమో తొడలు పగలు కొడతాను ఒకడికి అన్నాడు, వాడి గుండెలు చీల్చి రక్తం తాగుతానన్నాడు. మరి అవన్నీ నెరవేరాలంటే నువ్వు

చంపేస్తే ఎట్లా అన్నాడు. అందుకని ఆగుతాడు, అంత కోపం వస్తుంది. కానీ, ధర్మరాజుకి రాదు. అంచేతనే చెప్తారు చిట్టచివరలో, అతనికి కోపం వస్తే ఈ కర్ణుడులాంటి వాళ్ళు పది వేల మంది కర్ణులు అయినా ఎందుకు కాదురా అంటాడు కదా!

ఓర్పు ఈ రోజుల్లో అసలు లేదండి. ఏదో ఒకడి దగ్గరికి appointment కి వెళ్తాం. ఆయన ఫలానా time అని చెప్తాడు. ఈ time అయిన దగ్గర నుంచి, ఇలా చూసుకుంటూ, పెంచుకుంటూ ఉంటాం. ఏమిటి? Impatience, అసహనం పెరుగుతూ ఉంటుంది. అలా waiting లో చాలా లోపల అలజడి వచ్చేస్తుంది కదా! ఏంచేస్తావు మూడు నిమిషాలు తేడా పడితే? లేదా పది నిమిషాలు తేడా పడింది. అసలు రోజు తేడా పడ్డా, నువ్వు చేసేంత మహత్కార్యాలు ఏం ఉన్నాయి గనక? ఓ పావు గంట ఏదయినా flight ఆలస్యం అయినా, ఓ అర గంట train ఆలస్యం అయినా, ఏది ఆలస్యం అయినా, మనలో కలిగేటటువంటి అసహనం ఉందే అది మన test, మనకెంత ఓర్పు ఉన్నది అని. నువ్వు అనుకున్న సమయానికి నువ్వు అనుకున్న పని కాకపోతే నీలో అసహనం పెరుగుతూ ఉంటే నువ్వు బలహీనుడివి అని అర్థం. ఎంత వేచి ఉండగలిగితే అంత నేర్పు. వేచి ఉండలేకపోవడం నేర్పు కాదు. అది అపజయాలకి కారణం అవుతుంది. అంచేత, ఓర్పు నేర్పు అని చెప్తారు.

కొంతమంది చాలా ఓర్పుతో ఉంటారు. ఈ రోజుల్లో అలాంటి వాళ్ళని చాలా తక్కువగా చూస్తూ ఉంటాం. ఎందుకంటే, క్షణంలో irritate అయిపోతారు. కాస్త మనం అనుకున్నట్టుగా లేకపోతే లోపలి నుంచి impatience, intolerance, irritation, ఇవన్నీ కలిపి ఒక కోపమైనటువంటి ముఖము, ఇలాంటివన్నీ వచ్చేస్తుంటాయి. ఆయనకి అవన్నీ ఏం లేవట. ఓర్పుతో ఉంటాడు. మనం ఈ గుణాలు సంపాదించుకోవద్దూ? అందుకనే, ఓర్పు లేనివాడికి ఏం జరుగుతుందంటే ఎక్కడికి వెళ్ళినా waiting ఉంటుంది. నువ్వే చూసుకో. ఇప్పుడు కొంతమంది వెళ్ళంగానే ఏ ఆఫీసుకో, ఆ లోపల ఉన్న ఆఫీసర్ వెంటనే పిలుస్తాడు. కొంతమంది వెళ్తే, గంటయినా, రెండు గంటలయినా, మూడు గంటలయినా, పిలవకూడదని కాదు, పిలవడానికి వీలుపడదు. ఏదీ? ప్రకృతి నీకు ఓర్పు నేర్పుతోందని అర్థం. కొంతమంది స్టేషనుకి వెళ్తే train time కి వస్తుంది. కొంతమంది స్టేషనుకి వెళ్తే train అంత time కి రాదు. కొంతమంది ప్రయాణం చేస్తుంటే ఎప్పుడూ late గానే వస్తుంది బండి. మనవాళ్ళు ఉన్నారు, నాకు చెప్తుంటారు, నేను ఎక్కాను కదా గురువుగారు అందుకనే late గా వచ్చిందంటాడు! అంటే, వాడెక్కితే కచ్చితంగా late అవుతుందన్న మాట. ఎందుకవుతుందంటే అర్థం అతనిలో శని ప్రభావం చాలా బలహీనంగా ఉంది అని అర్థం. అంటే, అతనికి ఓర్పు లేదు అని అర్థం. ఓర్పు లేనివాడు త్వరపడి కష్టాలు తెచ్చుకుంటూ ఉంటాడు. ఓర్పు ఉన్నవాళ్ళు నిదానంగా ఉండి, భరించడం నేర్చుకోవడం వల్ల అన్నీ కలిసి వస్తాయి. నెమ్మది మీద అన్నీ కలిసి వస్తాయండి, తొందరపాటు వల్ల ఉన్నవి కూడా పాడయిపోతాయి.

అంచేత, ఈయనకి ఓర్పు అట. ఎంత ఓర్పు లేకపోతే తల్లితండ్రులని... వృద్ధులైన తల్లితండ్రులని చూడడానికి చాలా ఓర్పు కావాలి. ఈయనకి తల్లితండ్రులు ఉన్నారు. అందులో తండ్రికి కన్నులు లేవు. అలాంటి వాళ్ళకి చెయ్యడం అంటే అంత సులభం కాదు కదా! ఇంట్లో ముసలావిడ ఉందట అంటే నానా రకాలుగా విసుక్కుంటూ ఉంటారు అందరూ కదా! కాస్తోకూస్తో డబ్బు ఉంటే, వాళ్ళనీ వీళ్ళనీ, పని మనుషులని పెట్టేస్తారు. వాళ్ళెవరూ? నీ తల్లితండ్రులే,

నిన్ను పెంచి, పోషించి, పెద్దవాడిని చేసినటువంటివారు కదా! వాళ్ళకి చెయ్యడానికి నీకు... ఒకటి, ఓర్పు లేదు కదా! అందుకనేం చేస్తున్నాం? Old age home కట్టేసి అందులో తోలేస్తున్నాం. అది fashion కదా ఇప్పుడు! ఎందుకు old age home? పూర్వకాలం ఏవీ old age homes? ఎందుకు వస్తున్నాయి old age homes? It is a mark of our intolerance towards senior citizens who have been responsible for your upbringing and for your growth. మనం కనుక ఆలోచించుకుంటే, మనకే మాత్రం కృతజ్ఞతాభావం ఉంటే, మనని కని, పెంచి, పెద్ద చేసిన వారి యెడల attitude ఎలా ఉంది? ఇట్లా చెయ్యి పట్టుకుని నడిపించడానికి కూడా కొంతమందికి ఓర్పు ఉండదు. అలాంటిది ఇంట్లో ఇద్దరు వృద్ధులైన తల్లితండ్రులు. వారి పోషణ చూసుకోవాలి. వెళ్లి సమిధలు, కట్టెలు తీసుకురావాలి. వీటన్నిటిలోనూ సత్యవంతుడు చాలా ఓర్పు చూపిస్తున్నాడు అని నారదుడు చెప్తున్నాడు.

అంతే కాదు, అతని అందం పూర్ణ చంద్రుడిని చూస్తే ఎలా ఆహ్లాదం కలుగుతుందో అలాంటి ముఖము కలవాడు అని చెప్తున్నాడు. అంటే, రామచంద్రుడంటాము చూసారా, చంద్రుడు అని చెప్పడంలో సౌందర్యం గురించి చెప్తాం. ఆహ్లాదకరమైనటువంటి ముఖము కలిగినటువంటి వాడిని చంద్రుడితో పోలుస్తాము. చంద్రకాంతి వంటి ముఖము కలిగినటువంటి వాడతను. జాబిలితో సరిపోతాడని చెప్పాడు. అలాగే, సౌందర్యము, అశ్వనీ దేవతల సౌందర్యము కలిగి ఉన్నాడని చెప్తారు. ఇప్పుడు అశ్వినీ దేవతల సౌందర్యం అంటే, అశ్వినీ దేవతలు ఎట్లా ఉన్నారో మనకు తెలియాలి కదా? ఎలా తెలుస్తుంది చెప్పండి అశ్వినీ దేవతల సౌందర్యము? చూస్తే కదా తెలుస్తుంది! చూడకుండా తెలియని వాటితో మనం పోల్చలేం. నారదుడు అశ్వినీ దేవతలను చూసిన వాడు కాబట్టి ఆయన చెప్పగలడు. ఇప్పుడు నన్ను చెప్పమంటే, నేను చూడలేదు అశ్వినీ దేవతలని ఇంకా. కాబట్టి మీకు వివరించి చెప్పలేను. మీరు ప్రయత్నం చెయ్యండి పోనీ. అశ్వినీ దేవతలు సృష్టిలో పగలు-రాత్రి, కుడి-ఎడమ. ఈ ప్రజ్ఞలకు అధిదేవతలు. వారు ఇలా ఉంటారు అని తెలియచెప్పాలంటే నేను చూసి కదా నేను చెప్పాలి. లేకపోతే అసత్య దోషం. చూడకుండా చూసినట్టు ఎట్లా చెప్తారు?

ఎప్పుడో పదేళ్ల క్రితమో, పదిహేనేళ్ళ క్రితమో నేను, మా శ్రీమతి ఒకళ్ళ ఇంటికి వెళ్తే, ఆ ఇంటావిడ, ఇంటాయన పార్వతీపరమేశ్వరులు మా ఇంటికి వచ్చినట్టుగా ఉంది అన్నారు. అంటే, నేను వెంటనే అన్నాను, అబద్దాలు ఆడకండి, ఇప్పుడే కాలు పెడుతున్నాం ఇంట్లో, మొట్టమొదటి మాటే అబద్దం మాట్లాడుతారేంటి అన్నాను. అంటే, వాళ్ళిద్దరికీ భయం వేసింది, అంత మాట అనేసేడే అని. అదేంటండీ అలా అన్నారు అంటే, మీరు పార్వతీపరమేశ్వరులను చూసారా అని అడిగాను. పార్వతీపరమేశ్వరులను చూచి అలా అన్నారంటే అర్థం ఉంది. నువ్వు చూడలేదు కదా! లక్ష్మీనారాయణులు లాగా ఉన్నారు మీరు ఇద్దరూ అన్నారనుకోండి ఎవరన్నా, ముందు మనం వాళ్ళ కాళ్ళ మీద పడి దణ్ణం పెట్టేసుకోవాలి, సాష్టాంగ నమస్కారం చేసి. ఎందుకంటే, వాడు లక్ష్మీనారాయణులను చూచి, మన్ని వాళ్ళతో పోలుస్తున్నాడన్న మాట. లేకపోతే, మన్ని పొగడడానికి అంత అబద్దం ఆడాలాండి? ఇప్పుడు పొగడ్తలే అబద్దాలు. సత్య దూరంగా ఉంటాయి పొగడ్తలు.

అందుకనే, కృష్ణుడు చెప్పాడు, నిందా స్తుతులయందు మౌనంగా ఉండరా అని. స్తుతించాడుట అంటే భట్రాజే కదా వాడు! సత్యాన్ని ప్రశంసించడం వేరు, ఊరికే పొగడడం వేరు. లక్ష్మీనారాయణుల లాగా ఉన్నారు మీరు అంటే, నువ్వు లక్ష్మీనారాయణులను చూసావా? చూస్తే, ముందు నీకు నేను దణ్ణం పెట్టాలి, నువ్వు నాకు దణ్ణం పెట్టడం ఏమిటి? అబద్ధమేనా మీరు మాట్లాడింది? పార్వతీపరమేశ్వరులని మీరు చూడలేదు కదా! చూడలేదని మీ మొహం చూస్తేనే తెలుస్తుంది కదా! ఇప్పుడు దైవాన్ని చూచిన మొఖానికి, దైవాన్ని చూడని మొఖానికి తేడా తెలియదండి? తెలుస్తుంది. అంచేత, నువ్వు మీ ఇంటికి పిలిచావు బావుంది. ఏదో మీ ఇద్దరూ వచ్చారు, మాకు చాలా సంతోషంగా ఉందట అంటే, కామోసు అనుకుంటాం. అవునో కాదో మనకు తెలీదు. నిజంగా సంతోషంగా ఉందా లేదా అనేది తర్వాత తెలుస్తుంది కదా! ఎంచేత? ఏదో మాట్లాడాలని మాట్లాడడం కాదు. అలా మాట్లాడకూడదు. నువ్వు ఏం మాట్లాడినా అందులో సత్యం ఉండాలి. సత్యం లేని మాట ఎందుకు పలకాలి? అక్కరలేని మాటలు? లేదూ, అందరూ చూచే వాళ్ళున్నారనుకోండి, వాళ్లతో పోల్చండి. ఆ దిలీప్ కుమార్, మీనాకుమారి వచ్చినట్టుగా ఉందని అన్నారనుకోండి, అవైతే వాళ్ళెట్లా ఉంటారో మనకి కూడా చూపించవచ్చు బొమ్మలు కదా! అలా అంటే మనం ఒప్పుకోం, ఎందుకంటే మనం అలాలేము కదా! ఎందుకు లక్ష్మీనారాయణులు అంటారంటే, నువ్వూ చూడలేదు, నేనూ చూడలేదు. కాబట్టి అలా అనేస్తే వీడు పొంగిపోతూ ఉంటాడు. అదేంటండీ? అసత్య పొగడ్త విన్నప్పుడు లోపల విపరీతమైనటువంటి అలజడి కలుగుతుంది, తెలుసా? పొగడ్తలలో సత్యం లేనప్పుడు సత్పురుషుడికి లోపల ఆనందం కలగకపోగా, దుఃఖం కలుగుతుంది, అలజడి కలుగుతుంది. సత్పురుషుడు కాకపోతే పొగడ్తలన్నీ ఒప్పుకుంటాడు. ఇంకా కొంచెం పొగిడితే బాగుంటుంది అనిపిస్తుంది వాడికి. అంచేత, ఈ అశ్వినీ దేవతల వలే ఉంటుంది ఈ సత్యవంతుడి సౌందర్యం అని అన్నప్పుడు, ఎవరయినా చెప్పగలిగిన వారుంటే మీరు నాకు చెప్పండి, అప్పుడు నేను తెలుసుకుంటాను.

అంచేత, అతడు తపస్సు చేస్తాడటండి సత్యవంతుడు. ఇప్పుడు సినిమా చూస్తే ఏం చూపిస్తారండీ ఇవన్నీ, చూపించలేరు కదా! అలాగే, సావిత్రిని highlight చేసి, సత్యవంతుడిని సాదాసీదా మనిషిలాగా చూపిస్తారు కదా! ఏదో ఒక అర్భకుడిలా ఉంటాడు మామూలుగా సత్యవంతుడు. అర్భకుడయితే సావిత్రీ దేవి ఎందుకు ఎన్నుకుంటుందండీ? ఈ జ్ఞానం ఉండొద్దు? అంత మహత్తరమైన మేధో సంపత్తి కలిగినటువంటి స్త్రీ, ఒక బొత్తిగా ఎందుకూ పనికిరాని వాణ్ణి మొగుడిగా చేసుకుంటుందా? చేసుకోదు. అంచేత, తపస్సు, శమము, దమము, దానము, దేవబ్రాహ్మణ భక్తి, మహనీయ ప్రభావం ఆదిగా గల సుగుణాలన్నీ అతని యందే కానీ వేరేచ్చటా కానరావు అని చెప్పాడండి నారదుడు. అప్పుడు సమకాలికంగా ఉన్న కాలంలో అతనితో సరితూగ గల యువకుడు మరొకడు లేడు అని చెప్పి, నారద మహర్షి సావిత్రీదేవి చేసినటువంటి ప్రతిపాదనకు బలాన్ని కలిగిస్తాడు.

అయితే, నేడు మొదలుకొని ఒక సంవత్సరము మాత్రమే సత్యవంతుడికి ఆయుర్దాయము కలదు అని చెప్పాడు మహర్షి. మహర్షి కదా! త్రిలోకజ్ఞానం కలిగినటువంటి వాడు మహర్షి, అందరూ కాదు. ముందు మహర్షి అని పెట్టేసుకుంటే మహర్షి అయిపోవు. అయిపోతావా? ఒక్క సంవత్సరమే ఇక్కడి నుంచి బతుకుతాడు. ఇది అవశ్యం నీకు వెల్లడించవలసినది. నేను నీకు చెప్పాలి ఈ విషయం. నీ హితం కోరే వాడిని కాబట్టి వింటానికి కొంచెం చేదుగా ఉన్నా, మీ అమ్మాయి అంత గాఢంగా అతడినే కోరుకుంటున్నా, ఈ విషయం నీకు తెలియాలని చెప్పి చెప్పాడు. "ఒక

సంవత్సరం బతుకుతాడు ఇవాళ్ళ నుంచి. కనుకనే విశ్వాసంగా వక్కాణించాను. ఈ విషయం లెస్సగా పరియాలోచించి నిర్ణయించవలసినది అని చెప్పాడు. అశ్వపతి ఆ ప్రసంగం విని మిక్కిలిగా చింతించి, కుమార్తెని అవలోకించి, అమ్మా, నారద మహాముని దేవ రహస్యవేత్త. ఈతని వచనం అమోఘము. నీకు అట్టి అల్పాయిష్కుడయిన వరుడేల? వేరొకరి నెవరి నయినా వరించ వలసినది అని హితం చెప్పాడు."

అంతేగా, జాతకం చాలా బావుందండి, పిల్లవాడికి ఆయుర్దాయం లేదని చెప్పామనుకోండి, ఏ తండ్రి ఇస్తాడండి పిల్లని, ఇవ్వడు కదా! వధూవరులు పొంతన చూసేడప్పుడు ముందు చూడాలిసినది వరుడి ఆయుర్దాయం ఎంత, వధువు ఆయుర్దాయం ఎంత చూడాలి. వాళ్ళ కలియిక వల్ల ఆయుర్దాయానికి ప్రమాదం ఏమన్నా ఉందా? అది కూడా చూడాలి. కొన్ని కొన్ని జాతకాలు ఎలా ఉంటాయంటే, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవడం వల్ల వీడి ఆయుర్దాయం తగ్గిపోతుంది. కాకపోతే, ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవడం వల్ల ఆ అమ్మాయి ఆయుర్దాయం తగ్గిపోతుంది. ఎందుకంటే, రెండు ప్రజ్ఞలు ఒకటి అయినప్పుడు వారిది వీరికి, వీరిది వారికి, ఒకరి నుంచి ఒకరికి ప్రవహిస్తూ ఉంటాయి అవి, పాలూ నీళ్ళూ కలిసినట్టుగా. పాలభాగం ఎక్కువ ఉంటే పాలు, నీళ్ళభాగం ఎక్కువగా ఉంటే నీళ్ళయిపోతాయి కదా! అంచేత, చూసేటప్పుడు ముందు చూడావలసినది ఆయుర్దాయం ఎలా ఉంది, వీరిద్దరికి దీర్ఘాయుష్షు ఉన్నదా, ఒకటి. రెండవది, కలయిక వల్ల ఆయుర్దాయానికి ముప్పు ఉన్నదా? అది తెలుస్తుంది. అటుపైన చూడాలిసినది సంతాన యోగ్యత ఉన్నదా లేదా? అటుపైన చూడాలిసినది అన్యోన్యత. ఎందుకంటే, పోట్లాడుకుంటూ ఉన్నా పిల్లలని కనేస్తారు కదా! అన్యోన్యత ఉన్నదా లేదా? ఈ మూడూ చూస్తాం. ఈ మూడూ చూడడం కన్నా ముఖ్యంగా గుణసంపద ఎలా ఉన్నదో చూడాలి జాతకంలో. అంటే, గుణముల పొంతన అంటే, ఈ అబ్బాయి సంస్కారాలు ఏమిటి, ఆ అమ్మాయి సంస్కారాలు ఏమిటి? ఓదానికి, ఓదానికి కొంత అనుబంధం ఉన్నదా లేదా? ఇలాంటివి చూసుకోవాలి.

అట్లా జాతకం చూసేటప్పుడు ప్రధానంగా చూసేది ఆయుర్దాయం. అందుకని ఆయన ఆయుర్దాయం గురించి చెప్పాడు. గుణములు ముందే చెప్పాడు. ఇంతకన్నా మంచి గుణములు కలిగిన వరుడు ప్రస్తుతం లేడు. అయినప్పటికీ ఇతనికి ఆయుర్దాయం లేదు అని చెప్పాడు. చెప్తే ఏ తండ్రి అయినా బాధపడతాడు. అంచేత, అతడు ఈ విధంగా హితవు ఉపదేశించాడు. అది విని సావిత్రిదేవి మాట్లాడుతోంది, "తండ్రీ, మనో వాక్ కర్మలలో మనస్సు అత్యంత ముఖ్యము". మనస్సు, వాక్కు, చేత, వీటి మూడిట్లో మనస్సు అత్యంత ముఖ్యము. అంటే, మనస్సు కన్నా పైన బుద్ధి ఉన్నది. అంటే, బుద్ధి గురించి చెప్పట్లేదు. "కనుక, మనసారా అభిలషించిన భర్తనే కాక, నేను ఇంకొకరిని అభిలషించ దలచుకోలేదు" అని. ఒక్కసారి ఆ విధంగా మనస్సుతో నేను అతనియందు... నా మనస్సు అతనియందు తగులుకొని ఉన్నది కనుక, మనసారా నేను అతనినే భర్తగా భావిస్తున్నాను. కనుక, నేను ఇంకొక రకంగా ఆలోచించేటటువంటి అవకాశం లేదు, ఆలోచించలేను.

అదే పొద్దున్న చెప్పింది కూడా. పురుషుడికి, స్త్రీకి చాలా తేడా ఉంది ఈ విషయంలో. పురుషుడు చాలా సంస్కారవంతుడయితే తప్ప, భార్య తప్ప ఇతరుల గురించి ఆసక్తి లేని వాళ్ళు చాలా తక్కువ మంది

ఉంటారు. భారత స్త్రీ ఒక్కసారి భర్తకి మనసిస్తే, ఇంక ఆ భర్త లేకపోతే అతడినే మనసులో పెట్టుకుని శేషజీవితం పరిపూర్తి గావించుకుంటుంది. ఇంకొకరిని వివాహం చేసుకుందామనేటటువంటిది పురుషుడు అనుకుంటాడేమో గానీ, స్త్రీ అనుకోదు భారతదేశంలో ఇప్పటివరకూ. ఇప్పుడు అవి కూడా మారుతున్నాయి. ఎందుకంటే, అంత స్పష్టమైనటువంటి, అద్దమువంటి మనస్సు కరువైతే ఏదయినా ఫరవాలేదు అన్నట్టుగా ఉంటుంది. కాకపోతే, మన సాంప్రదాయంలో ఒక భారత స్త్రీ, ఒక పురుషునికి మనసిస్తే ఇంక అక్కడినుంచి అది వెనక్కిరాదు. అంచేత, బలవంతగా ఇంకో పెళ్లి చేసినా మనసులో ఇదే ఉంటుంది. అప్పుడు, ఆ పెళ్లి మన భాషలో చెప్పాలంటే పెటాకులు అయిపోతుంది. పాడయిపోతుంది. ఎందుకని? ఇంకొకరు మనసులో ఉండగా ఈ పురుషుని ఎలా అంగీకరించగలదు? అది మోసం చేసినట్లే! తనలో ఘర్షణ కలుగుతుంది. అంతేకాదు, తను ఎవరినైతే వివాహం చేసుకుందో ఆ పురుషుడికి అవగాహన అయిపోతుంది, నా మీద మనస్సు లేకుండా నన్ను పెళ్లెందుకు చేసుకున్నావు అని అడగొచ్చు కదా! అంచేత, మనసిచ్చిన తర్వాత ఇంకోటి ఎలా? అంచేత, ఇచ్చేటప్పుడే జాగ్రత్తగా చూసుకోవాలి. ఇచ్చేసిన తర్వాత అప్పు ఇచ్చేసినట్టే. కొంతమందికి అప్పు ఇస్తే డబ్బులు తిరిగిరావు. ఇచ్చేముందే ఆలోచించుకోవాలి కదా! అలాగ, మనసిస్తే మనస్సు ఓ పట్టాన తిరిగి రాదు. అదే ఆలోచిస్తుంది. ఎందుకని? అక్కడ తగులుకొని ఉంటుంది. అది తెలుసు సావిత్రిదేవికి. అంచేత, ఒకరికి మనసిచ్చి ఇంకొకరిని మళ్ళీ నేనెలా ఆలోచిస్తాను? ఆలోచించలేదు. అందుచేత, నేను ఇంకోటి ఆలోచించదలుచుకోలేదు. అదండి! ఆలోచించదలుచుకోలేదు సత్యవంతుడు ఎటువంటి వాడయినా సరే. అతడే నా ప్రాణపతి అంది. అంటే, తన ప్రాణాలు పోతాయంటే, అతను నా ప్రాణపతి అంటోంది ఆవిడ చూడండి.

అలా ఉంటాయి భార్యాభర్తల సంబంధం హైందవ సాంప్రదాయంలో. ఆ క్రతువులోనే చెప్తారు ఏడుసార్లు, ఏడు అడుగులు చుట్టూ తిరగగానే ఈ ఏడు అడుగులు తిరిగేటప్పుడు ఏడు వాగ్దానాలు చేయిస్తారు. సంస్కృతంలో చేయిస్తారు కాబట్టి మనకి తెలియదు, తెలుసుకోవాలనుకుంటే తప్ప. మేము కలిసి ఇది చేస్తాం, మేము అది చేస్తాం అని బోల్డు చెప్పుకుంటాం అంతా అయిపోయిన తర్వాత, ఏడు అడుగులు అగ్ని చుట్టూ నడిచిన తర్వాత మేము ఇద్దరం ఒకటి అయిపోయాము అని, it is one in two bodies అని, ఒకే ప్రజ్ఞ రెండు దేహాల్లో ఉంది అని. అంచేత, ఒకరు పరదేశం వెళ్ళినా, రెండవ వారికి వారు లేరు అనిపించదు. అంచేత, పురుషుడు పరదేశం వెళ్తే స్త్రీ భర్త లేడన్న భావం కలిగి ఉండదు లోపల. అంచేత, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంకొక పురుషుడిని అంగీకరించదు. అలాగే, పురుషుడు సంస్కారవంతుడైతే తాను ఎక్కడికి వెళ్ళినా తన హృదయమందు తన స్త్రీని తీసుకెళ్తాడు. అంచేత, అతనికి పరస్త్రీలయందు అతనికి వ్యామోహం ఉండదు. ఈ రహస్యమే చెప్తుంది రామాయణం. అమ్మవారు లంకకి వెళ్ళినా రాముడు తనతోనే ఉన్నాడన్న భావంతో ఉంటుంది. అయ్యవారు వనవాసం చేస్తూ సీతాదేవిని కోల్పోయినా, సీత తనతో ఉన్నాట్టుగానే భావిస్తాడు. అట్లా ఉంటే దానిని అవినావభావ సంబంధం అంటారు. అంటే, విడదీయరాని సంబంధం. దేహములైతే విడిగా ఉండొచ్చుతప్ప మనస్సులో ఇద్దరూ కలిసిపోయే ఉంటారు. అంచేత, అలా మానసికమైనటువంటి ఒక ఐక్యత కలిగినప్పుడు దాన్ని మరి విడదీయడానికి వీలుపడదు.

అప్పటికే నీళ్ళు కలిపేసాం పాలల్లో, కాఫీ పెట్టుకుందామని కదా! ఇప్పుడు ఆ పాలు ఆ నీళ్ళ నుంచి వేరు చెయ్యాలంటే ఎట్లా? అవ్వదుగా? అవుతుందా? లేకపోతే, అప్పటికే తోడు వేసేసాం పాలల్లో, అది పెరుగవుతోంది,

ఇప్పుడు కాఫీ పెట్టుకుందాం అంటే అవుతుందా? అవ్వదు. అలాంటి రసాయనక చర్య జరుగుతుంది ఒక పురుషుడికి, ఒక స్త్రీకి మధ్య. అంత ఆలోచించుకునే time లేదు ఎవ్వరికీ. మొత్తమంతా రసాయనమే. ఇప్పుడు నిజంగా మీరు వింటునప్పుడు మీలో ఒక రసాయనకం జరుతుంది. ఆ రసాయనం మీలో ఉండేటటువంటి ప్రజ్ఞను చక్కగా తీర్చిదిద్దుతుంది. అదే ఇంకో ఫంక్షన్నో, లేక action movie చూస్తుంటే, ఇంకో రకంగా ఉంటుంది. మోండా మార్కెట్లో తిరుగుతున్నాం అనుకోండి మరో రకంగా ఉంటుంది. రోడ్లమీద తిరుగుతూ ఉంటే ఇంకో రకంగా ఉంటుంది. ఏ పనీ లేకుండా రోడ్లమీద తిరుగుతుంటే గాడిదల్లే ఉంటుంది. మానవాకారంలో తిరుగుతున్న గాడిద అన్నట్టుగా ఉంటుంది. ప్రజ్ఞ ఎప్పటికప్పుడు తను ధరించినటువంటి భావం ప్రకారం ఆకారం మారుతూ ఉంటుంది. భౌతికంగా ఇలానే ఉండొచ్చు, చూడ్డానికి మనవరూపమే ఉండొచ్చు తప్ప, మానవుడే అయి ఉండక్కర్లేదు. దేవతై ఉండొచ్చు, లేక రాక్షసుడై ఉండొచ్చు కదా! ఏదయినా కావొచ్చు. లేక పశువై ఉండవచ్చు.

అంచేత, ఎంత బాగా చెప్పింది చూడండి. ఇది అందరికీ ఈ విషయములో అవగాహన తక్కువగా ఉంటుంది. అంచేత, ఈవిడ చాలా స్పష్టంగా చెప్పింది. ఒక సంవత్సరంలో పోతాడంటే, చూద్దాం. ఎవరూ ఒప్పుకోరండి. అసలు మనం ప్రేమించిన తర్వాత అవతల వాళ్ళకి ఎదో ఆపద వచ్చిందనుకోండి, పెళ్లి కొడుకు ఉద్యోగం పోయిందనుకోండి. Infosys లో ఉద్యోగం ఉండి, నెలకి లక్ష రూపాయులు అని మనం ఒప్పుకుంటాం. Infosys లేకపోతే ఇంకో sys, ఎదో చాల ఉన్నాయి కదా! లక్ష రూపాయిల ఉద్యోగం అండి, ఇప్పుడు పోయింది. ఇప్పుడు ఉద్యోగం లేదు, ఏం చేస్తావు? మళ్ళీ ఆలోచిస్తావా? పునర్ ఆలోచిస్తారు కదా! అదేంటండి? మిగతావన్నీ బావుంటే ఇది రాదా మళ్ళీ? నీ మీద నీకు ధైర్యం ఉండాలి. ఆ కుర్రవాడిలో ఉండేటటువంటి గుణములయందు నీకు విశ్వాసం ఉంటే, గుణములు చూచి పెళ్లి చేసుకోవాలి తప్ప ధనము చూచి పెళ్లి చేసుకోకూడదు. చాలా ధనం ఉండి, వాడు దుర్గుణవంతుడైతే ఏ సుఖమూ లేదు. చాలా సుగుణములు కలిగి ఉంటే, అతడు ధనవంతుడు కాకపోయినా, వివాహం చేసుకోవడానికి చాలా అర్హుడు. పొద్దున్న చెప్పానుగా మీకు, ఉద్యోగం పోయిందట, అమెరికా నుంచి వచ్చేసాడట, parents అతని మీదే dependent అట అంటే ఏ పిల్ల తండ్రీ ఆ పిల్లవాడికి పిల్లని ఇవ్వడు. అవి ప్రస్తుతం ఉన్న పరిస్థితులు. కానీ అతడు సుగుణవంతుడైతే? అతడి సుగుణములే అతనికి రక్ష. అతడి సుగుణములే అతడి వృద్ధికి మూలమని తెలిసినవాడు అలాంటి వాడే కావాలనుకుంటాడు. నీ ఉద్యోగంతో నాకు సంబంధం లేదు, నీ ఆస్తితో నాకు సంబంధం లేదు, నీయందు ఉండేటటువంటి సద్గుణములతో నాకు... అలా వివాహం చేసారు ముందు తరాల్లో.

అంచేత, ఇన్ని గుణములు ఉన్న మనిషి అతను. అలాంటి గుణములు ఎక్కడా లేవు. ఒక్క సంవత్సరమే బతుకుతాడా, చూద్దాం. ఎంచేత? ఆమె అతీతమైన శక్తి కలిగినటువంటి కన్య కదా! అది నిన్న తెలియపరిచాను, లేకపోతే పొద్దున్నో. ఎలా ఆయనకి అతీతమైన శక్తులు, శక్తి కలిగినటువంటి ప్రజ్ఞగా జన్మతః ఉన్నాయో. ఎంచేత? ఆమెకు ప్రాణముల యొక్క తీరుతెన్నులు తెలుసు. ప్రజ్ఞ యొక్క స్వరూప స్వభావాలు తెలుసు. ప్రజ్ఞ ఎలా ఉంటుంది, ప్రజ్ఞ ఎన్ని పనులు చెయ్యగలదు, ప్రజ్ఞ యొక్క పాటవము, విలాసము తెలిసినది.

ప్రాణముల యొక్క రాకపోకలు తెలిసినటువంటిది ఆవిడ. అంచేత, ఇతని ప్రాణములు పోతాయట అంటే, ఆమె అంతగా భయపడలేదు. భయపడకుండా, ఇలాగే చేసుకుంటానని చెప్పింది. "అని స్వాభిప్రాయముగా, నిస్సందేహంగా వెళ్ళడించినది. అశ్వపతి ఆపైన కింకర్తవ్య మూఢుడై దేవముని వైపు చూచాడు. నారదుడు ఆ ధోరణి గ్రహించి, మద్రేశ్వరా, నీ ప్రియ తనూజ సుగుణాల కన్నిటికినీ ఆలవాలము." నీ కూతురు అన్ని సుగుణములు కలిగినటువంటిది. "ఈమె దృఢ సంకల్పము మనమెవరమూ మార్చలేము. కనుక మరి అనుమానించక సావిత్రిని సత్యవంతుడికి ఇచ్చి వివాహం జరిపించవలసినది. ఈ పుణ్యశీల సుకృతరాశి వల్లనైనా అతనికి చిరాయుర్దాయము లభించవచ్చును".

అంటే, స్త్రీ పుణ్యం వల్ల పురుషుడి అదృష్టం మారుతూ ఉంటుంది. మనకి పాట ఉంది కదా, త్యాగరాజ కీర్తన, "మా జానకి చెట్టాపట్టాగా మహారాజువయినావు నువ్వు" అని. లేకపోతే నువ్వేముంది అని అంటూ ఉంటాం. అదేంటి అన్యాయం, ఆయన పుట్టుకతోనే చక్రవర్తి కొడుకు కదా! కానీ పాట అట్లా ఉంటుంది. అంటే, ఒక్కొక్కళ్ళని పెళ్లి చేసుకోవడం వల్ల అదృష్టం కలిసి వస్తుంది. ఒక్కొక్కరు కాలు పెడితే ఉన్నది కూడా పోతుంది. అందుకని మనకి సామెత ఉంది, "పిల్లొచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ" అంటూ ఉంటారు. ఇంట్లో కోడలు అడుగు పెట్టగానే, ఆ సంవత్సరంలో ఎలా జరిగినాయి ఇంట్లో కార్యక్రమాలు అనేటటువంటిది ఒకటి పరిశీలిస్తూ ఉంటారు పెద్దవాళ్ళు. అంటే, పిల్ల అదృష్టం తీసుకువచ్చిందా? దురదృష్టం తీసుకువచ్చిందా? అట్లాగే, ఈ పిల్లవాడు ఈ ఇంటికి అల్లుడవుతాడు కదా, అల్లుడొచ్చిన వేళ వాళ్ళకెలా ఉంటుందో కదా! "జామాతా దశమ గ్రహం" అంటారు కదా! అంటే, అల్లుడు మాములుగా నవ గ్రహాలు కాక, వీడొక గ్రహం, ఏడిపించుకు తినడానికి. అందుకని, "జామాతా దశమ గ్రహం" అంటారు. అంచేత, అల్లుడు రావడం వల్ల ఆ ఇంట్లో పొంగిందా, కుంగిందా? వాడు పుణ్యవంతుడైతే, వాళ్ళింట్లో కూడా పొంగుతుంది. ఎందుకంటే, పెళ్లి మంత్రాల్లో ఇవన్నీ చెప్పిస్తారు. పిల్లనందుకుంటూ పెళ్లికొడుకు చెప్తాడు, నిన్ను నేను... నువ్వు మా ఇంటికి వస్తున్నందుకు, నాతో సహజీవనం చేస్తున్నందుకు, నీ తల్లితండ్రులు ఆరోగ్యంగా ఉందురు గాక, నీ అన్నదమ్ములు అందరూ సుఖంగా ఉందురు గాక, నీ అప్పచెళ్ళిలందరూ వృద్ధి పొందురు గాక, మీ ఇల్లంతా ఐశ్వర్యములతో నిండును గాక, ఇట్లా చెప్తారు. వీడికుంటే... ఏది అదృష్టం. అని చెప్తే కాదు కదా!

అంచేత, ఈమె ఇంత పుణ్యరాశి ఉంది కదా! ఇవన్నీ పూర్వకాలంలో investments. మనిషి పుణ్యం మీద నువ్వు bet చెయ్యాలి తప్ప, మనిషికి ప్రస్తుతం ఉండే bank balance మీద bet చెయ్యలేవు. గుణవంతుడైతే తప్పక అతడికి వృద్ధి ఉంటుంది. కాలక్రమములో వృద్ధి చెందుతాడు. సద్గుణాలు సరైనటువంటి తెలివిని పెంచుతాయి. దుర్గుణాలు పనికిరాని తెలివిని పెంచుతాయి. పనికిరాని తెలివితో తాత్కాలికంగా మనం చాలా పోగేసుకున్నా అది మన దగ్గర నిలబడదు. ఆపదలు తీసుకువచ్చి, అవి పోగా, మనకి ఆపదలు మిగులుతాయి. అంచేత, ఏది చూసుకోవాలనేది భారతీయ ధర్మంలో, గుణములు చూసుకోమని చెప్తారు. అందుకనే, పిల్లనిచ్చేప్పుడు సంస్కారములు చూసుకోమని చెప్తారు. అలా చూసుకోకుండా, పదవులు, ధనము అవన్నీ చూసి చేస్తే విడాకులు వచ్చేస్తాయి. పై దేశాల్లో సులభంగా విడాకులు రావడానికి, మన దేశంలో ఇప్పుడిప్పుడే అవి పెరగడానికి ఒకటే కారణం. మన areas of examination, పరిశీలించదలుచుకున్న విషయములలో మార్పు వచ్చింది. అలా ఉండకూడదు. ఆ పిల్లకి మూడు తరాల వెనక ఆ కుటుంబం ఏమిటి, ఈ పిల్లవాడికి మూడు తరాల వెనక ఆ కుటుంబం ఏమిటి? జబ్బులు ఉన్నాయా? అవి కూడా

చూస్తారు. కొన్ని కొన్ని జబ్బులు ఆస్తుల వలే మనకి తరతరాలు వచ్చేస్తాయి. ఉబ్బసం, హృద్రోగం, రక్తపోటు, మధుమేహం ఇవన్నీ, ఆస్తులు ఇవ్వక పోయినా, ఈ ఆస్తులు వచ్చేస్తాయి. ఇలాంటివి ఉన్నాయని తెలుసుకుని, అయినప్పటికీ సిద్ధపడి ఇస్తే సరే, లేదా ఇవ్వక్కర్లేదు. ఎంచేత, అవి ఆ రక్తంలోంచి అన్నీ దిగి వస్తుంటాయి. తర్వాత, ఆ కుటుంబంలో పూర్వంలో ఎవరెవరు సంఘానికి ఎటువంటి మేలు చేసారు? పొట్టకోసమే బతికారా? లేకపోతే, సంఘానికి ఏమయినా చేసారా? ఊరికి ఏమయినా ఉపకారం చేసారా? ఏం ఉపకారం చెయ్యలేదు, ఊరంతా దోచుకున్నారట అంటే, అది ఉండదు. ఏం చూడాలి, ఏం చూడకూడదు అనేటటువంటిది మన గ్రంథాల్లో చాలా సులభంగా ఇచ్చారు.

ఇక్కడ చూడండి, ప్రాణాలు ఉండవు, అల్పాయిష్కుడు అన్నా చేసుకున్నాడండి. నా జీవితంలో రెండు సందర్భాలు ఉన్నాయి. పిల్లకి అద్భుతమైన ఐదోతనం ఉంది. పిల్లవాడు అల్పాయిష్కుడు. చాలా విద్యావంతుడు. అతని తండ్రి కూడా మరణించాడు ముప్పైయేళ్ళకే. ఇతడు కూడా జాతకం చూస్తే పెద్ద ఆయుర్దాయం ఉన్నట్టుగా లేదు. పిల్ల చూడబోతే అద్భుతమైనటువంటి, అంటే ఆమె వల్ల భర్త తప్పకుండా బతికేటటువంటి సందర్భం. ఆ పిల్లకి సంబంధాలు రావడం లేదు అని తల్లితండ్రులు గొడవ చేసి ఇది పట్టుకొస్తే, చూసి ఈ సంబంధం చెయ్యండని చెప్పాను. ఇప్పుడా పిల్లవాడికి అరవైయేళ్ళు వచ్చినాయి. పోలే, బానే ఉన్నాడు. అది ఎంత మంచి విషయం? అలాగే, ఇంకో సంబంధం. ఆ సంబంధంలో పిల్ల ఫోటో చూపించారు. పిల్లవాడి ఫోటో చూపించారు. జాతకం చూసాను. చూస్తే, ఆ పిల్లకి ఇక్కడ సుడి ఉంది, మామూలుగా ఇక్కడ ఉంటుంది కదా సుడి? ముఖం ముందు సుడి. సాముద్రిక శాస్త్రం ఏం చెప్తుంది తెలుసా, ఈ పిల్ల పెళ్లి చేసుకుంటే, ఆ పెళ్లికొడుకు ఐదేళ్ళ లోపు పోతాడు. నేను పెళ్లికొడుకుకి చెప్పాను, ఏమని నువ్వు పోతావని చెప్పలేదు, ఈ సంబంధం వద్దమ్మా అని చెప్పాను. ఇది వద్దు, ఇది చేసుకోక. కానీ తమాషా, నేను చేసుకుంటా నన్నాడు. రాకరాక నాకంటూ ఒక సంబంధం వస్తే, నువ్వు అది... సరైన సంబంధాలు రావడం లేదు, రాకరాక ఇది వచ్చింది. కానీ సంబంధం చేసుకుంటే నీకు ఆయిష్షు ఇబ్బంది. చేసుకుంటా నన్నాడు, చేసుకున్నాడు, పోయాడు. అంటే, ఇవన్నీ లేవనుకోబోకండి, శాస్త్రం తెలుసుకోవడం వల్ల మనకీ పరిజ్ఞానం ఒకటి పెరుగుతుంది. మామూలుగా తెలియని విషయాలు, ఈ శాస్త్రం ద్వారా కొంచెం మనకి focus ఎక్కువ అవుతుంది. తద్వారా తెలుస్తాయి.

ఈమెకి చూడండి, అల్పాయిష్కుడైతే అయ్యాడు, సద్గుణవంతుడు కదా అంది. దానికి నారద మహర్షి ఏమన్నాడు? ఈమె పుణ్యాలరాశి, కాబట్టీ చూద్దాం. మరి మనసు పడ్డది, ఇంకొకడిని చేసుకోనంటోంది కదా! ఇలాంటి dimensions మనకి ఈ కథలో కనిపిస్తూ ఉంటాయి.

"ఆ హితోపదేశం అయిన తర్వాత, దాన్ని అంగీకరించి అశ్వపతి, మునిసత్తమా నీవు మాకు పరమాచార్యుడవు. భవది ఆజ్ఞ తప్పక శిరసా వహించెదను అని విన్నవించాడు. నారద మౌని ఆపై వారువురినీ ఆశీర్వదించి, ఆశీస్సులు అనుగ్రహించి, వీడ్కొని, అంతర్హితుడై అమరలోకం వైపు తరలి వెళ్ళాడు. అశ్వపతి అటు పిమ్మట ఒక పుణ్య దినాన ప్రాతర్ వేళ బంధువులతో, మంత్రులతో, వృద్ధులతో, కుమార్తె

సావిత్రితో, వైవాహిక మంగళ ద్రవ్యాలతో ప్రయాణమై, అరణ్య మధ్యంలో నివసిస్తున్న ద్యుమత్సేనుని ప్రశాంతాశ్రమాన్ని ప్రవేశించాడు".

వెళ్ళిపోయాడు, శుభస్య శీఘ్రం అని. పెళ్లి చెయ్యడానికే వెళ్ళిపోయా డాయాన. పెళ్ళికి కావలసిన సామానంతా తీసుకుని వెళ్ళిపోయాడు. బంధువులు, మిత్రులు, మంత్రులు, అందరినీ పట్టుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతే, అక్కడ వాళ్ళ పరిస్థితి ఏమిటి? వాళ్ళకి వీళ్ళు వస్తారని కూడా తెలీదు కదా! అంచేత, వాళ్ళకి గౌరవంగా ఎదురుగా వెళ్లి, అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, కుశలప్రశ్నలు వేసుకున్న తర్వాత అశ్వపతి చెప్తాడు, ఎవరికి ద్యుమత్సేనుడికి. ద్యుమత్సేనుడంటే గుర్తుపెట్టుకోండి, ఒకప్పుడు వైభవంలో, దివ్య వైభవం, దివ్యమైన స్వభావం కలిగినటువంటి వాడు. తనకి తానుగా శత్రువులని సృష్టించుకోవడం చేత, తనకుండే దివ్య వైభవం అంతా పోయి, కన్నులు కూడా పోయి, ఒక దురదృష్టకరమైన పరిస్థితుల్లోకి వచ్చినటువంటి వాడు. రాజ్యం లేదు, కన్నులు లేవు, కొడుకు మీద ఆధారం. అలాంటి వాడి దగ్గరకు ఒక మహారాజు వచ్చాడండి. వచ్చి, మహారాజా అని సంభోదించాడు. రాజ్యం లేదు కదండి, మహారాజా అంటే? అంటే, జీవలక్షణం ప్రకారం అతను మహారాజే. కానీ, పోయినాయి అన్నీ. పోవడానికి కారణం తను సృష్టించుకున్న శత్రువులు. అంచేత, ఇప్పుడు ఈ విధంగా ఉన్నప్పటికీ, మహారాజా అని సంభోదించాడు. "ఈ కన్య నా కుమార్తె. మా వంశంలో ప్రాదుర్భవించిన మౌక్తికమణి" అన్నాడు. ప్రాదుర్భావం వేరు, పుట్టడం వేరు. ఉద్భవించడం అంటే అంతకుముందు ఉన్నది ఇప్పుడు కనిపించనది అని అర్థం. సంభూత... సమ్యక్ భూతా అంటే అంతకు ముందు ఉన్నది, ఇప్పుడు కనిపించింది. ఈవిడ ఎవరూ? సావిత్రిదేవి. అంటే, సూర్యమండలానికి అధిదేవత అయినటువంటి తత్వమేదయితే ఉందో, ఆ తత్త్వం పుణికి పుచ్చుకుని కన్యారూపం ధరించి, తన ఇంట్లో పుట్టుకొచ్చింది. అంటే, అనన్య సామాన్యమైనటువంటి ప్రజ్ఞావంతురా లావిడ. అందుకని, నాకు పుట్టిందని అనబోక, మా ఇంట్లో వెలిసిందని చెప్పాడు. మా ఇంట్లో వెలసినటువంటి ఒక చక్కటి మణి అని చెప్పి తెలియపరిచాడు. మౌక్తిక మణి. "కరుణించి నా పలుకు లాదరించి ఈమెని కోడలుగా స్వీకరించవలసినది. సావిత్రి, సత్యవంతులు ఉభయులూ వయస్సు, సౌందర్య సుగుణాలలో, సద్గుణాలలో, ఒండొరులకు ఎంతో అనురూపులు గనుక వీరి వివాహం సర్వదా మనకి అభిలషనీయము" అని పలికాడండి. పలికితే, ఆయన ఆశ్చర్యపోతాడు. ఎంచేత? అతడు రాజ్యం కలిగినటువంటి రాజు, ఇతడు రాజ్యం కోల్పోయినటువంటి రాజు. "ద్యుమత్సేనుడా ప్రార్థన ఆకర్ణించి, ఒకింత ఆశ్చర్యపడి, మద్రేశ్వరా, రాజ్యం పోగొట్టుకుని, ఘోరారణ్య మధ్యంలో నెలవేర్పరుచుకుని, నిరంతర తపస్చర్యతో కాలం వెళ్ళబుచ్చుకుంటున్న మాతో బాటు ఇడుముల ననుభవించుటకా ఈ సుకుమారిని?"... ఈ విధంగా అందిస్తున్నావు అని చెప్పి అన్నాడు. మాతో పాటు ఈ కష్టాలన్నీ పడగలదా అని అడిగాడు. తన ఉండేది అంతవరకూ రాజప్రాసాదంలో, ఆ తర్వాత ఇప్పుడు అరణ్యంలో ఉండాలి కదా! అంటే, అరణ్యం, రాజప్రాసాదం అనేటటువంటిది దేహాత్మ భావం ఉండేవాళ్ళకి చాలా వ్యత్యాసంగా ఉంటుంది. జీవాత్మ భావం ఉండేవారికి ఆ వ్యత్యాసం ఉండదు.

రాముడు అరణ్యవాసానికి బయలుదేరి వెళ్ళిన రోజున లక్ష్మణుడు చాలా బాధపడతాడు, ఇప్పుడు ఎలా పడుకుంటాడు రాముడు అని. రాజప్రాసాదంలో రాజకుమారుడు ఎలాంటి మెత్తని పరుపుల మీద పడుకుంటారండీ? హంసతూలికా తల్పాలు అంటూ ఉంటాయి కదా! అంటే, తల్పం, గిల్పం మనం చూసాము కదా! అలాంటి వాటన్నటి

మీద పడుకునే వాళ్ళకి, ఇప్పుడు ఎలా పడుకుంటాడని లక్ష్మణుడికి ప్రశ్న వచ్చి గుహుడితో మాట్లాడుతూ ఉంటాడు, మనం ఏ విధంగా పడక ఏర్పాటు చెయ్యాలి రాముడికి అని. ఎలాంటివాడు రాముడు? అతి సుకుమారి కదా! ఇలా మాట్లాడుతుంటే ఆయన అక్కడ ఉండి ఆకుల మీద నిద్ర పోయాడటండి. అది రాముడు! వీళ్ళు ఇంకా discussion లో ఉన్నారు, ఆయన ఆక్కడ హాయిగా నిద్రపోయాడు. అంటే ఏమిటి? అతడికి దేహాత్మ భావం అంత లేదు. అంతేమిటి, అసలు లేదు. హంస తూలికా తల్పం మీద ఎలా పడుకున్నాడో, అంత బాగానూ ఆకుల మీద పడుకున్నాడండి. అంటే, నీ ప్రజ్ఞ అంత ఉత్తమోత్తమమైనటువంటి స్థితిలో స్థిరపడి ఉన్నప్పుడు నీకు ఐహికమైన భోగములయందు ఉన్నా, లేకపోయినా ఒకే విధంగా ఉంటావు. ఉంటే కాదనడు, లేకపోతే బాధపడడు. అంచేత, ఇక్కడ కాబోయే మావగారు అడుగుతున్నారు, మీ అమ్మాయి అంత సుకుమారి కదా, రాజకుమారి కదా, రాజప్రాసాదంలో పెరిగింది కదా, ఇప్పుడెలా ఇక్కడ పడుకుంటుంది అని. అసలు పడుకోడానికి సిద్ధపడే కదా వచ్చింది. తన వరించిన వరుడు అరణ్యంలో ఉన్నాడంటే, అక్కడ ఏమయినా palace ఉంటుందా? సౌకర్యాలు అన్నీ ఉంటాయా? ఉండవు కదా. అయినప్పటికీ, అవన్నీ తెలిసే వచ్చింది ఆవిడ.

ఇలాంటి సందర్భంలో మన్ని మనం ఓసారి చూసుకోవాలి. మరి అట్లా రైల్వే ప్లాట్ఫారం మీద పడుకోవాలిసి వచ్చిందనుకోండి, పడుకోగాలవా? ప్రయత్నం చేసి చూడాలి. మనం ఎంత దేహంలో ఇరుక్కుని ఉన్నాము, ఎంత దేహమందు స్వామిత్వం కలిగి ఉన్నాం అని తెలియాలంటే, అప్పుడప్పుడూ నేల మీద పడుకోవాలండి. నేను నేల మీద పడుకోలేనండి అంటే లొంగిపోయావని అర్థం దేహానికి. నేను ఆరుబయట పడుకోలేనండి అంటే లొంగిపోయావని అర్థం. అంటే, చన్నీళ్ళ స్నానం చెయ్యలేనండి... ఒకప్పుడు చేసిన వాళ్ళమే అందరూ కదా! ఈ కొత్త తరం వాళ్ళకి తెలియకపోవచ్చు గాని, పాత తరం వాళ్ళు అట్లా బావుల్లోంచి చేదలు వేసుకుని, నీళ్ళు తోడుకుని పోసుకున్న వాళ్ళమే కదా! ఓ చాప వేసుకుని పడుకోగాలవా? పడుకో గలగాలి. కబుర్లు చెప్పడం కాదు. అవసరమైతే చాప వేసుకుని పడుకోగలగాలండి. దిండు లేకపోతే, ఇదే దిండు. కొంచెం కండలుంటే బావుటుంది దిండు. కండలు లేకపోతే ఎదో బొమికి పెట్టుకున్నట్టు ఉంటుంది కదా! అలా ప్రజ్ఞకి హెచ్చు తగ్గులు కాకుండా ఉండాలంటే, దేహ సౌకర్యాలు అంతంతగా వాటికి మనం లొంగిపోకుండా ఉండ గలిగేటటువంటి సందేశం ఇటువంటి కథల్లో తెలుస్తుంది. అవసరమైతే నేల మీద పడుకోగలిగి ఉండాలి. రోడ్డు పక్కన ఉండే పంపు కింద స్నానం చెయ్యగలగి ఉండాలి. ఏ మరుగులోనో బయలు కాలకృత్యాలు తీర్చుకోగలిగి ఉండాలి. నిద్ర పోవడానికి అవకాశం లేకపోతే కూర్చుని నిద్ర పోగలిగి ఉండాలి. నిద్ర వస్తే నువ్వు ఎట్లా ఉన్నా వచ్చేస్తుంది తెలుసా? నువ్వు పడుకోలేదే, అందుకని నేను రాలేదు అనదు నిద్ర. నువ్వు కూర్చున్నా వచ్చేస్తుంది, నిల్చున్నా వచ్చేస్తుంది నిద్ర! వింటున్నా వచ్చేయ్యట్లేదు నిద్ర! నిద్రని ఎవరు ఆపగలరు? ఆపలేరు కదా! అంచేత, అది ఎలాగూ వచ్చేస్తుంది. నువ్వు దాని కోసం ఎంత ప్రయత్నం చేస్తే, అంత దూరంగా వెళ్ళిపోతుంటుంది అది.

అంచేత, ఆ ప్రశ్నలు వేసాడండి. అక్కడికి ఆపుదాము. ఎందుకంటే మనకి ఆరు గంటలయ్యింది. ఆ ప్రశ్నకి సమాధానం, ఆ తర్వాత... బావుంటుంది. అసలు విషయంలోకి ప్రవేశిస్తాము. రేపు సాయంత్రం లోపల ఈ సావిత్రి ఉపాఖ్యానంలో ఉండేటటువంటి సాధనాపరమైన రహస్యాలు మనం తప్పక తెలుసుకుందాం. ప్రస్తుతం ప్రార్థనలోకి ప్రవేశిద్దాం.

––– స్వస్తి

# సావిత్రోపాఖ్యానము

## July 22, 2013 ఉదయం – ప్రవచనం #5

శ్రీ విజయ నామ సంవత్సర ఆషాఢ శుద్ధ పౌర్ణిమ, గురుపూర్ణిమ సందర్భంగా, ఈ ప్రాతః సమయంలో ఇక్కడ ప్రార్థనలలో పాల్గొని సద్గురువుల అనుగ్రహం పొందడానికి శ్రద్ధాభక్తులతో ప్రయతిస్తున్నటువంటి సోదరబృందానికి నా హృదయ పూర్వకమైనటువంటి నమస్కారములు. పూర్ణిమా సందర్భంగా శుభాకాంక్షలు. ఈ పూర్ణిమ ప్రత్యేకత మనయందు పునర్ వసించడానికి సద్గురువు హృదయమునందు ప్రవేశించడం. ప్రతీ గురుపూర్ణిమ నాడు సద్గురువు మనయందు ప్రవేశించి, మన హృదయమునందు వికాసం కలిగించి, వెలుగు నింపుతాడు. అందుచేతనే, ఈ ఆషాఢ మాసం, లేక కర్కాటక రాశిలో మొదటి నాలుగు రోజులు పునర్వసు నక్షత్రం పరిపాలిస్తుంది. పునర్వసు నక్షత్రం నాలుగు రోజులు పరిపాలిస్తున్నపుడు, మనలో పునర్ వసించడానికి దైవము గురువు రూపంలో మనయందు ప్రవేశించడం జరుగుతుంది. అక్కడి నుంచి పదమూడు రోజుల పాటు పుష్యమి నక్షత్రం నడుస్తుండగా, గురువు మనయందు అద్భుతమైనటువంటి కాంతి ప్రవేశింప చేస్తాడు. అది ఈ గురుపూర్ణ నాటితో పూర్తి అవుతుంది. ఎందుకంటే, నాలుగు రోజుల పాటు పునర్వసు నడిచిన తర్వాత, పునర్వసు తర్వాత వచ్చేటటువంటి పుష్యమి నక్షత్రం కాంతికి సంబంధించినది. అద్భుతమైన కాంతి అది. అన్ని రకముల కాంతులు అందులో దర్శనం ఇస్తాయి. కాంతులకు మూలమైన తత్త్వం కూడా దర్శనం ఇస్తుంది. దానికి స్థానం హృదయము. కర్కాటక రాశి హృదయానికి సంబంధించినది. అంచేత, ఆషాఢ మాసం రాగానే, శుక్ర ప్రతిపత్తి నుంచి బాగా గురువుని ఆవాహనం చేసుకుంటూ ఉండాలి. అంతకుముందు జేష్ఠ మాసంలో మన చుట్టూ ఆవరించినటువంటి వాయువునందు ప్రవేశించి ఉంటాడు సద్గురువు. ఆషాఢమునందు హృదయమునకు దిగి వస్తాడు. ఇలాంటి రహస్యాలు తెలియడానికే జ్యోతిష్య శాస్త్రం.

అంచేత, ఆ విధంగా దిగి వచ్చేటటువంటి తత్త్వం, దైవమే గురువుగా దిగి రావడం అనేటటువంటిది ఆషాఢ మాసంలో జరుగుతుంది. అలా దిగి వచ్చినటువంటివాడు ఈ పూర్ణిమ తిథి అయ్యే లోపల, పుష్యమి నక్షత్రం పరిపాలిస్తుండగా, అంటే పాడ్యమి నుండి పౌర్ణిమ రాకాంతము వరకూ, అంటే మళ్ళీ కృష్ణ పాడ్యమి తిథి ప్రవేశించేంత వరకూ కూడా, ఈ పదహారు రోజుల్లో మనయందు చాలా కాంతి నింపుతాడు. ఆ కాంతి ఆధారం చేసుకుని, మనం ఎప్పుడూ చెప్పుకుంటున్నట్టుగా, మనము దైవము నుంచి దిగి వచ్చినవారము అనేటటువంటిది గుర్తు చేసేటటువంటి ప్రజ్ఞ కూడా హృదయము నందే "నేను ఇక్కడ ఉన్నాను" అని చెప్తూ ఉంటుంది. హృదయం అంటే "నేను ఇక్కడ ఉన్నాను" అని అర్థం. "నేను" అనేది దైవము పేరు. అదే పేరు మనం కూడా పెట్టుకున్నాం. మన నాన్నగారి పేరే మనకి పెట్టినట్టు. అంచేత, "నేను ఇక్కడ ఉన్నాను" అని చెప్పేది హృదయం. అక్కడ వినిపించే శబ్దం "సోహం" – అతడే నేను, నా తండ్రే నేనుగా దిగి వచ్చాను అనేది అర్థం చేసుకోవాలి. దైవమే జీవుడిగా దిగి వచ్చాడు అనేటటువంటిది అనునిత్యం అక్కడ ఒక శాశ్వతమైన గానంగా వినబడుతూ ఉంటుంది. దానితో అనుసంధానం చెందాలి. అలా

అనుసంధానం చెందింప చెయ్యడానికే సద్గురువు ప్రవేశం. అతడు ఇచ్చినటువంటి వెలుగు ఆధారంగా దైవంతో మనం అనుసంధానం చెందడానికి ఒక పునర్ దీక్ష వహించాలి, మళ్ళీ పునర్ అంకితం అవ్వాలి.

లేకపోతే ఏం జరుతుందంటే, మనం విడిపోతాం. మనం మనంగా ఉండిపోతాము. దైవమే నేను అనేటటువంటి భావంలో జీవించేవాడికి, ఆ దైవమే నేను అనేటటువంటి అనుసంధానం లేనప్పుడు, తానుగా మిగిలిపోతాడు. అప్పుడు అతనియందు అహంకారం పెరుగుతూ ఉంటుంది. అంటే, నేను, నేను, నేను, నేనని... నేను ఇది చేసాను, నేను అది చేసాను, నా వల్ల ఇది అయ్యింది, నా వల్ల అది అయ్యింది, నేను లేకపోతే వీళ్ళంతా ఏమయిపోతారు, నేను పోషించకపోతే ఎలా నడుస్తుంది నా కుటుంబం... ఇలాంటివన్నీ వచ్చేస్తాయి. నువ్వేంటి అసలు? నువ్వు అతని నుండి దిగి వచ్చినటువంటి వాడివి. అతని వల్ల నీ సమస్త జీవన ప్రయోజనం నెరవేరుతుంది అని తెలియ చెయ్యడానికి సద్గురువు ప్రవేశిస్తాడు.

అంచేత, ఈ చిన్న "నేను", పెద్ద "నేను" తో అనుసంధానం చెందడానికి ఈ ఆషాఢ మాసంలో గురుప్రజ్ఞ ప్రవేశించి మనకి అనుసంధానం కలిపిస్తుంది. జీవుడికి దేవుడితో పెళ్లి చేస్తాడు సద్గురువు. జీవుడు పెళ్లికూతురు లాంటివాడు. దేవుడు పెళ్లికొడుకు లాంటివాడు. అంచేత, అలా దిగి వచ్చి, పెళ్లి చేసి దేవుడితో జీవుడికి, తాను పక్కన సాక్షీభూతంగా ఉంటాడు. సద్గురువు అడ్డంగా ఉండడు. పెళ్లి చేసేంత వరకే పూజారి కదా! పెళ్లి చేసిన తర్వాత, పెళ్లికూతురికి పెళ్లికొడుకుకి మధ్య పూజారి ఉండడు కదా! ఉంటాడా? సద్గురువు యొక్క ప్రధాన కర్తవ్యం ఏమిటంటే, జీవుని దేవునితో అనుసంధానం చేసి, అతడు శాశ్వతంగా దేవునితో కలిసి ఉంటేటటువంటి విధానం అతనికి నేర్పి, అటుపైన ఈ శిష్యుడు ఆ గురువుతో, ఈ జీవుడు దైవంతో ఏ విధంగా అనుసంధానం చెంది ఉంటున్నాడో చూస్తూ, బాగా అనుసంధానం చెందేంత వరకూ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు. అలాగే, వివాహంలో కూడా పురోహితుడు చాలా రకాలుగా వారిద్దరి మధ్యా అనుసంధానం కలిపి, తాను తప్పుకుంటాడు. అంచేత, అదే విధంగా జీవునికి దైవానికి అనుబంధం ఏర్పరిచేవాడు సద్గురువు.

అలాంటి అనుబంధం లేనప్పుడు జీవుడు స్థానికం అయిపోతాడు. అంటే, తాను ఒక విశ్వాత్మ చైతన్యంలోంచి వ్యక్తమైనటువంటి ఒక అల, ఒక తరంగం అని తనని తాను మర్చిపోతాడు. ఇలా మర్చిపోయిన వాడికి అతడి నిజస్వరూపాన్ని అతనికి గుర్తు చెయ్యడమే గురువు పని. అందుచేతనే గురువంటే గుర్తు చేసేవాడని. ఏమని గుర్తు చేస్తాడు? "అదే నీవు" అని గుర్తు చేస్తాడు. అది ఎలాగో చెప్తాడు, వివరిస్తాడు, జీవుని యొక్క స్వరూప స్వభావాలు తెలుపుతాడు, దైవము యొక్క స్వరూప స్వభావాలు తెలుపుతాడు. తెలిపి, అతడే నీవుగా ఏర్పడి ఉన్నావు. ప్రతి నిత్యం నీవు అక్కడి నుంచే మేల్కొంచి, "నేను ఉన్నాను" అనుకుంటున్నావు. ప్రతిసారీ ఒక అల సముద్రం నుంచి వచ్చినప్పుడు ప్రత్యేకంగా కనిపించినా అది సముద్రంలో భాగమే, సముద్రమే కూడా! సముద్రం కాక అల లేదు. కాకపోతే సముద్రానికి, అలకి స్థితి భేధం ఉన్నది. ఇది ఎగిరి పడుతూ ఉంటుంది, అది ఎగిరి పడదు కదా! అది ఎగిరి పడితే

మనకి కష్టం. అందుకని, అల సముద్రంలో భాగమే కదా! అలాగే జీవుడు దైవములోంచి వ్యక్తమైనటువంటి వాడే. అదే నేను, మీరూ, అందరూ అదే! నేనొక్కడినే అనుకోకూడదు.

కాస్త దైవభక్తి అనేటటువంటిది ఏర్పడుతూ ఉంటే, నేను చాలా మంచివాడి ననిపిస్తుంది ప్రతివాడికీ. నేను మంచివాడనుకోవడంలో, పక్కవాడు కాదు అనేది ఇమిడి ఉంటుంది. నేను భక్తుడు, మావాడు కాదు అన్నట్టుగా ఉంటాడు ప్రతీవాడూనూ కదా! కాదు కదా! అందరూ బంగారమే! ఒకడు ఉంగరం అయ్యాడు, ఇంకోడు గొలుసయ్యాడు, ఇంకోడు నెక్లెస్ అయ్యాడు, మరొకడు వడ్డాణం అయ్యాడు. ఏదయినప్పటికీ అన్నీ బంగారమే కదా! అలా అందరు జీవులు ఒకే ఒక దైవము యొక్క, తత్వము యొక్క వ్యక్త స్వరూపములు. అది మాటిమాటికి గుర్తు చేస్తాడు. తన జీవితంలో తను నిర్వర్తించి చూపిస్తూ ఉంటాడు ఉదాహరణగా. అందరియందు ఒకే సమభావం ఉంటుంది, సమదర్శనం ఉంటుంది. తర్వాత, స్వభావమునందు దైవీ స్వభావం ఎక్కువగా గోచరిస్తుంది. సద్గురువుకి, శిష్యునికి ఏమిటి తేడా అంటే, శిష్యుని స్వభావంలో పశు స్వభావం ఉంటుంది, మానవ స్వభావం ఉంటుంది. పశు స్వభావం అంటే, రాగద్వేషములు, కామక్రోధములు, లోభమోహములు, మదమాత్సర్యములు, అన్నీ పశువులప్పటి నుంచీ ఉంటాయి అవి. అంటే, కొత్తగా నేర్చుకోవక్కర్లేదు మనం. మన దగ్గర ఉంటాయి స్వభావంలో.

ఆషాఢ మాసం యొక్క ప్రత్యేకత ఏమిటంటే, జీవుడు సహజంగా దేవుని యొక్క అంశే కాబట్టి అతడు వెలుగు స్వరూపుడే, స్వయం ప్రకాశకుడే. అతడు బంగారమే. ఆత్మస్వరూపుడు, దివ్యస్వరూపుడు. అతనితో ఇబ్బంది లేదు. అతడు, తాను వేరుగా ఉన్నాననే భావం చేత ఏర్పరుచుకున్న స్వభావం ఉంటుందే, ఈ స్వభావంలో చాలా రకరకాల మార్పులు ఉంటాయి. మనమందరమూ ఒకరితో ఒకరు ఏ విధంగా వైవిధ్యంగా ఉన్నామంటే, స్వభావము చేత వైవిధ్యము తప్ప, జీవులుగా వైవిధ్యమేమి లేదు. జీవులుగా సోదరులమే. ఎక్కడ మనం సోదరులం? Brotherhood, brotherhood అంటారు. ఎక్కడ brotherhood అంటే, as souls we are all brothers. రాజయినా, పేదయినా, అందరూ అదే. స్వభావం చేత ఒకడు రాజయ్యాడు, స్వభావం చేత ఒకడు బంటు అయ్యాడు, స్వభావం చేత ఒకడు అధికారి అయ్యాడు, స్వభావం చేత ఇంకోడు దొంగ అయ్యాడు. ఇట్లా స్వభావం చేత ఒకడు మోసగాడు అవుతాడు, స్వభావం చేత మరియొకడు ధర్మాత్ముడు అవుతాడు. అది ఎక్కడ తేడా ఉందంటే స్వభావంలో తేడా. అంటే మన స్వభావము మన నుంచి ఏర్పడుతుంది. అది మన ఆవాసం, అందులోనే బతుకుతూ ఉంటాం మనం, ఆ స్వభావంలో. అందుకనే ఒక పరిస్థితిలో ఒక్కొక్కళ్ళు ఒకొక్క రకంగా ఉంటూ ఉంటారు, వాడి స్వభావం చేత.

ఈ రోజు గురుపూర్ణిమ అంటే ప్రత్యేకమైన ఉత్సాహంతో మూడు గంటలకే స్నానం చేసేవాళ్ళ దగ్గర నుంచి, ఇంకా నిద్రపోతున్న వాళ్ళ వరకూ ఉంటారు కదా! ఏమిటి తేడా? స్వభావంలో తేడా. స్వభావంలో తమస్సు ఎక్కువగా ఉంటే బద్ధకం చాలా ఉంటుంది. స్వభావంలో రజస్సు ఎక్కువగా ఉంటే, అయిన వాటికి, కాని వాటికి, అన్నిటిలోనూ చేతులూ, కాళ్ళూ దూర్చేసి, ఇబ్బంది పడుతూ ఉంటారు. మనకి కాని విషయాల్లో దూరడానికి కారణం రజోగుణ స్వభావం. రావణాసురుడు, ఆయనకు అక్కర్లేనిది లేదుగా! ఓ పాత్రని మనకి ఇచ్చారు రామాయణంలో.

రావణాసురుడికి తనది కానిది ఏమీ లేదు, ప్రతీదీ కావాలి. ఇంకొకడున్నాడు. ఎవరూ? కుంభకర్ణుడు. ఏమీ అక్కర్లేదు. అన్నిటికీ నిద్ర, తినడం, పడుకోవడం, తినడం, పడుకోవడం, తినడం పడుకోవడం. ఇదో స్వభావం. విభీషణుడు ఈ రెండిటికి మధ్యస్థంగా ఉన్నాడు, కొంత సత్వగుణం. సుగ్రీవుడి స్వభావం చూడండి. వాలి స్వభావం చూడండి. అలాగే భారతంలో ఎన్నో పాత్రలు ఉన్నాయి. వీరందరూ ఒకరితో ఒకరు ఎక్కడ వైవిధ్యం? మన కథల్లో గానీ, మన జీవిత కథల్లో గానీ, మన స్వభావమునందు ఉండేటటువంటి వైవిధ్యం. అందులో పశు స్వభావం ఉంటుంది, క్రూరమైనటువంటి స్వభావాలు కూడా ఉంటాయి. అలా ఉండగా, తమస్సుతో ఉండేటటువంటివి ఉంటాయి, రజస్సుతో ఉండేటటువంటివి ఉంటాయి. వీటన్నటినీ చక్కదిద్దడానికి సద్గురువు వస్తాడు. సద్గురువు ఇచ్చేటువంటి వెలుగులో ఏమిటి మనకు మార్పు జరగాలంటే, స్వభావమునందు మార్పు జరగాలి. అంటే, పులి లాంటి స్వభావం గోవులాగా మారాలి. అలా మారాలి. ఒక vulture, రాబందు లాంటి స్వభావం, మంచి గరుత్మంతుడి లాగా మారాలి. ఒక ఆవు కామధేనువు అవ్వాలి. ఒక ఎద్దు నందీశ్వరుడు అవ్వాలి. ఒక పాము వాసుకో, ఆదిశేషో అవ్వాలి. ఇట్లా మన స్వభావములను ఉద్ధరించి, మన నిజస్వరూపం మనకి ఆవిష్కరింప చేసి, మన జీవన ప్రయోజనమునందు మనని ప్రవేశింప చేసి, మనం కృతకృత్యులమై, శాశ్వతమైనటువంటి కథలో దైవముతో పాటుగా పని చేసేంతటి వరకూ కూడా సద్గురువు మనకు ఉండి నడిపిస్తాడు.

ఎందుకు చేరారో శిష్యులకి తెలియదు, ఏం చేస్తున్నారో గురువులకి తెలియదు. దేవుళ్ళు... తత్త్వం ఎవరూ చెప్పరు. వారి వారి బొమ్మలు పెంచుకోవడమే సరిపోతుంది! శిష్యులకి కూడా ఆ బొమ్మలు చేతిలో పెట్టుకుని తిరగడమే తప్ప తత్త్వం ఏం తెలుసు? "తత్వమేమెరెగు తానెరుగు" అంటాడు అన్నమాచార్య. నిన్ను నువ్వు తెలుసుకోవడం, దైవాన్ని తెలుసుకోవడం. ఈ తెలియడంలోనే నీకు సమస్తమైన విజ్ఞానం ఏర్పడి, నీ జీవన కర్తవ్యం నీకు తెలుస్తుంది. లేకపోతే, ఈ స్వభావంలో ఈ మార్పు మనకి రాకపోతే, మనం ఎంత కాలం ఉంటే ఏం లాభం? "ఏడాది ఉతికినా..." అంటే, ఒక జన్మంతా... ఇప్పుడు ముప్పై ఏళ్ళగా, నలభై ఏళ్లగా మనం జీవిస్తున్నప్పటికీ, అదే స్వభావం మనం ప్రకటిస్తున్నప్పుడు, మార్పు ఏం వచ్చినట్టు? వచ్చిందా? అంచేత, మనలో ఒకడే ఒకప్పుడు సద్గురువు కూడా. తనని తాను చక్కగా మలుచుకున్నాడు. మలుచుకోవడం చేత, అతనియందు దైవీ స్వభావం అవతరించింది. అది కారణంగా వందాలాది, వేలాది, లక్షాలాది మందికి అతను సహాయకారి అయ్యి, దైవము పని తనవంతు తాను చేస్తూ ఉంటాడు సద్గురువు.

అలాంటి సద్గురువు ప్రవేశించకపోతే మనకేం జరుగుతుందంటే, పుష్యమి నక్షత్రం అంటే, ఈ పౌర్ణిమ అవ్వంగానే మనకొచ్చేది, సూర్యుడు సంచరించే నక్షత్రం, ఆశ్లేష నక్షత్రం. ఆశ్లేష పాము కదా! మనకు రామాయణంలో లక్ష్మణుడు లాంటి వాడు. లక్ష్మణుడు రాముడితో కూడి ఉండకపోతే లక్ష్మణుడు వల్ల చాలా ఇబ్బంది ఉండేది అయోధ్యలో. నానా భీభత్సం సృష్టించే వాడు. అహంకారం ఉంటుంది, త్వరగా పొరపడతాడు కదా! వనవాసం చేస్తూ ఉంటే, భరతుడు వస్తుంటే, ఇక్కడ కూడా మనని బతక్కుండా ఉండడానికి సైన్యాలు తీసుకు వస్తున్నాడంటాడు లక్ష్మణుడు. అంటాడా? అంటే, రాముడంటాడు, నీకు అవగాహన లేదురా భరతుడంటే, మనని రాజ్యానికి కొని

పోవడానికి వస్తున్నాడు తప్ప, మన్ని ఎదో ఇబ్బంది పెట్టడానికి రావడం లేదు అని చెప్తాడు. ఎందుకని? రాముడియందు ఆ దైవీ స్వభావం ఉంది. దైవమే కదా! భరతునియందు దైవీ స్వభావం, లక్ష్మణునియందు అహంకార భావము. కానీ, దైవముతో కూడి ఉన్నది కాబట్టి అది దివ్యమైనటువంటి కాంతితో విరాజిల్లింది.

అంచేత, మనమంతా కూడా విడిగా ఉన్న వాళ్ళమే కదా! దేవుడు మన్ని నడిపిస్తున్నాడని మనకి తెలియదు కదా! మనమే లేచాం అనుకుంటాం. ఎప్పుడయినా అవసరమైనప్పుడు మెలుకువ రాకపోతే, ఏమిటో మెలుకువ రాలేదు... అదేంటి? నువ్వేగా లేచేవాడివి, ఎందుకు లేవ లేక పోయావు నిద్ర? చెప్పానుగా, నిద్ర మన చేతుల్లో లేదని. నిద్ర పోవడం, నిద్ర లేవడం నీ చేతుల్లో లేదు. ప్రాణ స్పందన నీ చేతుల్లో లేదు. నీకు తెలివి రావడం, నీకు తెలివి పోవడం నీ చేతుల్లో లేదు. ఏం నీ చేతుల్లో ఉందని అంత అహంకార పడుతున్నావు? కళ్ళు కనిపించక పోవచ్చు. కథలో ఒకాయనకి అయ్యింది కదా! మాట పలక్క పోవచ్చు కదా! ఈ రోజు నుంచి మీరు మాట్లాడడానికి వీలు లేదండి, అన్నీ అరిగిపోయాయి లోపల అని చెప్తారు. చాలా మాట్లాడేసారు, vocal chords అరిగిపోయినాయి, ఇంక మీరు మాట్లాడడానికి ఏం లేదు అంటే, శుభం అనుకోవాలి. ఎందుకంటే, ఇంక మనని మాట్లాడొద్దని అంటున్నాడు దేవుడు అనుకోవాలి అంతే. అలా అనుకోం కదా! ఏడుస్తూ ఉంటాం. ఏమిటోనండి మాట్లాడ లేకపోతున్నానండి, వినబడ్డం లేదండి అని బాధ పడతాడు. ఎంత సంతోషించాలో వినబడకపోతే తెలుసా? ఏం వింటున్నావు? జీవితం అంతా సద్వాక్యములు, సుభాషితములు విన్నవాడు, వినబడడం లేదని బాధపడ్డా అర్థం ఉంది. పిచ్చి పిచ్చి మాటలన్నీ వినడానికి ఎందుకండీ వినడం?

అంచేత, లక్ష్మణుడు ఆశ్లేష. అక్కడి నుంచి రాశి మారుతుంది. సింహ రాశి. మఖ నక్షత్రంతో మొదలవుతుంది. మఖ, పూర్వ ఫల్గుణి, ఉత్తర ఫల్గుణిలో ఒక పాదం. అందుకని, ఈ రాశిలో అహంకారం చాలా ఏర్పడే అవకాశం ఉంది. సింహ రాశి వారు ఎంతో సాధన చేస్తే తప్ప వారి అహంకారాన్ని వారు దమించలేరు. అలాంటి భావం ఉంటుంది. ఎంత వినయం నటిస్తున్నా, లోపల విపరీతమైన అహంకారం. ఆ అహంకారంలో పడిపోకుండా సింహ రాశికి ముందు, ఈ ఆషాఢ మాసంలో గురువుగారిని పట్టుకోవాలి మనం. సింహ రాశికి వెళ్లేసరికి అహంకారం పెరిగే అవకాశం వచ్చేసింది. ఎందుకంటే, ఆశ్లేషలోనే మొదలవుతుంది. పాము నోట్లో పడట్టే. ఇప్పుడు చూడండి వైకుంఠపాళిలో అలా వెళ్లి, అరుకాసుడని ఉంటాడు ఒకడు, వాడి నోట్లో పడితే, మళ్ళీ మూడు అంకెలోకి వచ్చేస్తాం. అక్కడ మళ్ళీ రెండు వేసుకుని ఇంకా కిందకి వెళ్ళిపోతాం. అట్లా అహంకారంలో పడ్డవాడల్లా, వైకుంఠపాళిలో పాము నోట్లో పడ్డవాడి కిందే లెక్క.

అంచేత, ఈ రాబోయే సంవత్సరంలో, ఈ మిగతా రోజుల్లో, అంతకంతకీ నీ స్వభావంలో నువ్వు ఇరుక్కుపోతూ ఉంటావు. ప్రతివాడు వాడి స్వభావంలో ఇట్లా ఇరుక్కుపోతూ ఉంటాడండి. ఎంతవరకూ ఇరుక్కు పోతాడంటే, మూలా నక్షత్రం వరకూ బాగా అట్లా మూలకి నెట్టేస్తారు, తొక్కేస్తారు. అది మూల అంటే. అంచేత, మళ్ళీ మూలా నక్షత్రం దాటిన తర్వాత సూర్యుడు అక్కడ నుంచి తిరుగుదారి. ఇది సంవత్సరం కథ. సూర్యుడిని కూడా సత్యవంతుడంటారు.

అది కూడా చెప్తాను. ఇవాళ్ళ ఎలాగయినా కొన్ని చెప్పుకోవాలి కదా సావిత్రికి సంబంధించినవి. ఇలా మనకి స్వభావంలో మనుషులు... మనమంతా ఎలా వైవిధ్యంగా ఉన్నామంటే, స్వభావం చేత, అసూయ చేత. అహంకారానికి మొదటి తమ్ముడె వరయ్యా అంటే అసూయ. ప్రతివాడూ దాని చేతనే పాడయిపోతాడు.

అహంకారం ఉన్నచోట అసూయ. అంటే, వాడికి అందరి మీద అభిప్రాయాలు ఉంటాయి. Pride ఉన్నచోట prejudice. Opiniated, వీడలాంటి వాడు, వాడలాంటి వాడు, వీడది, వాడది... అంటే, నీకు ఏం తెలుసు వాడి గురించి? ప్రతివాడి గురించి నిర్ణయాలు చేసేస్తూ ఉంటాం, మంచీ చెడూ నిర్ణయాలు చేసేస్తూ ఉంటాం. ఏదీ నీ గుడ్డి కన్నుతో. గుడ్డి కన్నేగా! తెలిసిన వాడసలు మాట్లాడనే మాట్లాడడు.

అంచేత, ఇప్పుడు సావిత్రి కథ మనం తీసుకుంటే, అందులో మనకి మొట్టమొదట మనకొచ్చే పాత్ర అశ్వపతి. అతడు మహానుభావుడు. దైవీ స్వభావము కలిగినటువంటి వాడు. ఏంచేత? తన ప్రాణములయందు తాను స్వామిత్వము సంపాదించి, తాను ఆనందమయ లోకంలో జీవిస్తూ, అంతటితో తృప్తిపడక, జీవన ప్రయోజనం కోసం ప్రయత్నం చేసాడు ఆయన కదా! అంటే, జీవన ప్రయోజనం ఎప్పుడు తెలుస్తుంది నీకు? అంటే, ఇట్లా తినడం, తిరగడం, నిద్ర పోవడం, అవీ ఇవీ సంపాదించుకోవడం, పోగేసుకోవడం, అందులో మోసాలు చెయ్యడం, ఇదేనా జీవితం? అందుకే పుట్టావా? "పొట్టకూటికే పుట్టితిమని సరిపెట్టి నిద్ర పోకండి, పుట్టినందుకు లంగరి ??? పురుషార్థము సుమండి" అని పాటుంది. అంటే, దేని వల్ల నీ జీవన ప్రయోజనం నీకు అందుతుందంటే, నీకు ఆ తపన ఉండాలి ముందు, అసలు నేను ఎందుకు పుట్టాను అని తెలుసుకోవడానికి. నేను ఎందుకు పుట్టాను? ఇప్పుడు అందరూ ఇదే పని చేస్తున్నారు కదండీ? అందరూ నిద్ర లేస్తారు, అందరూ స్నానాదికాలు చేస్తే చేస్తారు, ఇంత నోటిలో వేసుకుంటారు. ఇంక వాటికోసం, వీటికోసం, సాయంత్రం వరకూ తిరుగుతారు. ఈ మధ్యలో అలసట వస్తే పడుకుని నిద్ర పోతారు. మళ్ళీ లేచి అదే పని చేస్తారు. ఇంక మన కళ్ళకి, చెవులకి నచ్చినవన్నీ చూస్తూ ఉంటారు, వింటూ ఉంటారు. నిద్ర రాగానే పడుకుంటారు. ఇదే కదా! ఇలా కోటాను కోట్ల మంది జీవిస్తున్నారు. మరి ప్రతివాడికి అహంకారం ఉంది కదా, నా ప్రత్యేకత ఏంటి? నేనెందుకు పుట్టాను? నీవు ఎందుకు పుట్టావో తెలియాలంటే దాన్ని గూర్చిన తపన ఒకటి ఉండాలి.

నేను charted accountant గా ఉన్న సందర్భంలో మాస్టరుగారు నా జాతకం రాస్తూ, "కేవలం లెక్కలు కట్టుట వలెనే జీవన ప్రయోజనం నెరవేరదు" అని రాసారు. అంటే, లెక్కలు కట్టుకుంటూ, డబ్బులు సంపాదించుకుంటూ, ఒకిళ్ళు, రెండిళ్ళు, మూడిళ్లు, పదిళ్ళు, పదహారిళ్ళు కొనుక్కుంటూ, అలా వెళ్లిపోవచ్చు. ఏముందీ? దాని వల్ల ఏమవుతుంది? జీవుడుగా దిగి వచ్చిందానికి ప్రయోజనం ఉంటుంది ప్రతి వాడికి. Purpose of life అంటాం కదా! దాన్ని గూర్చినటువంటి ప్రయత్నం ఉండాలి. కేవలం పొట్టకూటికే బతుకుతుంటే రాదది. దాన్ని గూర్చిన తపన ఉండాలి. ఆ తపన ఉంటే, దానికి దారి చూపించడానికి నీకు దైవము సద్గురువు రూపంలో దగ్గర

చేరతాడు. తపన ఉన్నవారికే! ఏదో కాకతాళీయంగా మనకి దొరికాడు కాబట్టి వాడుకోవడం అదో పద్ధతి. తపనతో ఒక సద్గురువుని చేరినవాడికి జీవన ప్రయోజనానికి దారి తెలుస్తుంది. ఆ దారిలో నడిచి వెళ్తాడు.

అంచేత, అశ్వపతి ఆయన యోగము ద్వారా పంచ ప్రాణములపై ఆధిపత్యం సంపాదించి, హృదయమందు రమించే స్థితిలో ఉన్నప్పుడు కూడా అతనకి అసంతృప్తి ఉంది. ఎంచేత అసంతృప్తి ఉంది? జీవన ప్రయోజనం ఇంకా నెరవేరలేదు. ఏమిటి? ఉత్తరాధికారి తన రాజ్యానికి లేడు. అంచేత, దానికి గూర్చినటువంటి తపస్సు చేసాడు. తపస్సు చేయడం వల్ల అతనికి అమ్మవారే తన అంశతో కుమార్తెగా పుట్టింది. అటుపైన కుమారులు పుడతారని కూడా చెప్పింది అమ్మవారు కదా! అంచేత, జీవన ప్రయోజనం విషయంలో ఆయనకి సిద్ధే. సావిత్రిదేవి పుట్టుకతోనే జీవన ప్రయోజనం ఎరిగి పుట్టింది. జీవన ప్రయోజనం ఎరిగి పుట్టింది కాబట్టే, ఆమె చాలా స్పష్టంగా సత్యవంతుడినే పెళ్లి చేసుకుంటానని చెప్పింది. సంవత్సరం లోపల పాటు మరణిస్తాడన్న ఒక వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి సంసిద్ధం అవడం, కటిక దారిద్రంలో ఉండేటటువంటి వ్యక్తిని ఆగర్భ శ్రీమంతురాలైన తను వివాహం చేసుకుందామని అనుకోవడం, రాజ్యప్రాసాదంలో ఉంటూ, ఆక్కడి నుంచి అరణ్య ప్రవేశం చేసి అక్కడ వనవాసం చెయ్యడం, వీటన్నిటికీ సిద్ధపడ్డదంటే ఆమెకి పుట్టుకతోనే జీవన ప్రయోజనం తెలిసింది.

ఒక్కరికి ఒక్కొక్క రకంగా తెలుస్తూ ఉంటుంది. ఇప్పుడు Blavatsky జీవితం తరిచి చూసుకుంటే, చిన్నప్పటినుంచి జీవన ప్రయోజనం కోసం ఆవిడ చాలా తపన చెందింది. అలా తపన చెందుతూ ఉండడం వల్ల ఆవిడకి ముప్పైయేళ్ల ప్రాంతంలో సద్గురువు గోచరించి మార్గం చూపించాడు కదా! అలాగే ప్రతివాడికి ఏదో ఒక సమయంలో తపన బట్టి ప్రయోజనం తెలపడానికి, మార్గం చూపించడానికి గురువు వస్తాడు. అలాంటి గురువు వచ్చేటటువంటి సమయం ఇది. అంటే, ఇప్పటికే వచ్చి ఉన్నాడు. మాటిమాటికి ఇప్పుడు ప్రత్యేకంగా మళ్ళీ వస్తాడు.

ఆ విధంగా ఆవిడకి తెలిసి ఉండడం చేత, స్థిత ప్రజ్ఞ ఆవిడ, ఏం ఫరవాలేదు, నేను చూసుకుంటాను... ఏంచేత? తనయందు ప్రాణము, ప్రజ్ఞ, రెండిటియందు స్వామిత్వం కలిగినటువంటి దావిడ. ప్రాణములయందు స్వామిత్వము ఉన్నది, ప్రజ్ఞ యందూ స్వామిత్వము ఉన్నది సావిత్రి.

ఆటుపైన ద్యుమత్సేనుడు. ఉన్న వెలుగు పోగొట్టుకున్న వాడు. సత్యవంతుని యొక్క తండ్రి. ఉన్న వెలుగు కోల్పోయి... దేని వల్ల? ద్వేషము వలన, శత్రుత్వము వలన, తీరి కూర్చుని సమస్యలు పుట్టించుకోవడం వలన. మొన్న మాస్టరుగారి మాట ఒకటి విన్నాను కేసెట్టులో, మొత్తం సృష్టిలో మనిషి ఒకడేట చాలా నైపుణ్యం కలవాడు. ఏమిటంటే తన నైపుణ్యం, కోరి సమస్యలు సృష్టించుకోగలడట! కోరి సమస్యలు సృష్టించు కోగలిగినటువంటి వాడు మానవుడు అని ఒక మాట చెప్పారాయన. అంచేత, ఇట్లా ద్యుమత్సేనుడు, అంటే దేవతా సమూహములు తనకి సహకరిస్తుండగా తాను జీవిస్తున్నాడంటే అది చాలా వైభవోపేతమైనటువంటి జీవితం. ద్యుమత్సేనుడు అన్న నామానికి అర్థం అది. వెలుగు సేనలు తన వెంట ఎప్పుడూ ఉంటాయటండి. ఎప్పుడూ దేవ సహకారం ఉంటే, ఎక్కడికి వెళ్తే అక్కడ మార్గం సులభమైపోతూ ఉంటుంది. మనం వెళ్తున్న చోటల్లా మేఘాలు కమ్ముకోకుండా, వెడుతున్న చోట మేఘాలు

విచ్చుకుంటూ ఉంటాయి. ప్రతికూలమైన వాతావరణం అనుకూలమవుతూ ఉంటుంది దేవతా సమూహములు మన వద్ద ఉంటే, అలా ఉంటుంది. కొంతమందికి అన్నీ అనుకూలంగా అయిపోతూ ఉంటాయి, ప్రతికూలం అంత ఉండదు. అయిపోతూ ఉంటే గర్వం రావచ్చు కదా! అన్నీ బాగా జరుగుతుంటే మనంతటి వాళ్ళు లేదనిపిస్తూ ఉంటుంది కదా! అంచేత, అలా అనిపించి ఉండవచ్చు ద్యుమత్సేనుడికి. ఆయన కథ అంత విపరీతంగా ఇవ్వలేదు కానీ రాజ్యాన్ని కోల్పోయాడు శత్రువుల వలన. శత్రువులు ఎందుకొచ్చారో? శత్రువులు మనం సృష్టించుకుంటే ఏర్పడతారు. ఎక్కువ శత్రువులని మనం మాట చేత సృష్టించుకుంటామండి మనం. ఎందుకంటే ఎట్లా మాట్లాడాలో తెలియదు. ఒక పొల్లు మాట వచ్చిందనుకోండి, అయిపోతుంది, విరిగిపోతుంది కదా! ఒక్కమాట చాలదూ మనసు విరిగిపోవడానికి, శత్రుత్వం రావడానికి? మిత్రులే కదా శత్రువులు అవుతారు! మిత్రులు కానివారు శత్రువులు ఎట్లా అవుతారు? మిత్రులు ఎక్కువ శత్రువులు అవుతున్నారట అంటే నీలో తేడా ఉందని గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. ఇలా ఆయన స్వభావం అది. అశ్వపతి స్వభావం అది. సావిత్రిదేవి స్వభావం అది. ద్యుమత్సేనుడి స్వభావం అన్నీ ఉండి, చివరకి ఉన్నదాన్ని పాడు చేసుకున్నాడు స్వభావం చేతనే.

అలాంటి వాడికి ఒక కుమారుడు. అతడే మనకి ఎక్కువ ముఖ్యం. ఎంచేత? అతడు సామాన్య మానవుడు, రాజకుమారుడిగా పుట్టినటువంటివాడు, సద్గుణములు ఆశ్రయించాడు. అవే కదా నిన్న చెప్పుకున్నాం! మామూలుగా సత్యవంతుడంటే ఎదో ఒక అర్భకుడు, ఎదో చేతకాని వాడని అనుకుంటాం. కాదే! కాదు కదా! నిన్న చెప్పుకున్న విషయాలు మనం వింటే సత్యవంతుడు ఎంత గొప్పవాడండి? మానవుడిగా ఎంత గొప్పవాడు? అతను ఎన్ని సద్గుణములను ఆశ్రయించి, ఆరాధిస్తూ, ఆచరిస్తున్నాడు. అంటే, సత్సాధకుడు. మనకి అతడే ఆశయంగా ఉండాలి. ఎందుకంటే, సావిత్రి అమ్మవారు, సిద్ధురాలు కదా! ఆమె జన్మతః సిద్ధి పొందినటువంటి వ్యక్తి. అశ్వపతి మనకి భవిష్యత్తులో మన కార్యక్రమాలకి అన్నగారు లాంటి వాడు. అంటే, మనకింకా పంచ ప్రాణములు... నేను చెప్తుంటాను కదా! లోప్రాణములు, బహిః ప్రాణములు, రెండిటినీ సమన్వయించి, వ్యానము చేరితే, అప్పుడు నువ్వు దేహంలోంచి బయటుకు రాగలుగుతావు. అలాంటి వాడు అశ్వపతి అవుతాడు. కాబట్టి మనకి సాధనలో అతను ముందు తగిలేవాడని అర్థం చేసుకోవాలి. అటుపైన అతడు సవితృ వెలుగుని ఆరాధన చేసి, అనుగ్రహం పొందినటువంటి వాడు. ఇకపోతే, ద్యుమత్సేనుడు మనకి హెచ్చరిక. అంటే, ఉన్నది పాడు చేసుకోకురా అని. అంటే, ఇప్పుడు మనకి ఎవరయితే సన్నిహితులు, మిత్రులుగా ఉన్నారో, వారిని నీకుగా నువ్వు కారణంగా పోగొట్టుకోకూడదు. పోగొట్టుకుంటున్నావుట అంటే నీలో ఉండకూడని స్వభావం ఉంది అని అర్థం. ఇప్పుడు పోయినవేవో పోయినవి, కానీ ఇహ ఎందుకు పోవడం? ద్యుమత్సేనుడు పోగొట్టుకున్నాడు. రాజ్యం వైభవం పోగొట్టుకున్నాడు. కుమారుడున్నాడు, రాజ్యం లేదు. అశ్వపతికి రాజ్యం ఉంది, కుమారుడు లేడు. చూడండి ఎలా ఉందో? అంటే, మనమిట్లా బాగా కథ మీద ధ్యానం చేస్తే మనకివన్నీ తెలుస్తాయి. అశ్వపతికి అన్నీ ఉన్నాయి, కుమారుడు లేడు. కాబట్టి జీవన ప్రయోజనం నేరవేరట్లేదు. ఇక్కడ కుమారుడున్నాడు, రాజ్యం లేదు. కుమారుడు అద్భుతమైనటువంటి కుమారుడు. అతడికి రాజ్యం లేదే అన్న బాధ లేదు.

ఇది లేదు, అది లేదు అన్న బాధ లేదు. సద్గుణములను అనునిత్యం అనుసరించి, ఆచరిస్తూ జీవితం గడుపుతున్నాడు కదా!

అంచేత, అతనిని వరించడానికి వచ్చింది స్త్రీ. కొంతమంది పురుషులకు స్త్రీలు చేరినప్పుడు వివాహ సందర్భంగా, అతని జీవన ప్రయోజనానికి మార్గం దొరుకుతుంది. ఎందుకంటే, వివాహం అత్యంత పవిత్రమైన క్రతువుగా మన సాంప్రదాయం తెలుపుతుంది. అంచేత, ఆమె ఈ విధంగా నేను అతనినే చేసుకుంటానంటే, అప్పుడు అశ్వపతి అనేటటువంటి మహారాజు సావిత్రిదేవిని తీసుకుని వనానికి వచ్చి, ద్యుమత్సేనుడితో ఆ విధమైనటువంటి విషయాలు చెప్తాడు. ఇలా నా కుమార్తె సకల సద్గుణ సంపన్నురాలు, స్వయం ప్రకాశకురాలు, మణి అని చెప్పాడు కదా! మౌక్తిక మణి లాంటిది అంటే ఏమిటి అర్థం? మణి అనే పదానికి ఒకటే అర్థం. దాన్ని వెలిగించక్కర్లేదు. అదే స్వయంగా వెలిగేది. ఇంకొకళ్ళ చేత వెలిగింపబడేది కాదది. అంటే, తన అలా వెలుగుగా మారి ఉన్నది. అంచేత, సావిత్రి సత్యవంతుడిని వివాహం చేసుకోవడానికి ఇక్కడికి మేము వచ్చాం, అంచేత నువ్వు అంగీకరించమని ఈ రాజుని కోరతాడు.

కోరితే, అప్పుడు ద్యుమత్సేనుడు చాలా ఆశ్చర్యపడతాడు. "మద్రేశ్వరా, రాజ్యం పోగొట్టుకుని ఘోరారణ్య మధ్యంలో నెలవేర్పరుచుకుని, నిరంతర తపశ్చర్యలతో కాలం వెల్లబుచ్చుకుంటున్న మాతో పాటు ఇడుములు అనుభవించగలదా ఈ కుమారి, ఈ సుమారి?" అన్నాడు. అనుభవించగలదా అని అడిగాడు. అక్కడే కదా నిన్న మనం ఆగాం! ఈ వాక్యం మళ్ళీ ఒక్కసారి చదువుతాను. "రాజ్యం పోగొట్టుకుని ఘోరారణ్య మధ్యంలో నెలవేర్పరుచుకుని, నిరంతర తపశ్చర్యలతో కాలం వెళ్ళబుచ్చుకుంటున్న మాతో పాటు ఇడుములు అనుభవింపగలదా ఈ సుకుమారి?" అనేదాంట్లో మనకో సమాచారం అందుతుంది. ఏమిటంటే, పోయిన దానికి ఏడుస్తూ కూర్చోలేదు ఈయన కదా! రాజ్యం పోయిందిగా! రాజ్యం పోతే, అడివిలో కూర్చుని పన్నాగాలు పన్నాలి, ఎట్లా రాజ్యం సంపాదించాలని కదా! కానీ ఇతడు సహజంగా అంతకుముందు వెలుగు రుచి చూచినటువంటి వాడు. దానికి తేడా పడడం వల్ల తనకు ఉన్నది పోయిందని తెలుసుకున్నాడు. తెలుసుకుని, మనకి రాజ్యం ఉంటే ఏమిటి, లేకపోతే ఏమిటన్న ఒక స్థితిలోకి వచ్చాడు.

నిజంగా అడివిలో ఉండడం అలవాటు పడితే ఊళ్లోకి రాబుద్ధి కాదు, తెలుసా! మనం ఉండం, భయం చేత. ఉంటే అదే అలవాటు అయిపోతుంది. అందుకనే, ఆ రాముడికి, సీతకి ఆ palace కన్నా అక్కడ ఆ వనంలోనే బావుంది కదా అనుకుంటూ ఉండేవాళ్ళు ఇద్దరూ కూడా. మనకు అక్కడే ఎక్కువ బావుంది ఇక్కడ కన్నా అనిపిస్తుంది. ఇక్కడ బావుండడం కన్నా, అక్కడ ఎక్కువ బావుంటుంది. ఎందుకంటే ప్రకృతిలో ఉంటాం. ఇక్కడ మనం కృత్రిమ ప్రకృతిలో ఉంటాం. సరిగ్గా గాలి రాదు, వెలుతురు రాదు. మన మేర్పరుచుకున్న దుమ్ము నోట్లోకి, ముక్కులోకి పోతూ ఉంటుంది కదా! మన మేర్పరుచున్నదే! ఈ కాలుష్యంలో బతుకుతూ ఉంటాం. పై నుంచి చూస్తే తెలిసినవాడికి, అబ్బ ఇంత కుళ్ళుగా బతుకుతున్నారేంటి అనిపిస్తుంది. అది అరణ్యమా, ఇది అరణ్యమా అనిపిస్తుంది. మనము ఏది అరణ్యం అని

భయపడుతున్నమో అది ఊళ్ళో ఉంది ఇప్పుడు. ఈ ఊళ్ళో కన్నా అరణ్యంలోనే ఎక్కువ ప్రశాంతంగా ఉంటుంది. ఊరి బయటకి వెళ్తే బావుండదూ? గాలి బావుంటుంది, వెలుతురు బావుటుంది. రాత్రి పూట నక్షత్రాలు కనిపిస్తాయి, సూర్యోదయం కనిపిస్తుంది, సూర్యాస్తమయం కనిపిస్తుంది, చంద్రోదయం కనిపిస్తుంది, చంద్రుని అస్తమయం కనిపిస్తుంది కదా! మరి ఇవన్నీ మనకి కనిపిస్తున్నాయా? ఏం లేదు కదా!

అందుకని, ఈయన అరణ్యం చేరాడండి. చేరి, ఏం చేసాడు? పోయినదేదో పోయింది, ఇప్పుడు ఏం చెయ్యాలి నేను? దైవాన్ని ఆరాధన చేసుకుందాం. ఎప్పుడూ కూడా భారతంలో గానీ, రామాయణంలో గానీ, భక్తుల కథల్లో గానీ చూపించేది ఒక్కటే, కష్టం వచ్చినప్పుడు దైవం కాళ్ళు ఎక్కువ పట్టుకోవాలి. ఆ, నాకేం చేసారు, నాకు ఎవరు ఏం చేసారు, ఇన్నిసార్లు ఇన్ని ప్రార్థనలు చేసాను, ఇన్ని గుళ్ళ చుట్టూ తిరిగాను, నాకేం జరిగింది, ఇట్లా మాట్లాడేది అహంకారం. బాగా కష్టం వచ్చినప్పుడు తాను చాలా మంచివాడు అని తను అనుకోవడం వల్ల కదా, నాకు ఎందుకింత కష్టం వచ్చిందని అంటుంటాడు. అసలు నువ్వు మంచివాడివని ఎందు కనుకుంటున్నావు? మంచివాడివైతే ఇలా ఎందుకున్నావు? నీ గురించి నీకు అంచనా ఎక్కువ. ప్రతివాడికి అంతే. నాకయినా, మీకయినా, తన గురించి తనకి అంచనా ఎక్కువ, ఎదుట వాడి గురించి అంచనా తక్కువ. అదే, అక్కడే ఉంది మాత్సర్యం కదా! మన గురించి అంచనా తక్కువ ఉండాలి, ఎదుట వాడి గురించి అంచనా ఎక్కువ ఉండాలి. అదీ భక్తి. వచ్చినవాడే నారాయణుడు అనుకునేవాడు భక్తుడు. ఆ వాడికేం తెలుసు అనుకునేవాడు అహంకారి. ఎవడికీ ఏం తెలీదు అనిపిస్తుంది, మనకి తప్ప. ఇప్పుడు అంతా తెలిస్తే ఇట్లా ఉన్నావే నువ్వు? ఆ ప్రశ్న వేసుకోవద్దూ? నీకు అంతా తెలిసిన వాడివి, ఇట్లా ఉన్నావేంటి, ధేభ్యం మొహం వేసుకుని? అంచేత, తన గురించి మర్చిపోయిన వాడు భక్తుడు. తన గురించి గుర్తు ఉన్నవాడు అహంకారి. భగవత్ భక్తిలో మనకేం చెప్తారంటే, తన గురించి తనకి ఎంత గుర్తు ఉంటుందో, అంత మేర అహంకారం. కొలత అది అహంకారానికి. నేను, నేను, నేను అంటూ మాట్లాడుతారు కదా! ఎన్నిసార్లు తన గురించి మాట్లాడుకుంటే, అంత అహంకారం వీడిలో ఉందని మనం అంచనా వేసుకోవచ్చు. అది ఎదుటవాడు మాట్లాడుతున్నప్పుడు మనం అంచానా వేస్తాం. మనం మాట్లాడుతున్నప్పుడో? అందుకని, ఈ ఆత్మజ్ఞానం విషయంలో మనకి మనం మార్కులు వేసుకోవడమే తప్ప, ఎదుటవాడికి మార్కులు వెయ్యం. ఎన్నిసార్లు నీ గురించి మాట్లాడుకున్నావు ఇవాళ్ళ నువ్వు గొప్పగా? మాట్లాడుకున్నావా? పోనీ మాట్లాడలేదు, భావన చేసావా? చేసావు కదా! మరంతలా నీ గురించే అంతలా నిన్ను నువ్వే ప్రేమిచుకుంటూ ఉంటే, ఇంక ప్రపంచాన్ని ఏం ప్రేమిస్తావు, దేవుడిని ఏం ప్రేమిస్తావు? ప్రేమించలేవు కదా!

ఈ ద్యుమత్సేనుడు నాకెక్కడ ముచ్చటేసిందంటే చదువుకుంటున్నప్పుడు, రాజ్యం పోయిన తర్వాత మాములుగా చాలా ప్రతీకార బుద్ధి ఉంటుంది మామూలు వాడికే, ఇంక మరి క్షత్రియుడంటే చెప్పక్కర్లేదు. చాలా ఎక్కువ ప్రతీకార బుద్ధి. అలాంటి క్షత్రియుడు, అంతకుముందు తను రుచి చూసిన వెలుగుని మళ్ళీ పొందే ప్రయత్నంలో ఉన్నాడు తప్ప, రాజ్యం కోసం పన్నాగాలు వేసుకోలేదు. కళ్ళు పోయినాయి. పొతే పోయినాయి అనుకున్నాడు. చెప్పాగా ఇందాక. కనబడడం లేదంటే నానా బాధా పడిపోక్కర్లేదు. నీలో కొంచమయినా ధర్మం ఆచరిస్తే, సాయం చేసేవాడు ఎవడో ఒకడుంటాడు. ఎప్పుడు ఏ ధర్మం ఆచరించని వాడికి ఎలాంటి సహాయం రాదు. "*స్వల్పమపి ధర్మస్య*" అంటూ

భగవద్గీతలో ఒక శ్లోకం ఉంటుంది. కించిత్ ధర్మం ఆచరిస్తే చాలురా, నేను ఏదో రకంగా నీకు సాయం చేస్తూ ఉంటాను. అంచేత, అయ్యో కళ్ళు లేవే, అయ్యో కాలు లేదే, అయ్యో చెవి లేదే అనుకోవద్దు. ప్రజ్ఞ ఉందిగా! ప్రజ్ఞ చేత దివ్య ప్రజ్ఞతో అనుసంధానం చెందవచ్చు. అంచేత, ఈయన తపశ్చర్యలోకి వెళ్ళాడన్నది ఎంత బావుందండి! నా రాజ్యం పోయింది, నువ్వు వచ్చావు, ఇప్పుడు మీ అమ్మాయిని మేము చేసుకుంటే, నీ సైన్యం నా సైన్యం కదా, అంచేత మనం దండెత్తి శత్రువులని ఓడించి నా రాజ్యాన్ని తెచ్చుకోవచ్చు... ఇలాంటివన్నీ అనుకుంటాం కదా! కోడలు తండ్రి బాగా influence ఉన్నవాడుంటే, కొడుకు తండ్రి వాడుకోడండి? అది కదా లోకం! అదేగా లౌక్యం! మన అబ్బాయిని బాగా influence, state level, central level influence ఉండే వాళ్ళ అమ్మాయికి ఇచ్చి పెళ్లి చేసుకున్నామనుకోండి, మాటిమాటికీ 'బావగారూ' అని ఫోన్ చేస్తూ ఉంటాడు. దేనికీ బావగారు? ఆ పని చేసిపెట్టు, ఈ పని చేసిపెట్టు, వాడికి చెప్పు, వీడికి చెప్పు, ఇట్లా అడుగుతూ ఉంటాడు కదా! మరీ కాకపోతే, నేను తిరుపతి వెళ్తున్నాను, అక్కడ దర్శనానికి ఏర్పాటు చేసి పెడతావా అనన్నా అడుగుతాడు. ఏదోకటి అడుగుతాడు. అడుగుతాడు కదా! అంటే, లోక ప్రయోజనానికే ఎక్కువ వాడుకుంటాడు కదా!

ఈయన ఏమన్నాడు? మీ అమ్మాయి మా ఇంటికి వస్తుందంటున్నావు, ఉండగలదా ఇక్కడ? ఎప్పుడూ కూడా పిల్లనిచ్చే చోట మనకన్నా ఎక్కువ స్థితిగతులున్న ఇంట్లో ఇమ్మంటారు. ఎందుకంటే, పిల్ల సుఖపడుతుంది. తక్కువ ఇంట్లో ఇస్తే కష్టపడుతుంది. పిల్లని తెచ్చుకునే చోట మనకన్నా తక్కువ స్థితిమంతుల ఇంట్లోంచి తెచ్చుకోమంటారు. పిల్లని తెచ్చుకునేటప్పుడు నీకన్నా తక్కువ స్థితిమంతులు ఇంట్లోంచి తెచ్చుకున్నావనుకో, ఆ అమ్మాయి సుఖంగా ఉంటుంది. ఎందుకంటే, ఇక్కడ అంతకన్నా ఎక్కువ బావుంటుంది కాబట్టి. మాటిమాటికీ పుట్టింటికి వెళ్ళిపోతా అనదు. ఇక్కడ అంతకన్నా బావుంటే ఎందుకెళ్తుంది? వెళ్ళదు కదా! ఎప్పుడూ పుట్టింటికి వెళ్ళిపోతానని ఎందుకంటుంది? ఇక్కడ ఏడిసినట్టుంటే, అక్కడికి వెళ్లిపోదా మనిపిస్తుంది. అంచేత, మనకి పెద్దలేం చెప్పారంటే, పిల్లని తెచ్చుకునేటప్పుడు నీకన్నా స్థితిగతులు తక్కువగా ఉన్న కుటుంబంలో, సంస్కారములు చూసుకుని తెచ్చుకోమన్నారు. సంస్కారాలకి ఉండడం, లేకపోవడంతో సంబంధం లేదుగా! అలాగే, పిల్లనిచ్చే చోట ఎక్కువ స్థితిగతులు ఉండే ఇంట్లో ఇచ్చుకోమన్నారు.

ఇక్కడ reverse అయ్యింది. అతి తక్కువ, ఒక ఇల్లు కూడా లేదు. అటువంటి చోట ఇస్తున్నాడు ఇప్పుడు. అంచేత, ఈ ప్రశ్న వేసాడు. ప్రశ్న వేస్తే, దానికి ఆయన సమాధానం చెప్పాడు, అశ్వపతి. "ధరణీనాథా"... ఈయన ఎప్పుడూ ఆయనని "ధరణీనాథా", "మహారాజా" అని సంబోధిస్తూన్నాడండి. అంటే, రాజ్యం లేకపోవచ్చు గానీ, అతడి కుండేటటువంటి సంస్కారపరంగా అతడు రాజే. ఎందుకని? అడుక్కుతినటం లేదుగా! నా రాజ్యం పోయింది, నాకేమయినా ఇస్తావా అని అడగడం లేదు కదా! ప్రతిచోటకి వెళ్లి, నాకంతా పోయింది కదా, నువ్వు ఏమయినా సాయం చేసి పెడతావా అని అడగడం లేదు.

ధీరుడు అయి ఉండడం చేత, అరణ్యంలో తపస్సు చేసుకుంటూ అక్కడేం దొరికితే అది తిని బతికేస్తున్నాడండి. ధీర లక్షణం అవన్నీ. "గ్రాసము లేక, చిక్కిన జలాకృసమైన"... అందుకే పద్యం చదువుకున్నాం చిన్నప్పుడు. ఏం దొరకట్లేదు సింహానికి, బాగా చిక్కిపోతోందిట, డొక్కలన్నీ ఎండి పోతున్నాయట, ఎముకలు కనిపిస్తున్నాయటండి. అయినప్పటికీ గడ్డి తినదు సుమా సింహము అని రాసాడు భతృహరి. అంటే, రాజంటే సింహమే. క్షత్రియ లక్షణం అది. గడ్డి తింటుందా? తినలేదు కదా! అంటే ఆకులు, అలమలు తింటున్నాడు పాపం, ప్రకృతి ఇచ్చినవి పుచ్చుకుని బతికేస్తున్నాడు. ఆనందంగా ఉన్నాడు, రాజ్యంలో ఉండేదానికన్నా ఆనందంగా ఉన్నాడు. కళ్ళు లేవన్న బాధ లేదు, రాజ్యం లేదన్న బాధ లేదు. రెండూ లేవు. వాళ్ళూ మగాళ్ళంటే! ఒక లక్ష రూపాయిలు పోగానే గుండెలో తేడా పడేటటువంటి వాళ్ళం మనం, చాలా ఆధునిక మానవులం ఉన్నాం కదా! ఎవడో మనవాడే కొట్టేసాడనుకోండి, నీకు తేడా పడిపోతుంది కదా! మన వాళ్ళనుకున్నాను, నాకు ఇంత మోసం చేసాడు, అని తేడా పడుతుంది. మోసం ఒకటి పోగా, నువ్వు తేడా పడిపోడం ఇంకోటి extra దాని మీద కదా! Depressions, heart attacks ఇలాంటివన్నీ వచ్చేస్తాయి కదా! అవన్నీ లేవండి ఈయనకి. కాబట్టి మనకి ఈయన ఆదర్శనీయుడు అవునా, కాదా? అవును ఆదర్శనీయుడే. స్వభావం ఎలా ఉందో చూడండి. ఉండడం, లేకపోవడంతో సంబంధం లేకుండా, ఒకవేళ చేసిన పొరపాటు ఏదన్నా ఉంటే, దాన్ని సర్దుకుని, శుభ్రంగా తపస్సు చేసుకుంటున్నాడంటే, దివ్య స్వభావం ఏర్పరుచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నటువంటి వాడాయన.

దానికి ఈయన అన్నాడు, "ధరణీనాథా, కలిమిలేములు కలకాలం నిలవనేరవు." పాటలున్నాయి మనకి. "కలిమిలేములు, కష్టసుఖాలు, కావడిలో కుండలిలే" అంతేకదా! ఒకప్పుడు ఉంటాయి, ఒకప్పుడు ఉండవు. లేనివాడికి వచ్చి తర్వాత పోతే ఎక్కువ బాధ ఉంటుందండి. తెలుసా? లేనివాడికి లేనట్టే ఉంటే, వాడికే బాధ లేదు.

నేనెప్పుడూ చెప్తూ ఉంటా, మనకెవరయినా ఓ కోటి రూపాయిలు, మనం చేసిన పనుల వల్ల, ఏదో మొత్తానికి ఓ కోటి రూపాయిలు వచ్చిందనుకోండి. అంతకుముందు లేవా కోటి రూపాయిలు. ఇప్పుడా కోటి రూపాయిలు పోయినాయి అనుకోండి. పోతే ఎంత బాధగా ఉంటుందో! అదేంటిరా, అంతకు ముందు లేవుగా నీ దగ్గర? పదేళ్ళు వెనక్కి వెళ్తే, నీకు అవి లేవు కదా? ఉన్నాయా? పదేళ్ళ క్రితం లేనివి, నీకు వచ్చిన తర్వాత అవి వెళ్ళిపోతే, అంతకుముందు లేనప్పుడు ఎంత సుఖంగా ఉన్నవో, ఇప్పుడు అంత సుఖంగా ఎందుకు ఉండలేవు? మార్పు వచ్చింది నీలో. అసలు బాగా మనం మొదటికెళ్ళిపోతే, "వస్తా వట్టిదే, పోతా వట్టిదే". మధ్యలో బోల్డు వస్తుంటాయి, పోతూ ఉంటాయి. అవి పోక పోయినా, నువ్వు పోతావు కదా! అదొకటి ఉంటుంది కదా! అమ్మమ్మా, అలా ఎలా వెళ్ళిపోతామండి అంటే, అవి వెళ్ళిపోవు, ఉంటాయి, నువ్వు వెళ్ళిపోతావు. ఒకడేగా వస్తాడు, ఒకడే కదా వెళ్తాడు! ఈ లోపల బోల్డు వచ్చి చేరతాయండి. కొన్ని చేరుతూ ఉంటాయి, కొన్ని పోతూ ఉంటాయి. ఈ చేరినవి, పోతాయని తెలుసుండాలి.

"*ఆగమా పాయనః*" అంటుంది భగవద్గీత. వచ్చేవన్నీ పోయేవే అని అర్థం. ఎందుకనీ? అవి వచ్చినయి, కాబట్టి పోతాయి. అసలు రాకపోతే? "*మా జాతస్య మరణం ధృవం*" అంటారు. పుడితే, చచ్చిపోతావు. నువ్వు పుట్టినవాడివి కాదు. నువ్వు చొక్కా వేసుకున్నావు, చొక్కా తీసేస్తావు. ఇప్పుడు ఈ చొక్కా వేసుకున్నానండి పొద్దున్న, ఇది తీయాలా? వేసుకున్నప్పుడు ఇది తీస్తావని తెలుసా? ఏ సాయంత్రానికో ఈ గోతం తీస్తానని తెలుసు కదా! అంటే, బట్ట ఉంటే ఏం పెద్ద ఆనందం అండి? ఇంకో బట్ట ఉంది కదా! ఇలా గోతాలు వేసుక్కుర్చున్నామనుకోండి వాళ్ళూ వీళ్ళూ ఇచ్చారని, ఇది ఎప్పుడు ఇప్పేద్దామా అన్నట్టుగా ఉంటుంది. అట్లాగే, దేహం ధరించిటువంటి వాడు, తెలిసినవాడయితే, ఇది దీన్ని ఎప్పుడు పని పూర్తి చేసుకుని వెళ్ళిపోదామా అనిపిస్తుంటుంది వాడికి. తేలికైన శరీరం ఏర్పాటు చేసుకుని, అందులోకి వెళ్లిపోదామనిపిస్తుంది. అదయితే తేలుతుంది, ఎగురుతుంది, ఆకాశ గమనం చేస్తుంది. అలాంటిది, దీనికన్నా సుఖం. అది కూడా వద్దనుకునే వాళ్ళున్నారు తెలుసా! ఇవన్నీ మన ఇళ్ళే.

ఆషాఢ మాసం మన నివాసస్థానం గురించి చెప్తుంది. Fourth house is your house అంటారు, నివాసస్థానము. నీ ఇల్లు ఎట్లా ఉంది? నీ వళ్లు ఎట్లా ఉంటుందో నీ ఇల్లు అట్లా ఉంటుంది. నీ శరీరం నీ నివాసం. ఆ శరీరంలో వెలుగు శరీరం తయారు చేసుకుంటే అది ఇంకా మంచి నివాసం. అందులో బంగారుకాంతి నుంచి వజ్రకాంతికెళ్తే అది ఇంకా పెద్ద నివాసం. అందుకని, జీవుడు అసలు బొత్తిగా పల్చగా ఆకాశంలా ఉండే శరీరాన్ని కట్టుకు తిరుగుదాం అనుకుంటాడండి. అది వాడికి highest. "*ఆకాశం శరీరం బ్రహ్మ*" అంటుంది ఉపనిషత్తు కదా! బ్రహ్మదేవుడు ఆకాశమే శరీరంగా ఉన్నాటండి. ఎంత హాయో! ఇరుగ్గా ఉండదు ఎక్కడా. ఇలాంటి బట్టలేసుకుని, సాక్స్ వేసుకోవాలంటే, ఇక్కడ అడ్డుపడుతుంది, అక్కడ అడ్డుపడుతుంది, రకరాకాల బాధలుంటాయి కదా! శరీరం అడ్డమే జీవుడికి ఒక రకంగా. ఎందుకంటే, అంత తేజస్సుని అట్లా ఓ మట్టి బుడ్డిలో పెట్టినట్టుగా ఉంటాడు. ఇప్పుడు చూడండి, మట్టి ప్రమిదల్లో దీపం పెట్టం. క్రమక్రమంగా మట్టి తీసి, ఇప్పుడు గాజు పెట్టుకుంటున్నాం. అంటే ఏమిటంటే, ఈ శరీరం నుంచి ఇంకో శరీరం తయారు చేసుకోవడానికి మానవజాతికి అర్హత వచ్చిందని. మట్టి దీపాల్లోంచి, గాజు దీపాల్లోకి వచ్చారు. అక్కడ నుంచి విద్యుత్ దీపాల్లోకి వచ్చారు కదా! ఇదంతా పురోగతిగానే చూస్తారు పరమ గురువులు. వాళ్ళు మంచివాళ్ళు. అంటే, బొత్తిగా మనలో ఏ మచ్చా చూడకుండా, మీరు చాలా మంచివాళ్ళని చెప్తుంటారు. మనం నిజమేనని అనుకోకూడదు. ఎందుకంటే, ఉత్సాహ పరచడానికే అలా చెప్తూ ఉంటారు.

అంచేత, ఈ శరీర నిర్మాణాల్లో, ఏ శరీరం నీకు సుఖము అంటే, ఆకాశ శరీరం. జ్ఞానవాశిష్ఠంలో వశిష్ఠ యోగం ఒకటుంది కదా మనకి! ఆ జ్ఞానవాశిష్ఠంలో మొట్టమొదటొచ్చే కథే, ఆకాశ్వజుడి కథ. అంటే, వాడి శరీరం ఆకాశంలో... వాడు ఆకాశంలోనే పుట్టాడు. మనమంతా కూడా ముందు ఆకాశంలో పుట్టిన వాళ్ళమే. అక్కడి నుంచి ఇంకో దాంట్లోకి, ఇంకో దాంట్లోకి, ఇంకో దాంట్లోకీ, అట్లా మట్టిలోకి వచ్చేసాం మనం. అంచేత, ఆ శరీరం ఉంటే అద్భుతం. అంతకన్నా కొంచెం తక్కువ సూక్ష్మం, అంటే దాన్ని కారణ శరీరం, లింగ శరీరం అంటారు. దానికన్నా కొంచెం ముందుగా ఉండేది బంగారుకాంతి శరీరం, సూక్ష్మ శరీరం అంటారు. దానికన్నా బాగా తక్కువ కాంతి ఉండేది

భౌతిక శరీరం. దీన్ని కూడా పల్చగా, చక్కగా కాంతివంతగా ఉంచుకునే మార్గాలు ఉన్నాయి. అట్లా బండబారి పోకుండా, ఓ మొద్దల్లే తయారవ్వకుండా చూసుకోవచ్చు. దేని చేత? సున్నితమైన ఆహారం పెట్టి, బాగా నిద్ర పుచ్చి కాదు. వెలుగు నింపి. వెలుగు నింపడం చేత, ఈ శరీర ధాతువుల్లో చక్కని ఒక తేలికతనం వస్తుంది, సాంద్రత తగ్గుతుంది. ఇవన్నీ ఏర్పరుచుకోవడం కోసమే దైవారాధన.

ఆ విధమైనటువంటి దైవారాధనలో ఆయన ఉన్నప్పుడు, ఇలా ఉంది కదా అంటే, "ఈ కలిమిలేములు కలకాలం ఉండవు కదా" అని చెప్పాడు. మన సంగతేంటి? ప్రతీది మనకి అన్వయించుకోపోతే ఈ గ్రంథాలు ఉపయోగపడవు కదా! వచ్చినవన్నీ ఎప్పుడూ నీతో ఉంటాయా? సగంలోనే పోవచ్చు కొన్ని వచ్చినవి, లేదా నువ్వే వాటిలోంచి వెళ్లిపోవచ్చు. అయ్యో! అయ్యో! ఇన్ని సంపాదించుకుని ఇప్పుడే వెళ్ళిపోతే ఎట్లా అంటే? ఇప్పుడే కదండి అన్ని ఏర్పడినాయి, ఇప్పుడే ఎట్లా పట్టుకుపోతారంటే, కుదరదు కదా! అది ఎప్పుడొస్తే అప్పుడు నువ్వు సిద్ధంగా ఉండాలి. అంచేత, అవి శాశ్వతం కాదు కదా అన్నాడీయన.

పిల్ల తండ్రి, పిల్లవాడి తండ్రితో ఈ కలిమిలేములు కలకాలం ఉండవు కదా, అంచేత వాటి గురించి మనం ఆలోచించక్కర్లేదు అన్నాడు. అవి సంప్రాప్తించినప్పుడు ఆనంద దుఃఖాలు ధీరులని ఏమాత్రం అంటవు. సుఖము కలిగినప్పుడు అంట కూడదండి, కష్టం కలిగినప్పుడు అంట కూడదు. సుఖం కలగగానే, అంటే మనకి కాస్త సంపద కలగంగానే రకరకాల సౌకర్యాలు మనం ఏర్పరుచుకుంటాం కదా! అలా ఏర్పరుచుకుంటే, ఆ సౌకర్యం లేని చోట నువ్వు ఇబ్బంది పడుతూ ఉంటావు కదా! ఎప్పుడూ AC గదిలోనే పడుకున్నారనుకోండి, ఏ ఊరన్నా వెళ్తే అక్కడ AC ఉందా అనడగాలి. ఇప్పుడు మన పరిస్థితి అక్కడ commode ఉందా అని అడుగుతూ ఉంటాం కదా! మరది ఇదివరకూ ఉందా నీకు? నిన్న dining table మీద తింటూ అనుకున్నాను, నేల మీద హాయిగా విస్తేరేసుకుని తినేవాళ్ళం అని. ఇప్పుడు నేల మీద తినలేం కదా! పశువల్లే నిలబడయినా తింటాం కదా! ఏ మాటకామాట, ఉన్నమాట చెప్పుకోవాలి కదా! నిలబడి తినేది ఏది? పశువు. కూర్చుని తినడం అంటే, గోడ కుర్చీ వేసినట్టు, ఇట్లా సగం కూర్చుని తింటున్నాం కదా! పూర్తిగా కూర్చోట్లేదు కదా! మరేంటండి మనం? ఏం చేసాము? అలవాటు పడిపోయాము సౌకర్యాలకి. అంతే కదా! అలా అలవాటు పడిపోతే, అవి లేకపోతే ఎమయిపోతావు? చాలా కష్టంగా ఉంటుంది. ఒకప్పుడు మనకి కరెంటు లేదు కదా! చిన్నప్పుడు ఏం కరెంటు ఉందండి? మొత్తం ఇంటికి ఒక ఫాన్ ఉండేదేమో. నా చిన్నప్పుడు మొత్తం ఇంటికి ఒక ఫాన్, మొత్తం ఇంటికి ఒక bathroom కదా! మొత్తం ఇంటికి. అంటే, ఇంట్లో ఎంతమంది ఉంటారు? ఇప్పటిలాగా లింగూ లిటుకూ ముగ్గురూ, నలుగురూ కాదు కదా! ఓ డజను మందుంటారు. మూడు తరాలుంటాయి ఇంట్లో కదా! మూడు తరాల కొకటే bathroom. వాళ్ళూ బానే పొద్దున్నే లేచి స్నానాలు చేసారు. మరి ఈ సుఖాలు, సౌకర్యాలు ఏర్పడినప్పుడు, వీటికి... ఏర్పడకూడదని నేనడం లేదు. ఏర్పడవచ్చు. అవి లేకపోతే బాధ పడతావా? అది చూసుకోవాలి.

ఈ సారి గురుపూజల్లో వాళ్ళు గదిలో మంచాలు వెయ్యలేదుట అంటే, అయితే నేను వెళ్ళను అనుకోకూడదు. ఒకప్పుడు మనం గురుపూజల్లో నేల మీద పడుకున్న రోజులు ఉన్నాయి, ఓ గదిలో పది మంది పడుకున్న రోజులున్నాయి. నేల మీద తిన్న రోజులున్నాయి. వేడి నీళ్ళు మోసుకొచ్చి తెచ్చుకుని స్నానాలు చేసిన రోజులున్నాయి. ఇప్పుడు మనకి వేడి నీళ్ళు తెచ్చి ఇస్తారు, మంచాలు వేస్తారు, ఫ్యాన్లు పెడతారు, AC పెట్టమంటారా అని అడుగుతారు, commode ఏర్పాటు చేసి పెడతారు. ఇలా చేసి పెడుతుంటే నువ్వు చక్కగా ముఖమంతా కూడా విస్తరల్లే వికసించి ఉందనుకో, అది లేకపోతే కూడా అలా వికసించి ఉంటే అదీ లెక్క. అది మనిషి లొంగిపోయాడా లేదా అనేది తెలుస్తుంది. సుఖాలకి లొంగకూడదు. సుఖాలకి లొంగనివాడు కష్టాలకి కుంగడు. ఎప్పుడయితే నువ్వు సుఖానికి లోబడిపోతావో అప్పుడు కష్టం రాగానే చాలా కుంగిపోతావు. ఎందుకంటే, అన్న వస్త్రాదులకి లోటు ఉండదు. సౌకర్యాలకి లోటు ఉంటుంది.

కారులో వెళ్ళాలిసినవాడివి నడిచి వెళ్ళాలిసి వస్తుంది. ఏముంది? కాళ్ళు మొట్టమొదటి నుంచీ ఉన్నాయి మనకి. కార్లు ఇప్పుడిప్పుడే కదా వచ్చినాయి! కారు వెళ్ళిపోయిందనుకోండి, నడిచి వెళ్ళు. ఇచ్చాడుగా దేవుడు? అలా చెప్పడం సులభం అని అనొచ్చు మీరు. నేను అట్లా నడిచా. నేను పుట్టేప్పటికే మాకు కారు ఉంది. కొన్నాళ్ళు మా నాన్నగారు వెళ్ళిపోవడంచేత, ఏ కారు లేకపోతే, ఎక్కడినుంచి ఎక్కడికయినా నడచి వెళ్ళగలిగేవాడిని. అందుకనే, ఇప్పుడయినా నడిచి వెళ్ళడానికి నాకు అభ్యంతరం లేదు. అంటే, ఒకటే సాధించాను, మిగతావన్నీ కాదు! అంచేత, నడిచి వెళ్ళగలగాలి కారు లేకపోతే. వాడి కారు తీసుకుందామా, వీడి కారు తీసుకుందామా, నీ కారు ఇస్తావా, మా ఊరు వెళ్తాం... అది చాలా దరిద్రం. నువ్వు అడక్కుండా వాడు ఒకటికి నాలుగు సార్లు అడిగితే అది వేరే విషయం. పక్కవాడి కారు వాడుకోవడం, పక్కవాడి సౌకర్యాలు వాడుకోవడం... పక్కవాడి పెన్నే వాడుకోవద్దని చెప్పేవారు మాకు చిన్నప్పుడు. నీ పెన్ను ఇస్తావా అని పక్కవాడిని అడక్కురా అని చెప్పేవారు అనంతపూరులో ఒక మాస్టారు. ఏ రోగమా, నీ పెన్ను నువ్వు తెచ్చుకోవచ్చుగా అనేవాడు. ఇప్పుడు పెన్ను మర్చిపోయి, పక్కవాడి జేబులో పెన్ను తీసుకుని, వాడి పెన్ను పాడుచెయ్యడమే కదా!

ఎందుకివన్నీ చెప్తున్నానంటే, ధీరత్వం అనేటటువంటిది నిత్య జీవితంలో ఎప్పటికప్పుడు మనం గమనించుకుంటూ ఉండాలి. అంటే, కొన్నిటికి మనం లొంగి పోతున్నమేమో మనం చూసుకోవాలి. సుఖానికి చాలా సులభంగా లొంగి పోతాము. కాబట్టే, కష్టం వస్తే భరించలేక చచ్చిపోతాం భయమేసి. అలాంటి సుఖాలు ఎందుకు నేర్చుకోవాలి? ఉండనియ్యి. జనకుడు అదే చెప్తాడు. జనకుడు హంసతూలికా తల్పం మీద పడుకున్నటువంటి వాడు, అరణ్యంలో బండనేల మీద కూడా పడుకోగలడు. అందుకనే, ఈ జనకుడు మనకు ఉదాహరణ, యోగి. అటువంటి పరిస్థితి ధీరులకుంటుంది కదా, నీవు ధీరుడవు కదా అని చెప్పాడు.

అంచేత, "నా తనూజ పిన్న అయినా ధైర్యంలో పెద్దలకన్నా మిన్న". మా అమ్మాయి వయసులో చిన్నదే అయినా, ఈ విషయంలో ధైర్యంలో... ఎందుకంటే, తనకన్నా ధైర్యం చూపించినటువంటిది తన కుమార్తె కదా, అతనిని

పెళ్లి చేసుకుంటానని చెప్పి. "పెద్దల కన్నా మిన్న. అవన్నీ కాక, వియ్యమందవలెనన్న ఆశతో ఎంతో భ్రమపడి నీ సాన్నిధ్యం చేరుకున్నాను. ఇట్టి నా ప్రార్థన తిరస్కార న్యాయమేనా? కరుణించి నా మనోరథం నేరవేర్చవలసింది" అన్నాడు. అదేంటయ్యా, నా అంతటి వాడొచ్చి మాట్లాడితే అట్లా మాట్లాడుతావు అనలేదు కదా! నీకా రాజ్యం లేదు, పడున్నావు అరణ్యంలో, పిల్లనిస్తానంటే ఏంటి నీలుగుతున్నావు అన్నట్టుగా మాట్లాడలేదు కదా! "సాల్వపతి ఆ ప్రార్థనకి అంగీకరించి, స్వకీయ ఆశ్రమ వాసులైన మునీంద్రులతో కలిసి శుభలగ్న వేళలో సావిత్రిసత్యవంతుల పరిణయం యధావిధిగా నిర్వర్తించాడు. అశ్వపతి కుమార్తెకి, అల్లునకు వేరువేరు ఆభరణాలు సగౌరవంగా బహూకరించి, బంధువులను వీడ్కొని, పరివార సహితుడై స్వకీయ రాజధానికి తరలిపోయాడు." పెళ్లి చేసేసాడు. అల్లుడికి, పిల్లకి ఇవ్వాలిసిన ఆభరణాలు ఇచ్చేసాడు. వైభవోపేతంగా పెళ్లి చేసేసాడు. ఎందుకంటే, అన్నీ తెచ్చుకొచ్చాడు అరణ్యంలోకి. ఆ నమ్మకం ఉంది పెళ్లి చెయ్యగలమని, ఒప్పుకుంటాడని. ఏకంగా పెళ్ళి సంబరాలతో వచ్చేసాడండి. చెప్పడం, పెళ్లి చేసెయ్యడం కూడా అయిపోయింది.

"అటు పిమ్మట సావిత్రి మిక్కిలి మనోజ్ఞములైన అలంకారాలు, వాసనాలు పరిత్యజించి..." పుట్టింటి వారిచ్చారని ఊరికే పెట్టుకుని తిరుగుతూ ఉంటే బావుండదు కదా! ఒక్కటి తెలుసుకోవాలి ఆడవాళ్ళు, పుట్టింటి గొప్పలు మెట్టింట్లో మాట్లాడకూడదు. గొప్పవాళ్ళు అయి ఉండొచ్చు. మెట్టింటి గొప్పలు పుట్టింట్లో మాట్లాడాలి. అది సంస్కృతి. అంతే గానీ అత్తవారింట్లో సమాచారం అక్కర్లేనిదంతా పుట్టింటికి చేరవేసుకుంటూ, పుట్టింటి గొప్పలు అత్తవారింట్లో చెప్పుకుంటున్నారంటే, కాపురం కొల్లేరయిపోతుంది. నీ సంస్కారంలో భాగం అది. మా అమ్మానాన్నా అని, మా అమ్మానాన్నా అంతటి వాళ్ళు, ఇంతటి వాళ్ళని మాట్లాడకూడదు. అయి ఉండొచ్చు. ఇప్పుడు నువ్వు వెళ్లి ఇంకో ఇంట్లో చేరితే నువ్వు ఆ ఇంట్లో భాగమైపోయినట్టే. అంటు కట్టినట్టే. ఒక ఉపనది ఒక నది చేరినట్టే. ఆ గోత్రమే నీకు అన్వయిస్తుంది. ఆ ఇల్లే నీ ఇల్లు. నువ్వు 'ఆడ' పిల్లవి కదా, అక్కడికి చేరావు అని తెలియాలి. తెలిస్తే, చక్కగా దాన్ని దిద్దుకోవడం జరుగుతుంది ఇల్లు. చక్కదిద్దుకోవాలి. తన వెళ్ళిన వేళావిశేషం చేత ఆ ఇంటికి శోభ రావాలి, ఆ ఇంట్లో ఎక్కువ వృద్ధి రావాలి. దానికి తగ్గ కృషి తను చేస్తూ ఉండాలి. ఆ విధంగా దైవాన్ని ఆరాధన చేస్తూ ఉండాలి. అందరూ బావుండాలి, అత్తవారింట్లో అందరూ బావుండాలి, పుట్టింట్లో అందరూ బావుండాలి. అది స్త్రీ కోరుకోవలసినటువంటిది.

ప్రత్యేకించి పతికి అన్ని విధములైనటువంటి అనుకూల్యము కలిగేటట్టుగా సతి ప్రార్థనలు చెయ్యాలి. ఎంచేత అంటే శక్తి స్వరూపిణి స్త్రీ. అంచేత, స్త్రీ శక్తి వలెనే పురుషుడు పెరుగుతూ ఉంటాడు. స్త్రీ సాన్నిధ్యం లేకపోతే యోగమే జరగదు తెలుసా! అందుకనే, మాస్టరు CVVగారు నా యోగంలో ప్రవేశించాలంటే తప్పక వివాహిత లేక వివాహితుడు అయ్యుండాలని చెప్పారు. జాతకంలో వివాహం కుదరదని అనేటటువంటి వాళ్ళకి కూడా నేను కుదురుస్తాను అని చెప్పారు. నాకు పెళ్లి కాదని తిరుగుతున్న జ్యోతిష్యుడికి కూడా పెళ్ళయిపోయింది మా ఊళ్ళో. నాకు పెళ్లి కాదని తిరుగుతూ ఉండేవాడు. ఎందుకంటే, నా జాతకం నాకు తెలుసు కదా నాకు పెళ్లి కాదు అంటుండేవాడు. అలాంటివాడు పెళ్లి చేసుకోవలసి వచ్చింది, చేసేసుకున్నాడు. అంచేత, యోగానికి స్త్రీ, పురుష శక్తి సమ్మేళనమే కదా! స్త్రీ, పురుష ప్రజ్ఞలు చక్కగా సమన్వయింపబడినప్పుడు యోగం సిద్ధిస్తుంది. అంచేత, స్త్రీ, పురుషునికి చాలా సహాయకారి.

అందుకని కదా చెప్తుంటాము, ప్రతి పురుషుని విజయానికి వెనకాల ఒక స్త్రీ ఉంటుంది అంటాం. ఎంచేత, శక్తి అంతా అదే. పురుషుని శక్తికి స్త్రీ శక్తి తోడయితే చాలా మహత్కార్యాలు సాధించవచ్చు. స్త్రీ వ్యతిరేకమయితే వీడు బలహీనుడవుతాడు. ఇప్పుడీ కథలో స్త్రీ శక్తి మహత్తరమైనటువంటి శక్తి. అతడు అల్పాయిష్కుడైనప్పటికి కూడా దాన్ని కూడా జయించగలిగినటువంటి శక్తి ఇక్కడ తోడవుతోంది.

ఈమె రాంగానే ఏం చేసింది? పుట్టింటి వారిచ్చినటువంటి ఆభరణాలన్నీ తీసేసింది. పుట్టింటి వారిచ్చిన పట్టు చీరలన్నీ లోపల పెట్టేసింది. ఎందుకంటే, అత్తవారు అలా నార చీరలు కట్టుకుంటే నువ్వు జరీ చీరలు కట్టుకుంటే ఏం బావుంటుంది? అత్తగారికి ముక్కు పుడకలు లేవు, నువ్వు రవ్వల ముక్కు పుడకలు పెట్టుకుంటూ ఉంటే? మా అమ్మావాళ్ళు ఇచ్చారని రవ్వల దిద్దులు పెట్టుకుని తిరుగుతున్నావనుకో, అత్తగారికి అసలు దిద్దులే లేవు, ఎట్లా ఉంటుంది? అంటే, అట్లా తీసేయ్యడంలో ఏం కనిపిస్తోంది? సంస్కారము కనిపిస్తోంది. పెట్టుకుని తిరిగితే అత్తవారు ఏడుస్తుందని కాదు. ఏడవొచ్చు, మామూలు అత్తవారయితే ఏడుస్తుంది. ఈ అత్తగారు ఏడవదు. అదేంటమ్మా తీసేసావు నువ్వు పెట్టుకోవచ్చు కదా అంటుంది. అయినప్పటికీ తెసేయ్యాలి. అట్లా తీసేసింది. అన్నీ తీసేసి పక్కన పెట్టేసింది. ఎందుకు? వాళ్ళెలా ఉన్నారో వాళ్ళతో పాటు నేను అలాగే ఉంటాను. అది కదా integration మార్గం! నువ్వు ఏ ఊరు... నువ్వు ఎవరింటికయినా వెళ్తే వాళ్లతో సమానంగా నువ్వు ఉండాలి. మాములు మనుషులం కూడా! ఇప్పుడు నువ్వు ఇంట్లో నువ్వు కూర్చునట్టుగా రెండు కుర్చీలు, పడుకునేటట్టు మంచం వాడు వెయ్యలేదు కదా! నువ్వు పెట్టుకున్నటువంటి AC నువ్వు వారింటికి వెళ్ళినప్పుడు వారింటిలో వారు ఉన్న పరిస్థితులకు నువ్వు adjust అయిపోవాలి. అది యోగం.

అంచేత, ఆవిడ ఆ విధంగా పక్కన పెట్టేసింది. పెట్టేసి, "పరిత్యజించి, కాననవాస యోగ్యములైన వల్క లాజనలే ధరించి, అత్తమామలతో పాటు, భర్తకి ఎంతో భక్తితో పరిచర్యలు ఆచరించినది." ముగ్గురికీ. She took upon herself serving the three. అత్తమామలతో పాటు భర్తని. ఎలా రాసారు ఇక్కడ? అత్తమామలతో పాటు భర్త. ముందు నా మొగుడనుకోకూడదు. నీ మొగుడిని కని, పెంచి, పెద్ద చేసిన వాళ్ళు నీకు ముందు ముఖ్యం. అదీ భారత ధర్మంలో చెప్పేది. ముందు నా మొగుడనుకోకూడదు. ముందు, నా మొగుడు పుట్టడానికి ఆధారభూతులైన వాళ్ళు, వాడు ఆ విధమైనటువంటి స్థితిగతులు, సంస్కారము ఏర్పాటు చేసుకోడానికి వెనకాల వెన్నుబలంగా ఉన్నవాళ్ళు, వాళ్ళని గౌరవించి, భర్తని గౌరవించమంటారు. ఇలాంటివి ఇప్పుడు చెప్తే విసుగ్గా ఉంటుంది చాలామందికి. ఎందుకంటే ఇలా చెయ్యడంలో మన సంస్కారాలు పెరుగుతాయని తెలియదు. ఎందుకు చెయ్యాలండి మేము అనుకోకండి. ఎందుకు చెయ్యాలంటే చెయ్యడం వల్ల మీకు అహంకారం తగ్గుతుంది, సంస్కారం పెరుగుతుంది. ఎంత సేవ ఒకరికొకరు చేసుకుంటూ ఉంటే మనలో అంత అహంకారం తగ్గి, అంత సంస్కారం పెరుగుతుంది. అహంకారం పెరిగిన కొద్దీ సంస్కారం తగ్గిపోతూ ఉంటుంది. అత్తగారు, మామగారు వస్తే కాలు మీద కాలు వేసుకుని, కాలు ఆడిస్తూ కూర్చోవచ్చు, కుర్చీలోంచి లేవకుండా. ఓహో మంచి సంస్కారంలో పెరిగింది ఈ పిల్ల అనుకుంటారు కదా! వచ్చిన పిల్ల పుట్టింటి

సంస్కారాలని కదా తెచ్చుకుని వస్తుంది. మరి ఆ పుట్టింటి సంస్కారాలు, మంచి సంస్కారాలు అని ప్రశంసించేటట్టుగా తన ప్రవర్తన ఉండాలి.

అంచేత, ఈమె ఆ విధంగా ముందు అత్తమామలకు సేవలు చేసి, అటుపైన భర్తకి సేవ చేస్తూ, "వారు ఆ రాజకుమారి భక్తి సేవలకు ఆమంద ఆనంద భరితులైనారు. ఆ విధంగా నాలుగు దివసాలు కొరతగా ఒక సంవత్సరం గడిచి పోయింది." ఒక సంవత్సరం పాటు అట్లా సాగిందండి. అంటే, వెళ్గం వెళ్గం పదహారు రోజుల పండగ లోపలే ఈమె ఆ ఇంట్లో కలిసిపోయింది. తెలుసా? అలా కలిసిపోవాలి. అంటే, జ్ఞానము అక్కడ ఉన్నది. ఒక ఉపనది ఒక నదిలో కలిసినప్పుడు, మీరు ఎప్పుడయినా చూసారో లేదో, ఎప్పుడయినా నదిలో ప్రయాణం చేస్తే తెలుస్తుంది. ఒక ఉపనది ఒక నదిలో కలిసినప్పుడు ఆ కలిసిన చోట కొంత అలజడిగా ఉంటుంది నదికి. ఎందుకంటే ఒక ప్రజ్ఞ వచ్చి ఇంకో ప్రజ్ఞలో కలుస్తోంది. ఒక చైతన్య స్రవంతి వచ్చి ఉన్న చైతన్య స్రవంతిలో కలుస్తూ ఉంటుంది. కలిసిప్పుడు కొంత అలజడి వస్తుంది. అట్లాగే, ఇంట్లో ఒక పిల్లవాడో, పిల్లో పుట్టినప్పుడు ఇంకొక స్రవంతి వచ్చి అక్కడ చేరుతుంది. కొంత అలజడి ఉంటుంది, మళ్ళీ సర్దుబాటు అవుతుంది. కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత సర్దుబాటు అవుతుంది. మనం వ్యాపారాలు చేసుకుంటున్నా అంతే. ఓ పార్టనర్ వస్తే కొంత అలజడి, మళ్ళీ సర్దుబాటు. ఇంకో పార్టనర్ వస్తే కొంత అలజడి, సర్దుబాటు. అట్లాగే group living. బృందాలు బృందాలుగా ఇరవై మంది ఒక చోట కలిసుంటున్నారుట అంటే ఎన్ని adjustments చేసుకోకపోతే ఉండగలరు? ఒంటిలింగ రామలింగంగా ఉండేవారు నలుగురితో కలిసి ఉండలేరు. ఎందుకంటే ego problems కదా! నలుగురితో కలిసి ఉండడం కదా ఇప్పుడు గురుపూజలు. నలుగురితో కలిసి తినడం, కలిసి ఉడడం, కలిసి పడుకోవడం.

మొన్నో కుర్రాడు అడిగాడు నన్ను, మాస్టరుగారు, ఇదివరకూ మేమంతా ఒకే చోట కలిసి నేలమీద చాపేసుకుని పడుకునే వాళ్ళం, ఇప్పుడు ఎవరెవరం వాళ్ళ వాళ్ళ bedrooms లో పడుకుంటుంన్నాం, ఏం బాగుపడుతున్నట్టేనా అని అడిగాడు. నిజమే కదా! మొన్న సాయంత్రం! అతనేం చిన్న కుర్రాడు కాదు ఇప్పుడు. He is an IIT candidate, doing an excellent job, very well settled in life. But, ఆ భావాలు ఉండిపోయినాయి. అంటే spirit లో కలిసి ఉంటే చాలా మాన్యం. నీ spirit, స్ఫూర్తి ఎలా ఉందో చూసుకో. నీకు పెళ్ళయింది మరి, నీ స్నేహితులకి పెళ్ళయింది. వాళ్ళకీ భార్యలు, పిల్లలూ వచ్చారు. నీకు భార్య, పిల్లలు వచ్చారు. అంచేత, అలా పడుకోవడానికి అవకాశం అంతగా లేదు. అంతమాత్రం చేత, స్ఫూర్తి తగ్గిందేమో చూసుకో అని. అంటే, ఇవాళ్ళ పడుకోవాలిసివస్తే మీరందరూ, ఆ మగ పిల్లలందరూ కలిసి ఒక చాప మీద పడుకోగలరా? పడుకోగలగాలి.

అంచేత, ఇలా ఇమిడి పోవాలి. ఎక్కడ ఇమిడి పోవడం వస్తుందో అక్కడ అహంకారం తగ్గుతుంది. వేరువేరుగా ఉండడంలో అహంకారం పెరిగే అవకాశం ఉంటుంది. గుర్తు పెట్టుకోండి. ఎంతసేపటికీ వేర్పాటు ధోరణి ఇప్పుడు ఎక్కువ కదా! పెళ్ళ అవంగానే మొగిడితో మనం వేరుగా వెళ్ళిపోదామా అని అమ్మాయికి అనిపించొచ్చు, అబ్బాయికి అనిపించొచ్చు కదా! అంటే, పెద్దవాళ్ళకే nuisanse అనిపించొచ్చు. అదొకటి తమాషా. కొంతమంది

పెద్దవాళ్ళు, కోడలు రాగానే మేము ఇంకో ఇంట్లో ఉంటాంరా అంటుంది అత్తగారు. అదేంటమ్మా అంటే, లేదులే మాకూ బావుంటుంది, మీకూ బావుంటుంది. అదేంటది? అట్లా ఎట్లా బావుటుంది? కలిసుంటే బావుటుంది. కలిసి ఉంటే కలదు సుఖం. కాని ఆ సుఖం తెలియాలి. తెలియకపోతే అన్నీ కష్టాలే. ఆ పాట బాగా రాసారు. తెలిసిన వాళ్ళే రాస్తారు ఇవన్నీ కూడా ఇదివరకూ. పొరపాటులుండవు కదా! అంచేత, విడిపోతే తీరని దుఃఖం. ప్రజ్ఞలు కలిస్తే ఎంత ఆనందమో, అంత విడివిడిగా ఏడుస్తూ ఉంటే దరిద్రపుగొట్టు జీవితాల్లా ఉంటాయి ఎంత ఉన్నా. నీ ఇంటికి ఎవరూ రారు, నువ్వు ఎవరి ఇంటికి వెళ్ళవు. ఏమిటి నీ ఆనందం? నీ ఇంటికి ఎవరూ రారు. పది మంది వస్తూ ఉండాలి మన ఇంటికి. పది మంది ఇళ్ళకి మనం వెళ్తూ ఉండాలి. అప్పుడు కదా ఆనందం! ఆ ఆనందం తెలియని వాడు అట్లా కట్టేసుకుంటాడు పిచ్చుక గూడు తయారు చేసుకుని. అందులోనే బితుకు బితుకుమని బతుకుతూ ఉంటారు. అలా జరగకూడదు. వీలున్నంత మందిని కలుపుకోవాలి. మన ఇల్లు అందరి ఇల్లు అవ్వాలి. అప్పుడు అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవుతాయి. అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవ్వాలని అనుకోకూడదు. ముందు మన ఇల్లు అందరి ఇల్లు అవుతే, అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవుతాయి. అట్లా ఎన్ని ఇళ్ళు ఉంటాయో నీకు అప్పుడు. నీకు ఎక్కడికి పోయినా ఇళ్ళు ఉంటాయి, నువ్వు హోటల్లో ఉండక్కర్లేదు. ఏ దేశమెళ్ళినా హోటల్లో ఉండక్కర్లేదు, ఏ రాష్ట్రమెళ్ళినా హోటల్లో ఉండక్కర్లేదు, ఏ ఊరు వెళ్ళినా హోటల్లో ఉండక్కర్లేదు. ఎందుకూ? అక్కడ నీకు, నీ ఇంట్లోలానే నీకు ఆప్యాయత ఉంటుంది. మరి మనం అందరి ఇళ్ళకి వెళ్ళి, మన ఇంటికి ఎవరూ రాకుండా చూసుకున్నామనుకోండి. అదో తెలివి! ప్రతివారి ఇంటికి వెళ్ళి వాళ్ళిళ్ళల్లో ఉడడం, వాళ్ళిళ్ళలో తినడం, వాళ్ళ కార్లు వాడుకోవడం. మన ఇంటికి వాళ్ళని పిలుస్తున్నామా, మన ఇంటిలో వాళ్ళకి భోజనం పెడుతున్నామా, మన ఇంటికి వస్తే మన కారు ఇస్తున్నామా? ముందు నీతో మొదలు పెట్టాలి. పిలిచిన ప్రతిచోటికి తగుదునమ్మా అని పోయి వాళ్ళిళ్ళలో మనం ఉండకూడదు. ఎందుకుండ కూడదు? వాళ్ళని మన ఇంటికి పిలిచి మన ఇంట్లో ఉంచుకున్నమా ఆలోచించాలి. ఆలోచించు. ఎప్పుడూ మనతో start అవ్వాలి. అంచేత, ఆ విధంగా కలిసిపోవడం... సహజీవనం, సహజీవనం అని ఊరికే అది concept గా ఎక్కడో పుస్తకాల్లో ఉండకూడదు. జీవితంలో ఉండాలి. కలవాలి. కలిసుండాలి. ఏమి శరీరానికే కదా కొంత అసౌకర్యం? ఉంటే ఉంటుంది. ఎదుటి మనిషి ముఖ్యమా, నీ శరీర సౌఖ్యము ముఖ్యామా? ఇష్టమైతే కష్టం ఉండదు. తెలుసా? ఇష్టమైతే కష్టం ఉండదు. ఇష్టం లేకపోతే అన్నీ కష్టాలే. మరి ఇలాంటివి చెప్పుకోవాలి. ఎందుకంటే, ఊరికే పుస్తకం చదివేసుకుంటే ఏముంది అయిపోతుంది!

అంచేత, వచ్చేసింది! సంవత్సరం అయిపోయే సరికి ఆ పిల్ల మళ్ళీ పుట్టింటి గురించి ఆలోచించలేదు. ఇప్పుడు చూడండి, పొద్దున్నా, మధ్యాహ్నం, రాత్రి ఓ ఫోన్లు, ఫోన్లు, ఫోన్లు. ఇంట్లో పనులు మర్చిపోతూ ఫోన్లు! ఎవరికంటే, మా చెల్లిలికి. ఎవరికంటే, మా అన్నయ్యకి. ఎవరికంటే, మా అమ్మకి. ఎవరికంటే, మా నాన్నకి. ఇట్లానే ఉంటుంది ఓ చెవికి. ఈ నేర్చుకున్నారు, ఈ చెవికి ఈ భుజం ఆన్చేసి రెండు చేతులతో పని చేస్తుంటారు కదా! అదేంటండి? నువ్వు ఇక్కడున్నావా? అక్కడున్నావా? ఇక్కడ పనులు మర్చిపోతూ అక్కడ ఏ కూర వండుకున్నారు, అక్కడ ఈ రోజు ఉప్పు తక్కువయిందా, అక్కడ పప్పు తక్కువయిందా? ఎంత abuse ఈ mobile phones! అందుకనే ఇండియాలో సెల్

ఫోన్ కంపనీలు అన్నీ సక్సెసే. మిగతా దేశాల్లో ఇంత సక్సెస్ లేదు సెల్ ఫోన్లకి. మనకి అనిపిస్తుంది ఆ దేశాలు వెళ్ళినప్పుడు, ఏమిటి అత్యవసరం అయినప్పుడు తప్ప ఫోన్లు తియ్యరని. మనం మాటిమాటికి ఫోన్లు. Train ఎక్కంగానే ఫోను, ఆ ఎక్కాం, కూర్చున్నాం అని ఫోను. ఏదీ బయలుదేరిన చోటుకి, బయలుదేరే చోటికి. ఆ తిన్నాం, పడుకున్నాం, మళ్ళీ ఫోను కదా! మళ్ళీ చేరబోతుంటే ఫోను, చేరుతుంటే ఫోను. ఏ ప్లాట్ఫారం ఫోను. ఎందుకండీ? ఇదివరకూ ఉన్నాయా? మాటిమాటికి ఎందుకు ఫోను? చూడండి ఎలా అయిపోతోందో? ప్రతి దానికీ ఫోను. అంచేత, ఇక్కడ ఉంటాం, అక్కడా ఉంటాం, పెద్ద యోగుల్లాగా తయారయ్యాం. యోగి ఇక్కడ ఉంటాడు గానీ సమాధి స్థితిలో ఎక్కడో మంచి పనులు చేసి వస్తుంటాడట. మనం ఇక్కడ ఉంటాం గానీ, అక్కడక్కడడా... ఎదురుగుండా ఉన్నవాడితో మాట్లాడం. ఈ ఫోను తీసుకుని మాట్లాడుతూ ఉంటాడు. ప్రతి ఇంట్లో కూడా జరిగేది అదే. అందరికి ఫోన్లు ఉంటాయి. ప్రతి వాడూ ఎవడితోనో ఫోన్లో మాట్లాడుతూ ఉంటాడు. వాళ్ళందరూ ఇక్కడ లేరు ఆ ఇంట్లో, శాల్తీలు ఉన్నాయి అక్కడ అంతే కదా! శాల్తీలు ఇంట్లో ఉన్నాయి, ఒకడితో ఒకడు మాట్లాడడానికి time ఉండదు. కాస్త ఆ వస్తువు ఎక్కడుందోయ్ అనడుగుదాం అంటే ఎప్పుడూ ఫోన్లో ఉంటుంది. ఏమడగుదామన్నా ఆవిడ ఫోన్లో ఉండి, వాడూ ఫోన్లో ఉండి, కోడలూ ఫోన్లోనే ఉండి, అందరూ ఫోన్లోనే ఉన్నరనుకోండి, ఇహ ఏం చేస్తావు? నీవు కూడా కోపం వచ్చి, ఓ ఫోను తీసుకుని ఎవరితోనైనా మాట్లాడేస్తూ ఉండాలి. అంతేగా! అంటే, వాళ్ళడిగినప్పుడల్లా మనం ఓ ఫోను పట్టుకోవాలి. చాలా అసభ్యంగా తయారవుతోంది. అంటే, common sense పోతోంది. అంతలా ఉంది మన ఫోను working.

అదలా ఉండగా, సంవత్సరం పాటు ఆవిడకి పుట్టింటి భావనే లేదు. వాళ్ళూ మాటిమాటికి రాలేదు కదా! మధ్యమధ్యలో వచ్చి చూడొద్దండి అమ్మాయి ఎట్లా ఉందో? ఇచ్చేసిన తర్వాత కొన్నాళ్ళు బావుంటుందని. అదీ పట్టువిడుపులని చెప్పానే మొదటి రోజు, అలా ఉండాలి. మాటిమాటికి అక్కడ నుంచి ఫోను. అక్కడి నుంచి అత్తగారు మాటిమాటికి ఫోను చేస్తోందనుకోండి, ఇక్కడ ఈ అమ్మాయిని distrub చేస్తున్నట్టే కదా! చెయ్యకూడదు. ఏమిటండి ఇట్లా మాట్లాడుతారు, చాలా unsocial గా ఉన్నారు మీరు అనుకోకండి. ఏం లేదు, మీరు చెయ్యవలసిన పనులు మర్చిపోతారు. ఏం సందేహం లేదు. అసలు ఎక్కువ మాట్లాడేవాడు అసలు పనులు మరచిపోతాడనేది ఒక శాస్త్ర ధర్మం. " కూసే గాడిద మేసే గాడిదని చెరుస్తుంది" అని సామెత ఉంది కదా! ఊరికే మాటలు చెప్పేవాడు పని చేసేవాడిని పాడు చేస్తాడు. వాడిని ఏ పని చేసుకోనీయడు కదా!

అంచేత, అలా కాకుండా ఈవిడ వచ్చేసిందండి. మనం కథకి వచ్చేసాం. అంటే climax కి వచ్చేసాం. ఇంక నాలుగు రోజులుందండి కథ. నాలుగు రోజుల మందు. అది ఎప్పుడట అంటే ఇందులో చెప్తారు. జ్యేష్ఠ మాసం చివరి రోజుల్లో, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్య. సావిత్రిదేవి ఇంకో నాలుగు రోజుల్లో అమావాస్య అవుతుందన్న సందర్భంలో ఆమె ఇంట్లో అత్తమామలకి చెప్పింది నేను ఒక మూడు రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉంటాను అని. దేనికమ్మా? ఉంటాను, నాకలా చెయ్యాలని అనిపిస్తోంది. ఎందుకో తనకి తెలుసు. వీళ్ళకి తెలియదు పిల్లవాడు వెళ్లిపోతాడని. ఈవిడకెలా తెలిసింది? నారద మహర్షి వలన తెలిసింది. ప్రపంచం అంతా తెలియదు సంవత్సరంలో

సత్యవంతుడు వెళ్లిపోతాడని. మనందరం సినిమా చూడడం వల్ల తెలిసింది. ఎందుకంటే భారతం చదువుకున్న వాళ్ళం కాదు కదా! అక్కడ ఎవరికి తెలుసు? అశ్వపతికి తెలుసు, ఆయన భార్యకి తెలుసు, సావిత్రికి తెలుసు. సంవత్సరంలో అల్లుడు వెళ్లిపోతాడని, ఆమె తల్లితండ్రులకి తెలుసు. సంవత్సరంలో తన భర్త మరణిస్తాడు అన్న విషయం సావిత్రిదేవికి తెలుసు. ఎందుకని? చెప్పింది దేవర్షి. ఋషి వాక్యం అమోఘం. జరిగి తీరుతుంది.

అంచేత, ఆ విధంగా తెలిసి ఉంటం చేత ఉపవసించడానికి సిద్ధ పడ్డది. "నాలగవ నాడు భర్త మృతి దినమని గుర్తురెగిన సావిత్రి అత్యంత కఠోర నిష్ఠతో త్రిరాత్రోపవాసం ప్రారంభించినది". త్రిరాత్రోపవాసం అంటే పగలు, రాత్రి నిద్ర పోలేదు. ఉపవాసం అంటే ఏమిటంటే సావిత్రిదేవితో తాను అనుసంధానం చెంది మూడు రోజులుంటుందండి. సావిత్రిదేవంటే మన సూర్యుడికే మూలము. ఆ వెలుగు. ఏ వెలుగునయితే మనం గాయత్రి ద్వారా ఆరాధన చేస్తున్నామో ఆ వెలుగుతో అనుసంధానం చెంది మూడు పగళ్ళు, మూడు రాత్రులు ఉంది. ఎంత పరిపూర్ణంగా అనుసంధానం చెందిందంటే ఆహారం వంటివన్నీ కూడా అవసరం లేనంత అనుసంధానం చెందింది. భక్తి తన్మయత్వము కనుక ఉంటే ఆహారం మీదకి మనసు వెళ్ళదు. అది ఒక సత్యము ఉన్నది. నీకు భక్తిలో ఒక విధమైనటువంటి తన్మయత్వము ఏర్పడితే నీ శరీరం నీకు సహకరించడం మొదలు పెడుతుంది. అది ఆకలి, ఆకలి, ఆకలి అనదు. దప్పిక, దప్పిక, దప్పిక అనదు. కాస్తోకూస్తో సాధన చేసిన వాళ్ళకి ఆకలి, దాహం అంత ఉండవు. మాటిమాటికి అట్లా bottles నీళ్ళు తాగేస్తూ ఉండరు. దాహం అని శరీరం చెప్పినప్పుడు తాగుతారు. నాలుగు లీటర్లు తాగాలి కదండి అనేది వాడికి వర్తించదు. అలా కూర్చుని నీళ్ళు తాగుతూ ఉండదు. మాటిమాటికి అవీ ఇవీ తింటూ ఉండదు. మాములుగానే అటువంటి వాడు ఏదయినా ఒక దీక్షలో ఉంటే అతని శరీరం ఇంకా సహకరిస్తుంది. ఎంత సహకరిస్తుందంటే అసలు ఆకలి అనిపించదు. దాహం అనిపించదు. ఎంచేత? ప్రజ్ఞ దైవమునందు లగ్నమై ఉండడం చేత. పాట ఉంది కదా, "ఆకలుండదు, దాహముండదు నిన్ను చూస్తుంటే" అని ఉంది కదా! ఆ నిన్ను' వాడనుకుంటే అది భక్తి పాటే కదా! నిన్ను చూస్తుంటే నాకు ఆకలి వెయ్యడం లేదు, నాకు దాహం వెయ్యట్లేదు, నీతోనే ఉండాలనిపిస్తోంది అనేటటువంటిది ప్రేమభక్తి, దివ్యభక్తి. అమితమైనటువంటి భక్తి ఉన్నచోట, ప్రేమ ఉన్నచోట, దీక్ష ఉన్నచోట, అట్లా ఉంటుంది. మహత్తర కార్యాలు సాధించేవాళ్ళు మాటిమాటికి breakfast ఎక్కడ దొరుకుతుందో చూసుకోరు. హనుమంతుడు నూరు యోజనాలు సముద్రం ఎగరాలి అని బాగా గాలి పీల్చి, మూడుసార్లు, వదిలితే మహేంద్ర పర్వతమే గడగడలాడి పోయింది. అంత స్ఫూర్తితో బయలుదేరంగానే ఒకడు breakfast చేస్తావా అని అడిగాడు. అది చూడండి! మైనాకుడనే పర్వతం, కాస్త దిగి breakfast... పెద్ద పని మీద వెళ్తుంటే ఓ దోశ తిని వెళ్తావా? మనసంతా చెయ్యవలసిన పని మీదన్నప్పుడు అసలు దోశలు, పూరీలు, అప్పడాలు అంటూ కూర్చుంటే, ఇహ వీడేం చేస్తాడండి పని? చేస్తాడా? అంచేత, నువ్వు సాధించవలసినది మహత్కార్యమైనప్పుడు నీ మనసేంద్రియ శరీరములు మూడూ కూడా దానికి ఉమ్ముఖమై ఉండడం చేత దేహము తన అవసరాలని కోరదు. నీకు అలాంటి స్ఫూర్తి ఉంటే. లేకపోతే ఎప్పుడూ ఇవే, ఏం తిందామని. నాక్కూడా అంతే, ఏ పని లేకపోతే ఏమయినా తిందాం అనిపిస్తుంది. పని లేకపోతే శరీరం నా పని చెయ్యి, నీకు పని లేదు కదా, నా పనైనా చెయ్యి అంటుంది. పనున్నప్పుడు ఏం అడగదు. పనుంటే ఏం అడగదు. ఇట్లా కూర్చుని మంచి

నీళ్ళు తాగడం ఉండదు. అలా మనకి ఉత్తమోత్తమమైన భక్తులకి, వాళ్ళు నిజంగా ఉపవాసం. అంటే, దైవానికి దగ్గరగా కూర్చోడం చేత వారి మనస్సు, ఇంద్రియములు, శరీరము పూర్తిగా సహకరించి ఉంటాయి. అనుసంధానం చెంది ఉంటాయి. బుద్ధిలోకంలో ఉండి దైవలోకంతో అనుసంధానం చెంది ఉంటారు.

అంచేత, ఆవిడ ఆ విధంగా మూడు రాత్రులు మంచినీళ్ళు కూడా తాగలేదండి. నిర్జలం. నిద్ర పోలేదండి. జాగరణ. అలా చేసింది. "ద్యుమత్సేనుడది గమనించి ఎంతో ఆశ్చర్యపడి, కోడలిని తన సన్నిధికి ఆహ్వానించి, అమ్మా! ఇంతటి దుష్కరవ్రత నిష్ఠని ఆవలింబిస్తున్నావే దీనికి ఏమి కారణము అని అడిగాడు". మామగారు అడిగాడు. మరి నిద్ర పోవడం లేదు, అన్నం తినడం లేదు, మంచినీళ్ళు తాగడం లేదు, అలా అని పనులు మానేయ్యలేదు. Daily routine అంతా చేస్తోంది. "మద్రరాజ తనయ ఆ ప్రశ్నపై అత్యంత వినయంతో కనుదోయ అల్లన వాల్చి..." పెద్దవాళ్ళ ముందు చిన్నవాళ్ళు, అందులోనూ ఆడవారు, కన్నుల్లోకి చూచి మాట్లాడరు. లక్ష్మణుడు ఎప్పుడూ సీతాదేవి కన్నుల్లోకి చూడలేదుట. ఎప్పుడూ పాదాలు చూసే మాట్లాడేవాడట. అందుకనే ఆవిడ కంఠాభరణాలు అక్కడ ఋష్యమూక పర్వతం మీద పడిపోతే, అవి వాళ్ళు తెచ్చి చూపిస్తే రాముడు గుర్తించి, చూసావా లక్ష్మణా ఇవి మీ వదినవే కదా అంటే, నాకేం తెలుసంటాడు. నాకేం తెలుసు అన్నయ్యా, నాకు వదినగారి పాదాల దగ్గరుండే ఆభరణాలు తప్ప ఇకపై ఆభరణాలు నాకు తెలియవు అంటాడు. ఇహ కన్నుల్లోకి చూడడం అనేటటువంటిది, పెద్దవారి కన్నుల్లోకి చూడడం అనేటటువంటిది స్త్రీలు చెయ్యరు. అదో సంస్కారం. పురుషులు కూడా పెద్దవాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు కొంచెం తల దించే మాట్లాడుతారు. తల ఎత్తి మాట్లాడరు. ఇలాంటి సంస్కారాలు మనలో వినయం పెంచుతాయి. అవతల వాళ్ళకి అవి అవసరం కాదు. ఇప్పుడు ఈమె కళ్ళలోకి చూసి మాట్లాడితే మావగారు ఏం అనుకోదు, కాని తన సంస్కారానికి అది మంచిది. ఎప్పటికప్పుడు అహంకారం పెరుగుతూ ఉంటుంది. అది తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యడంలోనే సాధనంతా ఉంది. అహంకారంతో సాధన జరగదు.

అంచేత, "నేను ఇంతటి దుష్కర వ్రత భారం స్వీకరించానన్న ఆందోళన మీకు అనావశ్యకము". మీకు అనవసరం అన్నట్టుగా చెప్పేసింది. ఆందోళన అనావశ్యకము. ఆందోళన పడాలిసినదేమి లేదని చెప్పింది. ఏమిటి అనావశ్యకము? విషయము అనావశ్యకము కాదు, ఆందోళన చెందాలిసిన అవసరం ఏం లేదు. "కేవలం మహనీయ శుభ అభిలాషతోనే నేను ఆ నిష్ఠని ఆవలింబిస్తున్నాను". మహనీయమైనటువంటి శుభము మనందరికి కలగాలనేటటువంటి ఉద్దేశ్యంతో నేను దీన్ని ఆచరిస్తున్నావు. అంచేత, మీరు ఆందోళన చెందడానికి ఏ మాత్రం అవసరం లేదని చెప్పిందండి. "దీనికి హేతువేమో త్వరలోనే అవగతం కాగలదు" అంది. ఎందుకు చేస్తున్నావంటే... ఒక దీక్ష మన మవలంబిస్తున్నప్పుడు చాలామంది అడుగుతారు. ఎందుకు సార్ అలా గడ్డం పెంచారని, కదా? లేకపోతే, ఒక స్త్రీని అడగొచ్చు ఇందుకిలా నిష్ఠతో ఈ కార్యం చేస్తున్నావని అడుగుతారు కదా! అప్పుడు చెప్పకూడదు. అయిపోయిన తర్వాత మీకే తెలుస్తుంది. మీకే తెలిసేంత బాగా మన చెయ్యకపోవచ్చు కదా! మీకే తెలియగలదు అని చెప్పిందావిడ. "అని విన్నవించింది. మామ ఆ ప్రత్యుత్తరము విని మిక్కిలి ఆనందించి, శుభమగు గాక" అన్నాడు. అందరి శుభం కోసం చేస్తున్నానని అన్నప్పుడు నీకు శుభం కలగాలని ఆశీర్వదించాడు ఆయన.

"సావిత్రి ఆపైన నాలగవనాటి ప్రభాత వేళ మేల్కొని, భర్తకి ఆనాడు మరణ దివసమని లోలోపల మిక్కిలి చింతించినా"... తెలిసి, ఇవ్వాళ మా ఆయన పోతాడని, ఏ స్త్రీ స్థిరంగా ఉండగలదండి? అందుకనే మనకి చెప్పరు లెండి. మనకెవరికీ కూడా తెలిసి మృత్యువు రాదు. ఎందుకంటే మృత్యువు వస్తుందంటే అప్పుడే పోతాం. అప్పటికే మృత్యువు తెచ్చుకుంటాం కదా! అంత భయం భయంగా ఏం బతుకుతారు? చెప్పకుండా తీసుకుపోతే సరిపోతుంది. అందుకని 99.9% చెప్పకుండానే పట్టుకుపోతారు. ముందు చెప్పి తీసుకెళ్ళరు. Appointment లు ఏమీ ఉండవు కదా. Appointment లేకుండా వచ్చేవాడాయనే. ఇప్పుడు appointment లేకుండా ఇంటికొస్తే, ఎందుకోచ్చావు అన్నట్టుగా మొహం పెడతాం. చెప్పకుండా వచ్చావేంటి అని. చెప్పకుండా వచ్చేస్తుంది. అందుకని ఆ రోజు ఆవిడకి తెలుసు, ఈ రోజు... this is the day, it is the D-day, death-day కదా భర్తకి.

"చింతించినా, దరహసిత వికసిత వదనంతో పరిచార్య లాచరించి, అత్తమామల కిడుమంచిన భక్తి తాత్సర్యాలతో ప్రణమిల్లి, సౌభాగ్య సంవర్ధకములైన ఆశీర్వచనము లందుకుని..." అందుకోవాలది. "ఆనాడు ఝాము పొద్దెక్కిన పిదప మామ కోడలిని తన సన్నిధికి ఆహ్వానించి ప్రగాఢ ఆత్మీయతతతో, తల్లీ మహోగ్రమైన వ్రత నిష్ఠ స్వీకరించి నీవెంతో అలసి ఉన్నావు, కనుక ఇంక ఆలసించక ఆహారం స్వీకరించ వలసినది అని ప్రోత్సహించాడు. సావిత్రి దానిపై, నేను ఈనాటి సాయం సమయం వరకూ భుజింపరాదని మొట్టమొదటే నిర్ణయం చేసుకున్నాను" అని చెప్పింది. ఆ రోజు సాయంత్రం వరకూ భోజనం చెయ్యనని చెప్పింది. "సత్యవంతుడు సమిధలు, కుసులు, ఫలాలు, ఆదిగా గల వాని కోసము కారడవి ప్రయాణమైనాడు. సావిత్రి అది గమనించి, పతిని సమీపించి, నేను ఈనాడు మీతో బాటు అరణ్యానికి రావాలని ఉవ్విళ్ళూరుతున్నాను". నేను చాలా ఉత్సాహ పడుతున్నాను ఇవాళ్ళ రావాలని. అంతకుముందు ఎప్పుడూ వెళ్ళలేదు. ఉవ్విళ్ళు ఊరుతోందట. "కాదని వెంట పెట్టుకుపోవలసినది అని వేడుకున్నది. సత్యవంతుడు దానికి అంగీకరించక, త్రిరాత్రోపవేసంతో నువ్వు ఎంతో చిక్కి ఉన్నావు. అరణ్య గమనం నీకు అసాధ్యమని తిరస్కరించాడు. అయినా సావిత్రి నిరాశ చెందక, నాకిప్పుడు ఒకించుకైన ఉపవాస ఆయాసం లేదు". మీరు చెప్తే తప్ప నాకు గుర్తు లేదు నేను తినలేదు అని చెప్పింది. ఆయాసం లేదు. "అరణ్య మధ్యభాగం మహోజ్వల పుష్పాలతో విలసిల్లుతోందని విన్నాను. అంతేకానీ నేనెప్పుడూ అది సందర్శించలేదు. ఈనాడది పరిశీలించవలెనని ఎంతో కుతూహల పడుతున్నాను". అరణ్యంలో చాలా అద్భుతమైనటువంటి పుష్ప వృక్షాలు ఉన్నాయి, ఆ వృక్షాలు, ఆ పువ్వులు చూడాలి, ఆ ఫలములు చూడాలని ఎందుకనో చాలా ఉత్సాహ పడుతున్నాను ఇవ్వాళ నేను. "కాదూ కూడదనక నా చనువు చెల్లించవలసినది" అంది. అని కోరింది. సత్యవంతుడు, ఆయన చాలా సౌమ్యుడు, ఏదీ కాదనడు. సత్యవంతుడు మనం ఊహించుకుంటే, మంచి model మనకి. ఆ గుణములన్నిటితో పాటు ఊహించుకుంటే సౌజన్యమూర్తి. పరిపూర్ణంగా సద్గుణములని ఆశ్రయించి, మౌనం వహించి, తన కర్తవ్యాలని నిర్వర్తిస్తూ, ఎప్పుడూ ఎక్కడా ఏ మాటా లేకుండా, దేన్నీ ఆశించకుండా బతుకుతున్నాడు. ఈవిడొచ్చి పెళ్లి చేసుకుంటానంటే ఏం మాట్లాడలేదు కదా! చేసేసుకున్నాడు. అది ఒక రకమైనటువంటి మౌన దీక్ష కనిపిస్తుంది

సత్యవంతుడిలో. మొత్తం కథలో సత్యవంతుడు మాట్లాడింది కనబడదు కదా! ఎప్పుడూ దీక్షతోనే ఉన్నట్టుగా ఉంటాడతను. అంచేత, సరే కాదంటం ఎందుకు, కోరుకుంటోంది కదా అని తీసుకెళ్తాడు.

"అనుమతించిన పిమ్మట సావిత్రి అత్తమామల దగ్గరికి పోయి, ప్రణమిల్లి, మీ కుమారుడు సవిత్ కృషాదులపై విపిన భూమికి ప్రయాణమైనారు. నేనాయతో పోయి అరణ్య సౌదర్యం తిలకించవలెనని ఉవిళ్ళూరుతున్నాను. కరుణించి నాకీ వరం ప్రసాదించ వలసినది." ఇంట్లో ఆయన ఒప్పుకున్నా, ఇంట్లో పెద్దలకి, వాళ్లు కూడా permission. "అని ప్రార్థించింది. ద్యుమత్సేనుడది విని, ఆ రాజకుమారి ఎన్నడూ ఏదీ అర్థించలేదు. ఈనాడు అరణ్యం పరిశీలించవలెనని అభిలషిస్తున్నది కాబోలు, ఈ చిన్న కోర్కె కాదనడమేల అని భావించి అంగీకరించాడు. సావిత్రి వారిరువురి పాదాలపై వాలి ఎంతో భక్తితో నమస్కరించి, వీడ్కొని, లోలోపల అందోళన పైపైకి ఏ మాత్రము వ్యక్తీకరించక, అల తిరుగముతో ప్రియుని ఆమంద ఆనంద సంధామియై అల్లనల్లన అనుసరించినది". చాలా కష్టమైన విషయం కదా! ఇంకెవరికీ చెప్పకూడనటువంటి దుఃఖం. అందుకని, తన వెళ్తోంది. వెళ్తోంది కాబట్టి ఆశీర్వచనం తీసుకుంది. ఆశీర్వచనం తీసుకుంటూ దుఃఖ పడొచ్చుగా? కళ్ళెంబడి నీళ్ళు వస్తే తెలిసిపోతుంది ఏదో ఉందని. కళ్ళెంబడి నీళ్ళు రాకుండా, అది లోపలే అణుచుకుని, పైకి ఒక నవ్వు తెచ్చి పెట్టుకుని, లేని ఉత్సాహం తెచ్చి పెట్టుకుని, వాళ్ళ ఆశీర్వచనం తీసుకుని, భర్తతో బయలుదేరి వెళ్ళిందండి.

"మరి కొంతసేపటికా దంపతులు మందమంద గమనాలతో అరణ్య మధ్యంలో ప్రవేశించారు". వెళ్ళారు అరణ్యంలోకి. "ఆ సమయంలో ఆ అటవి అతిలోక మనోహరమై పొడగట్టినది. కమలాకరాలతో రాయించిన జంట అలలలో తూగనాడినది". అంటే, లోపల హంసలు, పద్మాలతో కూడిన సరస్సులో... ఆ వర్ణన అంతా ఎక్కువ సేపు చెప్పుకుంటే మనం ముందుకెళ్ళలేం గాని కొంత చెప్పుకోవాలి కదా! మనం మాములుగా హంసలని చూడలేము. అవి మనం ఉండేచోట అవి ఉండవు. కొంచెం మనం distrubance వాటికి. అందుకనే రాజ హంసలు చాలా పవిత్రమైన జలాల్లో, పవిత్రమైన ప్రాంతాల్లో ఉండే కోనేరులలో ఉంటాయి. అందులో కూడా, ఆ కోనేరులో పద్మాలు ఉండాలి. పద్మాలు లేని కోనేరులో ఉండవు అవి. వాటిని చూసిందండి. పద్మాలే కనబడవు మనకి కదా పల్లెటూళ్ళ కెళ్తే తప్ప! తెల్లటి పద్మాలు అరుదుగా కనిపిస్తాయి. కోనేరులో పద్మాలు. అంతేకాదు, అక్కడ రాజ హంసలు. వాటిని చూసింది.

"ఎటువైపు అవలోకించినా లలితాంగితములైన తరువులు బహువిధ ఫల పుష్పవాలతో, పల్లవాలతో కనుదోయ, కనుదోయ విందొనర్చినవి". ఎటు చూసినా పళ్ళ వృక్షాలు, ఫల వృక్షాలు, ఫలములు, పుష్పములు, లతలు. వీటితో బాగా అందంగా ఉందిటండి. అవన్నీ చూస్తోంది గాని వాటియందు మనసు పడుతుందా? వాటియందు మనసు పడదు. తనకి కర్తవ్యం ఉంది, ఆయనని అంటి పెట్టుకుని ఉండాలి. అంచేత, "తీయ తీయని తేనేలారగించి మశ్చిలిల గండు తుమ్మెదల ధ్వని సావిత్రిసత్యవంతుల వీనులలో మాటిమాటికి మ్రోగినది". తుమ్మెదలని చూడాలంటే, మంచి పుష్పాలు ఉన్నచోట గాని కనబడవు అవి. తేనె ఉన్నచోటే అవి ఉంటాయి కదా! అంచేత, పుష్పం బాగా వికసించి, తేనె బాగా పుడుతూ ఉంటే అందులోంచి, వాటికోసం తుమ్మెదలు వస్తాయి. అలాంటివి అరణ్యంలో కోకొల్లలుగా కనిపించి,

ఝుంకార ధ్వని వినిపిస్తాయి భ్రమర గీతంలాగ. అంతలా తుమ్మెదలు కనిపిస్తున్నాయి. "మిగలముగ్గిన పండ్ల రాసాలారగించి విజృంబించిన రాచిలకల పలుకులు కలకలం నలువైపులా చెలరేగింది. ద్యుమత్సేనుని కుమారుడు అరణ్యంలో గోచరించిన ఆయా విశేషాల అంగుళికతో తన ప్రియపత్ని అడుగగా నిర్దేశించి అపూర్వ ఉల్లాసంతో చూపించాడు. రాజకుమారి నిర్వికార ముఖ వైఖరితో అదే విధంగా పతి ననుసరించి కాననంలో యదేచ్ఛగా విహరించినది." అయన చాల ఉత్సాహంగా చూపిస్తున్నాడు భార్యకి, రాలేదు కదా తనతో అరణ్యంలోకి. రమ్మని తనూ అడగలేదు, అరణ్యం కదా అని. అక్కడుంటేటటువంటి మధురమైన సౌందర్యమంతా చూపిస్తున్నాడు, ఉత్సాహంగా చూపిస్తున్నాడు, ఇటు చూడు, అటు చూడు అని. చూపిస్తున్నప్పటికీ ఈవిడ నిర్వికారంగా చూస్తోంది, ఎందుకంటే ఈమె అందుకోసం రాలేదు కాబట్టి.

"సత్యవంతుడంత విపినంలో నాలుగువైపులా పరిభ్రమించి, ఫలపుష్పాదులతో తన చేతనున్న పెను సజ్జనుడించాడు. ఆపైన గంధ్ర గొడ్డలి చేపట్టి, కట్టెలు కొన్ని కొట్టి, మిక్కిలి అలసి, ఆ పరసుని ధరణిపై పడవేచి, ఎడతెగని నిట్టూర్పులతో వివర్ణ వదనుడై సావిత్రి వైపు చూచి, ఎందువలనో మేను అవశం అగుచున్నది అన్నాడు." పూలన్నీ సేకరించాడు, పళ్లన్నీ సేకరించాడు, అవన్నీ ఓ బుట్టలో వేసాడు. ఇహ కట్టెలు కొడదాం అని గొడ్డలి తీసుకున్నాడు. నాలుగు దెబ్బలు కొట్టంగానే దేహంలో ఒకరకమైనటువంటి తేడా కనిపించింది. కనిపించి, విపరీతమైన బాధ రావడం మొదలుపెట్టింది. అంతే కాదు, తన వశం తప్పుతోంది శరీరం. అంచేత, "ఎందువలనో మేను అవశం అయినది. మానసం పరిపరి విధాలుగా పరిభ్రమిస్తున్నది." ఎప్పుడూ ఏ కలతా లేకుండా స్థిరంగా ఉండేటటువంటి మనసు అలజడి చెందుతోందని చెప్పాడు సావిత్రిదేవికి. ఒళ్లంతా కంపిస్తోంది, దేహం వశం తప్పుతోంది. మనసులో రకరకాలుగా కలతలు కలుగుతున్నాయి అని బాగా చెప్పుకుంటూ వచ్చాడు.

"పరిపరి విధాలా పరిభ్రమించుచున్నది. బహు శూలాలతో శిరస్సుపై అనుక్షణం ప్రహరిస్తున్నట్లున్నది." తల శూలాలతో గుచ్చుతున్నట్టుగా నొప్పి వస్తోందిట. ఆ విధంగా అకస్మాత్తుగా వచ్చింది. "ఇక క్షణమైనా నిలవలేను. ఇచట నిమేష కాలం విశ్రమించగలను అని అస్పష్ట స్వరంతో వక్కాణించాడు. ఆ సాధ్వి ఆ పలుకులాలకించి, తన ఒడి తలగడగా సమర్పించి, ఎంతో ఆప్యాయంతో ఆదుకొన్నది. సత్యవంతుడామే అంకతనంలో వాలి అవశుడై కేవలం నిశ్చేష్ట తనుడైనట్టు గోచరించాడు." ఇక నేను నిలబడలేను, పడుకోవాలి కాసేపు అన్నాడు. పడుకోవాలనగానే ఆవిడ వెంటనే కూర్చుని తన ఒళ్లో ఆయన తల పెట్టుకుని పడుకునేటట్టుగా ఏర్పాటు చేసింది. అలా ఏర్పాటు చేసి పడుకోగానే, ఇక ఆ తర్వాత నిశ్చేష్టుడైపోయాడు, చేష్టలు ఉడిగినాయి. "మరి కొంత సేపటికి"... ఎలా అయిపోయిందో మన సభ? కలకలా నవ్వుతుండే సభ చూడండి ఎలా గంభీరం అయిపోయిందో? అయిపోతుంది కదా! ఎంత అకస్మాత్తుగా సీను మారిపోయింది కదా! ఒక frame తీసేసి ఇంకో frame పెట్టేసారు. అంత వరకూ ఒక frame, ఇప్పుడు ఇంకో frame వచ్చేసింది కదా!

"మరి కొంత సేపటికి అత్యంత భయంకరుడైన పురుషుడొకడు సావిత్రికి ఆరతి దూరంలో సాక్షాత్కరించాడు." వచ్చాడట ఒకాయన, అంత దూరంగా కనిపించాడట. మనకయితే కనిపించదు. తనకెందుకు కనిపించాడు, మనకెందుకు కనిపించదు? అది కదా ముఖ్యం! ఆవిడది చూడగలిగినటువంటి సామర్థ్యం ఉన్నది. సూక్ష్మ దర్శనం అనేటటువంటి సిద్ధి కలిగినటువంటిది ఆమె. ఎంచేత? అలాంటి శరీరం కలిగిందావిడ. ఉండడం చేత కనిపించాడు.

"అతడు కాలమేఘ వినీలాకారుడు." నల్లటి మేఘంలాగా ఉన్నాడటండి. యముడు చాలా భయంకరమైనటువంటి ఆకారుడని ఒకటి, అత్యంత సుందరమైనటువంటి ఆకారుడని ఒకటి, రెండూ ఉన్నాయి ఆయనకి. యముడు కనబడడానికి ముందు చాలా భయంకరంగా కనబడి, అటుపైన సజ్జనులకు సుందరాకారుడుగా గోచరిస్తాడుట. అంటే, అందరికీ యముడు రాడు. గుర్తు పెట్టుకోండి. VIPs కే యముడొస్తాడు. మిగతా వాళ్ళకి మృత్యుదేవతని పంపిస్తాడు. చాలామంది దగ్గరకు మృత్యుదేవతే వెళ్లి తీసుకొచ్చేస్తాడు. ఏదో అక్కడక్కడా కొన్ని కథల్లో మృత్యుదేవతకి వశం కాక వెళ్లి చెప్తాడు, సార్ మావల్ల అవ్వట్లేదు, కొంచెం మీరేదో చూడాలని. అంటే, ఏదో అది విశిష్టమైన సన్నివేశం అయితే తానే వెళ్తాడు. So, తనకే తెలుసనుకోండి అప్పుడు ఇహ వాళ్ళనీ వీళ్ళనీ పంపించడు, తానే వెళ్ళిపోతాడు. అంచేత, "ఎర్రని వదనంపై తెల్లతెల్లని వాడివాడి కోరలతో చూచినంతలోనే ప్రాణ లోక భయంకరుడు బంగారు రంగు విరజిమ్ముతున్న వసనాలతో కాలన జ్వాలవలె ప్రజ్వలిస్తూ ఆ పురుషుని హస్తంలో సుదీర్ఘమైన పాశ మొకటి పొదగట్టినది." మొహమేమో నల్లగా ఉందండి. కళ్ళేమో ఎర్రగా ఉన్నాయట. పెదవులు ఎర్రగా ఉన్నాయట. రెండు తెల్లటి కోరలు ఈ పక్కనుంచి బయటకొచ్చి ఉన్నాయటండి. అలా ఉన్నాడట. చేతిలో పాశం ఉందట. అంటే, అలా వేసి, ఇలా జీవుడిని చాలా సులభంగా, expert surgeon ఏ విధంగా ఇలా కోసి, అలా బయటకి తీసి repair చేస్తాడో, అలా యముడు అలా వేసాడంటే, ఆ లోపల కూరుకుపోయి ఉంటాడు కదా మట్టిలో. మట్టంటే? ఈ రక్త మాంసాదులతో కూడిన శరీరంలో బాగా ఇరుక్కుపోయి ఉంటాడు ముళ్లేసుకుని. దేవుడు వేసినవి కొన్ని, మనమేసుకున్నవి కొన్ని. ఇన్నిటిలోంచి తియ్యాలంటే ఒక్కొక్కటి ముడి విప్పడు. ఆయన దగ్గరో technique ఉంది, అలా వేసి ఇలా తీస్తే, వాడు వచ్చేస్తాడు, మిగతాది అక్కడ ఉండిపోతుంది. అది పట్టుకుని వచ్చాడు.

"హస్తంలో సుదీర్ఘమైన పాశ మొకటి పొదకట్టినది. ఆ భీషణాకారుడంత సత్యవంతుడిని సమీపించాడు. సావిత్రి ఆ వింత మనిషిని చూసి, మిక్కిలి ఆశ్చర్యపడి..." అదే first time చూడడం ఆవిడ కదా! అంతకుముందు చూడలేదు కదా! ఆశ్చర్యపడ్డదట, భయపడలేదు. ఈ భయం, గియం ఈ దేహంలో ఉన్నవాళ్లకే. పై దేహాల్లోకి వెళ్తే అంత భయం ఉండదు. అంచేత, "ఆశ్చర్యపడి, పతి శీర్షం మెల్లన దిగువ ఉంచి, మిక్కిలి భయ భక్తులతో"... సత్యవంతుడి శిరస్సుని తీసి నేలమీద వుంచి తాను నిబడ్డదటండి. నిలబడి, "మిక్కిలి భయభక్తులతో అంజలి ఘటించి, ఆర్యా, తమెవ్వరూ? అని అడిగింది." మీరెవరు స్వామీ అని అడిగింది. "ఇచ్చటికి విజయం చేసిన హేతువేమి అని ప్రశ్నించినది." ఎందుకిలా వచ్చారు? మీరెవరు, ఎందుకొచ్చారని అడిగిందండి నిలబడి. అంటే, చూడంగానే దణ్ణం పెట్టవలసినటువంటి వ్యక్తిలాగా కనిపించాడు కదా!

"ఆ పురుషుడంత, సాధ్వీమణీ, నేను అంతకుడను". నేను అంతకుడను. అంటే, ప్రతీ దానికి the end అని వేస్తాం కదా, అన్నిటికి ఒక మితి ఉంటుంది. ఒక ring pass not అంటారు. ప్రతి వాళ్ళకి ఇహ ఇంతకన్నా దాటి వెళ్ళలేని స్థితులు ఉంటాయి కదా! మన సూర్యుడుకి కూడా ఉంది. మన సూర్యుడికి కూడా ఆయన వెలుగుకి మితి ఉంది. అందరికీ పరిధులు ఉన్నాయి. సృష్టిలో దేవతలకు కూడా పరిధులు ఉన్నాయి. అందరికి మితి ఏర్పరిచే తత్త్వాన్ని యముడు అంటారు. యముడు అందరికీ. అది దాటి పోలేదు వాడు. ఎవరు దాటి పోగలరు అంటే, అపరిమిత్వంతో సంబంధం కలిగినవాళ్ళే ఈ మితత్వంలోంచి బయటకు రాగలరు. దేవతలు కూడా అందరూ అంతర్యామితో అనుసంధానం చెంది ఉండరు. మానవులు కూడా ఎలాగూ ఉండరు. సరే, జంతువులకి వీలే లేదు. ఋషుల్లో అపరిమితత్వంతో అనుస్యూతం కలిసి ఉండేటటువంటి వాళ్ళని బ్రహ్మర్షులంటారు. అంటే, వాళ్ళెప్పుడూ అందులోనే ఉంటారు. అంటే, అగస్త్యుడు, వశిష్ఠుడు, గౌతముడు, వీళ్ళని బ్రహ్మర్షులంటారు. వాళ్ళని ఈయని ముట్టుకోదు. ఎందుకని? వారు వారి వారి సాధనల చేత మితత్వం తగ్గించుకుంటూ అపరిమితత్వంలోకి పెరిగారు. మనం కూడా చెయ్యవలసింది అదే. ఈ జ్ఞాన సముపార్జన దేనికంటే జ్ఞానం అనంతం కాబట్టి, జ్ఞానం ఆధారంగా మన ప్రజ్ఞ అట్లా విస్తృతి చెందాలి. కేవలం మన దేహానికే పరిమితమై పోకూడదు. అయిపోతే, ఈ దేహం పోతుంటే ఇబ్బంది పడతాము. అట్లా ఒక్కొక్కరి ప్రజ్ఞ కొన్ని కొన్ని ప్రాంతాలవరకూ వ్యాప్తి చెందుతుంది. ఒకళ్ళు వాళ్ళింట్లో వాళ్ళకే తెలుసుంటారు. కొంతమంది ఆ వీధిలో వాళ్ళకి కూడా తెలిసుంటారు కదా! కొంతమంది కాస్త ఆ వూళ్ళో, ఆ ప్రాంతం... ఇప్పుడు ఇది paradise అంటాం కదా, ఈ paradise లో ఉండే వాళ్ళందరికీ paradise లో ఉండేవాళ్ళు తెలుస్తారా? ఒకడికి తెలియచ్చు. అట్లాగే, హైదరాబాద్ అంతా తెలిసిన వాడొకడు ఉండొచ్చు. మొత్తం హైదరాబాదుకి వాడు తెలుసు. అంటే పరిధి పెద్దది కదా! అలాగే పరిధి ఈ దేశం అంతా, ఖండం అంతా, భూగోళం అంతా పరిధి. అంటే ఏమిటి? నీ ప్రజ్ఞ అలా పరిధి పెంచుకుంటూ పోతుంది. అట్లా పరిధి పెంచుకుని, పెంచుకుని పోతే, భూగోళానికి ఒక పరిధి ఉంది. ఇతర గోళాలకి పరిధులు ఉన్నాయి. సూర్యుడికి పరిధి ఉంది. అందరికీ పరిధులు ఉన్నాయి. అట్లా ప్రతివాడికి మితి కూర్చేదేదుంటే దాన్ని ring pass not అంటారు. He marks the end.

ప్రతి దానికి ఒక అంతు ఉంటుంది. అంతులేని తత్త్వం ఒకటుంది, దాన్ని అనంతం అంటాం. అనంతంతో అనుసంధానం ఉండేవాళ్ళని మాత్రం ఈ అంతులేర్పరిచే తత్త్వం ముట్టుకోదు. మిగతా వాళ్ళందరినీ ముట్టుకుంటుంది. అందుకనే ప్రతిదానికి ఒక ఆయుర్దాయం ఉంటుంది. సూర్య మండలానికి ఒక ఆయుర్దాయం ఉంది. సృష్టికి ఆయుర్దాయం లెక్కలు కట్టారుగా ఇన్నేళ్ళని! కాబట్టి, ఈ ఆయుర్దాయం లెక్కల్లో ప్రతివాడికి ఒక అంతం ఉంది. ప్రతి పనికి ఒక అంతం ఉంది. చిన్నచిన్న పనులనుంచి, పెద్దపెద్ద పనుల వరకూ ఒక అంతం ఉంది. ఇప్పుడు ఈ గురుపూజలు శనివారం పొద్దున్న మొదలయితే, ఇవాళ సాయంత్రంతో అయిపోతాయి. అంతమేగా! ఇప్పుడు ఈ building కట్టారు. ఎప్పుడోప్పుడు, ఎప్పుడూ ఉండదు కదా! మహా అయితే వందేళ్ళు, తర్వాత తీసేయ్యాలి కదా! అదే ఒక అంతం ఉంది. ప్రతిదానికి అట్లా అంతాలు ఉన్నాయి. అందుకని, ఇట్లా సృష్టిలో దేనికయినా ఒక అంతం ఉంది. అంతం లేనిది ఒకటి ఉంది. దాని నుంచి ఈ అంతం చెందేటటువంటివన్నీ ఏర్పడుతూ ఉంటాయి. అన్ని లోకాలకి

అంతం ఉన్నది. అందుకని, అంతం అయిపోకుండా ఉండడం కోసం అనంతుడిని ఆరాధన చెయ్యడం వచ్చింది. అనంతుడంటే అంతం లేనివాడని అర్థం కదా! ఎవరది అనంతం? వేదం చెప్పేది సత్యం అనంతం, జ్ఞానం అనంతం, బ్రహ్మము అనంతం అని. అంచేత, సత్యాన్ని ఆచరిస్తూ, జ్ఞానాన్ని సముపార్జన చేస్తూ, బ్రహ్మముతో అనుసంధానం చెందినటువంటివాడికి అంతము ఉండదు. అంతం ఉండదంటే ఈ శరీరంలో ఎప్పుడూ అట్లాగే ఉండిపోతాడని కాదు. తాను ఉంటాడు, శరీరం మరణిస్తుంటే తాను చూస్తూ ఉంటాడండి.

మీకు తెలియదేమో, భారతంలో దృతరాష్ట్రుడు కూడా అలా తెలిసి మరణించినవాడే. అది చూడండి ఎంత జ్ఞానో. అంటే, మమకారం చేత బంధింపబడ్డా చివరికి అది పోయింది. పోవడం చేత, తానే స్వయంగా తన శరీరం చక్కగా అపాన ప్రాణానికి అందించి, తాను బయటకి వచ్చాడు. అది చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. జీవితం అంతా మమకారంతో బాధపడతాడు, మహా జ్ఞాని. చిట్టచివరిలో ఆ కాస్తా మామకారం విదురుడు కారణంగా పోతుంది. విదురుడు బోధ జీవితం అంతా వెల్ల, చిట్టచివరిలో last మాట విన్నాడు. ఇంకా ఎందుకు అన్నయ్యా, భీముడు పెట్టే అన్నం తింటూ, బొత్తిగా చీమూ నెత్తురూ లేకుండా ఇలా తయారయిపోయావే అని కోప్పడతాడు. దాంతో పోతుంది. పోయి, తను స్వచ్ఛందంగా దేహంకి మరణం అప్పచెప్పి తను బయటకొస్తాడండి. ఎలాంటి వాడు దృతరాష్ట్రుడు! అంటే, నువ్వు అంతం అవ్వక్కర్లేదు నీ శరీరం అంతం అవుతుంటే. మనకి శరీరం ఏమిటి, బయట చెప్పుల జోడు పోతుందేమో అన్న భయంతో పాత చెప్పులు వేసుకొచ్చే type కదా మనం! ఇప్పుడు గురుపూజలు ఇలాంటి చోట్లకి, గుళ్ళకి వెళ్ళేటప్పుడు పాత చెప్పులేసుకెళ్తారు. ఎందుకంటే, కొత్త చెప్పులు బయట పెడితే, మనసంతా చెప్పుల మీదే! అవి పోతే, ఈ దేవుడిని చూసిన ఫలం ఏం ఉండదు. ఎందుకంటే, ఈ ఆనందం కన్నా ఆ దుఃఖం ఎక్కువ. నిన్నే కొన్నానండి, అక్కడికెళ్ళి కొన్నాను, వాడితో బేరం కూడా ఆడాను, ఏదో చాలా చెప్తారు కదా! అంత దుఃఖం. ఇట్లా చిన్నచిన్న అంతాల దగ్గర నుంచి, పెద్దపెద్ద అంతాల వరకూ, సృష్టి అంతం వరకూ యమధర్మరాజు. అతడు ఎవడికి లొంగుతాడంటే, ధర్మము ఆచరించే వారి యెడల సుముఖుడై ఉంటాడు. ధర్మము నాచరించని వారి యెడల భయంకరుడై ఉంటాడు.

అందుకని, ఈమె ఎవరు స్వామీ మీరు అని అడిగితే, "సాధ్వీమణీ నేను అంతకుడను. మహనీయమైన పాతివ్రత్య ప్రభావం వల్లనే నీకు నా సాక్షాత్కార భాగ్యం చేకూరినది." నీకు తెలుసు కాబట్టి భయపడకుండా వెంట నడిచి వచ్చావు. పుట్టిన దగ్గర నుంచి ఆవిడ ఆచరించినది అంతా ధర్మమే. ఎక్కడా ఏ తేడా లేదు. అందుకని, ధర్మరాజుకి కూడా చిట్టచివరికి యమధర్మరాజు కనిపించి ఆశీర్వదిస్తాడు, శభాష్ అంటాడు. కొంతమందికి ముందు కనిపిస్తాడు. కనిపించి నీ పాతివ్రత్య మహిమ వల్ల నువ్వు నన్ను చూడగాలిగావు, లేకపోతే నన్ను అందరూ చూడలేరు అని చెప్పాడు.

"అంతేగానీ, అన్యులెవరికీ నేను అగబడను. నీ భర్త ఆయుర్దాయం ముగిసినది. అయితే, ఇతడు మహా పుణ్యాత్ముడు. అందువలనే ఇతరులెవరికీ ఆజ్ఞాపించక స్వయంగా నేనే ఇతడిని కొనిపోవలెనని సంకల్పించుకున్నాను." అంటే, యమధర్మరాజు తానే స్వయంగా వచ్చి జీవుడిని తీసుకెళ్ళేంత విశిష్టమైన జీవి సత్యవంతుడు. చెప్పాడుగా,

ఆయనే చెప్పాడు ఈ మాట. "ఇతడు మహా పుణ్యాత్ముడు. అందువలనే ఇతరులెవరికీ ఆజ్ఞాపించక స్వయంగా నేనే ఇతడిని కొనిపోవలెనని సంకల్పించుకున్నానని పలికి, సత్యవంతుడి శరీరంలో ప్రాదేశికా మాత్రాకారుడై ప్రజ్వలిస్తున్న జీవుని పాశంతో వెలువరించి దక్షిణ దిశా విముఖుడై తన ప్రస్థానికి ప్రారంభించాడు. మద్రరాజ తనయ అది గమనించి, లోలోపల మిక్కిలి దుఃఖించి, పతి మేనును ఒకచోట మిక్కిలి జాగ్రత్తతో భద్రపరిచి, సస్వమే వెన్నంటి సాగిపోయినది." చూడండి. అంటే, నేనే వచ్చాను స్వయంగా, నువ్వు చాలా సంతోషించవలసిన విషయం అని చెప్పాడు. అంటే, మీ ఆయనని నేను సగౌరవంగా తీసుకెళ్తున్నానని గుర్తుపెట్టుకో. ఎందుకంటే, ఇతను చాలా మంచివాడు అని చెప్పాడు. ఇంక అంతకన్నా ఏం మాట్లాడలేదు. అలా వేసాడు, ఇలా లోపలినుంచి ఇంత ఉండేవాడిని ఒకడిని బయటకు తీసాడు. మనమంతా అంతే ఉంటాం లోపల.

ప్రాదేశికా మాత్రాకారుడిని ఆ దేహంలోంచి బయటకు తీసాడు. తీసి, దక్షిణాముఖుడై, దక్షిణ ముఖంగా... దక్షిణం యముడి స్థానం కదా. దాక్షిణ్యము కలిగినటువంటి వారికి యముడు విష్ణుమూర్తి వలె దర్శనం ఇస్తాడు. కఠిన హృదయులకి భయంకరుడిగా కనిపిస్తాడు. నీ హృదయంలో దయ ఉంటే, తోటి జీవులయందు ఆ దయ నువ్వు చూపిస్తూ ఉంటే, నీకు యముడు సుందరాకారుడిగా దర్శనం ఇస్తాడు. తోటి జీవులయందు నీకేమాత్రం కారుణ్యం లేదు. లేకపోతే, ఎంత భయం వేస్తుందంటే, తట్టుకోలేనంత భయం వేస్తుంది. అంచేత, ఆయన వచ్చాడు, తీసుకెళ్తున్నాడు, వెళ్ళిపోయాడు. జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడండి ఆయన. అంటే, చూస్తుండగానే క్షణ మాత్రంలో అంతా జరిగిపోయింది. జరిగిపోతే, ఆవిడకి చాలా దుఃఖం వచ్చింది. దుఃఖం వచ్చి, పతి శరీరం పక్కన జాగ్రత్త పరిచింది. ఎక్కడన్నా జాగ్రత్త పెట్టాలి, ఎందుకంటే తన మళ్ళీ పతి ప్రాణాలు తీసుకురావాలి. పతిని తీసుకురావాలి కదా! పతిని తీసుకురావాలంటే, తీసుకొచ్చిన తర్వాత శరీరం లేకపోతే? ఈ లోపల ఏ పులో, నక్కో మింగేసిందనుకోండి, కోరికేసిందనుకోండి, ఏదయినా అవ్వొచ్చుగా? అందుకని ఏం చెయ్యాలి? ముందు శరీరాన్ని కాపాడాలి. మీరందరూ చూసారుగా సినిమా. మూడు రోజుల తర్వాత తిరిగొస్తానురా, అందాకా దీన్ని జాగ్రత్తగా చూడండి అని చెప్పి వెళ్ళాడు షిరిడి సాయి కదా! ఇప్పుడు దీన్ని చూడకపోతే, దీన్ని కాల్చేస్తే, తిరిగి వచ్చేటప్పటికి ఏముండదు కదా! ఈ లోపల కాల్చేయ్యాలని కదా ఓ ప్రయత్నం. అందుకని, దాన్ని జాగ్రత్త పెట్టింది.

అంతే కాదండి, ఇంకో విషయం ఉంది. జాగ్రత్త పెట్టి, ఆమె యముడి వెంట వెళ్ళింది కదా! ఆమె ఎలా వెళ్ళింది? అక్కడే తన శరీరం కూడా జాగ్రత్త పెట్టేసింది. స్వశరీరంతో వెళ్ళలేరు. తాను యోగమార్గం ద్వారా... చెప్పాగా అశ్వపతి కుమార్తె, సిద్ధురాలు, ప్రాణాపానములను సమానం చేసి, సమాన వాయువులోంచి ఉదాన వాయువులోకి ప్రవేశించి, ఉదానంలోంచి వ్యానంలోకి ప్రవేశిస్తే, వ్యాన వాయువు నిన్ను ఆజ్ఞ దగ్గరకి తీసుకొస్తుంది. ఇక్కడినుంచి నువ్వు బయటకు రావొచ్చు. ఆజ్ఞ ముఖద్వారం జీవుడు బయటకు రావడానికి. అందులోంచి బయటకు వస్తూ, ముందు ఓ పక్కన శరీరం ఏర్పాటు చేసి రావాలి. బయటకొచ్చిన తర్వాత ఏర్పాటు చెయ్యలేరు. అందుకని, పతి శరీరం అక్కడ ఉంచి, తాను యోగ ప్రక్రియలో ప్రవేశించి, తన శరీరాన్ని కూడా ఆ పక్కనే భద్రపరిచింది. భద్రపరిచి, తను సూక్ష్మ శరీరంతో యముని వెంట వెళ్తుంది. యోగం చేసుకోవడం అందుకే. CVVగారి యోగం ముఖ్య ఉద్దేశ్యం

అది. నువ్వు అలా బయటకి రాగలిగి ఉండాలి. ఊరికే మనం ఒకటికి పది ఆయన ఫోటోలు పెట్టేసుకుని, మనం ఆయన వాళ్ళమని తిరుగుతుంటే కుదరదు కదా! ఆయన అనుకోవాలి వీడు మనవాడని. "నీ వాడయి తనువారిలో నేనొకడినయి" అంటుంది భాగవతం. మాస్టరుగారు మా మాస్టరుగారు అనుకోకూడదు. మాస్టరుగారు వీడు నావాడు అనుకోవాలి. మనదంతా 50% love కదా, one-way! అటునుంచి ఆయన అనుకోవాలి వీడు నావాడు అని. అంచేత, ఈ యోగము యొక్క ముఖ్య ఉద్దేశ్యం అది. అందుకనే ఈ ఉపాఖ్యానం మనకి. యోగవిద్య నీవు నీ దేహంలోంచి బయటకు రాగలిగినటువంటి, దేహంలోంచి తరించేటటువంటి విద్య, కారణ విద్య. ఆ విద్య తెలుసావిడకి. ఎందుకని? తండ్రికే తెలుసు. తండ్రి ఎలాంటివాడు? అలాంటి తండ్రికి పుట్టిందావిడ. తండ్రి మహాయోగి కదా! ఆయన పంచ ప్రాణాలని స్వాధీనం చేసుకున్నటువంటి వాడు. మరలాంటి వాడికి తాను అమ్మవారి అనుగ్రహం చేత పుట్టింది. తనకీ విద్య ఉండడం చేత, తను కూడా పతి శరీరం పక్కన తన శరీరాన్ని ఏర్పాటు చేసుకుని, అక్కడినుంచి బయటకు వచ్చేసింది. బయటకొచ్చేసి, యముడి వెంట బయలుదేరుతుంది.

"ఒక చోట మిక్కలి జాగ్రుతతో భద్రపరిచి సత్వరమే యముని వెంట సాగిపోయినది. దండధరుడది గమనించి..." ఎవరొస్తారండి? ఇలా వెంటబడి వచ్చేవాళ్లుండరు మాములుగా. ఉంటారా? పోనీ వెళ్దామనుకున్నా వెళ్ళగలరా? అసలు వెళ్దామనుకుని, వెళ్ళే వాళ్ళెవరయినా ఉన్నారా first? ఎంత అత్యంతమైనటువంటి సన్నిహితులు పోయినా ఎంతవరకూ వెళ్తామండి? శివస్థానం వరకూ వెళ్తాం, స్మశానం వరకూ వెళ్తాం. అంతేగా? అదంతా మరి నీకు ఉండేటటువంటి ప్రేమ, ఆప్యాయత, భక్తి, గౌరవం ఏదయినా కానీయండి. వాడితో నీకున్న అనుబంధం కొద్ది అదంతా కాలిపోయే వరకూ ఉండగలవు. అంతేగా? ఏది కాలిపోతుంది? శరీరం. వాడెప్పుడో వెళ్ళిపోయాడు. వాడితో వెళ్ళలేవు కదా! అందుకనే, ఒకసారి మాస్టరుగారు తన అనుయాయుడొకడు అతని స్నేహితుడు, పెద్దవాడు ఒకతను వెళ్ళిపోతే బాగా ఏడుస్తూ, ఆ శవాన్ని మోసి, ఆ స్మశానం వరకూ వెళ్ళిన తర్వాత, ఇంకా అక్కడే కూర్చుని ఉంటే, అతనికి చెప్పారు మాస్టారు, "ఇంతకన్నా వెళ్ళలేవోయ్ నువ్వు, ఇహ వచ్చేయ్" అని చెప్పారు. అంటే, కూర్చుని ఏం చేస్తావు? వెళ్ళగలిగితే మంచి విషయం. నువ్వు వెళ్ళలేవు కదా, అక్కడ ఎంత సేపు కూర్చుంటావు? ముందుకెళ్ళలేనప్పుడు వెనక్కేనా వచ్చి పనులు చేసుకోవచ్చుగా, అక్కడేం చేస్తావు నువ్వు అని చెప్పారు. ఎంతో దూరం వెళ్ళలేవు, వచ్చేయ్ నువ్వు అని చెప్పారు. ఎంత దూరం వెళ్తావు నువ్వు? ఎవరు వెళ్ళారు? ఎవరు వెళ్ళారండి? ఏకైక ఉదంతం. సావిత్రి ఆ విధంగా వెళ్ళింది. ఎలా? తనకుండే యోగశక్తి చేత, ప్రాణంతో అనుసంధానం పెట్టుకుని వెళ్ళింది. తెలుసా? అది కూడా తెలియద్దూ? నువ్వు స్వచ్ఛందగా బయటకి వెళ్ళినప్పుడు నీ ప్రజ్ఞ బయటకు వెళ్తుంటే, నీ ప్రాణ సూత్రం నీతో ఇక్కడ ముడి వేసుకుని ఉంటుంది. ప్రాణ సూత్రం దేహంతో ముడి వేసుకుని ఉంటుంది. ఎందుకంటే, you have an intention to come back. ఇహ మరి రావక్కర్లేదు అంటే అది కూడా ఊడదీసుకుంటాడు. లేదూ మళ్ళీ తిరిగి వస్తామంటే, ప్రాణ సూత్రంతో ముడి ఉంటుంది. Thread of life and thread of consciousness అని ఆత్మకి రెండు ఉన్నాయి. అవి ఏమున్నాయో మనకేం తెలుసు? ఏమయినా తెలుసుకుంటే కదా! ప్రాణ సూత్రం ద్వారా దేహం పోషింపబడుతూ ఉంటుంది. ప్రజ్ఞా సూత్రం ద్వారా జీవుడు

కార్యక్రామాలు చేసుకుంటూ ఉంటాడు. ప్రజ్ఞా, ప్రాణమూ రెండూ ఆత్మకి రెండు పాయలు, రెండు స్రవంతులు. ప్రాణ స్రవంతిని దేహంతో ముడి వేసుకుని, ప్రజ్ఞా స్రవంతితో నువ్వు బయటకు వెళ్ళొచ్చు. నిజానికి మనకి స్వప్నం కలిగినప్పుడు జరిగేదదే. ప్రతి వాడూ నిద్రలోకి వెళ్ళినప్పుడు స్వప్నం వస్తుందా? రోజూ రాకపోవచ్చు. అసలేం స్వప్నం రాకుండా ఎవడూ ఉండదు కదా! స్వప్నం వచ్చినప్పుడు నువ్వు దేహంలో లేవు కదా! మరి ఆ దేహంలో లేకపోతే, మళ్ళీ దేహంలో ఎట్లా మేల్కొయించావు? ఎప్పుడన్నా ఆలోచించారా? మనం స్వప్నంలో ఆ ఊరెళ్తాం, ఈ ఊరెళ్తాం, పుణ్యక్షేత్రాలు వెళ్తాం, ఎక్కడికో పోతూ ఉంటాం కదా! పొద్దున్నే లేవగానే గొప్పగా చెప్పుకుంటాం మంచి కలైతే, చెడ్డ కలైతే ఎవరికీ చెప్పుకోము కదా! మనలో మనమే దాచేసుకుంటాం. మనకి తెలియదా ఏది చెప్పుకోవాలో, ఏది చెప్పుకోకూడదో?

అంచేత, అలా ఏదయినా స్వప్నం కలిగింది కదా! స్వప్నంలో నువ్వు శరీరంలో లేవు కదా! శరీరంలో లేకుండా బయటకు ఎట్లా వెళ్తావు? నీకు స్వప్న అనుభూతి ఉందంటే, నీ ప్రజ్ఞ వాటినన్నిటినీ అనుభవించింది కదా ఆ ప్రాంతాన్ని, అక్కడుండే మనుషులని. అంటే, నీ ప్రజ్ఞ బయటికెళ్ళింది. ఎట్లా బయటకెళ్ళింది? ప్రాణ సూత్రం దేహంతో ముడి వేసుకుంటే, ప్రజ్ఞా సూత్రం బయటకెళ్ళి తిరిగొస్తుంది. అది స్వప్నంలో జరిగేది. అక్కడ నీ వశంలో జరగదు స్వప్నం. ఇవాళ్ళ నేను పడుకుని స్వప్నంలో అలా ఓ సారి మానస సరోవరం వెళ్ళొస్తానని అనుకుని వెళ్ళగలవా? స్వప్నంలో నీ అధీనంలో ఉండదది. మామూలు నీ జీవితమే నీ ఆధీనంలో ఉండదు, అంతకన్నా ఘోరం స్వప్నంలో. You cannot choose your dream కదా! జీవితమే మనం కోరుకుంటునట్టుగా జరగదు కదండి. స్వప్నం లాంటిదే ఇది కూడా. అటు వెళ్లొద్దులెండి ఎక్కువ దూరం, అది పెద్ద విజ్ఞానం, తెలియాలది. ఇది కూడా ఒక స్వప్నమని తెలియాలి. ఇందులోంచి కూడా మేల్కొయించడం ఉంటుంది. మాములుగా వచ్చే స్వప్నాలలోంచి ఎలా మేల్కొయింపబడుతున్నావో, ఇది కూడా ఒక స్వప్నమే, ఈ స్వప్నంలోంచి కూడా మేల్కొయించాలి. ఇదే కదా అంతా అనుకోకూడదు. ఎంత నువ్వు బాగా చెప్పేసుకుంటూ అందరి చుట్టూ తిరుగుతున్నా, ఇది కూడా స్వప్నమే. నీవు ఇలా ప్రవచనాలు ఇవ్వడం కూడా స్వప్నమే. అందరూ నిన్ను ఆదరించడం కూడా స్వప్నమే. అంతా స్వప్నమే.

So, అందుకుని సావిత్రిదేవి యముడితో వెళ్తున్నప్పుడు, ప్రజ్ఞ ఆయనతో వెళ్తూ ఉంటుంది. ప్రాణములు హరింపబడవు, శరీరానికి ముడి ఉంటుంది. అదీ యోగం. మరిలాంటి యోగంలో చేరామని మీకేమయినా తెలుసా అసలు? ఆయనెంత మొత్తుకున్నాడో తెలుసా? ఇక్కడ పెట్టారులెండి బొమ్మ. అది నిజ స్వరూపం, ఇది విగ్రహమూర్తి, ఇది ఉత్సవమూర్తి. సద్గురువుకి నిజ స్వరూపమిదే. అది మీకు తెలియాలని అది పెట్టారీసారి. అంటే, బొమ్మలు పట్టుకుని ఏడవకండి. ఇది నిజ స్వరూపం, ఇది ఉత్సవమూర్తి. ఒకటికి మూడయినాయి కదా! ఎన్నయినా అవుతాయి. తెలుసుకుంటూ ఉంటే ఉత్సవమూర్తులు చాలా తయారవుతారు కదా! తెలుసుకోకపోతే...

అంచేత, ఆమె ఆ విధంగా వెళ్ళిందండి. ఎంత ధీమంతురాలు! శంకరాచార్యుల వారు కూడా పరకాయ ప్రవేశ విద్య అనేటటువంటిది నిర్వర్తించి చూపించారు తన అనుయాయులకి. ఏమిటిది? ఆ శరీరంలోంచి

బయటకొచ్చేసి ఇంకో శరీరంలోకి కూడా ప్రవేశించవచ్చు. అప్పుడే fresh గా మరణించిన ఒక శరీరంలో ప్రవేశించవచ్చు, ఓ జంతువులోకి ప్రవేశించవచ్చు, నీ ఇష్టం. మీకివన్నీ విఠాలాచారి సినిమాలు చూస్తే బాగా తెలుస్తాయి. పరకాయ ప్రవేశ విద్య బాగా చూపించాడాయన. ఆయన ఎప్పుడో ముప్పైళ్ళ క్రితం చూపించినవే ఇప్పుడు హాలీవుడ్లో చూపిస్తున్నారండి. ఆయన ఎంత ద్రష్ట? ఆచార్యులవారు. మనకేదో నవ్వులాటగా ఉండేది. మహాద్రష్ట ఆయన. నాకనిపిస్తుంది ఆ సినిమాలు చూస్తుంటే, ఆయనకి ఎంత దృష్టి అని. ఆయనకి అంత దృష్టి ఉండబట్టి అలాంటివి చూపించగలిగాడు. తీసే విధానం అప్పుడుండే technology ప్రకారం అంత బావుండేది కాదు గాని theme ఇప్పుడు హాలీవుడ్ వారిని మించిపోయి ఉండేది. ఎప్పుడూ? నలభైయేళ్ళ క్రితం, ముప్పైయేళ్ళ క్రితం. అది side issue.

Main issue లోకి వస్తే, ఈవిడ వెంటబడి వెళ్ళింది. అంటే, వెంటబడి వెళ్లిందంటే, ఎట్లా వెళ్ళిందన్న ప్రశ్న రావొద్దండి? సినిమా తీసేవాళ్ళు కూడా సరిగ్గా తీస్తే అందులోంచి అదే రూపం, ఆ heroine ని, ఓ వెలుగు రూపంతో కదిలి వెళ్తున్నట్టుగా చూపిస్తారు, తెలిస్తే. తెలియకపోతే, ఈ రక్తమాంసాదులతో, ఇంత లావుగా ఉన్న heroine వెళ్తున్నట్టుగా చూపిస్తారు కదా! మనకి కూడా ఏం తెలీదు అప్పుడు. మీరు లవకుశ సినిమా చూస్తే అందులో వాల్మీకి మహర్షి అమ్మవారు, సీతాదేవికి బొట్టు పెట్టి, కళ్ళు మూసుకొని, చూడు తల్లీ అంటే, ఆవిడ సూక్ష్మ శరీరం కదా వెళ్లి చూస్తుంది రాముడు యజ్ఞం చెయ్యడానికి ఎవరిని ఏర్పాటు చేసుకున్నాడో తన భార్యగా. వెళ్లి చూసి వచ్చేస్తుంది. అంతే కాదు, అక్కడికెళ్ళి బొట్టుకూడా పెట్టి వస్తుంది కదా! అది సినిమాలోనే కాదు గ్రంథంలో కూడా ఉంది. అంచేత, ఇలా సూక్ష్మ శరీరంతో వెళ్ళడం అనేది యోగ విద్యలో ఒక భాగం. అందుకని మనకి relevent ఇది. అలాంటి యోగ విద్యలో ఉన్నాం మనం. చాలా busy గా ఏవేవో చేసుకుంటూ ఉంటాం ఇందులో కూర్చుని, ఇది ఒక్కటి తప్ప. ఏది చెయ్యాలని ఆయన చెప్పాడో అదొక్కటీ తప్ప అన్నీ చేస్తుంటామండి మనం. ఓ విపరీతంగా గురుపూజలు చేసేస్తుంటాం, ఓ అక్కడ గురుపూజలు, ఇక్కడ గురుపూజలు, వాడిని చూసి వీడు, వీడిని చూసి వాడు, పోటీ గురుపూజలు జరుగుతూ ఉంటాయి కదా! పోటీలేగా! మనిషి బుఱ్ఱలో పోటీ బుద్ధి ఉంటే గురుపూజలు పోటీగా చేస్తుంటారు. వాడిలా చేసాడు కాబట్టి నేనిలా చేస్తాను, వాడి కన్నా బాగా... ఏమిటిది? ఇవన్నీ ఎందుకు? ఏం చేస్తావు బాగా? ప్రార్థన బాగా చెయ్యి. కొంచెం ప్రార్థన తగ్గించండి సార్, సమయం ఎక్కువైపోతోంది అంటున్నారీ మధ్య. అదేంటండి? ప్రార్థన తగ్గించడమేమిటి? అప్పుడు విశాఖపట్నంలో గురుపూజలకి అలా ప్రార్థనా, ప్రవచనం మీరు తొమ్మిది వరకూ అయిపోతే కష్టం సార్, ప్రార్థన తగ్గిస్తే సరిపోతుంది... ప్రార్థన తగ్గించకూడదు, ప్రవచనం తగ్గించాలి. ప్రార్థన తగ్గిస్తే ఎట్లా? ప్రార్థన పెంచుకోవాలి. అదొక్కటే మార్గం. నాన్యపంథా. ఇంకో మార్గం లేదు. ప్రార్థన ఒక్కటే మార్గం. ఇవన్నీ తెలియడానికి, ఈ మార్గాలు తెలియడానికి.

అంచేత, అలా వెళ్ళింది. మనం కూడా breakfast కి వెళ్దాం మరి! తొమ్మిదయిపోతోంది. సరే, ఆవిడ అలా వెళ్తూ వెళ్తూ ఉంటుంది. మళ్ళీ మనమొచ్చే సరికి కూడా వెళ్తూ ఉంటుంది ఆవిడ. వీలుంటే మధ్యాహ్నం కూడా చెప్పుకుందాం. ఏదోటి కత్తిరించేద్దాం, కత్తిరించి చెప్పుకోవచ్చు. ఒక కార్యక్రమం కత్తిరిస్తే చెప్పుకోవచ్చుగా!

చెప్పుకుంటే, మళ్ళీ సాయంత్రం పట్టుకొచ్చేస్తుంది ఆవిడ. ఎలా పట్టుకొచ్చింది, పట్టుకు రావడంలో ఆవిడ చూపించినటువంటి సంస్కారం అద్భుతం.

అంచేత, "ధనుర్ధరుడది గమనించి, లతాంగీ నన్నేల అనుసరించుచున్నావు?" అంతకుముందు, సాధ్వీమణీ అన్నాడు, ఇప్పుడు లతాంగి అన్నాడు. అంటే, సూక్ష్మము. చెట్టుకీ, తీగకి తేడా లేదండీ? సాధ్వీమణీ అన్నదానికి, లతాంగి అన్నదానికి, ఎందుకిలా వాడాడు అని మనం ఆలోచించాలి. మహర్షులు అడ్డుగోలుగా పదాలు వాడరు. రాసినది వేదవ్యాసుడు కదా! అనువదించినది తెలిసినాయన. ప్రస్తుతం తెలుగు వారికి తెలుగులో వాచికమైన అనువాదం పిలకా గణపతి శాస్త్రి గారే. ఆయనేం చేస్తారు? అక్కడ పద్య రూపంలో ఉండేది యథాతథంగా ఆ భావం ఇక్కడ తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. లతాంగి అనకుండా, ఓ అమ్మాయి అని అట్లా ఉండదు. ఇంకో రకంగా మాట్లాడదు. ఎంచేత? సూక్ష్మ శరీర ధారిణి అయిపోయింది ఆవిడ అప్పటికి. అంటే, తను ఒక మెరుపు తీగలా ఉంది. "లతాంగీ నన్నేల అనుసరిస్తున్నావు? వలదు, వలదు. నిలిచిపోవవలసినది. ఇక ఈ మార్గము నీకు అగమ్యము" అన్నాడు. అంటే, నువ్వు రాలేవు ఈ మార్గంలో అన్నాడు. మార్గంలో నువ్వు రాగలిగిన దానివి కాదు, నీకది కదల్లేవు. అగమ్యమంటే? గమనము అంటే కదలడము, గమ్యము అంటే కదిలే మార్గం. అగమ్యము అంటే నీకు దారి తెలియదమ్మా, రాలేవు అని చెప్పాడు. "అని ఆజ్ఞాపించాడు. అయినా సావిత్రి తన ధోరణి విరమించక, ప్రగాఢ వినయంతో ఇట్లని నివేదించినది." ఎట్లా నివేదించినదో తర్వాత మనం చెప్పుకుందాం.

--- స్వస్తి

# సావిత్రోపాఖ్యానము

## July 22, 2013 సాయంత్రం – ప్రవచనం #6

దండధరుడు అని యమునికి ఒక నామము. దండము ధరించి అధర్మమును ఆచరించేటటువంటి వారికి, సృష్టి నియమాలను ఉల్లంఘించే వారికి దండనని విధించేవాడు కాబట్టి అతడిని దండధరుడు అని పిలుస్తారు. గదాధరాయనమః అని కూడా పిలుస్తారు. విష్ణుమూర్తి యమస్వరూపం గదాధర స్వరూపం. అందుకని, గదాధరుడని ఎవరూ ఎక్కువగా పేరు పెట్టుకోరు. గదాధరుడంటే తప్పనిసరి శిక్ష. అంటే, వేలు దీపం దగ్గర పెడితే కాలడం అనేది ఎంత తప్పనిసరో, అలా సృష్టిలో సృష్టి ధర్మాలని అతిక్రమిస్తే అంత తప్పనిసరిగా దానికి తగినటువంటి శిక్ష ఒకటి ఏర్పాటు చెయ్యబడింది. సృష్టి నిర్మాణం అప్పుడే అందులో ఒక ధర్మచక్రాన్ని ఇమిడ్చి ఉంచారు. అంచేత, ఆ ధర్మచక్రమే కాల రూపంలో ప్రతివారికి శిక్షణ ఇచ్చి, జీవులని సరైన దారిలో పెడుతూ ఉంటుంది. ఒక అన్యాయం జరుగుతుంటే, మనం ఏమిటి ఇంత అన్యాయం జరుగుతోంది, దీనికేం మార్గం లేదా, దీనికేం శిక్ష లేదా అని మనం అనుకుంటూ ఉంటాం కదా! కాని మనకి తెలిసేటట్లుగా కాకుండా తెలియకుండా కూడా చాలా రకాలుగా శిక్షలు పడుతూ ఉంటాయి. ఒక్కొక్కరికి చేసినటువంటి భావనలబట్టి, భావనయందు ఒక దుర్భావన కలిగినా, అది వాక్కునందు, చేష్టనందు ప్రకటింపబడకపోతే దానికి శిక్ష తక్కువగా ఉంటుంది. అంటే, మధనం అంతా కూడా భావనలోనే ఉంటుంది. చాలామంది మనసు బాలేదు, మనసు బాలేదు అంటూ ఉంటారు కదా! మనసు బాలేదు అంటే మనసుతో చేసినటువంటి అపచారానికి మనసు బావుండదు. అలాగే, వాక్కు బాగా లేకపోతే, దానివల్ల ఇంకొకరికి అది బాధ కలిగిస్తే దానికి శిక్ష ఉంటుంది. అలా బాగా బాధ పెట్టేస్తే మరుజన్మలో మూగవాడిగా పుట్టొచ్చు. అలా మనకి పుట్టు గుడ్డి, మూగ, చెవుడు, కాలు లేకపోవడం, చెయ్య లేకపోవడం, ఇటువంటివన్నీ చూస్తూ ఉంటాం కదా! అంతేకాదు, కొంత దూరం వెళ్ళిన తర్వాత అలాంటివి జరగొచ్చు కూడా! ఇలా సృష్టిలో చేసిన పనికి ఏదో ఒక శిక్ష. అంటే, చేసిన పొరపాటు పనికి తద్వారా జీవుడు తదనుగుణమైనటువంటి శిక్షణ పొందుతూ ఉంటాడు.

అంచేత, ఇక్కడ ముందు నీవెవరని అడిగితే, నేను అంతకుడిని అని చెప్పాడు. ఇప్పుడు వేదవ్యాస మహర్షి దండధరుడు అని ఒక పదాన్ని వాడాడు. అంటే, దండము విధించేటటువంటివాడు. ధర్మాతిక్రమణం జరిగినప్పుడల్లా, చిన్నదయినా, పెద్దదయినా, దండన ఉంటుంది. అలా చాలా నిష్కర్షగా నిర్వర్తిస్తాడు. అందుకని యముడు అంటారు. యమము పాటించనివారిని యమము అవలంబించేటట్టుగా శిక్షణ ఇస్తాడు. ఇంకో మార్గం లేకుండా బంధిస్తాడు. అంచేత, అతనికి దండధరుడు అని పేరు. కించిత్ తప్పుకి కూడా శిక్ష ఉంటుంది. అతడు చేసిన ప్రవర్తన వలన ఎవరయినా బాధపడి మన్నించినా, చేసినవాడికి శిక్ష ఉంటుంది. అట్లా ఉంటుంది సృష్టి. అంచేత, మనకొక నానుడు ఉంది, "వాడి పాపాన వాడే పోతాడు మన కేందుకులే" అని. ఎందుకంటే, శిక్ష తప్పదు. కాకపోతే, మనకి తెలిసేటట్టుగా జరక్కపోవచ్చు అన్నీ. ఏమిటోనండి, ఎందుకింత కష్టం వచ్చిందో ఫలానా వారికి అనుకుంటూ ఉంటాం

కదా! ఎవరికి ఎప్పుడు ఏ కష్టం వచ్చినా దానికి వెనకాల పూర్వకథ ఒకటుంటుంది. పూర్వాపరములు ఎరిగినటువంటివారు మాత్రమే వీటికి సమాధానం చెప్పగలరు. పూర్వాపరములు తెలియనివారు, ఏమో ఏం చేసామో, అందుకని అనుభవిస్తున్నాం అని తెలిసి సర్దుకుపోయే వాళ్ళుంటారు. సర్దుకుపోలేక దానితో పోరాడేవాళ్ళూ ఉంటారు. అది పోరాడడం ఎట్లా ఉంటుందంటే గోడతో గుద్దుకోవడమే! ఎంత గుద్దుకున్నా అంత నీ చేతికి నొప్పి తప్ప, అది అనుభవమై, తదనుగుణమైన మార్పు నీలో వచ్చేంతవరకూ ఆ దండన ఆ విధంగా విధింపబడుతూ ఉంటుంది.

నేను మాస్టరుగారితో తిరుగుతున్న రోజుల్లో మాస్టరుగారు ప్రతీవారం ఒక భార్యాభర్త ఇంటికి వెళ్తూ ఉండేవారు. భర్త చాలా నిరంకుశుడు, భార్య చాలా సాధు స్వభావం. ఈయన వెళ్తూ ఉండేవారు వారంవారం. నాకెంత అవకాశం ఉంటే అంత మాస్టరుగారితో తిరుగుతూ ఉండేవాడిని. ఆయనని ఎక్కడికేనా తీసుకెళ్లాలంటే నాకు సరదాగా ఉండేది. కారు తీసుకుని వెళ్లి, ఆయనని తీసుకుని వెళ్తే, ఆయన వాళ్లకి చెప్పినవి, చేస్తున్నవి, ఇటువంటివన్నీ కొన్ని మనకి తెలుస్తూ ఉండేవి. ఈ భార్యాభర్తల విషయంలో నేను ఆయనని అడిగాను, ఇంత బండ మనిషిని, ఇంత నిరంకుశంగా ఉండేటటువంటి వాడిని ఎలా ఆ స్త్రీకి భర్తగా ఏర్పాటు చేసాడో భగవంతుడు చాలా ఆశ్చర్యంగా ఉంది మాస్టారు అంటే, అప్పుడు నవ్వారాయన. "మనం ఇది చూసి ఇది ఇలా ఉందనడమే తప్పు, ఎందుకిలా ఉంది అని తెలియాలంటే పూర్వాపరాలు తెలియాలోయ్" అన్నారు. అంచేత, ఈ నువ్వు చెప్పినటువంటి ఆ భార్యకి ఎందుకిలాంటి భర్త కలిగాడు అని తెలియాలంటే ఆమె పూర్వకథ తెలియాలి అన్నారు. ఇంతకుముందు జన్మలో ఆమె జీవిత భాగస్వామిని ఏ విధంగా దుఃఖ పెట్టిందో? ఆ జన్మలో స్త్రీ అయితే క్రిందటి జన్మలో స్త్రీ అయిఉండక్కర్లేదు. భాగవతం ఆరోస్కందం ఏం చెప్తుందంటే జీవుడు పరిణామ కథలో ఒక జన్మలో స్త్రీ, మరొక జన్మలో పురుషుడు, మరొక జన్మలో మళ్ళీ స్త్రీ, ఇట్లా సాగుతూ ఉంటుంది కథ అని చెప్తారు. ఎందుకంటే, మనిషి పరిపూర్ణుడు కావాలంటే అతనియందు స్త్రీ, పురుష ప్రజ్ఞలు చక్కగా సమన్వయింపబడాలి. ఇప్పుడీ జన్మలో పురుషుడిగా పుట్టిన వాళ్ళం, చాలా చేయించుకుంటూ ఉంటాం స్త్రీలచేత కదా! అంటే, బాగా చేయించుకోవడంచేత మనం బాగా receive చేసుకుంటాము కదా! ఎంత మనం ఆ విధంగా సేవ చేయించుకుంటూ ఉంటే వారి నుంచి ప్రసరింపబడుతూ ఉంటుంది చైతన్యం మనకు. మనం అందుకుంటూ ఉంటాం వారు చేస్తున్నవన్నీనూ. అది కారణంగా క్రమంగా వారిలో పురుష ప్రజ్ఞ పెరుగుతుంది. మనం అందుకోవడం అలవాటు చేసుకోవడంతో మనలో స్త్రీ ప్రజ్ఞ పెరుగుతుంది. అంచేత, పై జన్మలో స్త్రీగా పుడతాం. స్త్రీగా పుట్టి ఇదివరకూ బాగా కూర్చుని చేయించుకోవడం అలవాటు పడ్డవాళ్ళం, ఇప్పుడు అన్నీ చేసి పెట్టేటటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. అది మాములుగా రూపాలు ఎట్లా ఉన్నా... కొంతమంది పురుషులు, స్త్రీలకు చాలా చేస్తూ ఉంటారు, స్త్రీ చేయించుకుంటూ ఉంటుంది కదా! ఏమిటి అర్థం? ఇదివరకూ అతడు అంత పొంది ఉండడం వల్ల ఇప్పుడు చెయ్యాలిసివస్తోంది. పురుషుడిగా ఉన్నా, స్త్రీగా ఉన్నా, ఈ ఇచ్చిపుచ్చుకోవడాలన్నీ కూడా ఋణసంబంధాలే, కార్యకారణ సంబంధాలే. అంచేత, ఈమె ఎంత నిరంకుశంగా ఉందో జీవిత భాగస్వామితో, లేకపోతే ఎందుకిలా ఉందో మనకి తెలియదు. అందుకని నువ్వు పూర్వజన్మ కథలు తెలుసుకుంటే తప్ప మనకి చాలా విషయాలకి సమాధానం దొరకదు అని చెప్పారు.

ఇప్పుడు ద్రౌపతీదేవి ఐదుగురిని వరిస్తుంది, పాండవులు ఐదుగురిని, మత్స్యయంత్రం అర్జునుడే చేధించినా. దృపదుడు అర్జునుడు తన కూమార్తెకి భర్త కావాలని కోరుకుని ఆ మత్స్యయంత్రం ఏర్పాటు చేస్తాడు. ఎందుకంటే, విలువిద్యలో మేటి అయినటువంటి వాడే దానిని చేధించగలడు కాబట్టి. అర్జునుడు ఎక్కడో అజ్ఞాతంగా ఉన్నప్పటికీ, వాళ్ళు బ్రాహ్మణ కుమారులుగా ఏకచక్రపురంలో ఉంటూ ఉంటారు. స్వయంవరం వేయిస్తాడు దేశం అంతా. వేస్తే తప్పక వస్తాడని ఎందుకంటే, అది పోటీ కదా, వీరత్వం చూపించాలి, పరాక్రమం చూపించాలి. అందుకని, అర్జునుడు తప్పకుండా వస్తాడనే ఆ విధమైన ఒక పన్నాగం ఒకటి పన్నితే, అర్జునుడు వస్తాడు కదా! చేధిస్తాడు. కాబట్టి అర్జునుడికి ఇచ్చి పెళ్లి చెయ్యాలనుకుంటాడు. కానీ వీళ్ళు ఐదుగురూ పెళ్లి చేసుకోడానికి సిద్ధపడతారు. కథంతా చెప్పడంలేదు, ఎందుకంటే విషయం చెప్దామని. ఐదుగురు పెళ్లికుమారులు పీటలమీద కూర్చుంటే ఒక పెళ్ళికుమార్తె కోసం పెళ్లికుమార్తె తండ్రికెలా ఉంటుంది? ఆశ్చర్యపోతాడు ఇదేంటి ఐదుగురు పెళ్లికుమారులేంటి అని. అంటే, మా సంగతి వదిలెయ్యి, మీ అమ్మాయికి ఇష్టమేమో కనుక్కో ఇలా ఐదుగురు కూర్చున్నారని అడగమంటారు. వెళ్లి అడిగితే ఇష్టమేనని చెప్తుంది. అదేంటండి? అదేంటి, అట్లా ఎట్లా ఇష్టంగా ఉంటుంది ఈ ఐదుగురు అంటే? ధర్మరాజుని అడుగుతారు, ధర్మం తెలిసినవాడివి కదా, నువ్వు ధర్మం చెప్పు అని. ఇది ధర్మమేగాని ఎలా ధర్మమో తెలియదు అని చెప్తాడు. ఇది ధర్మమే అని లోపల అనిపిస్తోంది, కానీ నేనేం చెప్పలేను నీకు. ధర్మం కాకపోతే మా అమ్మ అలా చెప్పదు మాకు అన్నాడు ఆయన. మా అమ్మ సత్యవాక్కు కలది, ఆమె నోటి నుంచి వచ్చింది మీరు ఐదుగురు అనుభవించండని. అంచేత, మేము ఐదుగురు కూర్చున్నాం అని చెప్తాడు. అప్పుడు చాలా సందిగ్ధం వస్తుంది. వచ్చినప్పుడు వ్యాసమహర్షి వస్తాడు. వచ్చి, ఈ ద్రౌపతీదేవి, ఈ పాండవులు, వాళ్ళ పూర్వజన్మ కథలన్నీ తెలియపరుస్తాడు. అప్పుడు దృపదుడు సమాధానపడతాడు. నేను సమాధానపడొచ్చు, సంఘానికి ఎలా చెప్పను అంటే, నా కుమార్తె ఈ విధంగా ఇష్టపడుతోంది కాబట్టి చేస్తున్నానని చెప్పు అన్నాడు. కుమార్తె ఒప్పుకుంది కదా!

అలా చాలా కథల్లో మనకి పూర్వాపరములు ఉంటాయి. ఈ పూర్వాపరములు తెలియడం, దుఃఖాలు అనుభవించినా, సుఖాలు అనుభవించినా... ఏ తెలివితేటలు ఉండవండి, అద్భుతంగా ఐశ్వర్యం వరిస్తూ ఉంటుంది వాడిని. వాడిని చూస్తే వీడికేం తెలివుందని అబ్బింది వీడికి అనిపిస్తుంది. అమోఘమైన తెలివితేటలు ఉంటాయి, ఏం ముట్టుకున్నా మసే! చాలా తెలివైనవాడు. మనం ఊహించలేనంత తెలివితేటలు, కానీ ఏదీ కలిసిరాదు. అదేంటి చెప్పండి? మాములుగా మన equations ఎట్లా ఉంటాయి? తెలివి ఉంటే దాని ప్రకారం వాడు చాలా ఉన్నతమైన స్థితుల్లోకి వెళ్ళవచ్చు. తెలివితేటలు లేనివాడు అలా వెళ్ళలేడు కదా! మరి ప్రపంచం చూస్తే అలా ఉండదు. మేధావులంతా ఉత్తమోత్తమమైన పదవుల్లో ఉన్నారా? లేదు కదా! ఒక్కొక్కసారి మూర్ఖుడు కూడా అక్కడ కూర్చుంటాడు కదా! ఎందుకు కూర్చుంటాడు? అది పూర్వ పుణ్యం. ఇప్పుడు గురుచరిత్ర చదువుకున్న వాళ్ళకి తెలుస్తుంది. ఓ చాకలివాడు ఒకడు, వాడి పుణ్యం అలా ఉండి వాడికి నృసింహ సరస్వతి తారసిల్లాడు. తారసిల్లితే, ఆ నృసింహ సరస్వతి కలిసిన సందర్భంలో అప్పుడే ఒక రాజలా వెళ్తుంటాడు తన పరిచారంతో. ఎంతో వైభవంగా ఉంటుంది. చూసి గురువుగారికి దణ్ణం పెట్టి, నాకిలా చెయ్యరా ఎప్పుడైనా అని అడుగుతాడు. నేను కూడా అలా ఉండాలనుంది అంటే, పై

జన్మలో అలాగే పుడతావురా అని ఆయన ఆశీర్వదిస్తాడు. అంటే, నిజమా స్వామీ అంటే, అవును నువ్వు ఒక తురకరాజుగా పుడతావని చెప్తాడు. అప్పుడే కొత్తగా వస్తున్నారు తురకలు మనకి. అట్లా ఏదో ఒక తుగ్లక్ వస్తాడు ఏముంది? అంటే, వాడికి తెలివి ఉండక్కర్లేదు కదా పరిపాలించడానికి, చుట్టూ చాలామంది ఉంటారు. మనకలా ఎంతమంది రాలేదు? తెలివి లేక, అట్లా పదికాలాలపాటు ఐశ్వర్యాలు అనుభవిస్తూ... ఏం ఉండదు, గట్టిగా పొట్ట పొడిస్తే అక్షరం ఉండదు కదా! వీటిని ఎలా లెక్క వేస్తారు? చాలా ఆరోగ్యసూత్రాలు పాటించేవారికి అనారోగ్యం కలుగుతుంది కదా! ఏమీ పెద్దగా అంత ఆరోగ్యసూత్రాలు పాటించకపోయినప్పటికీ ఆరోగ్యంగా ఉండేవాళ్ళు ఉంటారు. నేను మొన్న కూడా చూసాను యూరపులో. ఆయనకి ఎనభైయేళ్ళు. ఎప్పుడూ సిగరెట్లు కాలుస్తూనే ఉంటాడు. ఏది, ఇన్ని advertisement లు ఉన్నా! ఎన్ని advertisement లు ఉన్నాయండి, cigarette smoking is injurious to health అని. Cancer వస్తుందని, అదొస్తుందని, ఇదొస్తుందని కొంత భయపడి మానేస్తాం కదా! ఆయన కాలుస్తున్నాడు. ఏమిటయ్యా నువ్వు ఇలా సిగరెట్లు కాలుస్తున్నావు అనడిగితే, చిన్నప్పుడెప్పుడో అలవాటయిపోయింది, ఇప్పుడేం మారుస్తాం అన్నాడు. ఏం కాలేదు, పైగా ఇంకే జబ్బూ కూడా లేదు. అది చూడండి, ఎనభైయొక్క ఏళ్ళ మనిషికి ఎప్పుడూ సిగరెట్టు కాల్చేవాడికి జబ్బు లేదండి!

అంటే, మీరు సృష్టిలో జరిగేవాటికి మనకి సమాధానాలు చాలా వాటికి తెలియదు కదా! ఎందుకు తెలియవంటే, సృష్టి చక్రాన్ని ఆ విధంగా దండధరుడు నిర్వర్తిస్తూ ఉంటాడు. ఎవ్వడూ తప్పించుకోడానికి వీలు ఉండదు. ఇవాళ్టికి తప్పించుకున్నావని సంతోషపడవచ్చు, కాని కాలచక్రం అది, రేపోమాపో, పై జన్మో, ఎప్పుడో అప్పుడు తప్పదు. అందుకని, అతడికి ఈ పేరు ఏర్పడింది దండధరుడని. ఎవరి చేతిలోనైనా తప్పించుకోవచ్చు తప్ప యముని చేతిలో తప్పించుకోలేరు. అతనికి అనుయాయిగా, అసిస్టెంట్ అంటాం కదా, చిత్రగుప్తుడుంటాడు. చిత్రగుప్తుడంటే akashic records అని చెప్తూ ఉంటారు. మనం చేసే ప్రతి పని, ప్రతి మాట, ప్రతి ఆలోచన, మన చుట్టూ ఉండే ఆకాశంలో continuos గా record అయిపోతూ ఉంటుంది. దాన్నే akashic record అంటారు. అందుకని మనం ఒక జన్మ ఇలా జీవించామనుకోండి, ఓ పుస్తకం తయారవుతుంది. మన biography మనం రాసుకుంటే మంచి మంచి విషయాలన్నీ అలా రాసుకుని, మిగతావన్నీ అలా పక్కన పెట్టేస్తాం కదా! అసలు కొంత గుర్తే ఉండదు. మంచి విషయాలన్నీ గుర్తు తెచ్చుకుని రాస్తాం, మంచివి కాని విషయాలు గుర్తు వచ్చినా రాయం. అందుకే కదా biography లు ఇట్లా ఉంటాయి, అది biography అయితే. అదే ఓ విమర్శకుడు రాస్తే, వాడు చూసిందే రాస్తాడు, మొత్తం రాయలేడు కదా! కాని చిత్రగుప్తుడు రాసే biography మొత్తం చిట్టా అంతా ఉంటుంది. ఆకాశంలో records పొందేటటువంటి విధానం కూడా ఒకటుంది. అంటే, జీవుల చరిత్రలు కాదు, మహాత్ముల చరిత్రలు ఆకాశంలో దర్శించి మళ్ళీ మళ్ళీ రాసిచ్చే విధానాలు ఉన్నాయి. అంచేత, తప్పించుకోలేనటువంటి దండన నిర్వర్తించేటటువంటి ఒక ప్రజ్ఞ సృష్టిలో ఉన్నది అని మన ఋషులు దర్శించారు, దాన్నే దండధరుడని పేరు పెట్టారు.

అంచేత, ఆ దండధరుడు అడిగాడు, "నన్నేల అనుసరించుచున్నావు? వలదు వలదు. నిలిచిపోవలసినది. నీకు ఇక ఈ మార్గం అగమ్యము." ఎప్పుడూ రాలేదు నువ్వు ఈ మార్గంలో. అసలు బొత్తిగా ఎవరూ ఆ మార్గంలో వెళ్ళలేరు,

తీసుకెళ్తే తప్పు. తీసుకెళ్లడం ఏమిటి, లాక్కెళ్తారు! ఎవరూ కావాలని రారక్కడికి. కావాలని ఎవరూ రారు కదా, లాక్కెళ్తూ ఉంటారు ఆ దారిలో! అందుకని, ఎవరూ వెళ్ళరు ఆ దారిలో, కాబట్టి తెలియదు ఆ దారి. "పుణ్యపురుషా, పతులెచ్చటికి పోయినా సతులు వారి ననుసరించ వలసినదే కదా! నీ అనుగ్రహం వల్ల, భర్తృభక్తి ప్రభావం వల్ల నాకు అగమ్యమైన నెలవున్నాదా" అన్నది. అలా అని చెప్పి పెట్టిందావిడ. నీ అనుగ్రహం నామీద ఉందంది. అంచేతే నన్ను సాధ్వీమణి అన్నావు. నీ పాతివ్రత్య మహత్యం వలన నువ్వు నన్ను చూడగలిగావు అని అన్నాడు కదా! అందరూ చూడలేరు అని చెప్పాడు, అంటే ప్రశంసించాడు సావిత్రిదేవిని. కాబట్టి నీ అనుగ్రహం ఉన్నది. అంతేకాదు, నా దగ్గర నా ప్రాణములుండగా నా పతి ప్రాణములు పోవడానికి వీలులేదు. అలాంటి ఒక దీక్ష ఉన్నది. నాకు ప్రాణములుండగా నా పతి ప్రాణములు పోవడానికి వీలు లేకుండా ఉండేటట్టుగా నేను ఒక ఏర్పాటు చేసుకున్నాను. కాబట్టి ఆయనెక్కడికి వెళ్తే నే నక్కడికి వెళ్ళవలసిందే అన్నది.

"మరెన్ని సకల మార్గాలలో ధర్మ పద్ధతి మిక్కలి ప్రశస్తమైనది. సత్పురుషులే అట్టి ధర్మానికి ఆధారభూతులు. సజ్జన దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు" అన్నది. చూడండి! అంటే, అది ప్రజ్ఞలో ఉంటే వస్తాయి తప్ప, అప్పటికప్పుడు అల్లుకుందామన్నా రావు కదా! ఏం చెప్పింది? ఆయన వెంట నేను రావాలి, ఒకటి. నీ అనుగ్రహం నాకు ఉంది, రెండు. నేను నా ప్రాణములుండగా ఆయన ప్రాణాలు కోల్పోడానికి వీలులేని విధంగా ఒక వ్రతంలో ఉన్నాను. అంటే, ఉపవాసంలోనే ఉంది కదండి. ఇవన్నీ ఇలా ఉండగా, నీ దర్శనం నాకు అయ్యింది కదా, ఒక సత్పురుషుడిని దర్శనం చేస్తే దాని ఫలం తప్పక ఉంటుంది, సత్ఫలం ఉంటుంది, అది వ్యర్థము అవ్వదు కదా! "సత్పురుషులే అట్టి ధర్మానికి ఆధారభూతులు. సజ్జన దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు." అది గుర్తు పెట్టుకోవాలి. ఎవరయినా ఊళ్ళో ఒక మహాత్ముడు ఉన్నాట్ట అంటే వెళ్లి దర్శనం చేసుకోవడం అనేది ఆచారం. ఎంచేతంటే, దూరం నుంచయినా ఒక దర్శనం చేసుకుంటే దాని ఫలం ఉంటుంది. ఎందుకంటే, ఒక సత్పురుషుడు అతడు ఉన్న ప్రదేశమంతా కూడా ప్రభావితం చేసి ఉంచుతాడు. అందులో కాసేపు కూర్చుని వచ్చేసినా చాలు. అందుకే, ఇవ్వాళ్టికి కూడా ఓ షిరిడి సాయి మందిరానికో, లేకపోతే ఒక రమణ మహర్షి సమాధి దగ్గరకో వెళ్లి, అక్కడ మౌనంగా కాసేపు కూర్చుని వచ్చేస్తారు. మనకి స్థూలంగా అనిపించకపోవచ్చు అంటిదా, అంట లేదా అని. సూక్ష్మంగా జరగవలసినది జరుగుతుంది. మంచి పుణ్య ప్రదేశాలకి వెళ్ళినప్పుడు, పుణ్యక్షేత్రాలకి వెళ్ళినప్పుడు, సత్పురుషుల ఆశ్రమాలకి వెళ్ళినపుడు, సత్పురుషులు సన్నిధిలో ఉన్నప్పుడు, మనకు తెలియకుండానే మనలో ఒక శుభ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అలానే, మనం అశుభమైనటువంటి ప్రదేశాలు వెళ్ళినప్పుడు, నాకేం కాలేదు కదా, బానే ఉన్నాను కదా, ఏం అక్కడికెళ్తే ఏమయింది అంటాడు కదా! నీకు తెలియదు. ఎంచేత? నీకు స్థూలమైన విషయాలే అంత బాగా తెలియదు, సూక్ష్మంగా జరిగే ప్రక్రియ నీకేం తెలుస్తుంది? ఒక buchery పక్కనే ఉన్నామనుకోండి, రోజూ అక్కడ గొర్రెలు, మిగతా జంతువులు నరుకుతూ ఉంటారు. ఆ పక్కనే మన ఇల్లు ఉంది. చాలా అపాయకరమైనటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. అందుకనే, పూర్వకాలంలో ఇలాంటివన్నీ దూరంగా ఉంచేవారు. అందుచేత, వాతావరణం ఎప్పటికప్పుడు పునీతం చేసుకుంటూ ఉండాలి. ఒక్కసారి ఓంకారం చేస్తే వాతావరణం అంతా పవిత్రీకరమైపోతుంది.

ఇంతమంది కలిసి ఓంకారం చేస్తే తప్పకుండా చాలా పవిత్రీకరం అవుతుంది. అంచేత, సామూహికంగా చేసేటటువంటి ప్రార్థనల వలన చాలా ఉపయోగం మనకి ఉన్నది. దర్శనం చేసాం, దర్శనమే కాదు సంభాషణ కూడా చేసాం. అందుకనే మనకి ఒక వాక్యం ఉన్నది, "సత్పురుష దర్శనము, స్పర్శనము, సంభాషణము". దర్శన, స్పర్శన, సంభాషణములు జరిగినప్పుడు సత్పురుషులతో నీమీద వారి యొక్క ప్రభావం ఉంటుంది. వారి ప్రభావం అంటే? వారు ప్రత్యేకమైన, వ్యక్తిగతమైన ప్రభావం ఉంచుకోరు. వారు దైవ సానిధ్యంలో ఉండడం చేత దైవము వారి నుండి ప్రసరిస్తూ ఉంటాడు. ఏ వ్యక్తి అయితే తన్ని తాను ఒక తటస్థ స్థితిలో ఉంచుకుంటాడో, సర్వకాల సర్వావస్థలయందు, దైవ ఆరాధన చేస్తూ... ఆ తటస్థ స్థితినే సత్వగుణమని అంటారు. It is neither active nor passive. అంటే, తమోగుణం కాదు, రజోగుణం కాదు. అలాంటి స్థితిలో తటస్థంగా ఉండి, అంతటా వ్యాపించిన దైవంతో అనుసంధానం చెంది ఉన్నాడనుకోండి. ఉంటే ఏం జరుగుతుందంటే, అతడు వాహికగా సర్వవ్యాపకమైన తత్వము అతని నుంచి ప్రసరించి ఆ చుట్టుపక్కల అందరికి కూడా మేలు కలిగిస్తుంది.

మరి అటువంటి జ్ఞానం సావిత్రిదేవికి ఉన్నది. అంచేత, నీ దర్శనం లభించడమే కాకుండా, నీవు భాషణం కూడా నాతో చేసావు కదా! అంచేత, ఆ ఫలం ఉండదా అని అడిగింది. "సత్పురుష దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు. సాధుశేఖరుడువైన నీ సాక్షాత్కారము లభించినప్పుడు..." సాధుశేఖరుడు. శేఖరు అనే పదానికి అర్థం తెలుసా? శిఖరమువంటి వాడని అర్థం. శిఖరమంటే ఆ చుట్టుపక్కలుండే కొండలకన్నా ఎత్తైనది అని అర్థం. మన దేహానికి శిరస్సు శిఖరము. అంచేత, సృష్టిలో ఉండే సాధువులను తీసుకుంటే, ఆ సాధుసమూహాల్లో ఈయన అందరికన్నా గొప్పవాడు. ఎంత సాధువో అంత దండధరుడు కూడా. అది చాలా two extremities in one person. అది యముడు. అంతకన్నా సాధువులు లేరు. సజ్జనులకు సాధువు, దుర్జనులకు దండధరుడు.

అంచేత, శుభప్రాప్తి లేక నేను వట్టిచేతులతో మరిలిపోగాలనా అంది. నీవెంటబడి రాగలను కాబట్టి వస్తున్నాను కదా! సూక్ష్మ శరీరధారి అయి వెంట వెళ్తోంది. మాట్లాడుతున్నాడు మళ్ళీ రెండోసారి. మొదటిసారి మాట్లాడాడు భౌతికంగా శరీరంలో ఉన్నప్పుడు. రెండోసారి మాట్లాడాడు ఈవిడ సూక్ష్మ శరీరధారణ చేసినప్పుడు. మాట్లాడితే, ఎలాగూ పట్టికెళ్తున్నావు కదా, నీవెంట నేనొస్తుంటే, నువ్వు మాట్లాడుతుంటే నీ భాషణ వల్ల నాకు తప్పక ఏదో ఒక విధమైన శుభప్రాప్తి కలుగుతుంది. అంచేత, అలాంటిది ఉంటుంది కదా తప్పకుండా, ఇది సృష్టి ధర్మమే కదా! అందుకని నేను వస్తున్నాను, నేను రాగలను కాబట్టి వస్తున్నానంది. "సమవర్తి" ఇంకో పదం యముడికి. ఒకటి అంతకుడు, పొద్దున్న చెప్పాను కదా! రెండోది దండధరుడు. మూడవది సమవర్తి. సమవర్తనం ఉన్నటువంటి వారిని ఆదరిస్తాడు. అతడు సమవర్తనం కలవాడు. ఎన్నడూ పొరపాటులు జరగవు ఏ పనిలోనయినా. సజ్జనులకు ఆశీర్వచనము, దుర్జనులకు శిక్షణము, రెండూ చాలా తూకం వేసినట్టు చేస్తాడు.

"సమవర్తి ఆ ప్రగల్భ మధుర ప్రసంగం విని మిక్కిలి ఆనందించి, పతివ్రతా తిలకమా అన్నాడు". మళ్ళీ చూడండి, "పతివ్రతా తిలకమా" అన్నాడు. అంటే, పతిని అనుసరిస్తోంది కదా! అది ఒక వ్రతం. పతి ఎక్కడికెళ్తే

నేనక్కడికి రావాలి కదా అంది. అదో వ్రతం పెట్టుకుంది. అందుకనే కదా వచ్చింది, మూడు రోజులు ఉపవాసం చేసి, పగలూరాత్రీ సావిత్రిదేవి ఆరాధన చేస్తూ, ఉపవాసం ఉపసంహరించుకోకుండా వెంటపడి అడివికి వచ్చింది కదా! ఇప్పుడు దేహం కూడా పక్కన పదిలం చేసి, సూక్ష్మ ప్రజ్ఞతో అనుసరిస్తోంది కదా! ఎవ్వరూ అలా అనుసరించలేదు యముడిని. ఆశ్చర్యపోయి, మరొక ప్రశంస వేసాడు. "పతివ్రతా తిలకమా, నీ ఉదార వాగ్ధోరణి నాకు అమందానందం కలిగించింది." చాలా ఆనందం కలిగించింది. నిజమే కదా! ఆవిడ మాట్లాడిన మాట కేవలం ప్రశంస కాదు, అది సత్యం. సత్యం లేకుండా ప్రశంస చేస్తే అలా పొంగిపోయేవాడు కాదు యముడు. అసత్యాన్ని అసలు బొత్తిగా అంగీకరించనటువంటి ప్రజ్ఞ అది. ఆయనకి నచ్చింది ఆవిడ మాట్లాడిన మాట.

"పతి జీవితం తప్ప వేరొకటేదయినా కోరుకోవలసినది." అది తప్ప నువ్వు ఏదయినా శుభమైన విషయం కోరుకో అని అడిగాడు. శుభప్రాప్తి కలుగుతుంది కదా నీవెంట నేను వస్తున్నందుకు అన్నదానికి ఆ మాట చెప్తాడు. అంటే, "తప్పక ప్రసాదించగలను అని అనుగ్రహించాడు. మద్ర రాజకుమారి." పదాలు చూడండి ఎలా వేస్తారో? ఇప్పుడీ మద్ర రాజకుమారి relevence ఏమిటి? అంటే ఏమిటంటే చెప్పాను మద్ర అనే పదానికి అర్థం, మద్రము అంటే ఆనందము అని, మంద్రము అంటే చైతన్యము అని. మద్ర రాజుకి పుట్టింది కదా! అంచేత, యముడు మాట్లాడుతుంటే ఈమెకి లోపల విచారం పోయింది. అంతకుముందు ఎంత చింతతో అరణ్యంలో ప్రవేశించిందావిడ? ఈ రోజు పతి మరణిస్తాడన్నటువంటి చింత కలిగి, వెంటపడి వచ్చింది Event జరిగేవరకూ చింతండి, event జరగంగానే ఇప్పుడు చింత లేదు. ఎందుకంటే, ఇప్పుడు పనుంది కదా! మామూలుగా మనకి కూడా మీరు బాగా తరిచి చూసుకుంటే, ఏదయినా ఒక విషయం అది జరగవలసినది జరగట్లేదేమో అన్నప్పుడు చింత ఉంటుంది. Event అయ్యిందనుకోండి అప్పుడు చింత ఉండదు. అప్పుడేం చెయ్యాలో next step చూసుంటాం. అందుకనే, ఒక contingent event మీద ఎక్కువ engage అయి ఉంటుంది మనసు. Contingent event అంటే happening or non-happening అన్న contingency ఉన్నచోట అలా engage అయ్యి, తపన చెందుతూ ఉంటుంది. అది అశుభం అనుకొండి, ఎవరయినా పోతారనే పరిస్థితి వచ్చి హాస్పిటల్లో చేర్పావనుకోండి. చింతగా ఉంటుంది చాలా. చాలా ఆదుర్దాగా ఉంటుంది. మూడు రోజులు, నాలుగు రోజులు, ఐదు రోజులు, ఆరు రోజులు, ఏడు రోజులు, ఎనిమిది రోజులు, తొమ్మిది రోజులు... డాక్టర్ని అడుగుతూ ఉంటాం, వాళ్ళు చూద్దామండి అంటూ ఉంటారు కదా! అలా ఒక నెల రోజులు అవుతుంది. మనకి కాళ్ళు పీకుతుంటాయి ఈ లోపల కదా! ఆయనేమో కొంచెం అంత సులభమైన విషయం కాదంటాడు. ఆ తర్వాత కొన్నాళ్ళవుతుంది, కష్టం అంటాడు. బాధ పడతావు. ఈ process అంతా క్రమంగా మనలో మానసికమైనటువంటి ఆ వత్తిడి, ఆ చింత అయిపోయి, ఇంక రెండు, మూడు నెలలయిన తర్వాత వెళ్ళిపోతే మంచిదే, ఆవిడకి మంచిదే, నాకూ మంచిదే అనుకోడూ? అనుకుంటాడా? ఇప్పుడు అక్కడున్నట్టు రోజూ చూస్తే బాధేస్తుంది. రోగీ బాధ పడుతోంది, వెళ్ళలేక, వెనక్కి రాలేక. నువ్వూ బాధ పడుతున్నావు. అంటే, పంపించెయ్యాలన్న ఉద్దేశ్యంతో కాదు, లేకపోతే హాస్పిటల్లో ఎందుకు పెడతావు. ఇలా ఇలా జరిగి, చివరికి event, ఇహ అయిపోయింది, ఇహ మీవాళ్ళని పిల్చుకోవచ్చు అన్నప్పుడు వచ్చిన వాళ్ళు ఏడుస్తారు తప్ప వీడు ఏడవడు. ఎందుకంటే, వీడికప్పుడే

అయిపోయింది process కదా! He went through the process slowly. Sudden గా విన్నప్పుడు అంత వెంటనే మనసు అంగీకరించలేదు కదా! అంచేత, slow death ఎవరికి ఉపయోగం అంటే, మిగిలి ఉన్నవాళ్ళకి ఉపయోగం, వాడికి కాదు. వెళ్ళిపోయే వాడికి slow death is not such a happy situation. ఉన్నవాడికి, it slowly prepares.

ఏది ఏమయినప్పటికీ, ఆవిడ అంతవరకూ చింతగా ఉంది, యముడిని చూచినప్పటి నుంచి ఎంత అప్రమత్తంగా వచ్చేస్తుంది. అప్రమత్తంగా వచ్చిన తర్వాత, ఆయన ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాడు కదా! ఇప్పుడు మూడోసారి కూడా మాట్లాడాడు. మనం ఎవరి దగ్గరికో, చాలా పెద్దవాళ్ళ దగ్గిరకెళ్ళినప్పుడు, వాళ్ళు మనతో చాలా సున్నితంగాను, ఉన్ముఖంగాను మాట్లాడుతుంటే మనకి ఉత్సాహం వచ్చేయదూ? వచ్చేస్తుంది. ఎవరు యముడు కదా! అంచేత, ఇప్పుడు మద్ర రాజకుమారి అంటే, ఆవిడ ఒకరకమైనటువంటి ఆనందకక్ష్యలో అనుసరిస్తోంది. యముడంటే భయం లేదు. పతిని ఇంతవాడిని చేసి తీసుకెళ్తున్నాడు. సరే, వెంటపడి వెళ్తున్నాము, ఆయన మాట్లాడుతున్నాడు, మనం మాట్లాడుతున్నాం, వరం కూడా ఇస్తానన్నాడు. ఎంత గొప్ప విషయం అండి అది. అంటే, ఋషులు గ్రంథాలు రాసినప్పుడు ఒక్కొక్కచోట ఒక్కొక్క పదాలు ఎందుకిలా వాడారు అని చూసుకుంటే మనకి చాలా లోతైన అవగాహనలు వస్తాయి. అక్కడున్నటువంటి మానసిక స్థితి కూడా తెలుస్తూ ఉంటుంది. సావిత్రిదేవి మానసిక స్థితి.

అంచేత, "ఆ మద్ర రాజకుమారి ఆ ప్రసంగం విని, ఇనుమడించిన అణుకువతో, తిరిగి కనుదోయ ముకుళించి, ధర్మమూర్తీ అంది." అందుకే చదివి చెప్పుకోవడం. అంటే, అతడు ధర్మమూర్తే కదా! ఎందుకనీ? అంతకుముందు ఆమె ఒక ధర్మం చెప్పింది, నువ్వు పతి ప్రాణాలు తీసుకెళ్తున్నప్పటికీ నీ దర్శనం నాకు కలిగినందుకు నాకేమైనా శుభం కలగాలి కదా అంది. అంతేకాదు, సత్పురుషుల దర్శనం వల్ల శుభం కలుగుతుంది కదా అంది. అంచేత, ఏదో ఒక శుభప్రాస నాకు ఏర్పడాలి కదా అంది. అది ధర్మమే. కాబట్టి, నీకు శుభం కలిగేటట్టుగా నేనేదయినా చేస్తాను, నీ పతి ప్రాణాలు తప్ప, నువ్వు కోరుకోవచ్చు అంటే సంతోషం వెయ్యదా? అంటే, కొంచెం కొంచెం ఆఫీసరుగారు మనం చెప్పింది ఒప్పుకుంటునట్టుగా ఉంటుంది. మనం ఏదో ఒక పెద్ద అప్పుకి పెట్టుకుంటే, ఆ GM, AGM మనకి అనుకూలంగా ఉంటున్నాడంటే మనం రెచ్చిపోతాం. పరిస్థితి అనుకూలంగా ఉంటే మన మేధస్సు ఇంకొంచెం చురుగ్గా పనిచెయ్యడం మొదలు పెడుతుంది.

అప్పుడావిడ చెప్పింది, "ధర్మమూర్తీ, రాజ్యం శత్రువులు అపహరించిన పిమ్మట అంధుడైన సాల్వ భూనాథుడు ఈనాడు నిష్ఠుర నియమాలవలింభించి అరణ్య మధ్యంలో నివసిస్తున్నాడు. కరుణించి ఆ పూజ్యునికి తిరిగి పరిపూర్ణ దృష్టి అనుగ్రహించవలసినది" అంది. చూడండి ఎలా ఎడిగిందో! ముందు మెట్టినిల్లు సుఖం. అది కూడా ఎలా అడిగింది? ఆయనకి దృష్టి పోయిందని చెప్పుకోవడం కాదు, మూడు రోజుల నుంచి చెప్పుకుంటున్నాము ఆయనకి దృష్టి పోయిందని. ఎలా పోయిందో కూడా చెప్పుకున్నాం. మాటిమాటికి ఆయన గురించి మనం అలా మాట్లాడుకోవక్కర్లేదు. ఒకప్పుడు చాలా దివ్యమైనటువంటి స్వభావంలో ఉన్నటువంటి వాడు. పోగొట్టుకున్నాడు. ఎంత పోగొట్టుకున్నాడంటే,

దృష్టి కూడా పోయింది. అంటే, దేవతానుకూల్యం నుండి దేవతా ప్రాతికూల్యంలోకి వచ్చేసాడు. ఇప్పుడు చాలా కఠోరమైన తపస్సు ఆచరిస్తున్నాడు. అతడు ధర్మాత్ముడే. కేవలం ఒక పొరపాటు వల్ల ఆ విధంగా జరిగింది కదా! అంచేత, ఏం చెప్పిందంటే, అతనికి దృష్టి ఇమ్మంది. మామూలుగా మనం కథలు వింటుంటే, దృష్టి అడిగింది, దృష్టి ఇచ్చేసాడు అనుకుంటాం. ఆవిడ ఏం అడిగింది? పరిపూర్ణ దృష్టి. మీకు మొన్నే చెప్పాను పరిపూర్ణ దృష్టి ఉండడంచేతే అతడు ద్యుమత్సేనుడు అయ్యాడని చెప్పి. ద్యుమత్సేనుడంటే నీ దేహమందలి దేవతలందరూ నీకు పరిపూర్ణంగా సేనలుగా సహకరిస్తుంటే, నీవు చక్కని జ్ఞానం కలిగి, దూరదృష్టి కలిగి, జీవించేటటువంటి ఒక విశిష్టమైనటువంటి ప్రజ్ఞ అది. ఆయన పేరులోనే ఉందది. అది పోయింది. అంచేత, పరిపూర్ణ దృష్టి ఇమ్మంది. అంటే, పరిపూర్ణ దృష్టి ఇమ్మంటే, కేవలం కన్ను ఇవ్వడమే కాకుండా, జ్ఞాన నేత్రం కూడా ఇమ్మని చెప్పింది. ఇదివరకూ ఏ జ్ఞానమైతే అతడు పొంది ఉన్నాడో, ఏది కోల్పోయాడో తర్వాత, అది మొత్తం అతనకి అందేటట్టుగా చూడమని కోరింది.

ఆ తర్వాత, "యమదైవకం సావిత్రికి ఆ వరం ప్రసాదించి, మరి నన్ను అనుసరించవలదు అని ఆదేశించి, స్వకీయ లోకంవైపు తరలిపోయినాడు. అయినా మద్ర తనూజ తన సంకల్పం విరమించక, మరి కొంత దూరం సాగిపోయి, ఉట్టిపడుతున్న వినయంతో తిరిగి విన్నవించినది." ఇంక మరి వెంటపడకు అని చెప్పాడు. వెంటపడకు అన్నా ఉత్సాహంగా వెంట వెళ్ళింది. "దేవోత్తమా, మనసుతోగాని, వాక్కుతోగాని, కర్మతోగాని, ఆర్యులెన్నడూ ఇతరులకు హింస సంకల్పించరు." నిజంగా ఎవరు ఆర్యుడంటే ఇది అర్థం. మనమంతా Aryans అనుకుంటూ ఉంటాం కదా! బాగా జాతి అంతా, అంటే మానవ జాతి అంతా Aryans ఇప్పుడున్నవారు. Atlantians, Aryans గా మారి వచ్చారు. ఆ కథలోకి వెళ్ళం. కాని Aryan అంటే మనసుతోగాని, బాషతోగాని, చేతతోగాని ఎవరినీ హింసించనటువంటివాడే ఆర్యుడు. అటువంటి వాడే ఆర్య అని తగిలించుకోవాలి. శంకరాచార్య, రామానుజాచార్య, అట్లా ఆర్యునికి ఆచార్య అనేది నామం. ఎవరు ఆర్యుడు? తను ధర్మాన్ని నేర్చి, తను అనుసరిస్తూ, తన అనుసరణ వల్ల ఇతరులు ప్రేరణ చెంది తన దగ్గర ధర్మాన్ని నేర్చుకోడానికి సంసిద్ధులైతే, వారికి కూడా ధర్మం నేర్పితే అప్పుడు పరిపూర్ణ ఆర్యుడు అని చెప్తుంది మన శాస్త్రం. ముందు ధర్మం తెలియాలి. రెండు, ఆ ధర్మం ప్రకారం తన జీవిస్తూ ఉండాలి. మూడు, తన జీవిస్తున్నటువంటి ఆ ధర్మ జీవనానికి స్ఫూర్తి చెంది అతనికి అనుయాయులుగా కొంతమంది చేరతారు. ఎందుకంటే, అదే ధర్మపథంలో నడవాలనే ఆసక్తి ఉండేవాళ్ళు. చేరితే, వారందరికీ ధర్మం నేర్పి, వారు కూడా ధర్మాన్ని ఆచరించే వారిగా తయారుచేస్తే, ఇవీ నాలుగు మెట్లు. ఇది ఎవరియందు సిద్ధిస్తుందో వాడు ఆర్యుడు అని చెప్పి పెద్దలు చెప్పారు.

అంచేత, ఇక్కడ ఏం చెప్తోంది? మనసుతో గాని... ఈయనని దేవోత్తమా అంది ముందు. దేవోత్తమా అంటే దేవతలంరికీ ఉత్తముడు. ఎలా ఉత్తముడో పొద్దున్న చెప్పాను. ఎందుకంటే, అందరికీ ring pass not ఏర్పాటు చేస్తాడు కదా! దేవతలకి రాజైన ఇంద్రుడుకి కూడా మితి ఉన్నది కదా! అందరికీ ఒక పరిధి ఉన్నది. ఒక అపరిమితమైనటువంటి చైతన్యము ఏదైతే ఉన్నదో అది కాలానికి లోబడి ఈ లోకాలని తయారుచేసినప్పుడు, ఆ కాలము పైనున్నటువంటిదంతా అపరిమితము. దాన్నే మనం దైవము అంటూ ఉంటాం. ఈ అపరిమితానికి, పరిమితానికి

మధ్య ఈ ఒరలు ఏర్పరిచేటటువంటి వాడు యముడు. దాన్నే ప్లూటో అని కూడా అంటూ ఉంటారు ఇంగ్లీషులో. He marks limitation. ప్రతివాడికి ఒక పరిధి ఉంటుంది. అట్లా ప్రతిదానికి. పిల్లికో పరిధి ఉంటుంది, కుక్కకో పరిధి ఉంటుంది. మృగరాజు, సింహానికో పరిధి ఉంటుంది. వాటికి పరిధుంది. దాటి వస్తే అపాయం కదా! అట్లాగే, మానవులకీ పరిధి ఉన్నది. దేవతలకీ పరిధులు ఉన్నాయి. కేవలం బ్రహ్మము, అంటే తత్వమునెరిగి, సతతము తత్వమునందే జీవిస్తున్న వాడికొక్కడికే పరిధి ఉండదు. సావిత్రిదేవి అలాంటిది. ఆమె అపరిమిత తత్వంతో అనుసంధానం చెంది ఉంది. అందుచేత, ఈ పరిమితులు కలిపించేటటువంటి యమధర్మరాజు ఆంక్షలు పెట్టగా, అవన్నీ దాటుకుంటూ వచ్చేస్తోంది. లేకపోతే దాటలేరు. ఎవరైతే అపరిమితంతో సంబంధం పెట్టుకుంటారో వారికి అపరిమితత్వం, ఈ పరిమితత్వం నుంచి ప్రసరిస్తూ ఉంటుంది. అంచేత, అలా ఎంత ప్రవహిస్తున్నా ఇంకా వస్తూనే ఉంటుంది. అంటే, he has set himself beyond limitation. దాన్నే liberation అంటారు. Liberation అంటే నీకుగా నువ్వు ఒక మితి ఏర్పరుచుకోకుండా, ఆ మొత్తానికి సమర్పణ చేసుకుని, దేనికయినా సిద్ధం అని జీవించే వాళ్ళంటారు. వాళ్ళ కథలు, భక్తుల కథలు చాలా అలా కనిపిస్తాయి. అలాంటి వాళ్ళ మీద ఆంక్షలు పెట్టలేడు యముడు. మిగతా వాళ్ళందరికీ ఆంక్షలు పెడతాడు. యజ్ఞ దేవతలకి, గ్రహ దేవతలకి, అంతరిక్ష దేవతలకి, అందరికీ limitations ఉన్నాయి. ప్రకృతికి కూడా limitation ఉంది. అన్నిటికీ ఉన్నాయి limitations. ఎంచేత? మొదటి సంకల్పం దిగి వచ్చినప్పటినుంచి, ఇహ ఈయన మితులు పెట్టుకుంటూ వస్తాడు. జలచరాలకి limits ఉన్నాయి, అది దాటి బయటకొస్తే మరణిస్తుంది. అట్లా మనం ఈ భూవలయం దాటితే మరణిస్తాము. అందుకునే కదా, machine లో కూర్చుని అన్నీ ఏర్పాటు చేసుకుని వెళ్తుంటాం పై గోళాలకి, మామూలుగా వెళ్ళలేం కదా! మితులు ఉన్నాయి. ఇలా దేవతలకే మితులు ఏర్పరిచేవాడంటే, ఇహ ఈయన కన్నా ఎవరున్నారండి? ఈయన పైన ఎవరుంటారు? అసలు తత్వమే ఉంటుంది. And he does not suffer limitation. And he does not let people beyond their limitation. అట్లా పెడతాడు హద్దులు. అంచేత, దేవతలకి కూడా పరిమితులు పెట్టగలవు కదా, అంచేత నువ్వు దేవోత్తముడివి.

"దేవోత్తమా, మనసుతోగాని, వాక్కుతోగాని, కర్మతోగాని ఆర్యుడెన్నడూ ఇతరులకి హింస సంకల్పించరు. దీనులనెప్పుడూ పరమకారుణ్య దృష్టితో సంరక్షిస్తూ ఉంటారు. వరాలు అనుగ్రహించినప్పుడు మరేవి అర్థించవలసిన అక్కర కలుగకమునుపే అభిలషించినవన్నీ ప్రసాదిస్తూ ఉంటారు." అది చూడండి! అంటే, గోదావరిలో నీళ్ళు తాగినట్టుగా మాట్లాడుతోంది సావిత్రిదేవి! అంతేగా! ఎంత బాగా చెప్పింది. మొదట ఏం చెప్పింది? దీనులనెప్పుడూ కారుణ్య దృష్టితో... సత్యాన్ని అనుసరించే వాడికెవడికైనా దయ అనేటటువంటిది సహజంగా ఉంటుంది. "దయను సత్యంబులోనుగా తలుపులేమి" అనొక పద్యం ఉన్నది. "కలుగనేటికి తల్లులు కడుపుచేటు" అని. అంచేత, కాస్తోకూస్తో సత్యం, ధర్మం అని ఉన్న ప్రతివాడికి కొంచెం కారుణ్యం ఉంటుంది. అలాంటిది నీబోటి వాడికెంత కారుణ్యం ఉండాలి. అంచేత, దీనులనెప్పుడూ అంటే, less fortunate people, అన్నం లేనివాళ్ళు, బట్ట లేనివాళ్ళు, పైకప్పు లేనివాళ్ళు, ఎంతోమంది ఉండగా, నీకు ఏమీ చెయ్యబుద్ధి కాలేదంటే నీలో ఏ కారుణ్య బుద్ధి లేదు. ఒకే మానవ కుటుంబంలో

అసలు బొత్తిగా రోజు గడవని వాళ్ళున్నారు. ఇట్లా బట్టలు వేసుకోవడానికి లేదు. తినడానికే లేకపోతే, బట్టలేం వేసుకుంటారు? ఏదయినా కారణం కావచ్చు. ఉండడానికి ఏం లేదు, వర్షం పడుతోంది. ఏ చెట్టుకింద తల దాచుకుందామన్నా తడిచిపోతుంది, జబ్బులు వచ్చేస్తాయి, రోడ్డుమీదే మరణిస్తూ ఉంటారు. ఇలాంటి వాళ్ళు కంటబడరా మనకి? నీలో కారుణ్య దృష్టి ఉంటే, యథోచితంగా మన మానవ కుటుంబంలోనే లేనివారికి ఉన్నవారు సహాయం చెయ్యకపోతే, అలాంటి వారికి ఎలా ఉంటుంది దేహం వదిలిన తర్వాత? నీలో ఏ కారుణ్యం ఉందని నేను దయగా చూడాలి? తోటి జీవులయెడల ఏమాత్రం కారుణ్యం లేక, వారి తెలివితక్కువతనాన్ని మనం బాగా దుర్వినియోగం చేసుకుంటూ, వారిని బాగా వాడుకుంటూ, ఉపయోగించుకుంటూ, అట్లా బతికామనుకోండి. మన తెలివితేటల ఆధారంగా తెలివితక్కువ వాళ్ళ మీద అజమాయిషీ చేసుకుంటూ ఉంటాం. మనకన్నా తెలివైనవాడు మన దగ్గర ఉండడు కదా! మనకన్నా తెలివితక్కువ వాళ్ళే మనతో ఉంటారు. వాడిని మోసం చేస్తే? సరే, మోసం చెయ్యలేదు. అసలు ఏమీ లేకుండా వాడక్కడ ఉంటే పక్కన, నువ్వు ఇక్కడ మంచి feast తింటూ ఉంటే ఎట్లా ఉంటుంది? అక్కడేమో వాడు 'అన్నమో రామచంద్రా' అని ఆకలితో ఏడుస్తూ ఉంటే, నువ్వు ఇక్కడ పంచభక్ష్య పరమాన్నాలు పెట్టుకుని ఎలా తినగలవు? తినగలవా? వాళ్ళు గుర్తులేరా నీకు? అలాంటి వాళ్ళని కారుణ్యమూర్తి అని ఎలా అంటాం, అనలేము కదా!

దీనుల దుఃఖాన్ని గుర్తించలేనివాడు కారుణ్యమూర్తి కాలేడు. ఈయనేమో పరమ కారుణ్యమూర్తి. అంచేత, దీనులను పరమ కారుణ్య బుద్ధితో సంరక్షిస్తూ ఉంటారు కదా! మీబోటి వాళ్ళు వరాలు అనుగ్రహించినప్పుడు ఇంక మళ్ళీ ఏం కోరకుండా ఉండేటట్టుగా అంత సంవృద్ధిగా అనుగ్రహిస్తారుగా! అంటే, ఎవరికయినా అన్నం పెట్టినా అట్లాగే పెట్టాలి, ఇంక చాలమ్మా అన్నట్టుగా పెట్టాలి. అంటే, అరకొరగా ఏం పెట్టకూడదు పెడితే. ఏం పెట్టి మనిషిని సంతోషింప పెట్టలేమండి, కానీ అన్నం పెట్టి మనిషిని సంతోషింప చేయొచ్చు తెలుసా? అది ఒక్కటీ అవతలి జీవుడు చాలు అంటాడు. జంతువైనా ఇంక చాలు అంటుంది. ఇహ మిగతావాటికి ఏం చాలడానికి అంతేమి లేదు. ఎన్ని బట్టలిస్తే సరిపోతుంది? వెంటనే చాలు అనడు కదా! అంచేత, ఏదయినా చేస్తే పెద్దవాళ్ళు, ఇంక మళ్ళీ అడగాలిసినవి, శేషించినవి ఏం ఉండకూడదు కదా! అలా చేస్తారు కదా! అలా ప్రసాదిస్తారు. "ఆశ్రితులకు అడుగడుగునా అమందానందం కలిగిస్తున్నారు. ఇవి ఆర్యజనం పరమ ధర్మాలు." ఆర్యులనే వారికి ఇవి ధర్మాలు. అందుకనే మనకి కథలు ఉంటాయి, ఇంటికొచ్చి తింటూ ఉంటే, అలా పెడుతూ ఉంటే, ఇంట్లోదంతా కూడా అయిపోతుంది కదా! అయినప్పటికీ పెట్టేస్తూ ఉంటారు. అలా పెడుతూ ఉంటే నువ్వు దరిద్రుడివైపోతావు అని చెప్తూ ఉంటారు ఇరుగుపొరుగు. అయినా చివరికి వాడు మహత్తరమైన ప్రసాదాన్ని పొంది, గట్టెక్కి, ఎంతోమందికి, వేలమందికి ఉపయోగపడ్డట్టుగా మనకి జరిగిన కథలు ఉన్నాయి.

"అందువలనే నీకు ధర్మదేవతని సార్థక నామధేయ మేర్పడి ఉన్నది. పక్షపాత రహితమైన సమాన దృష్టితో ప్రాణులకు శుభాశుభ కర్మ ఫలితాలేర్పరిచినందు వల్ల నీకు లోకాలన్నిటిలోనూ సమవర్తి అని సుప్రసిద్ధ నామమేర్పడినది." అది కూడా చెప్పింది. నువ్వు కారుణ్యమూర్తివి, దేవోత్తముడివి. అంతేకాదు, సర్వ సమాన దృష్టితో

ప్రాణులకు ఆయా శుభాశుభ ఫలితాలేర్పరిచినందు వల్ల నీకు లోకాల్లన్నిటిలోనూ సమవర్తి అన్న సుప్రసిద్ధ నామధేయ మేర్పడింది. ఏ లోకంలో కూడా యముడు తప్పు చేసాడు అని ఉండదు. ఇంద్రుడు తప్పుచేసిన కథలున్నాయి, అగ్ని తప్పుచేసిన కథలున్నాయి, వాయువు తప్పుచేసిన కథలున్నాయి. ఎంతోమంది అంతరిక్ష దేవతలు తప్పుచేసిన కథలున్నాయి. ఈ గ్రహ అధిదేవతలు కూడా తప్పులు చేసిన కథలున్నాయి. యముడు తప్పులు చేసిన కథలుండవు. అంత సమవర్తనం ఉన్నది. అంచేత, కల్మష నాశకుడైనందు వల్ల "శమనుడు" అన్న సార్థక నామధేయం కూడా ఏర్పడినది. ఏమాత్రం కల్మషం లేకుండా ఎప్పుడూ చాలా శాంతంగా ఉంటాడటండి శమనుడు. శమన మార్గం ఉంటుంది. వాళ్ళు బాగా పవిత్రీకరణం చేసుకుంటూ కూర్చుంటారు అరణ్యంలో. మన దేశంలో కూడా ఉన్నారు, వింధ్యారణ్య ప్రాతంలోనూ, శ్రీశైలం ప్రాంతాల్లోనూ. మనకి కనిపించేటట్టుగా వాళ్ళు తిరగరు. వారి పని ఒకటే, దేహ కోశములన్నీ వీలున్నంత పరిశుద్ధి గావించుకుని, తపస్సు చేసుకుంటూ ఉంటారు. నిర్మలమైన నీరు, నిర్మలమైనటువంటి పడిపోయిన ఆకులు, పండ్లు తింటూ బతుకుతూ ఉంటారు.

"కల్మష నాశకుడైనందు వల్ల నీకు శమనుడన్న నామధేయ మేర్పడినది. ప్రత్యేకించి విన్నవించవలసిన దేమున్నది? అన్నది. శమనుడది విని దరహసిత వికసిత వదనుడై, రాజపుత్రీ, కల్మష రహితమైన నీ ప్రసంగం దాహార్తునికి శీతల ఉదక ధార వలె నాకెంతో ఉల్లాసం కలిగిస్తోంది." అంటే, ధర్మాలు మాట్లాడుతోంది ఈవిడ. నువ్వు నాకు వరం ఇచ్చావు, నేను కోరుకున్నాను, అంతటితో నాకన్నీ తీరిపోయాయా అంటోంది. పెద్దవాళ్ళు వరమిస్తే ఇంక మళ్ళీ ఏం కోరడానికి మిగలకుండా ఉండేటట్టుగా వరం ఇవ్వాలి కదా అంది. అవునా కాదా అని అడిగింది. అవును. కాదనడానికి వీలులేదు. కాదనడానికి వీలులేని విషయాలన్నీ అడుగుతోందండి, అదొకటి. రెండోది, యముడితో ఇంతవరకూ మాట్లాడిన వాళ్ళెవరున్నారు? సంభాషణ ఏముంది? ఏ సంభాషణ ఉండదు కదా! కిందటి సంవత్సరం నచికేతుడు మాట్లాడాడు యముడితో. ఈ సంవత్సరం సావిత్రిదేవి మాట్లాడుతోంది యముడితో కదా! చాలా అరుదుగా మనతో మాట్లాడేవాడు దొరికాడనుకోండి, మనం మాత్రం వదులుకుంటామా? మళ్ళీ ఎప్పుడు దొరుకుతారో? కోటానుకోట్ల జీవుల్లో ఎవడు యమధర్మరాజుతో మాట్లాడతాడండి? చూడంగానే గుండె పేలి చచ్చిపోతాడు కదా! అంచేత, ఆయనకి ఆనందం కలిగింది ఇంతలా చక్కగా మాట్లాడుతోందని. చాలా దాహం వేసినవాడికి చల్లటి మంచినీళ్ళు ఎలా ఉంటుంది అట్లా ఉందమ్మా నీ మాటలు వింటుంటే అంటే అర్థం ఏంటండి? అంత ఆయనకి దాహంగా ఉంది జీవులతో మాట్లాడానికి. చూడంగానే చచ్చిపోతుంటారు, ఇంక ఏం మాట్లాడుతాడు? యముడంటే శనికి ముప్పై రెట్లు. ఈ శని చాలు. నీకు ఏలినాటి శనండి అంటేనే ముందు సగం చచ్చిపోతాడు కదా! శనీ... అంటాడు జ్యోతిష్యుడు. అనీ అనంగానే వీడికొక బీట్ తగ్గుతుంది. జాతకం చూసి ముందు శని అంటాడు వాడు. వాడే శని! అనంగానే వీళ్ళకి జారిపోతుంది కదా! ఎప్పుడూ ఒక అర్థాష్టమం శని, ఒక ఏలినాటి శని, ఒక శని, ఏమంటారు దాన్ని opposition ని తెలుగులో. తెలుగులో ఏదో అంటారు. ముఖాముఖి చూస్తుంటాడు. ప్రతి ఏడేళ్ళకి వస్తుంటాడండి. ఎక్కడ చస్తాం! ఒక ఏడు ఏళ్ళకి... అర్థాష్టమం అంటే నాలుగేళ్ళు. ఏడేళ్ళకి opposition లో ఉంటాడు, మళ్ళీ ఏడేళ్ళకి sqare లో ఉంటాడు, మళ్ళీ ఏడేళ్ళకి opposition లో ఉంటాడు. ప్రతి ఏడేళ్ళకీ

ఏడిపించేవాడితో ఎక్కడ చస్తామండి? అందుకే అంతగా చూసుకోబోకండి శని గురించి. యముడి గురించి చూసుకోండి. ఆయన ఇరవై ఎనిమిది సంవత్సరాలు ఒక గడిలో ఉంటాడు. శని ఇరవై ఎనిమిది సంవత్సరాలలో మొత్తం పన్నెండు గళ్ళూ తిరుగుతాడు. ఎంత పెద్దవాడు యముడు? అలాంటి వాడితో ఎవరు మాట్లాడుతారు? ఎవరు దొరుకుతారు మాట్లాడుకోవడడానికి? దేవుడితోనే మాట్లాడుకోవాలి.

అంచేత, ఆయనకి ఆనందంగా ఉందని చెప్పడానికి చెప్తున్నాడు. బాగా దాహం ఉండేటటువంటి వాడికి చల్లని నీళ్ళు ఇస్తే వాడెంత ఉల్లాస పడతాడో అట్లా ఉన్నాయి తల్లీ నీ మాటలు అని చెప్పి, "సత్యవంతుని ప్రాణాలు తప్ప వేరొక అభిలషితమేదయినా కోరుకోవలసినది. సత్వరమే నీకది ప్రసాదింపగలను" అన్నాడు. కొంచెం దారికి తెచ్చుకుంది కదా! "అని తిరిగి ప్రోత్సహించాడు. మద్రరాజ పుత్రిక పరమాదర దృష్టికెంతో ఆదరించి, కరుణామూర్తీ, వైరులపహరించిన రాజ్యం సాల్వ భూనాధునికి తిరిగి అనుగ్రహించవలసినది." అంటే, తన మామగారికి ఇప్పుడు రాజ్యం అడిగింది.

అంటే, ఇంటికి కోడలొస్తే అలాంటి కోడలు రావాలండి. కోడలొచ్చిన వేళ... అందుకనే, కుడికాలు లోపల పెట్టి రమ్మంటారు కదా! ఈ మధ్య football తన్నినట్టు ఆ బియ్యం కుండని తన్నడం ఒకటి మనవాళ్ళు కొత్తగా నేర్చుకుంటున్నారు. పూర్వకాలం ఇట్లా football తో తన్నడం ఉండేది కాదు. ధాన్యం పట్టుకుని వచ్చేది ఇంటికి ధాన్యలక్ష్మిగా. దాన్ని తన్నడం ఎందుకు? ఏమిటో? ఒకళ్ళని చూసి ఒకళ్ళు. అక్కడెక్కడో తన్నుతున్నారట అందుకని మనం తందామని... సింహద్వారం దగ్గిర తంతే అదెక్కడో వెనకాల పెరట్లో ఉండే తులసి గుడి దగ్గరకు వెళ్లి పడేటట్లు తన్నడం... అంత తన్నడం లేదు కానీండి, అసలు తన్నడం ఎందుకు ధాన్యాన్ని? ఇది ఉండొద్దూ? అక్కడ వాళ్ళు తంతుంటారు ఉత్తరాధిలో అందుకని మేము... వాడు తంతే? వాడికీ చెప్పు తన్నకూడదని. అంతేగానీ, వాడు తన్నేడు కాబట్టి నేను కూడా తన్నాలని... ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి... లక్ష్మేగా కోడలు ఇంటికి వస్తే? కోడలు ఇంటికొస్తే, అమ్మో ఇప్పటినుంచి ఎట్లా ఉంటుంది మనకి అనుకోకూడదు. కోడలు ఇంటికొస్తే లక్ష్మి ఇంటికి వచ్చింది. అందుకని, మన పిల్లని ఇంకో ఇంటికి లక్ష్మిగా పంపించి, మన ఇంటికి లక్ష్మిని తెచ్చుకోవడం అని అవగాహన ఉండాలి. అంటే, వదిలించుకునేటట్టుగా చెయ్యకూడదు ఆడపిల్లల పెళ్ళిళ్ళు. కన్యాదానం కోటి గోదానాల కన్నా గొప్పది. మరివన్నీ మనకెవరూ చెప్పలేదు కదా! అందుకనే, మనం దానం చేసే లోపలే ఆవిడే వెళ్ళిపోతోంది. అది కూడా ఉంది మనకి ఈ రోజుల్లో కదా! నువ్వు దానం చేసేదేముందిలే నాన్నా, నేనే వెళ్ళిపోతానని చెప్తుంది. ఇదిగో వీణ్ణి పట్టుకొచ్చుకున్నాను, నీకు వీలుంటే ఆశీర్వదించు అని అడుగుతారు కదా! పోయాయి! అంటే, మంచి మంచి సంస్కారాలు ఇవన్నీ. అంటే, ఇది తెలిస్తే ఇందులో ఎంత value ఉందో తెలుస్తుంది.

అంచేత, ఈ కోడలు ఏం చేసింది? మొదట మామగారికి, ఆయన జ్ఞానం అంతా తిరిగి రావాలని కోరుకుంది. అంటే, ఒకటి గుర్తుపెట్టుకోండి, వీడికి జ్ఞానం కలగాలని కోరితే అలా ఇవ్వరు. శివుడే ఇవ్వలేదు. ఉపమన్యువని ఒక కథ ఉంది. ఎక్కువ దూరం పోకూడదు, కథలో ఉండాలి. ఉపమన్యువు అనేటటువంటి వాడు శివుడి గురించి తపస్సు చేసిన

తర్వాత ఏం కావాలి నీకు అని అడిగితే, జ్ఞానం కావాలంటే, జ్ఞానం అలా ఇచ్చేది కాదని చెప్తాడు. అంటే, జ్ఞానం ఇవ్వడానికి వీలు పడదమ్మా, కానీ జ్ఞానం పొందడానికి మార్గం చూపిస్తానంటాడు. ఎందుకంటే, వాడూ వీడూ ఇచ్చేటటువంటి జ్ఞానమైతే పోతుంది. జ్ఞానం నువ్వు నీకుగా సాధన చేసి, నీలో తదనుగుణమైన మార్పు తెచ్చుకుంటే అది నీలో నిలబడుతుంది. ఇప్పుడు బోర్డు చూస్తుంటాము, "I am the change" అంటాడు. అంటే, నీవు నీలో జ్ఞానాన్ని పెట్టుకుని నిన్ను నువ్వు మార్చుకోవాలి. అంటే, అంతకుముందు పాలయితే ఇప్పుడు వెన్నె అవ్వాలి. అప్పుడు వెన్నె qualities నీకు వస్తాయి. అంచేత, జ్ఞానం ఎవరి దగ్గర నుంచైనా తెచ్చుకునేది కాదు. నీ లోపల నుంచి ఏర్పడేది జ్ఞానం. తెలుసుకోండి. ఇలా చెప్పంగానే అలా మనలో అతుక్కుపోతుందా? అతుక్కుపోదు. ఇప్పుడు చెప్పాను, పంచప్రాణాలు, ఏ విధంగా శరీరంలోంచి బయటకు రావొచ్చు... అంటే, అట్లా వచ్చేస్తామా? వచ్చేయగలమా? అలా రాదు కదా! కానీ ఆ విధానాన్ని అనుసరింప చెయ్యడానికి ఒక సద్గురువుని ఆశ్రయిస్తే, అతను నీకు వలసినటువంటి సహాయ సహకారాలు అందిస్తుంటే, అప్పుడు కూడా నువ్వే చేసుకోవాలి. అర్జునుడితో ఏం చెప్పాడు కృష్ణుడు, నువ్వు చెయ్యి యుద్ధం, నేను నీతో ఉంటాను అన్నాడు. నీకు అవసరమైనప్పుడల్లా సహాయం చేస్తాను, యుద్ధం నువ్వే చెయ్యాలి. నేను చేస్తే నీకు పేరెలా వస్తుంది? రాదు కదా! నిజానికి ఆయనే చేసేసాడు పాపం, ఎందుకంటే candidate weak! ఊరికే ప్రపంచం అంతా అవార్డులు ఉన్నాయి. చాలా అవార్డులు వచ్చాయి అర్జునుడికి. మనకి కూడా ప్రతిచోటా అవార్డులు ఇస్తుంటారు కదా! అవన్నీ వీడు నిజంగా సరుకుండొద్దూ? సరుకు లేకుండా బోల్డు అవార్డులు. సరే పదరా పోదాం, నీ ప్రతాపం అంతా చూపించు, ఇన్ని అవార్డులు నీకు ఉన్నాయి కదా, నిన్ను గాండీవి అంటారు, విజయుడు అంటారు, కిరీటీ అంటారు. ఏవేవో చాలా అంటారు ఆర్జునుడిని – అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటీ అని చాలా బిరుదులు ఉన్నాయి కదా! మరేది? పద మొదలుపెడదాం అంటే బేరమని ఏడ్చేసాడు. ముందు ఏడుపుతో మొదలు. ఇదేంటయ్యా ఈ అవార్డులు అన్నీ ఏంటి? నిలబెట్టాడు, చేయించాడు, చేసాడు. మొత్తానికేదో పని అయ్యింది కదా! అంచేత, ఎందుకు చెప్తున్నానంటే, అలా భగవద్గీత మొత్తం అంతా ఉపదేశించాడు అర్జునిడికి. అంతేకాదు, మళ్ళీ విశ్వరూప దర్శనం. ఇదెక్కడ గోలండి? విశ్వరూప దర్శనం అయ్యిన తర్వాత కూడా ప్రశ్న లడిగాడంటే, ఏం చెప్పాలండి అర్జునుడి గురించి? ఏ chapter విశ్వరూప సందర్శనం? పదకొండో అధ్యాయం. పదకొండో అధ్యాయంలో విశ్వరూప సందర్శనం కూడా అయిన తర్వాత ఇంకా అర్జునుడికి మళ్ళీ ప్రశ్నలు రావడం వల్ల కదా మిగతా అధ్యాయాలు వచ్చినాయి! అంటే ఏమిటి? ఎంత చూపించినా, అట్లా రాదది. గురువు తనకుండేటటువంటి ప్రేమచేత, కారుణ్యంచేత, ఎంత విస్తరింపచేస్తూ వెలుగు నందించినా, పుచ్చుకునే వాడినిబట్టే వాడు పుచ్చుకుంటాడు. అంతే, అంతకన్నా ఉండదు. ఇవన్నీ చెప్తాడు శివుడు ఉపమన్యుడికి. అర్థమయ్యేటట్టు చెప్పి, ఒక గురువుని చూపిస్తాను, ఆయన దగ్గర నువ్వు క్రమంగా శిక్షణ పొంది, క్రమంగా నువ్వు నన్ను జ్ఞానంతో పాటు చేరవచ్చు అని చెప్తాడు. ఆ ఉపమన్యుడు నెమ్మదిగా ఎంతటి వాడవుతాడంటే, అభిమన్యుడితోబాటూ ఉండగలిగే వాడంతటి వాడవుతాడు. అది కథ.

అంచేత, జ్ఞానం అలా దానంగా ఇచ్చెయ్యడానికి వీలులేదు. ఇప్పుడీవిడ ఏమడిగింది మొదట? మామగారికి పోయిన జ్ఞానం ఇమ్మంది. అంటే, ఆయనకి ఇంతకుముందు ఉన్నది, కొంతవరకూ సంపాదించుకున్నాడు, మరగున

పడ్డాడు. అది ఇవ్వచ్చు. అంతకన్నా ఎక్కువ ఇవ్వడానికి వీలు పడదు. ఇప్పుడే మడిగింది? రాజ్యం ఇమ్మంది. ఆయన రాజ్యం ఆయనకి ఇప్పించేసెయ్యి అని చెప్పింది.

"కరుణామూర్తీ, వైరులపహరించిన రాజ్యం సాల్వ భూనాథునికి లభించునట్లు అనుగ్రహించ వలసినది అని అభ్యర్థించినది. వైవస్వత దేవుడా ప్రార్థనపై, మద్రరాజ పుత్రీ, నీవు కోరిన వరం సత్వరమే అనుగ్రహిస్తున్నాను. మరి నన్ను అనుసరించక మరలి పోవలసినది. ఇది మహా దుర్గమమైన మార్గము అన్నాడు." ఇంక ఇక్కడినుంచి మరీ కష్టం అన్నాడు. మరీ కష్టం అంటే ఏంలేదు, అది స్థూలం నుంచి సూక్ష్మం, సూక్ష్మం నుంచి సూక్ష్మతరం, సూక్ష్మతరం నుంచి సూక్ష్మతమము అయిపోతుంటుంది ముందుకెళ్తున్నకొద్దీ. ఈవిడ దానికి తగ్గట్టుగా అన్ని శరీరాలు ఏర్పరుచుకున్నది సావిత్రీదేవి ఉపాసన వలన. రావడమే సావిత్రీదేవి నుంచి వచ్చిన అనుగ్రహ పుత్రిక కదా! అందుకని, ఆవిడకి సూక్ష్మ శరీరం ఉంది, కారణ శరీరం ఉంది. దాన్నే లింగ శరీరం అంటారు. అది దేంట్లోకయినా, ఏ లోకంలోకయినా ప్రవేశించగలిగినటువంటి శరీరం. ఇంక నువ్వు రాలేవు, కాబట్టి ఈ వరం తీసుకుని ఇంక వెళ్లిపొమ్మా అని చెప్పాడాయన.

"అని నిషేదించాడు. అయినా సావిత్రి తన ప్రాణేశ్వరుడి అనుగమనం విసర్జించలేదు. తిరిగి రెట్టించిన భక్తి భావంతో పరిపూర్ణాంజలి ఘటించి, ప్రప్రథమాధి ధర్మాధిపతీ అంది." The foremost among those who execute the law అన్నమాట. He is the authority. "ప్రప్రథమాధి ధర్మాధిపతీ, ఎంత కష్ట దశలోనైనా ధర్మాత్ము లేమాత్రం తమ న్యాయ మార్గం పరిత్యజించరు. ధార్మికులు ఎడుదలలో మోహతాపాదు లొకించుకైనా ప్రాదుర్భవించవు కనుక నిశ్చల చిత్తంతో నా కుచితమైన మార్గం నేను అనుసరించవలదా?" అన్నది. నేను అనుసరించవలసిన మార్గం నేను అనుసరించాలా వద్దా అనడిగింది. ఎంత కష్టమయినా సరే, అనుసరించవలసిన మార్గం అనుసరించాలా? "ఎంత కష్ట దశలోనైనా ధర్మాత్ము లేమాత్రం తమ న్యాయ మార్గం పరిత్యజించరు." అవేగా కథలన్నీ. అంటే, మనకి కొంచెం ఇబ్బందిగా ఉంది కాబట్టి మడతలేసేసి పనులు కానిచ్చుకోవడం అనేదొకటుంటుంది. వాళ్ళంతా మానవులు, మనో ప్రజ్ఞలో బతికేటంటివారు. మనో ప్రజ్ఞ దాటి, బుద్ధి ప్రజ్ఞ దాటి, ఆనందమయకోశంలో ఉంటే తప్ప, ఇట్లా "మద్రరాజ పుత్రి" అని పిలవడానికి వీలులేదు. వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్నే అనుసరిస్తారు, ఇంక దేన్నీ అనుసరించరు. అంచేత, ఇప్పుడు నా ధర్మాన్ని నేను అనుసరించాలి కదా, నువ్వు రావొద్దొన్నా నేను వస్తున్నాని కోపం పెట్టుకోబోక, నీ ధర్మం ప్రకారం నువ్వు తీసుకెళ్తున్నావు, నా ధర్మం ప్రకారం నేను వస్తున్నాను అని చెప్పింది. నా ధర్మం ప్రకారం నేను రావాలి తప్పదు అంటే ఏం చెప్తాడు యముడు? రావాలి బావుంది, రాగలుగుతోంది అది చూడండి! ఇప్పుడు మనకీ రావాలనుంటుంది. ఇప్పుడు మనకి ఇష్టమైన వాళ్ళు వెళ్ళిపోతే, మనం కూడా వెళ్లి తెచ్చుకుందాం అనుకుంటాం కదా! ఏం వెళ్తాం, ఎక్కడివరకూ వెళ్తాం? వేరే శరీరాలు తయారుచేసుకోలేదు కదా! యోగవిద్య ద్వారా చేసుకుంది కాబట్టి ఆవిడ వెళ్తోంది, అడుగుతోంది. ఇది ఇందులో రహస్యం.

అంచేత, " ధార్మికులు ఎదుదలలో మోహతాపాదు లొకించుకైనా ప్రాదుర్భావించవు కనుక నిశ్చల చిత్తంతో నా కుచితమైన మార్గం నేను అనుసరించవలదా? పతి అడుగమనం విడువగలనా? నాకింతకన్నా ముఖ్యమైన కర్తవ్యమేమున్నది అని తన ధోరణి లెస్సగా సమర్థించుకున్నది. సమవర్తి మారాడలేక..." ఏం మాట్లాడుతాడు? ధర్మం మాట్లాడితే ఏం మాట్లాడలేరు. సూటిగా ధర్మంతో ప్రశ్న వేస్తే మాట్లాడడానికి ఏం ఉండదు. బుద్ధుడు మాటిమాటికీ నేనెళ్ళిపోతా, నేనెళ్ళిపోతా, నేనెళ్ళిపోతా అంటూ ఉండేవాడు భార్యతో. దేనికని అడిగిందావిడ. అంటే, దైవదర్శనం చెయ్యాలంటే, అది ఇక్కడే దొరుకుతుందని చెప్పింది. దైవం ఇక్కడ లేదా? ఇక్కడే దొరుకుతాడు, వెళ్ళక్కర్లేదు అని చెప్తుంది. ఎన్నో రకాలుగా చెప్తాడు బుద్ధుడు. అన్నిటికీ ఆవిడ, యశోధర, ధర్మపరంగా సమాధానం చెప్తుంది, నువ్వు ఏది పొందుదామనుకుంటున్నావో అది ఇక్కడే ఉంది, ఎక్కడికో పోయి తెచ్చుకోక్కర్లేదు. పైగా నీకు తల్లితండ్రులున్నారు, బాధ్యత ఉన్నది, ఎక్కడికో వెళ్ళిపోతానంటావేంటి అని అడిగింది. సమాధానం చెప్పలేక, చెప్పకుండా వెళ్ళిపోయాడు. సిద్ధి పొందిన తర్వాత తెలిసింది వెళ్ళక్కర్లేదని, ఇక్కడే దొరికేదని. అందుకని, మొట్టమొదట ఆవిడకి క్షమాపణ చెప్దామని వస్తాడు. ఎక్కడ సూటిగా ధర్మపరమైన విషయాలు అడిగితే అక్కడ సమాధానం చెప్పడం కష్టం. అందుకని, నా పతి ననుసరించి నేను వస్తున్నాను, అది నా ధర్మము, కాదనగలవా అని అడిగింది. ఇది ధర్మం కాదని చెప్పగలవా పోనీ చెప్పు. అందుకని, నేను రావడం మీద నువ్వు కోపగించుకోవడానికి వీలులేదు. నా ధర్మం ప్రకారం నేను వస్తున్నాను, నీ ధర్మం ప్రకారం నువ్వు తీసుకెళ్తున్నావు ఆయుర్ధాయం అయిపోయిందని.

అప్పుడు ఆయనన్నాడు, "రాకుమారీ, నీవు అత్యంత ధర్మ తత్పరురాలవు. ఇందువల్ల తిరిగి నీకు ఇంకొక వరం ప్రసాదించవలనని నేను నిశ్చయించుకున్నాను. అర్థించవలసినది అని అజ్ఞాపించాడు." అజ్ఞాపించాడు ఈసారి. కోరుకొమన్నాడు. కోరుకోమంటే, "సావిత్రి దానికేంతో ఆనందించి, తిరిగి దోసలి కట్టి, మా తండ్రికి పురుష సంతానం కలగలేదు." అది కూడా కథ మొదటి భాగం. మొట్టమొదట ఆయన చాలా తపస్సు చేస్తాడు. మర్చిపోయామేమో! పద్దెనిమిదేళ్ళ పాటు రోజూ గాయత్రి మంత్రం చేసినటటువంటి వాడాయన. ప్రాణముల మీద ఆధిపత్యంతో బాటు, ప్రజ్ఞ మీద కూడా ఆధిపత్యం సంపాదించుకుని, సూర్యుడికి మూలమైనటువంటి సావిత్రిదేవి, సవితృమూర్తి ఆయనకి దర్శనం ఇస్తుంది. ఇచ్చినప్పుడు పురష సంతానం కావాలని కోరతాడు. కోరితే, స్త్రీ సంతానం నీకు ప్రస్తుతం రాసి పెట్టి ఉన్నది, అది పుచ్చుకో అని చెప్తుంది. ఆ పుట్టిన కన్య వలన నీకు పురుష సంతానం లభిస్తుంది తర్వాత అని కూడా చెప్తుంది. అది అడిగింది. అంటే, ముందు మెట్టినింటికి శుభాలు కోరి, ఆటుపైన పుట్టినింటికి శుభాలు కోరిందండి. అలా కోరేసరికి...

"కృతాంతుడు ఆ వరం ప్రసాదించి, సుదూరం నన్ననుసరించి మిక్కిలి అలసినావు. మరి మరలి పోవలసినది అని తిరిగి హితోపదేశం చేసాడు. సావిత్రి తనపై సవినయ స్వరంతో విన్నవించినది. శమన దేవా..." అంటే, ఇంత చేసినా ఆయనకి కోపం రావట్లేదు కాబట్టి. "శమన దేవా" అన్నది. ఒకటికి మూడుసార్లు అడిగితే మనకి మొహంలోనే చిరాకు వచ్చేస్తుంది కదా! అవతలి వాడు మళ్ళీ అడిగితే, అమ్మో ఇంక అడిగితే తిడతాడేమో అన్నట్టుగా పెడతాం. పెట్టడమేంటిలెండి అది అట్లా వచ్చేస్తుంది. ఇది ఓర్పు ఉంటే తప్ప అంతలా భరించడం కష్టం. మనుషులని

భరించాలంటే చాలా ఓర్పు ఉండాలి కదా! దానికి highest ఎవరయ్యా అంటే యముడు. ఇలా చూడండి, ఒద్దు, ఒద్దు అంటే వెంటబడి వస్తోంది, ఒకటి. వెంటబడి వచ్చి చక్కగా మాట్లడుతోంది, రెండు. ఆనందం కలిగిస్తోంది, అయినప్పటికీ వద్దన్న పని చేస్తోంది. ఇప్పటికి మూడుసార్లు చేసింది. మూడుసార్లు అయిపోయింది వద్దనడం. అయినా వస్తూనే ఉంది కదా!

అంచేత, "శమన దేవా, నా హృదయం భర్త యెడల సంపూర్ణ భక్తి భావంతో తొణికిసలాడుతున్నది. ఇట్టి నాకు అలసెటెట్లు సంఘటిల్లగలదు?" అంది. ఇప్పుడు చాలా అలిసిపోయావు, ఇంక చాల్లే, వెళ్ళిపో అన్నాడు. అంటే, అలసటేమిటి, నాకు అదే ముఖ్యం. అది అత్యంత ఇష్టమైన పని చేస్తున్నప్పుడు అలసటేట్లా ఉంటుందండి? రాత్రి రెండుంపావుకి పెడతారు ముహూర్తాలు. ఆడపిల్ల తండ్రికి ఆ రోజు పొద్దున్నుంచి ఆ మర్నాడు కూడా నిద్రలుండవు, తల్లికినూ. ఏమిటోనండి, అలిసిపోతారు, కాసేపు పడుకోండి అంటే ముహూర్తం time కి పడుకుంటాడా? ఎందుకనీ? ఇష్టమైన పని కాబట్టి నిద్ర రాదు. అంతా అయిపోయిన తర్వాత వస్తుంది నిద్ర. అలాగే మనకి అత్యంత ఇష్టమైన దానికి మనసు తగులుకుని ఉన్నప్పుడు నిద్రతో సంబంధం ఉండదు. మనకి క్రికెట్ పిచ్చివాళ్ళుంటారు కొంతమంది. ఇప్పుడు ఏ వెస్ట్ఇండీసులో ఇండియన్ క్రికెట్ టీం ఆడుతోందనుకోండి, అది ఫైనల్ అనుకోండి, ఇక్కడ నిద్ర పాడు చేసుకునయినా చూస్తాం కదా! ఇండియాలో చూడరా? ఎందుకు చూస్తారు? ఇష్టం కాబట్టి. అలా అని మర్నాడంతా నిద్రపోతారా? నిద్రపోరు. ఎందుకంటే, అంత అలసట అనిపించదు ఇష్టమైన విషయం కోసం మెలుకువున్నప్పుడు.

అంచేత, నాకు నిద్ర ఎట్లా వస్తుందయ్యా, నేను ఎలా వెనక్కి వెళ్ళిపోమంటావు, నాకు అసలు అలసటే లేదు కదా, నాకు కావలసిన పని మీద కదా నేను వెంట వస్తున్నానని చెప్పింది. "పతులకన్ని విధాలా ప్రాణేశ్వరానుసరణ గాక నాకు వేరొక పవిత్ర ధర్మమేమున్నది? మరి ఇంకొక విన్నపం. కృతార్థ హృదయుడవై ఆకర్ణించవలసినది." ఇంకొక్క మాట చెప్తాను విను అంది. ఈవిడ మాట చెప్పిందంటే అవతలి వాళ్ళు కరిగిపోవలసినదేనండి. యముడే కరిగిపోయాడంటే ఇంక మిగతా వాళ్ళ మాటేం చెప్పాలి? "ఆత్మ ధర్మ నిరతులైన పుణ్యాత్ములు ఈ భువనంలో మిక్కిలి దుర్లభులు. వారి సాంగత్యము వలన సమస్త దురితాలు నిశ్శేషంగా నశిస్తున్నవి. అట్టి వారందరూ పుడమిలో కేవలం పవిత్ర తీర్థ స్వరూపులు. వారి ప్రభావం చేతనే సూర్యచంద్రాదులు ఆకాశంలో సదా సక్రమ పద్ధతిలో చరిస్తారు. సాగరాలు అణు మాత్రమేనా అవధులు అతిక్రమించడం లేదు. కుల పర్వతాలన్నీ నిశ్చలమై విలసిల్లుతూ ఉన్నవి. భూ ధాత్రి ప్రాణకోటి నన్నిటినీ భరిస్తున్నది. ఇంకొక్క విషయం చిత్తగించవలసినది. ఏడు మాటలాడి నంతనే ఎట్టివారయినా అన్యులు ఆర్యులకి బంధువులవుతున్నారని విజ్ఞులు ఉపదేశిస్తున్నారు." ఏడు మాటలు మాట్లాడితే ఒక మహాత్ముడితో... అంటే వాడు మాట్లాడనిచ్చాడు కాబట్టి కదా ఈవిడ మాట్లాడుతోంది. అలా మాట్లాడడంలో ఏమవుతుందంటే ఈ విధంగా ఇప్పుడు నువ్వూ నేనూ సంభాషణ చేసుకుంటూ సాగుతున్నాం కదా, కాబట్టి నేను నీకు బంధువైపోయాను అంటోంది. అంటే సన్నిహితం పెరిగింది మనకి అని, నేను నీ బంధువుని. "అవుతున్నారని విజ్ఞులు ఉపదేశిస్తున్నారు. చిరకాల సంభాషణం వల్ల నేను ఇప్పుడు నీకు ఆప్తురాలైనానని వేరుగా విన్నవించనక్కర్లేదు కదా." ఎక్కడికక్కడ fix

చేసేస్తోంది కదా! మరి నేనంటే మీకు చాలా ఇష్టమని తెలిసిపోయిందని చెప్పేసింది. నామీద మీకు చాలా ప్రేమ ఉంది, చాలా వాత్సల్యం ఉంది, చాలా కరుణ చూపిస్తున్నారు, నేనడిగినవన్నీ మీరు చేసి పెడుతున్నారు, నాకర్థమయిపోయింది అని చెప్పింది. అవునా కాదా అంది. కాకపోతే, ఎందుకు చేస్తాడు? అవును కాబట్టే చేస్తున్నాడు.

"కనుక నా కోరిక అవశ్యం నెరవేర్చ తగినదని భావింతువు గాక." నేను ధర్మమైన మార్గంలోనే నీ వెంటబడి వస్తున్నాను. నేను ఎట్లాగూ వెనకకి వెళ్ళను. పైగా ఇప్పుడు నేనంటే నీకు ఇష్టం కదా అంది. చిన్న పిల్లలు అడుగుతూ ఉంటారు, నేనంటే నీకు ఇష్టం కదా, నువ్వు నాకది కొనిపెట్టవా అంటారు. నువ్వు నాకు ఇష్టం లేదని చెప్పలేవు కదా! నేనంటే నీకిష్టం కదా మమ్మీ, నాకు ice cream కొనిపించవా అంటే, ఏం చేస్తుంది అమ్మ? ఇప్పుడు తేల్చుకోవాలి. ice cream కొని ఇవ్వకపోతే ఇష్టం లేనట్టే కదా! Ice cream కొంటే ఇష్టం ఉన్నట్టు కదా! అలా చెప్పింది. ఎందుచేత? ఇంత కాలం సంభాషించాడు, మెచ్చుకుంటున్నాడాయన.

"సమవర్తి ఆ ప్రసంగం విని, మిక్కిలి ప్రసన్నుడై, మద్ర రాజకుమారీ నీ కింకొక్క వరమీయవలెనని నిశ్చయించుకున్నాను, కోరుకోవలసినది" అన్నాడు. ఈసారి ఆ conditions లేవు. ఇంకొక్క వరం ప్రసాదించాడు. "సావిత్రి ఆ సమాధానం విని, అమందానంద భరితురాలై, కృపాంభోనిధి, పతి జీవితం తప్ప వేరొక్కది అర్థించవలసినదని నీ వింతకుముందు ఉపదేశించావు. కానీ ఇప్పుడట్టి నియమం విధించలేదు." తెలిసే చేసాడు. ఇంకెందుకులే అనుకున్నాడు. ఇంక మరి జారిపోయాడాయన. అది సావిత్రిదేవి! జారిపోయే, అది చెప్పకుండా చెప్పాడు. "నీ పతి ప్రాణం తప్ప" అన్న పదం లేదుగా! అదే చెప్పింది. నీవలా అనలేదు కదా, కాబట్టి నేనడుగుతాను అంది. "కానీ ఇప్పుడా నియమం విధించలేదు. అందువలన, ఆనంద తరంగిత హృదయంతో నిన్ను అర్థిస్తున్నాను. భర్తృ వియోగం పరమ దుస్సహము. పతి లేని భామినిని అందరూ శుభకార్యాలలో నిరాకరిస్తారు. కనుక నా హృదయేశ్వరుడు పునర్జీవితుడై, సుగుణ సంపత్తితో, అతులిత కీర్తితో విలసిల్లునట్టు అనుగ్రహించవలసినది" అంది.

అంటే, ఊరికే మా ఆయన్ని నాకిచ్చేయ్ అనలేదండి. అంటే, తపస్సు చేసేవాళ్ళకి అలా ఉంటుంది మేధస్సు, కార్యసాధకుల మేధస్సు అలా ఉంటుంది. "నా హృదయేశ్వరుడు పునర్జీవితుడై, సుగుణ సంపత్తితో..." మళ్ళీ తిరిగొచ్చినా... కొంతమంది తిరిగొస్తుంటారు కోమాలోకెళ్ళి, వాడికన్నీ గుర్తుండవు, అంతకుముందు తెలిసినవేవీ ఇప్పుడు తెలియవు, అట్లా వెర్రిమొహం వేసుకుని చూస్తూ ఉంటాడు. పునర్జీవితుడే కానీ ఉపయోగం లేదు, కొన్ని missing. ఓసారి కోమాలోకి వెళ్లి వచ్చిన తర్వాత పూర్తిగా తిరిగిరావడం అనేది అదృష్టం.

అంచేత, ఇప్పుడు అసలు ప్రాణాలే ఎత్తుకు పోయారు కదా, అయిపోయింది కదా! అక్కడుంది అతడి శరీరం. ఈవిడది అక్కడే ఉంది. ఇప్పుడు తిరిగొచినప్పుడు పునర్జీవితుడైతే మాత్రం చాలదు. సుగుణ సంపత్తితో... అతడికెంత సుగుణముందో నిన్న సాయంత్రం చెప్పుకున్నాం. విపరీతమైన గుణరాశి ఆయనది. "అతులిత కీర్తితో విలసిల్లునట్టు అనుగ్రహించవలసినది". చాలా కీర్తి కలిగి ఉండాలి. అతడి గుణములకు సంబధించినటువంటి కీర్తి కూడా ఏర్పడేటట్టుగా అతడిని పునర్జీవుడిని చేసి నాకిమ్మని చెప్పింది. "మరి ఇంతకన్నా నేను అభ్యర్థించ వలసినదేమీ లేదు."

ఇది ఇచ్చావనుకో నేను ఇంక కోరుకోవాలిసినవేవీ లేవు. అప్పుడు నువ్వు perfect Aryan అని చెప్పింది. నువ్వు ఎప్పుడు ఆర్యుడవంటే నాకు ఏ కోరికా మిగలకుండా అన్నీ తీర్చినవాడివైతే అని చెప్పింది. అత్తమామలకి సంవృద్ధి, తండ్రికి సంవృద్ధి, తనకీ సంవృద్ధి. అన్నీ అయిపోయాయి కదా దానితో! అందుకని, నువ్వు అడిగినా కోరుకోడానికేం లేవు అని చెప్పింది.

"వైవశ్వతుడా ప్రార్థన కంగీకరించి అదే క్షణంలో సత్యవంతుడికి మృతుపాశన విముక్తి కలిగించి, సావిత్రి వైపు ఆదర దృష్టి ప్రసరింపచేసి, రాజపుత్రీ, ఇదిగో నీ ప్రాణేశ్వరుని స్వీకరించవలసినది. ఇతడు ఈ పిమ్మట నూరు సంవత్సరముల పర్యంతము జీవించి, శత పుత్రులతో..." ఆయన ఇంక ఆగలేదు. అంతలా ఆయనకి కారుణ్యం పెరిగిపోయింది, వాత్సల్యం పెరిగిపోయింది. ఇప్పుడు కూతురు అడిగిందనుకోండి, కూతురు అడిగిన దానికన్నా ఎక్కువ ఇస్తాడు కదా తండ్రి! ఎందుకంటే, ఆయనకి అనందం. అట్లా ఆవిడకి పతి ప్రాణంతో పాటు, అతనికి నాలుగు వందల సంవత్సరాల ఆయర్దాయం. కృతయుగంలో పూర్ణ జీవనం నాలుగు వందల సంవత్సరాలు. ఇది కృతయుగం కథ. అందుకే, కృతలో సావిత్రిదేవి, త్రేతలో సీతాదేవి, ద్వాపరలో ద్రౌపతీదేవి, కలిలో చూద్దాం... ఎందుకనీ? భారతం కలి ప్రారంభంలో రాసారు కాబట్టి ఆ మూడు మనకి తెలిసాయి. ఆ మూడు కథలు ఇక్కడే చెప్పేసారు. మార్కండేయుడు సీత కథ చెప్పాడు, సావిత్రి కథ చెప్పాడు ద్రౌపతీదేవికి. కృతయుగం కథ అంటే నాలుగు వందల సంవత్సరాలు ఆయుః పరిమాణం. అలాగే, త్రేతలో మూడు వందల సంవత్సరాలు, ద్వాపరలో రెండు వందల సంవత్సరాలు, కలిలో వంద సంవత్సరాలు. మనం తగ్గించుకుంటూ వస్తాం మన ప్రవర్తన వలన.

అంచేత, అతడు నాలుగు వందల సంవత్సరాలు బతుకుతాడు. అంతేకాదు, శత పుత్రులతో, మీ నాన్నకే వంద కుమారులు కాదు, నీకు కూడా వంద కుమారులు. "శత పుత్రులతో నిరంతర యాగ నిర్వహణతో వంశ శ్రేష్టుడై, లోకంలో సర్వత్రా శాశ్వత కీర్తి సంపాదించుకోగలడు." అంటే, ఈ సృష్టి ఉన్నంత కాలం ఈ కథ చదువుకోవడం జరుగుతూనే ఉంటుంది. మనం కాకపోతే ఇంకోళ్ళు చదువుకుంటారు. మనం ఇప్పుడు చదువుకుందాం. అంచేత, "అని పలికి, వీడ్కొని అంతర్థితుడై స్వీయలోకం చేరుకున్నాడు." ఇహ మరి మాట్లాడదానికి కూడా ఏం లేవు, ఆవిడ అడిగిన దానికన్నా ఎక్కువ ఇచ్చేసాడు. ఆవిడ ఒకటే అడిగింది. ఆ ఒకటే చాలంది. అన్నీ ఇచ్చేసాడు. అదృశ్యమైయ్యాడు.

మళ్ళీ చూద్దాం అంటే కుదరదు అలాంటి వాళ్ళని. అలాంటి వాడు. ఎవరికోగానీ కనబడనటువంటి వాడు, సంభాషించనటువంటివాడు. అలా అడిగినవన్నీ చేకూర్చి పంపిచాడంటే యముడెంత మంచివాడండి? చాలామంది దక్షిణ దిక్కు అంటే భయపడతారు. యోగులు దక్షిణ దిక్కుకు చూస్తూ తపస్సు చేస్తారు. ఎందుకంటే, మెప్పించాలంటే యముడుని మెప్పించాలి. దాక్షిణ్యమూర్తి. దక్షిణమందు ఉండడం చేత అతడు పరమ దాక్షిణ్యమైనటువంటి మూర్తి. సద్గురువు కూడా దక్షిణంలోనే ఉంటాడట, సిరియస్ అనేటటువంటి మండలంలో భూమికి. యముడూ దక్షిణంలోనే ఉంటాడు. నువ్వు యముడిని మెప్పించగలిగితే ఇంక నీకు మరణం అనేటటువంటిది చాలా చిల్లర విషయమైపోతుంది.

యముడిని మెప్పించాలంటే యమ నియమములు బాగా పాటించాలి. యమ నియమములు అంటే అహింస, సత్యము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, ఆస్తేయము, శుచి, శౌచము, సంతోషము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అని పది నియమాలు చెప్తారు యోగంలో. వాటిని తూచా తప్పకుండా ఎవరు ఆచరిస్తారో వారందరికీ యముడు ఉన్ముఖుడై ఉంటాడు, సుముఖుడై ఉంటాడు. అంటే, మనం ఆచరించకపోవడం వల్ల మనకి ఆ ఉన్ముఖత్వం, సుముఖత్వం కలగకుండా ఉంటుంది.

అంచేత, ఈయన ఆ విధంగా వెళ్ళిపోయాడు. "మరి కొంతసేపటికి సత్యవంతుడు అల్లన తిరిగి తెలివి తెచ్చుకుని..." వచ్చేసాడు కదా, తెలివి వచ్చింది. "తెచ్చుకుని, ఎంతోసేపు నిద్రించినట్టున్నాను. అయ్యో! రవ్వంత నన్ను మేల్కొల్పలేకపోతివా అన్నాడు." చాలాసేపు నిద్రపోయాను, ఇంతసేపు నిద్ర పోయానేంటి, మేల్కొల్పలేకపోయావా, మళ్ళీ ఇంటికి వెళ్ళాలి కదా, చీకటి పడిపోతోంది కదా, అని అన్నీ వచ్చేసినాయి ఆయనకి ఆలోచనలు. "బలవంతుడెవ్వడో నన్ను పాశంతో బంధించి, నన్ను తనవైపు ఆకర్షించి పోతునట్టు గోచరించినది. అతడేవ్వడూ అని అడిగాడు." ఈయనకి ఇది కల, అది సత్యం అక్కడ. అట్లా అనిపించిందట. ఆ వచ్చిన వాడెవడూ అని అడిగాడు. "నాకది కలగా భాసించలేదు, యదార్థమన్నట్టుగా గోచరిస్తున్నది." అంటే, మనకి కొన్ని కలలు అట్లా ఉంటాయి కదా! అది కలగా అనిపించదు, నిజంగా జరిగినట్లు అనిపిస్తుంది. "నాకేదో విచిత్రమైన భ్రాంతి కలిగినట్లున్నది." అట్లా నన్ను పట్టుకుపోతే, ఇక్కడేట్లా ఉంటాను, ఉండను కదా, కానీ అది నిజం అనిపిస్తోంది. ఏదో కొంచెం distrubanace వచ్చింది mind లో అంటున్నాడు. "అని ప్రసంగించాడు. మద్రరాజ తనూజ అతడి పునర్జీవనానికి ఎంతో ఆనందించి, ఆ విషయం పైకి ఏమాత్రం వ్యక్తీకరించక, నాథా ఆ విషయం సమన్వయంగా రేపు వివరించగలను. కటిక చీకటి నలువైపులా వ్యాపిస్తున్నది. మరి ఇచట నిమిషమైనా అలసించరాదు. అల్లదిగో మహోగ్రాకారులైన రాత్రించరులు అచ్చటచ్చటా సంచరిస్తున్నారు. జంబూకాల ఘోర ఆక్రందనలు ఎల్లడా వినిపిస్తున్నవి. భయంకర మృగ సమూహాలు, ఘోర ధ్వనులను అతి క్షణము సంగమిస్తున్నవి. నాకెంతో భయోత్కంపం కలుగుతోంది" అన్నది. ఏది, ఈవడకి భయం ఏమిటండి? ఈవిడకి భయమా? తొందరగా ఇంటికి వెళ్ళిపోదాం, ఇప్పుడీ చర్చ ఎందుకని, ఇక్కడ discussion పెట్టుకోకూడదు కదా! ముందు ఇంటికి వెళ్ళిపోదామని. బతికాడు కదా, అదే చాలు. వచ్చేసాడు. కనుక తొందరగా ఇంటికి వెళ్ళిపోడానికి ఇవన్నీ చెప్పిందావిడ.

"నీవు అలసించినందువల్ల అత్తామామాలెంతో అందోళనపడి దుఃఖించగలరు. శ్రీఘ్రమే మరలిపోయి వారి నానందింప చెయ్యవలసినది" అంది. మనం త్వరగా వెళ్ళకపోతే ఇంట్లో వాళ్ళకి భయం వేస్తుంది. ఏమిటి ఎప్పుడో రావలసినవాడు, పైగా కోడలిని కూడా తీసుకెళ్ళాడు, ఏమయిపోయారో వీళ్ళు అని. అట్లాగే పాపం ఆ గుడ్డిరాజుగారు వెతుక్కుంటూ వచ్చేస్తూ ఉంటాడు ఆలస్యం అయ్యిందని. ఇప్పుడు చూడండి పిల్లలు ఇంటికి రాకపోతే అట్లా రోడ్డు మీదకెళ్ళి పోతాం, main door నుంచి బయటకొచ్చి, gate దగ్గిరకొచ్చి, ఇంకా ఆలస్యం అయితే వీధి చివరకెళ్ళి, ఇట్లా చెయ్యం.

"అందుకని అటు పిమ్మట అతని వదనంపై అలసట మేళవించిన విషన్న వైఖరి పరికించి..." ఒకవేళ చీకటి దట్టమైనదని, మన ఆశ్రమ భూమి మిక్కిలి దూరమని మనం వెళ్ళలేకపోతాం అనుకుంటే, పోనీ ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోదాం, పొద్దున్నే వెళ్దాం నీకు అలసటగా ఉంటే అంది. ముందు ప్రయాస పడకూడదు కదా! అంటే, అప్పుడాయన, "రాకుమారీ, శిరోవేదన తొలగిపోయినది. మేనుకి తగినంత బలిమి కలిగినది. నెమ్మదిగా నడిచి పోగలము. అయ్యో, నా కన్న తల్లితండ్రులను అవలోకించనిదే నేను ఈ కానన భూమిలో నిమిషమైనా నిలవలేను." కాబట్టి వెళ్ళిపోదాం అని చెప్పాడు. వెళ్ళిపోతారు.

వెళ్ళిపోతే, అక్కడినుంచి వాళ్ళని వెతుక్కుంటూ వస్తూ ఉంటాడు. కన్నులు లేని రోజుల్లో నువ్వే నాకు కన్నుగా నడిపించావు, ఇప్పుడు నువ్వు లేకపోతే నాకు కన్ను ఏదిరా? అని మాట్లాడుకుంటూ ఆయన వెతుక్కుంటూ వస్తుంటాడు. వస్తే, ఈయన కనిపిస్తాడు. అంతా చదవక్కర్లేదు లెండి, ఎందుకంటే మనకి కూడా యముడు కాలపరిమితి ఒకటి పెడతాడు కదా! అంచేత, వాళ్ళలా బాధ పడుతున్నారు. కుమారుడు కూడా తండ్రి గురించి బాధ పడుతుంటాడు. నాన్న ఎంత బాధ పడుతున్నాడో, అమ్మ ఎంత బాధ పడుతోందో అని అనుకుంటూ గబగబా ఏం చేస్తారంటే, అంతకుముందు ఒక సజ్జ నిండా పూలు, పళ్ళు అవన్నీ ఏరుకున్నారు కదా, అవన్నీ అక్కడే వదిలేసారు. ఈ పూటకి వద్దులే, రేపు మళ్ళీ తెచ్చుకుందామని. వదిలేసి గబగబా నడిచేసి వచ్చేస్తారు. ఇంటికొచ్చే సరికి, "ఇక్కడ ఆశ్రమంలో అంతకుమునుపే కన్నులు వచ్చిన ద్యుమత్సేనుడు ఎల్లడలా పరికించి, స్వకీయ నేత్రమంటి కుమారుడు ఆడవిలో అత్యంత పరియంతం రాకపోవుటలో హేతువేమో తెలియక, కేవలం కనులు లేనివానివలె కుమిలి కుమిలి పలవరించాడు." సరే, అవన్నీ మాములుగా జరిగేవే! ద్యుమత్సేనుడు చూసాడు. వచ్చాడీయన. కొడుకూ, కోడలూ వచ్చారు. "నాయనా అరణ్యంలో ఇంత ఆలస్యానికి ఏమి హేతువు అని ప్రశ్నించాడు. సత్యవంతుడు తాను పళ్ళు కోసిన పిమ్మట, కట్టెలు కొడుతున్న సమయంలో, విపరీత శీర్ష వేదన వల్ల క్షణమైనా నిలువలేక విశ్రమించిన విషయమూ, స్వప్నంలో తన్నొక పురుషుడు నిగ్రహించిన వృత్తాంతము సవిస్తరంగా చెప్పాడు." తనకి కలిగిన బాధ, తనకి కలిగిన కలా రెండూ చెప్పేసాడు తండ్రికి.

"ఇంతలోనే సావిత్రి అందుకుని జరిగిన వృత్తాంతము యావత్తూ సంగ్రహంగా అత్తమామ లిరువురికీ నివేదించినది." చెప్పేసింది ఇదీ జరిగిన విషయం. "నారద మహాముని ఈ రాజకుమారునకు ఈ దినమే మృత్యువని వక్కాణించాడు." ఈ రోజు వెళ్ళిపోతాడని చెప్పి పెళ్లి చేసుకోడానికి ముందే నాకు నారద మహర్షి చెప్పాడు. "ముని మాట అమోఘమన్న ఆశయంతో నే నీనాడు పతిని అనుసరించి అరణ్యానికి పయనమైనాను. అచట ఈ రాజకుమారుడెంతో అలిసి నిద్రించిన సమయంలో అంతకు దచ్చటికి విచ్చేసి, ఇతని జీవుని పాశంతో బంధించి, స్వకీయ లోకానికి పయమైనాడు. నేనాతనను అనుసరించి, సత్యమైన ధర్మ మార్గంలో అనేక విధాలా ప్రస్తుతించాను. దానికతడు ఎంతో సంతోషించి నాకు నాలుగు వరాలు అనుగ్రహించాడు. వారిలో ఒక వరం వల్ల తిరిగి నా భర్త పునర్జీవుతుడైనాడు. వేరొక వరం వల్ల మీకు దృష్టి కలిగింది. మూడవ వరం వల్ల శాత్రవ హస్తగతమైన మీ రాజ్యం తిరిగి సంగ్రమిస్తుంది. నాలగవ వరం వల్ల నా జనకునికి పుత్ర సంతానం సంప్రాప్తించగలదు అని చెప్పింది." ఇదీ జరిగిన విషయం అని ఆ

రాత్రే చెప్పేసింది. మర్నాడు చెప్తానంది కదా! వాళ్ళు కూడా అడుగుతున్నారు ఏం జరిగిందో అని, ఇంక నిద్రపోరు. అందుకని ఉన్న విషయం అంతా ఆ విధంగా చెప్పింది.

ఇలా తన భర్తని తిరిగి పొందింది. ఇది ఉపాఖ్యానం. ఈ ఉపాఖ్యానంలో ఏమిటి విషయం అంటే సావిత్రి లోకాలోకములయందు సంచరించగలిగినటువంటి ప్రజ్ఞ కలిగిందావిడ. సత్యవంతుడు ధర్మాత్ముడైనటువంటి మానవుడు. అతడు ఆమె వలన మరణంలోంచి జీవనంలోకి రావడం జరిగింది. అటుపైన సత్కీర్తి సంపాదించుకుంటాడు. అతడు కూడా ఇలా లోకాలోకములలోకి ప్రవేశించ గలిగేటటువంటి ప్రజ్ఞని పొందాడా లేదా అనేది ఇంక భారతంలో ఉండదు. కాకపోతే, పరాకాష్ఠ ఎవరయ్యా అంటే, సావిత్రి, ఆమె తండ్రి, వారిద్దరూ. తండ్రి ప్రాణములను అధిగమించి, దైవ దర్శనం చేసుకుని, అతీతమైన తత్వంలోకి ప్రవేశిస్తాడు. అందువల్ల ఈమె జన్మించడం జరుగుతుంది. ఈమె అలాంటి విశేషమైన ప్రజ్ఞ పొంది, దాన్ని పెంపొందించుకుని, అది ఆధారంగా పతిని వెనక్కి తెచ్చుకుంది.

ఈ కథలో చాలా ధర్మాలు ఉన్నాయి. ఈ ధర్మంలో ముఖ్యమైన ధర్మం ఏమిటంటే, ఏ ఇంట్లో అయినా స్త్రీ, భార్య, చాలా పవిత్రమైనటువంటి ధర్మ మార్గంలో నడుస్తూ ఉంటే ఆ పతికి చాలా రక్ష ఉంటుంది. The only single way for a man to be protected is through his lady. అంతే! మీరు వినే ఉంటారు తులసి కథ. తులసి ఆమె పతివ్రతా ధర్మం వలన ఆమె భర్త అయినటువంటి జలంధరుడిని త్రిమూర్తులు కూడా జయించలేకపోతారు. అంత శక్తివంతమైన విషయం స్త్రీలయందు నిక్షిప్తమై ఉన్నది. అది ఒకటి. రెండో విషయం, మృత్యువుని దాటడం అనేది ఉన్నది. మూడవ విషయం, మృత్యుదేవత అంత భీకరుడు కాదు అన్న విషయం.

వేదంలో ఇదే ఒక చిన్న ఉపాఖ్యానంగా ఉంటుంది. ఇది జరిగిన కథ కృతయుగంలో. వేదంలో ఒక సావిత్రి ప్రసంగం వస్తుంది, సంకేతపరంగా. సత్యవంతుడంటే మన సూర్యుడు. ఈ విషయాన్ని మనకి అరవింద మహర్షి సావిత్రి అనే గ్రంథంలో ఇచ్చారు. సత్యవంతుడంటే సూర్యుడు. సూర్యుడు ప్రతి సాయంత్రం అస్తమిస్తాడు కదా మనకి! In relation to earth, సూర్యుడస్తమిస్తాడు. అస్తమిస్తే చీకటే కదా! అస్తమించిన తర్వాత కూడా ఒక వెలుగుంటుంది పశ్చిమ ఆకాశంలో. ఆ వెలుగుని సావిత్రి అని పిలుస్తారు వేదంలో. ఉదయం వెలుగుని అదితి అంటారు. పొద్దున్న సూర్యుడొచ్చిన తర్వాత వెలుగొస్తుంది కదా అది అదితి. సాయంత్రం సూర్యుడస్తమించిన తర్వాత కూడా కొంత సేపు ఉండే వెలుగుని సావిత్రి అంటారు. ఆ సావిత్రేం చెప్తుందంటే, సూర్యుడస్తమించాడని బాధపడక, రేపు పొద్దున్న మళ్ళీ పట్టుకొస్తాను అని చెప్తుంది సందేశం. అందుకని, మర్నాడు ఉదయానికి ముందు కాంతి వస్తుంది, తర్వాత సూర్యుడు వస్తాడు కదా! అందుకని, సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు ఉండేటటువంటి కాంతిని, సూర్యుడు ఉదయించడానికి మునుపు ఉండే కాంతిని సావిత్రిదేవిగా ఆరాధన అనేటటువంటిది వేద సాంప్రదాయంలో ఉన్నది. అంచేత, అస్తమించినటువంటి వాడు మళ్ళీ తిరిగి వస్తాడు అనేటటువంటిది ఒక రహస్యం ఆ విధంగా

వివరింపబడుతుంది. మనం కూడా సత్యవంతులమే. ఎందుకంటే, మనం సూర్యుని యొక్క అంశలుగా దిగి వచ్చినటువంటి వాళ్ళం. అంచేత, మనం కూడా అస్తమించినా తిరిగి వస్తాము. అది ఒకటి.

మూడవది ఏమిటంటే, ఉత్తరాయణ దక్షిణాయములలో... ఇప్పుడు మనకి దక్షిణాయణ పుణ్యకాలంలో ప్రవేశించాము కదా! దక్షిణాయణమునందు సూర్యుడు దక్షిణ దిశగా ప్రయాణం చెయ్యడం మొదలుపెడతాడు, ఉత్తర దిశ నుంచి. ఈ దక్షిణ దిశగా ప్రయాణం చేస్తూ ఉంటే పదార్థము ఎక్కువవుతుంది, ప్రజ్ఞ తక్కువవుతుంది. కాబట్టి అది క్రమంగా వృశ్చిక రాశి చేరేసరికి, దాదాపు ప్రజ్ఞ పదార్థం చేత పూర్తిగా కప్పబడి ఒక చీకటి వంటి పరిస్థితి ఏర్పడుతుంది. డిసెంబర్ 22 వరకూ అలా జరుగుతూ వస్తుంది. అంచేత, అప్పటికేమవుతుందంటే, పదార్థం పరిపూర్ణంగా ప్రజ్ఞని కప్పేసుంటుంది. అసలు ప్రజ్ఞ లేదేమో అన్నట్టుగా ఉంటుంది. ఇప్పుడు మనం జీవుడు. జీవుడు అంటే, ఎక్కడున్నాడు జీవుడు అని అడుగుతూ ఉంటాం కదా! ఎక్కడున్నాడు జీవుడు? ఈ పని చేస్తే వెళ్ళిపోయిన జీవుడు సంతోషిస్తాడంటే, ఈ కథలన్నీ చెప్పకండి, ఎక్కడున్నాడు జీవుడు అంటారు. ఎందుకిలా అంటారంటే, బాగా కూరుకుపోయి ఉన్నాడు పదార్థంలో. ఆ అడిగిన వాడు కూడా జీవుడే! ఈ మాట్లాడేవాడూ జీవుడే! ఎక్కడున్నాడంటాడు. అలాంటి అంధకారం ఏర్పడుతుంది. ఆ అంధకారం నుంచి మళ్ళీ ఉత్తారాయణం వచ్చేసరికి సూర్యుడు మళ్ళీ పైకి వస్తాడు కదా! పదార్థము, ప్రజ్ఞ, ఈ రెండిటికి మధ్య జరిగే నాటకం అది ప్రతి మాసం ఉంటుంది చంద్రపరంగా. ప్రతి సంవత్సరం ఉంటుంది సూర్యునిపరంగా. వెలుగు నీడల యొక్క క్రీడగా శాశ్వత కథ ఒకటి భూమి మీద జరుతుంది. దాన్నే భగవద్గీతలో కృష్ణ పక్షము, శుక్ల పక్షము అని సృష్టి గురించి చెప్తాడు కృష్ణుడు. ఈ చక్రంలో తిరుగుతూ ఉంటారు. పదార్థంలో ఇరుక్కుపోతూ ఉంటారు. మళ్ళీ బయటకి వచ్చి ప్రజ్ఞా లోకాల్లోకి వెళ్తారు. మళ్ళీ పదార్థంలోకి దిగి వస్తూ ఉంటారు. పుణ్యంచేత ఊర్ధ్వ లోకాల్లోకి వెళ్లి ఆ పుణ్యం క్షీణించగానే మళ్ళీ అధో లోకాల్లోకి వచ్చేస్తూ ఉంటారు. ఇట్లా ఎన్నాళ్ళు తిరుగుతూ ఉంటారు అని అడుగుతాడు అక్షర పరబ్రహ్మ యోగం అనేటటువంటి ఎనిమిదో అధ్యాయంలో. ఎనిమిది అంకె మృత్యువుకి సంబంధించినటువంటిది.

అందుకనే, "క్షీణే పుణ్య మత్సలోకే విషంతి". పుణ్యం క్షీణిస్తే ఎంత పెద్దవాడయినా మళ్ళీ భూమి మీదకి, చావును అనుభవించే లోకంలోకి రావాలి. మత్స లోకం అంటే మరణం అనుభవించే లోకం అని, మృతి. అంచేత, పుణ్యం క్షీణించగానే మళ్ళీ ఇక్కడికి వచ్చేస్తావు. మళ్ళీ ఎప్పుడు చేసుకుంటావో పుణ్యం! చేసుకున్న పుణ్యంతో ఊర్ధ్వలోకాలకెళ్ళి, మళ్ళీ అదంతా అనుభవించేస్తావు ఊర్ధ్వలోకాల్లో. నీకు నీ పుణ్యంకి సంబంధించినది ఈ భూమి మీద ఎంతకాలం గుర్తుపెట్టుకుంటుంటే మనుషులు, అంతకాలం నువ్వు అక్కడుంటావు అని శాస్త్రం చెప్తుంది. ఇప్పుడు అశోకుడు రహదారులు వేయించెను, ఇరుపక్కలా చెట్లు వేయించెను, తటాకములు తవ్వించెను అని ఇంక ఎక్కువ రోజులు చదువుకోలేము. అసలు చెప్పట్లేదు కూడా ఈ రోజుల్లో. వేరే కథలు చెప్తున్నారు కదా! అంటే ఏమిటి? ఇంతకాలం ఆయన గుర్తున్నాట్ట అంటే, అంతకాలం ఆయన ఊర్ధ్వలోకాల్లో ఉంటాడు. భూలోకంలో నీవు చేసిన సత్కార్యములు ఎంతకాలం కీర్తింపబడితే అంతకాలం నువ్వు ఊర్ధ్వలోకంలో ఉంటావు. ఇహ అది మర్చిపోయారనుకోండి, మర్చిపోతే నువ్వు వెళ్ళలేవు. అది కథ.

అందుకని, ఇట్లా పైకి ఎక్కుతూ, కిందకి దిగుతూ, ఈ రాట్నంలో, ఈ చక్రంలో అట్లా ఎంత కాలం బతుకుతావురా అని అడుగుతాడు కృష్ణుడు. అందుకని, "అపునరావృద్ధి మార్గం" అని ఒకటి చెప్తారు. ఆ చక్రం పరిధిలో తిరుగుతుంది తప్ప కేంద్రంలో తిరగదు కదా! ఇరుసు తిప్పుతుంది తప్ప ఇరుసు తిరగదు. అంచేత, నువ్వు ఈ తిరిగే దాంట్లో ఉండకుండా, ఇది ఎలా తిరుగుతోందో చూసేవాడిగా దానినుంచి బయటపడి ఉండమని చెప్తాడు. అదీ యోగం. అందుకని, పుణ్యం వస్తుందని కార్యాలు చెయ్యకు. అది నీ సహజమైన స్వభావం కావాలి. అంటే, ఒకరికి సహాయం చెయ్యడం సహజమై ఉండాలి స్వభావంలో. నేనీ సాయం చేసాను, ఆ సాయం చేసాను అని చెప్పుకునే పరిస్థితి ఉండకూడదు. అదేమిటి? నువ్వు చెయ్యవలసినది చెయ్యాలి. నువ్వు అన్నం తిన్నానని చెప్పుకుంటావా? అది ఎంత సహజమో, ఇతరులకు ఉపయోగపడడం కూడా అంతే సహజం. ఇలా అయినప్పుడేమవుతుందంటే నీకు పుణ్యం వచ్చింది కాబట్టి నువ్వు ఊర్ధ్వలోకానికి వెళ్ళాలనే ధర్మం నీకు వర్తించదు. పుణ్యం చేస్తూ, ఫలానా దానికోసం అంటూ ఫలం కోరకుండా సత్కార్యాలు చేసుకుంటూ వెళ్ళిపోతే, అంటే నీ సత్కార్య నిర్వహణము అంతా నిష్కారణమే అవుతుంది. అయినప్పుడు నువ్వు క్రమంగా ఈ పునరావృత్తి మార్గంలో తిరగకుండా, ఈ జరుగుతున్న దాంట్లో ఈ చక్రాన్ని చూస్తూ, ఈ తిరుగుతున్న జీవులని, ఇట్లా మనం బయట నిలబడి ఆ తిరుతున్న ఆ చక్రం చూస్తునట్టుగా... ప్రతి డిసెంబరులోనూ, మనకో wheel పెడతారుగా ఎక్సిబిషనులో. అందులో తిరిగినవాడికి బుర్ర తిరుగుతుంది కదా! పైకెళ్ళి వస్తాడు, కిందకెళ్ళి వస్తాడు, పైకెళ్తాడు, కిందకొస్తాడు. కిందకొచ్చిన తర్వాత కాసేపు అట్లా అట్లా... ఈ కింద నించుని చూసేవాడికి ఏ మార్పూ కలగదు కదా లోపల! అట్లా ఒక శాశ్వతము, స్థిరము అయినటువంటి ఒక స్థానము ఉన్నది. దాన్ని బ్రహ్మ లోకము అంటారు. అక్షర పరబ్రహ్మము అంటారు. అంటే, క్షరము లేని శాశ్వతమైటువంటి స్థితిలో నువ్వు ఉండి, ఈ జరుగుతున్న సృష్టి చక్రం అంతా గమనించేటటువంటి ఒక విధానం ఉంది. దానిమీద నేకేమన్నా interest ఉందా అని అడుగుతాడు అర్జునుడిని.

అంచేత, ఈ కథలో ఏమిటంటే, ప్రతి సాయంత్రం కథ, ప్రతి దక్షిణాయణం కథ సావిత్రి కథ. ప్రతి మకర సంక్రాంతి కథ అదితి కథ. అక్కడ అదితి కథ చెప్పుకుంటారు, ఇక్కడ దితి కథ చెప్పుకుంటారు. ఆరాధనలో సూర్యుడస్తమించిన తర్వాత ఉన్నటువంటి వెలుగుని ఆరాధన చేస్తే, నీవు అస్తమించకుండా ఉండేటటువంటి ఒక స్థితిలోకి ప్రవేశించగలవు. అందుకని ఆ ఆరాధన పెట్టారు. అలాగే, సూర్యుడు ఉదయించక ముందు ఉండేటటువంటి వెలుగును అప్పుడు దాన్ని చూచి ఆరాధన చెయ్యాలి. ఈ విధానం ఋగ్వేదములో ఉన్నది. దీన్ని మనకి శ్రీ అరవిందులవారు చక్కగా వివరించి ఇచ్చారు. ఈ ఆరాధన వలన ఏం జరుగుతుంది? ఈ చక్రం, తిరుగుతున్న చక్రంలో నువ్వు ఉండకుండా, దానికి ఈవలగా ఉండి, దాన్ని దర్శించి, భగవంతుని లీలగా దీన్ని దర్శించే ఒక స్థితిలోకి వస్తావు. అలా వచ్చినటువంటి వాళ్ళే మహర్షులు. అలా వచ్చినటువంటి వాళ్ళే పరమ గురువులు. వాళ్ళందరూ ఈ సృష్టిలో ఒక వర్గంగా ఏర్పడి, ఇలా ఈ చక్రంలో తిరిగేవాళ్ళు ఎవరైనా బయటకొద్దామని ఉత్సాహం చూపిస్తూ ఉంటే, వాళ్ళకి సహాయం చెయ్యడానికి ఒక వర్గం సృష్టి మొదటి నుంచీ ఉన్నది. సనక సనందనాదులు, సప్తర్షులు, వారినుండి ఏర్పడిన శిష్యగణం అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఆ విధంగా ఈ చక్రంలో తిరిగేవాళ్ళకి ఏర్పరచి ఉన్నారు. వాళ్ళనే

గురు పరంపర అంటారు. అలాంటి గురు పరంపరను మనం ఈ రోజున స్మరించుకుంటూ ఉంటాం గురుపూర్ణిమ సందర్భంగా. అంచేత, గురు ప్రార్థన చేసుకుంటూ గురువు ఇచ్చిన మార్గంలో మనం పయనిస్తూ ఉంటే, ఆయన ఒక్కొక్కటీ, ఒక్కొక్కటీ మనకి మన సాంప్రదాయంలో మనలో పాతుకుపోయినవి కూడా ఉన్నటువంటి కొన్ని మూఢమైనటువంటి విశ్వాసాలన్నీ తీసేస్తాడు. భగవంతుని నమ్మడం కాకుండా, నచ్చి ధర్మాన్ని ఆచరించేటట్టుగా తయారవుతాము. ధర్మం కాకపోతే నే నాచరించను అనే స్థితిలోకి వచ్చేటట్టుగా తీర్చిదిద్దుతాడు.

సద్గురువు చేసేటటువంటి కార్యక్రమాలు అద్భుతమైనటువంటి కార్యక్రమాలు. అతడు క్రమంగా మనయందు మన స్వభావాన్ని ఎంత సున్నితంగా మార్పు చేస్తాడంటే మనకి అసలు తెలియనే తెలియదు కొన్నాళ్ళపాటు మనం మారుతున్నామని. తర్వాత మన చుట్టుపక్కల ఉండేటటువంటి వాళ్ళు చెప్తారు, నువ్వు చాలా మారేవోయ్, ఇది వరకూ కన్నా, నీ మాటలో మార్పు ఉంది, నీ ప్రవర్తనలో మార్పు ఉంది, నీ ఆలోచనలో మార్పు ఉంది, ఇదివరకటలా లేవు అంటాడు. మనకి తెలియదు మారుతున్నప్పుడు. మారిన తర్వాత మన మిత్రులే, మన ఆప్తులే చెప్తుంటారు. అంచేత, అంత సున్నితంగా మార్పు చేస్తాడు. ఈ గురుపూర్ణిమ యొక్క ప్రధానమైనటువంటి భావం అదే. మన స్వభావమును మార్పు చేయించుకోవడం కోసం మనలను మనం గరువుగారి shed లో పడేసుకుంటాం. ఆయన repair చేస్తాడు. మన స్వభావమే మన వాహనం. అంచేత, ఈ స్వభావంలో దానికి చాలా repair చెయ్యాలి. ఎందుకంటే, మనకి ఇవ్వాళకీ అసూయ పోదు, ఈర్ష పోదు, కోపం పోదు, చింత పోదు, చిరాకు పోదు కదా! ఇవన్నీ ఉంటూనే ఉంటాయి కదా! ఇవన్నీ ఉండగా నువ్వు ఎక్కడికి వెళ్తావు? ఎక్కడికీ వెళ్ళలేవు. అందులోనే పడి ఉంటావు. నీ స్వభావాన్ని అధిష్టించి ఉండాలి కదా! నువ్వు చెప్పినట్టు నీ స్వభావం వినాలి. నీ స్వభావం చెప్పినట్టు నువ్వు వినకూడదు. ఎవరి స్వభావానికి వారు లోబడి జీవిస్తూ ఉంటే, వాళ్ళందరూ hen pecked అని అర్థం. Hen pecked అంటే మామూలుగా ఏమనుకుంటాం? భార్య ఏంచెప్తే అది వినేవాడని. మనకి ప్రతి వాడికి పురుషులైనా, స్త్రీలైనా, మన స్వభావమే మన భార్య, మనం పురుషులం. అందుకని, మన స్వభావం ఎలా చెప్తుంటే మనం అలా చేస్తుంటే, కర్తవ్యాకర్తవ్యములను మరచి, ధర్మాధర్మములను మరచి, స్వభావానికి ఇష్టమొచ్చినవి చేస్తున్నప్పుడు, నీవు ఇంకా బంధీకృతుడవైపోతావు నీ స్వభావంలో. అంటే, నీ జీవనమే నీకొక కారాగారంలా తయారయిపోతుంది. You are not a free bird. ఎన్నో obligations కదా! వెళ్ళాలిగా అంటుంది. అంతకుముందు, అన్ని వెళ్ళాలిగా అని ఉండవు. అంటే, నువ్వు ప్రవేశిస్తున్నకొద్దీ నీకు బంధాలు ఎక్కువవతున్నాయా, లేక స్వతంత్రత పెరుగుతూ ఉన్నదా?

ఇప్పుడు నీకు కీర్తి వచ్చిందనుకోండి, అది కూడా ఒక బంధమే. ప్రతివాడూ పిలుస్తాడు కదా! నాలుగు మంచి మాటలు మన గురించి చెప్తాడు. మననేదో చెప్పమంటాడు. వెళ్లాలనిపిస్తుంది. వీడు పిలుస్తాడు, వాడు పిలుస్తాడు, మరొకడు పిలుస్తాడు. ఇంక నీ జీవితమేముంది? ఊరులో వాళ్ళు వాడుకుంటూ ఉంటారు. ఉపయోగపడుతున్నావా అంటే ఏం లేదు. వాళ్ళేదో కండుర్తి తీర్చుకోవడానికి నిన్ను అక్కడ కాసేపు ఉంచుకుంటారు. నిన్ను పెట్టుకుని వాడొక సభ ఆడుకుంటాడు. అయిపోయింది. ఇంకోడు పిలుస్తాడు, ఇంకోడు... కీర్తి కండుర్తి వల్ల బంధంలోకి. అలాగే, ధన కండుర్తి వలన. ధనార్జన వలన ఏం అవుతుందంటే ఒక పరిస్థితి దాటిన తర్వాత ఇంక మన వశంలో ఉండదు. వాడు

పిలుస్తాడు, వీడు పిలుస్తాడు. ఎవరో మినిస్టరుగారు పిలిచాడంటాడు. లేకపోతే, పెద్ద industrialist పిలిచాడంటాడు. లేకపోతే, బాలీవుడ్లో ఆ stars పక్కన కూర్చోపెడతారట అంటే ఇంక పడిపోతాడు. ఎంతమంది ధనవంతులు క్రికెట్ మ్యాచ్లకి, ఈ బాలీవుడ్ shows కి అట్లా time కార్చుకుంటూ వెళ్ళిపోతారండి? ఏమయింది? He is slowly enslaving himself and he has no more free time.

That is not the case with a teacher. ఎంత పెద్దవాడయిన తన స్వాతంత్రం తన ఉంచుకుంటాడు. ఎవరియందు తనకి obligations ఉండవు. అందరికీ సహాయపడుతూ ఉంటాడు. ఎవరిచేతా బంధింపబడకుండా ఉంటాడండి. వాడూ రాజు కదా! నేను prime minister ని, నేను chief minister ని అనుకుంటూ పొద్దున్న నిద్రలేచిన దగ్గరనుంచి నీ time నీ చేతిలో లేకుండా తిరిగేవాళ్ళు, వాళ్ళు liberated beings లేక imprisoned beings? ఆలోచించండి. అంచేత, ఎక్కువ ప్రపంచంలోకి చొచ్చుకుపోతే అది పెద్ద వివేకం కాదు. చొచ్చుకుపోయినప్పటికీ వెనక్కి రాగలిగిన మార్గం ఉండాలి. అంటే, వ్యాపారంలో ప్రవేశించావు, మళ్ళీ వెనక్కి రాగాలవా? పదువుల వేటలో పడ్డావు, వెనక్కి రాగలవా? రాజకీయాల్లో పడ్డవాడు ఎప్పటికీ వెనక్కి రాలేడు. ఎదో ఒకరోజుకి chief minister కాకపోతామా అనిపిస్తుంది. అవ్వడు. అందరూ chief minister అయిపోతారేంటి? అవ్వరు కదా!

వెనక్కి రాని మార్గంలో ప్రవేశిస్తే ఏం లాభం అండి? ఎప్పుడు వెనక్కి రాగలవు? నీకు ప్రపంచంతో ఏ ఋణం లేకపోతే వెనక్కి రాగలవు. ప్రపంచంతో రకరకాలుగా ముడి వేసుకుంటే వెనక్కి ఎలా వస్తావు? అభిమన్యుడు వ్యూహంలో ప్రవేశించగలడు, కానీ వెనక్కి రాలేడు అన్నారు కదా! అట్లా మనం ఈ జీవనం అనేటటువంటి ఈ ప్రపంచమనే వ్యూహంలో మనం ప్రవేశించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. Do we have an exit door? వాడు తెలివయినవాడు. For everything there has to be an exit. ఏదయినా తెలియాలి కదా! Exit తెలియకుండా నువ్వు లోపలి ప్రవేశిస్తే నువ్వు బయటకి రాలేవు కదా! We must make sure that we exit from everything we have entered into. అది లేకపోతే ఎందుకండీ జీవితం? అది ఎంతవరకూ వెళ్తుందంటే, You have entered into this body, you should know how to exit from this body. అంతవరకూ ఉందా కోర్స్. When you enter and you cannot exit, you are totally destroyed there. అంచేత, లోపలకి ప్రవేశించడం కాదు, బయటకి రావడం కూడా తెలిసి ఉండాలి. అన్ని రంగాల్లో కూడా. అది కుటుంబపరం కావచ్చు, సాంఘికపరం కావచ్చు, వృత్తిపరం కావచ్చు, ఆశయపరం కావచ్చు. ఆశయానికి కూడా ఓ exit ఉండాలి.

For everything there has to be an exit అని చెప్తుంది ఈ మాసంలో. అలా నీ స్వభావాన్ని ఏర్పాటు చేసుకో. అలా నువ్వు ఏర్పాటు చేసుకోడానికి ఇదివరకే అలా ఏర్పాటు చేసుకున్నవాళ్ళు తిరిగుతూ ఉంటారు లోకంలో, వాళ్ళు నీకు సహాయం చేసి పెడతారు. అలాంటి వాళ్ళు నీకు దొరకడం కోసం ఈ గురుపూర్ణిమ ఏర్పాటు చేసారు.

అంచేత, ఈ గురుపూర్ణిమ నాడు సద్గురువు కోసం, సత్య దర్శనం కోసం ఆరాటపడే వాళ్ళు బాగా ప్రార్థన చేసుకుంటారు. అందువల్ల మనం ఈ విధంగా కలిసి మంచి విషయాలు ఈ జీవ స్వాతంత్ర సంబంధమైటువంటివి, దానికి సంబధించిన విజ్ఞానం తెలుసుకోవడం ఇవన్నీ. ఇప్పుడు సావిత్రిదేవి ఉంది. ఆవిడకేమీ ఎక్కడా there is no obligation. అందరికీ చేసి పెడుతుంటే ఏం obligation ఉంటుందండి? అందరిచేతా చేయించుకుంటే obligation. మనకి వాడొకటి చేస్తే మనం వాడికొకటి చెయ్యాలి కదా! వాడు మనకొకటి చెయ్యకుండానే మనం వాడికి చేస్తూ పోతుంటే మనకి స్వతంత్రత వస్తుంది. అంచేత, ఎంత obligations పుచ్చుకుంటూ ఉంటే అంత బంధనం పెరుతూ ఉంటుంది. అందుకని, పరమ గురువులు చెప్తారు stand free while surrounded అని. చుట్టూ ప్రపంచం చాలా ఉన్నప్పటికీ you are free.

అదే శ్రీకృష్ణుడంటాడు, ఈ మూడు లోకాల్లో నాకంటూ ఏ పనీ లేదు, ఒకటి. నాకెవరూ పని చెప్పగలిగినటువంటి వాడూ లేడని చెప్తాడు. ఎందుకనీ? నేనెవడి దగ్గరా ఏ obligation పుచ్చుకోలేదు. అందుకని, పార్థా ఒకటి గమనించు, ఈ మూడు లోకాల్లో నన్నెవరూ ఏదీ శాసించలేరు, గట్టిగా అడగలేరు, నాకే ఇష్టపడి చేస్తూ ఉంటానని చెప్పాడు. అంటే, ఎవడు ధీరుడు అంటే అలాంటి వాడు ధీరుడు. అంటే, he is not at all obligated, yet he serves. ఏ మాత్రమూ obligation లేకపోయినప్పటికీ ఒక సేవకుడి కన్నా ఎక్కువ సేవ చేస్తున్నాడట అంటే వాడికన్నా ధీరుడెవరు ఉంటారండి? అది గురువుల మార్గం.

సద్గురువులు ఎదో ఆశించి ఎదో చేసి పెట్టరు. అది వ్యాపారం. అంటే, నా వీపు నువ్వు గోకితే నీ వీపు నేను గోకుతా అనేటటువంటిదంతా కూడా commerce. అలా కాకుండా జీవులు బావుండాలని నిష్కారణంగా చేసే కార్యక్రమాల్లో వాళ్ళనుంచి ఏమీ ఆశించకుండా, వారికి అనుస్యూతంగా ఎదో విధంగా దోహదం చేస్తూ, సహకరిస్తూ, వారి చైతన్యానికి స్ఫూర్తి కలిగిస్తూ జీవించే సద్గురువులను మనం చేరడమే ఒక అదృష్టం. వారి మార్గంలో నడవడంచేత ఈ చచ్చి పుట్టేటటువంటి మార్గాల్లోంచి బయటకొచ్చేస్తాము క్రమంగా, ఇవ్వాళ్ళే కాదు. సద్గురువు చెప్తాడు నన్ను అనుసరించే వాడిని పన్నెండు జన్మల్లో కచ్చితంగా తీసి బయటపెడతానని. ఈ చక్రంలోంచి పన్నెండు జన్మల్లో. అంటే, పన్నెండు జన్మలు పడుతుంతాండి అంటే అది నీ బట్టే. అది maximum. అది minimum కూడా. ఈ జన్మలో కూడా అవ్వొచ్చు నీ బట్టి, నువ్వు తట్టుకుని నిర్వర్తించుకోగలిగితే. దానికి ఒక నియమావళి చెప్తాడు. ఆ నియమావళిని తప్పక పాటించాలి. అలా పాటిస్తే ఆ మార్గంలో ప్రవేశించి మనం కృతకృత్యులవుతాము. ఎందుకంటే, భూమి పుట్టినప్పటినుంచీ ఉన్నవాళ్ళం మనం తెలుసా! భూమికి ముప్పై కోట్ల సంవత్సరాలు. మనవజాతి చరిత్ర పద్దెనిమిది కోట్ల సంవత్సరాలు. పద్దెనిమిది కోట్ల సంవత్సరాల నుంచి ఇలా పుడుతూ, చస్తూ, పుడుతూ, చస్తూ, ఇట్లా ఎన్నాళ్లుంటావు? అసలీ విషయం మనకి తెలీదు కదండీ అంటాం కదా! తెలుసుకోవాలి కదా! అవన్నీ కూడా తెలియచెప్తారు. అంచేత, we belong to the sun, we have to get back to the sun. ఎరక్కపోయి వచ్చాను ఇరుక్కుపోయాను అంటారు చూసారా అట్లా అయిపోయింది మన పని. అంచేత, ఇరుక్కుపోయినటువంటి

వాడికి దారి చూపించేవాడు సద్గురువు. అతడి స్మరణకి ఈ సహజీవనం మనం ఏర్పాటు చేసుకున్నాం. అందరూ బాగా సహకరించడం చేత ఇది సవ్యంగా సాగిపోయింది.

చిట్టచివరగా ఒక పరమ గురువు యొక్క బోధనలు ఇది. విదురుడు అనేటటువంటి మహాత్ముడి గురించి తెలియని భారతీయుడు ఉండడు. దృతరాష్ట్రుడికి బాగా సలహాలు ఇచ్చి, ఇచ్చి, ఇచ్చి విసిగిపోయినటువంటి వాడు, మహాజ్ఞాని. ఇతడు చిట్టచివరగా మైత్రేయుడికి శిష్యుడిగా చేరతాడు. విదురుడు దృతరాష్ట్రుడికి చెప్పిన బోధలన్నీ కూడా మానవులందరికీ వర్తించేటటువంటిదే. దాని వల్ల జీవుడు చాలా సంస్కారవంతుడవుతాడు. అంచేత, ఆ విదుర నీతులన్నీ పోగేసి ఒక పుస్తకం కింద వెయ్యడం మొదలుపెట్టారు. దానికి చాలా ఆదరణ లభించింది. అది రెండవ ముద్రణ మళ్ళీ ఇప్పుడు చెయ్యడం జరిగింది. ఇప్పటికి కూడా విదురుడు ఉన్నాడు భూమిమీద గుర్తుపెట్టుకోండి. మాహాత్ముడైనటువంటి విదురుడు ప్రస్తుతం చేసే పనులేంటంటే civilizations కి సరైనటువంటి జీవన విధానం ఇవ్వడం అనేటటువంటి కార్యంలో ఉన్నాడు. అంటే, Asian, European, American ఉన్నాయి కదా! Civil societies అన్నిటికీ how to live in a much better fashion with due cooperation between all sections of the community అనేదాని మీద భౌగోళికంగా పని చేస్తున్నారు. ఈయన్ని ప్రస్తుతం ఒక మహాచోహన్ అని పిలుస్తూ ఉంటారు. అంటే, మహాజ్ఞాని అని అర్థం. ఈ కోహన్ అనే పదం యూదు పదం. కోహైన్ అంటారు జ్ఞానిని వాళ్ళు. మనం జ్ఞాని అంటాం. మహాకోహన్ అంటే మహాజ్ఞాని. మహాజ్ఞాని విదురుడు. అతని బోధలన్నీ ఇందులో ఉన్నాయి. మనకి చాలా పనికొస్తుంటాయి. చిన్న పిల్లలకి ఇప్పుడే పరిచయం చేస్తే వాళ్ళు మంచి దారిలో వెళ్ళడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. Value education, value education అని ఊరికే ఇంగ్లీషులో మాట్లాడితే అవ్వదు. Already ఇచ్చి ఉంచారు. ఉన్నది సరిగ్గా వాడుకుంటే తప్పక పిల్లలు సత్పురుషులుగా తయారవుతారు, సజ్జనులుగా తయారవుతారు. అంచేత, ఈ గ్రంథం ఆ పరమ గురువు సాన్నిధ్యంలో మనం ఆయనకి అర్పణంగా ఆవిష్కరించుకుంటున్నాం. ప్రార్థనలో ప్రవేశిద్దాం. ఈ ప్రార్థనతో ఈ గురుపూజా కార్యక్రమాలు సంపూర్ణం అవుతాయి. అటుపైన మనం తెలుసుకున్న విషయాలు ఆచరణలో పెట్టడానికి మనం ప్రయత్నం చేద్దాం.

––– స్వస్తి